16





26

బాటసారి

జయధీర్ తిరుమలరావు

కథ

అమ్మ కడుపు చల్లగా

4 మే 2014

ఆదివారం
ఆంధ్రజ్యోతి










# ఈ విటమిన్‌ను పట్టించుకోండి!

ఫిల్మ్‌నగర్


ఆలియా భట్


శ్రద్ధా కపూర్


పరిణీతి చోప్రా

# వీళ్లు సామాన్యులు కారు!

ఒక్కో మెట్టు ఎక్కి పైకి రావడమనేది పాత సామెత... బాలీవుడ్ కొత్తతరం మాత్రం ఒక్క హిట్టు కొడితే చాలు అంటోంది. వెంటనే కోట్లకు పడగలెత్తుతున్నారు. ఒక్క హిట్ రాగానే భారీ పారితోషికాలు తీసుకుంటూ, ప్రకటనలకు భారీ మొత్తాలను వసూలు చేస్తూ రెండు చేతులా సంపాదిస్తూ బిజీగా మారారు. ఆదిత్యరాయ్ (లండన్ డ్రీమ్స్) అప్పుడే ఒక్కో సినిమాకు 70 లక్షల రూపాయలు, యాడ్‌కు కోటి రూపాయలు వసూలు చేస్తున్నాడు. అర్జున్ కపూర్ (ఇషక్ జాదే, 2 స్టేట్స్) సినిమాకు కోటి, ప్రకటనకు రెండు కోట్లు తీసుకుంటున్నాడు. ప్రస్తుతం ఇతడి చేతిలో అరడజను సినిమాలున్నాయి. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్, హైవే, 2 స్టేట్స్ తర్వాత ఆలియాభట్ హవా బాలీవుడ్‌లో బాగా నడుస్తోంది. ఆమె కూడా కోటి కే నా ఓటు అంటోంది. వరుణ్ ధావన్, సిద్ధార్థ్ మల్హోత్రా (స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్), శ్రద్ధాకపూర్ (తీన్ పత్తీ), సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ (కాయ్ పో చే) తదితరులు కోటి రూపాయలు డిమాండ్ చేస్తుంటే, పరిణీతి చోప్రా ప్రకటనకైనా, సినిమాకైనా రెండు కోట్లు కావాల్సిందే అంటోందట. వీరికి మార్కెట్లో డిమాండ్ ఉంది కాబట్టే అంత డిమాండ్ చేస్తున్నారని డైరెక్టర్లు, యాడ్ మేకర్లు ఈ న్యూ జెన్ స్టార్లకు వంత పాడుతున్నారు.


అర్జున్ కపూర్


ఆదిత్యరాయ్


వరుణ్ ధావన్


సుశాంత్ సింగ్ రాజ్‌పుత్


సిద్ధార్థ్ మల్హోత్రా

ఆదివారం ఆంధ్రజ్యోతి
4 మే 2014

కామెంట్

# ఎవరి కష్టం అధికం!

ఈ ఎన్నికల్లో అందరి కంటే ఎక్కువ కష్టపడ్డవాళ్ళు ఎవరో తెలుసా!

ఇంకెవరు? మోది, సోనియా, రాహుల్ అయ్యుంటారు.

జాతీయ పార్టీల నాయకులైనంత మాత్రాన వాళ్ళెక్కువ కష్టపడ్డారని అనుకుంటే ఎట్లా? కాస్త ఆలోచించి చెప్పు.

ఓహో... రాష్ట్ర నాయకుల గురించి అడుగుతున్నారా! అయితే చంద్రబాబై ఉంటాడు.

అరె... రాష్ట్ర నాయకుల గురించని నేనెక్కడ అన్నాను? అయినా అన్ని పార్టీల నాయకులూ ఇంత ఘనం చెమటోడ్చుతుండగా ఒక్క చంద్రబాబు పేరే ఎందుకు చెప్పావు?



అందర్లోకీ పెద్దవాడు. పైగా తెలంగాణ, సీమాంధ్ర రెండిట్లోనూ తిరుగుతున్నది ఆయనొక్కడే కదా! మిగతా వాళ్ళంతా అక్కడో ఇక్కడో ఎక్కడో ఒకచోటే కదా తిరుగుతున్నారు.

నీ లాజిక్ బాగానే ఉంది కాని నేను అడిగింది అసలు రాజకీయ నాయకుల గురించి కాదు.

ఎన్నికల కమిషన్ అధికారుల గురించా! అవునవును. వరుస ఎన్నికలు రావడం వల్ల రమాకాంతరెడ్డి, భన్వర్‌లాల్, ఇంకా పోలింగ్ సిబ్బంది అందరూ చాలా కష్టపడి ఉంటారు.

అయ్యో స్వామీ... నీ ఆలోచనలు ఎంతసేపూ ఒక ట్రాక్ లోనే పోతున్నాయే...

సరే... సరే... నా తప్పు నాకు అర్థమైంది. నాయకులకు, ఉద్యోగులకు అది తప్పనిసరి వ్యవహారం కాబట్టి వాళ్ళను పక్కన పెట్టేద్దాం. మండు టెండల్లో మీటింగులకు వెళ్ళిన ప్రజల గురించేనా మీరు అడుగుతున్నది?

కాదు. వాళ్ళంతా అభిమానం వల్లో, డబ్బు కోసమో వెళ్ళినవాళ్ళు. వేరే వాళ్ళ గురించి ఆలోచించకుండా నీ గురించి నువ్వు ఆలోచించి చెప్పు చాలు.

ఆ... ఇప్పుడు తట్టింది. వాళ్ళ భాష వినీ వినీ నా చెవులు, వాళ్ళ హావభావాలని చూసీ చూసీ నా కళ్ళు, వాళ్ళ మాటల్లో నిజాయతీ కోసం వెతికీ వెతికీ నా బుర్ర గత నెలన్నరగా చాలా జబ్బుపడ్డాయి. నాలాంటి 81.45 కోట్ల మంది ఓటర్ల కళ్ళూ, చెవులూ, మెదళ్ళూ... అయ్య బాబోయ్! ■

'ఫన్' లైనర్

వెధవలతో ఎప్పుడూ గొడవ పడకు.
ఎందుకంటే వారు కొత్తగా నష్టపోయేదేమీ ఉండదు.

'ఆదివారం అనుబంధం'పై మీ అభిప్రాయాలను శుక్రవారంలోగా అందేలా పంపగలరు. ఆలస్యంగా అందిన ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని మనవి. **sunday.aj@gmail.com** కి మీ ఉత్తరాల్ని మెయిల్ చేయవచ్చు.

## ఇన్‌బాక్స్




## ఇండెక్స్




ప్రత్యేకం 9
ఈ విటమిన్‌ను పట్టించుకోండి

జీవనం . . . . . . . . . . . . . . . . 8
వృద్ధులకో విలేజ్

ఫుడ్‌కోర్ట్ . . . . . . . . . . . . . . 12
గ్రేవీ వెరైటీలు

సెలబ్రిటీ . . . . . . . . . . . . . . 13
గౌరవ్ కపూర్

బాటసారి . . . . . . . . . . . . . 16
జయధీర్ తిరుమలరావు

కేరింత . . . . . . . . . . . . . . . . 18
గ్రేట్ స్విమ్మర్

అవీ ఇవీ . . . . . . . . . . . . . . . 20
తేనెటీగల కోటు!

జైలు కథలు . . . . . . . . . . . . . 22
వంటే నేరమైన చోట!

ఈ వారం కథ . . . . . . . . . . . 26
అమ్మ కడుపు చల్లగా





ఈ వారం కవిత . . . . . . . . . . 34
ఈకల కిరీటాల మీద ...


### మెరుగైన సూత్రం

సాదా సీదా కష్టమర్లలాగా కనిపిస్తూనే, కొన్ని వస్తువులకు సంబంధించిన సూక్ష్మమైన విషయాలను శోధించే మార్కెట్ డిటెక్టివ్‌ల గురించి తెలియజేసిన కొంగ్రొత్త కథనం 'మిస్టరీ షాపింగ్'. వ్యాపారం ముందుకెళ్లాలంటే మిస్టరీ షాపింగ్ మంచి ఇన్‌వెస్ట్‌మెంట్ అన్నది నూటికి నూరుపాళ్లు మంచి మార్కెటింగ్ వ్యూహం. వీటి ద్వారా కస్టమర్లకు నైపుణ్యంతో కూడిన సేవలు అందుతాయనడంలో సందేహం లేదు.

– సురేష్, సురేఖ, ఖమ్మం

### బీచ్‌లో సూటా?

ఈ వారం 'బాటసారి'లో నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అనుభవాలు కొంచెం సీరియస్‌గా ఉన్నాయి. ఒకే కారులో 12 మంది ప్రయాణించిన తరువాత మట్టి రోడ్డు మీద నడిచి ఒళ్లంతా మట్టిగొట్టుకుపోవడం, ఒక సినిమా షూటింగ్‌లో హీరోయిన్ నీళ్లలో పడిపోవడం, పాములు, కప్పల ఆహారం భయంతో అమెరికా విమానంలో 30 గంటలపాటు బిస్కెట్లతో సరిపుచ్చుకోవడం.. ఇలాగ. అయితే 'న్యూడ్ జనం మధ్యలో సూట్లేసుకున్న..' బీచ్ సంగతులు మాత్రం తమాషాగున్నాయి.

– రాంబాబు, వరంగల్

### ఎలా ఉండకూడదో..

'నాయకుడు ఎలా ఉండాలి?' అన్న ప్రశ్నకు 'నాయకుడు ఎలా ఉండాలనేది ఎవరికీ తెలీదని, వారు ఎలా ఉండకూడదో మాత్రం చాలామందికి తెలుసనే' అర్థంలో 'సగం తెలిసిపోయిందోచ్...!' అని రాసిన సండే కామెంట్ బాగుంది.

– సుకుమారి, నంద్యాల

### ఆకట్టుకున్నాయి



ఆ మధ్య దూరదర్శన్‌లో అనుకుంటా 'కాంతం కథలు' అనే ధారావాహిక వస్తుంటే మా అమ్మతో పాటు నేనూ చూసాను. అవి ఎంతగానో ఆకట్టుకున్నాయి. మధ్యతరగతి దంపతుల మధ్య దోబూచులాడే సరాగాలే ఆ కథలు. తమ తాత మునిమాణిక్యం నరసింహారావుతో జ్ఞాపకాలను పంచుకున్న ఆయన మనవరాలు శేషుకుమారి, రామలక్ష్ములకు, మనవడు రాంచందర్‌కు ధన్యవాదాలు.

– బి. శ్రీధర్, ఇ మెయిల్,
ఎం.నిర్మల కుమారి, అత్తిలి(పగోజిల్లా)

### భలే బ్లాగోతం

పేపరు కాయితం, సైడుపక్క, డేంజర పాయం..ఇలాంటి పదాలు వింటే నవ్వు ఉరికురికి వస్తుంది. అవి చెలామణిలో ఉన్న బ్లాగరు ఊరులో మరో పదం కూడా ఉంది. అదే రుబ్బింగ్ మిషన్. ఇదే టైటిల్‌తో వచ్చిన ఆ బ్లాగోతం భలే ఉంది.

– ప్రవీణ్ ఆకుల, ఆనంద్, తిరుపతి

### తీరని లోటు



'వెండితెర బంగారం'లో 'ఆహా అం దము చిందే...' అని హాయిలా లికించిన దేవిక ఛాయా చిత్రం ముచ్చట గొలిపింది. ఆమె మోహన కృష్ణ పేరుతో రెండు చిత్రాల్లో నటించిందని, అబ్బాయి పేరులా ఉందని ఆ తరువాత పేరు మార్చుకున్నారని ఈ శీర్షికద్వారానే తెలిసింది. ఒక తరం ప్రేక్షకులను తన అందచందాలతో, అభినయంతో ఆకట్టుకున్న ఆమెలాంటి నటీమణులు ఆ తరువాత లేక పోవడం తీరనిలోటు.

– గంగా భవాని, చిత్తూరు

### చెఫ్ కపూర్

తండ్రి చేసే వంటలు గమనిస్తూ కునాల్ కపూర్ మాస్టర్ చెఫ్‌గా మారిపోవడం వండర్‌ఫుల్! దేశంలోనే అతి పెద్ద చాక్లెట్ టవర్(400 కిలోల చాక్లెట్)ను తయారు చేసి అతడు లిమ్కా బుక్‌లోకి ఎక్కడం, ఇప్పుడు ఓ ఎగ్జిక్యూటివ్ చెఫ్‌గా ఉండడం సో గ్రేట్. వంట గదులకు ఆమడ దూరాన ఉండే ఎంతోమంది పురుష పుంగవులు ఇలాంటివి చదివి చెఫ్‌లుగా కాకపోయినా కాఫీ, టీలు చేసుకునేవాళ్లుగా, చిన్న చిన్న టిఫినీలన్నా చేసుకునేవాళ్లుగా మారితే బాగుంటుంది.

– వరుణ్ కుమార్, హైదరాబాద్

**సుఖవ్యాధులు శృంగార జీవితంలో సంతోషాన్ని దూరం చేస్తాయి. ఎన్ని మందులు వాడినా ఫలితం కనిపించకపోవడంతో ఏం చేయాలో తెలియక దిక్కు తోచని స్థితిలో ఉండిపోతారు. అల్లోపతి చికిత్సలో సుఖవ్యాధులు తగ్గినట్లే తగ్గి మళ్లీ తిరగబెడతాయి. కానీ హోమియో చికిత్స సుఖవ్యాధులను సమూలంగా తరిమేస్తుంది. వ్యాధి తిరగబెట్టడం అనే సమస్య ఉత్పన్నంకాదు. సుఖవ్యాధులను దూరం చేసి శృంగార జీవితాన్ని సుఖమయం చేయాలంటే హోమియో వైద్య విధానం ఒక్కటే మార్గమని అంటున్నారు హోమియో వైద్యనిపుణులు డాక్టర్ టి.ప్రభాకర్.**



# సుఖవ్యాధులు సమూలంగా మాయం

ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా 1కోటి 90 లక్షల మంది సుఖవ్యాధుల (ఎస్‌టీడీ) బారినపడుతున్నారని అంచనా. ముఖ్యంగా 15 నుంచి 24 సంవత్సరాల వయస్సు ఉన్న వారు ఎక్కువగా ఈ వ్యాధుల బారినపడుతున్నారు. సుఖవ్యాధులు ఎక్కువగా శృంగారం ద్వారా వ్యాప్తి చెందుతాయి. ఏ విధమైన శృంగారం జరిపినా అంటే ఓరల్ సెక్స్, ఆనల్ సెక్స్, సాధారణ శృంగారంలో పాల్గొనడం ద్వారా సుఖవ్యాధులు వ్యాప్తి చెందుతాయి. రక్తం, వీర్యం, యోనిద్రావాలు(వెజైనల్ ఫ్లూయిడ్స్), లాలాజలం, బ్రెస్ట్‌మిల్క్ ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది.

గనేరియా : యుక్తవయస్సు వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. జననాంగాలు, నోరు, ఆనస్ వరకు వ్యాప్తి చెందుతుంది. భాగస్వామిలో ఒకరికి ఈ వ్యాధి ఉన్నా మరొకరికి సంక్రమిస్తుంది. గర్భిణిగా ఉన్నప్పుడు గనేరియా ఉంటే పిల్లలకు వచ్చే అవకాశం ఉంటుంది.

లక్షణాలు : మూత్రంలో మంట, ద్రవం కారడం, దుర్వాసన వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి ప్రొస్టేట్, టెస్టికల్స్‌కు వ్యాప్తి చెందుతుంది. స్త్రీలలో నెలసరి మధ్యలో రక్తస్రావం, మూత్రనాళంలో మంట, గర్భకోశ వ్యాప్తి ద్వారా సంతానలేమి, అండాశయ వాపు, గర్భకోశ వాపు, ట్యూబులు మూసుకోవడం జరుగుతుంది. కండోమ్స్ వాడటం వల్ల వ్యాధి వ్యాప్తి కొంతవరకు అడ్డుకోవచ్చు. కానీ నిర్మూలించలేము.

డాక్టర్ టి. ప్రభాకర్
ఎం.డి., హోమియో
డైరెక్టర్, హోమియో ట్రెండ్స్
హైదరాబాద్, సికింద్రాబాద్,
విజయవాడ
ఫోన్స్: 77 3000 3000,
77 3000 4000



జెనిటల్ హెర్పిస్ : జననాంగాలు, మలద్వారం, పిరుదుల భాగం, తొడల భాగంలో పొక్కుల మాదిరిగా, నీటి బుడగల్లా వచ్చి పుండ్లుగా మారుతుంది. అందులో నుంచి రసి కారుతుంది. శృంగారం ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. వ్యాధి తగ్గినట్లే తగ్గి మళ్లీ తిరగబెడుతూ ఉంటుంది.

హెచ్‌ఐవి : ఇది రోగనిరోధక వ్యవస్థను నాశనం చేస్తుంది. సురక్షితం కాని శృంగారం ద్వారా వ్యాప్తి చెందుతుంది. కలుషితనీడిల్స్, రక్తమార్పిడి ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది. మొదట లింఫ్ గ్రంధుల్లో వాపు, జ్వరం, తరచూ బాధించే నొప్పులు, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నిర్ధారణ : వ్యాధి నిర్ధారణలో రక్తపరీక్షలు బాగా ఉపయోగపడతాయి. హెచ్‌ఐవి యాంటీబాడీ స్క్రీనింగ్ టెస్ట్, ఆర్ఎన్ఏ(పీ24 యాంటీజెన్), పీసీఆర్ ఫర్ ఆర్ఎన్ఏ, పీసీఆర్ ఫర్ డీఎన్ఏ, సీడీ 4 కౌంట్ వంటి పరీక్షలు వ్యాధి నిర్ధారణలో, చికిత్సలో బాగా ఉపయోగపడతాయి.

సిఫిలిస్ : శృంగారం ద్వారా వ్యాపించే మరో వ్యాధి ఇది. యోని, మలద్వారం,మూత్రాశయం, పురుషాంగం, నోరు వంటి ప్రదేశాల్లో వచ్చే అవకాశం ఉంటుంది. జబ్బు వచ్చినట్లు తెలియకుండానే ఇతరులకు వ్యాప్తి చెందడం జరుగుతుంది.

ప్రారంభ దశ : నొప్పి లేని పుండు, రసికారడం జరగుతుంది. దీనినే శాంకర్ అంటారు. పుండ్లు ఒకటి లేక రెండు, మూడు ఉండవచ్చు. 3 వారాల నుంచి 3 నెలల్లోపు ఇవి కనిపిస్తాయి. 3, 6 వారాల తరువాత చికిత్సతో గానీ, చికిత్స లేకుండా గానీ తగ్గిపోతాయి. యోని భాగంలో వజైనా, సర్విక్స్, పురుషాంగం, మలద్వారం, నోరు, ఛాతీ, రొమ్ములపైన కూడా రావచ్చు. లింఫ్‌గ్రంధుల్లో వాపు ఉంటుంది.

రెండవ దశ : పుండ్లు తగ్గినట్లే తగ్గి మళ్లీ తిరగబెడతాయి. తరువాత చర్మంపై వచ్చే దురద 2 నుంచి 6 వారాల వరకు ఉంటుంది. అరికాలు, అరిచేతుల్లో వచ్చే దురద, జ్వరం, ఒళ్లునొప్పులు, నీరసం, గొంతునొప్పి, వెంట్రుకలు రాలిపోవడం, బరువు తగ్గడం, గ్రంధుల వాపు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మూడవదశ : ఇది తీవ్రమైన దశ. వ్యాధి నరాలకు, మెదడు, వెన్నెముకకు వ్యాప్తిచెందుతుంది. గుండెకు, ఇతర భాగాలకు విస్తరిస్తుంది. 1 నుంచి 20 సంవత్సరాల తరువాత ఇది జరగవచ్చు.

నిర్ధారణ : వీడీఆర్ఎల్ రక్తపరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చు

హెపటైటిస్ బి : ఇది కూడా శృంగారం ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెలియకుండా సంక్రమిస్తుంది. ఈ వైరస్ కాలేయంపై ప్రభావం చూపుతుంది. వెజైనల్ ఫ్లూయిడ్, రక్తం, మూత్రం ద్వారా వ్యాప్తి చెందుతుంది.

హెపటైటిస్ సి : శృంగారం, రక్తం ద్వారా వ్యాప్తి చెందుతుంది.

లక్షణాలు : నీరసం, కడుపులో నొప్పి, ఆకలి తగ్గిపోవడం, వికారం, వాంతి, కీళ్లనొప్పులు, తలనొప్పి, జ్వరం, చర్మంపై దురద వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ట్రైకోమోనియాసిస్ : శృంగారం ద్వారా వ్యాపించే ప్రొటోజువ పారసైట్ వ్యాధి. మొత్తం జనాభాలో 2 శాతం మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. మూత్రకోశ ం, జననాంగాలకు వ్యాప్తి చెందుతుంది. యోని, మూత్రనాళంపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

వ్యాధి లక్షణాలు : పురుషాంగం, యోని భాగంలో మంట, దురద, కలయికలో ఇబ్బంది, మూత్ర విసర్జన సమయంలో బాధ వంటి లక్షణాలు కనిపిస్తాయి. పసుపు, ఆకుపచ్చరంగుతో కూడిన ద్రవాలు, దుర్వాసన, దురదపెట్టే కుసుమ, కలయికలో మంట, నొప్పి, పొత్తికడుపులో నొప్పి వంటి లక్షణాలుంటాయి. పురుషుల్లో వ్యాధి ఉన్నా లక్షణాలు అంతర్గతంగా ఉండే అవకాశం ఉంటుంది.

రోగనిర్ధారణ :స్రావాలను పరీక్షించడం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చు.

ఇతర సమస్యలు : ట్రైకోమోనియాసిస్ వల్ల హెచ్‌ఐవి వచ్చే అవకాశాలు ఎక్కువవుతాయి. ప్రీమెచ్యూర్ డెలివరీ, తక్కువ బరువు ఉన్న పిల్లలు పుట్టడం జరగవచ్చు. సర్వైకల్ కేన్సర్ ప్రమాదానికి హేతువు. మగవారిలో ప్రొస్టేటు గ్రంధి వాపు, కేన్సర్ కారకం కావచ్చు.

హోమియోవైద్యం: హోమియో వైద్యవిధానం ద్వారా సుఖ వ్యాధులను సమూలంగా తరిమేయవచ్చు. ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా చికిత్స అందించవచ్చు. రోగి శారీరక లక్షణాలు, మానసిక స్థితిని బట్టి చికిత్స అందించడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వ్యక్తిని బట్టి ఫలితాలు మారుతుంటాయి. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే సుఖవ్యాధులు సమూలంగా తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి బలపడటం మూలంగా హెచ్‌ఐవి వైరస్ ప్రభావం తగ్గిపోతుంది. ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. గనేరియా, సిఫిలిస్ వంటి సమస్యలు శాశ్వతంగా దూరమవుతాయి.






## పెళ్లానికి ప్రేమలేఖ



డియర్ సులోచన, ఏ ఆలోచన లేకుండా నన్నొదిలి వెళ్లి వనస్థలిపురంలో ఎన్ని అవస్థలు పడుతున్నావో! ఇక్కడ నేను పస్తులుండి సంపాదించిన సమస్త ఆస్తులు నీకిద్దామంటే నీ నుండి ఉలుకూ పలుకూ లేదు. ప్రస్తుతం సఫిల్‌గుడాలో ఆపిల్ పళ్లు అమ్ముకుంటూ రమ్ము కూడా తాగకుండా గమ్మున గుమ్మంలో నిల్చుని నీకోసం ఎదురు చూస్తున్నాను. జూనియర్ యన్టీయార్ 'దమ్ము'ని, రవితేజ 'బలుపు'ని ఒళ్లంతా పులుముకుని వచ్చి రామ్‌చరణ్‌లా 'రచ్చ' చేశానన్నావ్. చివరకు 'మన సంతా నువ్వే' అంటున్నా వినకుండా నీకు ఒళ్లంతా కొవ్వే అని ఈసడించుకు వెళ్లిపోయావ్. కుర్చీలో కూర్చున్న నన్ను చర్చికి కూడా పోనీయకుండా 'మిర్చి' తెమ్మని బయటకి గెంటావ్? అఫ్ కోర్స్ .. అవన్నీ ప్రస్తుతం అప్రస్తుతం. మర్చిపోయాను గతం – నువు తిరిగి రావడం నాకు సమ్మతం.

ఇట్లు – చిట్టెం మరియదాస్

## క్యా డైలాగ్ హై



"మంచిగా ఉన్నంత వరకే నేను హీరోని. తేడా వచ్చిందో ... చరిత్ర చూడని నెపోలియన్‌ని, ప్రపంచం చూడని హిట్లర్‌ని నీకు చూపిస్తా .."

('1– నేనొక్కడినే' చిత్రంలో మహేష్‌బాబు)

పంపినవారు: అబ్బగాని భాస్కర్, మహబూబాబాద్

ఈ రాజకీయ తరంగాలలో
ఆ పదవులు చదరంగంలో
ఎవరికి ఎవరూ పోటీ .. ఎంతవరకీ లూటీ!

ప్రజల కోసమే పుట్టిందొకడు
పార్టీ టికెట్టు ఇచ్చేదొకడు
ఓటుకు నోటు పంచేదొకడు
చివరకు గద్దెను ఎక్కేదెవడు

## పేరడీ



టికెటు ఇచ్చిన లీడరు లేదని
తరలించుకుపోయే నీ రాత మారదు
పార్టీ పార్టీ మార్చక మానవు
కష్టాలయితే మాకు తప్పవు
ఈ ధరలు ధరణిలో మండక మానవు

('ఈ జీవన తరంగాలలో ఆ దేవుని చదరంగంలో' పాటకు)

– సంపంగి జయచంద్రారెడ్డి, బాపట్ల

# బిట్‌బ్యాంక్



నాణెం వేస్తే పనిచేసే మిషన్లు క్రీ.శ. ఒకటో శతాబ్దం నుంచి ఉన్నాయి. హీరో అనే గ్రీకు శాస్త్రవేత్త దీన్ని కనిపెట్టాడు.

★ రేడియో తరంగాలు ధ్వని తరంగాల కన్నా చాలా వేగంగా ప్రయాణిస్తాయి.



మోటారు కార్ల ఆగమనానికి ముందే ట్రాఫిక్ లైట్లను ఉపయోగించేవారు. 1868 లోనే గుర్రపు బగ్గీలు, పాదచార్లను నియంత్రించడానికి లాంతరును రెడ్, గ్రీన్ సిగ్నల్స్ కోసం లండన్‌లో వాడేవారు.

★ విమానం 6 అంగుళాల ఎత్తు ఎగరాలంటే ఒక గ్యాలన్ ఇంధనం అవసరమవుతుంది.



పలుచటి గాజుగ్లాసులో వేడినీళ్ళు పోస్తే పగులుతుందనుకుంటాం. కాని అది నిజం కాదు. దళసరి గాజుగ్లాసులే ఎక్కువ వేడిని తట్టుకోలేవు. అందుకే పరిశోధనకు వాడే టెస్ట్ ట్యూబ్స్‌ను పలుచటి గాజుతోనే చేస్తారు.





# ఈ విటమిన్‌ను పట్టించుకోం'డి'

ప్రత్యేకం

**జుట్టు ఊడిపోతోందంటే వెంటనే మల్టీ విటమిన్ ట్యాబ్లెట్స్ వాడండని సలహా ఇస్తారు. కీళ్ల నొప్పులు వస్తే కాల్షియం ట్యాబ్లెట్స్ వాడమంటారు. నీరసంగా ఉంటే ఐరన్ ట్యాబ్లెట్స్ వాడమంటారు. కాని విటమిన్ డి లోపం గురించి మాట్లాడేవారు తక్కువే. తాజా పరిశోధనల్లో విటమిన్ డి లోపం వల్ల అనేక ఆరోగ్యసమస్యలు వస్తాయని తేలింది. జీవనశైలిలో వస్తున్న మార్పులు, ఆహారపు అలవాట్లలో వచ్చిన తేడాల వల్ల విటమిన్ డి లోపం విపరీతంగా పెరిగిపోతోందని, ఈ విషయంపై వెంటనే దృష్టి సారించకపోతే అనేక సమస్యలు ఎదురవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.**

మనం ఆరోగ్యంగా జీవించటానికి అవసరమైన పోషకాలను, విటమిన్లను రకరకాలుగా పొందుతాం. కొన్ని ఆకు కూరలు, పళ్ల ద్వారా వస్తే ఇంకొన్ని పాలు వంటి వాటి ద్వారా మనకు అందుతాయి. అయితే మన శరీరానికి అత్యంత అవసరమైన విటమిన్ డి –సూర్యరశ్మి ద్వారా, కొన్ని మాంసాహారాల ద్వారా మాత్రమే లభ్యమవుతుంది. శాకాహారులకైతే ఈ విటమిన్ కేవలం సూర్యరశ్మి ద్వారానే అందుతుంది. ఇది తగినంత మోతాదులో లభించకపోతే రకరకాల సమస్యలు ఎదురవుతాయి. ఈ లోపానికి ప్రధాన కారణం– జీవన శైలేనని నిపుణులు పేర్కొంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ నీడపట్టునే పనిచేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ ఉండటం వల్ల ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. ''నా దగ్గరకు వచ్చే కేసులలో– 80 శాతం మంది విటమిన్ డి లోపం వల్ల బాధపడుతూ ఉంటారు. ఈ లోపం రకరకాల రూపాలలో బయటపడుతూ ఉంటుంది. కొందరికి



కీళ్ల నొప్పులు వస్తాయి. ఇంకొందరు 365 రోజులు జలుబుతో బాధపడుతూ ఉంటారు. పైకి సమస్య వేరుగా ఉంటుంది. దాని మూల కారణం వేరుగా ఉంటుంది. అందుకే నా దగ్గరకు వచ్చే పేషెంట్లకు మొదటే డి లోపం ఉందా లేదా అని పరీక్ష చేయిస్తాను..'' అంటున్నారు ప్రముఖ జనరల్ ఫిజిషియన్ వి. కుమార్.

ఇంత కాలం ఎవరూ పెద్దగా పట్టించుకోని 'విటమిన్ డి లోపం' హఠాత్తుగా ఇప్పుడు తెర మీదకు ఎందుకు వచ్చింది? ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు దీనిపై ఎందుకు దృష్టి పెడుతున్నారు? అనే విషయాలు తెలుసుకొనే ముందు– మన శరీరానికి దీని అవసరమెంతుందో తెలుసుకోవాలి. మన శరీరానికి అవసరమైన కాల్షియం విటమిన్ డి ద్వారానే తయారవుతుంది. విటమిన్ డి తక్కువైతే దాని ప్రభావం కాల్షియం శాతంపై పడుతుంది. కాల్షియం తక్కువైతే శరీరంలో ఎముకలు బలహీనపడతాయి. రికెట్స్ అనే వ్యాధి కూడా వచ్చే అవకాశముంటుంది. ఈ విషయాలు ఇప్పటికే అందరికీ తెలుసు. అయితే తాజా పరిశోధనల్లో మరిన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. బోస్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన మైఖేల్ ఎఫ్. హాలిక్ అనే శాస్త్రవేత్త చేసిన పరిశోధనల్లో – 'రక్తపోటుకు' విటమిన్ డికి ప్రత్యక్ష సంబంధముందని తేలింది. 'విటమిన్ డి'ని క్రమం తప్పకుండా మూడు నెలలు తీసుకుంటే రినిన్ అనే హార్మోన్ విడుదల కావటం తగ్గుతుందని, దానివల్ల రక్తపోటు కూడా తగ్గుతుందని తేలింది. జర్నల్ ఆఫ్ ది అమెరికన్ మెడికల్ అసోసియేషన్ చేసిన ఒక అధ్యయనంలో విటమిన్ డిని తీసుకోవటం వల్ల– చిన్న పేవుల్లో వచ్చే అల్సర్ గణనీయంగా తగ్గుతుందని కూడా తేలింది. ఇటీవల హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి చెందిన డాక్టర్ జైదీప్ చౌదరి చేసిన అధ్యయనంలో విటమిన్ డి లోపం ఉన్నవారికి బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటు వచ్చే అవకాశముందని తేలింది. ''ఈ అధ్యయనం చాలా యాధృచ్ఛికంగా జరిగింది. మా దగ్గరకు వచ్చే పేషెంట్లలో చాలా మందికి విటమిన్ డి శాతం తక్కువ ఉండటం గమనించాం. నరాలకు, విటమిన్ డికి ఎలాంటి సంబంధం ఉందనే విషయంపై అధ్యయనాన్ని ప్రారంభించాం. ఈ అధ్యయనం పూర్తి కావటానికి రెండున్నరేళ్ల

పట్టింది. దాదాపు 400 మంది పేషెంట్లకు సంబంధించిన వివరాలను తీసుకున్నాం. మన శరీరంలో విటమిన్ డి ఎంత ఉందనే విషయాన్ని తెలుసుకోవటానికి 25 హైడ్రోఏక్స్వై విటమిన్ డీని ఒక మార్కర్‌గా తీసుకుంటారు. మా అధ్యయనంలో దాదాపు 45 శాతం మందికి ఇది తక్కువగా ఉందని తేలింది. స్ట్రోక్ లేదా గుండెజబ్బులు వచ్చిన వారిలో విటమిన్ డి లోపంతో పాటుగా కొలస్ట్రాల్ శాతం కూడా చాలా ఎక్కువగా ఉంది. అంటే ఈ రెండు కలిసి ఉంటే చాలా ప్రమాదకరం. నా ఉద్దేశంలో - జీవన శైలిలో వచ్చిన మార్పుల వల్లే విటమిన్ డి లోపం ఏర్పడుతోంది..'' అని చౌదురి అన్నారు. దీన్ని బట్టి తెలుస్తున్నదేమిటంటే మన శరీరంలోని ప్రతి భాగంపైనా విటమిన్ డి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావం చూపిస్తోంది.



డాక్టర్ జైదీప్ చౌదురి

## ఇప్పుడే ఎందుకు?

గత పదేళ్లలో విటమిన్ డిపై పరిశోధకుల్లో ఆసక్తి బాగా పెరిగింది. అనేక వ్యాధులకు, విటమిన్ డికి ఉన్న ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలను శాస్త్రవేత్తలు కనుగొనగలిగారు. ''ఒకప్పుడు అందరూ ఉదయాన్నే లేచి బావి నుంచి నీళ్ళు తోడేవారు. అంట్లు తోమేవారు. ఏదో ఒక పని చేసుకునేవాళ్ళు. మగవాళ్లు పొలాలకు వెళ్లేవారు. ఆడవాళ్లు ఇంటి ముందు గుమ్మాలు కడిగేవారు. ముగ్గులు పెట్టేవారు. ఈ పనులు చేసే సమయంలో వారికి ఎండ తగిలేది. అంతే కాకుండా వారు తినే ఆహారంలో కాల్షియం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు జీవన శైలి మారటంతో చాలా మంది ఉదయాన్నే లేవడం లేదు. లేచినా లోపల్లోపలే పనులు చేసుకుని, ఆఫీసులకు తయారవ్వటంలో బిజీగా ఉంటున్నారు. ఆఫీసులకు వెళ్లిన తర్వాత అక్కడ ఏసీల్లో కూర్చుంటున్నారు. అన్ని ఆఫీసుల్లో ఏసీలు లేకపోయినా నాలుగ్గోడల మధ్య ఎండ తగలకుండా పని చేసుకునే వాతావరణమే ఉంది అంతటా. సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి చీకటి పడిపోతుంది. సూర్యుడిని చూడకుండా గడిపేస్తున్న వారు అనేక మంది. మనకు విటమిన్ డి కావాలంటే సూర్యరశ్మి ఒక ప్రధానమైన సోర్స్. దానిని వాడుకోకపోవటం వల్ల ఈ సమస్యలు వస్తున్నాయి..'' అని న్యూట్రిషనిస్ట్ పద్మజ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేస్తున్న వారిలో ఈ సమస్య ఎక్కువగా ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ''ఈ మధ్య నా దగ్గరకు 25 ఏళ్ల అమ్మాయి వచ్చింది. ఆమెకు విపరీతమైన కాళ్ల నొప్పులు ఉన్నాయి. అన్ని పరీక్షలు చేయించిన తర్వాత కూడా కారణమేమిటో తెలియలేదు. చివరకు విటమిన్ డి లోపం ఉందేమోనని అనుమానం వచ్చి పరీక్షలు చేయించాం. ఆ అమ్మాయి తీవ్రమైన 'డి' లోపంతో బాధపడుతోంది. చికిత్స మొదలుపెట్టిన తర్వాత ఇప్పుడు కొద్దిగా ఆరోగ్యం మెరుగుపడింది..'' అని డాక్టర్ వి. కుమార్ వెల్లడించారు. సూర్యరశ్మి లోపంతో పాటు భారతీయుల ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల వల్ల కూడా విటమిన్ డి లోపం ఏర్పడుతోంది. ఉదాహరణకు ఇటీవల కాలంలో ఎక్కువ మంది శాకాహారంపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. మాంసాహారుల్లో కూడా చేపలు వంటి పౌష్టికాహారం కన్నా చికెన్, మటన్‌లను ఇష్టపడే వారి సంఖ్య బాగా పెరుగుతోంది. సాధారణంగా విటమిన్ డి చేపలు, చేప కాలేయం నుంచి తయారుచేసే నూనె, కోడిగుడ్డు సొనలలో లభిస్తుంది. మాంసాహారులు కూడా వీటిని తినటం తగ్గించేసరికి వారిలో విటమిన్ డి లోపం ఏర్పడుతోంది.



## ఇతర కారణాలు కూడా..

నల్లగా ఉన్నవారిలో విటమిన్ డి తక్కువగా ఉంటుంది. మన చర్మంలో ఉండే మెలనిన్ అనే పిగ్మెంట్ - విటమిన్ డిని ఎక్కువగా తయారుచేయనివ్వదు. దీని వల్ల నల్లగా ఉన్నవారిలో విటమిన్ డి తక్కువగా ఉంటుంది. కొన్ని సార్లు కిడ్నీలు సరిగ్గా పనిచేయకపోవటం వల్ల కూడా విటమిన్ డి లోపం ఏర్పడుతుంది. స్థూల కాయం వల్ల కూడా విటమిన్ డి లోపం ఏర్పడే అవకాశముందని కనుగొన్నారు. బాడీ మాస్ ఇండెక్స్ 30 కన్నా ఎక్కువ ఉన్నవారి శరీరంలోని కొవ్వు కణాల పనితీరు మారిపోతుంది. సూర్యరశ్మి ద్వారా లభించే విటమిన్ డి ఈ కొవ్వు కణాల ద్వారానే శరీరంలోకి ప్రవేశిస్తుంది. కణాలలో తేడా వస్తే- విటమిన్ డి లోపం కూడా బాగా పెరుగుతుంది. ఈ సమస్యలకు పరిష్కారం ఆరోగ్యమైన ఆహారం తినటం, ఉదయపుటెండలో కాసేపు నడవడం మాత్రమే.

- అంకిత్

## ఇలా తెలుస్తుంది...!

విటమిన్ డి లోపం ఉంటే కీళ్ల నొప్పులు, కండరాలు బలహీనమయిన భావన, ఆస్తమా, పెద్దవాళ్లల్లో వినికిడి శక్తి తగ్గటం, రక్తహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి.

### ఎవరిలో ఈ లోపం ఎక్కువ ఉంటుంది?

★ విటమిన్ డి లోపం శాకాహారులలో ఎక్కువ.

★ ఉదయం నుంచి రాత్రి వరకూ ఏసీ గదుల్లో కూర్చునే వారిలోనూ ఎక్కువే.

★ నల్లటి రంగు ఉన్నవారిలో కూడా ఈ లోపం ఎక్కువగా కనిపిస్తుంది.

★ కిడ్నీ సమస్యలు ఉన్న వారు తప్పనిసరిగా విటమిన్ డి లోపం ఉందో, లేదో పరీక్షించుకోవాలి.

★ ఎసిడిటీ ఉన్నవారు, అజీర్తితో బాధపడేవారు, పేగులకు సంబంధించిన సమస్యలు ఉన్న వారిలో కూడా విటమిన్ డి లోపం ఉంటుంది.

★ బాడీ మాస్ ఇండెక్స్ 30 కన్నా ఎక్కువ ఉన్నవారిలో ఈ లోపం ఉండే అవకాశముంది.

### ఎంత కావాలి?

అమెరికాకు చెందిన 'ది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్' చేసిన సూచనల ప్రకారం ప్రతీ వ్యక్తికి (సగటు మహిళా లేదా పురుషుడు, ఏడాది దాటిన పిల్లలు) విటమిన్ డి 600 ఇంటర్నేషనల్ యూనిట్స్ అవసరమవుతుంది (రక్తంలో కలిసిపోయే విటమిన్లను ఇంటర్నేషనల్ యూనిట్స్‌లో కొలుస్తారు). అయితే దీనిపై ఏకాభిప్రాయం లేదు. సూర్యరశ్మి తక్కువగా ఉండే దేశాలలో ప్రజలకు ఇది తక్కువ అవసరమని కొందరు శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. వైద్య నిపుణుల అంచనాల ప్రకారం- ఒక వ్యక్తికి 20 ఎన్‌జీ-ఎంఎల్ (ఒక మిల్లీలీటరు రక్తంలో కేంద్రీకృతమయిన విటమిన్ డి శాతం) విటమిన్ డి అవసరమవుతుంది. దాని కన్నా తక్కువైతే ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి.

# ఒక్క ఓటు

పదకొండు గంటల సమయం.

వెంకట్రావ్ వీసా ఆఫీస్‌లోకి ప్రవేశించాడు.

అక్కడున్న గోడ గడియారం వేపు చూసి... అమ్మయ్య లేట్ కాలేదని అనుకుని వెయిటింగ్ హాల్‌లో ఉన్న కుర్చీల వరుసలో ఒక కుర్చీలో కూర్చున్నాడు.

పావుగంట తర్వాత వెంకట్రావ్‌కి పిలుపు వచ్చింది... మైక్‌లో. ఫైల్ పట్టుకుని లోపలికెళ్ళాడు. ఆఫీసర్ ముందు నుంచున్నాడు. కూర్చోమని చెప్పాడు ఆఫీసర్.

ఆఫీసర్ ఓ పావుగంటసేపు కొన్ని ప్రశ్నలు అడిగాడు... అన్నీ రొటీన్‌గా అడిగే ప్రశ్నలే. అన్నిటికీ జవాబులు చెప్పాడు. ఆఫీసర్ బాడీ లాంగ్వేజ్ చూసి ఇహ తనకి వీసా వచ్చినట్టే అని డిసైడ్ అయిపోయాడు వెంకట్రావ్.

ఆఫీసర్ ఫైల్‌ని ప్రక్కకి పెట్టి...

''వెంకట్రావుగారూ! మీ వయసు ఇరవైయారు సంవత్సరాలు కదా! మీరు ఇంతవరకు ఎన్నిమార్లు ఓటు వేశారు? అడిగాడు. ఇదేవిటీ! సిలబస్‌లో లేని ప్రశ్న అడుగుతున్నాడే అనుకుంటూ...

''నేను ఇంతవరకు ఒక్క మారు కూడా ఓటు వేయలేదు?'' చెప్పాడు.

''ఏం? ఓటర్స్ లిస్ట్‌లో మీ పేరు లేదా?''

''లేకేం సార్? ఉంది... ఓటర్ ఐడెంటిటీ కార్డ్ చాలా ముఖ్యమైంది కదా. అది లేకుండా వీసాకు అప్లయ్ చేయలేం కదా!'' చెపాడు వెంకట్రావ్.



''మరైతే ఓటు వేయలేదంటే... ఎందుకు వేయలేదో కాస్త కారణాలు వివరించగలరా?''

''సార్! ఈ నూట ఇరవైకోట్ల ఓట్లలో నా ఒక్కడి ఓటు వల్ల ఏం ఒరగబోతుంది మీరే చెప్పండి. ఏమీ లేదు కదా... ఒక్క ఓటు తగ్గితే ఏ కొంపలు అంటుకోవు కదా! ఈ మాత్రపు దానికి రెండు మూడు గంటల పాటు ఎండలో నుంచుని ఓటు వేయడం అవసరమా? మీరే చెప్పండి?'' చెప్పాడు వెంకట్రావ్.

ఆఫీసర్ ఫైల్ మూసేసి చేతికి పాస్‌పోర్ట్ అందించాడు... ఇహ మీరు వెళ్ళొచ్చు అనే భావం స్ఫురించేట్టు.

పాస్‌పోర్ట్ చేతికిచ్చేశాడూ అంటే తనకు వీసా రానట్టే అన్నమాట. ఆ మాటే అడిగాడు ఆఫీసర్‌ని.

వీసా ఆఫీసర్ చెప్పడం ప్రారంభించాడు.

''చూడండి వెంకట్రావ్‌గారూ! మా దేశంలో లక్షలాది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉన్నారు. వెంకట్రావ్ అన్న ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వచ్చి మా దేశాన్ని ఉద్ధరించబోయేది ఏమీ లేదు... మీరు లేనంత మాత్రాన ఏ కొంపలూ అంటుకోవు...'' చెప్పి సమాధానం కోసం ఎదురుచూడకుండా తర్వాతి అభ్యర్థిని రమ్మనడానికి బెల్ నొక్కాడు.

– శీనా, 097890 58199


దాంపత్య సుఖ జీవనం,
సంపూర్ణ శృంగార జీవితానికి



Power Gen Xtra
For High Potency Power

పవర్ జెన్ ఎక్స్‌ట్రా

లైంగికపరమైన సెక్స్ సమస్యల పరిష్కారానికి ప్రకృతిసిద్ధమైన వనమూలికలు

• సఫేద్ ముసలి • శిలజిత్ • శతావరి
• అశ్వగంధ • కఫీకచ్చు

శీఘ్రస్కలనము ఆపి, కండరాల పటుత్వాన్ని పెంచి, నరముల బలానికి తోడ్పడుతుంది. సంతృప్తికరమైన శృంగారజీవితానికి తోడ్పడుతుంది

జిల్లాల వారిగా అన్ని మెడికల్ షాపులకు సప్లై చేయుటకు డిస్ట్రిబ్యూటర్ & సూపర్ స్టాకిస్టులు కావలెను



• GMP Certified • 100% Ayurvedic Formula

Cell: 9550470123

Toll Free No.: 1800 200 4626

AYURGEN™ HERBALS

An ISO 9001:2008 Certified Company

D.No.5-9-285/14, Prashanthi Nagar,
Hyderabad-500 072



సాదా బిర్యాని రైస్ వండుకున్న ప్రతిసారీ సైడ్ డిష్‌గా ఏ గ్రేవీ చేసుకోవాలనేది ఒక చిక్కు ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబుగా ఇక్కడ మూడు రకాల గ్రేవీలు అందిస్తున్నాం. ఇవి సాదా బిర్యానికే పరిమితం కాదు. వెజిటెబుల్/ నాన్‌వెజ్ బిర్యానీలతో కూడా బాగుంటాయి.



❖ ఫుడ్ కోర్ట్

# బిర్యానీ సైడ్ గ్రేవీ వెరైటీలు

## మిర్చీకా గ్రేవీ

**కావలసిన పదార్థాలు:** బజ్జీ మిర్చీలు – 100 గ్రా., కారం – అర టీ స్పూను, ఎండు కొబ్బరి పొడి – 1 టేబుల్ స్పూను, నూనె – 2 టేబుల్ స్పూన్లు, దనియా పొడి – 1 టీ స్పూను, జీలకర్ర – అర టీస్పూను, జీరా పొడి –1 టీ స్పూను, కరివేపాకు – 4 రెబ్బలు, మెంతులు – చిటికెడు, అల్లం వెల్లుల్లి పేస్టు – 1 టేబుల్ స్పూను, ఆవాలు – అర టీ స్పూను, ఉల్లిపాయ – 1, పల్లీలు – 3 టేబుల్ స్పూన్లు, పెరుగు – 100 గ్రా., ఎండుమిర్చి – 3, ఉప్పు – రుచికి తగినంత, నువ్వులు – 2 టేబుల్ స్పూన్లు, చింతపండు గుజ్జు – పావు కప్పు, పసుపు – పావు టీ స్పూను.



**తయారుచేసే విధానం:** మిర్చీలను ఒక వైపు నిలువుగా చీరి గింజలు తీసేయాలి. కొద్ది నూనెలో పల్లీలు, నువ్వులు, ఎండుకొబ్బరి విడివిడిగా వేగించి, చల్లారిన తర్వాత అన్నీ కలిపి కొద్ది నీటితో పేస్టు చేసుకోవాలి. కడాయిలో నూనె వేసి ఆవాలు, ఎండుమిర్చి, జీలకర్ర, ఉల్లి తరుగు, కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్టు, మిగతా పొడులు ఒకటి తర్వాత ఒకటి వేగించి కప్పు నీరు పోయాలి. రెండు నిమిషాల తర్వాత పెరుగు, పల్లీ పేస్టు కలిపి మూత పెట్టాలి. మరుగుతున్నప్పుడు చింతపండు గుజ్జు కలపాలి. 5 నిమిషాల తర్వాత చీరిన మిర్చీలు వేసి ఉడికించి, చిక్కబడ్డాక ఉప్పు సరిచూసి దించేయాలి.

## కద్దూకా దాల్చా

**కావలసిన పదార్థాలు:** సొరకాయ పెద్ద ముక్కలు – రెండు కప్పులు, ఉల్లి, టమోటా తరుగు – అరకప్పు చొప్పున, శనగపప్పు – 1 కప్పు, చింతపండు గుజ్జు – పావు కప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు – 1 టీ స్పూను, కారం – 1 టీ స్పూను, పసుపు – చిటికెడు, గరం మసాల – 1 టీ స్పూను, దాల్చినచెక్క – అంగుళం ముక్క, బిర్యాని ఆకు –1, షాజీరా – అర టీ స్పూను, లవంగాలు – 4, పచ్చిమిర్చి – 2, కరివేపాకు – 4 రెబ్బలు, ఉప్పు – రుచికి తగినంత, నూనె – 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర, పుదీనా తురుము – అలంకరణకు సరిపడా.

**తయారుచేసే విధానం:** శనగ పప్పును మెత్తగా ఉడికించి పెట్టుకోవాలి. నూనెలో బిర్యాని ఆకు, దాల్చినచెక్క, షాజీరా, లవంగాలు, అల్లం వెల్లుల్లి పేస్టు, ఉల్లి, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు, పసుపు, గరం మసాల, కారం ఒకటి తర్వాత ఒకటి వేగించాలి. తర్వాత సొరకాయ, టమోటా ముక్కలు కలిపి మూత పెట్టి మగ్గించాలి. ముక్కలు మెత్తబడ్డాక ఉడికించిన పప్పు, చింతపండు గుజ్జు, కప్పు నీరు, ఉప్పు వేసి మరిగించి, రెండు పొంగులు రాగానే కొత్తిమీర, పుదీనా చల్లి దించేయాలి.



## మసాలా గ్రేవీ



**కావలసిన పదార్థాలు:** గరం మసాల పొడి – 1 టీ స్పూను, బిర్యాని ఆకులు – 2, ఎండు మెంతి – అర టీ స్పూను, కారం, దనియాలపొడి – 1 టీ స్పూను చొప్పున, పసుపు – పావు టీ స్పూను, కరివేపాకు – 4 రెబ్బలు, కొత్తిమీర తరుగు – కొద్దిగా, నూనె – 2 టేబుల్ స్పూన్లు, టమోటాలు – 2, పచ్చికొబ్బరి పేస్టు – 1 టేబుల్ స్పూను, ఉప్పు – రుచికి తగినంత.

**పేస్టుకోసం:** చిన్న ఉల్లిపాయలు – 10, పచ్చిమిర్చి – 2, వెల్లుల్లి – 5 రెబ్బలు, అల్లం – అంగుళం ముక్క.

**తయారుచేసే విధానం:** నూనెలో బిర్యాని ఆకులు, ఎండు మెంతి, కరివేపాకు, రుబ్బుకున్న ఉల్లి మిశ్రమం పేస్టు ఒకటి తర్వాత ఒకటి వేగించాలి. ఉల్లి పచ్చివాసన పోయాక టమోటా తరుగు, కారం, దనియా, పసుపు, మసాల పొడులతో పాటు ఉప్పు కలపాలి. పదినిమిషాలు చిన్నమంటపై ఉడికించి కొబ్బరి పేస్టు వేసి చిక్కబడ్డాక కొత్తిమీర తరుగు చల్లి దించేయాలి. పలచగా కావాలనుకునేవారు కొబ్బరి పేస్టుతో పాటు కొబ్బరి పాలు అరకప్పు పోసుకోవాలి.

క్రికెటర్లకు, సినిమా స్టార్లకు సన్నగా రివటలా ఉండే అతడంటే చాలా ఇష్టం. ఎక్కడో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ విశేషాల గురించి స్టూడియోలో కూర్చుని విశ్లేషకులతో ముచ్చటిస్తుంటాడు... గ్రౌండ్‌లో నిలబడి క్రికెటర్లను హుషారుగా ఇంటర్వ్యూ చేస్తుంటాడు... సినిమా ఫంక్షన్లు, ఇతర ఫంక్షన్లలో యాంకరింగ్ చేస్తూ స్టార్లతో సరదాగా చిట్‌చాట్ సాగిస్తాడు... వెరసి కెమెరా ముందు గౌరవ్ కపూర్ (34) ఉన్నాడంటే టీవీ చూసే ప్రేక్షకులకు వినోదానికి ఢోకా ఉండదు. ముఖ్యంగా క్రికెట్ క్రీడాభిమానులకు 'ఎక్స్‌ట్రా ఇన్నింగ్స్' నిర్వహించే గౌరవ్ సుపరిచితుడు. మైదానంలో క్రికెట్ జోష్‌కు ఏమాత్రం తగ్గకుండా యాంకరింగ్ చేయడంలో అతడు దిట్ట.





గవాస్కర్, రైనాలతో ...

సెలబ్రిటీ

గౌరవ్ కపూర్

# కొంచెం 'ఎక్స్‌ట్రా'!

'చమత్కారం' గౌరవ్ కపూర్ ఇంటిపేరు అంటుంటారు చాలామంది. కాలేజీలో చదువుతున్నప్పటి నుంచే అతడికి 'ఎక్స్‌ట్రా' యాక్టివిటీస్ అంటే చాలా ఇష్టం. ఢిల్లీలో పుట్టి పెరిగిన గౌరవ్ అక్కడి శ్రీ వెంకటేశ్వర కాలేజీలో చదువుకున్నాడు. మొదటి రోజు సీనియర్లు రాగింగ్ చేస్తారని తెలుసుకుని, అంతకుముందే వారిని కలిసి చిన్న పార్టీ ఇచ్చి వారితో ఫ్రెండ్‌షిప్ చేశాడు. మరుసటి రోజు వాళ్లతో కలిసి తనలాంటి ఫ్రెషర్స్‌ను ర్యాగింగ్ చేశాడు. తీరా క్లాసురూమ్‌లోకి వెళ్లిన తర్వాత గానీ అతడి బ్యాచ్‌మేట్స్‌కు తెలియలేదు గౌరవ్ కూడా ఫ్రెషరేనని. ''ఈ సంఘటనను కొందరు సరదాగా తీసుకుంటే మరికొందరు సీరియస్‌గా తీసుకున్నారు. అయితే ఇలాంటి ఎక్స్‌ట్రాలు ఇక్కడితోనే ఆగిపోలేదు. ఫస్టియర్‌లోనే నాకు ఆర్జేగా పిలుపొచ్చింది. దేశంలో అతి చిన్న వయసులోనే రేడియో జాకీగా మారిన రికార్డు అప్పట్లో నా పేరిట ఉండేది. క్లాసులు ఎగ్గొట్టి ఎప్పుడూ రికార్డింగులంటూ రేడియోస్టేషన్ చుట్టూ తిరుగుతుండేవాడిని. ఒకరోజు మా ఎకనామిక్స్ లెక్చరర్ క్లాస్‌రూమ్‌లో నన్ను చూసి గౌరవ్ కపూర్ క్లాసుకు వచ్చినందుకు అందరూ చప్పట్లు కొట్టండి అంటూ నన్ను ఎగతాళి చేశారు. అయితే నేను ఆ విషయాన్ని కూల్‌గా తీసుకున్నాననుకోండి'' అన్నారు గౌరవ్.

ఆ రోజుల్లో రేడియోలో జాకీగా పనిచేయడమంటే చిన్న విషయమేం కాదు. కాలేజ్ క్యాంపస్‌లో గౌరవ్‌ను సెలబ్రిటీలా చూసేవారు. అమ్మాయిలైతే అతడితో మాట్లాడేందుకు తెగ ఉత్సాహం చూపేవారు. అయితే గౌరవ్‌కు వారితో రొమాన్స్ చేయడానికి సమయమే చిక్కేది కాదు. ''డిగ్రీ చివరి సంవత్సరంలో ఒకమ్మాయిని ప్రేమించాను. కానీ ఆమె మరొకరిని పెళ్లి చేసుకుని చివరికి నాకు మంచి స్నేహితురాలిగా మారింది'' అని



జడేజా, సిద్ధూ, షాహిద్, ప్రియాంకలతో ...

నవ్వుతూ చెప్పారు. కాలేజీలో ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఉండి ఎప్పుడు చూసినా ఏదో ఒక కార్యక్రమం నిర్వహించేవాడు గౌరవ్. అందుకే అతడికి కలుపుగోలుతనం, కార్యక్రమ నిర్వహణ సామర్థ్యం బాగా అబ్బింది. ఆర్జేగా ఎంతోమంది సెలబ్రిటీలను ఇంటర్వ్యూ చేసిన అనుభవం అతడికుంది. ఆ అనుభవంతోనే 'చానెల్ వి'కి వీడియోజాకీగా వెళ్లాడు. ఆరు సంవత్సరాల పాటు ఆ చానెల్‌లో పనిచేశాడు. అదే సమయంలో గౌరవ్ టాలెంట్‌ను గుర్తించి రామ్‌గోపాల్ వర్మ 'డర్నా మనా హై' (2003)లో నటుడిగా అవకాశం ఇచ్చాడు. ఆ తర్వాత 'ష్', 'చాయ్ పానీ ఎట్సెట్రా', 'వైట్ రెయిన్‌బో', 'రామ్‌గోపాల్ వర్మ కీ ఆగ్', 'క్విక్ గన్ మురుగన్', 'ఎ వెడ్నెస్ డే' వంటి చాలా సినిమాల్లో ముఖ్య పాత్రలు పోషించాడు. ఈ బహు కళాకోవిదుడికి క్రికెట్ ప్రపంచం కూడా స్వాగతం పలికింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో సమీర్ కొచ్చర్, హర్షభోగ్లేలతో కలిసి 'ఎక్స్‌ట్రా ఇన్నింగ్స్'ను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహిస్తున్నాడు. అందులో భాగంగా ఎంతోమంది ప్రసిద్ధ క్రికెటర్లతో గౌరవ్ జరిపే సరదా సంభాషణలను అందరూ ఇష్టపడతారు.

చిన్న వయసులోనే మధుమేహం వచ్చినప్పటికీ ప్రతీరోజూ ఇన్సులిన్ తీసుకుంటూనే అటు సినిమాల్లోనూ, ఇటు క్రికెట్‌లోనూ తిరుగులేని స్టార్ ప్రజెంటర్‌గా పేరుతెచ్చుకున్నాడు. మధుమేహంపై ప్రజల్లో అవగాహనను పెంచేందుకు తన వంతు కృషి కూడా చేస్తున్నాడు. ''మధుమేహం వచ్చిందని అశక్తుడిగా మారాల్సిన అవసరం లేదు. దాన్ని అదుపులో ఉంచుకోగలిగితే ఏ పనైనా సరే చలాకీగా చేసేయొచ్చు. అన్నిట్నీ సీరియస్‌గా ఎందుకు చేయాలి? పనిచేస్తున్నప్పుడు సీరియస్‌గా చేస్తే చాలు. ఆ పని భారాన్ని మిగతా చోట్లకు తీసుకెళ్లకుండా ఉంటే తప్పకుండా జీవితం ఆనందమయం అవుతుంది'' అంటున్న గౌరవ్ ఎప్పుడూ నవ్వుతూ తన చుట్టూ ఉండే వారిని నవ్విస్తూ తెరమీద ఎలా ఉంటాడో తెర వెనక కూడా అలాగే ఉంటాడు. ఏ మాత్రం ఖాళీ దొరికినా ఫ్రెండ్స్‌తో టూర్లు వేస్తూ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తుంటాడు.

# అనుగ్రహం

4 – 10 మే 2014

డాక్టర్ పి.ఎ.రామన్



**మేషం:** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఆర్థిక లావాదేవీలు, వ్యాపార వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండాలి. మీ ఇష్టాయిష్టాలను లౌక్యంగా తెలియజేయండి. మీ శ్రీమతి ప్రోత్సాహంతో కొత్త యత్నాలు మొదలెడతారు. ఆదాయ వ్యయాలు అంచనాలకు భిన్నంగా ఉంటాయి. ఋణాలు, చేబదుళ్ళు స్వీకరిస్తారు. ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. శనివారం నాడు పనులు అనుకున్న విధంగా సాగవు. ఒక స్థిరాస్తి విక్రయంలో ఆలోచన మంచిది.



**వృషభం:** కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

మీ ఆలోచనలు కార్యరూపం దాల్చుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ముఖ్యమైన పత్రాలు జాగ్రత్త. బంధుమిత్రులు మీ నుంచి ధనసహాయం అర్థిస్తారు. వాయిదా పడిన పనులు పూర్తి చేస్తారు. ఒక శుభ కార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. మీ శ్రీమతి అభిప్రాయానికి విలువనివ్వండి. సంతానం విజయం సంతోషం కలిగిస్తుంది. ఉద్యోగ బాధ్యతలలో అప్రమత్తంగా ఉండాలి.



**మిథునం:** మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

ఈ వారం ముఖ్యమైన వ్యవహారాలతో తీరిక ఉండదు. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. అవసరాలకు ధనం అందుతుంది. ఆహ్వానాలు, ముఖ్యమైన పత్రాలు అందుకుంటారు. కుటుంబీకుల మధ్య అనురాగ వాత్సల్యాలు పెంపొందుతాయి. మీ అభిప్రాయాలను సున్నితంగా తెలియజేయండి. వాణిజ్య ఒప్పందాలు, చెల్లింపులు, నగదు స్వీకరణలో మెలకువ వహించండి.



**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

ఆసక్తికరమైన విషయాలపై దృష్టి సారిస్తారు. సంప్రదింపులు, ఒప్పందాలకు అనుకూలం. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పెట్టుబడులు లాభిస్తాయి. నూతన వ్యాపారాలు, సంస్థల స్థాపనలకు అనుకూలం. ఆది, సోమవారాల్లో వివాదాస్పద విషయాలకు దూరంగా ఉండాలి.



**సింహం:** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

శుభకార్యాన్ని ఘనంగా చేస్తారు. మీ అతిథి మర్యాదలు అందరినీ ఆకట్టుకుంటాయి. విదేశాల్లోని ఆత్మీయుల రాక సంతోషం కలిగిస్తుంది. ఆదాయ వ్యయాలకు బడ్జెట్ రూపొందించుకుంటారు. రావలసిన ధనం అందుతుంది. పనులు ఇతరులకు అప్పగించి ఇబ్బందులెదుర్కొంటారు. గత అనుభవంతో ఒక సమస్యను అధిగమిస్తారు. ఉద్యోగ బాధ్యతల్లో జాగ్రత్త. ఒక సంఘటన ఆందోళన కలిగిస్తుంది. వ్యాపారాల్లో లాభాలు గడిస్తారు.



**కన్య:** ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1, 2 పాదాలు

కుటుంబ, ఆర్థిక సమస్యలు క్రమంగా సర్దుకుంటాయి. ఒక వ్యవహారంలో ధనం అందుతుంది. ఋణ బాధల నుంచి విముక్తులవుతారు. ఆరోగ్య సంతృప్తి, ప్రశాంతత పొందుతారు. ఆత్మీయులతో ఉత్సాహంగా గడుపుతారు. గురు, శుక్ర వారాల్లో పనులు అనుకున్న విధంగా సాగవు. వ్యాపారాల్లో పోటీని తట్టుకుంటారు. మీ పథకాలు ఆశించిన ఫలితాలనిస్తాయి. మీ శ్రీమతి ఆకస్మిక ప్రయాణం ఇబ్బంది కలిగిస్తుంది.



**తుల:** చిత్త 3,4; స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కలిసివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారు. ఋణయత్నం ఫలిస్తుంది. ఆప్తులతో సంప్రదింపులు జరుపుతారు. ధనమూలక సమస్యలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ తగదు. గుట్టుగా యత్నాలు సాగించండి. శనివారం నాడు పనులు హడావుడిగా సాగుతాయి. ఆస్తి, స్థల వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపారాల్లో నిలదొక్కుకుంటారు. ఉద్యోగుల శ్రమకు గుర్తింపు లభిస్తుంది.



**వృశ్చికం:** విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఆదాయ వ్యయాలకు పొంతన ఉండదు. దుబారా ఖర్చులు చేస్తారు. ఒత్తిళ్ళు, మొహమాటాలకు దూరంగా ఉండాలి. ఆప్తులకు ముఖ్య సమాచారం అందిస్తారు. ఆది, సోమవారాల్లో పనులు మందకొడిగా సాగుతాయి. బంధుమిత్రులతో విభేదిస్తారు. వ్యవహార ఒప్పందాల్లో తొందరపాటు తగదు. ఉమ్మడి వెంచర్లు, వ్యాపారాల విస్తణలకు అనుకూలం. ప్రయాణాల్లో చికాకులు తప్పవు. వాహన చోదకులకు దూకుడు తగదు.



**ధనస్సు:** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ముఖ్యమైన వ్యవహారాలతో హడావుడిగా ఉంటారు. మీ నిర్ణయాలను కచ్చితంగా తెలియజేయండి. ప్రయత్నపూర్వకంగా అవకాశాలు కలిసి వస్తాయి. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. కుటుంబీకుల కోసం ధనం బాగా వెచ్చిస్తారు. మంగళ, బుధవారాల్లో ఇతరుల విషయాల్లో జోక్యం తగదు. పనుల సానుకూలతకు బాగా శ్రమించాలి. పెద్దల ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది.



**మకరం:** ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కార్యసాధనలో జయం, శుభవార్తా శ్రవణం. ఉత్సాహంతో కొత్త పనులు మొదలెడతారు. మీ మాటకు మంచి స్పందన లభిస్తుంది. ఆహ్వానం అందుతుంది. పెద్దల ఆశీస్సులు, ప్రముఖుల ప్రశంసలు పొందుతారు. ఆది, గురువారాల్లో ఒప్పందాల్లో మెలకువ వహించండి. హామీలు, పెద్ద మొత్తం ధన సహాయం తగదు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారు.



**కుంభం:** ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

వృత్తి వ్యాపారాల్లో నిలదొక్కుకుంటారు. ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. అసాధ్యమనుకున్న పనులు తేలికగా పూర్తి చేస్తారు. బంధువులతో సత్సంబంధాలు నెలకొంటాయి. ఆదాయ వ్యయాలకు పొంతన ఉండదు. మంగళ, శనివారాల్లో కావలసిన వ్యక్తుల కలయిక అనుకూలించదు. ఉద్యోగస్తుల శ్రమకు గుర్తింపు, ప్రతిఫలం అందుతాయి. మీ మాటతీరు, అలవాట్లు అదుపులో ఉంచుకోవాలి.



**మీనం:** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

మీరు చేసిన సహాయానికి మంచి గుర్తింపు లభిస్తుంది. కుటుంబీకులు, సన్నిహితులతో ఉల్లాసంగా గడుపుతారు. సంతానం విజయం సంతోషం కలిగిస్తుంది. స్థిరాస్తి అమర్చుకోవాలనే ఆసక్తి బలపడుతుంది. వాయిదాపడిన పనులు పూర్తి చేస్తారు. గురు, శుక్ర వారాల్లో ఇతరుల విషయాల్లో జోక్యం తగదు. వ్యాపారాల్లో క్రమేణా నిలదొక్కుకుంటారు. పొదుపు పథకాలు, వ్యాపారాల విస్తరణలకు అనుకూలం.

**కొన్ని వైరస్‌లు శరీరంలో ప్రవేశించి నిద్రాణంగా ఉండిపోతాయి. ఆ సమయంలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. లక్షణాలు ఏమీ లేవు కదా అని నిర్లక్ష్యంగా ఉండిపోతే అనేక సమస్యలకు దారితీయవచ్చు. ఒక్కోసారి ప్రాణాపాయం ఏర్పడవచ్చు. అలాంటి వాటిలో ముఖ్యమైనవి హెపటైటిస్ బి, సి, హెర్పిస్ సింప్లెక్స్ వైరస్‌లు. ఎన్ని మందులు వాడినా శరీరంలో నుంచి శాశ్వతంగా తొలగిపోని ఈ వైరస్‌లకు హోమియో మేలైన వైద్యమని అంటున్నారు హోమియో వైద్యనిపుణులు డాక్టరు రవికిరణ్.**

# హెపటైటిస్ హెర్పిస్‌లకు మేలైన వైద్యం

హెపటైటిస్ అనగానే అందరికీ హెపటైటిస్ బి గుర్తుకువస్తుంది. కానీ అదొక్కటే కాదు అందులో చాలా రకాలున్నాయి. హెప్‌టైటిస్ సి, ఎ, ఈ, ఎఫ్ రకాలు కూడా ఉన్నాయి. హెపటైటిస్ అంటే కాలేయంలో కణాలు వాచిపోయి ఫైబ్రోసిస్, సిర్రోసిస్‌కు దారితీస్తుంది. దీంతో కాలేయ పనితీరు మెల్లగా తగ్గి ప్రాణాంతకంగా మారుతుంది. కాలేయ కేన్సర్‌కు దారితీయవచ్చు. హెపటైటిస్ బి రాకుండా వాక్సినేషన్ ఉన్నప్పటికీ, ఈ వ్యాధి వచ్చిన తర్వాత శాశ్వత పరిష్కారాన్ని చూపే చికిత్స ఇతర వైద్యవిధానాలలో లేదు. కానీ హోమియోలో అద్భుతమైన చికిత్స ఉంది.

## ఇవీ కారణాలు

సురక్షితంగాని శృంగారంలో పాల్గొనడం అంటే ఎక్కువ మందితో సెక్సువల్ కాంటాక్ట్స్ పెట్టుకోవడం వల్ల హెపటైటిస్ వైరస్ సంక్రమించే అవకాశం ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎక్కించాల్సి వచ్చినపుడు అపరిచితుల నుంచి సేకరించిన రక్తం అంటే హెపటైటిస్ వైరస్ ఉన్న రక్తాన్ని ఎక్కించడం వల్ల సంక్రమించే అవకాశం ఉంది. స్వలింగ సంపర్కం వల్ల కూడా ఈ వైరస్‌లు సోకే అవకాశం ఉంది.



## లక్షణాలు

వ్యాధి సోకిన వెంటనే వైరస్ రోగనిరోధక శక్తి మీద దాడి చేస్తుంది. ఈ సమయంలో ఆకలి లేకపోవడం, వాంతి వస్తున్నట్లుగా ఉండటం, ఒళ్లంత నొప్పులు, మూత్రం పచ్చగా రావడం జరుగుతుంది. తరువాత నెమ్మదిగా కామెర్లు మొదలవుతాయి. దీంతో పాటు చర్మంపై దద్దుర్లు కనిపిస్తాయి. కాలేయం మొత్తానికే పనిచేయడం తగ్గిపోయి మరణం సంభవిస్తుంది.

## వ్యాధినిర్ధారణ పరీక్షలు

హెపటైటిస్ బి, సి వ్యాధులను గుర్తించేందుకు హెచ్‌బీఎస్ ఏజీ అనే పరీక్ష, సి గురించి హెచ్‌సీవీ యాంటీబాడీ ఎంజైమ్ ఇమ్యునోఅస్సై, హెపటైటిస్ బి, సి వైరల్ లోడ్, పీసీఆర్ టెస్ట్ వంటి పరీక్షలు వ్యాధి నిర్ధారణలో ఉపయోగపడతాయి. వీటితోపాటు లివర్ ఫంక్షన్ టెస్ట్, ఈఎస్ఆర్ పరీక్షలు ఉపయోగపడతాయి.

**డాక్టర్ రవికిరణ్** (ఎం.డి., హోమియో)
డైరెక్టర్ అండ్ సీనియర్ ఫిజిషియన్
**మాస్టర్ హోమియోపతి**
అమీర్‌పేట, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్,
హైదరాబాద్, విజయవాడ, కరీంనగర్
ఫోన్: 7842106106,
9032106106



## హోమియో చికిత్స

హెపటైటిస్ బి, సి వైరస్‌లు కాలేయంనకు ఎక్కువగా ఆకర్షితమవుతుంటాయి. ఎందుకంటే ఈ వైరస్‌లు కాలేయంలో మల్టిపుల్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీన్ని రెప్లికేషన్ అంటారు. ఈ రెప్లికేషన్ అయ్యే పద్ధతిని హోమియోపతి మందుల ద్వారా అడ్డుకోవచ్చు. అంతేకాకుండా పెరిగిన వైరల్ లోడ్‌ను మన రోగనిరోధక వ్యవస్థ ద్వారా సమర్థంగా అడ్డుకోవడంలో సహకరిస్తుంది.హోమియో వైద్యంలో క్లాసికల్ విధానం ద్వారానే ఈ వ్యాధిని ఎదుర్కోగలం. లైకోపోడియం, హెపర్ సల్ఫ్, మెర్క్‌సాల్, బ్రయోనియా, పాస్పరస్ వంటి హోమియో మందులు వ్యాధిని తగ్గించడంలో బాగా ఉపయోగపడతాయి.

## హెర్పిస్ సింప్లెక్స్

ఒక గుండు సూది గుండుమీద కోటి వైరస్‌ల దాకా ఇమిడిపోయేంత సూక్ష్మమైన వైరస్ ఇది. జీవింతాంతం బాధించే ఈ వైరస్‌ను హెర్పిస్ సింప్లెక్స్ వైరస్ అని అంటారు. ఇది రెండు రకాలుగా ఉంటుంది.

## నిర్ధారణ ఎలా?

ఈ వ్యాధిలో వైరస్ నిర్ధారణ చాలా ముఖ్యం. సాధారణంగా వ్యాధిని లక్షణాలను బట్టి గుర్తించవచ్చు. అపరిచిత వ్యక్తులతో లైంగిక సంపర్కం తరువాత వారం రోజులలో నీటి పొక్కులలాగా వచ్చి పుండ్లు కనిపిస్తాయి. పుండ్ల దగ్గర ఉండే స్రావాలను సేకరించి చేసే కల్చర్ టెస్ట్, డీఎన్ఏ టెస్ట్, యూరిన్ టెస్ట్ మొదలగు పరీక్షలు నిర్ధారణలో ఉపకరిస్తాయి.

## హోమియో చికిత్స

హెర్పిస్ సింప్లెక్స్ వంటి లైంగిక వ్యాధుల నివారణకు హోమియో చికిత్స అద్భుతంగా పనిచేస్తుంది. శాస్త్రీయతను సంతరించుకున్న హోమియో చికిత్స మూలకారణాన్ని గుర్తించి దాన్ని తొలగిస్తుంది. దీనివల్ల అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చు. రోగనిరోధక వ్యవస్థను పెంచడం ద్వారా రోగనివారణకు సరియైన మార్గం ఏర్పడుతుంది.

హెర్పిస్ వ్యాధికి సంబంధించిన లక్షణాలు కనిపించినపుడు శృంగారానికి దూరంగా ఉండాలి. వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. హెర్పిస్ ఉన్నవారు కండోమ్ ఉపయోగిస్తే మరీ మంచిది. అనుభవజ్ఞులైన హోమియో వైద్యుని దగ్గర చికిత్సతీసుకుంటే హెర్పిస్ వ్యాధిని సమూలంగా తరిమేయవచ్చనడంలో సందేహం లేదు.

## బాటసారి

# సంచారుల కోసం సంచారిగా మారాను!

''ప్రయాణాలలో చాలా రకాలుంటాయి. పండగలు, ఉత్సవాలు, పర్యాటక కేంద్రాలకు చేసే ప్రయాణాలు ఒక్కోటి ఒక్కో రకంగా ఉంటాయి. అదేవిధంగా హాలీడే టూరిస్టులు, యాత్రికులు, దేశదిమ్మరులు, సంచారులు... ఇలా ప్రయాణీకులు కూడా రకరకాలుగా ఉంటారు. విమానాల్లో, రైళ్లలో, బస్సుల్లో, కార్లలో ఇతర వాహనాల్లో ప్రయాణాలు చేయడం వేరు. పాదాలతో మాత్రమే చేయడం వేరు. పాదాలతో చేసే ప్రయాణమే సంచారం. నేను ఈ సంచార జాతికి చెందిన వాడిని. ఎందుకంటే నేను వెళ్లే చోటుకు ఏ వాహనం వెళ్లదు. అదే నా క్షేత్రం '' అంటున్నారు ప్రముఖ పరిశోధకుడు **జయధీర్ తిరుమలరావు**. సంచారాలపై ఆయనకు ఆసక్తి ఎక్కువ. అది పరిశోధన కావొచ్చు, జిజ్ఞాస కావొచ్చు... ఒంటరిగానైనా, బృందంగా అయినా కొన్ని వందల మైళ్లు సంచారం చేసిన అనుభవం ఆయనకుంది. ''చిన్నప్పుడు పేదరికం, పెద్దయ్యాక కుటుంబం, ఉద్యోగ బాధ్యతలు నా పాదాలకు బంధనాలుగా మారకపోయుంటే దేశదిమ్మరిగా బతికి ఉంటే ఎంత బాగుండేది అనిపిస్తుంటుంది అప్పుడప్పుడు. మన దేశంలో సంచారం చేసే జాతులు 500 దాకా ఉన్నాయి. అలాంటి ఒక సంచార జాతి గురించి తెలుసుకోవడానికే నేను సంచారిగా మారాను'' అంటున్న జయధీర్ తిరుమలరావే ఈ వారం మన 'బాటసారి'.





సమాజ అభివృద్ధికి సంచారం ఒక కారణం. భాష పరివ్యాప్తి, సాహిత్యం, కళలు, సంస్కృతి... ఇవన్నీ ఆయా జాతుల సంచారం ద్వారానే విస్తృతిని పెంచుకుని సజీవంగా నిలిచాయి. ఎందరో బాటసారులు ప్రయాణ సాధనాలు లేని రోజుల్లోనే కొన్ని వేల మైళ్లు తిరిగి వీటికి ప్రాణం పోశారు. అలాంటి సంచారుల్లో డక్కలివాళ్లు ముందువరుసలో ఉంటారు. వాళ్లు నిత్యం ఒక చోటి నుంచి మరో చోటికి సంచరిస్తూనే ఉంటారు. వాళ్లను దొరకబట్టి, వారితో మాట్లాడటం అంత సులువైన విషయం కాదు. పైగా మైదాన ప్రాంతాలకు చెందిన వాళ్లను, నాగరికత తెలిసిన వాళ్లను సంచారులు అస్సలు నమ్మరు. వారిని కలవాలనే ఆలోచన నాకు సుమారు 38 ఏళ్ల కిత్రం వచ్చింది. వారిని దొరకబుచ్చుకునేందుకే నా సంచారం మొదలైంది.

### సామూహిక సంచారులు...

1976లో 'తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంలో సాహిత్యం' అనే అంశం మీద పరిశోధన చేసేందుకు నేను క్షేత్ర పర్యటన చేయాల్సి వచ్చింది. అందులో భాగంగా నల్గొండ జిల్లా ఆలేరు ప్రాంతంలో తిరుగుతున్నప్పుడు కొలనుపాక, రేణిగుంట మార్గమధ్యలో నాకొక గుంపు తారసపడింది. వాళ్లు కొన్ని తెలంగాణ పాటలు పాడుకుంటూ వెళ్తున్నారు. ఊళ్లోకి వెళ్లి వారి గురించి ఆరా తీస్తే వాళ్లను 'డక్కలివాళ్లు' అంటారని, ఎక్కడికి పడితే అక్కడికి సమూహాలుగా వెళ్తుంటారని, వారికి స్థిర నివాసం అంటూ ఏదీ ఉండదని... ఇట్లా వాళ్ల గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు చెప్పారు. నాకు వాళ్ల గురించి మరింత తెలుసుకోవాలనే జిజ్ఞాస మొదలైంది.

ఒకసారి కరీంనగర్ నుంచి సిరిసిల్ల వెళ్తుంటే దారి మధ్యలో చెట్ల కింద కొంతమంది డక్కలివాళ్లు కనిపించారు. నేను వెంటనే బస్సు దిగి వారి దగ్గరికి వెళ్లాను. మాట్లాడాలని ప్రయత్నిస్తే వారు పెద్దగా స్పందించలేదు. తమ జాతి వాళ్లు కొందరు వరంగల్ దగ్గర పెద్ద పెండ్యాలలో ఉంటారని మాత్రమే చెప్పారు. మాటల సందర్భంలో నాకు అర్థమైంది ఏమంటే... వాళ్లు జీవితాంతం సంచారులే. దారిలోనే పుడతారు, దారిలోనే పాటలు పాడతారు, దారిలోనే అడుక్కుంటారు, దారిలోనే కాలం చేస్తారు. అలాగే తమ జాతి కాని వాణ్ణి ఎవర్నీ నమ్మరు. నాగరీకులు మోసగాళ్లని, ఊరు నీతి (వాళ్లకు ఊరంటూ ఉండదు) వేరుగా ఉంటుందని వారు వాదిస్తారు. వారి గురించి మరింత తెలుసుకోవాలంటే నేను కూడా వాళ్లలాగే

తయారై వారితో కొన్నాళ్ల పాటు తిరిగితే తప్ప నన్ను నమ్మరని అర్థమైంది.

## వాళ్లలో ఒకడిగా...

జబ్బుకు బ్యాగు, అందులో ఒక టేప్ రికార్డర్, చింపిరి జుట్టు, నెరసిన గడ్డం, మాసిన బట్టలతో నడుచుకుంటూనే పెద్ద పెండ్యాలకు వెళ్లి అక్కడ ఎంక్వయిరీ చేస్తే, సమీపంలోని 'నష్కల్'లో బండల మీద కొందరున్నారని తెలిసింది. రాళ్లలో పడి నడుచుకుంటూ చెట్లు, పుట్టలు దాటుకుంటూ వారి దగ్గరికెళ్లాను. ఆ బండల మీద నాలుగు గుడిసెలు మాత్రమే ఉన్నాయి. వాళ్లంతా నన్ను అనుమానంగా చూశారు. మొదట రానివ్వలేదు. సంచార జీవులకు బీడీలు తాగడం, సారా తాగడం ఇష్టం. అలాగే తాటి కల్లంటే పడి చస్తారు. తాటిచెట్లున్న బాటలోనే వారి ప్రయాణం సాగుతుంది. అది ఎంత దూరమైనా సరే తాటి చెట్ల మధ్య నుంచే వారు వెళ్తుంటారు. నేను తీసుకెళ్లిన బీడీ కట్టలోంచి ఒక బీడీని డక్కలి గోపాల్ అనే అతనికి ఆఫర్ చేసి నేను కూడా వెలిగించాను. కాసేపు మాటల్లోకి దింపిన తర్వాత గోపాల్ నా తపనను అర్థం చేసుకున్నాడు. మా వాళ్లతో మాట్లాడి చెబుతానన్నాడు. అప్పటికే రాత్రయ్యింది. నేను తిరిగి మెయిన్ రోడ్డు దాకా ఒంటరిగా నడుచుకుంటూ వస్తుంటే ఒక పోలీస్ నన్ను ఆపాడు. ఇంత రాత్రి ఎక్కడికెళ్లావని బెదిరించాడు. బండమీదున్న డక్కలోళ్లను కలిసొస్తున్నానంటే నన్ను ఒక నేరగాడిగా భావించి వివరాలు అడిగాడు. నా ఉద్యోగ వివరాలు రాసుకుని వదిలేశాడు.


డక్కలి బాలయ్య

కొన్నాళ్ల తర్వాత మళ్లీ నష్కల్‌కు వెళితే డక్కలి గోపాల్ కలిశాడు. నేను అప్పటిదాకా కలిసిన వాళ్ల గురించి చెప్పడంతో నా మీద వాళ్లకు నమ్మకం కుదిరింది. నడుచుకుంటూనే దగ్గర్లో ఉన్న తాళ్లకు వెళ్లి కల్లు తాగుతుంటే మాటల మధ్యలో 'జాంబ పురాణం' ప్రస్తావన వచ్చింది. ఆ ప్రాచీన కళను డక్కలోళ్లు ఇప్పటికీ ప్రదర్శిస్తుంటారని తెలిసింది.

## 'జాంబ పురాణం' వినేందుకు...

సురవరం ప్రతాపరెడ్డి రాసిన ఒక పుస్తకంలో 'పండగ సాయన్న' పాటను డక్కలి వాళ్లు పాడారని చదివాను. మహబూబ్‌నగర్ జిల్లా పరిగిలో కొందరు డక్కలి వాళ్లు ఉన్నట్టుగా నాకు సమాచారం తెలిసింది. ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేసే షరీఫ్ సార్‌తో కలిసి నా ప్రయాణం అటు వైపుగా సాగింది. బస్సులో పరిగిదాకా వెళ్లి అక్కడి నుంచి ఊళ్లోకి వెళ్తున్న వారి సైకిళ్ల మీద కొంతసేపు, ఎడ్ల బండ్ల మీద కొంతసేపు ప్రయాణిస్తూ కనిపించిన వారినల్లా అడ్రస్ అడుగుతూ ముందుకు వెళ్లాం. 'జాంబ పురాణం' చెప్పడంలో డక్కలి రంగయ్యను మించిన వాడు లేడని కొందరు డక్కలివాళ్లు మాతో చెప్పారు.

మేము వెళ్లేసరికి దొరగారి గడీలో ఎవరికో పాము కుడితే మందు వేసేందుకు వెళ్లాడని తెలిసింది. ఈ లోపు మాకు బాగా ఆకలవుతుంటే తిరిగి ఊళ్లోకి వెళ్లి ఒకచోట వంట చేయించుకుని తిని తిరిగి వచ్చేసరికి చీకటి పడింది. అప్పటికే బాగా తాగి వచ్చాడు రంగయ్య. మేమిద్దరం ఆయనను కలిసేందుకు పడ్డ కష్టాలను ఒక్కొక్కటిగా చెప్పుకుంటూ వచ్చాం. మేమడుగుతున్న 'జాంబ పురాణం' ఆయన దగ్గర తాళ పత్రాలలో ఉండటం చూసి ఆశ్చర్యపోయాం. 'జాంబ పురాణం' గురించి వచనంలో మూడుగంటల పాటు ఏకబిగిన రంగయ్య చెబుతుంటే మేము నోరెళ్లబెట్టి విన్నాం. అంత అద్భుతమైన నెరేషన్ ఎవరూ చెప్పలేరేమో అనిపించింది.


సంచారంలో ఇదీ ఓ భాగమే...

కథ వింటుంటే మధ్య మధ్యలో మమ్మల్ని కొందరు యువకులు చూసి వెళ్లడం గమనించాం. కథ పూర్తయ్యేసరికి అర్ధరాత్రి 12 గంటలయ్యింది. ఆడవాళ్లున్న గుడిసెల్లో ఉండకూడదనేది సంచారుల నియమం. రంగయ్య ఉంటున్న గుడిసెలో ఆయన భార్య, కూతురు ఉన్నారు. అందుకే మేమిద్దరం రోడ్డు మీద నడుచుకుంటూ బస్టాండ్ వైపు వెళ్తుండగా, అంతకుముందు మమ్మల్ని చూసి వెళ్లిన యువకులు అడ్డగించారు. ఊరవతల ఉన్న గుడిసెలోకి వచ్చి వెళ్తున్నామంటే మేము అన్నలమని అనుకున్నారట ( మాసిన బట్టలు, భుజాన సంచీ ఉండటంతో). ఏవో సమస్యలను మాతో చెప్పుకోవాలనుకున్నారు కానీ మేము సార్లమని తెలుసుకుని ఒక స్కూలు దగ్గరికి తీసుకెళ్లి చాప, దిండ్లు ఇచ్చి రాత్రికి అక్కడే పడుకుని తెల్లారి వెళ్లమన్నారు. కానీ మాకు నిద్ర పట్టలేదు. రంగయ్య చెప్పిన 'జాంబ పురాణం' గురించే చర్చించుకుంటూ తెల్లారిన తర్వాత నాలుగైదు కిలోమీటర్లు నడిచి మెయిన్ రోడ్డు మీదకొచ్చి బస్సెక్కాం. అలా వాళ్ల గురించిన విషయాలు తెలుసుకునేందుకు నేను వారితో కలిసి కొన్ని వందల మైళ్లు తిరిగి ఉంటాను. వాళ్లకు వైద్యం బాగా తెలుసు. పసర్లతో పాముకాటు, తేలుకాటుకు మందు వేస్తారు. అయితే ఎదుటివారిని నమ్మితేగానీ పెదవి విప్పరు. వాళ్ల అనుమానాలను తీర్చడం ఎవరివల్ల కాదు.

## 'కిన్నెర' కోసం...

డక్కలి వాళ్ల 'జాంబ పురాణం' ఒకెత్తయితే... డక్కలి బాలయ్య వాయించే 'కిన్నెర' ఒకెత్తని ఆ సమూహాలతో తిరగడం ద్వారా తెలుసుకున్నాను. అప్పుడిక డక్కలి బాలయ్యను పట్టుకోవాలనే ఆసక్తి మొదలయ్యింది. 1988లో డక్కలి బాలయ్య కోసం మహబూబ్‌నగర్‌కు ఏడెనిమిది కిలోమీటర్ల దూరంలో ఉండే బండమీదపల్లె (తండా)కు కాలినడకన ప్రయాణమయ్యాను. నాతో పాటు ఎ.కె. ప్రభాకర్ అనే మిత్రుడు, షరీఫ్ సార్ ఉన్నారు. కనిపించిన ప్రతీ టీ కొట్టు దగ్గర డక్కలి బాలయ్య గురించి ఆరా తీస్తుంటే అంతకుముందే అక్కడికి వచ్చి టీ తాగి వెళ్లాడని ప్రతి ఒక్కరూ చెప్పారు. అలా ఆయన వెంటబడి ఎండలో సుమారు రెండు మూడు గంటలు ప్రయాణించి ఎట్టకేలకు బాలయ్య ఉన్న చోటుకు చేరేసరికి ఆయన అప్పటికే బాగా తాగి నిద్రపోయాడు. మూడు నాలుగు గంటల నిరీక్షణ తర్వాత నిద్ర లేచిన బాలయ్య 'కిన్నెర' తన దగ్గర లేదని, దాన్ని ఒక చోట కుదువ పెట్టానన్నాడు. ఆయనను వెంట తీసుకుని దాన్ని విడిపించి తీసుకొస్తుంటే మరోసారి మందు తాగి 'కిన్నెర' వాయిస్తూ 12 వీరగాథల్ని మాకు వినిపించాడు. ఆ కథలను బాలయ్య రాగయుక్తంగా పాడుతుంటే మరో ప్రపంచంలోకి వెళ్లిన అనుభూతి కలిగింది. అంత గొప్ప సంగీతకారుడు డక్కలి బాలయ్య.

ఇలాంటి ఎన్నో సంచారాల తర్వాత స్టేషన్ ఘన్‌పూర్ దగ్గరి బండి అవుతాపురంలో ఎట్టకేలకు 'జాంబ పురాణం' ప్రదర్శన చూసే అవకాశం కలిగింది. బ్యాక్‌గ్రౌండ్‌లో జాంబపురాణానికి చెందిన పటం వేసి, 13 మందితో ఏడు గంటల పాటు అద్భుతంగా ప్రదర్శించారు. ఆ అనుభవాలతో 1996లో వరంగల్ జిల్లాలోని 'నష్కల్'లో దళిత కళారూపాల ప్రదర్శనను వారం రోజుల పాటు ఒక జాతరలా నిర్వహించడంతో నా సంచారానికి, పరిశోధనకు ఒక లక్ష్యం నెరవేరినట్లయ్యింది.

– చల్లా శ్రీనివాస్

# రంగులు వేయండి



## పియానో విజిల్!

పియానో వాయిస్తే వచ్చే శబ్దాన్ని ఈలగా వేసి వరల్డ్ రికార్డు సాధించాడో విద్యార్థి. అతడి పేరు హార్న్‌డెన్. అతడు సాధించిన రికార్డు– పియానో కీబోర్డుమీద 'బి7'అనే రెండో హయ్యెస్ట్ నోట్(శృతి)ను ఈలగా వేయడం. చిన్నతనంలోనే ఒక ఫ్రెండ్ ఈల వేయడం చూసి తనూ ఈల నేర్చుకున్నాడతను. అలా.. అలా.. రోజుకు నాలుగైదు గంటలు వేస్తూ ఫ్రెండ్స్‌ను, మమ్మీ, డాడీలను చికాకు పెట్టేవాడు. ఒక రోజు తనకు పాఠాలు చెప్పే గురువు ముందు వేసాడు.




ఆయన విసుక్కోకుండా తెగమెచ్చుకున్నాడు. దానితో సంబరపడిపోయి పియానో మీద శృతులను ఈలలుగా మార్చడం, ఆ ఆడియోలను ఇంటర్నెట్‌లో పెట్టడం... చేస్తూ పోయాడు. 2006లో జెన్నిఫర్ డేవిస్ సాధించిన రికార్డును బ్రేక్ చేసి, 2013 నవంబర్ నాటికి 'బి7'ను ఈలగా వేయడంలో కొత్త రికార్డు సాధించాడు హార్న్‌డెన్.

## గ్రేట్ స్విమ్మర్

మైకేల్ ఫిలిప్స్ ప్రపంచంలోనే ప్రసిద్ధ ఈతగాడు. ఇప్పటిదాకా ఒలింపిక్స్‌లో ఎవరూ గెలవలేనన్ని మెడల్స్ సాధించాడు. అతడు సాధించిన



22 ఒలింపిక్ మెడల్స్‌లో 8 గోల్డ్‌మెడల్సే ఉన్నాయి. 2008లో బీజింగ్‌లో జరిగిన ఒలింపిక్స్‌లోనే ఆ 8 గోల్డ్ మెడల్స్ సాధించాడు. 2002లో లండన్‌లో జరిగిన పోటీలతర్వాత విరామం తీసుకున్నా, మళ్లీ 2016లో బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరగబోయే ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు రెడీ అవుతున్నాడు. అందులో కూడా పాల్గొంటే అతడు ఐదు ఒలింపిక్స్ పోటీలలో పాల్గొన్నట్లు లెక్క. అంతేనా అరిజోనాలో జరగబోయే మరో మూడు ఈతపందేల్లో కూడా పాల్గొంటాడని అతడి కోచ్ బాబ్ బౌమన్ అంటున్నాడు. ''ఇదంతా ఫిలిప్స్‌కు సరదా. ఇన్ని రికార్డులు సాధించినా ట్రెయినింగ్ తీసుకున్నాకే కొత్త కొత్త పోటీల్లో పాల్గొంటున్నాడంటే అతడికి హ్యాట్సాఫ్ చెప్పాలి'' అని కూడా మెచ్చుకుంటున్నాడు బౌమన్.

## 7 గెలిచింది

'ఇంటినంబర్ 13' అని ఒక సినిమా ఉంది. అది దెయ్యాల సినిమా కనుక ఎంతోమందిని భయపెట్టింది. ఆ పేరులోని 13 సంఖ్య అన్నా చాలామందికి భయమే. మరైతే అందరికీ ఇష్టమైన నంబర్ అంటూ ఒకటి లేదా అనే ప్రశ్న వేసుకుని బదులు రాబట్టాడు అలెక్స్ బెల్లోస్ అనే గణితరచయిత. 'ఇష్టమైన నంబరు' మీద ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్‌సర్వే చేపట్టాడాయన. అందులో 44,000 మంది పాల్గొన్నారు. ప్రతి నంబరు మీదా కొందరు ఇష్టాన్ని తెలిపినా, ఎక్కువమంది '7' ను తమ ఇష్టమైన నంబరుగా ఎన్నుకున్నారు. ఏడు ప్రపంచవింతలు, సంగీతంలో ఏడు స్వరాలు, వారానికి ఏడు రోజులు..ఇలా ఎంతో పాపులర్ అయిన నంబర్ కనుకనే దానికి అంతగా 'ఓట్లు' వేసారు అని సంబరపడ్డాడు ఆయన.

## చుక్కలు కలపండి



# దారి కనుక్కోండి




# నా బొమ్మ





కె. కేతన్ శ్రీ,
ఎల్.కె.జి.,
ప్రతిభ విద్యాలయం
సబ్బవరం,
విశాఖ జిల్లా.

## మీకు తెలుసా?

- దక్షిణ అమెరికా ఖండంలో 50 శాతం భూభాగం బ్రెజిల్ దేశానిదే.
- ప్రపంచంలో బాతుగుడ్లే పెద్దగుడ్లు .
- డివిడిలు, సిడిలు ఒకే సైజులో ఉన్నా సిడిలతో పోల్చితే డివిడిలలో 13 రెట్ల సమాచారాన్ని ఎక్కువగా నిల్వచేసుకోవచ్చు.
- పరిమాణంలో భూమి కన్నా సూర్యుడు 3,30,330 రెట్లు పెద్దదైతే, చంద్రుడు భూమిసైజులో 27 శాతమే ఉంటాడు.
- విష పూరిత పాములలో నాగుపాము అతి పెద్దది. దాని పొడవు 13 అడుగులవరకు ఉంటుంది.




పిల్లులతో, కుక్కపిల్లలతో ఆడుకోవడం చాలామందికి భలే సరదా. అయితే అపార్టుమెంట్లలో వాటిని పెంచుకోవడం కష్టమే! అందుకే లారెన్ పియర్స్ అనే ఆవిడ లండన్‌లో లేడీ దినాస్ క్యాట్ ఎంపోరియంను ప్రారంభించింది. అక్కడికెళ్లి కేకులు, ఐస్‌క్రీములు తింటూ పిల్లులతో

## పిల్లులకో కేఫ్



ఎంచక్కా ఆడుకోవచ్చు. ఫ్లాట్‌లలో బోరు కొట్టిన పెద్దలు పిల్లలతో పాటు అక్కడికి వెళ్లి వాటితో గడుపుతున్నారట. అయితే రెండు గంటలు వాటితో గడపాలంటే 8.29 డాలర్లు చెల్లించాలి. జపాన్‌లో పది సంవత్సరాల క్రితమే ఇలాంటి క్యాట్ కేఫ్స్ పెడితే, అమెరికాలోని శానిఫ్రాన్సిస్కోలో, కాలిఫోర్నియాలో వీటిని త్వరలోనే ప్రారంభించబోతున్నారు. క్యాట్‌కేఫ్‌లు రాబోయే రెండునెలల వరకు బుక్ అయిపోవడం చూసి, లండన్‌లో కొత్తగా డాగ్‌కేఫ్‌ను కూడా ప్రారంభించబోతున్నారు.

# తేనెటీగల కోటు!

పదహారు రాణి తేనెటీగల పరిమళాన్ని తన ఒంటికి పూసుకుని నిల్చున్నాడు 34 ఏళ్ల షీపెంగ్. అతడి సహాయకులు తేనెటీగలున్న ఒక్కో పెట్టెను తెరవగానే అవన్నీ ఆ వాసనకు ఒక్కొక్కటిగా షీపెంగ్‌పై వాలడం మొదలెట్టాయి. ఝుమ్మని శబ్దం చేస్తూ అవి ఒంటి నిండా వాలుతున్నా మొక్కవోని ధైర్యంతో అంగుళం కూడా కదలకుండా అలాగే నిల్చున్నాడాయన. అలా 4 లక్షల 68 వేల తేనెటీగలు వాలే సరికి షీపెంగ్ బరువు 45.7 కిలోలు పెరిగింది. ఈ రికార్డు కోసమే ఆయన అంతసేపు బొమ్మలా నిల్చున్నాడు. ప్రపంచ రికార్డు సృష్టించానని తెలియగానే 'యాహూ' అంటూ ఒక్కసారి అరిచాడు. దాంతో తేనెటీగలన్నీ కదిలి ఆ ప్రాంతం చిన్నపాటి తుపాను వాతావరణాన్ని తలపించింది. బరువైన 'తేనెటీగల కోటు' ధరించిన వ్యక్తిగా షీపెంగ్ ప్రపంచ రికార్డును సృష్టించడంతో ఆయన స్నేహితులు తేనెతో నోరు తీపి చేసుకున్నారట.





## అవీ ఇవీ

# పెంపుడు జంతువుతో పరుగు!

ప్రపంచవ్యాప్తంగా చాలా మారథాన్‌లు జరుగుతుంటాయి. అవన్నీ కూడా ఒక్కో అంశాన్ని ఫోకస్ చేస్తుంటాయి. ఈ మారథాన్‌లలో భాగంగా 5కె, 10కె రన్‌లు నిర్వహించడం మామూలే. అయితే ఇటీవల న్యూయార్క్‌లోని ఒనొండాగా లేక్ పార్క్‌లో జరిగిన '6 లెగ్డ్ 5కె రన్' అందర్నీ అమితంగా ఆకట్టుకుంది. ఒక జంతు సంరక్షణ సంస్థ నిర్వహించిన ఈ రన్‌లో పాల్గొనేవారంతా తమ పెంపుడు జంతువుతో పాటుగా రావాలని కోరడంతో ఆ ప్రాంతమంతా కుక్కలు, గుర్రాలతో నిండిపోయింది. సుమారు 300 మంది తమ పెంపుడు జంతువులతో (2+4 లెగ్స్) లేక్ పార్క్‌లో 5కె రన్‌ను పూర్తి చేశారు. ఈ కలర్‌ఫుల్ ఈవెంట్‌ను కెమెరాల్లో బంధించేందుకు దేశ విదేశాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు పోటీ పడ్డారు.





**మన శరీరంలో శక్తి ప్రసారం సరిగ్గా జరగటానికి అనేక రకాల వ్యాయామాలు ఉన్నాయి. ఈ వ్యాయామాలు చేయటానికి అవసరమైన శక్తి- మనం తినే ఆహారం, తాగే నీరు, పీల్చే గాలి ద్వారా వస్తుంది. ఈ విధంగా పొందిన శక్తిని సక్రమంగా ఎలా ఉపయోగించుకోవాలనే విషయాన్ని తాయ్ చీ చెబుతుంది. తాయ్ చీ విశిష్టతను బేరీజు వేయాలంటే దాని సమకాలంలో ఉన్న ఇతర వ్యాయామాల గురించి కొద్దిగానైనా తెలుసుకోవాలి.**

# తాయ్‌చీ.. మూడు విధాలుగా లాభం

## క్యూగాంగ్

క్యూగాంగ్ అంటే శక్తిని సక్రమంగా ఉపయోగించుకోవటమని అర్థం. శరీరంలో జీవ శక్తి (క్వి)ని పెంపొందించటానికి క్యూగాంగ్ భంగిమలు ఉపయోగపడతాయి. రెండిటి ఉద్దేశం జీవశక్తిని పెంపొందించటమే అయినా వీటి మధ్య కొన్ని ప్రధానమైన వ్యత్యాసాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యాయామాలలో క్యూగాంగ్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఈ వ్యాయామాలను ఒంటరిగా లేదా బృందాలుగా లేదా వృక్షాలను భాగస్వాములుగా చేసుకొని చేయవచ్చు. కొన్ని వ్యాయామాలు కేవలం సంభాషణల రూపంలో ఉంటాయి. తాయ్ చీలో



వ్యాయామాలు ఇన్ని రకాలుగా ఉండవు. అంతే కాదు. క్యూ గాంగ్‌లో వ్యాయామాలు ఏదో ఒక అంశంపైనే కేంద్రీకరిస్తారు. ఉదాహరణకు ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు సంబంధించిన వ్యాయామాలలో శక్తి ప్రసారం పైన మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తారు. దీని వల్ల కచ్చితమైన ఫలితాలు ఉంటాయి. గుండె జబ్బు ఉన్న వారికి ఒక రకమైన వ్యాయామం ఉంటే కండరాల జబ్బులు ఉన్నవారికి మరొక రకమైన వ్యాయామం ఉంటుంది. తాయ్‌చీలో ఇలా వేర్వేరు వ్యాధులకు వేర్వేరు వ్యాయామాలు ఉండవు. శక్తి ప్రసారాన్ని క్రమబద్ధీకరించటం ద్వారా వ్యాధులను తగ్గించటమే దీనిలో ప్రధానమైన ఉద్దేశం. ఇక క్యూ గాంగ్‌లో శక్తి ప్రసారానికి సంబంధించిన వ్యాయామాలు ఉంటాయి తప్ప, ఇతరులను ఎదుర్కొనే యుద్ధ వ్యూహాలు ఉండవు. తాయ్‌చీలో యుద్ధ వ్యూహాలు ఉంటాయి. అయితే చాలా సార్లు వీటిపై ఎక్కువ దృష్టిని కేంద్రీకరించరు. ఈ రెండింటి మధ్య ఇన్ని వ్యత్యాసాలు ఉన్నా- ఇవి సంప్రదాయక చైనా వైద్య పద్ధతినే అనుసరిస్తాయి.

– శ్రీభావ

తాయ్‌చీ వల్ల ప్రధానంగా మూడు రకాల ప్రయోజనాలు ఉంటాయి. వీటిలో మొదటిది ఒత్తిడిని దూరం చేసుకోవటం. రెండోది శత్రువుల నుంచి రక్షించుకోవటం. మూడోది ఆరోగ్యాన్ని పెంపొందించుకోవటం. ఈ మూడింటిలోను శత్రువుల నుంచి రక్షించుకోవటం తప్ప- మిగతా రెండు ఒక దానిపై మరొకటి ఆధారపడినవి. తాయ్ చీ సూత్రాలలో వీటి గురించి చాలా విపులంగా చర్చిస్తారు. వీటి గురించి తెలుసుకున్న తర్వాత తాయ్‌చీలో ఉండే రకరకాల భంగిమలను అర్థం చేసుకోవాలి.

# పేరులో ఏముంది? 60

## తీర్థ



మాకు మొదటి సంతానంగా అబ్బాయి పుట్టినప్పుడు పేరు పెట్టడానికి పెద్దగా ఇబ్బంది పడలేదు. కారణం- అంతకుముందే 'లోహితాక్ష్' పేరు పెట్టాలని నిర్ణయించుకున్నాం కాబట్టి. వాడి తర్వాత మూడేళ్లకు 7, అక్టోబర్ 2013న అమ్మాయి పుట్టింది. జన్మ నక్షత్రం వైశాఖ కావడంతో పంతులుగారు తే, తూ, తో అక్షరాలతో ఆరంభమయ్యే పేరు పెట్టాలని చెప్పారు. కానీ వాటితో ఎంత ప్రయత్నించినా సరైన పేరు దొరకలేదు. 'తూలిక' అనుకున్నాను కానీ దానికి అర్థం 'పక్షి ఈక' అని ఉండడంతో వెనకడుగేశాం. సరిగ్గా ఆ సందర్భంలో కుటుంబసమేతంగా మంత్రాలయం వెళ్లాం. రాఘవేంద్రస్వామి దర్శనం చేసుకుని బయటకి వస్తుండగా అక్కడున్న తమిళ పూజారి నన్ను పిలిచి 'తీర్థ' అన్నాడు. ఆయన ఉద్దేశ్యం 'తీర్థం' తీసుకుని వెళ్లమని కాబోలు. వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు పూజారి నోటినుండి వెలువడ్డ ఆ పేరు వినడానికి సొంపుగా, స్త్రీ లింగంలో ఉండడంతో రాఘవేంద్రుడే మా అమ్మాయికి ఆ పేరు సూచించారేమో అనుకున్నాం. నా సతీమణి దీప కూడా ఆ పేరునే పెట్టాలని పట్టుబట్టింది. ఆ తర్వాత శ్రీకాళహస్తి వెళ్లి అమ్మవారి ఎదుట 'తీర్థ'గా నామకరణం చేశాం. బోసినవ్వులతో ఇప్పుడిప్పుడే దోగాడుతున్న తీర్థ మా ఇంటి దివ్వె.

– శ్రావణ్‌కుమార్, 94419 34636

## డీతిక



మాది చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలంలోని వెంకట్రామాపురం. నేను పుట్టినప్పుడు 'డీ' అక్షరంతో పేరు పెట్టాలని జ్యోతిష్యుడు చెప్పడంతో మా నాన్న సోమవరపు కృష్ణమనాయుడు గాంధీగారు చాలా ఇబ్బంది పడ్డారట. తెలుగు నిఘంటువులో 'డీ' అక్షరంతో ఆరంభమయ్యే పేరే దొరకలేదట. దాని బదులు వేరే పేరు పెడదామని ఇతరులు సలహా ఇచ్చినా అరిష్టం అని వినలేదట. జాతకం ప్రకారం అదే అక్షరంతో మొదలయ్యేలా ఆలోచించి 'డీతిక' అని నామకరణం చేశారట. నన్ను స్కూల్లో చేర్పించినప్పుడు 'డీతిక' అని చెబితే మేం సరిగ్గా ఉచ్ఛరించలేదనుకుని 'గీతిక' అని రాశారు. దాన్ని 'డీతిక' చేసేవరకు నాన్నగారు నిద్రపోలేదు. ఎవరూ కనిపెట్టకపోతే పేర్లెలా పుడతాయి, అర్థంతో పనేముంది అంటారాయన. మొదట్లో తోటి పిల్లలు, స్నేహితులు, బంధువులు 'పాడవేల రాధి క.. ప్రణయసుధా డీతికా' అంటూ ఆటపట్టించేవారు. అయినా ఎవరేమనుకుంటే నాకేంటి? లోకంలో ఎవరికీ లేని పేరు నాకున్నందుకు వాళ్లంతా కుళ్లుకుంటున్నారని భావిస్తాను. ఈ మధ్యనే పదవ తరగతి పరీక్షలు రాశాను.

– డీతిక, తిరుపతి

★ **అరవై వారాల్లో 116 ప్రత్యేకమైన పేర్ల వెనక గల కథనాన్ని అందిస్తూ వచ్చాం. ఈ శీర్షికను ఇంతటితో ముగిస్తున్నాం. మాకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు** – సంపాదకులు

**జైలు ఆవరణ శుభ్రంగా ఊడ్చి ఉంది. ఒక్క ఎండిన ఆకు కూడా లేదు. నలుగురైదుగురు ఉండే ఇళ్ళే శుభ్రంగా ఉండవే... అలాంటిది వంద మంది పెద్దలు, పాతిక మంది పిల్లలు ఉండే జైలు ఆవరణ ఇలా ఎలా ఉండగలి గింది అని ఆశ్చర్యపోయాను.**

**''దీదీ! నాస్తా గంట కొట్టారు. నువ్విక్కడే కూర్చో నేను తెస్తాను'' అంటూ దులా ఒక స్టీలు గిన్నె తీసుకుని గబగబా వెళ్ళింది. లైనులో నిలబడి తీసుకునే అనుభవం సర దాగా ఉండేది కదా అని నేనే వెళ్ళాలను కున్నా. కానీ మొదటి రోజు కదా వద్దంటే వినేలా లేదు. నాస్తా చూడగానే దిగులేసింది.**


బొమ్మ : అక్బర్

అంతకుముందే చాయ్ అనుభవం ఒకటయిపోయింది. ఇంతకాలం అత్యంత చెత్త చాయ్ అవార్డ్‌కి రైల్వే వాళ్ళకి మాత్రమే అర్హత ఉందనుకునేదాన్ని. ఆ అభిప్రాయం వెంటనే మార్చేసుకుని జైలువాళ్ళకే ఆ అవార్డు ఇచ్చేశా. అమ్మో ఆ విషయంలో వాళ్ళని ఎవరూ బీట్ చేయలేరు.

రచయిత త్రిపుర 'భగవంతం కోసం' కథలో అనుకుంటా మొదటిసారి 'కాఫీ! అదొక వేడి గోధుమరంగు ఊహ' అనీ, తర్వాత 'అది ఉత్త గోధుమ రంగు ఊహ' అనీ, చివరకు 'అది ఒక వేడి ఊహ' అనీ.. ఇలా రకరకాలుగా వర్ణిస్తాడు. మంచి చాయ్ అనేది జైలు నుంచి విడుదలయ్యే వరకూ నాకు కూడా ఒక వేడి గోధుమ రంగు ఊహగానే మిగిలిపోయింది.

# వంటే నేరమైన చోట!

ఇక్కడ నాస్తా అంటే నానపెట్టిన శనగలు. నాకు శనగలు ఏ రూపంలోనూ పడవు. వాటి వంక దిగులుగా చూస్తుంటే ''దీదీ నా దగ్గర పల్లీలున్నాయి, తింటావా?'' అంటూ వేయించిన పల్లీకాయలు బయటకు తీసింది లలిత. వాటిని వలుచుకొంటూ కబుర్లలో పడ్డాం. నేను తొక్కలన్నీ జాగ్రత్తగా పోగేసి బయటపడేద్దాం అని లేవబోతుంటే ''ఇలా ఇవ్వు'' అంది.

ఫరవాలేదు అని ఏదో ఘోరం జరిగిపోయినట్టు కెవ్వున అరిచి ''అమ్మో అవి చాలా ప్రియమైనవి (ఖరీదైనవి). ఇలాంటివి ఇక్కడ పడెయ్యకూడదు'' అంది.

బిత్తరపోయాను నేను. తరువాత మెల్లగా మూడు చిన్న చిన్న డబ్బాలు తీసింది. వాటిని త్రిభుజాకారంగా పేర్చింది. దానిమీద ఒక చిన్న స్టీలు గిన్నె పెట్టింది. దాని కింద ఒక ప్రమిద పెట్టింది. అందులో కొంచెం ఆవనూనె పోసింది. ఒక చిన్న గుడ్డపీలిక వత్తిలా చేసి దానిలో వేసి 'లాల్ చాయ్' (డికాక్షన్‌ను ఝార్ఖండ్‌లో లాల్ చాయ్ అంటారు.) చెయ్యడం మొదలుపెట్టింది.

''అరె ఈ ప్రమిద ఎక్కడిది?''

దీపావళికి ఇక్కడ అందరికీ ఒక్కో ప్రమిద చొప్పున ఇస్తారట. ఎక్కడో అక్కడ వెలగడమే కదా కావాల్సింది. ఇక్కడది చాయ్ గిన్నె కింద వెలుగుతుంది అంతే. చాయ్ చేయడానికి ఈ నూనె సరిపోతుంది కానీ ఇంకొంచెం ఎక్కువేమయినా చెయ్యాలంటే పల్లీతొక్కలు, అరటిపండు తొక్కలు, పాత చెప్పులు, పాత గుడ్డలు, ప్లాస్టిక్ సంచులు, వేప పుల్లలు, ఎండుటాకులు... లిస్టు ఇంకా కొనసాగుతుండగానే... నా మెదడులో మెరుపు మెరిసింది. ఆవరణ అంత శుభ్రంగా ఎందుకున్నదో ఇప్పుడు తెలిసింది. ఎండుటాకుల కోసం ఎన్ని యుద్ధాలు జరగగలవో తరువాత కాలంలో నేను ప్రత్యక్షంగా చూశాను. జైలు ఆసుపత్రి గదిలో అప్పుడప్పుడు దొరికే సెలైన్ బాటిల్స్ కోసమైతే ప్రపంచ యుద్ధాలే జరుగుతాయి. అవి ఇంకా బాగా ఎక్కువసేపు మండుతాయి కాబట్టి చాలా డిమాండు.

**లిస్టు ఇంకా కొనసాగుతుండగానే... నా మెదడులో మెరుపు మెరిసింది. ఆవరణ అంత శుభ్రంగా ఎందుకున్నదో ఇప్పుడు తెలిసింది. ఎండుటాకుల కోసం ఎన్ని యుద్ధాలు జరగగలవో తరువాత కాలంలో నేను ప్రత్యక్షంగా చూశాను. జైలు ఆసుపత్రి గదిలో అప్పుడప్పుడు దొరికే సెలైన్ బాటిల్స్ కోసమైతే ప్రపంచ యుద్ధాలే జరుగుతాయి.**

నిజానికి జైల్లో వంట, వంట నిషేధం. అయినా ఏదో స్థాయిలో వంట నడుస్తుంది. వంట లేకుండా వంట కుదరదు కనుక కాదేదీ మంట పెట్టడానికి అనర్హంలా అన్నీ చివరికి చేరేది పొయ్యిలోకే. అయితే అందరూ చేసుకుంటారని కాదు. కొంతమందికి మగవాళ్ళ వార్డుల నుండి కూరలు వస్తూ ఉంటాయి. అక్కడ కొంతమంది కలిసి సామూహికంగా రేషన్ తీసుకుని

# జైలుకథలు - 7

బి. అనూరాధ

కూరలు వండుకుంటారు. అవి మహిళా వార్డులో ఉండే తమ కుటుంబ సభ్యులైన ఆడవాళ్ళకి పంపుతూ ఉంటారు. వారానికి ఒకసారి 15 మి.లీ ఆవనూనె ఇస్తారు. అది కూడపెట్టి వంటలకి వాడుకుంటారు. ఝార్ఖండ్‌లో నాకొచ్చిన మరొక కష్టం ఆవనూనె వంటలు తినడం. కానీ అదే వాడతారు. అది అక్కడ ముఖ్యమైన పంట. అంతేకాకుండా ఒంటికి ఆవనూనె పూసుకోవడం చాలా అలవాటు అక్కడి వాళ్ళకి. అందుకే ఆ నూనె ఇస్తారు. తలకి రాసుకోవడానికి వేరుగా కొబ్బరినూనె ఒక పేకెట్ ఇస్తారు. అది 15 రోజులకి ఒకసారి.

★★★

జైలులో ఏడాది మొత్తం మీద నాలుగు నెలల పాటు వారానికోసారి మాంసం ఇవ్వాలనే నియమం ఉంది. అలాగే పండుగల సందర్భంగా విశేష భోజనం కావాలంటే ఆ పండగకి రెండు వారాల ముందుగా వేరే ఏదైనా కట్ చేసి మిగిల్చిన డబ్బుతో ఆ పండగ ఏర్పాట్లు చేయవచ్చు అనే నియమం కూడా ఉంది. దీనిని ఉపయోగించుకుని ఖైదీల తిండిలో కోతలు మొదలవుతాయి. మాంసం ఇవ్వడం రెండు దఫాలుగా ఉంటుంది. అందులో రెండు నెలల మాంసం హోలీ పండుగ జరపడానికి, మరొక రెండు నెలల మాంసం దసరా పండుగ జరపడానికి అనే పేరుతో కోత పెడతారు. వెరసి ఖైదీలకి ఒక దఫాలో ఒకసారి, రెండో దఫాలో ఒకసారి మాంసం కూర పెడతారు. దానివల్ల మాంసం వారికి నామమాత్రంగానే దొరుకుతుంది. దాంతో ఖైదీలు పావురాల వెంట పడుతుంటారు.

నా స్నేహితుడొకరు 'గే నెక్' అని ఒక పుస్తకం పంపాడు. అది చదివాక నాకు పావురాల మీద ప్రత్యేకమైన అభిమానం కలిగింది. అయినా జైలుకి, పావురాలకి ఒక అవినాభావ సంబంధం ఏదో ఉందనిపిస్తుంటుంది. గుంపులు గుంపులుగా పావురాలు అలా వచ్చి వాలుతూ ఉంటాయి. బయట ఉన్నప్పుడు అవి స్వేచ్ఛకి ప్రతీకలుగా అనిపిస్తే జైల్లో మాత్రం స్వేచ్ఛ కోల్పోవడానికి ప్రతీకలుగా కనిపిస్తాయి. వాటిని గమనించడం మొదలయ్యాక వాటిలో ఎన్ని రంగులుంటాయో, వాటి మెడ ఎంత అందంగా ఉంటుందో జీవితంలో మొదటిసారి గుర్తించాను నేను. అంతకు ముందు కాకులన్నీ ఒకేలా ఉన్నట్టు పావురాలు కూడా ఒక్కలాగే అనిపించేవి.

రింకూ పావురాలు పట్టడంలో మహాదిట్ట. మా జైలు బిల్డింగ్ పాత కాలం నాటి బ్రిటిష్ కట్టడం. దానికి ఎత్తయిన గోడలతో పాటు పైకప్పుకి కొంచెం కింద పిజెన్ హోల్స్ ఉంటాయి. వాటిల్లో నుండి పావురాలు బయటకూ లోపలికీ తిరుగుతుంటాయి. కొన్నిటిలో గూళ్లు కట్టుకుని పిల్లలను పెడుతుంటాయి. ఉదయం పూట ఖైదీలు ఎండపెట్టే శనగల కోసం ఒకటే వచ్చి వాలుతుంటాయి.

నా స్నేహితుడొకరు 'గే నెక్' అని ఒక పుస్తకం పంపాడు. అది చదివాక నాకు పావురాల మీద ప్రత్యేకమైన అభిమానం కలిగింది. అయినా జైలుకి, పావురాలకి ఒక అవినాభావ సంబంధం ఏదో ఉందనిపిస్తుంటుంది. గుంపులు గుంపులుగా పావురాలు అలా వచ్చి వాలుతూ ఉంటాయి. బయట ఉన్నప్పుడు అవి స్వేచ్ఛకి ప్రతీకలుగా అనిపిస్తే జైల్లో మాత్రం స్వేచ్ఛ కోల్పోవడానికి ప్రతీకలుగా కనిపిస్తాయి. వాటిని గమనించడం మొదలయ్యాక వాటిలో ఎన్ని రంగులుంటాయో, వాటి మెడ ఎంత అందంగా ఉంటుందో జీవితంలో మొదటిసారి గుర్తించాను నేను. అంతకుముందు కాకులన్నీ ఒకేలా ఉన్నట్టు పావురాలు కూడా ఒక్కలాగే అనిపించేవి. మహా అయితే తెల్ల పావురాలు, బూడిద రంగు పావురాలు అంతే. ఆ కాలంలో చలం రాసిన బుజ్జిగాడు తెగ గుర్తుకొచ్చేది (అది గోరింకల గురించి అయినప్పటికీ). అప్పట్లో గోపాలకృష్ణ గాంధీ గవర్నర్ పదవి నుండి రిటైర్ అయ్యి, బహుశా హిందుస్థాన్ టైమ్స్‌లో అనుకుంటా కాలమ్ రాస్తున్నారు. ఒకసారి ఆయన తన బాల్కనీకి రెగ్యులర్‌గా వచ్చే గోరింకల గురించి రాశారు. అందులో ఒక ఆడ గోరింక కుటుంబ హింసకి గురయ్యినట్టు ఆయన అనుమానించారు కూడా. ఇలా పక్షుల గురించి ఎవరేం రాసినా తెగ చదివేయడం, వాటిని జీవితంలో భాగం చేసేసుకోవడం అలవాటయ్యింది.

జైలు నాకు పక్షులను, పువ్వులను దగ్గర చేసింది. జైలులో నా జీవితానికి అందాన్ని, ఆనందాన్ని తెచ్చిపెట్టాయవి. అలాంటి టైములో నాకొక క్లిష్ట పరిస్థితి ఎదురయ్యింది. నేను ఒక పావురం తగవు తీర్చాల్సి వచ్చింది. ఆహారపు అలవాట్ల రీత్యా నేను మాంసాహారినే. అనేక రకాల మాంసాలు తిన్న దానినే. అయితే కొత్తగా పావురాల పట్ల పెరిగిన ఈ ప్రేమ నన్ను సంకటంలో పడేసింది.

పావురాలు గుంపులుగా వాలినప్పుడు హఠాత్తుగా వాటి మీద టవల్ విసిరి వాటిని ఒడుపుగా పట్టుకునేది రింకూ. ఇప్పుడు తగవు ఎక్కడొచ్చిందంటే రింకూ కూర వండుతున్నప్పుడు రుదన్‌గాడు ఆమె వెనకాల తిరగడం మొదలు పెట్టాడు. ఆమె తనకి వాటా ఇవ్వబోవడం లేదని అర్థం అయ్యాక తన ఇద్దరన్నదమ్ములైన బుదన్, సుదన్‌లని కూడా తీసుకొచ్చాడు. వాళ్ళతో కూడా పని అయ్యేటట్టు లేదని గ్రహించాక తమ పెంపుడు తల్లి పారోదేవిని కూడా లాక్కొచ్చాడు. పావురాన్ని మెడ కొరికి చంపింది నిజానికి రుదన్‌గాడేనని పిల్లలంతా పారోకి సాక్ష్యం చెప్పారు. నోరులేని మూగజీవాలకి అన్యాయం చేస్తే పుట్టగతులుండవని, 'బీస్ సాల్ సజా' (ఇరవై యేళ్ళ శిక్ష) పడుతుందని పారో నోరు చేసుకొంది. పావురాన్ని శుభ్రం చేసి మషాలాలు దట్టించి వండింది ఆఫ్టరాల్ ఒక పిల్లి వెధవకి ఇవ్వడానికి కాదని రింకూ వాదన. కానీ పారోదేవికి అవి ఆఫ్టరాల్ వెధవ పిల్లులు కానే కాదు. తన బిడ్డల్లాగా చూసుకొంటుంది వాటిని. కాబట్టి, వాటికి అన్యాయం జరగనిచ్చే ప్రశ్నే లేదు. దాంతో ఇద్దరూ ఒకరినొకరు ఆపకుండా తిట్టుకొన్నారు. జైల్లో ఎవరైనా ఇద్దరు ఖైదీలు తిట్టుకొంటున్నప్పుడు తీర్పు చెప్పడానికి పోవడం కన్నా బుద్ధి తక్కువ పని ఇంకొకటి లేదు. కానీ ఒక పక్షం పిల్లులు కావడం, వాటికి పిల్లల మద్దతు పూర్తిగా ఉండడం, ఆ పిల్లులు రింకూ మీదకు గాండ్రుమని దూకడానికి సిద్ధంగా ఉండడంతో అందరం వార్డులో నుండి బయటకు రాక తప్పలేదు. లేకపోతే అది పెద్ద గొడవగానే పరిణమించేది. చివరికి నన్ను కూడా అందులోకి లాగాక, రెండొంతులు రింకూ తీసుకుని ఒక వంతును పిల్లులకి ఇవ్వాలని, దానిని వాళ్ళమ్మ మూడు భాగాలు చేసి మూడు పిల్లులకే ఇవ్వాలని ఫైసలా చేశాను.

నిజానికి ఇది కొంచెం సరదా వ్యవహారంగా పరిణమించినందువల్ల గానీ లేకపోతే నేనసలు ఎంతమంది వచ్చి అడిగినా తగాదాలు తీర్చే పనికి అస్సలు పోను. ఎందుకంటే దానివల్ల ఏదో ఒక పక్షానికి శత్రువుగా మిగలడం తప్ప మనం సాధించేది ఏమీ ఉండదు.

రింకూకు కోపం తగ్గలేదు. విషయం సెటిలయ్యాక కూడా రుదన్ గాడికేసి చూస్తూ 'అరె రుదనవా, సాలా! నిన్ను కూడా వండుకొని తింటానొక రోజు చూస్తావుండు' అని బెదిరించింది. 'మ్యావ్' అన్నాడు రుదన్. అంటే 'ఏడిసావులే' అని అర్థం అని పారో చెప్పింది.

anu13ravi@gmail.com

# మిక్స్చర్ పొట్లం

బొమ్మలు: ఎస్.రాజశేఖర్ రెడ్డి

## మనిషిన్నాక కృతజ్ఞత ఉండాలే ...



రమ, సుమ పార్కులో ఉండగా ఒక బిచ్చగాడు ఎదురై ''ధర్మం చెయ్యండమ్మా'' అని అడిగాడు.

రమ వెంటనే పర్సులోంచి ఐదు వందల రూపాయల నోటు తీసి వేసింది.

''పిచ్చెక్కిందా నీకు, అది ఐదు రూపాయలనుకున్నావా?'' ఆశ్చర్య పోయింది సుమ.

''తెలిసే వేశాను .... గతంలో అలాంటి ఐదు వందల నోట్లు నాకోసం ఎన్నో ఖర్చుపెట్టాడతను'' తాపీగా చెప్పింది రమ.

## గోడ తగవు



స్వర్గానికి, నరకానికి మధ్య ఉన్న గోడ కూలిపో డానికి సిద్ధంగా ఉందని, ఇరు పక్షాల వారు సమావే శమయ్యారు.

''నరకవాసుల వల్లే గోడ బీటిచ్చింది ... మీరే పునర్నిర్మించాలి'' అన్నారు స్వర్గవాసులు.

''మాకు సంబంధం లేదు. కావాలంటే కోర్టులో కేసు వేద్దాం'' అన్నారు నరకవాసులు.

''మాకు న్యాయం జరగదు. లాయర్లంతా నరకంలోనే ఉన్నారు'' చెప్పారు స్వర్గ వాసులు.

## రివర్స్ గేర్



''అమ్మా ... బిచ్చం తల్లీ'' అరిచాడు రోజూ వచ్చే బిచ్చగాడు.

''హమ్మయ్య వచ్చావా? నీకోసమే ఎదురు చూస్తున్నా .. అను కోకుండా మా అత్తింటి బంధువులొచ్చారు. ఇప్పుడు నాకు వండే ఓపిక లేదు. నీ జోలెలో ఉన్న అన్నం, కూరలు అరువివ్వు. రేపు వడ్డీతో సహా ఇస్తాలే'' ఖాళీ గిన్నెలు ముందుంచి బిచ్చగాడిని అర్థించింది అలివేలు.

## కనిపించని బాటిల్



''టైరు ఎలా పంక్చరయ్యింది?''

''కారుని ఒక మందు బాటిల్‌పై నుండి నడిపాను''

''మరి మందు బాటిల్ ఏది?''

''అది ఆ తాగుబోతు జేబులో ఉండి పోయింది''

## వార్నింగ్



''నేను సెల్ ఫోన్ అయితే .. నీవు సిమ్ కార్డువి'' గోముగా అంది రాధ.

''యురేకా ...'' పిడికిళ్లు బిగించి అరుస్తూ ముద్దివ్వబోయాడు మదన్.

''ఓవర్ యాక్షన్ చేస్తే సిమ్ కార్డు మార్చేస్తా జాగ్రత్త'' వార్నింగ్ ఇచ్చింది రాధ.

## ప్రశ్నించడం నేర్చుకో



''మీ గేదె పాలిస్తుందా?'' అడిగాడు అప్పారావు.

''ఇవ్వదు. మనమే పితుక్కోవాలి'' చెప్పాడు సుబ్బారావు.

## దెబ్బకు దెబ్బ



హాలివుడ్ దగ్గర్లో ఉన్న బార్‌లో కూర్చున్న Steven Spielberg దగ్గరకి ఒక చైనా వాడు వెళ్లి ''ఆటోగ్రాఫ్ ప్లీజ్'' అన్నాడు. వెంటనే Spielberg చైనావాడి చెంప పగలగొట్టి ''మీ చైనీస్ మా పెరల్ హార్బర్‌ని పేల్చేశారు'' అన్నాడు.

''పెరల్ హార్బర్ పేల్చింది మేం కాదు, జపనీస్'' చెంప తడుముకుంటూ చెప్పాడు చైనావాలా.

''చైనీస్, జపనీస్, తైవానీస్ ... మీరంతా ఒక్కటే'' అన్నాడు Steven Spielberg గుడ్లురిమి.

''అయితే నీవు టైటానిక్ కూల్చేశావు .... అందులో మా తాతున్నాడు'' అరిచాడు చైనావాలా కోపంతో.

''టైటానిక్‌ను ముంచింది ఐస్ బర్గ్ ... నేను కాదు'' చెప్పాడు Spielberg.

''ఐస్ బర్గ్, కార్ల్స్ బర్గ్, స్పీల్ బర్గ్ ... మీరంతా ఒక్కటే'' అని అరుస్తూ అక్కడ్నుంచి వెళ్లిపోయాడు చైనావాడు.




## రమేశ్చంద్ర మహర్షి

బి.టెక్,

సెల్: 92465 82255

ఫోన్: 040-6522 5554


భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, ప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలూ, పంచ కర్మేంద్రియాలూ, మనసూ అనే పదకొండు ఇంద్రియాలూ, శబ్ద, రూప, స్పర్శ, రస గంధాలనే ఇంద్రియ విషయాలూ కోరిక, ద్వేషం, తెలివి, సుఖం, దుఃఖం, ధైర్యం ... వీటి వికారాలూ కలిసి ఏర్పడే క్షేత్రం ... మనిషి! ఆ మనిషికి భవిష్యత్తనే దారి చూపే నేత్రం, జ్యోతిశ్శాస్త్రం!!

★★★

కృతే కార్యే కిం ముహూర్త ప్రశ్నేన?

పని ముగిసిన పిదప ముహూర్తమడగడం, జరగకూడనిది జరిగిపోయాక పరిహారాలు పాటించడం వలన ఏంటి ప్రయోజనం?

భవిష్యత్ ముందే తెలిస్తే ముప్పు నుండి తప్పించుకోవడం లేదా తగ్గించుకోవడం సాధ్యమే!

కాలః క్రీడతి గచ్ఛత్యాయుః

కాలం ఆడుకుంటూ ఉంటుంది. ఆయువు గతించిపోతూ ఉంటుంది. రాబోయే మంచి చెడ్డలు తెలిస్తే ఉన్నంతలోనే ఉన్నతంగా జీవించగలుగుతాం!

వయం భగవంతః స్యామ

మనమందరమూ భాగ్యశాలురమవుదుముగాక!

★★★

పాఠకులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఈ క్రింది వివరాలు రాసి పంపండి.

పేరు ....................................

పుట్టిన తేదీ ..............................

పుట్టిన సమయం .....................

పుట్టిన ఊరు (మండలం)...........

ప్రశ్న ....................................

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అదృష్ట రత్నజ్యోతి**

ఆంధ్రజ్యోతి దినపత్రిక

ప్లాట్ నెం.76, అశ్విని లే-అవుట్,

జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033.

# అదృష్ట రత్నజ్యోతి

**వై.ఎస్.ఆర్., మదనపల్లి**

మా మనుమడి జన్మకుండలి సంపూర్ణంగా, నిర్మొహమాటంగా వివరించగలరు. ఈ జన్మకుండలి ప్రకారం నక్షత్రం ధనిష్ఠ. రాశి కుంభం.

2012 సెప్టెంబర్ వరకూ రాహు దశ.

2012 సెప్టెంబర్ నుండి 2028 జూన్ వరకూ గురు దశ.

2028 జూన్ నుండి 2047 మార్చ్ వరకూ శని దశ. పిదప బుధ దశ.

యోగాలు : 1. రాజయోగం. పని చేస్తుంది. అయిదే ఇది శని దశ నుండి మాత్రమే బహిర్గతమవుతుంది. ఈ రాజయోగానికి దిశా నిర్దేశం అగమ్యం! కారణం శని చంద్రుల కలయిక! అలాగే ఈ రాజ యోగం ఉద్యోగంలో ఉన్నంతవరకూ పని చేయదు. వృత్తి సబార్డినేషన్ నుండి స్వతంత్రమైతేనే దీని ఫలితం.

2. నీచభంగ రాజయోగం. ఇది బుధునికి శుక్రుని వలన, గురుని వలన ఇద్దరి వలనా కావడం విశేషం. విచిత్రమేమిటంటే ఈ యోగం ఉద్యోగంలో ఉన్నంత వరకూ పనిచేసే యోగం. అలాగే చెడిన అదృష్టం... చేయి జారిన అదృష్టం ఎప్పటికయినా తిరిగి చెందేలా చేసే యోగం. బూమరాంగ్ లాగా తిరిగి తన వద్దకు రావలసిందే!

3. పరివర్తన యోగం. దీని ఫలితం ఉద్యోగం చేసినంత కాలం విదేశాల్లో ఉండడం, విదేశాలతో సంబంధం కలిగి ఉండడం. అలా కాకపోతే ఉద్యోగ రీత్యా ఎదుగుదల ఉండకపోవడం, అవమానాలు, వద్దని భీష్మించుకున్నా వచ్చే మార్పులు... అంటే చేంజాఫ్ జాబ్, చేంజాఫ్ ప్లేస్ తదితరం!



ఇక రవి పోర్ట్ ఫోలియోస్...

వ్యాపారం చేయించి ధనాన్నివ్వాలన్న రవి ప్రయత్నానికి కేతువు గండి కొడుతుంటాడు. ఆ ధన నష్టం, వ్యాపార నష్టం భాగస్వాములను పోగొట్టుకోవడంలో ''వెంట్'' తీసుకుంటుంది.

వ్యాపార స్థానాధిపతి పరిస్థితి కూడా ఇదే! వ్యాపారం బాగా చేయించి మంచి స్థితిలో ఉంచాలన్న అధిపతి ప్రయత్నాన్ని గురువు నిర్వీర్యం చేస్తుంటాడు. వ్యాపారం సంగతి మర్చిపోయి, విదేశాల్లో ఉద్యోగం చేసుకోమనడం ఇక్కడ గురుని పోర్ట్‌ఫోలియో!

దీనంతటినీ క్రోడీకరిస్తే ఈ జాతకునికి భవిష్యత్‌లో ఎప్పుడూ వ్యాపారం చేయకూడదన్నది గూడార్థం! చేస్తే నష్టమే తప్ప లాభముండదన్నది సారాంశం.

విద్య ఇంజనీరింగ్. 2011 సెప్టెంబర్ నుండి ప్రారంభమవుతుంది. అంటే రాహువులో కుజునితో. అయితే గురు దశలో విద్య రీత్యా కొంత జాగ్రత్త అవసరమే. కారకుడు కనుక విద్యనివ్వాలి. పోర్ట్‌ఫోలియో బ్రేక్ చేయడం కనుక విద్యని వంట బట్టకుండా చేయాలి... కన్ఫ్యూజన్! ఇలాంటప్పుడే రెమిడీస్ అక్కరకు వస్తాయి. వీటిలో ప్రధానమైన రెమిడీ- హాస్టల్‌లో ఉండి చదువుకోవడం. దీనర్థం ఇంట్లో ఉంటే సరిగా చదవరూ, హాస్టల్లో ఉంటే బాగా చదువుకుంటారు అని కాదు! అది ఒక రెమిడీ... అంతే!

రెండవది పచ్చ+వజ్రం కలిపి ధరించడం. దీని వలన లగ్నాత్తూ చంద్రలగ్నాత్తూ కూడా విద్యా స్థానాధిపతుల అండదండలు లభిస్తాయి. లక్ష్మీ యోగం పురి విప్పుకుంటుంది. నిజానికి జన్మకుండలిలో లక్ష్మీయోగం ఉద్యోగంలో అసాధారణమైన స్థితికి ఉపయోగపడుతుంది. అయితే మంచి ఉద్యోగం, దానిలో ఉన్నతీ ఉండాలంటే ముందు విద్యలో రాణించాలి కదా ఆ విధంగా ఇక్కడ లక్ష్మీ యోగం ఈ రత్నధారణతో యాక్టివేట్ అయి విద్యలో విజయానికి తోడ్పడుతుంది. ''భూతం భవ్యాయ కల్పతే'' జీవితంలో సంఘటనలు ఒక దానికొకటి విచిత్రంగా ముడిపడి ఉంటాయి. ఉదాహరణకి దశరథుడు శ్రవణకుమారుడి మీదికి అనుకోకుండా విడిచిన బాణం, ఎప్పుడో జరిగే రావణుడి వధకు సంబంధం కలిగి ఉంటుంది. ఆఖరికి ఆ రోజు దశరథుడు వేటకు బయలుదేరేటప్పుడు ఎదురయిన శకునంతో సహా అయి ఉండవచ్చు!!!

ఇక వివాహం విషయానికి వస్తే 2020 జూన్ వరకూ కళ్యాణ ఘడియలు లేవు, వివాహం వద్దు! నిర్మొహమాటంగా చెప్పుకుంటే వైవాహిక జీవితాన్ని ఎప్పటికప్పుడు కాపాడుకుంటూ ఉండాలి. దానికి సూర్యుని అనుగ్రహం ఎంతైనా అవసరం. ఎప్పుడు కానీ విడిపోయే పరిస్థితికి మూల కారణాలు రెండయి ఉంటాయి. 1. ధనార్జన. 2. స్నేహితుడు. ఈ కోణంలో 2023లో ఒకసారి 2038, 39లో మరోసారి జాగ్రత్తగా ఉండాలి. ఏదిఏమైనా వైవాహిక బంధం మాత్రం బలంగా ఉండదు. గుర్తుంచుకోవలసిన విషయం ఒకటే... మనసు విరిగితే అతకదు. ఆ జాయింట్ మీద ఏ ఆయింట్‌మెంటూ పనిచేయదు.

విదేశాల్లో ఉండడం ఒక విధంగా ఇక్కడ వైవాహిక జీవితానికి రెమిడీగా పని చేస్తుంది.

**దశా నిర్దేశం :** 1. గురు దశలో- అంటే 2028 జూన్ వరకూ విదేశాల్లో ఉద్యోగం. 2. శని దశలో- అంటే 2028 నుండి 2047 మార్చ్ వరకూ కన్సల్టెన్సీ. 3. 2019 జులై నుండి 2020 జూన్ మధ్య లీగల్ మేటర్, కోర్ట్ కేస్. 4. 2025 మార్చ్ నుండి 2026 ఫిబ్రవరి మధ్య, 2040 అక్టోబర్ నుండి 2041 నవంబర్ మధ్య గృహ యోగం. 5. సంతానం ఇద్దరు. 2023 డిసెంబర్ నుండి 2025 మార్చ్ మధ్య ప్రథమ సంతానం. 6. 2019 జులై నుండి 2020 జూన్ మధ్య, 2034 ఫిబ్రవరి నుండి 2035 మార్చ్ మధ్య చిన్నపాటి గండాలు. వీటికి రెమిడీస్ పాటించాలి.

**శక్తియుక్తులు :** జిహ్వాయత్తౌ వృద్ధి వినాశౌ- ధనం, వృద్ధి ఇవి ప్రధానంగా నాలుక మీద ఆధారపడి ఉంటాయి. ఎక్కడా నోరు జారకుండా ఎంత మౌనంగా, గంభీరంగా ఉంటే అంత ధనం, అంత సుఖసంసారం! భార్యమీద కానీ, ఎవరి మీదికి గానీ ఒంటికాలి మీద లేవడం సరికాదు.

యుద్ధమంటే ఒకరు ఓడిపోవడం, ఒకరు గెలవడం ఉండదు! యుద్ధమంటే ఇద్దరూ ఓడిపోవడం! అని గుర్తెరిగి మసలుకోవాలి!

పుస్తక ప్రపంచంలో ఒక మహా ఆవిష్కారం **'అధినేత'**. 1992లో సంచలనం సృష్టించిన రమేశ్చంద్ర మహర్షి విరచిత **'అధినేత'** ఇప్పుడు ఎమెస్కో వారి ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. ప్రతులకు: **92465 82255**. Advt

ఈవారం కథ

# అమ్మ కడుపు చల్లగా

★ విజయ కర్రా

**పనివేళ ముగిసిందని సూచిస్తూ ఆ ఫ్యాక్టరీ సైరన్ ఓ నిమిషంపాటు కూసింది.**

**రోజూ ఉండేదే అయినా చెట్లపైనున్న పక్షులన్నీ బెదిరి పైకెగిరి రెక్కలు రెపరెపలాడిస్తూ మళ్లీ చెట్టు కొమ్మలని చేరాయి. ఉద్యోగస్తులను నిర్మోహమాటంగా, నిర్దాక్షిణ్యంగా తొలగించే ఆ ఫెర్టిలైజర్స్ కంపెనీలో పనిచేసే చాలామంది నిత్యం ఆ పక్షుల్లానే బెదురుతూ బతుకులీడుస్తుంటారు. సైరన్ కూసిన కాసేపటికి సదరు బెదురుజీవులు ఒక్కొక్కరుగా వెలుపలికి రాసాగారు. అర్ధగంట గడిచాక, దాదాపుగా అందరూ వెళ్లిపోయాక, ఆవరణలో కుడివైపుగా విసిరేసినట్టున్న డెలివరీస్ డిపార్ట్‌మెంట్ నుండి ఒక్కడే బయటికొచ్చాడు రాజు.**


బొమ్మలు : అక్బర్

అతని గుండె దడదడలాడుతోంది. అందరితోపాటు వెళ్లనీయకుండా ఆఖరి నిమిషంలో అర్జెంట్ పనుందని ఆపేసిన సూపర్‌వైజర్ని తిట్టుకుంటూ గేట్‌కేసి నడుస్తుంటే, ముందు తనమీద తనకు జాలి కలిగింది. ఆ తర్వాత ఎవరిమీదో తెలీదు కానీ కోపం తన్నుకొచ్చింది.

'ఇలా భయపడుతూ ఎన్ని రోజులు బ్రతకడం' అనుకున్నాడు. సత్యకి కూడా అనుమానంగా ఉంది. 'ఏంటి అదోలా వుంటున్నావు? ఆఫీసులో ఏదన్నా ప్రాబ్లమా!' అంటూ ఈ మధ్య ఒకటే ప్రశ్నలు. ఏమని చెప్పాలి? పనికి వెళ్లి రావడం దినదిన గండంగా తయారైందనా? 'నేనింక ఈ ఉద్యోగం చెయ్యలేను సత్యా' అని ఎన్నో సార్లు నోటిదాకా వచ్చినా ఆపుకున్నాడు. చొక్కాలు మార్చినట్లు ఉద్యోగాలు మార్చగలిగే అర్హతలు కానీ, అనుభవం కానీ తనకి లేవు మరి.

గేటు వద్ద సెక్యూరిటీ చెక్ ముగించుకుని రోడ్డుమీద పడేసరికి నల్లటి మబ్బులు ఆకాశానికి గొడుగు పట్టేసి వున్నాయి. అప్పుడొకటీ ఇప్పుడొకటీ చినుకులు పడసాగాయి. రాజు గుండెలో దడ మొదలయింది. అయినా ఏ మూలో చిన్న ఆశ.

'వర్షమొస్తుందని ఈ రోజు కాస్త ముందే వెళ్లిపోయుంటాడేమో' అనుకుంటూ... హారర్ సినిమాలో కనబడబోయే తర్వాతి దృశ్యాన్ని కళ్లకడ్డుపెట్టుకున్న చేతివేళ్ల సందుల్లోంచి తొంగిచూసే పిరికి ప్రేక్షకుడిలా... గేటు పక్కకో దొంగచూపు సారించాడు.

అదృష్టం వెక్కిరించిందతన్ని.

ముసలాడు అక్కడే ఉన్నాడు.

రాజు గుండెలో రాయి పడింది. వళ్లు వణికింది. కాళ్లు కదల్లేదు. నేలలో పాతేసినట్లు ఎక్కడివాడక్కడే నిలబడిపోయాడు.

అక్కడికి వంద గజాల్లోపే ఉన్న బస్టాప్ చంద్రగోళమంత దూరంలో ఉన్నట్లనిపించింది. దూరంగా సిటీ బస్సు వస్తూ కనబడింది. అడుగు అటువైపు వేసే ధైర్యం మాత్రం రావటం లేదు. ఈ బస్సు వెళ్లిపోతే మరోటి ఇప్పుడే రాదు. అవతలేమో వర్షం ముంచుకొస్తోంది.

'ఇప్పుడేం చెయ్యటం?'' అనుకున్నాడు గాభరాగా.

★★★

చిన్నిని భుజాన వేసుకుని తిప్పుతూ రాజు కోసం ఎదురుచూస్తోంది సత్య. ఇప్పటికే చాలా లేటయింది. చీకటి పడుతున్న వేళ రాకూడని అతిథిలా వచ్చిన వర్షం ఆమె మనసులో బెంగని మరింత పెంచింది.

ఈ మధ్యకాలంలో అతడి కలత నిద్ర, పరధ్యానం....సత్యకు చెప్పకనే చెపుతున్నాయి దేనిగురించో అతను విపరీతంగా మథనపడుతున్నాడని. అతనీ ఉద్యోగంలో చేరి ఏడాది దాటింది. చేసే పనిమీద తొలి ఏడాదిలో ఉన్న ఉత్సాహం ఇప్పుడు కనబడటం లేదు. అప్పుడప్పుడూ ఆలస్యంగా పనికి వెళుతున్నాడు– వెళ్లటం ఇష్టం లేనట్టుగా. కొన్నిసార్లు ఆలస్యంగా ఇంటికొస్తున్నాడు. అదేమంటే బస్సు మిస్సయిందంటున్నాడు. ఒకటి రెండు సార్లు ''ఏదన్నా ప్రాబ్లమా?'' అనడిగితే ''అంతా నీ అనుమానమే. ఏం లేదు'' అన్నాడు ముక్తసరిగా. ఆమెకు నమ్మకం కుదరలేదు. ఆఫీసులో ఏదో ఇబ్బంది అయి ఉంటుంది. ఏమైనా ఉంటుందా అని ఆలోచనలో పడింది.

ఆమె ఆలోచనల్లో ఉండగానే ఇంటి గేటు తెరుచుకుంది. తడిసి ముద్దయి ఇల్లు చేరాడు రాజు.

ఆ రాత్రి అతడిని జ్వరం కమ్ముకుంది.

తెల్లారేసరికి ఎక్కువైతే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లింది. ఆయన ఏవో మందులు రాసిచ్చాడు. ఎందుకైనా మంచిదని అమ్మవారికీ మొక్కుకుంది.

మహిమ మందులదో లేక మహాదేవిదో గాని మూడో రోజుకి జ్వరం తగ్గుముఖం పట్టింది. ఆ మరునాటికి పూర్తిగా తగ్గింది. అయినా నీరసంగానే ఉన్నాడతను. ఆ రాత్రి చిన్నిని ఉయ్యాలలో పడుకోబెట్టి వచ్చి అతని పక్కన కూర్చుని నుదుటిని చెంపలని తాకి చూస్తుంటే, ''ఈ వేళే విన్నా. చిన్నికి మాటలొస్తున్నాయి అప్పుడే'' అన్నాడు నవ్వుతూ.

''అవును. 'అత్తత్తత్తా...'అంటూ పగలంతా ఒకటే పాట. రాత్రేమో 'తాత, తాత' అంటూ నీ కలవరింతలు'' నవ్వింది.

''నేనా? కలవరించానా!?''

''అవును జ్వరంలో. ఆఫీసుకు వెళ్లను అని కూడా అన్నావ్. నన్ను, చిన్నిని ఒకటే పిలిచావు. ఇంకెవరో తాతని కూడా! ఎవరు రాజా ఈ తాత?''.

అతడి మొహంలో దిగులు మబ్బేసింది. కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆమె కంగారుగా అడిగింది

''ఎందుకు రాజా! ఏమయింది? ఇప్పటి

కన్నా చెప్పవా నాకు?''

చెప్పాలా వద్దా అన్నట్టు కాసేపు తటపటాయించాక, చివరికి నోరు విప్పాడతను.

★★★

రెండు నెలలక్రితం ఓ సాయంత్రం. సెక్యూరిటీ గార్డ్ రొటీన్ చెక్ చేసాక సహోద్యోగి చంద్రంతో కలిసి బయటికి వస్తుండగా, గేటు దాటి పది అడుగులు వేసాక కనిపించాడతడు. పండు ముదుసలి. నీరసించిన దేహం. మొహంలో దైన్యం. ఎదురుగా ఓ సత్తుగిన్నె. చూడగానే రాజుకి సానుభూతి కలిగింది. గుండె కరిగింది. చెయ్యి తన ప్రమేయం లేకుండానే జేబులోకి వెళ్లి రెండ్రూపాయల బిళ్లతో తిరిగొచ్చింది.

అది చూసి చంద్రం ''ఏమిటోయ్ రాజూ? ఏం చేస్తున్నావ్?'' అంటూ వారించాడు. ''పాపం పెద్దవాడు!'' అంటుండగానే ''ఇప్పుడిచ్చావంటే రేపూ ఇదే టైముకి ఇక్కడ ప్రత్యక్షమవుతాడు. నీదసలే జాలిగుండె కాబట్టి మళ్లీ రేపూ ఇస్తావు. ఆ దెబ్బతో వాడు పర్మనెంట్‌గా ఇక్కడే సెటిలైపోతాడు. అక్కడితో ఆగదు. నాలుగురోజుల్లో ఇంకో నలుగురు బిచ్చగాళ్లు చేరతారిక్కడ. ఆఫీస్‌లోకి వచ్చేవాళ్లనీ, పోయేవాళ్లనీ వెంటబడి వేధిస్తూ న్యూసెన్స్ క్రియేట్ చేస్తారు. ఇదంతా నీ కారణంగానే మొదలయిందని మేనేజ్‌మెంట్‌కి తెలిస్తే లేనిపోని తలనొప్పి. అసలే, ఏ వంకతో ఉద్యోగాలు పీకుదామా అని ఎదురుచూస్తున్నారు వాళ్లు'' అంటూ అడ్డొచ్చాడు చంద్రం.

''చంద్రం ఊహాశక్తికి నవ్వుకుంటూ నేనిచ్చే ఆఫ్టరాల్ రెండ్రూపాయల కోసం అతినిక్కడే సెటిలైపోతాడా?'' అన్నాడు రాజు.

''మరింకేం. ఆఫ్టరాల్ రెండ్రూపాయల్తో అతని ముష్టిబతుకు మిరుమిట్లు గొలపదని ఒప్పేసుకుంటున్నట్టే కదా. అంతకాడికి ఈ దాతృత్వ ప్రదర్శన ఎందుక్కానీ అది లోపల పెట్టు ముందు'' అంటూ చెయ్యిపట్టుకుని ఆపేశాడు చంద్రం.

అప్పుడే అటుగా వచ్చిన మరో సహోద్యోగి పరశురాం వీళ్ల సంభాషణ విని ''ఏం రాజావారూ. పైసలెక్కువైతే నాకూ కాసిని దానం చేయొచ్చుగా'' అన్నాడు రెండు చేతులూ దోసిలిపట్టి అడుక్కుంటున్నట్లు అభినయిస్తూ.

రాజు మనసు చివుక్కుమంది. మౌనంగా నాణెం జేబులో పెట్టుకున్నాడు. తనకేసి ఆశగా చూస్తున్న వృద్ధుడిని చూసే ధైర్యంలేక తలొంచుకుని ముందుకు నడిచాడు.

మరుసటి ఉదయం–ఫ్యాక్టరీలోకి వెళ్తుండగా అదే ప్రదేశంలో మళ్లీ కనబడ్డాడా వృద్ధుడు. గేటు పక్కనే, గోడకానుకుని, మౌనంగా కూర్చుని ఉన్నాడు. గిన్నె ఖాళీగా ఉంది. నిండుగా కళకళలాడటానికది శ్రీవారి హుండీ కాదు మరి. కనీసం తళతళలాడటం కూడా లేదది. పైన ఎండపడుతున్నా.



ఆ వృద్ధుడిని చూడగానే రాజు ఓ క్షణం ఆగిపోయాడు. ఇప్పుడైనా ఏదన్నా ఇద్దామనుకుంటుండగా నిన్నటి చంద్రం విసుర్లు, పరశురాం వెటకారాలు గుర్తొచ్చాయి. ఎందుకైనా మంచిది ఎవరైనా గమనిస్తున్నారా అని కనుకొనల నుండి అటూ ఇటూ పరికిస్తే దూరం నుండి వస్తున్న సహోద్యోగులిద్దరు కనపడ్డారు. ధైర్యం చాల్లేదు. దానం చేసే ఆలోచన మానుకుని, తప్పు చేస్తున్న వాడిలా తలొంచుకుని గబగబా ముందుకి సాగిపోయాడు. వెనకనుండి వృద్ధుడి చూపులు వీపుని గుచ్చుతున్న భావన ఫ్యాక్టరీ ఆవరణలోకి అడుగుపెట్టిన కాసేపటికి కానీ అతన్నొదల్లేదు.

ఆ సాయంత్రం–ఆఫీస్ నుండి ఇంటికి వెళ్లేటప్పుడు–వృద్ధుడు అక్కడ లేకపోతే బాగుండునని కోరుకుంటూ బయటికొచ్చాడు రాజు.

అతని కోరిక ఫలించలేదు. అదే ప్రదేశంలో కూర్చుని ఉన్నాడా ముదుసలి. తనని చూడగానే అతని కళ్లలో కదలాడిన ఆశ రాజు దృష్టిని దాటిపోలేదు. సెక్యూరిటీ గార్డు తనిఖీ చేస్తున్నంతసేపూ రాజు మనసులో ఒకటే ఆలోచన. ''ఏం చెయ్యటం? ఈ సమస్య నుంచి ఎలా తప్పించుకోవటం?''

తనిఖీ అయిపోయే సమయానికి అతనికి ఫ్లాష్‌లా వచ్చిందా ఆలోచన. ''పోనీ మరెవరన్నా ఇచ్చేదాకా వేచి ఉండి వాళ్ల వెంబడే నేనూ ఇచ్చేస్తే?''

ఈ ఆలోచన తెగ నచ్చేసిందతనికి. ఏదో పనున్నట్లు అక్కడే తచ్చాడుతూ ఓ కన్ను బిచ్చగాడి మీద పడేసి ఉంచాడు.

పావుగంట గడిచింది. ఫ్యాక్టరీ నుండి ఒక్కొక్కరే బయటికి వెళ్లిపోతున్నారు కానీ ఏ ఒక్కరూ ఓ రూపాయి విదిలించరే!

మెల్లగా రాజులో ఆందోళన రాజుకుంది. ఇంకాసేపుంటే తన బస్సు వెళ్లిపోతుంది. అది మిస్సయితే మళ్లీ రెండు గంటలపాటు బస్సు లేదు.

మరో ఐదు నిమిషాల ఎదురుచూపుల తర్వాత ఇక తప్పదని బయల్దేరాడతను. బిచ్చగాడిని సమీపించే సరికి అతని గుండె దడ హెచ్చింది. అతన్ని గమనించనట్లు తల అవతలికి తిప్పుకుని గబగబా నడుస్తూ దాటేసి 'హమ్మయ్య' అనుకున్నాడు.



అలా మొదలయ్యాయి బిచ్చగాడితో రాజు దాగుడుమూతలు–ప్రతి ఉదయమూ, సాయంత్రమూ. అతడిని తప్పించుకోటానికి రోజుకో ఎత్తు వేసేవాడు.

సెల్‌ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నట్టు నటిస్తూ ఓసారి...

ఇంకా పదినిమిషాలకి కానీ తిరిగ్గా రాని బస్సు మిస్సయిపోతుందన్నట్లుగా పరుగు దీస్తూ మరోసారి...

పనికిమాలిన రాజకీయాల మీద ఎనలేని ఆసక్తితో న్యూస్‌పేపర్ నమిలేస్తూ ఇంకోసారి...

ఇతర సహోద్యోగులతో ముఖ్యమైన విషయమేదో మాట్లాడుతూ చుట్టూ ప్రపంచాన్ని పట్టించుకోనంత పరాకులో అతి తరచుగా...

ఇవన్నీ కుదరకపోతే బిచ్చగాడు బిచాణా ఎత్తేసేదాకా వేచి ఉండటం, ఆ క్రమంలో బస్సు మిస్సవటం...

ఇలా రోజులు నెట్టుకొస్తుండగా ఓ రోజు బస్‌స్టాప్ దగ్గర చాట్ బండి నడిపే నారాయణ ఎవరితోనో ఆ బిచ్చగాడి గురించి చెబుతున్న మాటలు రాజు చెవిన పడ్డాయి.

నారాయణ చెప్పిన ప్రకారం–ఆ వృద్ధుడు బతికి చెడ్డ వ్యక్తి. ఒకప్పుడతను రాజు పనిచేసే ఫ్యాక్టరీ గేట్ ఎదురుగా, రోడ్డుకి అవతలివై

రాజు మనసు చివుక్కుమంది. మౌనంగా నాణెం జేబులో పెట్టుకున్నాడు. తనకేసి ఆశగా చూస్తున్న వృద్ధుడిని చూసే ధైర్యం లేక తలొంచుకుని ముందుకు నడిచాడు.

మరుసటి ఉదయం–ఫ్యాక్టరీలోకి వెళ్తుండగా అదే ప్రదేశంలో మళ్లీ కనబడ్డాడా వృద్ధుడు. గేటు పక్కనే, గోడకానుకుని, మౌనంగా కూర్చుని ఉన్నాడు. గిన్నె ఖాళీగా ఉంది. నిండుగా కళకళలాడటానికది శ్రీవారి హుండీ కాదు మరి. కనీసం తళతళలాడటం కూడా లేదది. పైన ఎండపడుతున్నా.

ఆ వృద్ధుడిని చూడగానే రాజు ఓ క్షణం ఆగిపోయాడు.

పున్న చెప్పుల షాపకు ఓనర్. పిల్లల్లేకపోవటంతో ఓ అనాథను చేరదీసి పెంచి పెద్దచేస్తే, ఆ కుర్రాడు కాలక్రమంలో ఈయనన్నుండి షాపు గుంజేసుకుని వృద్ధుడినీ, ఆయన భార్యనీ నడివీధిలోకి గెంటాడు. రెండేళ్ల కిందట భార్య పోయింది. ఆ తర్వాత ఆయన ఎటో వెళ్లిపోయాడు. తిరిగి ఇప్పుడు ఇలా కనబడ్డాడు–ఒకప్పుడు తనకి జీవితాన్నిచ్చిన చెప్పుల షాపు ఎదురుగానే బిచ్చమెత్తుతూ.

ఆనాటి నుండి రాజులో అపరాధ భావన రెట్టింపయింది. వెంటాడే వృద్ధుడి చూపు ఛాయగా మారింది. తడబాటు అతడి నడకలోకి కొత్తగా వచ్చి చేరింది. జనంలో కలిసి నడుస్తున్నా వృద్ధుడి దృక్కులు తనని వెతికి పట్టుకుని ఆశగా చూడడం రాజుకి తెలుస్తూనే వుంది. అతని చూపులతో చూపులు కలిసినప్పుడు అతడి గుండె దడదడమని కొట్టుకునేది.

రాను రాను రాజుకి బిచ్చగాడి ఉనికి భారంగా మారింది. చివరికి ఏదైనా అయి ఆ బిచ్చగాడు చచ్చిపోతే బావుండుననుకునేవాడు. అంతలోనే, తనేమీ ఇవ్వకుండానే పోతాడేమో అని ఆందోళన చెందేవాడు. నెల రోజులు తిరిగేటప్పటికి బిచ్చగాడు అతడి మనసుని, ఆలోచనలని పూర్తిగా ఆక్రమించేసుకుని పిచ్చివాడిని చేసేసాడు.

★★★

చెప్పటం పూర్తయ్యాక, ''అడుక్కునే మనిషి కాదు సత్యా! ఎవరూ లేరట పాపం ఆ తాతకి. ఆ వయసులో మరింకేం చెయ్యలేక...'' అంటూ ఆగిపోయి కళ్లు మూసుకున్నాడు రాజు. అలాగే నిద్రలోకి జారిపోయాడు.

ఇదీ ఓ సమస్యేనా అంటూ ఆమె నవ్వలేదు. జీవితంలో ఇంకే సమస్యలూ లేవన్నట్లు ఇదేమిటీ అంటూ చిరాకు పడలేదు. రెండన్నరేళ్ల అనుబంధంలోనే అతడేమిటో ఆమెకు బాగా అర్థమయ్యాడు.

పక్కకి ఒత్తిగిల్లి నిద్రపోతున్న భర్త మొహం చూస్తుండిపోయింది. ఆమెకెందుకో తన తండ్రి గుర్తొచ్చాడు.

కోపిష్టి తండ్రి వెనకా ముందు చూడకుండా తల్లిని కొట్టేవాడు. తన పదిహేడో ఏట అలా కొడుతున్న తండ్రిని నిలదీస్తే ''మీ అమ్మకి బుద్ధిలేదు. ఎప్పటికీ మారదు'' అన్నాడు ఆయాసపడుతూ. ''మారాల్సింది నువ్వు నాన్నా. కోపం నీ బలహీనత. కొట్టటం దానికో కవరింగ్. లెక్కల టీచరువి కదా



ఈసారి కోపమొస్తే... అమ్మ ఒంటిమీద చెయ్యివేసే బదులు, ఓ వంద ఒంట్లు లెక్క పెట్టుకో'' అనగానే తన చెంప చెళ్లుమంది.

అతి మంచితనం, అంతకు మించిన మొహమాటం రాజు బలహీనతలైతే–అవి ఓ వంద అంకెలు లెక్కపెడితేనో, నూటొక్క ప్రదక్షిణాలు చేస్తేనో పోయేవి కావు.

చెయ్యి చాచి అతడి నుదుటిపైన జుట్టుని వేళ్లతో పైకి తోసింది. ఆ చేతినలాగే అతడి నుదుటిపైన వుంచి నిద్రలోకి జారుకుంది.

★★★

ఉదయం పదకొండవుతుండగా, ఎవరో వచ్చారని రాజుకి చెప్పాడు అటెండర్. కొత్త సప్లయర్లు ఎవరో ఒకరు వస్తుంటారు ఆ సమయంలో. లేచి బయటికి వచ్చాడు. అతను రాగానే రిసెప్షన్ సోఫాలో కూర్చుని ఉన్న సత్య లేచి నిల్చుంది. పక్కనే చిన్ని. అతను కంగారు పడ్డాడు. ఎప్పుడూ లేనిది ఆమె చెప్పకుండా ఆఫీసుకు వచ్చిందంటే... అతని మనసు కీడు శంకించింది. దగ్గరికెళ్లి ''ఏంటీ...ఇక్కడ?'' అన్నాడు తన కేసి దూకుతున్న చిన్నిని ఎత్తుకుంటూ.

''గుడికొచ్చాను రాజూ. మొన్న నీకు జ్వరం వచ్చినపుడు అమ్మవారికి మొక్కుకున్నాను. ఈ పక్కనే కదా. ప్రసాదం ఇచ్చేసిపోదామని...'' అంటూ కొబ్బరి ముక్క విరిచి అతని చేతిలో పెట్టింది సత్య. అతను దాన్ని కళ్లకద్దుకుని నోట్లో వేసుకునేదాకా ఆగి ''అలా బస్టాప్ దాకా రారాదూ? అక్కడ చాట్ బండి వాడు బాగా చేస్తాడని చెబుతుంటావు కదా. ఇద్దరం కలిసి చాట్ తిని ఎన్నాళ్లయిందో. అట్నుండటే బస్ ఎక్కించి వెళుదువుగాని'' అంటూ అడిగింది.

ఆమెని, చిన్నిని ఆఫీస్ వాతావరణంలో అలా చూడడం బావుంది రాజుకి. పని వత్తిడి ఎక్కువగా ఉన్నా పట్టించుకోకుండా ''పద'' అంటూ బయల్దేరాడు. ఆమె అనుసరించింది.

గాలి తిరిగి సన్నటి చప్పుడు చేస్తూ చెట్లకొమ్మలు కదులుతున్నాయి. తురాయి చెట్ల పూలు అక్కడక్కడా రాలిపడుతున్నాయి. కుడి చేతి గుప్పిటిలో తండ్రి జుట్టు గట్టిగా పట్టుకుని తలెత్తి చెట్లపైన ఎగురుతున్న పక్షుల్ని చూస్తోంది చిన్ని.

సెక్యూరిటీ పోస్ట్ దాటాక చుట్టుపక్కల ఎవరికోసమో అన్నట్లు కళ్లతో వెతికి ''ఆయనేనా?'' అంటూ చూపించింది సత్య. ఉలిక్కిపడి చూసి ''ఆ'' అన్నాడు.

వెంటనే అతడిచెయ్యి పట్టుకుని చకచకా అటు నడిచింది. కలలోలా ఆమె వెంట కదిలాడతను.

గోడనానుకుని, మండుతున్న ఎండలో, నిర్వేదంగా కళ్లు మూసుకుని కూర్చుని వున్నాడు బిచ్చగాడు.

''తాతా...ఓ తాతా'' అంటూ పిల్చింది సత్య. నెమ్మదిగా కళ్లు తెరిచాడా వృద్ధుడు. మొదట రాజుని, తరువాత ఆమెను చూసి, తిరిగి రాజుపై నిలిచాయతడి చూపులు.

ఆమె రాజు జేబులో నుండి పర్స్ తీసి, చేతికందిన నోట్లు బయటికి లాగి భర్త చేతిలో పెడుతూ ''ఆలోచించొద్దు. ఇచ్చేయ్ రాజా'' అంది.

మరమనిషిలా అతడా నోట్లని బిచ్చగాడి చేతిలో పెట్టాడు. ఆ వృద్ధుడి మొహం విచ్చుకుంది. నోరు తెరిచి ఏదో మాట్లాడబోయాడు. కానీ గొంతు పెగల్లేదు. రెండు చేతులూ పైకెత్తి దీవిస్తున్నట్లు గాల్లో ఆడించాడు.

అంతకుముందు దాకా ఉన్న బెరుకు, భయం, మొహమాటం మంత్రమేసినట్లు మాయమైపోగా, తేలికైన గుండెతో సత్యకేసి చూసాడు రాజు. ఆమె కళ్లు నవ్వుతున్నాయి.

ఆ కళ్లలో అతనికి మాత్రమే అర్థమయ్యే భావమొకటి కదలాడింది. ''అభాగ్యుడిని ఆదుకోవటానికి ఆలోచనలూ, లెక్కలూ ఎందుకు రాజా?''

ఆ వేళ–ఇవ్వటం ఎంత తేలికో అతడికి తెలిసింది.

..........................................

vijaya.karra.011@gmail.com

సెక్యూరిటీ పోస్ట్ దాటాక చుట్టుపక్కల ఎవరికోసమో అన్నట్లు కళ్లతో వెతికి ''ఆయనేనా?'' అంటూ చూపించింది సత్య. ఉలిక్కిపడి చూసి ''ఆ'' అన్నాడు.
వెంటనే అతడిచెయ్యి పట్టుకుని చకచకా అటు నడిచింది. కలలోలా ఆమె వెంట కదిలాడతను.
గోడనానుకుని, మండుతున్న ఎండలో, నిర్వేదంగా కళ్లు మూసుకుని కూర్చుని వున్నాడు బిచ్చగాడు.
''తాతా...ఓ తాతా'' అంటూ పిల్చింది సత్య. నెమ్మదిగా కళ్లు తెరిచాడా వృద్ధుడు. మొదట రాజుని, తరువాత ఆమెను చూసి, తిరిగి రాజుపై నిలిచాయతడి చూపులు.

# అంకెలతో అదృష్టం

**ఐ.బి. సాహు**
సెల్ : 95810 94208,
90142 48124

పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీకాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియనితనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు......................
2. పుట్టిన తేదీ ...........
(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)
3. పుట్టిన సమయం .........
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు ...........
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అంకెలతో అదృష్టం**

ఆంధ్రజ్యోతి దినపత్రిక,
ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్ – 500 033.

ఒక పేరు విశ్లేషణ జరగడానికి డేటాఫ్ బర్త్ అవసరం ఎంత ఉంటుందో భాష అవసరం అంతే ఉంటుంది. ఏ భాషైనా అచ్చులు, హల్లులతో కూడి ఉంటుంది. కాకపోతే తెలుగు భాషకు ఒక విధంగానూ ఇంగ్లీష్ భాషకు మరో విధంగానూ ఉంటుంది. Ka ని సులభంగా క, కా అన్నంతగా సంఖ్యాశాస్త్ర సిద్ధాంతాలు ఉండవు. ఇంగ్లీషు భాషలో ఉన్నవి 5 అచ్చులే అయినా అనంతమైన పదవాహినిలో ఎక్కడైనా ఉండవచ్చు. ఇది భాషా సంస్కృతి. సంఖ్యాశాస్త్రం వరకు ఒక అక్షరం అదీ అచ్చుగా ఉన్న అక్షరం స్థానానికి లోబడి ఉంటుంది.

Apple లో A కు Bank లో A కు Tea లో A కు ఎంతో తేడా. ఇవన్నీ సంఖ్యాశాస్త్ర పరంగా కౌంట్ చేసినపుడు. పేర్లను సంఖ్యాశాస్త్ర పరంగా గమనించినపుడు Amala లోని A విలువలు తెలిసి తీరవలసిందే. Vijaya లో A విలువ పైన Amala లో A విలువ రెండూ విభిన్నమే. ఈ రోజున కాస్తంత కుతూహలం ఉన్న వ్యక్తి పేరు మొత్తం ఇంత కదండి అని అడుగుతూనే ఉంటారు. ఆపైన ఇంకేమీ చెప్పలేదు. ఒక కాలిక్యులేటర్ కూడా చేస్తుందిగా లెక్కలు. మనకంటే మంచి న్యూమరాలజిస్ట్ కాలిక్యులేటర్ కాదంటారా?



యూనివర్స్‌లో చిన్న పరమాణువు దగ్గర నుండి అతి పెద్ద అంశం వరకూ ప్రతీది ఆర్డర్‌లోనే ఉంది. గతి తప్ప లేదు. విభిన్న సిద్ధాంతాలు లేవు. సంఖ్యాశాస్త్రంలో ఖచ్చితమైన సైన్స్ ఉంది. ఆ సైన్స్ సంఖ్యల ఆవిరావాన్ని పుట్టుకనూ, పేరునూ సంఘటనలను వివరిస్తుంది. ఈ సంఖ్యల ద్వారా ఒక వ్యక్తి జీవిత చక్రం, గతి, దిశ, వేగం, ఫలితం లెక్కించవచ్చు. అయితే ఈ గణన ఫార్ములాల ఆధారంగానే జరగాలి. ప్రాక్టికల్‌గా చెప్పాలంటే మిస్టిక్ పవర్‌ను లెక్కించాలన్నా ఫార్ములాలు లేకుండా సాధ్యం కాదు. ఇవన్నీ పేరు అనలైజేషన్‌లో పాటించవలసిన నియమాలు.

పాశ్చాత్య దేశాల్లో ఏ న్యూమరాలజిస్ట్ పేరులో డబుల్ అక్షరాలు కనబడవు. సందర్భానుసారంగా ఉచ్చారణను అనుసరించి ఉంటాయే తప్ప స్పెల్లింగ్ మిస్టేక్స్‌గా ఉండవు. అంతేకాదు నిర్దిష్టమైన స్పెల్లింగ్‌లు తప్ప లెక్కల కోసం తప్పొప్పుల తడకగా అంతకన్నా ఉండవు. లిండా స్పెల్లింగ్ లిండాలానే ఉంది. జోనాథన్ స్పెల్లింగ్ జోనాథన్ లానే ఉంది. అయితే న్యూమెరికల్‌గా మార్పు జరగలేదా అంటే జరిగింది. కాకపోతే బీభత్సంగా మాత్రం కాదు. Pavan అనే పేరులో రెండవ V విలువ ఎంత? ఇంకో N చేర్చినపుడు N విలువ ఎంత? ఈ మెథడాలజీ లేకుండా ఏ సిద్ధాంతమూ సంఖ్యాశాస్త్రపు ఛాయలోకి వెళ్ళదు. స్వతహాగా కరెక్షన్ లేకుండా పేరు కుదిరితే అద్భుతం.

భగవద్గీతలో 1 నుండి 9 వరకూ అర్థం వేరు.

ఖురాన్‌లో 1 నుండి 9 వరకూ అర్థం వేరు.

బైబిల్‌లో 1 నుండి 9 వరకూ అర్థం వేరు.

కహూనాలో 1 నుండి 9 వరకూ అర్థం వేరు.

ఇక భిన్న విషయాలను పేరులో సంఖ్యల పరంగా అన్వయపరచేటప్పుడు ఎంత జాగ్రత్త అవసరమో ఆలోచించండి. ఏ సంఖ్యపడితే ఆ సంఖ్యలోకి పేరు మార్చి తద్వారా వ్యక్తిని న్యూట్రల్‌గానో నెగెటివ్‌గానో మార్చేయడం వెనుక ఏ శత్రుత్వం ఉంది? ఎంతో నమ్మకంతో, ఆశతో వచ్చిన వ్యక్తిని నెగెటివ్ దిశలోకి ఎందుకు మార్చుతున్నారు. తెలిసి చేస్తున్నారో, తెలియక హాని చేస్తున్నారో అర్థం కావడం లేదు.

ఒక పేరు మూల స్థాయిలో బలం పొందాలి.

పేరుకు సంబంధించిన జన్మతేదీ క్షేత్ర స్థాయిలో బలం పొందాలి.

ఈ రెండూ ఆర్.వి. ఎనర్జీతో సింక్రొనైజ్ కాబడాలి.

జన్మతేదీలోని మూడు విరుద్ధ అంశాలు సమాన ప్రాతిపదికలో ఉండాలి. ఈ మాత్రం జాగ్రత్త వహించని పేరు ఆ వ్యక్తికి నిస్సందేహంగా చెడే చేస్తుంది.

మీ పేరులో ఏముందో తెలుసుకోవడం మీ హక్కు. అయితే మీ పేరును ఇష్టానుసారంగా మార్చే హక్కు ఎవరికీ లేదు. ఇంతకు మునుపు ఉన్న పేర్లన్నీ లోపభూయిష్టమైనవిగా విమర్శించే హక్కు ఎవరికీ లేదు. ప్రతి పేరూ అర్థవంతమైనదే. ఈ అర్థం మీ జీవితానికి 10 శాతంలో ఉందా? 60 శాతంలో ఉందా అనే అంశ నిర్ధారణ ముందుగా జరగాలి. ఆపైన మీ జన్మతేదీలోని సంఖ్యలు, పేరులోని సంఖ్యలు డీకోడ్ చేసే విషయం పరిశీలించాలి. ఈ అన్వయానికి క్వాలిఫికేషనూ అవసరమే. గురువూ అవసరమే శాస్త్ర జ్ఞానం పెట్టనికోటే. అరణ్యంలోనైనా నీతి ఉందేమో కాని మానవారణ్యంలో ఏ నియమాలూ లేకపోవడమే వింత.

Advt

## స్వీకారం

**జ్ఞాపకాల తెరలు** (జాలాది వెంకటేశ్వరరావు)
తెలుగు : దామరాజు వెంకటేశ్వర్లు
పేజీలు : 82, వెల: రూ.100
ప్రతులకు : ప్రజాశక్తి, విశాలాంధ్ర

★★★

**ప్రాచీన భారత సమాజంలో బానిసల స్థితిగతులు**
తెలుగు : డా. ఉప్పల లక్ష్మణరావు
పేజీలు : 124, వెల: రూ.75

**గిరీశం** (కవిత్వపు ట్యూషను)
రచన : కొల్లూరు ధర్మరాయకవి
పేజీలు : 46, వెల : రూ.35

**క్రొవ్వుటాళ్ళు** (స్వభావ పరిశోధనాత్మక నవల)
రచన : 'ఉపాధ్యాయుడు'
పేజీలు : 178, వెల : రూ.100

**శతకాలలో స్త్రీల పట్ల వివక్ష**
రచన : మొండెపు ప్రసాద్
పేజీలు : 92, వెల : రూ.65
ప్రతులకు : విశాలాంధ్ర

★★★

**పాఠకులతో నూతన సంభాషణ**
(నూతన సంపాదకీయాలు)
రచన : యం. రత్నమాల
పేజీలు : 96, వెల : రూ.80
ప్రతులకు : 94403 29445

★★★

**నేను బానిసనా?** (పోలీసు దుఃఖం– నవల)
రచన : వరకుమార్ గుండెపంగు
పేజీలు : 254, వెల : రూ.150
ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు

★★★

**'గో' విలాపం**
రచన : డా. ఎన్. గోపాలకృష్ణ (లక్ష్మణరేఖ)
పేజీలు : 76, వెల : రూ.60
ప్రతులకు : 94930 53206

★★★

**చైతన్య దీపిక**
పేజీలు : 151, వెల : రూ.75

**ఆరోగ్య మార్గదర్శిని**
పేజీలు : 96, వెల : రూ.125
రచన : డా. చంటిగారి శ్రీనివాసరెడ్డి
ప్రతులకు : 98666 54242

★★★

**సుగంధాల భరిణె**
రచన : కె. ప్రభాకర్
పేజీలు : 120, వెల : రూ.150
ప్రతులకు : 94401 36665

## ఆధ్యాత్మిక అందాలు

అక్రమమో, సక్రమమో ఆర్జన అనేది సదుపాయాలను సమకూరుస్తోందే తప్ప మానసిక సౌఖ్యాన్ని అందించటం లేదు. ధనికుడి నుంచి సామాన్యుడి వరకు ఒకటే ఆందోళన. పల్లెల్లో ప్రశాంతత ఎన్నడో మృగ్యమైంది. సమష్టి కుటుంబ వ్యవస్థ బీటలువారి చాలాకాలమైంది. మానసిక ఆనందం కోసం పరుగులు దీసే వారిలో హెచ్చుమంది భక్తి వైపు మొగ్గు చూపుతున్నారు. ఒక్కో గురువుది ఒక్కో మార్గం. అదేమిటో తెలుసుకుని పాఠకులకు చెప్పేందుకు యోగా నేర్పే గురువులను, భక్తితత్వాన్ని విడమర్చి చెప్పే స్వాములను, ఇతర ప్రముఖులను రచయిత



ఇంటర్వ్యూ చేశారు. నాలుగేళ్ళ పాటు ప్రతి శుక్రవారం ఆంధ్రజ్యోతి 'నివేదన'లో వచ్చిన ఆ వ్యాసాల నుంచి 81 తీసుకుని ఇప్పుడు ఒక పుస్తకంగా తీసుకువచ్చారు.

ప్రతి జీవిలో దేవుడిని దర్శించగలగడమే ఆధ్యాత్మికత అని స్వామి పరమార్థానంద వివరించారు. ధర్మ ప్రచారం చేయాల్సిన వారే మత రాజకీయాలకు పాల్పడుతున్నారని దాశరథి రంగాచార్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు కణ జీవశాస్త్రంలో డాక్టరేట్ పొందిన వ్యక్తి. ఏడు కొండల స్వామి మంగళ రూపాన్ని ఆయన మాటల్లో చదివితేనే అందం. నాలుగు పదులకు పైగా వయస్సు వచ్చే వరకు హిందువుగా ఉన్న సహజనటి జయసుధ, తాను ఎందుకు బాప్టిజం తీసుకోవాల్సి వచ్చిందో ఇందులో వివరించారు. నాస్తికుడైన అక్కినేని దృష్టిలో దైవం అంటే ఏమిటో కూడా ఆమె తెలియజేశారు. మరెందరో స్వాములు, యోగ గురువులు, రాజకీయ ప్రముఖులు, నటులు, న్యాయమూర్తులు తమవైన భాష్యాలు, అనుభవాలు చెప్పారు. పినిశెట్టి బొమ్మలు అదనపు సొబగులు చేకూర్చాయి. ఆసక్తిపరులకు ఈ పుస్తకం నిజంగా మృష్టాన్న భోజనమే. ఇక అంతో ఇంతో తెలుసుకోవాలని అనుకునే వారికి చిరు కరదీపిక.

**– మద్దిపట్ల మణి**

**నివేదన** (ప్రముఖుల ఆధ్యాత్మిక అనుభవాలు)
పేజీలు : 252 వెల : రూ.200



## నవ్య జ్యోతిషం

సాయన జ్యోతిష సూత్రాలకు తోడు 30 మంది ప్రముఖుల జాతకాల విశ్లేషణతో కూడిన పుస్తకమిది. నవ్య వారపత్రికలో రెండేళ్ళ పాటు ఈ విశ్లేషణలు వచ్చాయి.
పేజీలు : 232, వెల : 100, తిప్పావఝుల కుమార్,
ప్రతులకు : రచయిత సెల్: 99854 42000

---

తెలంగాణ సాయుధ పోరాటకాలంలో ఉద్యమ కార్యాచరణలో భాగంగా పుట్టిన రచయితల్లో ఆవుల పిచ్చయ్య ఒకరు. ఆయన రాసిన దౌరా, ఊరేగింపులు, చపరాసీ దినచర్య, వెట్టిచాకలి దినచర్య, ఈత గింజయిచ్చి తాటి గింజలాగిన జమీందారు అనే ఐదు కథలతో 'కవిలె' తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరాల్ సెంటర్ వారు వెలుగులోకి తెచ్చిన సంపుటి ఇది.



దేవులపల్లి కృష్ణమూర్తి, ముదిగొండ సుజాతారెడ్డి, కాసుల ప్రతాపరెడ్డిల ముందుమాటల్లో పిచ్చయ్య ఎవరనేది తెలిస్తే, నిజాంను

## ఆవుల పిచ్చయ్య పోరాట కథలు

వ్యతిరేకిస్తూ హక్కులకోసం పోరాడిన ఆయన పూర్తి వ్యక్తిత్వాన్ని ఆయన కథలు పట్టిస్తాయి. పిచ్చయ్య ఫోటో వెతకడంలో కృష్ణమూర్తి పడ్డ పాట్లు కళ్లు చెమర్చేలా ఉన్నాయి. సాయుధ పోరాట సమయంలో సామాన్యుడు ఎలా బలయ్యాడో తెలుసుకోడానికి తప్పక చదవాల్సిన కథలివి.

**– గౌరుసు**

**ఆవుల పిచ్చయ్య తెలంగాణ పోరాట కథలు**
సంపాదకుడు : సంగిశెట్టి శ్రీనివాస్,
పేజీలు: 32, వెల: రూ. 10, ప్రతులకు: 98492 20321

నిర్బంధం విప్లవ మార్గం పట్టిన మనుషులమీదే కాదు, రచనలమీదా తీవ్రంగా ఉంటుందనేందుకు ఒక ఉదాహరణ వసంతగీతం నవల. రచయిత ఒకరే అయినా తొలి ముద్రణలో పులి ఆనంద మోహన్‌గా, మలి ముద్రణలో అల్లం రాజయ్యగా ద్విపాత్రాభినయం చేయవలసి వచ్చింది ఆ పేరు.

1980–85 మధ్య తెలుగు సమాజం పరిస్థితులను రేఖామాత్రంగా అయినా రూపు కడితే గాని దీనికి కారణం అర్థం కాదు. సాంప్రదాయంగా వస్తున్న పార్టీకి ఉద్వాసన పలికి ప్రాంతీయ పార్టీకి ప్రజలు అధికారం అప్పజెప్పిన కాలమది. మరో వైపు విప్లవ పోరాటాలు మైదాన ప్రాంతాలకు పరిమితం కాక దండకారణ్యంలోకి తొలిఅడుగులేసిన కాలం కూడా అదే. అయిదు సంవత్సరాల వ్యవధిలోనే నిర్బంధం చుట్టుముట్టడంతో గ్రామాలు, యూనివర్సిటీలు పోలీసుక్యాంపులతో నిండిపోయాయి. అడవుల్లో 'ఎదురు కాల్పులు'.... జైళ్లలో విద్యార్థులు, రైతాంగ కార్యకర్తలు

# దేశం గర్వించదగ్గ యుద్ధ నవల

సాధారణ విషయమైపోయింది. మరి కల్లోల భరితమైన ఉత్తర తెలంగాణలోని రచయితల పరిస్థితి? సొంత పేరు వదిలి అజ్ఞాత నామంతో రచనలు చేయక తప్పని స్థితి. అందుకే రచయిత మారుపేరు పెట్టుకోవలసివచ్చింది.

సొంత పేరు పెట్టుకోలేని రచయిత స్థితీ, ఆయన తీసుకున్న నవలా వస్తువూ రెండూ వేరు కాదు. దండకారణ్యంలోని దళాల కడగండ్లు, జయాపజయాలు,




పోరాట స్ఫూర్తే దీని ఇతివృత్తం. 1981ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసు కాల్పులు సహా అన్ని నిర్బంధాలూ పాఠకుల చెవికి వినిపించేలా రికార్డు చేసారు. ఓ ఉద్యమ కార్యకర్త గన్ను బదులు పెన్ను చేపడితే ఎలాంటి రచన వస్తుందో అలాంటి రచనే ఈ నవల. అత్యంత శ్రద్ధాసక్తులతో పాక్షిక మాండలికంలో రచయిత 6 నెలలపాటు చెక్కిన యుద్ధశిల్పమిది.

నవలా నాయకుడు గట్టయ్య నిష్టాగరిష్ఠుడు కాదు. నాటి ఎర్ర సినిమాల్లో మడత నలగని ఎర్ర చొక్కాలతో సిల్వర్ స్క్రీన్ దద్దరిల్లేలా కేకలేసే హీరో కాదు. దుఃఖమూ, వేదనా లేని మెషిన్‌గన్ కాదు. పత్రికల పరిభాషలోని తీవ్రవాది కాదు. 1985–86 మధ్యకాలంలో ఉత్తర తెలంగాణ పోరాటంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా పొరకల( పీపుల్స్‌వార్)పార్టీ నాయకత్వంలోని ఒక దళం దైనందిన జీవితానికి ప్రతినిధి. ఎంతో మందిలాగా వ్యక్తిగత సమస్యల నుంచి కదన రంగానికి వెళ్లి, ఊగిసలాటల మధ్య తిరిగి ఇంటి ముఖం పట్టినవాడు. తుదకు అడవిలోని కార్చిచ్చులో నిప్పుకణంలా కలిసిపోయిన వాడు.

గోదావరి ప్రచురణల తరపున నాటి పుస్తకాన్ని అలాంటి ప్రమాద సమయంలో మొదట సాహసించి ప్రచురించినవారు కె.ఎస్.చారి, ఆయన సహచరి కె.సులోచన. ఈ నవలను రాజకీయార్థిక నవలగా అభివర్ణించిన వరవరరావు, ఇందులోని ఘటనలకు, వాస్తవ ఘటనలకు బాంధవ్యం ఏమిటో విపులంగా రాసారు ముందుమాటలో. కవర్‌మీది, పుస్తకంలోపలి అన్నవరపు శ్రీనివాస్ పెయింటింగ్స్ ఈ నవలకు దృశ్యబలాన్ని చేకూర్చాయి.

చివరిగా ఓ మాట. 'అభివృద్ధి' చెందుతున్న దేశం ముందు నిలబడి ఓ ఆదివాసీ యువకుడు ఇలా అంటున్నాడు.

''మాకేమీ వద్దు–మీ గుడిసెలద్దు, మీ పెంకలద్దు, మీ మేకలద్దు, మీరు మా మట్టలకు బెల్లం రాసి నాకమనద్దు. మాకు మా శివారులో అరువై ఎకురాల జమీనున్నది. మేం చానా ఏండ్ల నుంచి దాన్ని దున్నుకుంటున్నం. నిరుడు జంగ్లాతు వాళ్లచ్చి రిజర్వు అన్నరు. గ భూమికి పట్టాలిప్పియ్యుండ్లి–'' (పేజీ 158 )

ఇలాంటి డిమాండ్లే ఆ తర్వాత ఆదివాసీ అనుకూల చట్టాలకు నాంది పలికాయి. ఎప్పటికయినా అవి అమలయినప్పుడే రచయిత మాటలు సార్థకమయ్యేది.

– యింద్రవెల్లి రమేష్

**వసంత గీతం**, అల్లం రాజయ్య, సంపాదకులు: వరవరరావు
పేజీలు : 420, వెల : రూ 250, ప్రతులకు : విశాలాంధ్ర

# కొత్తపుస్తకాలు




ఒక రచన చదివిన తరువాత వెంటాడే పాత్రలు కొన్ని ఉంటాయి. ఆ పాత్రలే ఆ రచన(ల)కు ప్రాణభూతాలవుతాయి. ఆ పాత్రలు ప్రయాణం చేసిన మిట్ట పల్లాలు మానవజీవితాలకు ప్రతిబింబాలు. అవి తిరిగి పాఠకులకు హెచ్చరికలుగానో, స్ఫూర్తిదాయకంగానో నిలుస్తాయి. అందులోనూ స్త్రీ పాత్రల్లో కనిపించేంత వైవిధ్యం మరోచోట కనిపించదు. కారణం – ఆమె చుట్టూ ఉన్న ప్రపంచం అటువంటిది. సీత కష్టాలుగానో, నిగమశర్మ అక్కగానో – జాతీయాల్లో నిలిచిపోయేంత విభిన్నత్వం స్త్రీ పాత్రలకుంది.

ఈ వైవిధ్యాన్ని పరిచయం చేసే దిశగా రూపొందించిన డా. ముక్తేవి భారతి గారి 'ఆ పాత్ర మధురం' గుర్తుపెట్టుకోదగిన గ్రంథం. ఇందులో

## స్త్రీ పాత్రలకు మంచి పరిచయం

50 నవలల్లోని ఇతివృత్తాన్ని సంక్షిప్తంగా ఇచ్చి వాటిలోని స్త్రీ పాత్రలను ప్రస్ఫుటంచేసి చూపించారు. రచయితలు, రచయిత్రుల చేతిలో రూపు దిద్దుకున్న స్త్రీ పాత్రలు 'జెండరు స్పృహ'ను పట్టిస్తాయి. స్త్రీలు ఈ పుస్తకం చదివి తమది ఏ పాత్రో, ఏ పాత్రగా జీవిస్తే తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందో వెతుక్కోవచ్చు. మనస్తత్వ విశ్లేషకులు, వారిచ్చే కౌన్సిలింగ్‌లకు సజీవరూపంగా నిలిచి, పాఠకులకు మార్గదర్శక పాత్ర వహిస్తుందీ గ్రంథం.

చారిత్రక క్రమంలో నవలల్ని కూర్చినట్లయితే స్త్రీ పాత్రల ప్రయాణంలో ఒక అవగాహన కల్పించినట్లయ్యేది. అక్కడక్కడా పాత్రల పేర్లలో తప్పులు దొర్లాయి. ఉదా : సి.ఎస్.రావు గారి రాతిపువ్వు నవలలో (పేజి : 193) మంజుల గురించి చెబుతూ శీర్షికలో 'సునంద' అని పేర్కొన్నారు. ఇందులో కొన్ని నెగిటివ్ స్త్రీ పాత్రలు కూడా ఉన్నాయి. (ఉదా: మృగతృష్ణ – 'సునంద' – పేజి : 13, అనూహ్య – 'అనూహ్య'– పేజి : 212) అటువంటప్పుడు అన్నీ కలిసి ఆ'పాత్ర'మధురమవుతాయా?.... పాత్ర చిత్రణలో శిక్షణ అవసరమున్న వారికి కూడా ఈ పుస్తకం ఉపయోగకారి.

– మృదుల

**ఆ పాత్ర మధురం**
తెలుగు నవలల్లో విలక్షణ స్త్రీ పాత్రలు
డా. ముక్తేవి భారతి, పేజీలు : 232,
వెల : రూ. 150, ప్రతులకు : విశాలాంధ్ర

# సినిమా పజిల్

నిర్వహణ : యజ్ఞమూర్తి

## అడ్డం

1. ఛార్మి నాయికగా తమ్మారెడ్డి భరద్వాజ్ రూపొందించిన చిత్రం (5)
4. 'సుగుణ సుందరి కథ'లో కాంతారావు జోడీ (3)
6. బెల్లంకొండ సురేశ్ నిర్మించిన 'బస్‌స్టాప్' దర్శకుడు (3)
7. 'జగమే మాయ' (1973)తో పరిచయమైన నటుడు తర్వాత విలన్‌గా రాణించాడు (4)
10. సీతారామశాస్త్రి కుమారుడు రాజా హీరోగా పరిచయమైన 'కేక' చిత్ర దర్శకుడు (2)
11. 'సంసారాల మెకానిక్' సురేశ్ జోడీ (4)

## నిలువు

1. చిరంజీవి 'శంకర్‌దాదా జిందాబాద్' దర్శకుడు (4)
2. 'కూలీ నెంబర్ 1'లో వెంకటేశ్ సరసన నాయిక (2)
3. 'వేదం'లోని 'ఎగిరిపోతే ఎంత బాగుంటుందీ' పాట రచయిత (3)
5. 'చిలక్కొట్టుడు'లో జగపతిబాబు సరసన ఓ నాయిక (3)
6. అక్కినేని, సావిత్రి, బేబి హనీ ఇరానీ ప్రధాన పాత్రధారులుగా తాతినేని ప్రకాశరావు చిత్రం (3)
7. నాగార్జున 'గీతాంజలి' నాయిక (3)
8. శ్రీకాంత్, వడ్డే నవీన్ హీరోలుగా ఇ.వి.వి. సత్యనారాయణ చిత్రం 'చాలా....' (3)
9. 'అంతకుముందు ఆ తరువాత'లో హీరో సుమంత్ అశ్విన్ తల్లి (3)

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | | ● | 3 |
| | ● | ● | | ● | ● | |
| 4 | | 5 | ● | 6 | | |
| | ● | | ● | | ● | ● |
| ● | 7 | | 8 | | ● | 9 |
| ● | | ● | | ● | ● | |
| 10 | | ● | 11 | | | |

### గత వారం జవాబులు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 రే | సు | 2 గు | ర్రం | ● | ● | 3 ర |
| ప | ● | రు | ● | 4 సం | ఘ | వి |
| టి | ● | ● | ● | సా | ● | బా |
| 5 కొ | త్త | కా | 6 పు | రం | ● | బు |
| డు | ● | ● | ష్ప | ● | 7 రా | ● |
| కు | ● | ● | 8 వ | జ్రా | యు | ధం |
| ● | 9 ఓ | మ | ల్లి | ● | డు | ● |

# అంకేళి

నిర్వహణ : పి. రాఘవరెడ్డి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 | | 7 | | 9 | | |
| | 2 | 8 | | 4 | | 1 | 5 | |
| 6 | 9 | 3 | | 1 | | 8 | 7 | 4 |
| | 6 | | | | | | 4 | |
| | 5 | | 3 | 6 | 4 | | 9 | |
| | 3 | | | | | | 8 | |
| 2 | 1 | 9 | | 8 | | 4 | 3 | 7 |
| | 7 | 6 | | 2 | | 5 | 1 | |
| | | 5 | | 3 | | 2 | | |

అడ్డం, నిలువులోనే కాకుండా బాక్సులో, క్రాస్‌లో కూడా 1 నుండి 9 అంకెలు ఒకసారే వచ్చేలా నింపాలి. దాదాపు సుడోకు లాంటిదే. కాని రెండు క్రాస్‌లలో కూడా రావడం ఇందులో అదనం.

### గత వారం జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 5 | 9 | 1 | 4 | 3 | 6 | 8 | 7 |
| 4 | 8 | 3 | 6 | 5 | 7 | 9 | 2 | 1 |
| 1 | 6 | 7 | 8 | 9 | 2 | 3 | 4 | 5 |
| 9 | 1 | 4 | 3 | 6 | 8 | 7 | 5 | 2 |
| 3 | 2 | 8 | 7 | 1 | 5 | 4 | 6 | 9 |
| 6 | 7 | 5 | 9 | 2 | 4 | 1 | 3 | 8 |
| 8 | 9 | 6 | 2 | 3 | 1 | 5 | 7 | 4 |
| 7 | 4 | 1 | 5 | 8 | 6 | 2 | 9 | 3 |
| 5 | 3 | 2 | 4 | 7 | 9 | 8 | 1 | 6 |

# ❖ పూరణం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | ■ | 4 | | 5 | 6 |
| 7 | | ■ | 8 | 9 | | ■ | 10 | |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | |
| 11 | 12 | ■ | 13 | | 14 | ■ | 15 | |
| ■ | 16 | | | ■ | 17 | | | ■ |
| 18 | | ■ | 19 | 20 | | ■ | 21 | 22 |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | |
| 23 | 24 | ■ | 25 | | 26 | ■ | 27 | |
| 28 | | | | ■ | 29 | | | |

## అడ్డం

1. పేరులో పంట పొలాలున్నా దరిద్రానికి ప్రతీకైన కృష్ణ సఖుడు (4)
4. రాజకీయాల్లో రచ్చగెలిచిన రాజమండ్రి సి'తార' (4)
7. సుగ్రీవ సతి (2)
8. చెప్పు తినెడి కుక్క చెరుకు తీపెరుగదన్నవాడు (3)
10. బల్లిని చూసినా, బొద్దింకను చూసినా చాలామందికి కలిగే ఫీలింగ్ (2)
11. తిరగబడ్డ 'సూత్రం' (2)
13. ఒకప్పుడు ఈ దొంగలుండేవారు (3)
15. ఆద్యంతాలతో భార్యగా మారిన సవతి (2)
16. నేరస్థులకు విధించేది (3)
17. సూర్యుడిని దాచుకున్న జాకెట్టు (3)
18. ఒకరినుండి మరొకరికి వ్యాపించే వ్యాధిని ఏమంటారు? (2)
19. సున్నా లుప్తమైనా ... బంగారమే (3)
21. అటు ఇటు లేని ఆలంబన (2)
23. గుండీ దూరడానికి చేసే రంధ్రం-తీపి వంటకమైంది (2)
25. కూనలమ్మ పదాల సృష్టికర్త అడుగులు తడబడ్డాయి (3)
27. 'ముత్యాలముగ్గు' వేసిన చిత్రకారుడు (2)
28. బాపు తొలి సినిమాను తన ఇంటిపేరుగా మార్చుకున్న నటుడు (4)
29. నిగూఢ రహస్యాన్ని దాచుకున్న దేశ ఆర్థికమంత్రి (4)

## నిలువు

1. ఒకనాటి సమరాన్ని తలపించే 'ఆంధ్రజ్యోతి' ఎన్నికల అనుబంధం (4)
2. ఒక కూర దుంప (2)
3. కిందనుండి ప్రార్థించు (2)
4. పవన్ స్థాపించిన సేన (2)
5. వెలుగు – ఒకతరం సినీ నాయిక (2)
6. తడబడ్డ నలసతి (4)
9. అలనాటి చెన్నపురికి .. నేటి చెన్నైకి మధ్య నామం (3)
12. రాయి తగిలిస్తే అయస్కాంతమే (3)
13. తేలడానికి వ్యతిరేకం (3)
14. కొందరు నిద్రలో కొట్టేది (3)
15. కలంతో అంతమైన సర్వం (3)
18. చీకటి (4)
20. 'ప్రధాని' రేసులో బరిలో దిగిన నాయకుడి అసలు పేరు (3)
22. ఆంధ్రా, ఒడిశాల సరిహద్దు టౌను (4)
24. జాగారంలో కనిపించే స్థలం (2)
25. ఒక సాధుజంతువు (2)
26. నాలుక మాత్రమే కనుక్కోగలిగేది (2)
27. తోక తెగిన బాబర్ (3)

### గత వారం జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 గు | 2 డ్ | ప్లై | 3 డే | ■ | 4 నీ | రా | 5 జ | 6 నం |
| 7 రి | గౌ | ■ | 8 గ | 9 రు | డ | ■ | 10 గం | గ |
| విం | ■ | ■ | ■ | ద్రా | ■ | ■ | ■ | నా |
| 11 ద | 12 ధి | ■ | 13 అ | క్ష | 14 రం | ■ | 15 బూ | చి |
| ■ | 16 ల | హ | రి | ■ | 17 గు | మ్మ | డి | ■ |
| 18 పూ | జ | ■ | 19 సె | 20 వు | ల | ■ | 21 ద | 22 శ |
| త | ■ | ■ | ■ | పా | ■ | ■ | ■ | ని |
| 23 రే | 24 గు | ■ | 25 జ | యం | 26 తి | ■ | 27 బా | వా |
| 28 కు | తూ | హ | లం | ■ | 29 ను | డి | కా | రం |

నిర్వహణ : గౌరుసు

❖ ఈవారం కవిత

# ఈకల కిరీటాల మీద నూకల స్వర్గపు గజళ్లు

నాగరేయకపు నది రంకె వేసినప్పుడు
నగరాలకోసం గూడేలు నయాగరాలై
చరిత్రలకు మరణశాసనాలు రాయబడతాయి
గత శతాబ్దపు పాతాలింకా నేర్వనప్పుడు
క్లియోపాత్ర రాజప్రాసాదాల్లా
తాటాకు గుడిసెలు జలసమాధై
కొమ్ముబూర అతి పెద్ద పురావస్తు ప్రదర్శనశాలౌతుంది

మారణకాండ భాష
పాదయాత్ర చేసి పదకోశం మాడుకెక్కి
అధికార హస్తిన భాషకు శబ్దరత్నాకరమై
విశ్వాసరాహిత్య విభజన భజన రెక్కలై
విశ్వసించిన తెలుగుజాతి రీతిపైనే రెక్కీలు చేసి
పువ్వుల్ని పుప్పొడిని నలుగులా కలిపి నలిపితే
నువ్వు నడిచిన నేల నీట మునుగుతున్న కథావస్తువై
ఎలిజీలు రాసుకుంటుంది గనక
ఈకల కిరీటాల మీద నూకల స్వర్గపు గజబొంకు గజళ్ళు
మంద్ర స్థాయిలో పాడి పాడి
బాధిత పరిహారానికి బానిస వేషమే వేయిస్తాయి ...

జాతీయ జెండాకు చిల్లులు పడినంతగా
వేల క్యూసెక్కుల కొండచిలువల్ని ఎగదోసి
ఆనకట్టలపై కట్టలు తెగిన ఆలోచనల కర్సర్ మీద
మనం సవర్ణ దీర్ఘసంధిగా పేరు మార్చుకున్నామని
చేసిన ప్రకటన శ్రవణానందకరమేమో గానీ
సవర్ణుల జాతీయతా రాడార్ మీద గుర్తుపట్టని
మతిమరుపుకు చచ్చేంత సిగ్గేసిచచ్చి
నచ్చిన కొండ భాషలో 'యూ టూ బ్రూటస్' అని
చచ్చేట్టుగా చివాట్లు పెట్టాలనిపిస్తోంది గానీ
వచ్చే వర్షాకాలానికి నేను మునిగిపోకుండా
గోదావరిని దాటలేననే నీ ధీమా నాకు తెలుసులే!

ఓ నయా నర్మదా!
నీ విజిగీష నాకు తెలుసు!
నీ నిజరూపమూ నాకు తెలుసు!
మూలవాసీనని గొణిగినంత కాలానికి
ఒక మూల ఆదివాసీగా బతకడమే నేరమైన నేరానికి
వాగ్దానాల వాంగ్మయాల వాగ్గేయకారాలకు
ఎన్ని దండకారణ్యపు దండన కథలు!
ఎన్నెన్ని మిడతల గొంతుల ఉరితీతల దండలు!!

ఇంత జరిగాక
నువ్వు రచిస్తున్న ఈ సుజలాం – సుఫలాం – సస్యశ్యామలాల
అభివృద్ధి కథల నడుమ
సతత హరిత గీతమొకటి రాసివ్వగలవా!
అడవి వేసుకుంటున్న బొమ్మజెముడు పండు రంగుల్ని ఆపగలవా!
జనవాసాలపై నదుల్ని కట్టిపడేసి
తెలుగుజన హృదయానికి ప్రేమపూర్వక ఆనకట్ట కట్టగలవా!

*(పోలవరం ప్రాజెక్ట్‌కు నిరసనగా)*



బొమ్మ : అక్బర్

– తుల్లిమల్లి విల్సన్ సుధాకర్, 09538053030

# వెండితెర బంగారం - 49



## 'సుందరాంగా ... అందుకోరా, సౌందర్య మాధుర్య మందారమూ ..'

**జూ**పిటర్ వారి 'సంతోషం' (1955) చిత్రంలోని **హెలన్** స్టిల్ ఇది.

21 నవంబర్, 1939న బర్మాలో జన్మించారు హెలన్. తల్లి మార్లెన్ బర్మా దేశీయురాలు, తండ్రి రిచర్డ్‌సన్ ఆంగ్లో ఇండియన్. తండ్రి మరణానంతరం తల్లితో కలిసి రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఎన్నో కష్టాలకు ఓర్చి రంగూన్ నుండి ఇండియాకు వచ్చారు. అస్సాం, కలకత్తాల మీదుగా ఎన్నో ప్రాంతాలు తిరిగి తిరిగి చివరకు ముంబై చేరుకున్నారు. అక్కడ 'కుకూ' అనే సినీ నర్తకి పరిచయంతో హెలన్ డాన్సర్ అయ్యారు. 'అలిఫ్ లైలా' (1953) చిత్రంలో హెలన్ తొలిసారి నృత్యం చేశారు. బ్రేక్ ఇచ్చిన సినిమా 'బారిష్' (1957). ఆ తర్వాత 'హౌరాబ్రిడ్జ్' (1958)లో 'మేరా నామ్ చిన్ చిన్ చు ..' అనే గీతాదత్ పాటకు నృత్యం చేసి తారాపథంలోకి దూసుకుపోయారు.

తెలుగులో స్వయంప్రభ, అక్కాచెల్లెళ్లు, దొంగల్లో దొర, భూకైలాస్ లాంటి చిత్రాల్లో కనువిందైన నృత్యాలు చేశారు. వెండితెరపై శృంగార దేవతగా ఆరాధించబడ్డ హెలన్ రిచర్డ్‌సన్ 1981లో సలీం ఖాన్ (ప్రముఖ బాలీవుడ్ హీరో సల్మాన్‌ఖాన్ తండ్రి) ని వివాహం చేసుకుని 'హెలన్ ఖాన్' అయ్యారు.

అరవై ఏళ్లలో సుమారు 150 చిత్రాల్లో నటించారు హెలన్. "Mehbooba Mehbooba"(షోలే–1975) "Yeh Mera Dil Pyar Ka Deewana"(డాన్ – 1978) పాటలకు ఆమె చేసిన నృత్యాలు ప్రేక్షకులు ఇప్పటికీ మరిచిపోలేదు. మొదట్లో హెలన్ నృత్యాలకు పాటలు పాడటం వలనే ఆశాభోంస్లే పరిశ్రమలో నిలదొక్కుకున్నారని అంటారు. పలుమార్లు ఫిలింఫేర్ అవార్డులతో పాటు 2009లో భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ అందుకున్నారు హెలన్.

నిర్వహణ : **డా. కంపల్లె రవిచంద్రన్, 98487 20478**



మీ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోండి.. మీ జీవితాన్ని మెరుగుపరుచుకోండి...
Diabetes గురించి మీకు తెలుసా?
డయాబెటిక్ తర్వాత వచ్చే సమస్యలు - దుష్ఫలితాలు
• నీరసం • అధిక బరువు
• బరువు తగ్గడం
• సెక్సువల్ సమస్యలు
• సంతానలేమి
• థైరాయిడ్ • ఆర్థరైటిస్
• వెన్నునొప్పి • డిప్రెషన్
నొప్పులు తో మొదలయ్యే సమస్యలు...
• రుమటాయిడ్ ఆర్థరైటిస్
• ఫ్రోజెన్ శోల్డర్ • గౌటీ ఆర్థరైటిస్
• సోరియాటిక్ ఆర్థరైటిస్
• స్పాండిలైటిస్
• ఆస్టియో ఆర్థరైటిస్
డయాబెటిస్ చికిత్స కొరకు
డయాబెటిక్ సెల్
పాజిటివ్ హోమియోపతి సౌజన్యం
ఆర్థరైటిస్ చికిత్స కొరకు
Positive Orthopathy
A Positive Homeopathy Initiative
థైరాయిడ్ చికిత్స కొరకు
థైరో సెల్
థైరాయిడ్
మన జీవితంపై ఎంతగా ప్రభావితం చేస్తుందో మీకు తెలుసా?
థైరాయిడ్ వల్ల సమస్యలు
• అధిక బరువు
• సంతానలేమి
• నెలసరి సమస్యలు
• అతినిద్ర
• జుట్టు రాలటం
• అతి సున్నితత్వం
పైల్స్, ఫిస్టుల్యా & ఫిష్షర్స్ కు
హోమియోలో పాజిటివ్ ఫలితాలు
• మూత్రాశయంలో దురద, మంట
• అధిక రక్తస్రావం
• ఎక్కువసేపు కూర్చోవడానికి ఇబ్బంది పడడం
• మూత్రాశయ పగుళ్ళు,
ఇన్ఫెక్షన్లు మొ॥న ఎన్నో సమస్యల నుండి సత్వర పరిష్కారం అందిస్తుంది
'పాజిటివ్'
ఉచిత సలహాలకై: 1800 425 0144 | ఆంధ్రప్రదేశ్, తమిళనాడు & కర్ణాటక | SMS 'POSITIVE' to 55352
The art of healing
పాజిటివ్ హోమియోపతి
నెం.1 వరల్డ్ క్లాసికల్ హోమియోపతి An ISO 9001 - 2000 Certified ®
• అమీర్‌పేట • S.R. నగర్ • మెహిదీపట్నం • కూకట్‌పల్లి
• విక్రమ్‌పురి • కాచిగూడ • దిల్‌షుక్‌నగర్ • A.S.రావు నగర్
• నిజామాబాద్ • కర్నూల్ • గుంటూరు • విజయవాడ
• వైజాగ్ • తిరుపతి • రాజమండ్రి • బెంగుళూరు • చెన్నై
డాక్టర్ గారితో డైరెక్ట్‌గా సంప్రదించండి
96527 54053
ఉ॥ 10 గం॥ల నుండి రాత్రి 7 గం॥ల వరకు
www.sricharanamedia.com
ఫ్రీ డాక్టర్ కన్సల్టేషన్ కొరకు
92461 99933
Follow us on :
www.positivehomeopathy.com

11 మే 2014

# ఆదివారం ఆంధ్రజ్యోతి



# ఫీ'మేల్' బైకర్స్!






12



సెటైర్
ఎలుకలూ..ఎన్నికలూ

16



బాటసారి
ఈమని శివనాగిరెడ్డి

26



కథ
రక్షణ


జూహీచావ్లా


శ్రీదేవి ఫ్యామిలీ

# జాలీ డే!

ఎండలు మండిపోతున్నాయి. బాలీవుడ్ స్టార్లు రెక్కలు కట్టుకుని విదేశాల్లో వాలుతున్నారు. ఇటీవల ఫ్లోరిడాలో జరిగిన 'ఐఫా' అవార్డుల ఉత్సవంలో పాల్గొన్న చాలామంది తారలు అక్కడే ఉండి సమ్మర్ హాలీడేస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. వారంతా ట్విట్టర్, ఫేస్‌బుక్‌లలో ఫోటోలు కూడా పోస్ట్ చేశారు. హాలీడే ట్రిప్పుల్లో స్టార్లు ఏం చేస్తారో, ఎలా ఉంటారో ఈ ఫోటోలు చూస్తే తెలుస్తుంది. పరిణీతి చోప్రా, సోనాక్షి సిన్హా, ప్రియాంక చోప్రా, సన్నీ లియోన్, బిపాషా బసు, జూహీచావ్లా, శ్రీదేవి, అమీషాపటేల్... వీరంతా ఫ్రెండ్స్‌తో, ఫ్యామిలీతో విదేశాల్లోని సముద్రతీరాల్లో సేదదీరుతూ, పర్యాటక స్థలాలను సందర్శిస్తూ, షాపింగ్ చేస్తూ ఎంత డిఫరెంట్‌గా ఉన్నారో చూడండి.



సన్నీ లియోన్


పరిణీతి చోప్రా


అమీషాపటేల్

ఆదివారం ఆంధ్రజ్యోతి
11 మే 2014

❖ కామెంట్

# ..ష్.. సస్పెన్స్



సస్పెన్స్ కథల్ని మెప్పించడం చాలా కష్టం.

నేను ఆఫీసుకు వెళ్ళేలోగా రైల్వే వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందా లేదా, తత్కాల్‌లో టిక్కెట్ దొరుకుతుందా లేదా అనేది నీ ఒక్కడికి లేదా నీ కుటుంబానికి సస్పెన్స్ అవుతుంది కాని అందరికీ ఎందుకవుతుంది? పార్కింగ్‌లో నీ కారుకు చోటు దొరుకుతుందా లేదా అనేది కూడా నీకో, నీ డ్రైవరుకో యమ సస్పెన్స్ కావొచ్చు కాని మిగతా వాళ్ళకు డోన్ట్ కేర్ కదా.

అందుకే అందరికీ చివరిదాకా సస్పెన్స్ ఉండేలా కథలు రాయడం చాలా కష్టమని ఎవరమైనా సరే ఒప్పుకోక తప్పదు. సస్పెన్స్ కథ పండాలంటే కొన్ని సూత్రాలున్నాయి.

ఉదాహరణకు– హీరో, విలన్‌లిద్దరి దృష్టికోణంతోనూ పాఠకులకు పరిచయం ఏర్పరచాలి. రెండిట్లోను ఎంతో కొంత న్యాయం ఉందనిపించాలి. ఒక విధంగా చెప్పాలంటే వాళ్ళిద్దరికీ ఒకరి గురించి ఒకరికి తెలియని విషయాలు పాఠకులకు తెలిసి ఉండాలి. అప్పుడే చివరికి ఏమవుతుందనే ఉత్కంఠ పెరిగిపోతుంది.

కాల వ్యవధి తప్పనిసరిగా ఉండాలి. గడియారంతో పాటు పరుగెత్తుతున్నట్టు ఫీలింగ్ కలిగించాలి.

ఏదో ఉదాత్తమైన దాన్ని రక్షించడానికి జరుగుతున్న ఘర్షణగా చూపించాలి. లేకపోతే పాఠకులు టైం వేస్ట్‌గా భావించే ప్రమాదం ఉంది.

విషయం చాలా సంక్లిష్టమైనదన్నట్టు చూపించాలి. మధ్యలో అనేక అవాంతరాలు వస్తుండాలి. హీరో విలన్ల మీదే కాదు పాఠకుల మీద కూడా ఒత్తిడి క్షణక్షణం పెరిగిపోతుండాలి. హీరో గెలవకపోతే ప్రపంచం తలకిందులు అవుతుందన్నట్టు అందరూ తల్లడిల్లిపోవాలి. అప్పుడే కథలో సస్పెన్స్ పండుతుంది. హీరో గెలుస్తాడనేది మొదట్నించీ తెలిసిందే కాబట్టి అదంత ముఖ్యం కాదు.

★★★

మన ఎన్నికల్లోనూ ఈ లక్షణాలన్నీ ఉన్నాయి. అందుకే కథ మొదలై నెల దాటినా సస్పెన్స్ బాగా పండుతూ వచ్చింది. హీరో ఎవరో, విలన్ ఎవరో తెలియకపోవడం వల్ల కూడా కొంత అదనపు సస్పెన్స్ వచ్చి చేరింది. బహుశా ఇంతటి సస్పెన్స్ కథను భారత ప్రజాస్వామ్యం తప్ప ఇంకెవరూ రాయలేరేమో!

'ఫన్' లైనర్

ఆరోగ్యంగా ఉండాలంటే... టీవీ ప్రకటనల్లో వచ్చే ఫుడ్ ఐటెమ్స్‌ని చూడండి.. కాని తినకండి.

‘ఆదివారం అనుబంధం’పై మీ అభిప్రాయాలను శుక్రవారంలోగా అందేలా పంపగలరు. ఆలస్యంగా అందిన ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని మనవి. **sunday.aj@gmail.com** కి మీ ఉత్తరాల్ని మెయిల్ చేయవచ్చు.

## ఇన్‌బాక్స్



## ఇండెక్స్




కవర్‌స్టోరీ 8
ఫీ'మేల్' బైకర్స్

సెటైర్ ................ 12
ఎలుకలూ... ఎన్నికలూ

సెలబ్రిటీ ............. 13
జోనిట గాంధీ

బాటసారి ............. 16
శివ నాగిరెడ్డి

కేరింత ................ 18
ప్రకృతే పాఠశాల

అవీ ఇవీ ............... 20
ట్రీ పెయింటింగ్

జైలు కథలు ........... 22
పేదింటి పొగ

ఈ వారం కథ ........... 26
రక్షణ

ఫుడ్‌కోర్ట్ ............... 28
నాన్‌వెజ్ స్నాక్స్





బ్లాగోతం .............. 29
మా ఆవిడా ఇంతే, మరి...


### మహారచయిత మంచిమాటలు

ఈసారి ‘కామెంట్’లో గేబ్రియల్ గార్షియా మార్క్వెజ్ అభిప్రాయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. నవలా రచనకు, పత్రికా రచనకు తేడాల గురించి ఆయన చెప్పిన అభిప్రాయాలు ఆలోచనాత్మకంగా ఉన్నాయి. ‘అంతమంది చదువుతున్నారని..’ బాధ్యత గుర్తెరిగినందువల్ల ఆయన గొప్ప రచయితగానే కాదు, గొప్ప జర్నలిస్టుగా కూడా రాణించివుంటారని రూఢి అవుతోంది.

– సురేష్, పద్మజ, రాణి, హైదరాబాద్

### గాన గాంధర్వుడు

ఈసారి ‘వెండితెర బంగారం’లో అబ్బురపరిచిన విషయం నాటి మేటి హాస్య నటుడు రేలంగి నటగాయకుడు పి.సూరిబాబు ట్రూపులో కాఫీబాయ్‌గా పనిచేసారన్నది. అంతే కాదు, సూరిబాబు నాట్యమండలిని స్థాపించారని, ‘తారా శశాంకం’వంటి గొప్ప నాటకాన్ని ప్రదర్శించారన్నవి కూడా తెలియని సంగతులే. ఆయన పాడిన పాటలు మరువతరమా!

– భాగవతుల నరసింహం, శ్రీకాకుళం

### ఇక్కడెప్పుడో?

‘యాస గురువులు!’ కథనం బాలీవుడ్‌లోని కొత్త పరిణామాన్ని కళ్లముందుంచింది. అక్కడి దర్శకులు సంభాషణల కోసం ‘సహజత్వం’ బాట పట్టడం, హిందీ స్టార్లు ‘స్థానిక’ ఉచ్చారణకోసం సాదాసీదా కుర్రాళ్ల వద్ద శిక్షణ పొందడం ఆహ్వానించదగ్గ మార్పు. దానివల్ల ప్రేక్షకులకు మరింత వినోదం. తెలుగు పరిశ్రమలో కూడా ఇలాంటివి ఎప్పుడు చోటుచేసుకుంటాయా అని నిరీక్షించడం తప్ప మరో దారిలేదేమో!

– సునీల్, వరంగల్

### పలకడం కోసమే...!?

హిందీ చిత్రపరిశ్రమ పుణ్యమా అని వికాస్ కుమార్, ఆనంద్ మిశ్రా, నీలేష్ రాయ్‌వంటి వారి పంట పండుతోంది. నిన్నటిదాకా నటులు కావాలనుకున్నవారు, ఉపాధ్యాయ వృత్తి చేసుకునేవారు.. నేడు స్టార్లకు మాస్టర్లయిపోయి రెండు చేతులా ఆర్జిస్తున్నారంటే ఆశ్చర్యం వేస్తుంది. అక్కడ యాసలకు డిమాండ్ పెరగడంతో ఇలాంటి కొత్త వృత్తిలో వారు మెరిసిపోతున్నారు.

ఒక పదం ఎలా పలకాలనేందుకు ఒక టీచర్‌నో, రచయితనో సంప్రదిస్తున్న అమీర్ ఖాన్ అంకితభావానికి, పరిణతికి జై కొట్టవలసిందే.

– రాఘవ రాజు, కరీంనగర్

### నిష్ఠుర సత్యం

స్నేహితుడు, ప్రేమికుడు, మొగుడు పాత్రలు వేరేవేరని అమ్మ పాత్రలోంచి వచ్చిన మాట నిష్ఠుర సత్యం. ‘మా అమ్మ, ఆమె దోస్త్ మల్లి’ రచయిత్రికి ధన్యవాదాలు.

– సరళారాణి, తెనాలి

### గ్రేట్! గ్రేట్!

‘ఎర్రబస్సుతో పైకొచ్చాడు’ కథనం స్ఫూర్తిదాయకంగా ఉంది. ఒక సాధారణ కంపెనీ ఉద్యోగి ఫణీంద్ర సామా తన కృషికి సృజనాత్మకతని జోడించి యువతకు ఆదర్శప్రాయుడయ్యారు. ‘రెడ్ బస్ డాట్ ఇన్’ వెబ్‌సైట్‌ను ప్రారంభించి దాన్ని దేశంలోనే అత్యధిక బస్‌టికెట్లను ఆన్‌లైన్‌లో అమ్మే సంస్థగా తీర్చిదిద్దడం అమోఘం. సరిగ్గా ఎనిమిదేళ్లలోనే 700 మంది ఉద్యోగులతో 24 రాష్ట్రాల్లో దానిని విస్తరించడం మాటలా? హ్యాట్సాఫ్ టు ఫణీంద్ర!



– వసంతకుమార్, నంద్యాల

### అక్కడ డాన్స్ ఓ వరమే

‘మానససరోవరం దగ్గర డ్యాన్ చేశా’ అని ఉబ్బితబ్బిబ్బయిన స్వాతి సోమనాథ్ అనుభవాలు బాగా చదివించాయి. గైడ్ మాటలు వినకపోవడం వల్ల ఆమె పడిన తిప్పలు, అమరనాథ్ యాత్రలో తన వస్తువులన్నీ పోగొట్టుకుని చేదు అనుభవాన్ని మిగుల్చుకోవడం కూడా నాబోటి టూరిస్టులకు హెచ్చరికలే. ఏదేమైనా అంతటి చలిలో సరోవరం ఒడ్డున ఇరవై నిమిషాలపాటు డ్యాన్సు చేసి ఆమెకు ఆమే సాటి అనిపించుకుంది.

– సంగీత, బెంగళూరు

# షుగర్ సమస్యలకు హోమియోతో చెక్

**సమయానికి మందులు వాడుతున్నాం కదా.. అని నిర్లక్ష్యంగా ఉండిపోతే డయా బెటిస్ సమస్యలు ప్రాణాంతకం కావచ్చు. దీర్ఘకాలంగా మధుమేహం ఉన్నప్పుడు రక్తనాళాల సమస్యలు, కంటిచూపు మందగించడం, లైంగిక సమస్యల వంటివి ప్రారంభమవుతాయి. అందుకే షుగర్ ఉన్నవారు ఏడాదికోసారి అన్ని పరీక్షలు చేయించుకోవాలని, క్రమం తప్పకుండా డాక్టర్‌ని కలవాలని సూచిస్తుంటారు. అయితే సమస్యలు వచ్చిన తరువాత చికిత్స కోసం పరుగులు పెట్టే కన్నా రాకుండా చూసుకోవడమే ఉత్తమం. ఇందుకు హోమియోపతి సరైనదారి చూపుతుందనడానికి నిదర్శనం ఈ ఇద్దరు. షుగర్ వ్యాధితో అనేక సమస్యలు ఎదుర్కొంటూ ఆందోళనకరమైన స్థితిలో హోమియో చికిత్సతో ఆరోగ్యవంతమైన జీవితం గడుపుతున్న ఇద్దరి కథ....**

ఆమె పేరు విజయ. వయసు 52 సంవత్సరాలు. గత ఆరేళ్లుగా డయాబెటిస్‌తో బాధపడుతోంది. రోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకుంటోంది. మొదట్లో బాగానే ఉండేది. ఇన్సులిన్ తీసుకుంటే ఆరోగ్య సమస్యలేమీ లేవు కదా అని నిర్లక్ష్యం చేసింది. ఏడాది క్రితం నుంచి కాళ్లలో తిమ్మిర్లు మొదలయ్యాయి. నడుస్తుంటే పట్టు లేనట్లుగా అనిపించేది. స్పర్శ తగ్గిపోయింది. ఒకసారి రాయి తగిలి రక్తం వచ్చినా, ఇంటికి వచ్చి చూసుకునేవరకు తెలియలేదు. మరోరోజు జ్వరం వచ్చినప్పుడు డాక్టర్ దగ్గరకు వెళితే పరీక్ష చేసి బీపీ ఎక్కువగా ఉందని చెప్పాడు. అప్పటివరకు ఆమెకు హైబీపీ ఉన్న సంగతి తెలియదు. ఇటు హైబీపీ, అటు కాళ్ల తిమ్మిర్లతో ఏం చేయాలో పాలుపోలేదు. ఆ తరువాత కంటిచూపు మందగించింది. రాత్రుళ్లు కళ్లు సరిగ్గా కనబడేవి కావు. దాంతో పరిస్థితి విషమిస్తోందని ఆమెకు అర్థమయింది. తెలిసినవాళ్లు ఈ సమస్యలన్నీ షుగర్ వ్యాధి మూలంగానే వస్తున్నాయి. హోమియో మందులు తీసుకుంటే ఈ సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చని సలహా ఇవ్వడంతో పరుగుపరుగున మా దగ్గరకు వచ్చింది.

* * *

అతని పేరు దినేష్. వయసు 27 సంవత్సరాలు. వృత్తి ప్రైవేటు ఉద్యోగం. ఏడాది క్రితం పెళ్లయింది. ఏడాదిపాటు వైవాహిక జీవితాన్ని బాగా ఎంజాయ్ చేశాడు. సాఫీగా సాగిపోతున్న జీవితంలో ఒక్కసారిగా కుదుపు. ఒంట్లో నిస్సత్తువగా ఉండడంతో మొదలైన సమస్య శృంగారంలో విఫలం కావడం వరకు చేరింది. ఒకరోజు తను పనిచేసే ఆఫీసులో హెల్త్‌క్యాంపు నిర్వహించారు. అందరు ఉద్యోగులతో పాటు తను కూడా పరీక్షలు చేయించుకున్నాడు. అక్కడ చేసిన రక్తపరీక్షల్లో షుగర్ స్థాయి 300 ఉన్నట్లు వచ్చింది. అదేంటి.. నాకు షుగర్ ఉండడం ఏమిటి? మిషన్‌లో ఏదో ప్రాబ్లమ్ కావచ్చని మరొక్కసారి పరీక్ష చేయించాడు. మళ్లీ అదే రిపోర్టు. మరుసటి రోజు పొద్దునే ప్రైవేటు ల్యాబొరేటరీకి వెళ్లి షుగర్ పరీక్ష చేయించాడు. అక్కడ కూడా అలాగే రావడంతో డయాబెటిస్ ఉన్నట్లుగా నిర్ధారణకు వచ్చాడు. ఈ వయసులో షుగర్ ఏమిటి అనుకుంటూ డాక్టర్ దగ్గరకు పరుగెత్తాడు. కొంతకాలంగా నీరసంగా ఉండటం, కొద్దిదూరం నడవగానే చెమటలు పట్టడం, శృంగారంలో సమస్యల వంటివన్నీ షుగర్ వ్యాధి మూలంగానే వచ్చాయని డాక్టర్ చెప్పేసరికి అర్థమయింది. షుగర్ వ్యాధి రావడానికి ఇప్పుడు వయసుతో సంబంధం లేదని, యుక్తవయసువారిలోనూ కనిపిస్తోందని డాక్టర్ చెప్పుకొచ్చాడు. షుగర్ కంట్రోల్‌లో పెట్టుకోవడానికి ఇన్సులిన్‌ను సూచించాడు. ఇన్సులిన్ వాడటం మొదలుపెట్టాక కొద్దిగా తేడా కనిపించింది. కాని ఆరోగ్యస్థితిలో మార్పు రాలేదు. కాళ్ల తిమ్మిర్లు రావడం, చెమట పట్టడం తగ్గలేదు. అంగస్తంభన సమస్య అలాగే ఉంది. దాంతోవైవాహిక జీవితంపై భయం పట్టుకుంది. ఆ స్థితిలో మిత్రుని సలహా మేరకు హోమియో చికిత్స కోసం మా దగ్గరకు వచ్చాడు.

* * *

ఈ ఇద్దరిని పరిశీలిస్తే స్థూలంగా ఒక విషయం అర్థమవుతుంది. డయాబెటిస్ ఉన్నవారు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉంటే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని. చాలామంది షుగర్ వ్యాధి ఉంటే ఇన్సులిన్ తీసుకుంటే సరిపోతుందని అనుకుంటారు. కాని అదొక్కటే సరిపోదు. షుగర్ వ్యాధి వల్ల వచ్చే ఎన్నో సమస్యలను ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండాలి.

## సమస్యలు ఇలా ఉంటాయి..

- డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉంటాయి. రక్తంలో షుగర్ లెవల్స్ దీర్ఘకాలంగా ఉన్నప్పుడు అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ముఖ్యంగా కళ్లు, కిడ్నీలు, రక్తనాళాలు, గుండె సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుంది.
- డయాబెటిస్ దీర్ఘకాలంగా ఉన్నప్పుడు కంటి సమస్యలు మొదలవుతాయి. దృష్టిలోపం ఏర్పడుతుంది. రాత్రివేళ చూడలేకపోతారు. నిర్లక్ష్యం చేస్తే కంటిచూపు పూర్తిగా పోయే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను డయాబెటిక్ రెటినోపతి అంటారు.
- పాదాలకు చిన్న గాయమైనా తగ్గడానికి చాలా సమయం పడుతుంది. కొంతమందిలో గాయం మానకుండా గ్యాంగ్రిన్‌గా మారుతుంది. అటువంటప్పుడు కాలు తొలగించాల్సిన అవసరం ఏర్పడుతుంది.
- డయాబెటిస్ ఉన్నవారు రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి. కొలెస్ట్రాల్ పెరగకుండా చూసుకోవాలి. ఎందుకంటే గుండెజబ్బులు వచ్చే అవకాశం షుగర్ ఉన్నవారిలో రెట్టింపు ఉంటుంది. పక్షవాతం వచ్చే అవకాశాలుంటాయి.
- రక్తనాళాలు దెబ్బతినడం వల్ల కాళ్లలో తిమ్మిర్లు, శక్తి లేనట్లుగా అనిపిస్తుంది. నడుస్తుంటే పట్టు లేనట్లుగా ఉంటుంది. పురుషుల్లో లైంగిక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ సమస్యను డయాబెటిక్ న్యూరోపతి అంటారు.
- రక్తపోటు అధికంగా ఉంటే కిడ్నీలు త్వరగా దెబ్బతింటాయి. ఒక్కసారి కిడ్నీలు పాడైపోతే డయాలసిస్ లేక కిడ్నీ మార్పిడి చేయించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఈ సమస్యను డయాబెటిక్ నెఫ్రోపతి అంటారు.

## చికిత్స మొదలుపెట్టాక...

డయాబెటిస్ ఉన్నవారిలో బీపీ ఉంటే ప్రమాదం రెట్టింపు ఉంటుంది. ఆ విషయాన్ని ఆమెకు (విజయ) వివరించి బీపీ తగ్గేందుకు మందులు ఇస్తూ డయాబెటిస్ కాంప్లికేషన్స్‌ను దృష్టిలో పెట్టుకుని చికిత్స ప్రారంభించాం. చికిత్స మొదలుపెట్టాన నెల రోజుల్లోనే మంచి ఫలితం కనిపించింది. కాళ్లలో తిమ్మిర్లు తగ్గిపోయాయి. చెమటలు పట్టడం తగ్గిపోయింది. కంటిచూపు మెరుగుపడింది. ముఖ్యంగా బీపీ నియంత్రణలోకి రావడంతో ఆమె ఆరోగ్యం వేగంగా కుదుటపడింది. దాంతో ఆమెలో కొత్త ధైర్యం వచ్చింది. మూడు నెలల్లోనే డయాబెటిస్ మూలంగా వచ్చిన సమస్యలన్నీ దూరమయ్యాయి. కాళ్లలో స్పర్శ బాగా తెలుస్తోందని సంతోషంగా చెప్పుకొచ్చింది.

దినేష్ విషయంలోనూ మంచి ఫలితం కనిపించింది. నీరసం బాగా తగ్గిపోయిందని, హోమియో చికిత్స తన జీవితంలో వెలుగులు నింపిందని చెప్పుకొచ్చాడు. వైవాహిక జీవితంలో ఇబ్బంది పోయిందని అన్నాడు. అయితే హోమియో చికిత్స తీసుకోవడంతో పాటు జీవన విధానంలో మార్పులు చేసుకోవాలని ఇద్దరికీ సూచించాం. ఇప్పుడు వారిద్దరూ షుగర్ వ్యాధి వల్ల వచ్చే సమస్యల భయం లేకుండా హాయిగా గడుపుతున్నారు.



**డాక్టర్ రవికిరణ్**
ఎం.డి.
మాస్టర్స్ హోమియోపతి
హైదరాబాద్, విజయవాడ
కరీంనగర్
7842 106 106
9032 106 106

మాస్టర్స్ హోమియోపతి






(పద కవితా పితామహుడు శ్రీ అన్నమాచార్యుల వారి 'సిరుత నవ్వుల వాడె సిన్నక్కా వాడు – వెఱపెరుగడు సూడవె సిన్నక్కా' కీర్తనకు)

## పొలిటికల్లీడరె సిన్నక్కా ... వాడు సిగ్గెరగడు సూడవె సిన్నక్కా ...

మాటకారి వాడు, ఇచ్చకాయల వాడు .. మోసగాడు వాడు సిన్నక్కా
అరచేతిలోన స్వర్గమ్ము చూపేటి .. ఐంద్రజాలకుడే సిన్నక్కా

ఐదేళ్లకోమారు కనబడి చేస్తాడు .. బాసలెన్నొ వాడు సిన్నక్కా
ఏటిని దాటాక తెప్ప తగలేసేటి .. ప్రజ్ఞలున్న వాడే సిన్నక్కా



మూణ్ణాళ్లకోమారు పార్టీని మార్చేటి .. ఊసరవెల్లి వాడు సిన్నక్కా
మర్కట చేష్టల కడుపుబ్బ నవ్వించు .. వీధి హాస్యగాడే సిన్నక్కా

తేనె పూసిన కత్తి, మేక వన్నె పులి .. నీతి మాలినవాడె సిన్నక్కా
మొన్నటి రౌడీ, నిన్నటి ఎమ్మెల్లే .. నేటి మంత్రివర్యుడే సిన్నక్కా

చట్ట సభలో వాడు ప్రశ్నలడగాలంటే .. ముడుపులడుగుతాడె సిన్నక్కా
మిరియాలు కారాలు కళ్లల్లో జల్లేటి .. దుడుకు చేష్టవాడే సిన్నక్కా

– వీరంరాజు తిరుమల సోమశేఖర్, 96764 45386

## ఎప్పుడూ ఇంతే ...




ఆరుగంటల ప్రాంతంలో ఆఫీసునించి ఇంటికి బయల్దేరిన ఆనందరావుకి ఆక్సిడెంట్ అయింది. అదే రూట్‌లో వెళ్తున్న పక్క ఆఫీస్ తాలూకు స్టాఫ్ బస్‌లో ఉన్న సరోజ చూసి, బస్‌ని ఆపమని చెప్పి దిగిపోయి ఆనందరావుని అపోలో హాస్పిటల్‌కి చేర్చింది.

రెండు గంటల తర్వాత ఆనందరావు తన మొబైల్‌నించి ఇంటికి ఫోన్ చేశాడు.

భార్య శైలజ ఫోన్ అందుకుంది.

ఆనందరావు చెప్పసాగాడు.

''శైలూ .. నాకు చిన్న ప్రమాదం జరిగింది. నువ్వేం కంగారుపడకు. సరోజ నన్ను హాస్పిటల్‌కి చేర్చింది. చిన్న ప్రమాదమే. తలకు చిన్న దెబ్బ తగిలింది. స్కాన్ చేసి చూశారు. మెదడుకి ఏం దెబ్బ తగల్లేదు. కాకపోతే కుడివేపు పక్కటెముకలు ... రిబ్స్ అంటారే ... అవి ... మూడు విరిగిపోయాయి. అదికాక కాలికి చిన్నదే ... కాంపౌండ్ ఫ్రాక్చర్ అయిందట. కాలు తీసేయాలని అనుకుంటున్నారు. ఇంకా ఏం డిసైడ్ చేయలేదు. మళ్లీ చెప్తున్నాను .. నువ్వేం కంగారు పడకు. ఈ సమయంలో నువ్వు బాగా ధైర్యంగా ఉండాలి ..'' ఊపిరి తీసుకోవడానికి కాస్త ఆగాడు.



శైలజ అందుకుంది –

''అంతా బాగానే ఉంది గానీ .. ఇంతకీ సరోజ ఎవరు?''.

– శీనా, 097890 58199

# బిట్‌బ్యాంక్



మొదటి గాలి మరను కని పెట్టి 1370 ఏళ్ళయింది. ఇరాన్ వాళ్ళు ధాన్యం ఆడించడానికి దాన్ని వాడేవాళ్ళు.

★ 1926లో జాన్ లోగీ బెయిర్డ్ అనే స్కాటిష్ ఆవిష్కర్త లండన్‌లోని సోహోలో టెలివిజన్ పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించాడు. అయినా పదేళ్ళ తర్వాత కూడా ప్రపంచంలో వంద టీవీల కంటే ఎక్కువ లేవు.



మనకూ జిరాఫీకీ కూడా మెడలో ఏడే ఎముకలు ఉంటాయి.

★ ఒక సాధారణ అమెరికన్ ప్రతిరోజూ 264 కంప్యూటర్ల మీద ఆధారపడతాడు.



మన తల మీద సగటున 85 వేల నుంచి 1.5 లక్షల వరకు వెంట్రుకలు ఉంటాయి.

★ చలికాలంలో గోళ్ళు వేగంగా పెరుగుతాయి.



**కవర్‌స్టోరీ**

**ఒకప్పుడు అమ్మాయిలు రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తుంటేనో, బస్టాప్‌లో బస్సు కోసం వెయిట్ చేస్తుంటేనో అబ్బాయిలు బైకుల మీద రయ్యిన దూసుకెళ్తూ స్టయిల్ కొట్టేవారు. రాను రాను అమ్మాయిలు కైనటిక్ హోండాల మీద, స్కూటీల మీద కాలేజీలకు, ఆఫీసులకు వెళ్లడం మొదలెట్టారు. మెల్లగా 100 సిసి లోపు ఉన్న టూవీలర్స్ అమ్మాయిల కోసం... 100 సిసి దాటిన బైకులు అబ్బాయిల కోసం అనే అభిప్రాయం దాదాపు స్థిరపడిపోయింది. కాని అమ్మాయిలు దానికి 'బ్రేక్' వేశారు. జీన్స్, టీ షర్టులు వేసినట్టే... అబ్బాయిలకే పరిమితం అనుకున్న బైకులను సైతం అలవోకగా నడుపుతూ సవాల్ విసురుతున్నారు. హార్లీ డేవిడ్‌సన్, బుల్లెట్, రాయల్ ఎన్‌ఫీల్డ్, యమహా వంటి 100 ప్లస్ సిసి బైకులను సైతం ఎంతో ఆత్మవిశ్వాసంతో రోడ్లపై పరుగులు తీయిస్తున్నారు. బైకులపై దూసుకెళ్తున్న అమ్మాయిల సంఖ్య దేశ వ్యాప్తంగా యేడాదికి యేడాది బాగా పెరుగుతోందంటున్నాయి ఆటోమొబైల్ వర్గాలు. బైకర్స్ (అబ్బాయిల)ను ఒకింత అసూయకు, ఆశ్చర్యానికి గురి చేస్తున్న 'బైకర్నీ' (అమ్మాయిల) గురించే ఈ వారం కవర్‌స్టోరీ.**



శీతల్ బిడాయే

# ఫీ'మేల్' బైకర్స్!

మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో ప్రపంచ ప్రసిద్ధ బైకుల కంపెనీ 'హార్లీ డేవిడ్‌సన్' ఒక షోరూమ్ ఏర్పాటుచేసింది. ఈ షోరూమ్‌లో అత్యధిక సిసి కలిగిన తొలి స్పోర్ట్స్ బైక్‌ను కొన్నది కస్తూరి డియోధర్ అనే ఒక మహిళ. కేరళలోని కొచ్చిలో సైతం ఇదే సీన్ రిపీట్ అయ్యింది. కేరళ రాష్ట్రంలో 'హార్లీ డేవిడ్‌సన్' బైక్‌ను సొంతం చేసుకున్న తొలి మహిళగా సంగీత వినోద్‌కుమార్ రికార్డు సృష్టించింది.

★★★

బెంగళూరులోని 23 ఏళ్ల దీక్షిత్ షా ప్రతీ రోజూ తలకు హెల్మెట్ పెట్టుకుని... జీన్స్. టీషర్ట్ మీద బ్లాక్ జాకెట్ ధరించి 150సిసి బజాజ్ పల్సర్‌పై 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇనిస్టిట్యూట్‌కు రయ్యిన దూసుకెళ్తుంది. ప్రతీరోజూ బస్సుల కోసం నిరీక్షించి విసిగి వేసారిన తర్వాత రెగ్యులర్ టూ వీలర్ బదులు సరదాగా పల్సర్ కొన్నానని, దాని మీద గేర్లు మార్చుతూ వేగంగా వెళ్లడం కిక్కునిస్తుందని అంటోంది.



కత్రినా కైఫ్

## ఏటా సంఖ్య పెరుగుతోంది...

ఆహార్యంతో పాటు అమ్మాయిల ఆలోచనల్లో కూడా చెప్పుకోదగ్గ మార్పు కనిపిస్తోంది. ఆహార్యం, ఆహారం, ఆనందాలకు ఆడ మగ తేడా ఏముంటుందనేది వారి వాదన. ఈ రోజుల్లో మగవారి దుస్తులను కూడా మహా దర్జాగా వేసుకు తిరుగుతున్న అమ్మాయిలు ... వెహికిల్స్ విషయంలో మాత్రం తేడాలెందుకని ప్రశ్నిస్తున్నారు. గత ఐదారేళ్లుగా టూవీలర్స్‌తో రోడ్డు మీదకు వస్తున్న అమ్మాయిల సంఖ్య బాగా పెరగడం ఒక విషయమైతే, గత మూడు నాలుగేళ్లుగా దేశవ్యాప్తంగా బైక్‌లను కొనుగోలు చేస్తున్న అమ్మాయిల సంఖ్య కూడా పెరుగుతోందని ఆటోమొబైల్ ఇండస్ట్రీ వారు చెపుతున్నారు. అధికారికంగా లెక్కలు లేకపోయినప్పటికీ నాలుగేళ్ల క్రితమే ఇండియాలో బైకులు కొన్న అమ్మాయిల సంఖ్య అంతకుముందు కన్నా నలభై శాతం పెరిగిందని, ప్రతీ యేడాది ఈ సంఖ్య పెరుగుతూనే ఉందని బైక్‌ల తయారీదారులైన హోండా మోటార్ సైకిల్, రాయల్ ఎన్‌ఫీల్డ్, యమహా మోటార్స్ కంపెనీలు తెలిపాయి. 30 ఏళ్ల లోపు యువతులు బైకుల మీద దూసుకుపోయేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని వాటి తయారీదారులు అంటున్నారు. ''ఆడ మగ తేడా లేకుండా బైకింగ్ సంస్కృతి అనేది రాను రాను పెరుగుతూనే ఉంది. బైకులు నడపాలనే కోరిక అమ్మాయిల్లో ఎక్కువవుతోన్న మాట వాస్తవం. కానీ కొందరు అమ్మాయిలు తమ పేరు మీద బైకులను రిజిస్టర్ చేసుకోవడం లేదు కాబట్టి మన దేశంలో యేడాదికి ఎన్ని బైకులు కొంటున్నారని కచ్చితంగా

చెప్పలేం'' అని రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు చెందిన ఒక సేల్స్‌మ్యాన్ చెప్పారు. అమ్మాయిల్లో బైకింగ్ ట్రెండ్‌ను ప్రోత్సహించేందుకు కొన్ని కంపెనీలు వారి కోసం టీ షర్టులు, హెల్మెట్స్ వంటి ప్రత్యేక యాక్సెసరీస్‌ను కూడా రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## మాకేం తక్కువ?

సాధారణంగా అమ్మాయిలు బైకు మీద వెళ్తామంటే ముందుగా భయపడేది తల్లిదండ్రులు. దానికి కారణం అది 'మేల్ వెహికల్' అనేది వారి వాదన. పైగా మగరాయుడిలా బైకు మీద వెళ్లడాన్ని పెద్దవాళ్లెవరూ ఇష్టపడటం లేదు. కైనటిక్ హోండా, స్కూటీ వంటి టూవీలర్స్ అయితే అమ్మాయిలకు కూర్చునేందుకు సౌకర్యంగా ఉండటమేగాక గేర్‌లెస్ వెహికిల్స్ కావడంతో వాటిని నడపడం సులువు అనే భావన కూడా చాలామందిలో ఉంది. అయితే కొందరు అమ్మాయిలు మాత్రం గేర్‌లెస్ టూ వీలర్ కన్నా, గేర్లు మార్చుతూ బైకు నడపడమే మజాగా ఉంటుందని అంటున్నారు. ''బైకు నడపడం వల్ల అబ్బాయిల కన్నా తక్కువ కాదనే ఆత్మవిశ్వాసం కలుగుతుంది. నేర్చుకోవాలేగానీ టూ వీలర్ కన్నా బైక్ రైడింగ్ కంఫర్ట్‌గా ఉంటుంది. కాకపోతే అమ్మాయిలు ధైర్యం చేయాలంతే. హెల్మెట్, జాకెట్ ధరించి బైకు మీద వెళ్తుంటే ఎవరి అటెన్షన్ కూడా మన మీద పడదు'' అని గత కొన్నేళ్లుగా యమహా బైక్ నడుపుతున్న సన అంటోంది. ఆయా నగరాల్లో బైకులు నడుపుతున్న సనలాంటి అమ్మాయిలు చాలామందే ఉన్నారు. వారంతా ఒకరికొకరు ఎప్పుడూ టచ్‌లో ఉంటూ ఈ ట్రెండ్‌ను మరింత విస్తరించే దిశగా ప్రయత్నిస్తున్నారు.



అపర్ణ బండోద్కర్

## ఫిమేల్ బైకర్స్ కోసం 'బైకర్నీ'

పుణేకు చెందిన ఊర్వశి పటోల్ పదమూడేళ్ల క్రితమే బైక్ రైడింగ్ నేర్చుకుంది. అప్పటి నుంచి బైకులే నడుపుతోంది. తనలాంటి విమెన్ బైకర్స్‌ను ఒక్కచోటికి తీసుకురావడమేగాక, మహిళల్లో బైక్ రైడింగ్ పట్ల ఆసక్తిని పెంచేందుకు ఆమె మూడేళ్ల క్రితం (2011) 'బైకర్నీ' అనే మోటార్ సైకిల్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసింది. అందులో ఢిల్లీ, బెంగళూరు, హుబ్లీ, మైసూరు, చెన్నై, తిరువనంతపురం, అహ్మదాబాద్, రాజ్‌కోట్, పుణే, ముంబాయి, హైదరాబాద్, కోల్‌కతా, గౌహతి తదితర నగరాలకు చెందిన మహిళా సభ్యులు అనేకమంది ఉన్నారు. వారంతా ఫేస్‌బుక్‌లో, మెయిల్స్‌లో టచ్‌లో ఉంటారు. ఆయా నగరాల్లోని సభ్యులు 'బైకర్నీ' తరపున కొన్ని కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తుంటారు. ఉదాహరణకు ప్రతీ యేడాది మే మొదటి శుక్రవారం (ఈ యేడాది మే 2) 'ఇంటర్నేషనల్ ఫీమేల్ రైడ్ డే' సందర్భంగా హైదరాబాద్‌లోని 'బైకర్నీ' సభ్యులంతా ఒక చోట చేరి లాంగ్ డ్రైవ్‌కు వెళ్తుంటారు. ఈ గ్రూప్‌కు వివిధ ఎంఎన్‌సీలలో పనిచేస్తున్న జై భారతి, ప్రసన్న దమ్ములు నేతృత్వం వహిస్తుంటారు. ''అమ్మాయిలకు బైక్ రైడింగ్ పట్ల ఆసక్తిని పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. అందుకే బైకులు నడిపే వారందర్నీ 'బైకర్నీ' ఒకచోటకు చేర్చుతోంది. అమ్మాయిలు ధైర్యంగా ముందుకు వచ్చేందుకు మేము బైకుల మీద చేస్తున్న ఈ లాంగ్ జర్నీలు చాలా ఉపయోగపడతాయి. బైకుల మీద లడాఖ్ వెళ్లాలనే కోరిక ప్రతీ బైకర్‌కు ఉంటుంది. మేము కూడా అలాంటి ప్రయత్నాల్లో ఉన్నాం'' అని జై భారతి అన్నారు. వీరిలో కొందరు యమహా, హీరో హోండా వంటి బైకులు నడుపుతుండగా మరికొందరు ఎన్‌ఫీల్డ్, హార్లీ డేవిడ్‌సన్ వంటి భారీ బైకులను కూడా డ్రైవ్ చేస్తున్నారు. ''భారీ బైకులకు రోడ్డు మీద గ్రిప్ బాగుంటుంది. అందుకే వాటి మీద వెళ్లడం ఎప్పుడైనా సేఫ్‌గా ఫీలవుతా'' అని ఒక ఫీమేల్ బైకర్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.


స్మిత జాదవ్


నికీ రాయ్


ప్రసన్న దమ్ము

పుణే, బెంగళూరులలోని 'బైకర్నీ' అసోసియేషన్‌లు కూడా తరచూ విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉంటాయి. ఆయా ప్రాంతాల బైకర్నీ సభ్యులు ప్రతీ నెలా ఏదో ఒక టూరు గానీ, ఇంటర్ సిటీ ట్రిప్‌గానీ ఆర్గనైజ్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఉదాహరణకు నగరాలకు దగ్గరగా ఉన్న లోనావాలా, మహాబలేశ్వరం, అనంతగిరి హిల్స్ వంటి కొండ ప్రాంతాలకు బైకుల మీద వెళ్తొస్తుంటారు. ప్రతీ యేడాది ఒకచోట కలుసుకుని బైక్ రైడింగ్‌లో తమ అనుభవాలను పంచుకుంటూ, మరింత



హైదరాబాద్ బైకర్నీలు



మందిని ఆకర్షించే ప్రయత్నాలు చేస్తుంటారు. ఈ అసోసియేషన్‌లో కేవలం కాలేజీ అమ్మాయిలే కాదు... వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగినులు, గృహిణులు కూడా ఉండటం విశేషం. ''బైక్ రైడింగ్ అనేది 'బాయ్‌థింగ్' ఎంత మాత్రం కాదు. బైక్ నడపడంలో నాకు ఎనలేని సంతృప్తి లభిస్తుంది. బైకులంటే అమ్మాయిలు భయపడాల్సిందేమీ లేదు. వాటి పట్ల ఆసక్తి, నైపుణ్యం ఉంటే చాలు అబ్బాయిలకన్నా మెరుగ్గా అమ్మాయిలు బైకులు నడపొచ్చు'' అని ఊర్వశి పటోల్ అన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 500 వంటి భారీ బైకును ఆమె చాలా సులువుగా నడుపుతుంది.

## ఆసక్తి రేపుతున్న 'ఆర్ ఇ' గాళ్స్...

ముంబాయిలో కొంతమంది విమెన్ బైక్ రైడర్స్ ఒక జట్టుగా ఏర్పడ్డారు. వారంతా రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను నడపడం విశేషం. అందుకే ఆ గ్రూప్‌కు 'ఆర్ ఇ గాళ్స్' అని పేరొచ్చింది. ఈ గ్రూపులో ఐటి ప్రొఫెషనల్స్‌తో పాటు, పోలీస్ ఫోర్స్‌కు చెందిన మహిళలు, డాక్టర్లు, యాక్టర్లు, చెఫ్‌లు కూడా ఉన్నారు. మహిళలు, పిల్లలకు సంబంధించిన సామాజిక అంశాలను హైలైట్ చేస్తూ 'ఆర్ ఇ గాళ్స్' పలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. 'ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ డే', 'చైల్డ్ రైట్స్ అండ్ యు' వంటి కార్యక్రమాల కోసం వాళ్ళు మోటార్ సైకిల్ ట్రిప్స్ వేశారు. ఈ గ్రూపులో ఉండే 11 మంది సభ్యులు కలిసి ఆ మధ్య ఒక రికార్డు సృష్టించారు. ప్రపంచంలోనే ఎత్తయిన మోటార్ సైకిల్ మార్గంగా పేరొందిన ఖర్దుంగ్-లాకు ధైర్యంగా చేరుకుని తమ సత్తా చాటారు. ప్రపంచంలోనే ఈ మార్గం గుండా బైకుల మీద వెళ్లిన పెద్ద మహిళా గ్రూపు వీరిదే. 'క్వీన్స్ ఆఫ్ ది రోడ్స్'గా పేరొందిన ఈ బృందానికి డాక్టర్ అపర్ణ బండోద్కర్ అనే దంత వైద్యురాలు నేతృత్వం వహిస్తున్నారు. చిన్నతనంలో తండ్రితో కలిసి బైకు మీద వెళ్లినప్పటి నుంచే ఆమెకు వాటిపట్ల ఆసక్తి పెరిగిందట. అయితే మన దేశంలో అమ్మాయిలు బైకు దగ్గరికి వెళ్లగానే అమ్మో పడిపోతావు అని భయపెడుతుంటారు. అలాగే అపర్ణను కూడా అందరూ భయపెట్టారు. ''అమ్మాయిలకు కిక్ కొట్టేంత శక్తి ఉండదని, బైక్ స్టాండ్ వేయలేరని, మగవాళ్ల సాయం తప్పక తీసుకోవాలని చిన్నప్పటి నుంచి వినీవినీ విసిగెత్తాను. అందుకే అమ్మాయిలు ఏదైనా చేయగలరు అని నిరూపించేందుకే నేను బైక్ డ్రైవింగ్ నేర్చుకున్నాను. ఇప్పుడు రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి భారీ వాహనాన్ని అవలీలగా నడుపుతుంటే నన్ను చూసి చాలామంది అమ్మాయిలు ధైర్యం తెచ్చుకున్నారు'' అని డాక్టర్ అపర్ణ చెప్పారు. ఇప్పటికీ వివిధ కార్యక్రమాలకు సపోర్టుగా జరిగే రోడ్ షోలలో ఆమె తరచూ తన బైక్‌తో పాల్గొంటూ ఉంటుంది.

## స్ఫూర్తినిచ్చిన తారలు...

సినిమాల్లో ఎప్పుడు చూసినా హీరోలే రకరకాల బైకుల మీద విన్యాసాలు చేస్తుంటారు. నాజూగ్గా కనిపించే హీరోయిన్లకు టూవీలర్లే శరణ్యం. అయితే ఆ మధ్య మహిళా దర్శకురాలు జోయా అక్తర్ తీసిన 'జిందగీ నా మిలేగీ దుబారా'లో కత్రినాకైఫ్ ఒక సన్నివేశంలో హీరోను కలుసుకునేందుకు తలపై హెల్మెట్ ధరించి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకు మీద ఫాలో అవ్వడం అబ్బాయిలనే కాదు అమ్మాయిలను కూడా విపరీతంగా ఆకట్టుకుంది. ఆ సినిమా ప్రచారంలో భాగంగా ముంబాయి రోడ్ల మీద హృతిక్‌రోషన్‌ను ఎక్కించుకుని కత్రినా బైక్ రైడ్ చేయడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. అలాగే 'సన్నాఫ్ సర్దార్' సినిమాలో సోనాక్షి సిన్హా కూడా బైక్ రైడింగ్ చేసింది. మరో నటి గుల్ పనాగ్‌కు నిజజీవితంలో కూడా బైక్ రైడింగ్ అంటే చాలా ఇష్టం. ఆమె బైక్ రైడింగ్‌లో రికార్డులు సృష్టించిన శీతల్ బిడాయేతో కలిసి ఎన్‌ఫీల్డ్ మీద ఢిల్లీలో చక్కర్లు కొట్టడం టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. ''టీనేజీలోనే నా కజిన్ సిస్టర్స్ మోటార్ బైకుల మీద చండీగఢ్‌లోని కాలేజీకి వెళ్లి వస్తుండేవారు. ఆ తర్వాత నా కజిన్ ఒకరికి ఆర్మీలో ఉద్యోగం దొరికి



పుణె బైకర్నీలు





వెళ్లిపోవడంతో అతడి బైకు గ్యారేజీలో ఖాళీగా కనిపించింది. దాని బ్యాటరీ డౌన్ కాకుండా ఉండాలంటే అప్పుడప్పుడు కిక్ కొట్టి స్టార్ట్ చేయమనేవారు. ఆ విధంగా నెమ్మది నెమ్మదిగా అక్కడే బైక్ నేర్చుకుని ఒకరోజు ధైర్యంగా రోడ్డెక్కాను. ఆ తర్వాత పాటియాలాలోని కాలేజీకి దానిపైనే వెళ్లాలని డిసైడ్ అయ్యాను'' అని పనాగ్ అన్నారు. గేర్లను చక్కగా వేయగల సామర్థ్యం తనకుందని, తన భర్త (రిషీ అట్టారీ)కు బిఎం డబ్ల్యూ 650 బైక్ ఉందని, లాంగ్ డ్రైవ్‌లో దాన్ని కూడా నడుపుతానని చెప్పిందామె. పనాగ్ క్రమం తప్పకుండా ఢిల్లీ నుంచి లడాఖ్‌కు ట్రిప్‌లు వేస్తూ ఉంటుంది. వాటిలో కొన్ని ట్రిప్పులు మోటార్ సైకిల్ మీద కూడా ఉన్నాయని తెలిపింది. ఈ విధంగా సెలబ్రిటీలు బైక్ రైడింగ్ చేయడం వల్ల కూడా అమ్మాయిల్లో ఉత్సాహం రెట్టింపవుతోంది. అందుకే ఈ మధ్య చాలా మంది అమ్మాయిలు బైక్ రైడింగ్ వైపు మొగ్గుచూపుతున్నారు.

### పర్వతారోహణకూ సై...

ఇటీవల కాలంలో బైకుల మీద పర్వతారోహణం చేయాలనుకుంటున్న అమ్మాయిల సంఖ్య కూడా పెరుగుతోంది. 'బైకర్నీ' అసోసియేషన్ ఇప్పటికే ఇలాంటి చాలా ట్రిప్‌లను నిర్వహించింది. అత్యంత క్లిష్టమైన ఘాట్ రోడ్ల మీద బైక్ డ్రైవ్ చేయడం వల్ల ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుందని, ఎలాంటి ప్రతికూల పరిస్థితులకైనా తట్టుకుని నిలబడగలిగే శక్తియుక్తులు తమకు ఉంటాయని నిరూపించుకునే అవకాశం వీటివల్ల కలుగుతుందని 'బైకర్నీ'లు అంటున్నారు. ముంబాయికి చెందిన శీతల్ బిడాయే 2011లో ఇసుక, గులకరాళ్లు, మంచుతో నిండి, అతి తక్కువ ఆక్సిజన్ లెవల్స్ ఉండే 18,654 అడుగుల ఎత్తయిన మార్సిమెక్ లా పర్వతం మీదకు బైక్ మీద వెళ్లి లిమ్కా బుక్ రికార్డుల్లోకి ఎక్కింది. మోటార్ సైకిల్ మీద మార్సిమెక్ లా చేరుకున్న తొలి మహిళ ఆమెనే కావడం విశేషం. ఇటీవల కొందరు అమ్మాయిలు లడాఖ్‌లోని ఖర్దుంగ్ లా పర్వతం మీదకు సాహోసపేత యాత్ర నిర్వహించి సక్సెస్ అయ్యారు. ప్రతీ యేడాది ఇలాంటి సాహసాలు చేసేందుకు చాలామంది ముందుకు వస్తున్నట్టు 'బైకర్నీ' తెలిపింది. అంతేకాదు యువకులతో పాటు బైక్ రేసింగ్‌లో పాల్గొనేందుకు కూడా కొందరు యువతులు ముందుకు వస్తున్నారు. చెన్నైకి చెందిన అలిషా అబ్దుల్లా తన హోండా సిబిఆర్ 600 సూపర్ బైక్‌తో బైక్ రేసులో పాల్గొన్న ఏకైక భారతీయురాలిగా రికార్డు సృష్టించింది.



కస్తూరి

ఇంతకాలం 'మేల్ మిషన్స్' అని పిలుచుకున్న భారీ సీసీ బైకుల పట్ల ఇప్పుడు 'ఫీమేల్స్' కూడా ఆసక్తి చూపుతుండటంతో ఆటోమొబైల్ నిపుణులు వాటికే కొత్త హంగులు చేర్చేందుకు సిద్ధం అవుతున్నారు. రోడ్డు మీద ఒక బైక్ వేగంగా దూసుకుపోతుంటే, దాన్ని డ్రైవ్ చేసేది అబ్బాయే అని ఫిక్సయిపోకండి... డేరింగ్ అండ్ డాషింగ్ అమ్మాయి కూడా కావొచ్చు. నోరెళ్ళబెట్టి చూస్తూ నిల్చోకుండా వారి ప్రయాణం అడ్డంకులు లేకుండా సాగాలని మనస్ఫూర్తిగా కోరుకోండి.

– సండే డెస్క్

మీరు చాలా సన్నగా ఉన్నారా ?
మీ శరీరాకృతిని అందంగా, ధృడంగా మార్చుకోవడానికి
ఆయుర్‌న్యూట్రిమోర్
ఉపయోగపడుతుంది

మీరు చాలా లావుగా ఉన్నారా ?
మీ అధిక బరువుకు సత్వర పరిష్కారము
గార్సినీయా క్యాప్సూల్
(ఇది గార్సినీయా ఫ్రూట్ నుండి తయారు చేయబడినది
మీ శరీరంలోని అధిక కొవ్వును తొలగించడానికి


నాజూకైన శరీరాకృతిని తిరిగి పొందడానికి ఉపయోగపడుతుంది.

ఛాతి పెరుగుదలకు
SHAPEUP BRUST CREAM
ఉపయోగపడుతుంది (Only for Ladies)


మీరు హైట్ పెరగాలనుకుంటున్నారా
గ్రోటాల్ ప్లస్
ఉపయోగపడుతుంది

• No Side Effects • 100% Ayurvedic
Call : 9550460123
AYURGEN HERBALS
An ISO 9001:2008 Certified Company
# 5-9-285-14, Prasanthi Nagar, Kukatpally, Hyderabad-500072
www.ayurgenherbals.com

సెటైర్

# ఎలుకలూ.. ఎన్నికలూ

**ఆనందరావుకి అమెరికా సముద్రతీర ప్రాంతంలో ఉన్న ఊళ్లో ఉద్యోగం దొరికింది. ఒక శనివారం ఉదయం షాపింగ్‌కి వెళ్లాడు. క్యూరియో షాపు కనిపించింది. లోపలికెళ్లాడు.**

అక్కడ చాలా వస్తువులు కనిపించాయి. వాటికి కట్టి ఉన్న అట్టముక్కల మీద ఉన్న ఖరీదు చూస్తే ... అన్నీ వందడాలర్ల పైమాటే. ఒకే ఒక బొమ్మ మాత్రం కంచుతో చేసిన ఎలుక బొమ్మ. చాలా అద్భుతంగా ఉంది. కానీ దాని మీద ఖరీదు లేదు. దాన్ని చేతిలో ఉంచుకుని ఆ షాపు ఓనర్ కేబిన్‌లోకి వెళ్లాడు. తలుపు మీద ఉన్న నేమ్ బోర్డుని చూసుకుంటూ –

''రాబర్ట్ గారూ, నాకు ఇది బాగా నచ్చింది. ఖరీదెంతో చెప్పండి. తీసుకుంటాను'' చెప్పాడు.

''ఆ ఎలుక బొమ్మ ప్రత్యేక శక్తులున్న బొమ్మ. నేను చేసిందే. ఖరీదు పది డాలర్లే. కాకపోతే దీంతో బాటు నేను రాసిన ఒక కథ మీరు తీసుకోవాలి. వంద డాలర్లు. వెరసి నూటపది'' చెప్పాడు రాబర్ట్.

కథకీ, ఎలక్కీ ఉన్న సంబంధం ఏమిటో ఆనందరావుకి బొత్తిగా అర్థం కాలేదు. సరే, దాందేముంది అనుకుని నూటపది డాలర్లు రాబర్ట్‌కి ఇచ్చి 'కథని రెండు రోజుల తర్వాత వచ్చి తీసుకుంటాన'ని చెప్పి గుమ్మం వైపు నడిచాడు.

రెండు మూడు అడుగులు వేయగానే ఒక సందేహం వచ్చి మళ్లీ రాబర్ట్ కేబిన్‌లోకి వెళ్లాడు.

''సార్, ఒక ముఖ్య విషయం మర్చిపోయాను. ఈ బొమ్మకి ప్రత్యేక శక్తులు ఉన్నాయన్నారే ... ఆ వివరాలు మీరు చెప్పనేలేదు'' అడిగాడు ఆనందరావు.

''ఇంటికెళ్లే లోపు మీకే తెలుస్తుంది'' నవ్వుతూ చెప్పాడు రాబర్ట్.

''అంటే, మీరు చెప్పరా?''



''చెప్పడానికి నాకే అభ్యంతరం లేదనుకోండి. అయినా మీరే తెలుసుకుంటే బాగుంటుందని నేను చెప్పడం లేదు. అప్పటికీ మీకు తెలీకపోతే ... కథని తీసుకోవడానికి వస్తారు కదా. అప్పుడు చెప్తాను లెండి'' అన్నాడు.

'నీ సస్పెన్స్‌ని గంగలో తొయ్యా' అని మనసులో అనుకుంటూ తలాడించి చేతిలో ఉన్న ఎలుక బొమ్మని జాగ్రత్తగా పట్టుకుని షాపు బయటికి నడిచాడు.

వీధి చివరికి వచ్చేసరికి ... అందరూ తన వేపే చూస్తూండడం గమనించాడు. ఏమై ఉంటుందా అని కాస్త ఆగి .. వెనక్కి తిరిగి చూశాడు.

తన వెనక ఒక యాభై ఎలకలు ఉన్నాయి. భయంవేసింది. కనిపించిన వీధిలోకి పరిగెత్తసాగాడు. ఎంతసేపు పరుగెత్తాడో తెలియలేదు.

ఒక అరగంట తర్వాత ఊపిరి పీల్చుకోవడానికి ఆగి వెనక్కి చూశాడు. గుండె ఆగిపోయింది. లెక్కకందని ఎలుకలు కనిపించాయి. దాదాపు మైలు పైమాటే. రోడ్డంతా ఎలుకల మయమే. తన వైపే చూస్తున్నాయి. చుట్టుపక్కల చూశాడు. సముద్రం కనిపించింది.

తీరం వైపు పరుగెత్తసాగాడు. దాదాపు అరవై నిమిషాలు పరుగెత్తాక తీరం చేరుకున్నాడు.

ఒడ్డున నిలుచుని తన శక్తి మొత్తం కూడగట్టుకుని చేతిలో ఉన్న బొమ్మని సముద్రంలోకి విసిరేసి కళ్లు మూసుకుని బోర్లా పడుకున్నాడు.

ఎలుకలన్నీ ఆ బొమ్మ వైపు వేగంగా పరుగెట్టుకుంటూ వెళ్లి సముద్రంలో పడిపోయాయి. తన మీదుగా ఎలుకలు పరుగెడుతున్నంత సేపూ ..

హారిసన్ ఫోర్డ్ నటించిన రైడర్స్ ఆఫ్ ది లాస్ట్ ఆర్క్, ఇండియానా జోన్స్ సినిమాల్లోనీ .. గ్రెగరీపెక్ నటించిన మెకనాస్ గోల్డ్ సినిమాల్లోనీ ... క్లయిమాక్స్ సీన్లూ, బ్యాగ్రౌండ్ మ్యూజిక్కూ కళ్లముందు నిలిచాయి.

అరగంట తర్వాత భయంకర నిశ్శబ్దం. సముద్రపు అలల శబ్దాలు తప్ప వేరే శబ్దాలు ఆనందరావు చెవలకు వినబడలేదు. నడుచుకుంటూ ఎదురుగా ఉన్న స్టార్‌బక్స్ హోటల్‌కి వెళ్లి కూర్చున్నాడు. దడ ఇంకా తగ్గలేదు. లేచి కౌంటర్ దగ్గరికి వెళ్లి ఒక కాఫీ తీసుకున్నాడు. మూలనున్న టేబుల్ దగ్గరకెళ్లి పాలూ, చక్కెరా వేసుకుని తన సీట్‌కి వచ్చి కూర్చున్నాడు. ఒక సిప్ తాగగానే ... స్వర్గం ఎక్కడో లేదు, ఇక్కడే ఉందనిపించింది.

మనసు కాస్త కుదుటబడ్డాక ఏం జరిగిందని ఆలోచించాడు. మొత్తం సినారియో సమగ్రంగా బోధపడింది.

గబుక్కున ఒక ఆలోచన వచ్చింది. వెంటనే తన జేబులోంచి ఐఫోన్ తీసి తన బ్యాంక్‌లో ఎంత ఉందని చూశాడు. పదివేల డాలర్లు ఉన్నాయి. అమ్మయ్య అనుకుని నీళ్లలో .. అందులో ఉప్పు నీళ్లలో తడిసినా ఇంకా పన్జేస్తూండే ఆపిల్ వాడి పనితనాన్ని మెచ్చుకుంటూ .. జేబులో పడేసుకున్నాడు.

బైటకొచ్చి క్యూరియోషాపుకి క్యాబ్‌లో వెళ్లాడు.

ఆనందరావుని చూడగానే రాబర్ట్ బయటికొచ్చి సాదరంగా లోపలికి ఆహ్వానించాడు.

''రాబర్ట్‌గారూ, మీరు తయారుచేసిన బొమ్మ శక్తి నాకు బాగా అర్థమైంది. నచ్చింది కూడాను. కానీ ఒక సందేహం. ఈ శక్తులతో ఏ బొమ్మనైనా చేయగలరా?'' అడిగాడు ఆనందరావు.

''ఎనిమిది గంటల టైమ్ చాలు. కాకపోతే రెఫరెన్స్‌కి బొమ్మలు మీరే ఇవ్వాలి'' చెప్పాడు.

తర్వాతి ఐదు నిమిషాల్లో ఆనందరావు ఆర్డర్ కన్‌ఫర్మ్ చేయడమూ, రాబర్ట్ అకౌంట్ తాలూకు నంబర్ తీసుకుని అతను అడిగినంత అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేయడమూ ... మర్రోజు సాయంత్రం వైజాగ్ వెళ్లే ఫ్లయిట్‌కి కన్‌ఫర్మ్ చేసుకోవడమూ ... శరవేగంతో జరిగిపోయాయి.

రాబర్ట్ తన కంప్యూటర్ ముందునించి లేచి నుంచుని ''డబ్బు వచ్చేసింది. బొమ్మ ఇస్తారా? పని ప్రారంభించాలి'' అడిగాడు.

తన లాప్‌టాప్ వైపు చూస్తూ పనిచేస్తున్న ఆనందరావు తల తిప్పకుండా ''ఆ పని మీదే ఉన్నాను. ఇంకో రెండు నిమిషాల్లో మీకో మెయిల్ వస్తుంది. దాంతోబాటు ఉన్న ఎటాచ్‌మెంట్‌ని చూసుకోండి'' అన్నాడు.

కాసేపయ్యాక ''మెయిల్ వచ్చేసింది. ఎటాచ్‌మెంట్ కూడా వచ్చింది. ఇంకో ఐదు నిమిషాల్లో నా పని ప్రారంభిస్తాను. అది సరే గానీ ఆనందరావుగారూ .. నాకనవసరం అనుకోండి. అయినా ఆరాటం చంపుకోలేక అడుగుతున్నాను. ఎవరీ ఫోటోలో ఉన్న మనిషి?'' అడిగాడు రాబర్ట్.

''ఇండియాలోని ఒక రాజకీయనాయకుడు'' చెప్పాడు ఆనందరావు.

– శీనా, 097890 58199



**తండ్రి సంగీతకారుడు... ఇంట్లో ఎటు చూసినా సంగీత పరికరాలు... ఆ ప్రాంతంలో ఎప్పుడు చూసినా ఉత్సవ వాతావరణాన్ని తలపించే కెనెడియన్ సంస్కృతి... ఒక చిన్నారి సంగీతం పట్ల ఆకర్షితురాలు కావడానికి అంత కన్నా ఏం కావాలి? అందుకే నాలుగేళ్ల పసి వయసులోనే స్టేజీ మీద పాటలు పాడటం మొదలెట్టింది జోనితా గాంధీ. పాటతో పాటే ఎదుగుతూ, లైవ్ షోలలో పాటలు పాడుతూ ప్రపంచం మొత్తం తిరిగింది. వన్ ఫైన్ డే ఆమె పాట ఎ.ఆర్.రెహమాన్ చెవిన పడింది. టాలెంట్‌ను ఇట్టే పసిగట్టే ఆ సంగీత మాంత్రికుడు తొలుత 'హైవే'లో అవకాశమిచ్చి, జోనిట గళాన్ని ఆకాశానికెత్తాడు. ఆయన సంగీత దర్శకత్వంలోనే రజనీకాంత్ తాజాచిత్రం 'కొచ్చడియాన్'లో కూడా పాటలు పాడిన 24 ఏళ్ల జోనిట, రెహమాన్ 'రౌనక్' ఆల్బమ్‌తో పాపులర్ గాయనిగా మారింది.**

సెలబ్రిటీ

**జోనిట గాంధీ**



# రెహమాన్ మెచ్చిన గళం!

ఇండో కెనెడియన్ సంతతికి చెందిన జోనిట గాంధీ పుట్టింది ఢిల్లీలోనైనా పెరిగింది మాత్రం కెనడాలోని టొరొంటోలో. చిన్నప్పటి నుంచే ఇంట్లో పాటలు పాడటం, డాన్సులు చేయడాన్ని ఆమె తల్లిదండ్రులు ప్రోత్సహించేవారు. ఎలక్ట్రానిక్స్‌లో ఇంజనీర్ అయిన జోనిట తండ్రికి సంగీతం హాబీ. ఆమె టాలెంట్‌ను గుర్తించిన తండ్రి తనతో పాటు సంగీత కార్యక్రమాలకు తీసుకెళ్లి పాటలు పాడించేవాడు. ఆ విధంగా చిన్నతనం నుంచే జోనిటాకు స్టేజీపై పాటలు పాడటం అలవాటయ్యింది. హెల్త్‌సైన్స్‌లో డిగ్రీ చేసినప్పటికీ పాటల పల్లకీలోనే ఊరేగింది. సెలవుల్లో ఇండియాకు వచ్చినప్పుడు హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో కూడా శిక్షణ పొందింది. స్టేజీమీద పాడిన పాటలను, సొంతంగా పాడిన పాటలను ఎప్పటికప్పుడు యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం జోనిటకు హాబీ. యూనివర్శిటీలో చదువుతున్నప్పుడే సోనునిగమ్, కైలాష్‌ఖేర్ తదితరులు టొరొంటోలో నిర్వహించిన సంగీత కార్యక్రమాల్లో పాల్గొని ప్రశంసలు అందుకున్న జోనిట తన మిత్రత్రయం (సాహిల్ ఖాన్, ఆకాష్ గాంధీ)తో కలిసి రూపొందించిన 'పానీ ద రంగ్'ను ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్‌లో సుమారు 30 లక్షల మంది వీక్షించారు. ఆ ఆల్బమ్ ఆమెకు బాలీవుడ్‌లో ఎంట్రీకి అవకాశం కల్పించింది.

షారుక్ బ్లాక్ బస్టర్ 'చెన్నై ఎక్స్‌ప్రెస్'లో టైటిల్ సాంగ్‌ను అద్భుతంగా పాడి బాలీవుడ్‌లో బోణీ కొట్టిన వెంటనే ఆమె రెహమాన్ దృష్టినాకర్షించింది. అప్పటికే ఆమె పాటలను యూట్యూబ్‌లో చూసి ఫిదా అయిన రెహమాన్ ఆమెకు 'హైవే'లో 'కహా హూ మై' పాటను పాడే అవకాశమిచ్చాడు. ఫ్రెష్‌గా వినిపించే జోనిట గళం రెహమాన్‌ను అమితంగా ఆకట్టుకుంది. అందుకే ఆయన తన ఇంటర్వ్యూలలో సైతం జోనిటాను ఆకాశానికెత్తేశాడు. ''రెహమాన్ సార్ నాపై ప్రశంసల జల్లు కురిపించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఆయనతో కలిసి పని చేయాలనే నా కల అంత త్వరగా సాకారమవుతుందని నేను ఊహించలేదు. ఒక క్రిస్మస్ వేడుకలో నేను పాడిన 'సైలెంట్ నైట్' అనే వీడియో సాంగ్‌ను రెహమాన్ సార్ యూట్యూబ్‌లో చూసి నాకు అవకాశం ఇచ్చారట. ఈ రోజుల్లో టాలెంట్ ఉన్న ప్రతీ ఒక్కరికి యూట్యూబ్ ఒక చక్కని ప్లాట్‌ఫామ్‌గా మారింది. మనలో సృజనాత్మకత, టాలెంట్ ఉంటే తప్పకుండా గొప్పోళ్ల దృష్టిని దీని ద్వారా ఆకట్టుకోవచ్చు'' అంటోంది జోనిట.

సూఫీ, పాప్, సాఫ్ట్ రాక్, వెస్ట్రన్ క్లాసిక్, బాలీవుడ్ స్టయిల్స్‌ను అద్భుతంగా ఆలపించే జోనిట గళ మాధుర్యానికి ఎవరైనా సరే ఇట్టే ఆకర్షితులవుతారు. సోను నిగమ్, సునిధి చౌహాన్ వంటి సీనియర్లతో ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అనేక లైవ్‌షోలు ఇచ్చిన జోనిట 'కొచ్చడియాన్' తర్వాత మరింత బిజీ అవుతుందంటున్నారు బాలీవుడ్ జనాలు. 'కెరీర్ ప్రారంభంలోనే షారుక్ ఖాన్, రజనీకాంత్ వంటి సూపర్‌స్టార్ల సినిమాలకు పాటలు పాడటం ద్వారా నాకు బోనస్ లభించి ఉండొచ్చుగానీ నా వరకు నాకు పదికాలాల పాటు నిలిచిపోయే పాటలు పాడాలని, అందుకోసం మరింత కష్టపడాలని అనుకుంటున్నాను'' అంటున్న జోనిట కొత్త పాటల కోసం బాలీవుడే కాదు... యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.





రెహమాన్, ఇంతియాజ్ అలీలతో ...

11 – 17 మే 2014

# అనుగ్రహం

డాక్టర్ పి.ఎ.రామన్



**మేషం:** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఆసక్తికరమైన విషయాలపై దృష్టి సారిస్తారు. పనులు అనుకున్న విధంగా సాగవు. ఆకస్మిక ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి. సంప్రదింపులు, వ్యవహారాల్లో ఏకాగ్రత వహించండి. మీ ఇష్టాయిష్టాలను కచ్చితంగా తెలియజేయండి. ఆది, బుధవారాల్లో తొందరపాటు వల్ల నష్టపోయే ఆస్కారం ఉంది. విలువైన వస్తువులు, నగదు జాగ్రత్త. ఉమ్మడి వెంచర్లు, ఏజెన్సీలు, టెండర్లకు అనుకూలం. ఆరోగ్యం నిలకడగా ఉంటుంది.



**వృషభం:** కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఓర్పు, పట్టుదలతో అనుకున్నది సాధిస్తారు. మీ మాటకు మంచి స్పందన లభిస్తుంది. ఆదాయ వ్యయాలు ఫర్వాలేదనిపిస్తాయి. బంధువులు మీ నుంచి ధన సహాయం అర్థిస్తారు. కొంత మొత్తం సాయం చేసి వారిని సంతృప్తిపరచండి. పనులు అస్తవ్యస్తంగా సాగుతాయి. ఆసక్తికరమైన విషయాలు గ్రహిస్తారు. మంగళ, శనివారాల్లో ఒక సంఘటన మీపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వ్యాపారాల్లో నష్టాలు, ఆటంకాలను అధిగమిస్తారు.



**మిథునం:** మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

సన్నిహితులకిచ్చిన మాట నిలబెట్టుకుంటారు. ఆర్థిక, కుటుంబ సమస్యలు కొలిక్కి వస్తాయి. ముఖ్యమైన వ్యక్తులను కలుసుకుంటారు. మీ అంచనాలు ఫలిస్తాయి. ఖర్చులు అధికం. అవసరాలకు ధనం సర్దుబాటవుతుంది. శుభకార్యానికి యత్నాలు సాగిస్తారు. గురు, శుక్రవారాల్లో మీ శ్రీమతి వైఖరి అసహనం కలిగిస్తుంది. ఉద్యోగ బాధ్యతల్లో ఏకాగ్రత వహించండి.



**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

బాధ్యతలు పెరుగుతాయి. సంఘంలో గౌరవం లభిస్తుంది. ఆసక్తికరమైన విషయాలపై దృష్టి సారిస్తారు. ప్రత్యర్థులతో జాగ్రత్త. పొగడ్తలు, మొహమాటాలకు దూరంగా ఉండాలి. మీ శ్రీమతి వైఖరి అసహనం కలిగిస్తుంది. విలువైన వస్తువులు, నగదు జాగ్రత్త. వ్యవహారాలు స్వయంగా చూసుకోవాలి. ఇతరుల విషయాల్లో జోక్యం తగదు. ఆదాయాభివృద్ధి పొందుతారు.



**సింహం:** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆర్థిక లావాదేవీలు, వ్యాపారాలను సమర్థంగా నిర్వహిస్తారు. రావలసిన ఆదాయం అందుతుంది. ఖర్చులు అంచనాలను మించుతాయి. ఇతరుల విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి తగదు. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండాలి. కీలక పదవుల కోసం యత్నాలు సాగిస్తారు. ఉద్యోగస్తులకు శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. మీ బలహీనతలు, అలవాట్లు అదుపులో ఉంచుకోవాలి. ఆకస్మిక ప్రయాణం చేయాల్సి వస్తుంది.



**కన్య:** ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1, 2 పాదాలు

పొదుపు పథకాలు, దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలిస్తాయి. వ్యవహారాల్లో సముచిత నిర్ణయాలు తీసుకుంటారు. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలేర్పడతాయి. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. స్థిరాస్తి కొనుగోలు యత్నం ఫలిస్తుంది. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. అనవసర విషయాలకు దూరంగా ఉండాలి. చేపట్టిన పనుల్లో ఆటంకాలు, చికాకులు ఎదుర్కొంటారు.



**తుల:** చిత్త 3,4; స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కష్టానికి ప్రతిఫలం దక్కుతుంది. ఆదాయానికి తగ్గట్టుగా ఖర్చులుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. సంప్రదింపులు, ఒప్పందాలు కొలిక్కి వస్తాయి. ఆది, సోమవారాల్లో ముఖ్యమైన పనులు స్వయంగా చూసుకోవాలి. సంతానం ఉన్నత చదువులపై దృష్టి సారిస్తారు. బంధువులు, అయినవారితో అభిప్రాయభేదాలు తలెత్తే సూచనలున్నాయి. వ్యాపారాలు ఆశించిన పురోభివృద్ధి సాధిస్తారు. పరిచయం లేని వ్యక్తులతో జాగ్రత్త.



**వృశ్చికం:** విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

దీర్ఘకాలిక సమస్యలు, చికాకుల నుంచి బయటపడతారు. ఖర్చులు ప్రయోజనకరం. ఆలోచనలు కార్యరూపం దాల్చుతాయి. ఆసక్తికరమైన విషయాలు గ్రహిస్తారు. ఒక సమాచారం సంతోషం కలిగిస్తుంది. మంగళ, బుధవారాల్లో పనులు అనుకున్న విధంగా సాగవు. మీ శ్రీమతి సలహా పాటించండి. విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారు. వ్యాపార, ఆర్థిక విషయాలు గోప్యంగా ఉంచండి. భాగస్వామిక సమావేశాలు వాయిదాపడతాయి.



**ధనస్సు:** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

సంతోషకరమైన వార్తలు వింటారు. ఒక వ్యవహారంలో ధనం అందుతుంది. పొదుపు పథకాలపై దృష్టి సారిస్తారు. పెద్ద మొత్తం ధన సహాయం తగదు. గురు, శుక్రవారాల్లో అలవాటు లేని పనులకు దూరంగా ఉండాలి. ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. కీలకమైన పత్రాలు అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలు స్వయంగా చూసుకోవాలి.



**మకరం:** ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొత్త విషయాలపై దృష్టి సారిస్తారు. పరిచయాలు, వ్యాపకాలు పెంపొందుతాయి. పట్టుదలతో యత్నాలు సాగిస్తారు. మీ ఊహలు, అంచనాలు ఫలిస్తాయి. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. శనివారం పనులు హడావుడిగా సాగుతాయి. పెద్దమొత్తం ధనం డ్రా చేసే విషయంలో జాగ్రత్త. బంధుమిత్రుల ద్వారా కొత్త విషయాలు గ్రహిస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగ ప్రాప్తి.



**కుంభం:** ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

కొత్త యత్నాలకు శ్రీకారం చుడతారు. అప్రయత్నంగా అవకాశాలు కలిసివస్తాయి. మీ మాటకు మంచి స్పందన లభిస్తుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. దుబారా ఖర్చులు తగ్గించుకుంటారు. సన్నిహితుల ద్వారా ఆసక్తికరమైన విషయాలు గ్రహిస్తారు. వ్యవహార ఒప్పందాలు కొలిక్కి వస్తాయి. కళత్ర ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. ఉమ్మడి వెంచర్లు, టెండర్లకు అనుకూలం. గృహ మార్పు యత్నం ఫలిస్తుంది.



**మీనం:** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఆర్థికంగా బాగుంటుంది. రోజువారి ఖర్చులే ఉంటాయి. రుణాలు తీర్చి తాకట్టు విడిపించుకుంటారు. యత్నాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఇతరుల మేలు కోరి చేసిన మీ వాక్కు ఫలిస్తుంది. మంగళ, బుధ వారాల్లో పనులు, వ్యవహారాలు స్వయంగా చూసుకోవాలి. దంపతుల మధ్య ఆసక్తికరమైన విషయాలు చర్చకు వస్తాయి. వ్యవహార ఒప్పందాల్లో తొందరపాటు తగదు. ఉద్యోగస్తులకు ఒత్తిడి, పనిభారం అధికం.

# అంకెలతో అదృష్టం

**ఐ.బి. సాహు**
సెల్ : 95810 94208, 90142 48124

పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీకాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియనితనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు........................
2. పుట్టిన తేదీ ...........
(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)
3. పుట్టిన సమయం .........
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు ...........
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అంకెలతో అదృష్టం**

ఆంధ్రజ్యోతి దినపత్రిక,
ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్ – 500 033.

**ఎస్.ఎమ్.ఎస్., తిరుచ్చి**

సంఖ్యలను ఏ పద్ధతిలో చూసుకుంటే మంచిది. ఏ పద్ధతిలో పవర్‌ఫుల్‌గా ఉంటుంది? పేరు ఏ పద్ధతిలో బావుంటుంది. కొంచెం అవగాహన ఉంది నాకు. నా పేరు ఎలా ఉంటే నేను అభివృద్ధి సాధిస్తాను?

పేరు ఏ పద్ధతిలో మార్చుకున్నా పేరులో లీనియర్ గ్రాఫ్ అనుసరణ ద్వారానే అన్వయించబడుతుంది. 'స' లో Sa కానివ్వండి, 'న' లో Na కానివ్వండి అక్షరం సూచింపబడేది అంకె ద్వారానే. అక్షరం రకరకాల భాషల్లో రూపాంతరం చెందుతూ ఉంటుంది. కాని సంఖ్యలు రూపాంతరం చెందవు. 27 ఏ భాషలోనైనా 27 మాత్రమే. లిపిగా మారినపుడు భాషాపరంగా మార్పే తప్ప సంఖ్యలు మారవు. మార్పు చెందవు. చాల్డీన్ పద్ధతిలో 32 అర్థం బాగోలేదు. పైథాగరస్ పద్ధతిలో 27 బాగోలేదు అనే వ్యాఖ్యలు అర్థరహితం. B అనే అక్షరం ఎన్ని సంఖ్యలను సూచిస్తుంది అనే విషయంపై రిసెర్చ్ చేయడం మానివేసి B అంటే రెండు అని సంతృప్తి పడిపోయి లెక్కేసేయడం దేనికి నిదర్శనం. పేరులోని అక్షరం విలువను కన్‌ఫ్యూజ్ చేసుకుంటూ రెండు పద్ధతుల్లోను ఒకే సంఖ్య రావాలనుకోవడం శాస్త్రపరంగా బుద్ధిహీనతే కాక మరింకేమవుతుంది.



ఒక పద్ధతిలో 13ను ఫోర్స్‌గా అభివర్ణిస్తారు. ఫోర్స్ ఏవిధంగానైనా ఉండవచ్చు. 37లో ఎస్కేపిజమ్ ఉంటుంది. 41లో వీక్ మెంటాలిటీ ఉంటుంది. మరి ఇవే సంఖ్యలు చాల్డీన్ పద్ధతిలో ఒకరకంగానూ, పైథాగరస్ పద్ధతిలో మరో రకంగాను ఉంటాయి. ఒక పేరు అమర్చడం జరిగినపుడు లీనియర్ గ్రాఫ్ నుండి తీసుకునే అన్వయం ఏ సంఖ్యకైనా ఒకేలా ఉంటుంది తప్ప వేర్వేరుగా ఉండదు.

పుట్టిన తేదీ, విధాన వైబ్రేషన్, పుట్టిన తేదీలో ఉన్న వైబ్రేషన్స్ మారవు. వైబ్రేషన్స్ మారవు కాబట్టి వాటికనుగుణంగా పేరును అమర్చడం న్యూమరాలజిస్ట్ బాధ్యత. టి.వి.లో క్రైమ్ సీన్స్ చూస్తున్నపుడు నేరం చేయడం ఇంత సులభమా అనిపిస్తుంది. నా దృష్టిలో సరియైన అన్వయం పేరు విషయంలో జరగనప్పుడు పేరు మార్పు కూడా క్రైమే. నేరమే. ఐదేళ్ళు డాక్టర్ కోర్సు చదివి ఆపై స్పెషలైజేషన్ చేసి ఎక్స్‌పీరియన్స్ సాధించిన ఒక వ్యక్తి చేసే సర్జరీ, పుస్తకం ద్వారా చూసి నాకు సర్జరీ తెలుసు అనే వ్యక్తి ఒక్కరే ఎలా అవుతారు? అందరికీ తెలిసిన విషయాలు కొన్ని. అవి వెరీ కామన్. తెలియని విషయాలు ప్రతిభావంతులకే తెలుస్తాయి. ఇక్కడే సక్సెస్ అడుగుపెడ్తుంది.

అతిశయోక్తి కానప్పటికీ నేను వ్రాసే టెక్నికల్ అంశాలు ఎంతోమంది కాపీ కొడ్తుంటారు. నేను ఎంతవరకు వివరిస్తానో అంతే కాపీ కొట్టగలరు. ఆపైన సాధ్యపడదు. ఉదాహరణకు డేటాఫ్ బర్త్‌లో ఎనర్జీ ఉంటుంది అనే అంశం పదేళ్ళ క్రింద వరకూ ఎవరూ మెన్షన్ చేయలేదు. ఇలా నేను వ్రాసానో లేదో ప్రతివారి నోటా డేటాఫ్‌బర్త్‌లో ఎనర్జీ ఉంటుందమ్మా. దానిని మనం మార్చలేము అనే డైలాగ్ రానే వచ్చింది. ఇప్పుడు లీనియర్ గ్రాఫ్ అన్నానే కాని దానిని వివరించలేదు. కాబట్టి మీ పేరులో లీనియర్ గ్రాఫ్ ఉందమ్మా అని ఎవరు కాపీ కొట్టినా అభ్యంతరం లేదు. శాస్త్ర అంశం పరిమితంగా చెప్పడం నాలుగు కబుర్లు చెప్పడం తప్ప సాధించేది ఏదీ లేదు.

మీ పేరు మార్చుకున్నారు. బోర్డ్ పెట్టుకున్నారు. కొద్దోగొప్పో ఫాలోయింగ్ ఉంది. ఇంకా అసంతృప్తి ఏమిటండి మీకు? అభివృద్ధి ఏ రకంగా సాధించాలని మీ ఉద్దేశ్యం. ఒక జీవితాన్ని కంట్రోల్ చేయడానికే శక్తి సరిపోదు. కొన్ని వందల జీవితాలను గమనించడానికి మీకున్న అర్హతేమిటి? మీ శక్తి స్థాయి ఏమిటి? ఏ పద్ధతిలో శక్తి సాధించగలుగుతున్నారు?

సంఖ్యాశాస్త్ర పరంగా పుట్టుకను విశ్లేషించవచ్చు. అంతే స్థాయిలో చివరి మజిలీని విశ్లేషించవచ్చు. శాస్త్రంలో ఎన్నో విషయాలు. సాధన చేయగా, చేయగా చేస్తుండగా ఒక్కో అంశం క్లిక్ అవుతూ ఉంటుంది. మేధోమథనం అద్భుతాలను ఆవిష్కరిస్తుంది. ఒక్కో పేరులో ఆటంబాంబ్ లాంటి శక్తి ఉంటుంది. ఒక్కో పేరులో ఎంతకూ మొలకరాని మట్టి తత్వం ఉంటుంది. సంఖ్యలే ఊపిరిగా శ్వాసిస్తే మిస్టీరియస్ స్వభావాలు వాటికవే అనుభవంలోకి వస్తాయి. ఎవరో చెప్తేనో, కాపీ కొడితేనో శాస్త్రం రాదు.

మీ పేరులో లెవల్స్ సామాన్య స్థాయిలో ఉన్నాయి. ఒక పేరు, ఆ పేరుగల వ్యక్తి పబ్లిక్‌లో వెలగాలంటే ఉండే శక్తి స్థాయికి ఒక కొలత ఉంటుంది. రజనీకాంత్ రజనీకాంతే. ఇంకే రజనీకాంత్ అయినా కనీసం జిరాక్స్ స్థాయి కూడా ఉండదు. ఇక మీరు కోరుకునే అభివృద్ధి ధనపరంగా అయితే కనుక పేరు, ఇనీషియల్ వ్రాసిన తరువాత 'సాయి' చేర్చండి. అద్భుతమైన శక్తి స్థాయి ఏర్పడుతుంది. నిలుపుకోగలిగితే మీ అదృష్టం. అభివృద్ధి 2017 జులై వరకు వీక్షించవచ్చు.

శుభమ్.

Advt

## బాటసారి



“ఒక స్థపతిగా జీర్ణావస్థలో ఉన్న ఎన్నో దేవాలయాలను పునరిద్ధరించడంలో పాలుపంచుకున్నాను. ముఖ్యంగా శ్రీశైలం ప్రాజెక్టు నిర్మించినపుడు ముంపునకు గురైన అనేక దేవాలయాల జీర్ణోద్ధరణకు వెళ్లి ఆ ప్రయాణాలలో చాలా కష్టాలు పడాల్సి వచ్చింది. అదే విధంగా పురావస్తు శాఖలో పనిచేస్తున్నప్పుడు మహబూబ్‌నగర్ జిల్లాలోని సేతుపల్లికి వెళ్లి అక్కడ శతాబ్దాల నాటి సమాధులను తవ్వుతున్నప్పుడు అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. చరిత్రను తవ్వి బయటకు తీసేందుకు చేసిన ఈ ప్రయాణాలన్నీ కష్టంతో కూడుకున్నవే అయినా సంతృప్తినిచ్చాయి” అని చెప్పారు పురావస్తు పరిశోధకుడు, స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌కు డైరెక్టర్ అయిన ఇ. శివనాగిరెడ్డి. తవ్వకాల ద్వారా ఎంతో చరిత్రను బయటకు తీయడమేగాక వాటిని గ్రంథస్థం కూడా చేశారు. “నా ప్రయాణాలన్నీ చరిత్ర చుట్టే తిరిగాయి. గత యేడాది బౌద్ధాన్ని, బౌద్ధారామాలను అధ్యయనం చేసేందుకు శ్రీలంకకు వెళ్లడం కూడా అమితమైన ఆనందాన్నిచ్చింది” అంటున్న శివనాగిరెడ్డే ఈ వారం మన ‘బాటసారి’.

# ‘చరిత్ర’ను తవ్వే దారుల్లో...

చిన్నప్పుడు పెద్ద చదువులు చదువుకునే స్థోమత లేక మా ఊళ్లో రంగాచారి అనే మాస్టారి సలహా మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడిచే శిల్పకళా కోర్సులో చేరాను. అప్పటి దాకా చరిత్ర మీద నాకు పెద్దగా అవగాహన ఉండేది కాదు. శిల్పకళలో డిగ్రీ పూర్తి చేయగానే అదృష్టం కొద్దీ అసిస్టెంట్ స్థపతిగా ఉద్యోగం వచ్చింది. అదే సమయంలో (1978) శ్రీశైలం జలాశయంలో నీటి ముంపునకు గురైన 102 గ్రామాల్లోని సుమారు 45 దేవాలయాలను పునరిద్ధరించేందుకు గణపతి స్థపతి ఆధ్వర్యంలో 25 మందిని ఎంపిక చేశారు. ఆ బృందంలో నేను కూడా ఉన్నాను. గణపతి స్థపతి దగ్గర శిష్యరికం అనగానే నాకు ఎక్కడలేని శక్తి వచ్చింది. ప్రాజెక్టులో భాగంగా మా బృందం ప్రయాణం ఆలంపూర్ నుంచి మొదలయ్యింది. కొల్లాపూర్‌లో మా క్యాంపు ఉండేది. అక్కడి నుంచి ప్రతీ రోజూ ఉదయం ఆయా పని ముట్లతో కాలినడకన మల్లేశ్వరం, మంచాల కట్ట, జటప్రోలు మొదలైన గ్రామాలకు వెళ్లేవాళ్లం. అవన్నీ కూడా ముంపు గ్రామాలు కాబట్టి ఊళ్లే కాదు ఇళ్లు కూడా సరిగా ఉండేవి కావు. తాగేందుకు నీళ్లు కూడా దొరికేవి కావు. ఇప్పటి లాగా అప్పట్లో వాటర్ బాటిల్స్ లేవు కాబట్టి బావి నీళ్లే శరణ్యమయ్యేవి.

### స్థానికుల అభ్యంతరాలతో అగచాట్లు...

ఆ ఊళ్లకు దగ్గరలో ఉన్న గుళ్లను ఒక పద్ధతి ప్రకారం తొలగించి తర్వాత జాగ్రత్తగా పునరుద్ధరణ చేయాలి. స్థపతులుగా మేము ఎలా తొలగించి, ఎలా కట్టాలో ప్రణాళిక రచించగలం కానీ కూలీ పనులు చేయలేం కదా. అందుకోసం ఆయా గ్రామాల్లోని కూలీలను ఉపయోగించుకోవాలి. ఎండలో, వానలో వారం రోజుల పాటు ఒక గుడిని పరిశీలించి, మార్కింగ్ చేసిన తర్వాత గుడి రాళ్లను పద్ధతి ప్రకారం తీయాలని స్థానిక కూలీలను కోరాం. కానీ వారు అందుకు ఒప్పుకోలేదు. గుడిని కూల్చడం మహా పాపమని వారు భీష్మించుకుని కూర్చోవడంతో మేమంతా అవాక్కయ్యాం. చేసేదేమీ లేక వచ్చిన దారంటే ఈసురోమంటూ వెనక్కి వెళ్లాం.

ప్రతీ రోజూ సుమారు పది పన్నెండు కిలోమీటర్లు నడవాలంటే మా వల్ల అయ్యేది కాదు. అందుకే ఆ తర్వాత కష్టమైనా నష్టమైనా ఆ ఊళ్లకు దగ్గర్లోనే ఉండాలనుకున్నాం. వెళ్తూ వెళ్తూ దారి మధ్యలో తగిలే ఊళ్ల నుంచి కూలీలను మాతో పాటు తీసుకెళ్లేవాళ్లం. మేము ఆయా గ్రామాలను దాటుకుంటూ వెళ్తుంటే మమ్మల్ని గ్రామస్థులంతా దోపిడీ దొంగల్లా చూసేవారు. ఆలయాల్లోని గుప్త నిధులను దోచుకుపోయేందుకు వచ్చామని కొందరు మా చర్యల్ని అడ్డుకున్నారు కూడా. అయితే స్థానిక అధికారుల చొరవతో ఎలాగైతేనేం కొంత కాలం తర్వాత స్థానికుల ఆదరణకు నోచుకున్నాం. ముంపు గ్రామాలు కాబట్టి అక్కడి గుడిసెలు కూడా బాగుండేవి కావు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, ఉన్నది తింటూ ఆయా గుళ్ల పునరుద్ధరణలో భాగం పంచుకున్నాం. ప్రయాణ సౌకర్యాలు, కనీస జీవన అవసరాలు లేని చోట్ల

శ్రీలంకలోని బౌద్ధాలయం



జనం ఎన్ని ఇబ్బందులు, కష్టాలు పడతారో అక్కడున్న మూడేళ్లలో బాగా తెలిసింది. ఎక్కడి కెళ్లినా అక్కడి వాళ్లతో కలిసిపోయి వారి నమ్మ కాన్ని చూరగొంటేే తప్ప మనం ముందుకు సాగలేమని ఆ టూరు ద్వారా తెలిసింది. చారిత్రాత్మక మదన గోపాలస్వామి దేవాలయం (జటప్రోలు), మాధవ స్వామి దేవాలయం (మంచాల కట్ట), సోమే శ్వర స్వామి ఆలయం (సోమశిల), మల్లేశ్వర స్వామి దేవాలయం (మల్లేశ్వరం), సంగమేశ్వర ఆలయం (ఆలంపూర్) వంటి అనేక దేవా లయాల పునరుద్ధరణలో పాలుపంచుకున్న ఆనందం ముందు నేను పడ్డ కష్టాలు చిన్నవిగా కనిపిస్తాయి. పైగా ఆ టూరులోనే నాకు చరిత్ర మీద అపారమైన ప్రేమ ఏర్పడింది.

## సమాధుల పక్కనే వంట, నిద్ర...

శ్రీశైలం భారీ ప్రాజెక్టు తర్వాత చరిత్ర మీద ఆసక్తితో పురావస్తు శాఖకు వెళ్లాను. అంతకు ముందుది దేవాలయాలను పునర్నిర్మించే ఉద్యోగం అయితే, ఈసారి తవ్వకాలు జరిపి చరిత్రను బయటకు తీసే ఉద్యోగం. అందులో భాగంగా 1981లో మహబూబ్‌నగర్ జిల్లా సేతుపల్లిలో ఉన్న క్రీస్తు పూర్వం నాటి సమాధుల చరిత్ర తవ్వి తీసేం దుకు ఆలంపూర్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సేతుపల్లికి మా బృందంతో బయలుదేరాను. దారి మధ్యలో ఆ ఊరి వ్యక్తి తారసపడి మా పని గురించి ఆరా తీశాడు. అక్కడ చేయబోయే పని గురించి నేనతనికి వివరించాను. మధ్యలో కాతూరు అనే చోట మా క్యాంపు ఏర్పాటు చేశారు.



శ్రీలంకలో మిత్రబృందంతో ...

మరుసటి రోజు మేము సమాధులున్న చోటికి వెళ్లేసరికి ఆ ఊరి జన మంతా అక్కడ గుంపుగా నిల్చున్నారు. ఎక్కడి నుంచో వచ్చి సమా ధులు తవ్వుతుంటే చూస్తూ ఊరుకోమని, అది తమ ఊరికి అరిష్టమని, బొందలు తవ్వితే దెయ్యాలు ఊళ్లోకి ప్రవేశిస్తాయని హెచ్చరికలు జారీ చేశారు. గ్రామస్థులంతా ఎదురు తిరిగితే ఏ అధికారైనా చేసేది ఏమీ ఉండదు. అందుకే సైలెంట్‌గా నడుచుకుంటూ మా క్యాంపు దగ్గరికి తిరిగొచ్చాం. విషయం తెలుసుకున్న అప్పటి నాగర్‌కర్నూల్ ఆర్డీవో కె.వి.రమణాచారిగారు మమ్మల్ని వెంట బెట్టుకుని ఆ గ్రామానికి వెళ్లి స్థానికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దానికి వాళ్లు 'సమాధు ల్లోని నిధులు, నిక్షేపాలు ఎక్కడి నుంచో వచ్చిన వాళ్లు దోచుకెళ్తుంటే చూస్తూ ఊరుకోవాలా?' అంటూ ప్రశ్నించారు. వారి సందేహాలన్నిం టికీ ఆయన ఓపిగ్గా సమాధానాలు చెప్పిన తర్వాత మా పనులు ప్రారంభించాం.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బుద్ధ విగ్రహాలు

అయితే సమాధులు తవ్వుతున్నామని మా దగ్గరికి గ్రామస్థులె వరూ వచ్చేవారు కాదు. మాకు సాయం చేసేవారు కాదు. దాంతో సమాధుల పక్కనే మేము వంట చేసుకుని తిని, అక్కడే నిద్రించేవాళ్లం. సమాధుల్లో నుంచి బయట పడిన వస్తువులకు, సంపదకు రాత్రంతా కాపలా కాసేవాళ్లం. ఆ విధంగా గొందిమళ్ల, ఉప్పలపాడు తదితర ప్రాంతాల్లో ఉన్న అలనాటి రాజవం శాలకు చెందిన 8 సమాధులను తవ్వి వాటిల్లోని విగ్రహాలు, నాణేలు, ఆభ రణాలు, వాస్తు శిల్ప రీతులను బయ టికి తీశాం. గ్రామస్తులు మొదట్లో మాకు సాయం అందించకున్నా అస్థి పంజరాలు కొన్ని శతాబ్దాల చరిత్రను బయటపెట్టాయి. ఎన్ని కష్టాలు ఎదు రైనా వాటిని భరిస్తూ గమ్యాన్ని చేరు కోవడమే అసలైన ప్రయాణం అని ఆ టూరు ద్వారా అర్థమైంది.

## వస్తువులు అమ్మడంలో సిద్ధహస్తులు వారు...

గత యేడాది నవంబర్‌లో బౌద్ధాన్ని, బౌద్ధారామాలను అధ్య యనం చేసేందుకు నలుగురు అధికారులతో కలిసి (వారిలో శిల్పా రామం జి.ఎం. వేణుగోపాలరావు కూడా ఉన్నారు) శ్రీలంకలో ఆరు రోజుల పాటు పర్యటించాను. హైదరాబాద్ నుంచి మధురైకి వెళ్లి అక్కడి నుంచి కొలంబోకు వెళ్లాం. శ్రీలంకలోని అనురాధపుర, క్యాండీ, పొలొన్నరువాలోని పురాతన బౌద్ధ కట్టడాలను చూస్తే ఎవ రైనా సరే మంత్రముగ్ధులవుతారు. ప్రపంచ వారసత్వ కట్టడాలుగా ప్రసిద్ధి చెందిన ఆ ఆలయాల్లో పరిశుభ్రత అద్భుతం. అక్కడ బౌద్ధానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉందని తెలుసుకుని ఆశ్చర్యపోయాను. ఎక్కడ చూసినా నీళ్లు. పచ్చటి పొలాలతో కళకళలాడుతూ ఉంటుంది శ్రీలంక. అక్కడ పొలాలకు దగ్గరగా ఇళ్లు కట్టుకుంటారు. పశుసంపద అంటే వారికి ఎంతో ఇష్టం. ప్రతీ ఇంట్లో ఏదో ఒక పెంపుడు జంతువు తప్ప కుండా ఉంటుంది.

ముఖ్యంగా రహదారులన్నీ తీర్చి దిద్దినట్లుగా ఉంటాయి. శ్రీలం కలో అన్ని నగరాలకు అద్భుతమైన రోడ్లున్నాయి. కొలంబో నుంచి ట్రింకోమలికి 200 కిలోమీటర్లున్నప్పటికీ రోడ్డు మార్గంలో ఎలాంటి అలసట లేకుండా తక్కువ సమయంలో చేరుకోవచ్చు. దారి పొడవునా ఏనుగులు గుంపులు గుంపులుగా వెళ్తూ కనిపిస్తాయి. అభయగిరి ప్రాంతంలో ఒక్కోసారి రోడ్డు మీద వాహనాలకు అడ్డుగా వస్తుం టాయి. పొలొన్నరువాలో మహా పరి నిర్వాణంలో ఉన్న బుద్ధుడి భారీ విగ్రహాన్ని చూడటం గొప్ప అనుభూతి. అయితే వస్తువులను అమ్మ డంలో శ్రీలంకన్లు సిద్ధహస్తులు. ప్రతీ చోటా షాపుల్లో బుద్ధుడి బొమ్మలు అమ్ముతుంటారు. మనం ఎంతగా బేరమాడినా విసుక్కో కుండా, ముఖంపైన చిరునవ్వు చెరగనివ్వకుండా, ఓపిగ్గా మనకు అంటగడతారు. దాంతో అక్కడికి వెళ్లిన వాళ్లు వాటిని తీసుకోకుండా రాలేరు. ఎంతో చరిత్ర కలిగిన ఆలయాలను పరిరక్షించడంలో, విదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో వారికి తిరుగులేదు.

– చల్లా శ్రీనివాస్

# దారి కనుక్కోండి




# ప్రకృతే పాఠశాల

ఒకప్పుడు..విద్యార్థులు మంచి పౌరులుగాను, పూజారులుగాను, యుద్ధవీరులుగాను ఉండాలనుకునేవారు. ఉండేవారు కూడా. అప్పుడు లిపి లేదు కనుక అక్షరాల ద్వారా దేన్నీ నేర్చుకునే అవకాశం లేదు. పాటలు, మంత్రాలు, కథలు, కవితల ద్వారానే అప్పటివాళ్లు విద్యలు నేర్చుకునేవాళ్లు. ఇదంతా క్రీ.పూ. 3500 సంవత్సరాల క్రితం మాట.



మొదట ఈజిప్షియన్లు చిత్రలిపి(బొమ్మలరూపంలోని అక్షరాలు) కనుగొన్నారు. ఆ తరువాత గ్రీకులు, రోమన్లు కూడా తమ తమ అవసరాలకోసం కొత్త లిపులు కనుగొన్నారు. మీరు చదువుకుంటున్న రోజుల్లోలాగా ఇంత పెద్దభవనాలు లేవు ఆ విద్యార్థులకు. ఇంజనీరింగ్, డాక్టరు కోర్సుల్లాంటివి లేవు. ప్రకృతిలోనే ఆటా, పాటా, మాటా అన్నీ నేర్చుకునేవారు. ప్రసిద్ధ తత్వవేత్త అరిస్టాటిల్ కూడా అట్లాగే చదువుకున్నాడు.

# పెద్ద ముక్కల్ని తినొద్దు

ఆహార పదార్థాల్ని చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని తినేవాళ్లకంటే పెద్దముక్కలుగా కసుక్కున కొరుక్కుతినే పిల్లలు దురుసు ప్రవర్తనతో ఉంటారని, పెద్దవాళ్ల మాటలు లెక్కచేయక నిర్లక్ష్యంగా ఉంటారని న్యూయార్కులోని కార్నెవెల్ యూనివర్సిటీ పరిశోధకులు తేల్చారు. అందుకు వారు 12 ఎలిమెంటరీ స్కూళ్లలో చదివే 6-10 సంవత్సరాల మధ్య వయసుగల పిల్లల్ని రెండు గ్రూపులుగా చేసారు. చిన్న చిన్న మాంసం ముక్కలతోపాటు ఫోర్కులను ఒక గ్రూపు పిల్లలకు ఇచ్చారు. పెద్దగా ఉన్న మాంసం ముక్కల్ని మరొక గ్రూపు పిల్లలకు ఇచ్చారు. ఆ పిల్లలు అవి తింటుండగా వీడియో రికార్డు చేసారు. ఫోర్కుల సాయంతో తిన్న పిల్లలకంటే, పెద్దముక్కల్ని కొరికితిన్న వారిలో కోపం,దురుసుతనం ఎక్కువగా ఉన్నట్లు కనుగొన్నారు.



# మీకు తెలుసా?

- జూపిటర్ ఎంత పెద్దగ్రహం అంటే సౌర కుటుంబంలోని గ్రహాలన్నీ దానిలో ఇమిడిపోగలంత.
- నారింజ పండు సైజుని బట్టి దానిలో తియ్యదనం వుంటుంది. అంటే ఎంత పెద్దదయితే అంత తియ్యగా ఉంటుందన్నమాట.
- మానవ శరీరంలో అతి పెద్ద అవయవం ఏమిటో తెలుసా! చర్మం.
- శరీరంలోని ఎముకల్లో నాలుగోవంతు పాదాల్లోనే ఉంటాయి.
- శరీరంలో గాయంనుంచి అతిత్వరగా కోలుకునే భాగం నాలుక.

# రంగులు వేయండి






## చుక్కలు కలపండి



## అడవులే బెస్ట్!



మీరెప్పుడైనా సింహాలు, పులులు, ఎలుగుబంట్లను చూసారా? జింకలు, కంగారూలు, చింపాంజీలు, డాల్ఫిన్లు, పాములు? అన్నిటినీ జూలలో చూసేవుంటారు కాని దగ్గర్నుంచి అయ్యుండదు. అవి దగ్గరి కొస్తే ఇంకేముంది..భయంతో పరుగులు తీస్తారు.. ఔనా? కానీ వాటన్నిటినీ ఈ మధ్య అమెరికాలో కొందరు ఇళ్లలోనే పెంచుకుంటున్నారు. అయితే వాటికి జబ్బులు చేసినపుడు, అవి పొరుగింటి వారికి ప్రమాదం కలిగిస్తున్నపుడు పాపం వాటి యజమానులు చాలా తిప్పలు పడుతున్నారట. అందుకే అమెరికన్ సొసైటీ ఫర్ ద ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు ఎనిమల్స్(ఎఎస్‌పిసిఎ) వారు వాటిని ఇళ్లలో పెంచుకోవద్దంటున్నారు. ''వేలాది సంవత్సరాలుగా ఆ జంతువులు అడవుల్లోనే నివాసమున్నాయి. ఆ వాతావరణంలో ఉంటేనే అవి ఆరోగ్యంగా ఉంటాయి. కావాలనుకుంటే చాలామందికి లాగా పిల్లులు, కుక్కల్ని మాత్రం పెంచుకుంటే సరిపోతుంది'' అంటున్నారు ఎఎస్‌పిసిఎ వాళ్లు.

## నా బొమ్మ



మెర్ల వెంకట అభిరామ్,
ఐదవ తరగతి
శ్రీ చైతన్య స్కూల్, హైదరాబాద్



## కనిపించని కవర్

ప్రపంచంలోనే అతి చిన్న మ్యాగజిన్ కవర్ గురించి విన్నారా? దానిని క్యుబెక్‌లోని (కెనడాలో) మెక్ గిల్ యూనివర్సిటీలో ఐబిఎం కంపెనీకి చెందిన మైక్రోస్కోపిక్ 3డి ప్రింటర్‌తో సృష్టించారు. దాని కవర్‌పేజీమీద 'రెండు పాండాలున్న ఒక చెట్టు బొమ్మ 'తో పాటు 'స్పెషల్ డెలివరీ: పాండా ట్విన్స్' అనే టైటిల్ రాసారు. అది నేషనల్ 'జియోగ్రాఫిక్ కిడ్స్' తాజా సంచిక మీద కవర్‌పేజీయే. విశేషమేమంటే, అది కంటికి కనిపించనంత పరిమాణం లో ఉంటుంది. అలాంటి 2వేల కవర్లు ఒక ఉప్పుకణం(సాల్ట్ గ్రెయిన్)లో ఇమిడిపోగలవట. అంటే అది ఎంత చిన్నదో ఊహించారా? ఊహించడమెందుకు దాని కొలతలు చూస్తే మీకే తెలుస్తుంది – 0.011మి.మీ వెడల్పు, 0.014 మి.మీ పొడవు.



# పందులకు పరుగుపందెం!





'ఎవరి పిచ్చి వారికానందం' అంటారు. ఒక చోట కుక్కలకు రన్నింగ్ రేస్... మరో చోట కప్పలకు జంపింగ్ రేస్... ఇంకోచోట ఏనుగులతో ఫుట్‌బాల్ గేమ్... ఇది కూడా ఆ కోవలోకి వచ్చే రేసే. చైనాలోని ఇక్సూ అనే ప్రాంతానికి పెద్ద చరిత్ర ఉంది. నల్లగా, చిన్న చెవులు కలిగి ఉండే పందులకు అక్కడి వారు ప్రేమగా తిండిపెట్టి పెంచే సాంప్రదాయం తరతరాలుగా వస్తోంది. ప్రతీ యేడాది ఇక్సూలో 'పిగ్‌లెట్ రేస్' అనే సాంప్రదాయ క్రీడను నిర్వహిస్తారు. పోటీలో భాగంగా మైదానాన్ని బురదమయం చేసి అందులో ఈ పంది పిల్లలకు పరుగుపందెం ఏర్పాటు చేస్తారు. పందులు గమ్యం వైపు పరుగులు తీస్తుంటే అక్కడ చేరిన వందలాది మంది కేరింతలు కొడుతూ వాటిని ప్రోత్సహిస్తుంటారు. స్థానికంగా జరిగే ఈ పోటీలో తమ పందిపిల్లతో పాటు పాల్గొనేందుకు చాలామంది ఉత్సాహం చూపుతారు. పోటీ జరుగుతున్నంత సేపూ ఆ ప్రాంతమంతా చప్పట్లు, కేరింతలతో దద్దరిల్లుతుంది.

## అవీ ఇవీ



# 'ట్రీ' పెయింటింగ్!





మనకు రోడ్ల పక్కనున్న చెట్లను నరికేయడమే తెలుసు కానీ వాటిని కూడా అద్భుత కళాఖండాలుగా మార్చవచ్చనడానికి ఇవి నిలువెత్తు సాక్ష్యాలు. చైనాలోని ఫుజోవుకు చెందిన ఫ్యూజియన్ అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ యూనివర్శిటీ విద్యార్థులు చెట్లపై 'హాలో పెయింటింగ్స్', '3డి ఇమేజెస్' వేసి వాటికి కొత్త అందాలను తీసుకొచ్చారు. ఆ ప్రాంగణంలో ఏ చెట్టును చూసినా ఇలాంటి కళాకృతులతో కనువిందు చేస్తాయి. కొమ్మలను బట్టి దానికి ఎలాంటి షేప్ ఇవ్వాలనేది ముందుగా ప్లాన్ చేస్తారు. ఆ తర్వాత రంగులతో పులిగానో, కుక్కగానో, పాండాగానో దానిని తీర్చిదిద్దుతారు. అటువైపుగా వెళ్తున్న వారు ఈ ట్రీ పెయింటింగ్స్ నుంచి చూపు మరల్చుకోలేకపోతున్నారట.



## రమేశ్చంద్ర మహర్షి

బి.టెక్,
సెల్: 92465 82255
ఫోన్: 040-6522 5554

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, ప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలూ, పంచ కర్మేంద్రియాలూ, మనసూ అనే పదకొండు ఇంద్రియాలూ, శబ్ద, రూప, స్పర్శ, రస గంధాలనే ఇంద్రియ విషయాలూ కోరిక, ద్వేషం, తెలివి, సుఖం, దుఃఖం, ధైర్యం ... వీటి వికారాలూ కలిసి ఏర్పడే క్షేత్రం ... మనిషి! ఆ మనిషికి భవిష్యత్తనే దారి చూపే నేత్రం, జ్యోతిశ్శాస్త్రం!!

★★★

కృతే కార్యే కిం ముహూర్త ప్రశ్నేన?

పని ముగిసిన పిదప ముహూర్తమడగడం, జరగకూడనిది జరిగిపోయాక పరిహారాలు పాటించడం వలన ఏంటి ప్రయోజనం?

భవిష్యత్ ముందే తెలిస్తే ముప్పు నుండి తప్పించుకోవడం లేదా తగ్గించుకోవడం సాధ్యమే!

కాలః క్రీడతి గచ్ఛత్యాయుః

కాలం ఆడుకుంటూ ఉంటుంది. ఆయువు గతించిపోతూ ఉంటుంది. రాబోయే మంచి చెడ్డలు తెలిస్తే ఉన్నంతలోనే ఉన్నతంగా జీవించగలుగుతాం!

వయం భగవంతః స్యామ

మనమందరమూ భాగ్యశాలురమవుదుముగాక!

★★★

పాఠకులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఈ క్రింది వివరాలు రాసి పంపండి.

పేరు ..................................

పుట్టిన తేదీ ...............................

పుట్టిన సమయం ........................

పుట్టిన ఊరు (మండలం)...........

ప్రశ్న ....................................

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

అదృష్ట రత్నజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రిక
ప్లాట్ నెం.76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033.

# అదృష్ట రత్నజ్యోతి

**ఎమ్.ఎస్.ఎన్.ఆర్., హైద్రాబాద్**

**నా జన్మకుండలి సంపూర్ణంగా, నిర్మొహమాటంగా వివరించగలరు.**

మీ జన్మకుండలి ప్రకారం-

నక్షత్రం భరణి. మేషరాశి.

1990 నవంబర్ నుండి 2000 సెప్టెంబర్ వరకూ చంద్ర దశ. 2000 సెప్టెంబర్ నుండి 2027 ఆగస్ట్ వరకూ కుజ దశ. 2007 ఆగస్ట్ నుండి 2025 మే వరకూ రాహు దశ. పిదప గురు దశ.

**కంట్రోలింగ్ ఫేక్టర్స్ :** చంద్రునికి శుక్రుడు. కుజునికి రాహువు. రాహువుకు శుక్రచంద్రులు. బృహస్పతికి రాహువు శని.

**యోగాలు :** 1. భాగ్య దశమాధిపతులు కలిసి ధన స్థానంలో ఇస్తున్న రాజయోగం. దీని ఫలితం వృత్తి ద్వారా మంచి ఆదాయం.

2. హంస మహాపురుష యోగం. అయితే బృహస్పతికి ఉచ్ఛ భంగం కావడం వలన ఈ యోగం పని చేసేది ఒక 30 శాతం వరకూ మాత్రమే.

3. బుధాదిత్య యోగం. ఇది ఉండకపోతేనే ఇక్కడ ప్రయోజనం. ఉండి, ఉన్న రాజయోగాన్ని కొంత బలహీనపర్చడం దురదృష్టం.

4. విపరీత పారిజాత యోగం. ఈ జన్మకుండలిలోని ప్రతి గ్రహం మరో గ్రహంతో సంబంధం కలిగి ఉండడం. ఇక్కడ లగ్నాధిపతి గురుని స్థానంలో పడి, ఆ గురువు చంద్రుని స్థానంలో పడి, ఆ చంద్రుడు కుజుని స్థానంలో పడి, ఆ కుజుడు శుక్రుని స్థానంలో పడి, ఆ శుక్రుడు తిరిగి శని స్థానంలో పడి... ఇలా పారిజాత యోగం విపరీత పారిజాత యోగం అయి ఈ జన్మకుండలిని యోగ జాతకం చేసే పద్ధతి విశిష్టంగా ఉండడం విశేషమే!

**అంతర్గత :** ఈ జన్మకుండలి వరకూ రవికి అంతర్గత కుజుడు. చంద్రునికి అంతర్గత కుజుడు. కుజునికి బృహస్పతి. రాహువుకు కుజుడు. బృహస్పతికి శుక్రుడు. శనికి శని. బుధునికి శుక్రుడు. కేతువుకు బుధుడు. శుక్రునికి చంద్రుడు.

కుజునికి అంతర్గత బృహస్పతి అవ్వడం కారణంగా కుజ దశ అంతా... అంటే 2000 నుండి 2007 ఆగస్ట్ మధ్య... అంటే మీ 33 నుండి 40 సంవత్సరాల వయసు మధ్య...

రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్... అంటే ప్రాపర్టీస్‌కి సంబంధించిన వ్యాపారాలు చేయడం జరుగుతుంది. అలాగే ఇదే దశలో మీకు స్వగృహ యోగం కలుగుతుంది.

కుజునిలో కుజుడు, 2000-2001 మధ్య, రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో కొత్తపుంతలు. అలాగే కన్‌స్ట్రక్షన్‌లో ప్రవేశించడం.

కుజునిలో రాహువు... అంటే 2001 ఫిబ్రవరి నుండి 2002 ఫిబ్రవరి మధ్య వ్యాపారంలో పురోగతి. అలాగే మీరు ఒక సైట్ తీసుకోవడం.

కుజునిలో బృహస్పతి... అంటే 2002 ఫిబ్రవరి నుండి 2003 జనవరి మధ్య గృహప్రవేశం.

కుజునిలో శని... అంటే 2003 జనవరి నుండి 2004 మార్చ్ మధ్య మీరున్న ఊరికి దూరంగా మరో ఊరిలో అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించి, ఆ కారణంగా వారానికొకసారి అన్నట్టుగా అటూ ఇటూ నిరంతరంగా ప్రయాణాలు చేయడం.

2004 మార్చ్ నుండి 2005 ఫిబ్రవరి మధ్య చేస్తున్న వ్యాపారంలో మంచి ధన యోగం. ఇది కుజునిలో బుధుడు.

కుజునిలో శుక్రుడు... అంటే 2005 జూలై నుండి 2006 సెప్టెంబర్ మధ్య వృత్తిలో ధనయోగం, మంచి వాహన యోగం. వృత్తిలో మలుపు.

2006 సెప్టెంబర్ నుండి 2007 జనవరి మధ్య... అంటే కుజునిలో రవిలో... ఈజీ మనీ లేదా వారసత్వంగా వచ్చే ధనం లేదా అనాయాసార్జన.

కుజునిలో చంద్రుడు... అంటే 2007లో మళ్ళీ మీకు స్థిరాస్తి సమకూరడం. ఈవిధంగా కుజ దశ అంతా స్థిరాస్తులకు సంబంధించి వ్యాపారం, అలాగే స్వగృహ యోగం.

ఇక రాహు దశ. రాహువుకు తిరిగి కుజుడు అంతర్గత! అంటే కుజుని దశ ఎలా జరిగిందో రాహు దశ కూడా అలాగే జరుగుతుంది.



అయితే శుక్రుని కారణంగా, కుటుంబ స్థానంలో రాజయోగం కారణంగా, సంతానం అభివృద్ధిలోకి రావడం, ఇంట్లో శుభకార్యాలు, గొప్ప వాహనయోగం!

రాహువులో శనిలో... అంటే 2012 ఆగస్ట్ నుండి 2015 జూన్ మధ్య నాలుగైదు వందల కిలోమీటర్ల దూరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం... ఆ కారణంగా విపరీతమైన ప్రయాణాలు.

2019 జనవరి నుండి 2021 డిసెంబర్ మధ్య పిల్లల పరంగా శుభకార్యాలు. ఇక్కడి నుండి అకస్మాత్తుగా ఈక్వేషన్స్ మారిపోకుండా, తారుమారు కాకుండా గట్టి రెమిడీస్ పాటించాలి.

రాహువులో రవి... అంటే 2021 డిసెంబర్ నుండి 2022 నవంబర్ మధ్య అకస్మాత్ ధన నష్టం! విండ్ ఫాల్ లాసెస్! ఇక్కడ రవికి గట్టి రెమిడీస్ పాటించి తప్పించుకున్న వెంటనే మళ్ళీ 2022 నవంబర్ నుండి 2024 ఏప్రిల్ మధ్య రాహువులో చంద్రునిలో ఒక కొనకూడని ప్రాపర్టీ కొనడం చేస్తారు. రాహు చంద్రులకు పరిహారాలు పాటిస్తే.. ఏమో... ఆ సమయానికి ఆ బుద్ధి పుట్టాలి కదా... ఈ ఒక్క తప్పుకు శిక్ష... మొత్తం అప్పటివరకూ చేస్తున్న వ్యాపారాలు దివాలాకు రావడం. దీనంతటకూ మూలకారణాలు... ఆ ప్రాపర్టీ తాలూకు వాస్తు! అలాగే ఒక కూడని స్త్రీ పరిచయం!!

అందుకే ''కుర్యాన్న పరదారేచ్ఛాం...'' పరాయి స్త్రీలను ఆశించకూడదు...

– సశేషం –

పుస్తక ప్రపంచంలో ఒక మహా ఆవిష్కారం **'అధినేత'**. 1992లో సంచలనం సృష్టించిన రమేశ్చంద్ర మహర్షి విరచిత **'అధినేత'** ఇప్పుడు ఎమెస్కో వారి ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. ప్రతులకు: **92465 82255.** Advt



# పేదింటి పొగ

**సునీత బెయిల్‌పై విడుదలయ్యాక రిజిస్టర్‌లో కొత్త బందీల పేర్లు నమోదు చేసే పని నా పైన పడింది. ఉష, ఆశ అక్కచెల్లెళ్ళు. వాళ్ళ బట్టలు వాళ్ళ పేదరికాన్ని సూచిస్తే వాళ్ళ కళ్ళు చదువు సంస్కారం వల్ల అబ్బే జ్ఞానాన్ని సూచిస్తున్నాయి. ఇద్దరిలోను ఉష పెద్దది. ఎం.ఎ పొలిటికల్ సైన్స్ చదివింది. వివాహమైంది. వయసు 24. ఆశ ఎం.ఎ హిందీ. వయసు 21, అవివాహిత. ఈ వివరాలు అతి కష్టం మీద చెప్పారు.**

ఇద్దరూ కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూనే ఉన్నారు కనక అవసరానికి మించిన వివరాలు అడగ లేదు. అయినా చుట్టుప్రక్కల వాళ్ళు ఊరుకోరు కనక 'ఏం కేసు, ఏం కేసు' అని వాళ్ళని వేధిస్తూనే ఉన్నారు. నిజం చెప్పాలంటే నాకు కూడా తెలుసుకోవాలనే ఉంది. ఈ లోపు ఆశ వెక్కిళ్ళ మధ్య చెప్పింది మర్డర్ కేస్ అని. అంతకుమించి చెప్పగలిగే స్థితిలో వాళ్ళు లేరు.

★★★

వారం రోజులు గడిచిపోయాయి. వాళ్ళు కొంత తేరుకున్నారు. ఇంటి నుండి ములాకాతీ వచ్చింది. ఆ రోజు మధ్యాహ్నం పూట నేను నా బిస్తర్ మీద కూర్చుని జెఫ్రీ ఆర్చర్ నవల చదువుతున్నా. జైలులో ఉన్నప్పుడు అలాంటి పుస్తకాలు చదవడం ఒక వరం లాంటిది. సమయం ఎలా గడుస్తుందో తెలియకుండా గడిచిపోతుంది. ఆ టైమ్‌లో కొంచెం దూరం నుండి 'ఎక్స్‌క్యూజ్ మీ మేడమ్' అని లీలగా చెవులబడ్డది. తలెత్తి చూద్దును కదా చిన్నమ్మాయి ఆశ దూరంగా గుమ్మంలో నిలబడి అడుగుతోంది. నాకు నవ్వాగలేదు. రమ్మన్నట్టు చెయ్యూపి, ఇదేమన్న నా ప్రైవేట్ గదా? వార్డులోకి రావడానికి పర్మిషన్ ఎందుకు అని నవ్వాను. ఆమె కొంచెం బిత్తరపోయి, ''అంటే మీరు ఉన్నారు కదా మేడమ్ అందుకని'' అన్నది.

అయితే ఏమిటి అనుకుని 'సరే రండి, కూర్చోండి' అన్నాను. ఆమె చాలా వినయంగా చేతులు కట్టుకుని నా బిస్తర్‌కి కొంచెం దూరంలో కింద కూర్చొని ''మేడమ్ మీరు దయచేసి మాకు ఒక సహాయం చెయ్యాలి'' అన్నది.

''అరెరే, అలా కింద ఎందుకు కూర్చుంటారు! ఇక్కడికి రండి బిస్తర్ మీదకి. నేను కూడా మీలాగే ఖైదీనే కదా. మేడమ్ ఎందుకు? హాయిగా దీదీ అని పిలవండి'' అన్నాను.

''హా నిజంగానా? ఇప్పుడే వస్తాను'' అంటూనే పరుగెత్తిపోయింది. కొంచెం సేపటికి వాళ్ళ అక్కని తీసుకుని వచ్చింది. ఈసారి నేను జరగగానే ఇద్దరూ నా బిస్తర్ మీద కూర్చుని నవ్వు మొహాలతో ఒకేసారి ఏదో చెప్పబోయి నవ్వేశారు. చివరికి ఆశే మొదలుపెట్టి, ''మీరు ఇక్కడ ఉద్యోగి అనుకుని అక్క భయపడి నన్ను మీతో మాట్లాడమని ముందుకు తోసింది'' అని నవ్వింది. వాళ్ళు నవ్వడం ఆ వారం రోజుల్లో మొదటిసారి చూశాను.

''మీరు మరీ ఇంత అమాయకంగా ఉంటే ఎలా? ఇక్కడ ఉద్యోగినై ఉంటే ఖైదీల మధ్యలో పక్కేసుకుని కూర్చుంటానా?'' అన్నాను గాని వాళ్ళ నవ్వుకు మరేదో మరో కారణం ఉన్నట్టు తరువాత అనుమానం వచ్చింది. ఎందుకంటే వారిలో ఏదో సంతోషం కనబడుతోంది. మర్డర్ కేసు అన్నారు కనక బెయిల్ వెంటనే వచ్చే అవకాశం లేదు.

నా సందేహాలకు తెరదించుతూ అప్పటివరకూ తన చేతిలో చుట్టలా చుట్టి ఉన్న పేపర్ తీసి చూపింది. ''మేమిద్దరం డి.ఆర్.డి.ఎలో ఉద్యోగం కోసం రాతపరీక్షలకి హాజరయ్యాం. ఈ రోజు ఫలితాలు వచ్చాయి. నేను క్లియర్ చేశాను. మా తమ్ముడు కబురు చేశాడు'' అంటూ పేపర్ తీసి చూపింది.

'ఇప్పుడు ఇంటర్వ్యూకి పిలుపొచ్చిందట. మా ఇంటి వాళ్ళు చెప్పారు. నేను ఈ పరీక్ష రాయడం కోసమే పుట్టింటికి వచ్చి ఇలా ఇరుక్కుపోయాను'' ఈసారి ఆమె కళ్ళ నుండి జలజల కన్నీళ్ళు కారాయి.

''ఇంటర్వ్యూ ఎప్పుడు?''

''ఎల్లుండి''

''అబ్బా అంత తక్కువ టైమ్‌లో ఏం చేయగలం? ఈ రిజల్ట్ కాగితం, మీ ఇంటర్వ్యూ కార్డు జతచేసి చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ అనుమతి తీసుకుని ఎస్కార్ట్‌తో వెళ్ళి హాజరుకావచ్చు. కాని ఒక్కరోజులో అది సాధ్యం కాదు. అయినా ప్రయత్నం చేద్దాం'' అన్నాను. కానీ జైలర్‌ని కలవాలన్నా రేపు ఉదయం వరకు ఆగాలి. ఈ మాట చెప్పగానే ఆమె ముఖంలో నీలి నీడలు కమ్ముకున్నాయి.

''ఇంతకీ ఎవరు ఎవర్ని మర్డర్ చేస్తే మీరు ఇరుక్కొన్నారు?'' అని అడిగాను.

''అసలు హత్యనే జరగలేదు. మామీద జబర్దస్తీగా బనాయించారు.''

''ఎవరో ఒకరు చచ్చిపోకుండా మర్డర్ కేసు ఎలా పెట్టారు?'' ఆశ్చర్యంగా అడిగాను.

''ఒక ముసలమ్మ చచ్చిపోయింది'' అన్నది ఆశ.

''అలా కాదు. అసలు మొదటి నుండి జరిగినది చెప్తానుండండి'' అని ఉష చెప్పడం మొదలుపెట్టింది.

''మాది ఇదే ఊరు. సొంత స్థలం ఉంది గానీ, ఆర్థిక పరిస్థితి అంత బాగా లేక చిన్న రేకుల షెడ్ వేసుకున్నాము. మా నాన్నగారు ఆడపిల్లలయినా సరే మంచిగా చదువుకోవాలని మా ఇద్దరినీ బాగా చదివించారు. ఆ తరువాత నా పెళ్ళి. వీటన్నిటి మీద డబ్బు ఖర్చుపెట్టారు. ఆస్తిపాస్తులేమీ లేవు కాబట్టి చదువు సంస్కారమే ఆస్తి అనుకున్నాం.

# జైలుకథలు - 8

బి. అనూరాధ

మా ఇంటి పక్కనే గోడనానుకుని ఉన్న వాళ్ళు బాగా డబ్బున్నవాళ్ళు. చిన్నదానికీ పెద్దదానికీ ఊరికే గొడవపెట్టుకోవాలని చూస్తుంటారు. మేము ఎప్పుడూ పట్టించుకోకుండా ఉండేవాళ్ళం. ఆ రోజు ఉదయాన బయట ఆవరణలో వంట చేస్తున్నాం. ఎప్పుడూ అక్కడే చేస్తాం. అయితే చలికాలం కదా. కట్టెలు సరిగ్గా మండక పొగ లేస్తోంది. అమ్మ లోపలుంది. చెల్లి, నాన్న పొయ్యి దగ్గర చలి కాచుకుంటున్నారు. హఠాత్తుగా పక్కింటి వాళ్ళు పై అంతస్తు నుండి మా పొయ్యిలో నీళ్ళు పోశారు. పైగా ఒకటే తిట్లు. ముసలావిడ తెగ బూతులు తిట్టింది. ఊరుకొంటుంటే మరీ ఎక్కువైపోతుందని మా తమ్ముడు గట్టిగా అరిచాడు. పక్కింటాయన గబగబా వచ్చి మా తమ్ముడి కాలర్ పట్టుకుని కొట్టాడు. మా నాన్న అడ్డు వెళ్ళబోతే తోసేశారు. నాన్న కిందపడిపోయారు. ఇంటిల్లిపాదీ వచ్చి ఒకటే అరుపులు, తిట్లు. మేము చాలా భయపడ్డాం. నాన్నకు స్పృహ తప్పింది. చాలా భయం వేసింది. ముసలావిడ తిట్టీ తిట్టీ లోపలికి వెళ్ళిపోయింది.

మమ్మల్ని ఏమన్నా చేస్తారేమో అని భయపడి పోలీసులకి ఫోన్ చేశాం. మధ్యాహ్నానికి ఒక పోలీసాయన వచ్చాడు. రిపోర్ట్ చేద్దురు రండి అని స్టేషన్‌కి రమ్మన్నాడు. అంతలో పై ఇంట్లో నుండి ఏడుపులు వినిపించాయి. పోలీసాయన కూడా పైకి వెళ్ళి చూశాడు. ముసలావిడకి హార్ట్ ఎటాక్ వచ్చిందట. వెంటనే హాస్పిటల్‌కి తీసుకుపోయారు. ఆ గొడవలో మేము పోలీసు స్టేషన్‌కి పోలేదు. ఈలోగా ఎస్.ఐ వచ్చి, మీరు ఇప్పుడు ఇంట్లో ఉండడం మంచిది కాదు. ముసలావిడ చనిపోయిందట. మిమ్మల్ని ఏమన్నా చేస్తారేమో అని అందరినీ స్టేషన్‌కి తీసుకుపోయాడు. అక్కడ జరిగినదంతా చెప్పాం. చాలా సానుభూతితో విన్నారు. రాత్రంతా మమ్మల్ని.. మా సెక్యూరిటీ కోసమే అంటూ స్టేషన్లోనే ఉంచారు. మరుసటి రోజు ''వాళ్ళు మీమీద కేసుపెట్టారు. మేము ఏం చేయలేం అని మా ఇద్దరినీ, మా తమ్ముడినీ జైలుకి పంపారు.''

**ఆ రోజు ఉదయాన బయట ఆవరణలో వంట చేస్తున్నాం. కట్టెలు సరిగ్గా మండక పొగ లేస్తోంది. హఠాత్తుగా పక్కింటి వాళ్ళు పై అంతస్తు నుండి మా పొయ్యిలో నీళ్ళు పోశారు. పైగా ఒకటే తిట్లు. ముసలావిడ తెగ బూతులు తిట్టింది. ఊరుకొంటుంటే మరీ ఎక్కువైపోతుందని మా తమ్ముడు గట్టిగా అరిచాడు. పక్కింటాయన గబగబా వచ్చి మా తమ్ముడి కాలర్ పట్టుకుని కొట్టాడు. మా నాన్న అడ్డు వెళ్ళబోతే తోసేశారు. నాన్న కిందపడిపోయారు. ఇంటిల్లిపాదీ వచ్చి ఒకటే అరుపులు, తిట్లు. మేము చాలా భయపడ్డాం. నాన్నకు స్పృహ తప్పింది. చాలా భయం వేసింది.**

''అదేంటీ, పోలీసాయన ఉండగానే అతని ఎదురుగానే హాస్పిటల్‌కి తీసుకుపోయారు కదా'' అన్నాను అప్రయత్నంగానే. తరువాత నా అమాయకత్వానికి నాకే నవ్వొచ్చింది. ఎన్ని కేసులు చూసినా కొన్నిసార్లు ఆశ్చర్యం కలుగుతూనే ఉంటుంది. మరీ ఇంత ఘోరంగా ఎలా చేస్తారో! పెళ్ళయిన ఆడపిల్ల జైలుకి వెళ్ళిందంటే అత్తింటివాళ్ళు ఎంత హంగామా చెయ్యగలరో ఊహించవచ్చు. ఉషకి అది కూడా ఒక భయం లేకపోలేదు.

మరుసటిరోజు ఉదయం లాకప్ తెరిచే టైమ్‌కి దరఖాస్తు ఇస్తే మంచిదని ఉషని అప్పుడే రాసిపెట్టమన్నాను. దానితో పాటు నేను జైలర్‌ని కలవడానికి అనుమతి అడుగుతూ 'ఒక జీవితాన్ని నిలబెట్టేందుకు ఆయన (జైలర్) చేయూతనివ్వాలని' సెంటిమెంట్ మీద దెబ్బకొడుతూ ఒక దరఖాస్తు రాశాను. మామూలుగా జైలర్‌ని ఎప్పుడు కావాలంటే అప్పుడు కలవడం వీలు కాదు. అలా అనుమతి కూడా ఇవ్వరు. అయితే సెంట్రల్ జైల్ కావడం వల్ల, జడ్జీలు నెలకొకసారి రావడం లేదా బయటనుండి అయినా ఎవరన్నా రావడం జరుగుతుండేది. అలాంటప్పుడు మేము అక్కడి సమస్యలు నేరుగా ఫిర్యాదు చేసేవాళ్ళం. పైగా జైలర్ చార్జ్ తీసుకున్న కొత్తలోనే ఖైదీల సమస్యల మీద పెద్ద పోరాటం చేశాం కాబట్టి నేను ఏదైనా సమస్య గురించి కలవాలంటే ఇంటర్వ్యూ ఇవ్వడం, తగిన హెల్ప్ చెయ్యడమే మంచిదని ఆయన అనుభవం ద్వారా తెలుసుకున్నాడు.

అనుకున్నట్టే మరుసటి రోజు ఉదయం 8 గంటలకల్లా పిలుపు వచ్చింది. ఆయన వివరాలన్నీ అడిగాడు. కానీ దరఖాస్తు కోర్టుకి వెళ్ళాలి, జడ్జి ఒప్పుకుని లిఖితపూర్వక అనుమతి ఇవ్వాలి, ఇదంతా అయ్యే పనేనా? పైగా ఇంటర్వ్యూ కార్డ్ ఆమె దగ్గర లేదు. అయినా జైలర్ సానుకూలంగానే స్పందించాడు. ఆమె ఇంటి నంబర్ తీసుకుని వాళ్ళ ఇంటి వాళ్ళని కార్డు తీసుకుని రమ్మని చెప్పి, ఆలోపు మమ్మల్ని అక్కడే కూర్చుని బందీ పిటిషన్ రాసి ఇవ్వమన్నాడు. హెడ్ క్లార్క్‌ని పిలిచి కోర్టు తెరిచే టైమ్‌కి వెళ్ళి మేజిస్ట్రేట్‌కి ఇచ్చి, పర్మిషన్ అక్కడే ఉండి తీసుకురమ్మని ఆదేశించాడు. ఆయన దాన్ని తీసుకువచ్చేసరికి మధ్యాహ్నం అయిపోయింది. అప్పుడు మళ్ళీ జిల్లా ఎస్.పికి కాగితం పంపి ఎస్కార్ట్ కావాలని అడిగారు.

మొత్తానికి మరుసటి రోజు ఉదయం ఎస్కార్ట్‌తో ఉష ఇంటర్వ్యూకి హాజరయింది. ఆమె ఇంటివాళ్ళు సర్టిఫికెట్లు తీసుకుని వచ్చి అక్కడే అందించారు. దీనిని ప్రత్యేక కేసుగా పరిగణించి ఆమెకు వెంటనే ఇంటర్వ్యూ నిర్వహించి పంపెయ్యాలని, ఒక ఖైదీని పెట్టుకుని తాము బయట ఎక్కువసేపు ఉండడం సాధ్యం కాదని పోలీసులు అధికారులను కలిసి పైరవీ చేశారు. వాళ్ళ తొందర వాళ్ళది. కాబట్టి మొదట ఆమెనే ఇంటర్వ్యూ చేశారు. ఆమెని ఇంటర్వ్యూ చేసిన అధికారులు, 15 రోజుల్లో ఫలితాలు రావొచ్చని, అప్పటికి విడుదల అయితే జాయిన్ కావచ్చని, లేకపోతే మాత్రం తాము చేయగలిగింది ఏమీ లేదని తెలియజేశారు.

ఇక అప్పుడు ఉషకి కొత్త దిగులు... ఆలోపు తనకి బెయిల్ వస్తుందా లేదా అని. అయితే ఆ రోజు ఇంటర్వ్యూలు కవర్ చెయ్యడానికి వచ్చిన విలేకరులకు, అలా ఒకమ్మాయి బందోబస్తుతో హాజరుకావడం పెద్ద న్యూసే అయింది. వాళ్ళు ఆమె ఇంటికి వెళ్ళి అక్కడ చుట్టుప్రక్కల వాళ్ళతో ఇంటర్వ్యూలు తీసుకుని పొయ్యి ఫోటోలు తీసి ఒక సచిత్ర కథనం ప్రచురించారు. జైలర్ ఆశించినట్టే ఆయనని కూడా కలిసి ఆయన చేసిన సహాయం గురించి కూడా రాశారు.

మొత్తానికి రెండు నెలల తరువాత హైకోర్టు నుండి వాళ్ళకి బెయిలూ, ఉషకి జాయినింగ్ ఆర్డర్ రెండూ ఒకేసారి వచ్చాయి. ఆరోజు లాకప్ అయ్యాక రిలీజ్ ఆర్డర్ వచ్చింది. ఉష, ఆశ ఉన్న బ్యారక్ మహిళా వార్డు గేట్‌కి దగ్గరలోనే ఉంటుంది. వాళ్ళని బయటకు తీశాక మా వార్డు దగ్గరకి రాబోతుంటే హెడ్ వార్డర్ టైమ్ లేదు వెనక్కి పోవద్దు అని కోప్పడ్డా పరిగెత్తుకుని మా వార్డు దగ్గరికి వచ్చారు. కటకటాల్లో నుండి చేతులు కలుపుతూ, ''దీదీ, మీది మంచి మనసు. తీసుకుపోవడానికి ఆయన రావాలని కూడా ఆశీర్వదించండి'' అని చటుక్కున వంగి కాళ్ళకి దణ్ణం పెట్టింది ఉష కళ్ళలో నుంచి నీళ్ళు కారిపోతుండగా. అలా దీవెనలతోనే అంతా చక్కపడిపోతే ఎంత బాగుండును అనిపించింది.

.....................................

anu13ravi@gmail.com

## స్వీకారం

**కమిషన్లు రికమండేషన్లు**
(రైతు సంక్షేమం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే)
సంకలనం : సారంపల్లి మల్లారెడ్డి
పేజీలు : 304, వెల: రూ.150

సామరస్యం సమానత్వంతో కూడిన భవిష్యత్తు కోసం
**ప్రజల ప్రత్యామ్నాయం**
కూర్పు : గుడిపూడి విజయరావు
పేజీలు : 208, వెల : రూ. 100

బిజెపి మార్కు ఆదర్శ పాలన
**'వికాస' పురుషుని వినాశ నీతి**
పేజీలు : 32, వెల: రూ.15

**రెండు రాష్ట్రాలు ఒక ఉద్యమం**
రచన : వి. శ్రీనివాసరావు
పేజీలు : 48, వెల: రూ.20
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్

***

**ఎక్సలెన్స్ సాధించండి** (ఆశించిన ఫలితాలు సాధిస్తూ జీవితాన్ని అద్భుతంగా మలచుకోండి)
పేజీలు : 158, వెల: రూ.130+(శిక్షణాదీపిక)

**ఎక్సలెన్స్ సాధించండి** (వ్యక్తిత్వ వికాసాన్ని జీవితానికి ఎలా అన్వయించుకోవాలో నేర్చుకోండి)
రచన : కొండా చంద్రారెడ్డి
పేజీలు : 88, వెల: ఉచితం
ప్రతులకు : 80997 44855

***

**మోహం**
రచన : నరేష్ నున్నా
పేజీలు : 32, వెల : రూ.20
ప్రతులకు : పాలపిట్ట బుక్స్ 98487 87284

***

**స్వాతంత్రోద్యమంలో వాడపల్లి** (రూపకం)
రచన : ఎస్.ఆర్. పృథ్వి
పేజీలు : 18, వెల : రూ.30
ప్రతులకు : 0883-2421123

***

**నిలువుటద్దం** (నెమిలేటి కవితలు)
రచన : నెమిలేటి కిట్టన్న
పేజీలు : 106, వెల : రూ. 90
ప్రతులకు : విశాలాంధ్ర

***

**సాక్ష్యం చెప్పని కృష్ణమ్మ**
రచన : అధరాపురపు తేజోవతి
పేజీలు : 152, వెల : రూ. 50
ప్రతులకు : డా. ఎ. తేజోవతి, 1/14, బ్రాడీపేట, గుంటూరు-522002

# వేలూరి కథల్లో వేయి కోణాలు




వేలూరి శివరామ శాస్త్రి కథల మొదటి సంపుటాన్ని 35 కథలతో 2012 నవంబర్‌లో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించింది. ఇవన్నీ 1925 నుంచి 1950 వరకూ ఆయన రాసిన కథలు. కాగా, ప్రస్తుత రెండవ సంపుటాన్ని కూడా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఏడు కథలతో ప్రచురించింది. బహుముఖ సాహితీ వ్యక్తిత్వంగా పేరున్న వేలూరి శివరామ శాస్త్రి కథలు మూసపోసి ఉండవు. ప్రతి కథా వస్తువులోనూ వైవిధ్యం ఉంటుంది. సృజనాత్మకత ఉంటుంది. ఒక కథకూ మరో కథకూ శైలీ శిల్పాలు పూర్తిగా మారిపోతాయి. మొదట్లో కొన్ని కథల్లో కనిపించిన గ్రాంథికం ఆ తరువాత కనిపించక పోవడం విశేషం.

జీవితాన్ని, సమాజాన్ని, ప్రాచ్య, పాశ్చాత్య గ్రంథాలను ఆయన ఎంతో లోతుగా, ఎంతో నిశితంగా పరిశీలించేవారనడానికి ఆయన కథలే తార్కాణం. 1892లో జన్మించి, 1967లో కన్నుమూసిన శివరామ శాస్త్రి ఎంచుకున్న ఇతివృత్తాలు గ్రామాలకో, పట్టణాలకో మాత్రమే పరిమితం కాలేదు. ఆయన కథల్లోని పాత్రలు కూడా ఒకదానికొకటి పూర్తిగా భిన్నంగా కనిపిస్తాయి. ఎక్కువగా మానసిక ఒత్తిళ్లకూ, మానసిక ఘర్షణలకూ పెద్ద పీట వేసే ఈ కథలు ఎవరి మనసులకైనా వెంటనే హత్తుకుపోతాయి. కాదేదీ కవితకు అనర్హమన్నట్టుగా ప్రతి సామాజిక అంశాన్నీ ఆయన తన ఇతివృత్తానికి ఎంచుకుంటారు. ఉదాహరణకు ఆయన తన వస్తువుగా ఒక్క హిందూ జీవితాల్ని మాత్రమే కాదు, ముస్లిం, క్రైస్తవ మత జీవితాల్ని కూడా ఎంచుకున్నారు. ఇతర మతస్థుల స్థితిగతులను కూడా కథా వస్తువుగా తీసుకోవడాన్ని బట్టి ఆయన సమాజాన్ని ఎంతగా అధ్యయనం చేసిందీ అర్థం చేసుకోవచ్చు. ఇక ఐతిహాసిక, పౌరాణిక, చారిత్రక పాత్రలను కూడా ఆయన అంతే తేలికగా తన కథా వస్తువులో జొప్పిస్తారు.

'ఓబయ్య', 'చీకటి తప్పు' అనే కథల్లో బ్రిటిష్ రాజుల కాలం నాటి సామాజిక పరిస్థితులను కళ్లకు కట్టించారు. అప్పటి విలాసాలు, వేషభాషలను సున్నితంగా స్పృశించారు. సంపన్నతనూ, పేదరికాన్నీ అద్భుతంగా పోల్చి చూపారు. 'హిందూ దేశము నందలి గ్రామ చరిత్ర అంతయు నొక్కటియే' అని ఓబయ్య కథలో ఓ పాత్రతో చెప్పిస్తారు. పురుషుల డబ్బు విలువలకు మహిళలు ఏవిధంగా బలయ్యేదీ చెప్పే ఓబయ్య కథ ఆసాంతం ఆసక్తిగా చదివిస్తుంది. 'అమ్మనమ్ముకుందాం' అనే కథ కూడా దాదాపు ఈ కోవకు చెందిందే. ఓ రైతు దృక్కోణం నుంచి భూదేవితో సంవాదం ద్వారా సమాజాన్ని వీక్షించే ఈ కథ ఈ మొత్తం ఏడు కథల్లోనూ ఎంతో చక్కని కథ, ఆర్ద్రమైన కథ అని చెప్పుకోవచ్చు.

అలాగే 'చదరంగం' కథను మెచ్చనివారుండరు. ఒకపక్క అల్లుడి నిర్వాకాన్ని ఎండగడుతూనే కడుపుబ్బ నవ్వించే కథ ఇది. ఈ రెండవ సంపుటం తెలుగు కథా పరిణామానికి ఎంతో దోహదం చేసే కథా సంకలనం.

**– జి. రాజశుక**

**వేలూరి శివరామ శాస్త్రి కథలు** (రెండవ సంపుటం)
పేజీలు : 183, వెల : రూ. 125, ప్రతులకు : విశాలాంధ్ర

# రక్త దానం.. ప్రాణ దానమే!




మనిషి బరువులో కేజీ ఒక్కింటికి 76 మి.లీ. రక్తం ఉంటుంది. వాస్తవానికి 50 మి.లీ. రక్తం ఉంటే సరిపోతుంది. మిగతాది దానం చేయొచ్చు. స్విట్జర్లాండులో అత్యధికంగా ప్రతి వెయ్యి మంది జనాభాలో 113 మంది రక్తదానం చేస్తుంటే.. మన దేశంలో ఆ సంఖ్య 4-6 మాత్రమే. దీనిని కనీసం 10-15 మందికి పెంచితే మన దేశ అవసరాలన్నీ తీరతాయి. ఈ పుస్తకం చదివితే సుబ్బరాజు గారి ఆశయంలో మనమూ భాగస్వాములం కావాలనే ఆలోచన వస్తుంది. ఎన్నో ప్రాణాలు నిలబడతాయి.

**రక్తం-రక్తదానం**, పెన్మెత్స సుబ్బరాజు, **పేజీలు** : 183, వెల : రూ.100, బ్లడ్ బ్యాంకులకు, రక్తదాన ఉద్యమకారులకు, సంస్థలకు ఉచితం. ప్రతులకు : 94911 84911

## కొత్తపుస్తకాలు

# కొల్లేటి జీవనకావ్యం

కొల్లేటి సరస్సుపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆధారపడిన ప్రజల జీవన శైలి, ఆచార వ్యవహారాలు, పలుకుబడులు, కష్టాలు, సుఖాలు, ప్రేమలూ, ద్వేషాలు .. వీటన్నిటి విశ్వరూప సందర్శనమే 'కొల్లేటి జాడలు'. ఒక సామాజికాభివృద్ధి దశలో జరిగిన ఘటనల అంతస్సారాన్ని గ్రహించి, వచ్చిన మార్పులను నిష్పక్షపాతంగా, సజీవంగా, అందమైన కళారూపంగా వ్యక్తం చేయడంలో రచయిత కృతకృత్యులయ్యారు.




మనుషుల పట్ల, సమాజం పట్ల అవ్యాజ ప్రేమ ఉంటే తప్ప ఇలాంటి కరుణాపూరితమైన నవలను రాయడం సాధ్యం కాదు. ఈ నవలలో అనేక పాత్రలు మానవత్వానికి నిలువెత్తు దర్పణంలా నిలబడతాయి. అనేక సందర్భాలలో పాఠకుల కళ్లు చెమర్చి, హృదయం బరువెక్కుతుంది. ఆద్యంతమూ మానవత్వపు గుబాళింపుతో కథనాత్మక కావ్యంలా సాగుతుందీ నవల.

ఈ నవలలో మరో అద్భుత ఘట్టం – సమిష్టి వ్యవసాయం. మట్టి మనుషులంతా ఏకమై – సముద్రంలాంటి కొల్లేట్లో మునిగి, అడుగున్న మట్టిపెళ్లను తీసుకొని పెద్ద పెద్ద గట్లను నిర్మించి, అయిదొందల ఎకరాల మేరకు సమిష్టి వ్యవసాయాన్ని అయిదారేళ్లపాటుగా కొనసాగించేరన్న నిజాన్ని చదివి ఆశ్చర్యంతో, ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవుతాం. రచయిత తన బాల్యంలో ఈ యజ్ఞానికి ప్రత్యక్ష సాక్షి కాబట్టే దాన్ని ఎంతో సాధికారంగా రాయగలిగేరు. ఎలెక్స్ హెలీ 'ఏడు తరాలు' లో ఆఖరి తరానికి చెందినవాడు కాబట్టే, ఆ నవలకంత విశ్వసనీయత ఏర్పడింది. హెన్రీ మిల్లర్ అన్నట్లుగా "Writing is autobiography and autobiography is therapy, which is a form of action"

తెలుగుదేశంలోని ఒక ప్రాంతానికి చెందిన ప్రజలు ఒకప్పుడు ఇలా జీవించారు, ఇంతటి ఘన విజయాన్ని సాధించారన్న వాస్తవాన్ని దేశ ప్రజలందరూ తెలుసుకునేందుకు ఈ నవలని దేశ భాషలన్నిట్లోకి తర్జుమా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనలో 'మనిషితనం' ఎంత మిగిలి ఉందో తెలుసుకునే లిట్మస్ టెస్ట్‌గా ఈ నవలని అందరూ చదవాల్సిందే, గుండెల్లో బరువు దింపుకోవాల్సిందే. రచన అంతస్సారానికి తగినట్టుగా పుస్తకం ముఖచిత్రం కూడా అద్భుతంగా తీర్చిదిద్దారు.

– యాళ్ల అచ్యుత రామయ్య

**కొల్లేటి జాడలు** , అక్కినేని కుటుంబరావు
పేజీలు: 220, వెల: రూ.100/–
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు, ఈ బుక్: కినిగె డాట్ కామ్.

# వార్తా కథలు

ఇప్పటికే వంద పైచిలుకు కథలతో సాహిత్య లోకానికి సుపరిచితుడైన సింహప్రసాద్ ఆరవ కథల సంపుటి ఇది. బరువైన వాక్యాలకు, గాఢమైన వర్ణనలకు అతీతంగా చెప్పదలచుకున్న విషయాన్ని ముక్కుసూటిగా చెప్పడం ఆయన పద్ధతి. కథల్లో నాటకీయత కొట్టొచ్చినట్టు కనిపించినా, అది వాస్తవికత అనే భ్రమ పాఠకుడిలో కలిగించే కనికట్టు చేయగల రచయిత. సరిగ్గా అలాంటి భ్రమకు లోను చేసే కథ 'అమ్మ దొరికింది'. చిన్నతనంలో తల్లికి దూరమైన కథానాయకుడికి నిరంతరం అమ్మ కలవరింతే. ఆయన దృష్టిలో ప్రేమ, ధైర్యం, నమ్మకం, భరోసా, ఆశ – వెరసి అమ్మ. కనిపించిన ప్రతివారిలో అమ్మే కనిపిస్తుంది. చివరికి కొడుకులుండీ నిరాదరణకు గురైన ఒక ముసలి తల్లి అతనికి తారసపడ్డం, ఆమెను అమ్మగా భావించి అక్కున చేర్చుకోవడం – దాని సారాంశం. 'జరిగిన కథ' అనే మరో కథలో తను ప్రేమించిన అమ్మాయి తనను ప్రేమించలేదన్న కసితో యాసిడ్ పోసి, ఆమె జీవితాన్ని అంధకారం చేయడంతో పాటు తన జీవితాన్ని కటకటాల పాలు చేసుకొంటాడు హీరో. వస్తువు వార్తా కథనమే. అయినా వాస్తవంగా జరుగుతోంది కదా అని ఒప్పిస్తాడు రచయిత. కాలక్షేపం కథలు ఇష్టపడేవారికి బాగా నచ్చుతాయి.



– తహిరో

**జో అచ్యుతానంద జోజో ముకుందా**,
సింహప్రసాద్, పేజీలు: 198, వెల: రూ.100
ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు
ఈ బుక్: కినిగె డాట్ కామ్

# బౌద్ధం గురించి మరోసారి

బౌద్ధం గురించి గతంలో ఎందరో ఎన్నో రకాలుగా తమదైన శైలిలో చెబుతూ వస్తున్నారు. మహానుభావుల పేర్లను వినడం వేరు – వారి వెనకున్న గొప్పదనం తెలియడం వేరు. ఆ గొప్పని సందర్శించ గలిగినప్పుడే వాళ్లు మనకు మార్గదర్శకులవుతారు. ఆ క్రమంలో బుద్ధుడి గొప్పతనాన్ని సూటిగా, సులువుగా, క్లుప్తంగా చెప్పే ప్రయత్నం చేశారు ఈ పుస్తకంలో.




లుంబినీవనంలో జన్మించినప్పటి నుండి మరణించేవరకు వరకు బుద్ధుడి జీవితంలో జరిగిన ముఖ్యమైన సంఘటనలన్నిట్నీ ఇందులో తీసుకున్నారు. దేశ విదేశాల్లో బౌద్ధం వ్యాప్తి చెందిన క్రమాన్ని కూడా వివరించారు.

బుద్ధుడి మాటల్లో చెప్పాలంటే – అవసరం లేని ఆసక్తులను నిర్మూలించి, మనసులోంచి భయాన్ని పారద్రోలి, శాంత చిత్తం పొందినవారు ఎప్పుడూ సుఖంగా, సంతోషంగా ఉంటారు; మనసే మనల్ని నడిపిస్తుంది ... మనసును జయించగలిగితే ప్రపంచాన్ని జయించినట్లే; బిడ్డ పుట్టుక నుంచి మరణించేవరకు పూజలు, కర్మలు, క్రతువుల పేరుతో పురోహితులు పెత్తనం చేస్తూ ఉంటారు. వాటిని ఎదుర్కోవాలి; ఆరోగ్యం కంటే కోరదగిన ఐశ్వర్యం లేదు ... 2400 సంవత్సరాల క్రితమే ఇంతటి సార్వజనీన సూత్రాలను ప్రవచించిన బౌద్ధధర్మం పట్ల ఎవరికి ఆసక్తి ఉండదు? ఎన్ని పుస్తకాలు వచ్చినా మరోటి ఎప్పుడూ ఆహ్వానించదగిందే.

– గౌరుసు

**బుద్ధుడు – బౌద్ధ ధర్మం**, డా. పొనుగోటి కృష్ణారెడ్డి
పేజీలు: 112, వెల: రూ.100, ప్రతులకు: 94409 74788

# రక్షణ

★ ప్రొఫెసర్ కె. పద్మలత



**ఉదయం ఎనిమిది గంటలు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు డ్యూటీకి వెళ్లడానికి రెడీ అవుతున్నాడు. స్నానం చేసి, బ్రేక్ ఫాస్ట్ కానిచ్చాడు. తర్వాత యూనిఫారం వేసుకుని, సోఫాలో కూర్చొని వంగి షూ వేసుకుంటున్నాడు. ఇంతలో ఆయన భార్య లలిత కాఫీ కప్పుతో రావడం చూసి ''ఇప్పుడొద్దోయ్, త్వరగా వెళ్లాలి''అన్నాడు.**

**''ఏంటంత హడావుడి, కాఫీ కూడా తాగకుండా'' చిరాగ్గా అంది లలిత.**

''ఎలక్షన్లోయ్. ఇంకో రోజులయితే గాని మాకీ హడావుడి తగ్గదు'' అన్నాడు లేచి నిల్చుంటూ.

ఈశ్వరరావు ఎనిమిదేళ్ల కొడుకు ఆశ్రిత్ అక్కడే కూర్చొని గట్టిగా చదువుకుంటున్నాడు. 'మ్యాన్ ఈజ్ ఎ సోషల్ బీయింగ్' అని ''నాన్నా! దీనర్థం ఏంటి!'' అనడిగాడు.

''మానవుడు సంఘజీవి అని'' చెప్పి, ''లలితా, నేను వెళ్తున్నాను. ఎలక్షన్ టైం కాబట్టి నేనెప్పుడొస్తానో నాకే తెలీదు. నువ్వు భోంచెయి. నాకోసం చూడొద్దు'' అన్నాడు.

''నాన్నా! సంఘజీవి అంటే ఏమిటి?'' ఆశ్రిత్ మళ్లీ అడిగాడు.

''ఒరేయ్ నాన్నా! నేను త్వరగా వెళ్లాలిరా. నన్ను చంపకు, మీ అమ్మను అడుగు, ఓపిగ్గా చెపుతుంది'' అంటూ లోపలికి వెళ్లి రివాల్వర్ తీసుకుని బయటికొచ్చాడు.

''నువ్వు రోజూ రివాల్వర్ ఎందుకు తీసుకెళ్తావు నాన్నా!'' మళ్లీ ప్రశ్న.

''రక్షణ కోసం''.

''అది నీకు రక్షణ కల్పిస్తుందా''అనుమానంగా చూస్తూ అడిగాడు ఆశ్రిత్.

''నన్నొదిలేయరా బాబూ. నీ అనుమానాలన్నీ తర్వాత తీరుస్తాను'' అంటూ హడావుడిగా బయటకు నడిచాడు. అప్పటికే డ్రైవర్‌తో సహా బయట జీపు సిద్ధంగా ఉంది. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కొచ్చేసరికి పోలీసులు, ఇతర జనంతో అక్కడంతా హడావుడిగా ఉంది. ఈశ్వరరావు లోపలికి వెళ్లి సబ్ ఇన్‌స్పెక్టర్‌ను పిలిచి ''మనవాళ్లందరూ ఎలక్షన్ డ్యూటీకెళ్తున్నారా, ఎవరెవరు ఎక్కడికి వెళ్లాలో చెప్పావా'' అని అడిగాడు.

''ఆర్డర్స్ ఇచ్చేసాను సార్ అందరికీ . కొన్ని విలేజెస్‌కు రోడ్డు సరిగా లేదు. టూవీలర్స్ మీద వెళ్లాలి'' అన్నాడు ఎస్సై శ్రీనివాస్.

''సరే, టూ వీలర్స్ మీదే వెళ్లమను. ఎలక్షన్ డ్యూటీకి వెళ్తున్న ఎంప్లాయీస్ బస్సులలో సెక్యూరిటీగా వెళ్తున్న వారి లిస్టు ఉందా'' అడిగాడు.

''ఉంది సార్. చూపిస్తాను.''

ఇంతలో ఒక కానిస్టేబుల్ లోపలికి వచ్చి సెల్యూట్ చేసి నిల్చున్నాడు.

ఈశ్వరరావు అతని వంక చూసి ''చెప్పు, ఏం కావాలి'' అడిగాడు. ఇన్‌స్పెక్టర్ అతనిని చూసి ''అరే, మళ్లీ వచ్చావా! చెప్తే వినిపించుకోవేం'' అని గట్టిగా అరిచి ఈశ్వరరావుతో ''సార్, ఇతడు ఏజన్సీ ఏరియాలోని నాగారం విలేజికి వెళ్లాలి. టూ వీలర్‌పై వెళ్లమంటే వెళ్లనంటున్నాడు. ఏదైనా బస్సులో వెళ్లే ఎలక్షన్ డ్యూటీ ఆఫీసర్స్‌కి సెక్యూరిటీగా వెళ్తా అంటున్నాడు'' అన్నాడు. ఈశ్వరరావు అతన్ని చూసి ''నాగారం ఎందుకు వెళ్లవు'' అనడిగాడు. అతను నసుగుతూ ''సార్! ఆ వూరికి రోడ్డు సరిగ్గా లేదు. టూవీలర్ పైననే వెళ్లాలి. నాతో పాటు ఇంకొకరే ఉంటారు. అందుకని భయం సార్!''

ఈశ్వరరావు అతన్ని విచిత్రంగా చూసి ''భయమా! అంత భయముంటే పోలీసు డిపార్టుమెంట్‌లో ఎందుకు చేరావు'' అన్నాడు.

''పోలీసులమైనా మనుషులమే కదా సార్. అది నక్సలైట్ ఏరియా. దారిలో ఏమైనా చేసినా దిక్కులేదు'' భయంగా అన్నాడు.

''నీ దగ్గర గన్ లేదా! ఉంది కదా. ఇంకా ఎందుకు భయం?''

''ఆయుధాలు వాళ్ల దగ్గర కూడా ఉంటాయి కదా సార్. అది నాకెట్లా రక్షణ ఇస్తుంది.''

ఈశ్వరరావు విసుగ్గా చూసి ''ఇంతకూ ఏమంటావ్. ఎలక్షన్ డ్యూటీ చేయవా'' కఠినంగా అడిగాడు.

''చేస్తాను సార్. కాని, బస్సులో వెళ్లేవారికి సెక్యూరిటీగా వెళ్తాను...మీరు పర్మిషన్ ఇస్తే'' రిక్వెస్టింగ్‌గా అన్నాడు.

''నీ పేరేంటి?''

''సుబ్రహ్మణ్యం సార్.''

''చూడు సుబ్రహ్మణ్యం, బస్సులో వెళ్తే వచ్చే లాభమేంటి.''

''చాలామంది ఉంటారు కదా సార్. వాళ్లందరి మధ్య ఉండడం కాస్త ధైర్యంగా ఉంటుంది.''

''అంటే, నువ్వు వాళ్లకు సెక్యూరిటీగా వెళ్తున్నావా, లేక వాళ్లు నీకు సెక్యూరిటీ ఇవ్వాలా'' నవ్వుతూ అడిగాడు.

ఈశ్వరరావు నవ్వు చూసి కానిస్టేబుల్‌కి కాస్త ధైర్యం వచ్చింది. ''నలుగురి మధ్య ఉండి డ్యూటీ చేయడం హ్యాపీగా ఉంటుంది సార్. కానీ, ఒకరిద్దరు ఉన్నప్పుడు ఎన్ని ఆయుధాలున్నా కూడా భయంగానే ఉంటుంది'' అన్నాడు.

''పిరికి సన్నాసి, అనవసరంగా పోలీసు డిపార్టుమెంట్‌లో చేరాడు''సబ్‌ఇన్‌స్పెక్టర్ చిరాగ్గా అన్నాడు.

ఈశ్వరరావు కాస్సేపు ఆలోచించాడు. ''ఈ కానిస్టేబుల్ మాటల్లో కొంత వాస్తవముంది. నిజానికి ఈ ఎలక్షన్ టైంలో, ఇప్పుడున్న టెన్స్ సిట్యుయేషన్‌లో ఒకరిద్దరిని వెళ్లమంటే భయంగానే అనిపిస్తుంది'' అనుకున్నాడు.

''పోనీ, ఆ రూట్‌లో వెళ్లే వాళ్లందరూ ఒకేసారి వెళ్లండి'' అన్నాడు.

''ఏంటి సార్! గట్టిగా వెళ్లమని చెప్పక అతన్ని కన్విన్స్ చేస్తారు'' చిరాగ్గా అన్నాడు సబ్‌ఇన్‌స్పెక్టర్.

''తొందర పడకు శ్రీనివాస్. అతనికిష్టం లేనప్పుడు ఇబ్బంది పెట్టడమెందుకు'' అని ''ఆ...ఏంటీ చెప్పు అలా వెళ్తారా'' అన్నాడు.

''సార్...ప్లీజ్ సార్. నేను బస్సులోనే వెళ్తాను. ఏ ప్లేస్ అయినా ఫరవాలేదు.''

''సరే...నీ ఇష్టం. కాని, నువ్వు పోలీసువై ఉండి అంత పిరికిగా ఆలోచించకూడదు. కాస్త ధైర్యం పెంచుకో'' అని, ''శ్రీనివాస్! ఇతన్ని వేరేచోటికి బస్సులో వెళ్లేవారికి సెక్యూ

## ఈవారం కథ

రిటీగా పంపించు'' అన్నాడు.

''థాంక్యూ సార్!'' అని బయటకు వెళ్లాడు సుబ్రహ్మణ్యం.

ఆ తర్వాత నెలరోజులకు కమలాపూర్ అడవిలో నక్సలైట్లు ఉన్నారన్న సమాచారం రావడంతో సబ్ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొంతమంది పోలీసులు కూంబింగ్ జరుపగా జరిగిన ఎదురుకాల్పులలో ఇద్దరు నక్సలైట్లు చనిపోయారు. ఇద్దరు పారిపోయారు. పోలీసులు వారికోసం వేట ప్రారంభించారు. రెండు రోజులకు నారపల్లి తండాలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని తెలిసి పోలీసులక్కడికి వెళ్లి అతడిని అరెస్టు చేసి తీసుకొచ్చారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రావు అప్పుడు పోలీస్‌స్టేషన్‌లోనే ఉన్నాడు.''సార్! మొన్న పారిపోయిన నక్సలైట్ ఇతనే'' అన్నాడు ఎస్సై శ్రీనివాస్.

''ఇతడు దొరికాడని ఎస్పీగారికి ఇన్ఫర్మేషన్ ఇవ్వాలి'' అని అతని వైపు తిరిగి, ''నీ పేరేంటి'' అన్నాడు ఈశ్వరరావు.

''ప్రసాద్'' అన్నాడు నీరసంగా. అతని మొహం వాడిపోయి ఉంది. చాలా అలసటగా కనిపిస్తున్నాడు. ''కూర్చో'' అన్నాడు ఈశ్వర్‌రావు పక్కనున్న బెంచి చూపిస్తూ. అతడు కూర్చున్నాడు.

''సార్...''అని ఆశ్చర్యంగా చూస్తున్న శ్రీనివాస్‌తో ''ఫరవాలేదులే..చాలా నీరసంగా కనిపిస్తున్నాడు. కూర్చోనీ'' అన్నాడు. ఎస్సై చిరాగ్గా చూసాడు.

'ఎన్ని రోజులైంది ఉద్యమంలో చేరి' అన్నాడు.

''రెండు సంవత్సరాలైంది''

''ఎందుకు చేరావు''

''మాది చాలా పేద కుటుంబం. నాన్న వ్యవసాయకూలీగా పనిచేస్తాడు. అమ్మ కూడా కూలీ పనికి వెళ్తుంది. అయిదుగురు పిల్లలం. కష్టంమీద ఇంటర్‌మీడియట్ వరకు చదివాను. సరిగా రాయకపోవడం వల్ల ఎగ్జామ్స్‌లో ఫెయిల్ అయ్యాను. ఇంటికి వెళ్తే నాన్న తిడ్తాడని భయపడి రెండు రోజులు బయటే తిరిగాను. ఈలోగా నక్సలైట్ ఉద్యమంలో పనిచేస్తున్న నా స్నేహితుడొకడు కలిసి నన్ను తీసికెళ్లాడు. అప్పటినుండి వాళ్లతోనే ఉంటున్నాను. ఆ తర్వాత వాళ్ల ఆశయాల మీద, ఉద్యమాల మీద ఇంట్రెస్ట్ పెరిగింది'' అన్నాడు.

''నీ స్నేహితుని పేరేంటి''

''అదిప్పుడు అనవసరం సార్, అతడు బహుశా చనిపోయి ఉంటాడు'' బాధగా అన్నాడు ప్రసాద్.

''వీళ్లొక పట్టాన వాళ్ల వివరాలు బయటపెట్టరు సార్. మీరే అనవసరంగా జాలిపడ్తున్నారు'' ఎస్సై కోపంగా అన్నాడు.

ఈశ్వరరావు ఆ మాటలు పట్టించుకోనట్టుగా ''ఆ రోజు ఎంతమంది ఉన్నారు అక్కడ'' అని అడిగాడు.

ప్రసాద్ తలవంచుకుని ''నలుగురు'' అన్నాడు.

''ఇద్దరు చనిపోయారు... ఆ విషయం నీకు తెలుసా''

''నిన్న తండాలో అనుకుంటుంటే విన్నాను'' గద్గద స్వరంతో అన్నాడు ప్రసాద్.

''ఇంకొక వ్యక్తి ఏమయ్యాడు''

''తెలీదు''

''నిజంగా తెలీదా''

''అందులో అబద్ధమేముంది. కాల్పులు ప్రారంభించగానే తలా ఒకవైపు పరిగెత్తాం. ఎవరికి ఏమైందో ఇంకొకరికి తెలీదు''

''నీ విషయం చెప్పు. ఆ తర్వాత నువ్వేం చేసావు''

''పోలీసులొచ్చారని అర్థమైంది. వారెలాగు ఎక్కువ సంఖ్యలో ఉంటారు కనుక తప్పించుకోవడం కష్టమని కూడా అర్థమైంది.



అందుకే నాకు తోచిన వైపు పరిగెత్తాను. ఆ రోజంతా పరిగెడ్తూనే ఉన్నాను. ఎట్లాగైనా దగ్గరలోని ఏదో ఒక ఊరికి చేరుకుంటే మంచిదని భావించాను'' అని ఆగాడు.

''ఆ తర్వాత''

''ఒకవైపు ఆకలి, నీరసం, మరోవైపు దొరికిపోతానేమోనన్న భయం. భుజానికున్న కిట్ బ్యాగ్ మోయడం కష్టంగా ఉంది. చీకటి పడింది. ఏం చేయాలో తెలీక, నడిచే ఓపిక లేక అక్కడున్న పెద్దరాయిలాంటి దాని మీద కూర్చుని, ఆ తర్వాత నిద్రపోయాను. తెల్లారి లేచి మళ్లీ నడక మొదలుపెట్టాను. ఎలాగోలా మనుషుల మధ్యకు చేరుకోవాలనే ఆరాటంలో ఆకలిని కూడా లెక్కచేయక పరిగెత్తాను.

అతని గొంతులో దుఃఖం ఛాయలు కనిపిస్తున్నాయి. ఈశ్వరరావు అతన్ని జాలిగా చూసాడు. 'నిండా ఇరవై రెండేళ్లు కూడా ఉండవేమో. అప్పుడే ఈ అనుభవాలు, సంఘర్షణలు' అనుకున్నాడు.

''ఎందుకంత తొందర. నీ దగ్గర ఆయుధాలు లేవా?'' అని అడిగాడు.

అతడు అనుమానంగా చూసి ''ఉన్నాయి. కాని ప్రత్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఉండి, నేనొక్కడినే ఉన్నపుడు ఆయుధాలెన్ని ఉన్నా, అవి ఎంతమేరకు రక్షణ కల్పిస్తాయి?''

''జనం మధ్యకు వెళ్తే మాత్రం, పోలీసులు నిన్నేం చేయరని ఎలా అనుకున్నావు''

''జనం మధ్యలో ఉన్నపుడు కచ్చితంగా ధైర్యంగా ఉంటుంది. నా చుట్టూ ఉన్నవారిలో కొంతమందైనా నన్ను సపోర్టు చేయకపోతారా. పైగా జనం చూస్తుండగా పోలీసులు నన్నెలా కాల్చగలరు? అదే ధైర్యం నాకు. అందుకే, ఎలాగోలా ఆ తండాకు చేరుకోగానే కాస్త ఊపిరి తీసుకున్నాను. నేనెవరో వాళ్లకి చెప్పలేదు. కాని నన్ను కొందరు అనుమానంగానే చూసారు. ఆకలితో ఉన్న నాకు ఒక ముసలమ్మ జొన్నరొట్టె ఇచ్చింది. అది తిని నీళ్లు తాగిన తర్వాత ప్రాణం లేచొచ్చింది. ఈలోగా ఎలా తెలిసిందో గాని, మీ వాళ్లొచ్చి నన్ను పట్టుకున్నారు''.

''సరేలే, ఎస్పీ గారొచ్చేవరకు కూర్చో. ఆ తర్వాత ప్రెస్‌మీట్‌లో మాట్లాడాల్సి ఉంటుంది. నాకు చెప్పిందే వాళ్లకు కూడా చెప్పు'' అని ఈశ్వరరావు వెళ్లి చెయిర్‌లో కూర్చున్నాడు.

ఆ రోజు రాత్రి డిన్నర్ చేసిన తర్వాత ఈశ్వరరావు బయట కారిడార్‌లో కూర్చొని ఆలోచిస్తున్నాడు. గత నెల రోజుల్లో తనకు రెండు విచిత్రమైన అనుభవాలు ఎదురైనాయి. ఆ రోజు ఎలక్షన్ డ్యూటీకి వెళ్లమంటే కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం ఆయుధాలున్నా కూడా జనం మధ్య ఉండడమే మంచిదని అభిప్రాయపడి బస్సులో వెళ్లడానికి ఇష్టపడ్డాడు. ఈ రోజు నక్సలైట్ ప్రసాద్ కూడా తనవద్ద ఆయుధాలున్నా, ఎంత కష్టపడైనా సరే జనం మధ్యకు చేరుకోవాలని తాపత్రయపడ్డాడు. అంటే దానర్థం ఏంటి? ఆయుధాలు మనుషులకు కొంతమేరకు రక్షణ కల్పిస్తాయి గాని, సమాజంలోని జనం మధ్యలో ఉండడం, ప్రజలతోడు...ఇవే మనుషులకు అసలైన రక్షణ కల్పిస్తాయి'' అనుకున్నాడు. 'మ్యాన్ ఈజ్ ఎ సోషల్ బీయింగ్' అని కొడుకు చదివింది గుర్తొచ్చింది. 'ఈ రివాల్వర్ నీకు రక్షణ కల్పిస్తుందా నాన్నా!' అన్న మాటలు కూడా గుర్తొచ్చాయి. 'మానవుడెప్పుడూ సంఘ జీవిగా ఉండడమే మంచిది. ఏ రాబిన్‌సన్ క్రూసోలాగానో అడవిలో ఉండడం ప్రస్తుత పరిస్థితులలో అంత శ్రేయస్కరం కాదేమో' అనుకున్నాడు. 'మనుషుల మధ్య ఉండే సామాజిక బంధం ఎంత గొప్పది. అది వారిలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, రక్షణను కలుగజేస్తుంది' అని కూడా అనుకున్నాడు.

..........................

రచయిత్రి సెల్ : **98496 10222**

# నాన్‌వెజ్ స్నాక్స్



❖ ఫుడ్ కోర్ట్



## చికెన్ టిక్కీలు

కావలసిన పదార్థాలు: (దంచిన) చికెన్ – అరకేజీ, శనగపప్పు – అరకప్పు, నీరు – 1 కప్పు, ఉప్పు – తగినంత, ఉల్లి తరుగు – అరకప్పు, అల్లం తరుగు – 1 టీ స్పూను, జీరా, యాలకుల పొడి – అర టీ స్పూను చొప్పున, దనియాపొడి – 1 టీ స్పూను, చిదిమిన లవంగాలు – 2, గరం మసాల – 1 టీ స్పూను, కొత్తిమీర తరుగు – పావు కప్పు, నూనె – 2 టేబుల్ స్పూన్లు, గిలకొట్టిన గుడ్లు – 2.

తయారుచేసే విధానం: ఒక పాత్రలో చికెన్, శనగపప్పు, నీరు, చిటికెడు ఉప్పు వేసి పప్పు మెత్తబడేవరకు ఉడికించాలి. అల్లం, వెల్లుల్లి, ఉల్లి, మిగతా మసాల పొడులతో పాటు మరికొద్ది ఉప్పు వేసి రుబ్బి చికెన్ మిశ్రమలో కలపాలి. ఈ ముద్దని అరంగుళం మందంతో, వడల్లా వత్తుకుని ఫ్రిజ్‌లో అరగంటసేపు ఉంచాలి. తర్వాత గుడ్డుసొనలో ముంచి నూనె రాసిన పెనంపై రెండు వైపులా దోరగా కాల్చుకోవాలి. పెరుగు చట్నీ మంచి కాంబినేషన్.

## కీమా బాల్స్

కావలసిన పదార్థాలు : మటన్ కీమా – 150 గ్రా., ఎండు మిర్చి – 2, పుట్నాలు – 1 టేబుల్ స్పూను, జీడిపప్పు – 4, సోంపు – 1 టీ స్పూను, కొబ్బరి తురుము – 2 టేబుల్ స్పూన్లు, చిన్న ఉల్లిపాయలు – 6, అల్లం తురుము – 2 టీ స్పూన్లు, వెల్లుల్లి – 6 రెబ్బలు, యాలక్కాయ – 1, దాల్చినచెక్క – అంగుళం ముక్క, లవంగం – 1, కరివేపాకు – 4 రెబ్బలు, గుడ్డు – 1, ఉప్పు – తగినంత, నూనె – వేగించడానికి సరిపడా.

తయారుచేసే విధానం: టీ స్పూను నూనెలో కీమా వేసి నీరు ఆవిరయ్యేవరకు వేగించాలి. కొద్ది నూనెలో యాలక్కాయ, దాల్చినచెక్క, లవంగం, కరివేపాకు, అల్లం తురుము, వెల్లుల్లి, ఉల్లి తరుగు, మిర్చి, జీడిపప్పు, సోంపు, కొబ్బరి తురుము ఒకటి తర్వాత ఒకటి వేగించి పుట్నాల పప్పు చల్లి దించేసి చల్లారనివ్వాలి. ఇవన్నీ మిక్సీలో (నీరు కలపకుండా బరకగా) పొడి చేయాలి. ఇందులోనే కీమా, ఉప్పు, గుడ్డు వేసి అర నిమిషం తిప్పాలి. ఈ ముద్దను గులాబ్‌జామ్ సైజులో ఉండలు చేసుకుని నూనెలో దోరగా వేగించాలి (మంట మరీ చిన్నగా, పెద్దగా కాకుండా చూసుకోవాలి).





## ఎగ్ స్ప్రింగ్‌రోల్స్

కావలసిన పదార్థాలు: గుడ్ల తెల్లసొన – అరకప్పు, క్యారెట్ – 1, క్యాబేజీ – పావు కేజీ, బీన్స్ – 50 గ్రా., సోయా సాస్ – 1 టేబుల్ స్పూను, అజినమోటో – పావు టీ స్పూను, మిరియాల పొడి – చిటికెడు, ఉప్పు – రుచికి తగినంత. కవరింగ్ కోసం : మైదా – పావు కేజీ, గుడ్డు – 1, నూనె – వేగించడానికి సరిపడా.

తయారుచేసే విధానం: స్పూను నూనెలో తెల్ల సొన వేసి పొరటులా చేసుకోవాలి. కొద్ది నీటిలో కూరగాయలను సగం వరకు ఉడికించి నీరు ఒడగట్టి గుడ్డు పొరటు, అజినమోటో, సోయాసాస్, మిరియాల పొడి, ఉప్పు కలపాలి (ఈ మిశ్రమం ముద్దలా కాకుండా పొడిగా ఉండాలి). మైదాని చపాతీ పిండిలా కలిపి పూరీల్లా వత్తుకొని మధ్యలో తగినంత మిశ్రమం పెట్టి రోల్ చేసి రెండు వైపులా మడవాలి. అంచుల్లో గుడ్డు సొన పూసి పది నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత నూనెలో దోరగా వేగించాలి. టమోటా సాస్‌తో నంజుకుంటే చాలా రుచిగా ఉంటాయి.

❖ బ్లాగోతం

# మా ఆవిడా ఇంతే, మరి మీ ఆవిడ..?

ఆహా, వారాంతం! విసుగు విరామాలకు ఇక ఇదే అంతం అనుకుంటూ ఆనందంగా ఇంటికి చేరాను. చేరి చూద్దును కదా, మా ఆవిడ కోపగృహము సీన్‌లో కనిపించేసరికి గుండె జల్లుమంది. “దేనికిరా బాబు ఈ సారి టెండరు” అని మనసులోనే అనుకుని కాస్త దగ్గర చేరి “ఏంటి డియర్..”అంటూ అనునయించబోయాను. ఊహూ వింటేనా? పట్టు వదలని విక్రమార్కునిలా మరో అర గంట ప్రయత్నించినా ఫలితం లేదు. ఇక మనకి సత్రం భోజనం, మఠం నిద్రే గతి అనుకుంటూ మా ఆవిడ చూడకుండా మా అంజిగాడికి రెండు మిస్‌డ్ కాల్స్ ఇచ్చాను. మరో రెండు నిమిషాల్లో అంజిగాడు ఫోన్ చేసాడు. స్పీకరు ఫోన్ ఆన్ చేయగానే “క్లయింట్ కాల్...చాలా అర్జంటు...వెంటనే ఆఫీసుకు రావాలి...” అని వచ్చింది. (ఈ కాల్స్ విషయంలో నాకూ అంజిగాడికి గొప్ప అవగాహన ఉంది) “సారీ డియర్” అని చెప్పి నేను హడావుడిగా బయటపడి అంజిగాడి గది వైపు కారు పరిగెత్తించాను.

అంజిగాడి గదిలోకి వెళ్లగానే వాడు విశాలంగా నవ్వుతూ ఆహ్వానించాడు. ఎదురుగా టేబుల్‌పై విస్కీ సోడాలతో పాటు కెంటకీ ఫ్రయిడ్ చికెన్ పాకెట్టు పలకరించాయి. ఈ విషయంలో వాడిది చాలా గొప్ప అభిరుచి. లాప్‌టాప్ ఏవో గజల్స్ పాడటం మొదలుపెట్టగానే విస్కీ గ్లాసులోకి వంపుతూ నేను కాస్త ఈర్ష్యగా అన్నాను. “ఒరేయ్, పెళ్లి చేసుకోవడం లాంటి



ప్రోగ్రాం ఏమీ పెట్టుకోవద్దురా. చాలా మిస్సయిపోతాం లైఫులో.”

వాడు కళ్లెగరేసి గ్లాసందుకుని “నాకు అలాంటి..” ఒక్క క్షణం ఆగి కాస్త బీరు చప్పరించి “..బాధలేమీ ఉండవు గురూ ఎందుకంటే ఈ పుస్తకంలోని టెక్నిక్కులని ఫాలో అవుతున్నాను” అంటూ, నా ముందుకు ఓ పుస్తకాన్ని తోసాడు.

పుస్తకం కవరుపై అక్షరాలు మెరుస్తున్నాయి. “వై మెన్ లై అండ్ వుమెన్ క్రై.”

మేము విస్కీ సీసా ఖాళీ చేసేలోపు వాడు ఆ పుస్తకం ఎన్ని కాపీలు అమ్ముడుపోయిందో, ఆ పుస్తకం సారాంశమేమిటో, ఆ పుస్తకం చదివిన తర్వాత గత నాలుగు రోజుల్లో వాడికీ, నందినికీ(నందిని, అంజిగాడి గర్ల్ ఫ్రెండు) ఎన్ని గొడవలు సమసిపోయాయో సోదాహరణంగా చెప్పాడు. నాకు హఠాత్తుగా మహాభారతంలో గీతోపదేశం సీన్ గుర్తొచ్చింది.

అంజిగాడు చివరి పెగ్గు లాగిస్తూ చెప్పాడు “ఇదే పుస్తకాన్ని తెలుగులోకి అనువదించాలనుకుంటున్నాను. మంచి క్యాచీగా ఉండే టైటిలు కావాలి గురూ.”

“మగవాళ్లెందుకు తాగుతారు–ఆడవాళ్లెందుకు వాగుతారు” అనేసి నేను మరో పెగ్గుకు సిద్ధమవుతుండగా వాడు నా వంక ముత్యాల ముగ్గు రావుగోపాల్రావు పద్ధతిలో చూసి, “మడిసన్నాక కూసింత కళాపోసణుండాలి, లేకపోతే మడిసికి, మొగుడికి తేడా ఏవుంటుంది చెప్పు?” అనేసి పడుకున్నాడు.

ఆ డైలాగు దెబ్బకు నాకు మత్తు దిగిపోయింది. ఇక ఆ రాత్రి చాలా దీక్షగా ఆ పుస్తకం చదివేసాను. ఆ పుస్తకంలో చెప్పిన అతి ముఖ్యమైన సూత్రం ఏమిటంటే, “ఆడవాళ్లకు కావలసింది కేవలం సానుభూతితో వాళ్ల సమస్యలు వినేవాళ్లు. పరిష్కారాలు కాదు. అందువల్ల సమస్యలను ఎప్పుడూ పరిష్కరించే ప్రయత్నం చేయవద్దు. కేవలం వినేసి సానుభూతి చూపిస్తే చాలు.” నాకు గొప్ప చిదంబర రహస్యం అర్థమైనట్టుగా అనిపించింది.

ఉత్సాహంగా వెలిగిపోతూ ఇంటికి బయలుదేరాను. ఆ రోజుకి సమస్య ఏమీ అనిపించలేదు. మా ఆవిడ చెప్పేదంతా కళ్లు విప్పి (వింటున్నట్టు ఉండాలంటే అలాగే చేయాలిట మరి) వినడం అలవాటు చేసుకున్నాను. మూడేళ్ల క్రితం జరిగిన వాళ్ల పిన్ని తమ్ముడి కూతురి పెళ్లిలో తనెందుకు ఫీలయిందో, వాళ్ల అన్నయ్య బావమ్మర్ది ఇంట్లో కిటికీ కర్టెన్ రంగులు ఎందుకు సరిగ్గా మ్యాచ్ కాలేదో, వాళ్ల చెల్లెలి కూతురికి చేయించిన గాజుల డిజైన్ ఎందుకు బాలేదో ...ఒకటేమిటి మా ఆవిడ గడగడా చెబుతుంటే, తలాడించడమే నా పని. అంతా విని, “ప్చ్! చాలా కష్టపడ్డావ్ డియర్”,“నీకు కాబట్టి ఇవన్నీ తెలిసాయి” లాంటి స్టాకు డైలాగులు చెబితే చాలు.

మా ఆవిడ ఆఫీసులో ఉన్నప్పుడు ఫోన్ చేసినా, చెప్పేదంతా వింటున్నట్టుగా రిసీవరు పక్కన పెట్టేసి మధ్య మధ్యలో “అవునా, ఆహా” అంటున్నాను.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. పుస్తకంలోని కిటుకులు బాగా పని చేస్తున్నాయి. రెండు వారాల పాటు అంజిగాడి దగ్గరికి వెళ్లే అవసరం రాలేదు. వాడూ డిటోయే, నందిని చెప్పే సోదంతా వింటున్నాడు(ట).

హమ్మయ్య, పుస్తకం పుణ్యాన “బతుకు పరిమళించెనే...” అని ఆఫీసులో పాడుకుంటూ ఉండగా, హఠాత్తుగా నా కేబిన్‌లోకి అంజిగాడు ఊడిపడ్డాడు.

“ఒరేయ్, అర్జంటుగా ఓ వెయ్యిడాలర్లు కావాల్రా, శాలరీ రాగానే ఇస్తాను” అన్నాడు.

వాడి అకౌంట్లోకి ఇఫ్టి చేస్తూ అడిగాను నేను. “ఇంతకీ దేనికిరా”

“ఫోను బిల్లు కట్టడానికి రా మామా, పుస్తకంలో కిటుకులు కాదు గానీ ఈ సారి ఫోను బిల్లు పేలింది” అంటూ నా గుండెల్లో బాంబు పేల్చాడు.

వెంటనే నా (మా ఆవిడదిలెండి) ఫోన్ బిల్లు చూద్దును కదా, మొత్తం బిల్లు 1670 డాలర్లు. ఈ సారి నా గుండెల్లో అణుబాంబు పేలింది. ఈ ఫోను బిల్లు విషయం చెప్పనందుకు పుస్తకం రాసినాయనకు ప్రపంచంలోని బూతులన్నీ రాసి మెయిలు కొడదామనిపించింది.

ఇంతలో ఫోన్ మోగింది. మా ఆవిడ నుంచే, “బిజీగా ఉన్నాను” అని చెప్పి ఫోన్ పెట్టేస్తుండగా, అంజిగాడన్నాడు.

“సాయంత్రం రూంకు రారా మామా!”

ఇక చెప్పేదేముంది, మనకు తప్పేదేముంది.

మా ఆవిడ ఇంతే, మరి మీ ఆవిడ...?

..........

prasadm.wordpress.com నుంచి

**తాయ్‌చీ అంటే ఉక్కు పిడికిలి అని ఒక అర్థం. మనకు ప్రశాంతతను చేకూర్చి, జీవశక్తిని పెంపొందించే వ్యాయామాన్ని 'ఉక్కు పిడికిలి' అని ఎందుకు పిలుస్తారు? అనే అనుమానం రావచ్చు. తాయ్‌చీ వ్యాయామాలు మన శరీరంపై దాడి చేసే రకరకాల వ్యాధులను తరిమితరిమి కొడతాయి. మన శరీరాన్ని ఒక ఉక్కుపిడికిలిలా మారుస్తుంది. బహుశా అందుకే తాయ్‌చీకి ఈ పేరు వచ్చి ఉండచ్చు. ఇప్పుడు తాయ్‌చీ వల్ల కలిగే లాభాలేమిటో చూద్దాం..**



# తాయ్‌చీతో దృఢమైన శరీరం

తాయ్‌చీ వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలు రెండూ మెరుగుపడతాయని అనేక అధ్యయనాలు తెలియజెప్పాయి. వాస్తవానికి ఈ రెండు ఒక దానిపై మరొకటి ఆధారపడినవే. తాయ్ చీ వ్యాయామాలను క్రమం తప్పకుండా చేస్తే- కండరాలకు అదనపు శక్తి లభిస్తుంది. జీవకణాలు పరిపుష్టమవుతాయి. మానసిక ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. వీటన్నింటి ప్రభావం శారీరక ఆరోగ్యంపై కనిపిస్తుంది. అంతే కాకుండా తాయ్ చీ వల్ల- శరీరంలోని అవయవాలన్నీ సక్రమంగా పనిచేస్తాయి. దెబ్బలు తగిలినా త్వరగా మానతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే- భవిష్యత్తులో జబ్బులు రాకుండా కాపాడటమే కాకుండా వర్తమానంలో ఉన్న ఆరోగ్య సమస్యలను కూడా తీరుస్తుంది తాయ్‌చీ.

మన శరీరంలో రక్తనాళాల ద్వారా ఆక్సిజన్, ఇతర పోషకాలు సరఫరా అవుతూ ఉంటాయి. ఈ రక్తనాళాలలో సమస్యలు వస్తే- గుండెజబ్బులు, పక్షవాతం, కిడ్నీ వైఫల్యం వంటి అనేక జబ్బులు వచ్చే అవకాశముంది. క్రమం తప్పకుండా తాయ్‌చీ వ్యాయామం చేసేవారిలో రక్తప్రసారం క్రమబద్ధమవుతుంది. తాయ్‌చీ చేసేవారిపై ఇప్పటి దాకా శాస్త్రవేత్తలు చేసిన అనేక అధ్యయనాలలో ఈ కింది ఫలితాలు కనిపించాయి.

★ పురాతన చైనా వైద్య పద్ధతుల్లో అరికాళ్లకు, అరిచేతులకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఈ రెండింటిలోను రక్తప్రసారం సరిగ్గా జరగకపోతే కీళ్ల నొప్పుల నుంచి కండరాల నొప్పుల దాకా అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. కంప్యూటర్లను ఎక్కువగా ఉపయోగించేవారిలో, డ్యాన్సర్లలో కీళ్లు, కండరాలకు సంబంధించిన అనేక సమస్యలను మనం గమనించవచ్చు. తాయ్‌చీ వ్యాయామాలు అరిచేతుల్లోను, అరికాళ్లలోను రక్తప్రసారాన్ని బాగా పెంచుతాయి. దీని వల్ల కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు తగ్గుతాయి.

★ ఒక వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలంటే పటిష్టమైన రోగ నిరోధక వ్యవస్థ ఉండాలి. ఈ రోగ నిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే రక్తప్రసారంతో పాటు గ్రంధులు తగిన మోతాదుల్లో హార్మోన్లను విడుదల చేయాలి. తగిన మోతాదుల్లో హార్మోన్లను విడుదల చేయటమనేది తాయ్ చీ వ్యాయామాల ద్వారా సాధ్యమేనని తాజా అధ్యయనాలలో తేలింది. అంటే రోగ నిరోధక వ్యవస్థ బలిష్టంగా తయారుకావటంలో కూడా తాయ్‌చీ ప్రముఖ పాత్ర పోషించగలుగుతుంది.

★ మన శరీరంలోని క్లోమ గ్రంధి (లింఫ్ గ్లాండ్) అతి చిన్నదైనా అత్యంత శక్తివంతమైనది. లింఫ్ గ్లాండ్ సక్రమంగా పనిచేస్తే తరచూ జలుబులు, జ్వరాలు రావు. తాయ్‌చీ వ్యాయామాల వల్ల పెద్ద పెద్ద కండరాలు మాత్రమే కాకుండా లింఫ్ గ్లాండ్ వంటివి కూడా ప్రేరేపితమవుతాయి.



★ తాయ్ చీలో వ్యాయామాలు చాలా నెమ్మదిగా ఉంటాయి. దీని వల్ల శరీరంలోని శక్తి తల మీద నుంచి కాలి వేళ్ల వరకూ ప్రసారమవుతుంది. శరీరపు కదలికల్లో కూడా సమతుల్యత ఏర్పడుతుంది. మన శరీరంపై మనకు పట్టు వస్తుంది. ఎటువంటి ప్రతికూల పరిస్థితినైనా ఎదుర్కోగలమనే ధైర్యం కలుగుతుంది.

★ తాయ్ చీ సూత్రాల ప్రకారం జీవశక్తి తల దగ్గర ఉంటుంది. ఇది శరీరంలోని అన్ని ప్రాంతాలకు ప్రసరించినప్పుడే మానవుడు ఆరోగ్యంగా ఉండగలుగుతాడు. తాయ్ చీ వ్యాయామాలను క్రమం తప్పకుండా చేస్తే జీవశక్తి శరీరంలోని వివిధ భాగాలకు ప్రసారమవుతుంది.

★ తాయ్ చీ అన్ని వయస్సుల వారికి సమర్థంగా పనిచేస్తుంది. చిన్న పిల్లల దగ్గర నుంచి వృద్ధుల దాకా అందరూ ఈ వ్యాయామాలను చేయవచ్చు.

\- శ్రీభావ

# మిక్చర్ పొట్లం

బొమ్మలు: ఎస్.రాజశేఖర్ రెడ్డి

## జన్మ జన్మల బంధం



''ఆ వెంకట్‌గాడు రోజూ నా వెంట పడుతు న్నాడు ... అర్థం కావటం లేదే'' వాపోయింది సరోజ.

''ఇందులో అర్థం కాకపోవడానికేముందే ... పూర్వజన్మలో వాడు కుక్కగా, నీవు దాని యజమానిగా పుట్టి ఉంటారు'' తేలిగ్గా కొట్టేసింది హిమజ.

– యు.చిట్టిబాబు, పాల్వంచ

## శకునం చూడొద్దా?



''వేటకు బయల్దేరి వెంటనే వచ్చే శావేం'' అనుమానంగా అడిగింది పెళ్లాం పిల్లి.

''గుమ్మం దాటగానే నల్లటి మనిషి ఎదురొచ్చాడు ... కాస్సేపయ్యాక వెళ్తాలే'' చెప్పింది మొగుడు పిల్లి.

## అలా పనికొచ్చింది



''ఎంసెట్‌లో సీటు సంపాదిం చాలని మీ వాడు చాలాసార్లు ఎంట్రెన్స్ రాశాడు కదా .. సీటొ చ్చిందా?'' అడిగాడు మూర్తి.

''సీటు రాలేదు కానీ, ఆ అనుభ వంతో ఎంసెట్ కోచింగ్ సెంటర్ నడుపుతున్నాడు ప్రస్తుతం '' చెప్పాడు శర్మ.

## నామం



తల్లిదండ్రులు పెడితే ... నామం
నీకు నీవు పెట్టుకుంటే ... స్వనామం
స్నేహితులు పెడితే ... సర్వనామం
ప్రియురాలు పెడితే ... పంగనామం

– అబ్బగాని భాస్కర్, మహబూబాబాద్

## తాగమరిగిన పిట్ట



బుచ్చిబాబు చేపల వేటకె ళ్లాడు. చెరువు ఒడ్డుకు చేరిన తర్వాత గుర్తుకొచ్చింది తన వద్ద గేలానికి గుచ్చడానికి ఎర ల్లేవని. అనుకోకుండా కొద్ది దూరంలో ఒక పిట్ట ముక్కుతో ఎరని పొడిచి తినడం చూశాడు. ఒడుపుగా పిట్టని పట్టి ఎర లాగి, ప్రతిఫలంగా పిట్ట నోట్లో తన దగ్గరున్న విస్కీని నాలుగు చుక్కలు పోసి వదిలేశాడు.

కొద్ది సేపయ్యాక తన వీపుని ఎవరో గోకినట్టు అయితే వెనుదిరిగి చూశాడు బుచ్చిబాబు. మరో మూడు ఎరలను ముక్కున కరుచుకుని తెచ్చింది పిట్టమ్మ.

## తెగని పాకం



''మా 'పవిత్రబంధం' సీరి యల్ వెయ్యి ఎపిసోడ్స్ పూర్తి చేసు కున్న సందర్భంగా మీ అమూల్య అభిప్రాయం చెప్పండి'' అడిగింది టీవీ యాంకరమ్మ.

''ఈ సీరియల్‌కి పవిత్ర బంధం బదులు 'తెగని బంధం' అని పెడితే సరిపోయేది'' ఠపీమని చెప్పాడు ఒక బుల్లితెర ప్రేక్షకుడు.

## హతవిధీ ...



''మహారాజా ... మన యువరాణిగారు కనిపిం చడం లేదు'' కంగారుగా పరిగెత్తుకొచ్చింది అంతఃపుర చెలికత్తె.

''ఆఁ ... వెంటనే రాజ్యం నలుదిక్కులా కట్టుదిట్టం చేయించండి. ఏడీ ... మన యువ సేనాధిపతి ... క్షణాల్లో నా ఎదుట ఉండేట్టు పిలిపించండి'' గర్జించాడు మహారాజు.

పిన్‌డ్రాప్ సైలెన్స్ లోంచి మెల్లగా వినిపించిన మాట –
''యువ సేనాధిపతి కూడా కనిపించడం లేదు ప్రభూ''

## క్యా డైలాగ్ హై



**''జీవితం పుస్తకం లాంటిది. మొదటి పేజీలో పుట్టుకను, చివరిపేజీలో మరణాన్ని రాసిపెట్టాడు దేవుడు. మధ్యలో పేజీలన్నీ ఖాళీ. ఎందులో ఏది రాసుకుంటావో అదే నీ జీవితం''**

(చిత్రం: పాండవులు పాండవులు తుమ్మెదా)

పంపినవారు: కొంగర ఉమామహేశ్వరరావు, తెనాలి.

# సినిమా పజిల్

నిర్వహణ : యజ్ఞమూర్తి

## అడ్డం

1. విజయవంతంగా ఆడుతున్న 'ప్రతినిధి' హీరో (5)
4. కృష్ణ, విజయనిర్మల జంటగా తాతినేని ప్రకాశరావు తీసిన సినిమా (5)
6. నాగార్జున, రమ్యకృష్ణ, ఆమని కాంబినేషన్‌తో వచ్చిన చిత్రం 'ఘరానా...' (3)
7. శ్రీకాంత్ సినిమా 'దేవరాయ' దర్శకుడు (4)
9. సాగర్ డైరెక్షన్‌లో వచ్చిన 'అన్వేషణ' హీరో (4)
10. జగపతిబాబు, స్నేహ జంటగా వచ్చిన చిత్రం అటు ఇటయ్యింది (2)

## నిలువు

1. 'కౌరవుడు' (2000)లో హీరో (4)
2. చిరంజీవి, మాధవి జంటగా కె.ఎస్.ఆర్. దాస్ డైరెక్షన్‌లో వచ్చిన చిత్రం (4)
3. కె.వి. నాగేశ్వరరావు, గీతాంజలి జంటగా అక్కినేని సంజీవరావు డైరెక్ట్ చేసిన చిత్రం (3)
5. 'విజయగౌరి'లో ఎన్టీఆర్ జోడీ (3)
7. జూ. ఎన్టీఆర్ 'దమ్ము'లో విలన్ (3)
8. 'చందమామ కథలు'లో ఓ నాయకుడు (3)
9. 'సత్యం శివం'లో అక్కినేని జోడీ (2)

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | ● | 3 |
| | ● | | ● | ● | ● | |
| | ● | 4 | | 5 | | |
| 6 | | | ● | | ● | ● |
| ● | ● | ● | 7 | | 8 | |
| 9 | | | | ● | | ● |
| | ● | ● | | ● | 10 | |

### గత వారం జవాబులు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 ప్ర | తి | ఘ | 2 ట | న | ● | 3 సా |
| భు | ● | ● | బు | ● | ● | హ |
| 4 దే | వి | 5 క | ● | 6 మా | రు | తి |
| వా | ● | స్తూ | ● | బా | ● | ● |
| ● | 7 గి | రి | 8 బా | బు | ● | 9 రో |
| ● | రి | ● | గుం | ● | ● | హి |
| 10 తే | జ | ● | 11 ది | వ్య | వా | ణి |

# అంకేళి

నిర్వహణ : పి. రాఘవరెడ్డి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | | | | 3 | | | | 8 |
| 3 | 7 | | 4 | 2 | 8 | | 6 | 9 |
| 9 | 4 | | | 5 | | | 3 | 2 |
| | 9 | | | | | | 2 | |
| 1 | 6 | 7 | | | | 3 | 4 | 5 |
| | 8 | | | | | | 1 | |
| 7 | 5 | | | 1 | | 2 | 8 | |
| 8 | 3 | | 2 | 7 | 4 | 6 | 5 | |
| 2 | | | | 8 | | 7 | | |

అడ్డం, నిలువులోనే కాకుండా బాక్సులో, క్రాస్‌లో కూడా 1 నుండి 9 అంకెలు ఒకసారే వచ్చేలా నింపాలి. దాదాపు సుడోకు లాంటిదే. కాని రెండు క్రాస్‌లలో కూడా రావడం ఇందులో అదనం.

### గత వారం జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 4 | 1 | 6 | 7 | 8 | 9 | 2 | 3 |
| 7 | 2 | 8 | 9 | 4 | 3 | 1 | 5 | 6 |
| 6 | 9 | 3 | 2 | 1 | 5 | 8 | 7 | 4 |
| 1 | 6 | 7 | 8 | 9 | 2 | 3 | 4 | 5 |
| 8 | 5 | 2 | 3 | 6 | 4 | 7 | 9 | 1 |
| 9 | 3 | 4 | 1 | 5 | 7 | 6 | 8 | 2 |
| 2 | 1 | 9 | 5 | 8 | 6 | 4 | 3 | 7 |
| 3 | 7 | 6 | 4 | 2 | 9 | 5 | 1 | 8 |
| 4 | 8 | 5 | 7 | 3 | 1 | 2 | 6 | 9 |

# పూరణం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | ■ | 4 | | 5 | 6 |
| 7 | | ■ | 8 | 9 | | ■ | 10 | |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | |
| 11 | 12 | ■ | 13 | | 14 | ■ | 15 | |
| ■ | 16 | | | ■ | 17 | | | ■ |
| 18 | | ■ | 19 | 20 | | ■ | 21 | 22 |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | |
| 23 | 24 | ■ | 25 | | 26 | ■ | 27 | |
| 28 | | | | ■ | 29 | | | |

## అడ్డం

1. బొలీవియా గెరిల్లా వీరుడిగా జగమెరిగిన యోధుడు (4)
4. ఊర్లో సంచరించే వరాహం (4)
7. ఉప్మా వంటకు కీలకమైన పదార్థం (2)
8. అడక్కుండానే ఉచితం ఇచ్చేది (3)
10. బోర్లా పడ్డ వెదురు బుట్ట (2)
11. చివర లేని డజను (2)
13. ఈ కాలంలో ఒంటికి పట్టేది (3)
15. చేపకోసం గేలానికి గుచ్చేది (2)
16. అయోనిజ మరో పేరు (3)
17. మరులు కాదు, ముంగురులు (3)
18. పండుకు పూర్వ రూపం – అట్నుంచి (2)
19. యజ్ఞం (3)
21. పగ – శత్రువుపై కట్టేది (2)
23. ఘంటసాల ఆలపించిన 'కరుణశ్రీ' విలాపం (2)
25. గజ్జిగా అవతరించిన పంకజం (3)
27. పాలగుమ్మి పద్మరాజు పొట్టి పేరు (2)
28. దారితప్పిన 'ప్రయాణికుడు' (4)
29. దిద్దుబాటు (4)

## నిలువు

1. నిలువు 6కు సంబంధించిన కవి, రాజై అవతరించాడు (4)
2. అవ్వ కాదు – అడవి పావురం (2)
3. కృష్ణుడు గోపికలతో ఆడిన క్రీడ (2)
4. మనసులో సృష్టించుకున్న సుందరి (2)
5. శబరిమల తీరంలో ప్రవహించే పెద్ద నది (2)
6. నగ్నత్వాన్ని గుర్తుకు తెచ్చే కవులు (4)
9. ఆమర్త్య నోబెల్ శాంతి బహుమతి పొందిన చిన్నారి – అట్నుంచి (3)
12. ఒక కరేబియన్ ద్వీప దేశం (3)
13. '––– కనరావా, నిరాశ బూని పోయితివా' అక్కినేని పాడుకున్న పాట (3)
14. తడబడ్డ డప్పు (3)
15. వీటి బెడదకే కొందరు ఇంట్లో పిల్లిని పెంచుకుంటారు – ఏకవచనం (3)
18. చిత్రగుప్తుని శాశ్వత విలాసం (4)
20. బొడ్డు కోల్పోయిన గురుత్వ కేంద్రం (3)
22. తెలుగులో 'సారీ' కోరండి (4)
24. అల్లర్లలో జనాన్ని చెదరగొట్టడానికి పోలీసులు వదిలే వాయువు – కిందనుండి (2)
25. తొక్క – పవన్‌కల్యాణ్‌కు కోపం వస్తే తీస్తాడు! (2)
26. ఈ పట్టులో తర్కం కూడదంటాడు (మాయాబజార్) శ్రీకృష్ణుడు (2)
27. మట్టిని తవ్వే పని ముట్టు (2)

నిర్వహణ : గౌరుసు

## గత వారం జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 కు | 2 చే | లు | 3 డు | ■ | 4 జ | య | 5 ప్ర | 6 ద |
| 7 రు | మ | ■ | 8 వే | 9 మ | న | ■ | 10 భ | యం |
| క్షే | ■ | ■ | ■ | ద్రా | ■ | ■ | ■ | మ |
| 11 త్రం | 12 సూ | ■ | 13 ము | సు | 14 గు | ■ | 15 స | తి |
| ■ | 16 దం | డ | న | ■ | 17 ర | వి | క | ■ |
| 18 అం | టు | ■ | 19 క | 20 న | క | ■ | 21 లం | 22 బ |
| ధ | ■ | ■ | ■ | రేం | ■ | ■ | ■ | రం |
| 23 కా | 24 జా | ■ | 25 ఆ | ద్ర | 26 రు | ■ | 27 బా | పు |
| 28 రం | గా | రా | వు | ■ | 29 చి | దం | బ | రం |

# ఈవారం కవితలు

సెలవులు సమీపిస్తున్నయంటే
మనసంతా అమ్మగారింటి చుట్టే

బాల్యపు ఎండాకాలపు ★తాతీలల్ల
ఆ ఊల్లోనే చల్లబడ్డాను

పంటపొలంకు పారే నీళ్లల్ల
చెమట ఎట్లా కలె కలుస్తుందో
మన్నుల ఎంత తల్లడిల్లుతే
నోట్లెకింత బువ్వ దక్కుతుందో
నేను తాత నాగటి సాల్లెంబడి
తిరుక్కుంట తిరుక్కుంట తెల్సికున్న

బాయి .. దొడ్డి .. ఎడ్లు .. వడ్లు
రోజూ వడ్లకొండ తాళ్ళు
మా తాత వ్యవసాయ జీవన రహస్యం

## పెద్ద పహాడ్

ఇల్లు .. ఇత్తనాలు .. ఎవుసం
సద్దులు .. సుద్దులు .. సుట్టాలు .. పక్కాలు
అమ్మమ్మ ఆనందపు జీవన సూత్రం

చిన్నమామ చెప్పిన మహాభారత గాధ
చిన్నప్పుడే చెవికెక్కింది
పెద్దమామ నేర్పిన పెద్ద బాలశిక్ష
అప్పటికప్పుడే అబ్బింది

తల్లికడుపు పిల్ల కర్సి పట్టుకొని
పిల్లను తల్లి దాసుకొని కొమ్మ నెగిరే
వానరసేనల దునుకు దృశ్యాలు
ఇప్పటికీ ఆ చెరిగిపోని కావ్యాలు
గుంపులు గుంపుల కోతుల మందల
ప్రాకృతిక జీవనం అద్భుత చిత్రం

చిన్నప్పుడందరికీ
ఇల్లు కంటే అమ్మగారిల్లంటేనే
ఎక్కువ మక్కువ
ఎందుకంటే అక్కడ ★★గావురం ప్రవహిస్తది

ఎండాకాలం
సెలవులే కాదు
ఏ సెలవులైనా మాకు
పెద్ద పహాడే
అదో పెద్ద విడిది క్షేత్రం
ఇప్పుడది జ్ఞాపకాల నేత్రం

★ తాతీలు = సెలవులు

★★ గావురం = గారాబం



– అన్నవరం దేవేందర్
94407 63479

బొమ్మలు : అక్బర్



## మా అమ్మ

మదర్స్‌డే సందర్భంగా...

వేకువ జామునే లేచి
చీకటి ముసుగు తీసి
పొద్దుని నిద్దుర లేపే
తొలిపొద్దు మా అమ్మ

పుల్ల పుడక పోగేసి
పొయ్యి కింద రాజేసి
ఆకలికే అగ్గిపెట్టే
నిప్పురవ్వ మా అమ్మ

ఇంటిని చక్కదిద్దడానికి
ఒంటిని వింటిగ మలచి
తన శక్తినంతా సంధించే
సవ్యసాచి మా అమ్మ

నేలతల్లి నెత్తిమీద
గొడుగల్లే నడుమొంచి
చల్లని నీడను పరిచే
చెమట పూలచెట్టు మా అమ్మ

వెలుతుర్ని మింగి చీకటి
మా ఇంటిని కబ్జా చేసినప్పుడు
మాలో ధైర్యాన్ని నింపే
దీపమై వెలిగేది మా అమ్మ

– పెద్దిపాగ పున్నారావు
99592 48542

# వెండితెర బంగారం - 50



## 'ఊహలు గుసగుసలాడే ... నా హృదయం ఊగిసలాడే'

**'పి**చ్చిపుల్లయ్య' (1953) నిర్మాణ సమయంలో తీసిన **కృష్ణకుమారి** స్టిల్ ఇది.

ఆమె 6.3.1932న పశ్చిమ బెంగాల్‌లోని నైహాటీలో జన్మించారు. సోదరి షావుకారు జానకి అడుగుజాడల్లో నడవాలని శ్రద్ధగా నృత్యం అభ్యసించారు. 'నవ్వితే నవరత్నాలు' (1951) చిత్రంతో కథానాయికగా వెండితెరపైకి వచ్చారు. ఆ తర్వాత ప్రియురాలు, పిచ్చిపుల్లయ్య, బంగారుపాప లాంటి చిత్రాల్లో నటించినా అంతగా పేరు రాలేదు. ఎల్వీప్రసాద్ తన 'ఇలవేల్పు' (1956)లో రేలంగి సరసన హాస్యపాత్రనిచ్చారు. ఆమె చిత్రాల్లో శతదినోత్సవం జరుపుకున్న మొదటి చిత్రం ఇదే. విఠలాచార్య జయవిజయ (1959) విజయం ఆమెను వెండితెర రాజకుమారిని చేసింది. అదే సమయంలో 'రతి' పేరుతో కొన్ని హిందీ చిత్రాల్లోనూ నటించారు.

జమునతో అగ్రహీరోలిద్దరి పేచీ కృష్ణకుమారికి లాభించింది. 'భార్యాభర్తలు' (1961) చిత్రంలో జమునను కథానాయికగా తీసుకోవాలని నిర్మాతలు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడం వలన అది కృష్ణకుమారికి అదృష్టంగా పరిణమించింది. ఆ చిత్రంలో 'శారద' పాత్రలో జీవించారామె. ఇక వెనుదిరిగి చూడకుండా సంవత్సరానికి దాదాపు 18 సినిమాల్లో నటించారు. అదృష్టం కొద్దీ ఆమె నటించిన చిత్రాలన్నీ మ్యూజికల్ హిట్సే.

పెళ్లికానుక, పునర్జన్మ, కులగోత్రాలు, వాగ్దానం, తిరుపతమ్మకథ, శాంతినివాసం, చదువుకున్న అమ్మాయిలు వంటి పలు చిత్రాల్లో ఎంతో గొప్పగా నటించారు. ఆమె అందం ఒక్కోసారి ఆమె నటనను డామినేట్ చేసేది.

కృష్ణకుమారి తారాపథంలో వెలిగిపోతున్న రోజుల్లోనే ఉన్నట్టుండి 16.3.1969న అజయ్ మోహన్ ఖైతాన్ అనే రాజస్థానీని వివాహం చేసుకుని పరిశ్రమ నుండి తప్పుకున్నారు. కొంతకాలం తర్వాత కారెక్టర్ ఆర్టిస్టుగా పునఃప్రవేశం చేశారు. ఆమె ఆఖరు చిత్రం 'ఫూల్స్'.

కృష్ణకుమారి దంపతులకు ఒక్కతే కూతురు. పేరు దీపిక. కృష్ణకుమారి భర్త రెండేళ్లక్రితం మరణించారు. ప్రస్తుతం మనవడి ముద్దుమురిపాలు చూసుకుంటూ, సోదరి జానకితో పాత జ్ఞాపకాలు నెమరేసుకుంటూ తన ఎస్టేట్‌లో ప్రశాంతంగా కాలం గడుపుతున్నారు ఆమె.

నిర్వహణ : డా. కంపల్లె రవిచంద్రన్, 98487 20478

# పైల్స్, ఫిస్టులా & ఫిషర్స్ కు

హోమియోలో పాజిటివ్ ఫలితాలు



- అధిక రక్తస్రావం
- ఎక్కువసేపు కూర్చోవడానికి ఇబ్బంది పడడం
- మూత్రాశయంలో దురద, మంట
- మూత్రాశయ పగుళ్ళు, ఇన్ఫెక్షన్లు మొ॥న ఎన్నో సమస్యల నుండి సత్వర పరిష్కారం అందిస్తుంది **'పాజిటివ్'**

థైరాయిడ్ చికిత్స కొరకు

థైరోసెల్

పాజిటివ్ హోమియోపతి వారి సౌజన్యంతో™

# థైరాయిడ్

మన జీవితంపై ఎంతగా ప్రభావితం చేస్తుందో మీకు తెలుసా?



## థైరాయిడ్ వల్ల సమస్యలు

- అధిక బరువు
- సంతానలేమి
- నెలసరి సమస్యలు
- అతినిద్ర
- జుట్టు రాలటం
- అతి సున్నితత్వం

# "సంతాన ప్రాప్తిరస్తు"

ఇన్ఫెర్టిలిటీ లోపాలను తొలగించుకొనేందుకు

POSITIVE INFERTILITY

Powered by Positive Homeopathy

**అమ్మా** అని పిలుపించుకోవాలి అనుకునే మీ కలను నిజం చేసుకొనేందుకు,



- ఇతర మందుల ప్రభావం
- ఆందోళనలు • అత్యల్ప స్పెర్మ్
- ఇంపోటెన్సీ • సంతానలేమి
- హార్మోనల్ సమస్యలు
- నెలసరి సమస్యలు
- సెక్స్ కోరికలు తగ్గడం
- భార్యాభర్తల మధ్య లైంగిక సమస్యలు

ఆర్థరైటిస్ చికిత్స కొరకు

Positive Orthopathy

A Positive Homeopathy Initiative

# నొప్పులు తో

మొదలయ్యే సమస్యలు...



- రుమటాయిడ్ ఆర్థరైటిస్
- స్పాండిలైటిస్
- ఫ్రోజెన్ శోల్డర్
- గౌటీ ఆర్థరైటిస్
- సోరియాటిక్ ఆర్థరైటిస్
- ఆస్టియో ఆర్థరైటిస్

ఉచిత సలహాలకై: 1800 425 0144 | ఆంధ్రప్రదేశ్, తమిళనాడు & కర్ణాటక | SMS 'POSITIVE' to 55352

The art of healing

# పాజిటివ్ హోమియోపతి

నెం.1 వరల్డ్ క్లాసికల్ హోమియోపతి An ISO 9001 - 2000 Certified ®

- అమీర్‌పేట • S.R. నగర్ • మెహిదీపట్నం • కూకట్‌పల్లి
- విక్రమ్‌పురి • కాచిగూడ • దిల్‌షుక్‌నగర్ • A.S.రావు నగర్
- నిజామాబాద్ • కర్నూల్ • గుంటూరు • విజయవాడ
- వైజాగ్ • తిరుపతి • రాజమండ్రి • బెంగుళూరు • చెన్నై

డాక్టర్ గారితో డైరెక్ట్‌గా సంప్రదించండి

**96527 54053**

ఉ॥ 10 గం॥ల నుండి రాత్రి 7 గం॥ల వరకు

www.sricharanamedia.com

ఫ్రీ డాక్టర్ కన్సల్టేషన్ కొరకు

**92461 99933**

*Follow us on :*

www.positivehomeopathy.com

18 మే 2014

# ఆదివారం ఆంధ్రజ్యోతి



14 బ్లాగోతం
ఒక రాజు - నలుగురు కొడుకులు



16 బాటసారి
దర్శకుడు మారుతి





# వేయిస్తంభాలు మళ్లీ నిలబడ్డాయి

ఫిల్మ్‌నగర్





# 'స్టార్స్' ఫోన్ మ్యానర్స్!

కొందరు ఫోన్ రింగ్ అవుతున్నా అస్సలు లిఫ్ట్ చేయరు. మరి కొందరు అస్త మానం ఫోన్‌లో మాట్లాడుతూనే కాలక్షేపం చేస్తుంటారు. ఇంకొందరు మెసేజ్‌లతో సరి పుచ్చుతారు. మరి మన స్టార్ల సంగతేంటీ? నిరంతరం మోగే ఫోన్లకు వాళ్లు ఎలా రియాక్ట్ అవుతారు? ఈ వివిపీలకు ఎలాంటి ఫ్యాన్సీ నెంబర్లుంటాయి?

బాలీవుడ్ స్టార్ల సన్నిహితులు చెప్పిన 'స్టార్స్' ఫోన్ మ్యానర్స్ ఇలా ఉన్నాయి. బ్లాక్‌బ్యూటీ బిపాషాకు అప్పట్లో ఫన్నీ కాలర్ ట్యూన్ ఉండేదట. ఎవరు ఫోన్ చేసినా 'హలో.. హలో.. నాకేం వినబడటం లేదు. కాస్త పెద్దగా మాట్లాడండి' అనే ఇంగ్లీషు మాటలు వినిపించేవట. ఆ మాటలు విని ఫోన్ చేసిన వాళ్లు గట్టిగా మాట్లాడేవారు కానీ బిప్ మాత్రం ఫోన్ లిఫ్ట్ చేసేది కాదట. బిగ్ బీ ఎవరైనా మెసేజ్ ఇస్తే కాస్త ఆలస్యమైనా స్పందిస్తాడు. కానీ ఆయన కోడలు ఐశ్వర్యరాయ్ మాత్రం ఇందుకు పూర్తిగా విరుద్ధం. ఆమె బర్త్ డే రోజు మెసేజ్ పంపినా రిప్లయ్ మాత్రం రానే రాదట. షారుక్ మొబైల్‌కు ఏదైనా మెసేజ్ పంపితే ఆశ్చర్యంగా అర్ధరాత్రి మాత్రమే జవాబు వస్తుందట. అయితే ఆ మెసేజ్ తప్పకుండా నవ్వు తెప్పిస్తుందట. ఎ.ఆర్.రెహమాన్, ఫిరోజ్ నాడియావాలా, సైరా భాను, టబుల ఫోన్ నెంబర్ల చివర 786 (బిస్మిల్లా) ఉండేలా చూసుకుంటారట.

కత్రినాకైఫ్ వెంటనే స్పందించకపోయినప్పటికీ యు.కెలో ఉన్నా, వెగాస్‌లో ఉన్నా ఎస్ఎంఎస్ రిప్లయి మాత్రం తప్పక ఇస్తుందట. దీపికా పదుకొనే ఒక 'స్మైలీ' మాత్రం పంపించి తప్పించుకుంటుందట. ప్రియాంకచోప్రా ఇచ్చిన రిప్లయిని బట్టి ఆమె ఏ మూడ్‌లో ఉందో ఇట్టే చెప్పొచ్చంటున్నారు ఆమె సన్నిహితులు. తన భార్య కిరణ్‌రావ్ ఫోన్లకు అమీర్‌ఖాన్ సందేశాల రూపంలోనే సమాధానం చెబుతుంటాడట. కరీనాకపూర్ మాత్రం తన స్మార్ట్‌ఫోన్ విడిచి పెట్టి కొన్ని నిమిషాలు కూడా ఉండదట. ఫోన్లు చేస్తూ, మెసేజ్‌లు పంపుతూ ఎప్పుడు చూసినా బిజీగా ఉంటుందట.







ఆదివారం ఆంధ్రజ్యోతి
18 మే 2014

# నీరు చెప్పిన పాఠం

కామెంట్



ఒకరోజు బుద్ధుడు తన శిష్యులతో కలిసి ఒక ఊరి నుంచి ఇంకో ఊరుకు వెళుతున్నాడు. అప్పటికి బౌద్ధం ఇంకా ఎక్కువ ప్రాంతాలకు వ్యాప్తి చెంద లేదు. నడుస్తూ వెళుతుంటే అల్లంత దూరాన వాళ్లకు ఒక చెరువు కనిపించింది.

బుద్ధుడు ఆగాడు. శిష్యుల్లో ఒకర్ని దగ్గరకు పిలిచి 'బాబూ .. నాకు కాస్త దాహంగా ఉంది గాని ఆ చెరువులోంచి మంచినీళ్లు తెచ్చి పెడతావా' అని అడిగాడు.

శిష్యుడు చెరువు దగ్గరికి వెళ్లాడు. సరిగ్గా అతను అక్కడికి వెళ్లిన సమయం లోనే ఒక ఎద్దులబండి నీళ్లలోంచే చెరువును దాటుకుంటూ వెళ్లింది. నీళ్లన్నీ బురద బురదగా అయ్యాయి. 'అయ్యో .. గురువుగారికి ఇలాంటి నీళ్లు ఇవ్వడం ఎలా?' అనుకుని వెనక్కి వెళ్లి జరిగిన విషయం చెప్పాడు.

ఒక అరగంట గడిచింది. బుద్ధుడికి దాహం పెరిగింది. శిష్యుడ్ని మళ్లీ వెళ్లమన్నాడు. ఈ పాటికి నీరు తేట పడి ఉండొచ్చనుకుంటూ వెళ్లాడతను. కాని ఇంకా మురికిగానే ఉన్నాయి. వెనక్కి వచ్చి బుద్ధుడికి మళ్లీ ఆ మాటే చెప్పాడు. బుద్ధుడు ఏం మాట్లాడకుండా ఊరుకున్నాడు.

ఇంకో అర్ధగంట తర్వాత అదే శిష్యుడ్ని మళ్లీ చెరువు దగ్గరికి వెళ్లి చూసి రమ్మన్నాడు. ఈసారి చెరువులో నీళ్లు తేటగా స్వచ్ఛంగా కనిపించాయి. ఒక చిన్న దుత్తలో నీళ్లు ముంచుకుని బుద్ధుడి దగ్గరికి తీసుకొచ్చాడు.

ఆయన ఆ నీళ్లను చూస్తూ 'నీళ్లు ఎలా శుభ్రపడ్డాయో చూశావా! వాటిని కదిలించకుండా ఉంచడం వల్లే బురద అడుక్కి వెళ్లిపోయి నీళ్లు తేటపడ్డాయి. మన మెదడు కూడా అలాంటిదే. ఎక్కువ ఆలోచనలతో గందరగోళంగా ఉన్నప్పుడు దానికి మనం కొంచెం సమయమివ్వాలి. వేరే ఏం చేయనక్కరలేదు. అదే స్థిమితపడుతుంది' అని చెప్పి దాహం తీర్చుకున్నాక అక్కడ్నించి ముందుకు సాగాడు.

★★★

ఎన్నికల సందర్భంగా మన దగ్గర కూడా చాలా బురద పైకి లేచింది. ఇప్పుడు ఓట్ల లెక్కింపు అయిపోయి మన భావి పాలకులెవరో తెలిసింది కాబట్టి ... కొన్నాళ్ళు సహనంతో ఉంటే ఈ కోపతాపాల మాలిన్యం మెదడు అడుగు పొరల్లోకి వెళ్లిపోయి బుద్ధుడు నీళ్ల గురించి చెప్పినట్టుగా మనందరి జీవితాలు కూడా తేట పడతాయని ఆశిద్దాం. వందల వేల సంవత్సరాల తర్వాత మనిషికి అవసరమయ్యే విషయాల గురించి ముందే చెప్పి వెళ్లిన బుద్ధుడు ఎంత గొప్పవాడో కదా!

'ఫన్' లైనర్

డబ్బు చెట్లకు కాయకపోతే... బ్యాంకులకు 'బ్రాంచ్'లు ఎందుకుంటాయి?

‘ఆదివారం అనుబంధం’పై మీ అభిప్రాయాలను శుక్రవారంలోగా అందేలా పంపగలరు. ఆలస్యంగా అందిన ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని మనవి. sunday.aj@gmail.com కి మీ ఉత్తరాల్ని మెయిల్ చేయవచ్చు.

# ఇన్‌బాక్స్



# ఇండెక్స్




కవర్‌స్టోరీ 8
వేయి స్తంభాలు మళ్లీ...

సెలబ్రిటీ .............. 13
సెంథిల్ కుమార్

బ్లాగోతం .............. 14
ఒక రాజు.. నలుగురు కొడుకులు

బాటసారి ............. 16
దర్శకుడు మారుతి

కేరింత ................ 18
పిక్టోరిస్ వేగం

అవీ ఇవీ ............... 20
మైనస్ 30లో మారథాన్

జైలు కథలు ............. 22
మనిషీ వర్సెస్ జంతువు

ఫుడ్‌కోర్ట్ ............. 24
చింత చిగురు

ఈ వారం కథ ........... 26
ఇరుకు పదును







కొత్తపుస్తకాలు ........... 30
నేలకు దిగిన నక్షత్రం, కాశీబుగ్గ


## ఇవ్వటమే ఆనందం

‘అమ్మ కడుపు చల్లగా’ కథ చక్కగా ఉంది. ఒక జీవితాన్ని దగ్గరగా చూస్తున్న ట్టుంది. ఇవ్వటంలో ఉన్న ఆనందం, హాయి ఎంతటిదో చాలా బాగా చెప్పారు. రచయిత్రికి అభినందనలు.

– దాట్ల దేవదానం రాజు, ఇ మెయిల్

## శైలి ఆకట్టుకుంది

విజయ కర్రా గారి కథ బాల్యంలోని నా మనస్తత్వాన్ని గుర్తుచేసింది. అప్పుడు పేదరికంలో ఉన్నవారికి ఏదైనా సాయం చేయాలనుకునేవాడిని. కానీ భయం, సిగ్గు వెన్నంటి ఉండేవి. ఇలాంటి మనస్తత్వం సమాజంలో చాలామందిలో ఉంటుందను కుంటాను. కథనశైలి ఆకట్టుకునేలా ఉంది.

– మహ్మద్ అయూబ్, ఇ మెయిల్

## అమోఘం...అద్భుతం...

‘జైలు కథలు’ చదువుతుంటే, ఆశ్చర్యం...ఆవేదన..సానుభూతి... నాలో వెల్లువెత్తాయి. ఒక్కొక్క కథ ద్వారా అభాగ్యుల జీవితాల్లోని చీకటి కోణాలు తెలుస్తున్నాయి. ఈ వరుసలో వచ్చిన ‘వంటే నేరమైన చోట’ చాలా ఆలోచనాత్మకంగా ఉంది. రచయిత్రి వీటిని రాస్తున్న తీరు అద్భుతం... అమోఘం.



**– యం.చిట్టిబాబు,** కొత్త పాల్వంచ

## బాటసారి జయధీర్

‘సంచారుల కోసం సంచారిగా మారాను!’ అన్న జయధీర్ తిరుమలరావు ‘బాటసారి’లో నిజమైన బాటసారిగా అనిపించారు. విమానాల్లో, రైళ్లలో, బస్సుల్లో, కార్లలో కాక పాదయాత్రతోనే డక్కలివాళ్లని చేరుకున్న ఆయన నిజమైన బాటసారి. వసంతగీతం ‘దేశం గర్వించదగ్గ యుద్ధ నవలే ’ కానీ రాజయ్యలాంటి రచయితలు మౌనంవీడి ఇలాంటి రచనలు ఇంకా ఇంకా అందించవలసివుంది.

– భీంరావు, నిర్మల్
శ్యామల, ఉట్నూరు

## నేర కథనాలు

సరసి గారి కార్టూన్లు జవ,జీవాలతో కదను తొక్కుతున్నవి. వారికి అభినందనలు. నేరాలు..ఘోరాలు నేడు నిత్యసత్యాలయిపోయాయి. అందువల్ల ఒక పేజీగాని, అరపేజీగాని సైబర్ నేర కథనాలకు కేటాయిస్తే ఆదివారం సంచిక మరింతగా పాఠకులకు చేరువ కాగలదనుకుంటున్నాను. ఈ సలహాను పరిశీలించ మనవి.

– బి.రామచంద్రరావు, చీరాల

## ఆమెకోసం

‘వెండితెర బంగారం’లో హెలన్ ఛాయాచిత్రం ముచ్చటగా ఉంది. టైటిల్‌లో ఉన్నట్టు ‘సుందరాంగ...అందుకోరా’ అని పాడుతున్నట్లే ఉందా స్టిల్. తెలుగులో ‘భూకైలాస్’లోను, షోలే, డాన్ లాంటి హిందీ హిట్ చిత్రాలలోను ఆమె నృత్యాలున్నట్లు తెలుసుకున్నాను. ఆ అందాల నాట్యమయూరి కోసం తప్పక ఆ సినిమాలు చూస్తాము.



– రాగిణి.పి, పల్లవి.పి, తెనాలి

## మనకూ అవసరమే

‘వృద్ధుల విలేజ్’ అనేది మన సమాజానికి చాలా కొత్త కాన్సెప్ట్. అమెరికాలో మొదలైన ఈ ట్రెండ్ వృద్ధుల పాలిట వరం. వారి ఆరోగ్యం, భద్రత, మానసికానందం కోసం వెలసిన సరోవరాలు ఈ విలేజ్‌లు. ఎవరూ ఎవరినీ పట్టించుకోలేని పరిస్థితుల్లోకి మనం కూడా వచ్చేస్తున్నాం. కనుక అలాంటివి ఇక్కడా చాలా అవసరమవుతాయనడంలో సందేహం అక్కర్లేదు. ఇలాంటి మంచి సంగతులు తెలిపినందుకు ధన్యవాదాలు.

–కనకరాజు, కాకినాడ

★★★

వృద్ధులకు చెకప్‌లకు వీలుగా 24 గంటలూ డాక్టర్లు, ఏదైనా సాయం కావాలంటే వాలంటీర్లు అందుబాటులో ఉండడం చాలా అవసరం. ఇంటిని, సొంత వూరిని తలపించే కాలనీలతో అమెరికాలో మొదలైన ‘వృద్ధుల విలేజ్’లకు స్వాగతం.

– లీలాకుమారి, కడప

ఆహా!

# సెక్రటరీ.. మరియు ..పిట్‌స్టాప్‌లు

**వెంకట్రావ్ ఓ కంపెనీలో జనరల్ మేనేజర్. ఇతనికి చెప్పుకోదగ్గ హాబీస్ ఏవీ లేవు టీవీలో కార్ రేస్‌లు చూడ్డం తప్పించి. ఫైనల్స్ జరుగుతూంటే సెలవుపెట్టి మరీ చూస్తాడు.**

ఇతని భార్య రవళికి ఇతని శీలం మీద ఎప్పుడూ అనుమానమే. అవకాశం వచ్చినప్పుడల్లా వాకబు చేసుకుంటూ... తన భర్త శ్రీరామ చంద్రుడే అని ధృవీకరించుకుంటూ ఉంటుంది.

ఓ రోజు ఫోంచేస్తున్నప్పుడు రవళి...

''మీ ఆఫీస్‌లో మీకో కొత్త సెక్రటరీని అప్పాయింట్ చేశారట... అవునా?'' అడిగింది.

''అవును...'' చెప్పాడు.

''ఎర్రగా... బుర్రగా ఉంటుందా?''

''గమనించలేదు...''

''కళ్ళు... ఆకుపచ్చా... నలుపా?''

''గమనించలేదు...''

''కాళ్ళు సన్నగా ఉంటాయా?... మందంగా ఉంటాయా?''

''డ్రస్సు చీరా... చుడీదారా?''

''అంతగా నోట్ చేయలేదు...''

అమ్మయ్య అనుకుని... తన మంగళ సూత్రాలను చేతిలోకి తీసుకుని కళ్ళకద్దుకుని లేచింది.

వెంకట్రావ్ అందుకుని... ''ఒక మాట! ఇవేవీ నేను గమనించలేదు. కాని ఒకటి మాత్రం గమనించాను. డ్రస్ మాత్రం చాలా ఫాస్ట్‌గా... ఎంత ఫాస్ట్‌గా అంటే... కారు రేసుల్లో పిట్ స్టాప్‌లో కార్లకి టైర్లు మార్చే సినంత ఫాస్ట్‌గా చేసేసుకుంటుంది'' చెప్పి లేచాడు.

**వివరణ :**

కారు రేసుల గురించి తెలిసినవారికి ఈ వివరణ అనవసరం. తెలియని వారికి మాత్రం అవసనం.

కారు రేసుల్లో... ఈవెంట్‌ని బట్టి యాభై లాప్‌లు, వంద లాప్‌లు ఉంటాయి. రేస్ జరుగుతున్నప్పుడు కార్లకి టైర్లు మార్చుకోవడం, పెట్రోల్ పోయించుకోవడం లాంటివి చేసుకోవచ్చు. ఇందుకోసం రేస్ ట్రాక్ పక్కనే అన్ని వసతులతో ఓ వర్క్‌షాప్ ఉంటుంది. దీన్ని 'పిట్' అంటారు.

ఐదారు చుట్లు అయింతర్వాత పెట్రోల్ పోసుకోవడానికి, టైర్లు మార్చుకోవడానికి కారుని ఇందులోకి తీసుకు వెళ్ళిపోతే అత్యంత వేగంగా ఈ పనులు చేసేస్తారు. ఎంత వేగంగా చేస్తారంటే... ఫెరారీ వాళ్ళు తాము స్పాన్సర్ చేసిన కారు తాలూకు టైర్లు నాలుగింటినీ



మార్చడానికి కేవలం ఆరున్నర సెకండ్లు మాత్రమే తీసుకుంటారు.

కార్ పిట్ లోపలికి వచ్చి ఆగగానే... ఒకడు కారుని వెనక భాగం పైకి లేపుతాడు. అదే సమయంలో ఇంకోడు ముందు భాగం పైకి లేపుతాడు. ఒక్కో చక్రం దగ్గర ఒక్కొక్కడు ఉండి టైర్‌ని తీసేస్తాడు. ఇంకోడు కొత్త టైర్‌ని ఆ చోట ఉంచుతాడు. క్షణాల్లో బిగించేస్తారు.



అన్ని చక్రాలకీ కొత్త టైర్లు బిగించిన తర్వాత... కారుని పైకి లేపిన వాళ్ళు కిందికి దించేస్తారు. ఈ లోపు కార్‌కి పెట్రోల్ అవసరమైతే ఆ పనీ ఇంకో ఇద్దరు ముగించేస్తారు.

కార్ ట్రాక్ మీద పరిగెడుతూన్నంతసేపూ.. కారులో ఉన్న ఇంజన్ తాలూకు వివరాలు మొత్తం ఈ పిట్‌లో ఉన్న ఇంజనీర్లకి రేడియో సిగ్నల్స్ ద్వారా అందుతూంటుంది. వాటిని గమనిస్తూ ఇంజన్ తాలూకు పెర్ఫార్మెన్స్‌ని అంచనా వేస్తుంటారు. ఈ వివరాలని చూడడానికి డ్రైవర్‌కి అస్సలు ఖాళీ ఉండదు. ఏదైనా ఓ సమస్య రావచ్చు అనిపిస్తే... దానికి కావలసిన స్పేర్ పార్ట్‌లని సిద్ధం చేసుకున్నాక... సందర్భం చూసుకుని పిట్ స్టాప్‌లోకి వచ్చేయమని డ్రైవర్‌కి వాళ్ళు వైర్‌లెస్‌లో చెప్పేస్తారు. డ్రైవర్ కారుని పిట్‌లోకి తేవడంతోటే... చకచకా పని ముగించి కారుని మళ్ళీ రేస్ ట్రాక్‌లోకి పంపించేస్తారు.

ఈ కారణాల వల్లే... గెలిచిన కారు తాలూకు క్రెడిట్, డ్రైవర్‌కి మాత్రమే కాకుండా టీమ్ మొత్తానికి వస్తుంది. కానీ... మోటార్ సైకిల్ రేస్‌లో మాత్రం క్రెడిట్ మొత్తం... డ్రైవర్‌కే.

ఇదంతా బాగానే ఉంది కానీ... మొత్తం రేస్‌కి ఎంత పెట్రోల్ కావాలో ముందుగానే అంచనా వేసుకుని... అంత పెట్రోల్ కారులో నింపుకుని బయల్దేరవచ్చు కదా అన్న సందేహం వస్తే... ఈ వివరణ తప్పనిసరి. రేస్ కారు ఎంత తేలిగ్గా ఉంటే... వేగం అందుకోవడానికి అంత అడ్వాంటేజ్ ఉంటుంది డ్రైవర్‌కి. రేస్ మొత్తానికి కావలసిన పెట్రోల్ ఒకేసారి పోసుకోవాలంటే రేస్ కార్‌ని వాడడానికి వీలుపడదు. అప్పుడు పెట్రోల్ టాంకర్‌ని రేస్‌లో నడిపించాలి.

★★★

ఈ కారణం వల్లే ఫ్లయిట్‌లో బయల్దేరే ముందు బరువు చూసుకుని... అంటే ప్రయాణికుల బరువు, ఫ్లయిట్‌లో ఉన్న సరుకుల బరువు, ప్రయాణం చేయాల్సిన దూరం... ఈ మూడిటితో పాటు సేఫ్టీ ఫ్యాక్టర్‌నూ పరిగణనలోకి తీసుకుని... ఆ తర్వాతే ఎంత పెట్రోల్ కావాలో లెక్కగట్టి అంత పెట్రోల్ మాత్రమే విమానంలో నింపుకుంటారు. (విమానాల్లో వాడే ఇంధనాన్ని పెట్రోల్ అనరనుకోండి. ఎటిఎఫ్ (ఏవియేషన్ టర్బయిన్ ఫ్యూయల్) అంటారు.)

– శీనా, 097890 58199






(ఒక దొంగకు అతని పెంపుడు మార్జాలం చేసిన నీతి బోధ)

మౌనంగానే నడవమనీ పిల్లి నీకు చెబుతుంది
తుమ్ములు దగ్గులు రాకుండా 'కేర్' తీసుకోమంటుంది
రేచీకటి రాకుండా ఏ విటమిను తినమంది
అర్ధరాత్రి దాటాకే అనువైన టైమంది /మౌనం/

మెయిను గేటుకు తాళమని దిగులుపడకు చోరుడా
కిటికీలన్నీ అండగా నీకు ఉన్నాయిగా
బీరువాలు ఖాళీ అని
బాధపడకు ధీరుడా
బెడ్డుకింద నగదూ నట్రా
ఉంటాయిరా
ఏనుగులా నువ్వు
కదిలావంటే
వేటే పడుతుంది
చిరుత పిల్లలా సాగావంటే సొమ్మే గిడుతుంది
సులభంగా లాభిస్తే మజా ఏముంటుందీ
కష్టాలతో సాధిస్తే ఆ కిక్కే వేరుంటుందీ
నేనెరిగిన సత్యమిది తపనుంటే సాధ్యమిది /మౌనం/




కాలంతో పాటుగా 'డ్రెస్ సెన్సు' మార్చుకో
తైలాలు, ముసుగులు పాతవని తెలుసుకో
టెక్నాలజీ ఉందిగా దాని సాయమందుకో
'జిపియస్' సిస్టం చక్కగా వాడేసుకో
సెల్లుఫోను సైలెన్సు మోడులో ఉంచుకోవాలి
ఫ్రీక్వెంటుగా చెవుడు రాకుండా చూసుకోవాలి
డ్యూటీ ముందు బూస్టు కాంప్లేన్ విధిగా తాగాలి
లెక్కలు గిక్కలు ఇంటికొచ్చే చూసుకోవాలి
పిల్లిమాట వినకుంటే – కటకటాలు లెక్కెట్టాలి /మౌనం/

( 'మౌనంగానే ఎదగమనీ' పాటకు )

– దాసరి చంద్రయ్య, 94404 07381

## ఫటా ఫట్



మనసుకు పగ్గం వేయాలంటే?
– లగ్గం చేయాలి!



తింగరిబుచ్చి?
– ఉదయం చల్లని కాఫీ ఇచ్చినందుకు మొగుడు తిట్టాడని, సాయంత్రం ఐస్ క్రీం వేడి చేసి ఇచ్చేది.



ఎవరెస్ట్ అంటే?
– ఎవరైనా రెస్ట్ తీసుకునేది.

– కె. సతీష్‌రెడ్డి, వరంగల్.

## క్యా డైలాగ్ హై



"తినడానికి అన్నం ఉండి తినకపోవడం ఉపవాసం. పడుకోవడానికి మంచం ఉండి పడుకోకపోవడం జాగారం. నరకడానికి తల ఉండి నరక్కపోవడం మానవత్వం"

(చిత్రం: జల్సా)

– కె.జయన్న, రాజోలి

# బిట్‌బ్యాంక్



సెల్‌ఫోన్‌లో వాడే బ్లూటూత్‌కి ఆ పేరు డెన్మార్క్ రెండవ రాజు హెరాల్డ్ బ్లూటూత్ నుంచి వచ్చిందట.

★ చాలాసార్లు విమానంలో తిండి అస్సలు బాగోదని తిట్టుకుంటాం. దానికి ఒక కారణం 35 వేల అడుగుల ఎత్తులో ఉన్నప్పుడు మన నాలుక్కి రుచి సరిగ్గా తెలియదట.



టీ బాగ్స్‌ను మొట్టమొదట న్యూయార్క్‌లో 1904లో ప్రవేశపెట్టారు.

★ ఫోర్డ్ కారులన్నీ మొదట్లో నల్లరంగులోనే ఉండేవి. అన్ని రంగుల కంటే నలుపైతేనే త్వరగా ఆరిపోతుందని దాన్ని వాడేవారట.



ఇంగ్లండ్‌లో గాడిదలకు, గుర్రాలకు కూడా పాస్‌పోర్ట్ ఉంటుంది.

★ వందేళ్ళు పైబడి బతికిన వాళ్ళలో ఐదింట నలుగురు స్త్రీలే.







**కవర్‌స్టోరీ**

# వేయిస్తంభాలు మళ్లీ నిలబడ్డాయి

**కాకతీయుల మహోజ్వల ఘట్టానికి నిలువెత్తు నిదర్శనమైన 850 ఏళ్ల నాటి పురాతన కట్టడమది... శిల్పకళా ప్రతిభకు తార్కాణమైన ఓరుగల్లు వేయిస్తంభాల గుడి విశిష్ట నిర్మాణానికి, అనేక విశేషాలకు ఆలవాలం. కానీ... ఈ అపురూప కట్టడం ఆలనాపాలన లేక క్రమక్రమంగా శిథిలావస్థకు చేరుకుంది. 'చరిత్ర' కనుమరుగయ్యే ప్రమాదాన్ని గుర్తించి, తొమ్మిదేళ్ల క్రితం పునర్నిర్మాణమనే మహా ఘట్టానికి శ్రీకారం చుట్టారు. 'దిగితే కానీ లోతు తెలియదు' అన్నట్లుగా... పునర్నిర్మాణం పనులు చేపట్టిన నాటి నుంచి ఇప్పటిదాకా వేయి స్తంభాల నిర్మాణం వెనుక ఉన్న ఎన్నో అద్భుతాలు, మరెన్నో ఆసక్తికర అంశాలు ఒక్కొక్కటిగా బయటపడుతూ వచ్చాయి. వర్తమానానికి సవాలు విసిరాయి. 'చరిత్ర'ను పునర్నిర్మించే క్రమంలో ఎదురైన ఆ సవాళ్లు, పునర్నిర్మాణ విశేషాలే ఈ వారం కవర్‌స్టోరీ.**

కాకతీయుల కట్టడాలకు అద్వితీయమైన చారిత్రక నేపథ్యం ఉంది. వారి నిర్మాణశైలి అత్యంత విశిష్టమైంది, దేశంలోని మిగతా ప్రాచీన కట్టడాల కన్నా భిన్నమైంది. అడుగడుగునా అద్భుతమైన శిల్పకళానైపుణ్యంతో ఎటుచూసినా సుందరమైన చెక్కడాలతో చూపరులను అబ్బురపరుస్తుంది. రాతి స్థంభాలమయమైన ఆలయ నిర్మాణాల్లో కనిపించని ప్రత్యేక పద్ధతి వీరికి ఉంది. పునాది నుంచి పై కప్పు వరకు ఎక్కడా కాంక్రీటు కనిపించదు. వేయి స్తంభాలగుడి (రుద్రేశ్వరాలయం) ప్రాంగణంలోని కల్యాణ మండపం అటువంటి కట్టడాల్లో ఒకటి. ఈ అపురూప పురాతన కట్టడాన్ని పునర్నిర్మించే మహాయజ్ఞం చివరి దశకు చేరుకున్నది. ఒక ప్రాచీన ఆలయ మండపాన్ని మొత్తంగా విప్పి కుప్ప పోసి అదే చోట అదే రీతిలో తిరిగి నిలబెట్టే ఈ వినూత్న ప్రాజెక్టును కేంద్ర పురావస్తు శాఖ దేశంలోనే తొలి సారిగా ప్రయోగాత్మకంగా వరంగల్‌లో చేపట్టింది. రూ.7.50 కోట్ల వ్యయంతో చేపట్టిన దీని పునరుద్ధరణ పనులు పూర్తయితే కల్యాణ మండపం మరింత సుందరంగా పూర్వరూపాన్ని సంతరించుకుంటుంది.

పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు



## రుద్రదేవుడు నిర్మించిన త్రికూటాలయం

కాకతీయుల్లో సుప్రసిద్ధుడైన రుద్రదేవ మహారాజు క్రీ.శ 1163లో ఈ దేవాలయాన్ని నిర్మించినట్టు ఆలయ ప్రాంగణంలోని శిలాశాసనాన్ని బట్టి తెలుస్తోంది. ఏకామ్రనాధుని 'ప్రతాపరుద్రుని చరిత్ర'లో కూడా ఈ విషయం ఉంది. కాకతీయరాజులు, వారి బంధువులు, సామంతులు ఎవరు ఏ ఆలయాన్ని నిర్మించినా అక్కడ ప్రతిష్ఠచేసిన ఈశ్వరునికి తమ పేర్లను కలిపేవారు. ఆ రకంగా రుద్రదేవుడు కట్టిన ఆలయం కనుక ఇది రుద్రేశ్వరాలయం అయింది. ఒకే వేదిక మీద రుద్రేశ్వర, వాసుదేవ, సూర్యదేవర ఆలయాలను నిర్మించారు కాబట్టి

దీన్ని త్రికూటాలయం అని అంటారు. రుద్రేశ్వరాలయానికి అనుబంధంగా దక్షిణ దిశలో ఒక కల్యాణ మండపాన్ని నిర్మించారు. దీని పునరుద్ధరణ పనులే ఇప్పుడక్కడ జరుగుతున్నాయి.

## నృత్య ప్రదర్శనలకు వేదిక

కాకతీయుల దేవాలయాలు, కల్యాణ మండపాలన్నిట్లో నృత్య ప్రదర్శనలకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండేవి. కొన్ని దేవాలయాల్లో గర్భగుడికి ఎదురుగానే రంగమండపం ఉండగా, మరికొన్ని దేవాలయాలకు విడిగా కల్యాణ మండపాలు ఉన్నాయి. అలాంటి వాటిల్లో వేయిస్తంభాల గుడి ఒకటి. ఈ దేవాలయంలో ఎక్కడ చూసినా రమణీయ నృత్య శిల్పాలే కనిపిస్తాయి. ఆనాడు వ్యాప్తిలో ఉన్న నృత్యవిశేషాలు ప్రతీ శిల్పంలో గోచరిస్తాయి. కాని మండపంలో మాత్రం అలాంటి శిల్పాలు లేవు. అన్నీ స్థంభాలే. ఆ కాలంలో ప్రధాన ఆలయంలోని రంగమండపంలో ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం నాట్య ప్రదర్శనలు జరుగుతుండేవని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. రుద్రేశ్వరాలయంలో రంగమండపం లేకపోయినా గర్భగుడి ఎదుట నాడు ఎంతో ప్రాచుర్యం పొందిన పేరిణీ నత్య ప్రదర్శనలు జరిగేవని, ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో మాత్రం 'దేశీ' 'మార్గ' నృత్య రీతులను ప్రదర్శించేవారని శాసనాలను బట్టి తెలుస్తోంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా ఈ కల్యాణ మండపం వేదికగా నిలిచేది. రుద్రదేవుడు నిత్యం ఉదయం సాయంత్రం కోట నుంచి రహస్య మార్గం గుండా ఈ ఆలయానికి చేరుకొని రుద్రేశ్వరునికి పూజలు జరిపిన అనంతరం కల్యాణ మండపంలో జరిగే నృత్యప్రదర్శనలు తిలకించేవారని చెపుతారు. ప్రధాన ఆలయంలో మాదిరిగానే నృత్య ప్రదర్శనలకు అనువుగా మండపంలో కూడా మధ్య భాగాన వృత్తాకారంలో




నునుపైన రాతి ఫలకం ఉంది. పూర్తిగా స్థంభాలతోనే నిర్మించిన ఈ మండపాన్ని పర్వదినాల్లో ప్రత్యేకంగా పూజా, ధార్మిక, సాహిత్య కార్యక్రమాలకు వాడుకొనే వారు. ప్రధాన ఆలయం లాగా ఇది కూడా నక్షత్రాకారంలోనే ఉంటుంది. ప్రధానాలయం లోపలి వైశాల్యం 7 మీటర్లు కాగా మండపం వైశాల్యం 33 మీటర్లు. మండపం దెబ్బతినడానికి ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు.

## ఇసుకే పునాది

ఏ కట్టడానికైనా బలమైన పునాది ముఖ్యం. సాధారణంగా సిమెంట్, కంకర, సున్నం వంటి వాటితో పునాది వేస్తారు. దానిపైనే ఏ కట్టడాన్నయినా చేపడతారు. కాకతీయులు ఇందుకు భిన్నమైన విధానాన్ని అనుసరించారు. ఇసుకతోనే పునాది (సాండ్ బాక్స్ టెక్నాలజీ)ని నిర్మించి దానిపైన మండపాన్ని నిలబెట్టారు. వరదలు, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని కట్టడం చిరకాలం నిలవడానికి పునాదిలోని ఈ ఇసుకే స్పాంజ్‌లాగా పని చేస్తుంది. కాకతీయుల ఆలయాల్లో అనేకం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండడానికి ఇదే కారణం.


కల్యాణమండపంతో పాటు కనిపిస్తున్న వేయిస్తంభాల గుడి

## కాకతీయుల కాలంలోకి వెళ్ళాను...



వేయిస్తంభాలగుడి కల్యాణ మండపం పునర్నిర్మాణం పని అత్యంత సంక్లిష్టమైనది. ఇటువంటి పనిని చేపట్టడం దేశంలోనే మొదటిసారి. మండపం పునర్నిర్మాణంలో ఎక్కడా సిమెంట్, కాంక్రీట్, ఇనుము వాడకుండా కాకతీయులు నాడు అనుసరించిన విధానం ద్వారానే పూర్తి చేయాలన్నది నిబంధన. పైగా ఇసుక పునాదిపై కట్టడాన్ని నిలబెట్టాలి. దీనిని ఒక సవాల్‌గా తీసుకున్నాను. పునర్నిర్మాణంలో ప్రతీ రాయి కీలకమే. మిల్లీమీటర్ తేడా కూడా రాకూడదు. వస్తే రాళ్ళు కుదురుకోవు. అసలు కట్టడమే నిలవదు. రాళ్ళు కుదురుకునే వరకు మిగతా పని ముందుకు సాగదు. ఒక్కోసారి నిలబెట్టిన రాయి వెంటనే కుదురుకుంటుంది. ఒక్కోసారి ఒక రోజంతా పడుతుంది. లోపం కనిపెట్టే వరకు పని ఆపేయాల్సిందే. పునర్నిర్మాణం పనిలో అనేక క్లిష్టమైన సమస్యలను ఎదుర్కొన్నాను. స్థపతిగా కొత్త పాఠాలను నేర్చుకున్నాను. కాకతీయుల కాలానికి వెళ్ళి ఆ నాటి నిర్మాణశైలిలోకి పరకాయ ప్రవేశం చేసిన అనుభూతిని పొందుతున్నాను. నా స్వస్థలం తమిళనాడులోని నాగపట్టణం జిల్లా మైలాడుదొరై గ్రామం. మా తాత, నాన్న శిల్పులే. మా పెద్దనాన్న స్వయం భూనాథన్ వద్ద శిల్పాలు చెక్కడం నేర్చుకున్నాను. స్థపతిగా నేను ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 500లకు పైగా ఆలయాలు, పురాతన మందిరాల పునరుద్ధరణ పనులను చేశాను. చిత్తూరు జిల్లా నాగలాపురంలోని వేదనారాయణ స్వామి, వాయల్పాడులోని పట్టాభి రామస్వామి ఆలయం తదితర ఆలయ గోపురాల పునర్నిర్మాణ పనులు వీటిలో కొన్ని. ప్రస్తుతం మారిషస్‌లో 144 అడుగుల ఎత్తయిన వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని రూపొందిస్తున్నాను.

– బాలక్రిష్ణన్ శివకుమార్, స్థపతి, తమిళనాడు


ఇసుకతో దట్టించిన పునాది

## దెబ్బతీసిన నీటిపాయ

ఈ కల్యాణ మండపం శిథిలం కావడానికి ముఖ్యకారణం భూమి పొరల్లోని ఒక నీటి పాయ మండపం పునాది మధ్య నుంచి వెళ్ళడమేనని భూగర్భ నిపుణులు చెబుతున్నారు. నీటి ప్రవాహానికి ఇసుక పక్కకు తొలగడం వల్ల ఈశాన్య దిశలో రాతి స్తంభాలు కుంగి మండపం క్రమంగా పక్కకు ఒరిగిపోవడం మొదలుపెట్టింది. నిజాం కాలంలోనే అప్పటి పురావస్తు శాఖ అధికారులు దీనిని గమనించారు. మండపం పూర్తిగా కూలిపోకుండా ఆసరా కోసం పైకప్పు నుండి కింది వరకు రాతితో తాత్కాలికంగా రాతి స్తంభాలను నిర్మించారు. అయినప్పటికీ మండపం కుంగిపోవడం ఆగలేదు. దీనిని ఇలాగే వదిలేస్తే మండపం మొత్తంగా కుప్పకూలే ప్రమాదం ఉంది. ఒక వేళ అదే జరిగితే రాతి స్తంభాలన్నీ ముక్కలు ముక్కలుగా విరిగిపోతాయి. పునర్నిర్మించడం అసాధ్యం. ఈ క్రమంలోనే పునర్నిర్మాణానికి పునాది పడింది.

## కాకతీయుల శైలిలోనే...

కల్యాణ మండపం పునరుద్ధరణను కేంద్ర పురావస్తుశాఖ 2005లో చేపట్టింది. మొత్తం మండపాన్ని విప్పి ఉన్నది ఉన్నట్టు తిరిగి నిలబెట్టే పనికి శ్రీకారం చుట్టింది. ఎక్కడా సిమెంట్, కాంక్రీట్, ఇనుము వాడకుండా కాకతీయులు అనుసరించిన సాండ్ బాక్స్ టెక్నాలజీ పద్ధతి ద్వారానే పునరుద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఆ మేరకు ప్రణాళికలను రూపొందించింది. ఇందుకు కాజీపేటలోని జాతీయ సాంకేతిక కళాశాల (నిట్) సహకారం తీసుకున్నది.

నాడు కాకతీయులు అనుసరించిన సాంకేతిక పద్ధతిలోనే మండపం పునాదిని నిర్మించడానికి నిట్ రూపకల్పన చేసింది. మొదట మండపంలోని స్తంభాలతో సహా ప్రతీ భాగాన్ని ఫోటో తీశారు. ఒక్కొక్క రాయికి ఒక్కో నెంబర్ వేశారు. ముందుగా రూపొందించిన ప్లాన్‌లో ఈ నెంబర్లను చేర్చారు. ఆ తర్వాత జాగ్రత్తగా మండపాన్ని విప్పారు. ఇలా విడదీసిన రాళ్ళను ఆలయం ప్రాంగణంలో, పద్మాక్షి దేవాలయం ప్రాంతంలో భద్రపరిచారు.

తర్వాత పునాదిలోని ఇసుకను మొత్తం తొలగించి ఒక చోట జాగ్రత్త చేశారు. అడ్డం, పొడవు– సుమారు 40 మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ పునాదిని మూడు మీటర్ల లోతు వరకు తవ్వారు. ఇందులో ఎటు నుంచి ఎటైనా ఒకటిన్నర మీటర్ల ఎడం ఉండేలా 8 మీటర్ల లోతు వరకు 365 బోర్లు వేసి అందులో కంకర, ఇసుకలను అత్యధిక పీడనంతో (గ్రాన్యులర్ ఫైల్స్) దట్టించారు. వీటి మధ్యలో మరో 120 రంధ్రాలు చేసి సున్నంతో (గ్రౌటింగ్) నింపారు. ఆ తర్వాత తొలగించిన అదే ఇసుకను పునాదిలో నింపి అధిక పీడనంతో దట్టించారు. సున్నం, ఇసుక కలయిక వల్ల పునాది సాండ్ స్టోన్‌గా మారుతుంది.

మండపం బరువు గతంలో ప్రతీ చదరపు మీటరుకు 15 నుంచి 18 టన్నులు ఉండేది. మరో వెయ్యేళ్ళ వరకు మండపం చెక్కుచెదరకుండా ఉండేందుకు బరువును తట్టుకునే శక్తిని ప్రతీ చదరపు మీటరు 50 నుంచి 60 టన్నులకు పెంచారు. వివిధ రకాల పరీక్షల్లో ఈ విషయం రుజువైంది. ఈ పునాదిపై ఏడు పొరలు (లేయర్స్)గా ప్రదక్షిణ పథాన్ని, దానిపైన 4 పొరలుగా కక్ష్యస్థానాన్ని నిర్మించారు. దీనిపై ఫ్లోరింగ్ వేసి మొత్తం 132 స్తంభాలకుగాను ఇప్పటి వరకు 90 స్తంభాలను నిలబెట్టారు. మిగతా వాటిని త్వరలో అమర్చుతారు. వీటిలో 13 స్తంభాలు లేవు. 300 అడ్డదూలాల్లో 30 వరకు లేవు. స్థానికంగా దొరికే రాయితోనే వీటిని శిల్పులతో కొత్తగా చెక్కిస్తున్నారు.

ప్రదక్షిణ పథం, కక్ష్యాసనం, స్తంభాల ఏర్పాటు పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ సిమెంట్, కాంక్రీట్, ఇనుము వాడకూడదని కేంద్ర పురావస్తు శాఖ నిషేధం విధించింది. దీనితో పిడుగురాళ్ళ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన సున్నం, కరక్కాయ, నల్లబెల్లాన్ని కలిపి బాగా గ్రైండ్ చేసి

## సాండ్‌బాక్స్ టెక్నాలజీ అంటే..?

కాకతీయులు తమ కట్టడాలలో సాండ్‌బాక్స్ టెక్నాలజీని వాడటం చర్చనీయాంశంగా మారింది. అసలు ఈ సాండ్‌బాక్స్ టెక్నాలజీ అంటే ఏమిటి? కాకతీయులు భారీ కట్టడాలు, ముఖ్యంగా ఆలయాలను నిర్మించేటప్పుడు పునాది కోసం 40 మీటర్ల వెడల్పు, 40 మీటర్ల అడ్డం, 3 మీటర్ల లోతుతో కందకం తీసేవారు. దానిని ఇసుకతో నింపి చాలారోజుల పాటు ఏనుగులతో తొక్కించడం ద్వారా బాగా గట్టిపరిచేవారు. కందకంలో ఈ ఇసుక పూర్తిగా స్థిరపడ్డ తర్వాత వర్షాలు, వరదల వల్ల ఈ ఇసుక ఏ మాత్రం బయటకు వెళ్లకుండా దాని చుట్టూ రాతితో ఏడు వరసల్లో ప్రదక్షిణ పథాన్ని, నాలుగు వరసల్లో కక్ష్యాసనాన్ని నిర్మించేవారు. దీనిపైన రాతి స్తంభాలు, లేదా రాతి గోడలతో కట్టడాన్ని నిర్మించేవారు. కాకతీయులు తమ కట్టడాల్లో సాండ్‌బాక్స్ టెక్నాలజీని వినియోగించారన్న విషయాన్ని కాకతీయుల రాతి నిర్మాణాల శైలిపై పరిశోధన సందర్భంగా నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు మొదటిసారి కనుగొన్నారు. సిమెంట్, కాంక్రీట్, ఇనుము కన్నా ఇసుక చాలా శక్తివంతమైన పదార్థం. ఎక్కువ బరువును మోసేశక్తి దానికే ఉంటుంది. దీనికి నీటిని వెంటనే బయటకు (సీవేజ్) పంపే గుణం ఉంది. వరదలు, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కట్టడం పడిపోకుండా భూమిలోని ప్రకంపనాలకు అనుగుణంగా షాక్‌అబ్జార్వర్‌గా కూడా పని చేస్తుంది. ఈ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే కాకతీయులు తమ కట్టడాల్లో సాండ్‌బాక్స్ టెక్నాలజీని వినియోగించారు. కర్నాటకలో హొయసలులు కూడా తమ నిర్మాణాల్లో ఇలాంటి టెక్నాలజీనే వాడిన దాఖలాలు కనిపిస్తాయి.

సున్నం, నల్లబెల్లం, కరక్కాయల మిశ్రమం తయారయ్యే తొట్టెలు





తవ్వకాల్లో బయటపడిన ద్వారపాలకుల విగ్రహాలు

తద్వారా వచ్చిన మిశ్రమాన్ని రాండమ్ రబుల్ మెషినరీ విత్ మోర్టర్ విధానంలో వాడుతున్నారు. గతంలో కాకతీయులు కూడా తమ కట్టడాల్లో ఇదే మిశ్రమాన్ని వాడారని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. మండపం పునర్నిర్మాణం సందర్భంగా పలు అవాంతరాలు ఎదురయినా వాటిని ఎప్పటికప్పుడు అధిగమిస్తూ పనులను కొనసాగించారు. ఈ మండపానికి దగ్గర్లోనే విశాలమైన భద్రకాళి చెరువు ఉంది. పునాది కోసం త్రవ్వకాలు జరుపుతుండగా పెద్దఎత్తున నీరు ఉబికి వచ్చింది. పనులకు తీవ్ర ప్రతిబంధకంగా మారింది. మోటార్లతో ఎప్పటికప్పుడు నీటిని తోడివేయాల్సి వచ్చేది. నీరు ఇంతగా ఉబికి వస్తున్న చోట పునాది నిర్మాణం ఎలా సాధ్యం అవుతుందనీ, ఇలాంటి పునాది మీద మండపం ఎలా నిలుస్తుందనీ సందేహాలు వ్యక్తం



తయారవుతున్న కొత్త రాతిస్తంభాలు

అయ్యాయి. ఒక దశలో పునర్నిర్మాణ పనులు అసాధ్యం అన్న ప్రచారం కూడా జరిగింది. కానీ ఆ అనుమానాలన్నీ పటాపంచలు చేస్తూ ఎట్టకేలకు మండపం పూర్వరూపాన్ని సంతరించుకుంటోంది. ఈ పునరుద్ధరణ పనులను కేంద్ర పురావస్తు శాఖ సూపరింటెండెంట్ ఆర్. కృష్ణయ్య, సీనియర్ కన్సర్వేషన్ ఆఫీసర్ సాంబశివకుమార్, నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు పర్యవేక్షిస్తున్నారు. స్థపతి బాలక్రిష్ణన్ శివకుమార్ కీలక భూమిక పోషిస్తున్నారు. మండపాన్ని విప్పి తిరిగి నిలబెట్టే పనిని ఆయనే దగ్గరుండి చూసుకుంటున్నారు.

''కల్యాణ మండపం లేకపోవడం వల్ల ఇన్నాళ్ళూ వేయిస్తంభాల గుడి బోసిపోయి కనిపించింది. మండపం పనులు పూర్తయితే గుడికి పూర్వశోభ వస్తుంది. పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుంది. అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల మండపం పనులు గత తొమ్మిదేళ్ళుగా నత్తనడక నడుస్తున్నాయి. ఈ ఏడాదిలోగా అయినా పనులు పూర్తి చేస్తే ఒక అద్భుతమైన 'చరిత్ర'కు జీవం పోసినట్లవుతుంది'' అని వేయి స్తంభాల గుడి ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. మండపం పునర్నిర్మాణం పనుల కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ పాండు రంగారావు చెబుతున్నట్లుగా డిసెంబర్‌లో ఈ పనులు పూర్తయితే కాకతీయుల మిగతా కట్టడాల పునరుద్ధరణకు మార్గం సుగమం అవుతుంది.

**– రమేశ్‌బాబు వెల్దండి, శంకర్‌రావు శెంకేసి**
ఆంధ్రజ్యోతి, వరంగల్



# అనుగ్రహం

18 – 24 మే 2014

డాక్టర్ పి.ఎ.రామన్



**మేషం:** అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం

కుటుంబ, ఆర్థిక సమస్యలు కొలిక్కి వస్తాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. అవసరాలకు ధనం అందుతుంది. ఖర్చులు సామాన్యం. కొత్త విషయాలపై దృష్టి సారిస్తారు. వ్యవహారాల్లో తొందరపాటు తగదు. విలువైన వస్తువులు చేజారిపోయే ఆస్కారం ఉంది. శనివారం నాడు ఒక సంఘటన ఆందోళన కలిగిస్తుంది. ఆరోగ్యం కుదుటపడుతుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరం. పెద్ద మొత్తం నగదుతో ప్రయాణం తగదు.



**వృషభం:** కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

శుభకార్యాలకు యత్నాలు సాగిస్తారు. ఒక సమాచారం సంతోషం కలిగిస్తుంది. అవసరాలకు డబ్బు సర్దుబాటు చేసుకుంటారు. ప్రముఖులతో పరిచయాలేర్పడతాయి. ఆది, సోమవారాల్లో పనులు, వ్యవహారాలు స్వయంగా చూసుకోవాలి. ఇతరుల విషయాల్లో జోక్యం తగదు. వ్యాపారాల్లో ఆటంకాలను అధిగమిస్తారు. అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో ఏకాగ్రత వహించండి. ప్రయాణం తలపెడతారు.



**మిథునం:** మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

ఎదుటివారి వ్యాఖ్యలకు దీటుగా స్పందిస్తారు. గుట్టుగా యత్నాలు సాగించండి. పనులు హడావుడిగా సాగుతాయి. ప్రముఖులతో మంతనాలు సాగిస్తారు. ఖర్చులు పెరిగినా భారమనిపించవు. మంగళ, బుధవారాల్లో చెల్లింపులు నగదు స్వీకరణలో జాగ్రత్త. మీ శ్రీమతికి అన్ని విషయాలు తెలియజేయండి. నూతన పెట్టుబడులకు అనుకూలం.



**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

సంప్రదింపులు, కీలక వ్యవహారాలతో హడావుడిగా ఉంటారు. ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ఎవరినీ అతిగా విశ్వసించవద్దు. ఆదాయ వ్యయాలకు పొంతన ఉండదు. ఆది, గురువారాల్లో పనులు అస్తవ్యస్తంగా సాగుతాయి. ప్రముఖుల ఇంటర్వ్యూ కోసం పడిగాపులు తప్పవు. ప్రయత్నపూర్వకంగా అవకాశాలు కలిసివస్తాయి. ప్రయాణంలో జాగ్రత్త.



**సింహం:** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆలోచనలు కార్యరూపం దాల్చుతాయి. ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. యత్నాలు గుట్టుగా సాగించండి. ఇతరుల విషయంలో జోక్యం తగదు. దుబారా ఖర్చులు అధికం. మంగళ, శనివారాల్లో పనులు అనుకున్న విధంగా సాగవు. బంధుమిత్రులకు ముఖ్య సమాచారం అందిస్తారు. ఆరోగ్యరీత్యా ఇబ్బందులు తప్పవు. మీ ప్రమేయంతో శుభకార్యం నిశ్చయమవుతుంది. చిరు వ్యాపారులకు ఆశాజనకం.



**కన్య:** ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1, 2 పాదాలు

పరిస్థితులు గతం కంటె కొంత మెరుగ్గా ఉంటాయి. రావలసిన ధనం అందుతుంది. రుణం కొంత మొత్తం తీర్చగలుగుతారు. గురు, శుక్ర వారాల్లో కొన్ని విషయాల్లో సర్దుకుపోవలసి వస్తుంది. పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. మీ శ్రీమతి వైఖరిలో మార్పు సంతోషం కలిగిస్తుంది. మీ ఆలోచనలు గోప్యంగా ఉంచండి. వృత్తి వ్యాపారాల్లో పురోభివృద్ధి గడిస్తారు. నిరుద్యోగులు, అవివాహితులు శుభవార్తలు వింటారు.



**తుల:** చిత్త 3,4; స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కొత్త పదవులు, సభ్యత్వాలపై దృష్టి సారిస్తారు. ఆలోచనలతో మనస్థిమితం ఉండదు. ఆకస్మిక ఖర్చులుంటాయి. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో దానికి వ్యయం చేస్తారు. శనివారం నాడు దంపతుల మధ్య చికాకులు తలెత్తుతాయి. పనుల సానుకూలతకు బాగా శ్రమించాలి. ఆసక్తికరమైన విషయాలు గ్రహిస్తారు. ఉద్యోగ యత్నంలో నిరుత్సాహం తగదు. వాణిజ్య ఒప్పందాలు ఒక కొలిక్కి వస్తాయి. ప్రయాణంలో జాగ్రత్త.



**వృశ్చికం:** విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఈ వారం కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతారు. యత్నాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. కుటుంబంలో ప్రశాంతత నెలకొంటుంది. వ్యవహార ఒప్పందాల్లో తొందరపాటు తగదు. అనుభవజ్ఞుల సలహా పాటించండి. వృత్తి, ఉపాధి పథకాల్లో స్థిరపడతారు. నూతన పెట్టుబడులు, లీజు, టెండర్లకు అనుకూలం. అధికారుల హోదా మార్పు, స్థానచలనం సంభవం.



**ధనస్సు:** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఆర్థికంగా బాగుంటుంది. మొండి బాకీలు వసూలవుతాయి. వాయిదాపడిన పనులు పూర్తి చేస్తారు. ఇతరుల విషయాల్లో జోక్యం తగదు. మానసిక ప్రశాంతత పొందుతారు. మీ ప్రమేయంతో శుభకార్యం నిశ్చయమవుతుంది. బంధువులతో సంబంధాలు బలపడతాయి. సంతానం ఉన్నత చదువులపై దృష్టి సారిస్తారు. ఆత్మీయుల క్షేమ సమాచారం సంతృప్తి నిస్తుంది.



**మకరం:** ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రయత్నపూర్వకంగా అవకాశాలు కలిసివస్తాయి. మీపై అభియోగాలు తొలగిపోగలవు. వాగ్దాటితో అందరినీ ఆకట్టుకుంటారు. ఆది, సోమవారాల్లో కొన్ని విషయాల్లో సర్దుకుపోవలసి ఉంటుంది. ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాల్లో లాభాలు, మెళకువలు గ్రహిస్తారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి.



**కుంభం:** ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

వ్యాపారాల్లో ఆటంకాలను దీటుగా ఎదుర్కొంటారు. వాణిజ్య ఒప్పందాలు అనుకూలిస్తాయి. మంగళ, బుధవారాల్లో అవగాహన లేని విషయాలకు దూరంగా ఉండాలి. ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. రావలసిన ఆదాయం అందుతుంది. ఖర్చులు ప్రయోజనకరం. విలువైన వస్తువులు, నగదు జాగ్రత్త. గుట్టుగా యత్నాలు సాగించండి. ఉద్యోగస్తుల సమర్థతకు గుర్తింపు లభిస్తుంది. ప్రియతముల గురించి ఆందోళన చెందుతారు.



**మీనం:** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

నూతన పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. నిర్దిష్ట ప్రణాళికలతో ముందుకు సాగుతారు. రాబోయే ఖర్చులకు డబ్బు సర్దుబాటవుతుంది. గురు, శుక్ర వారాల్లో మితంగా సంభాషించండి. పదవుల కోసం యత్నాలు సాగిస్తారు. ఎవరినీ అతిగా విశ్వసించవద్దు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. షేర్ల క్రయవిక్రయాలు లాభిస్తాయి. ప్రముఖుల ఇంటర్వ్యూ కోసం పడిగాపులు తప్పవు.



## సెలబ్రిటీ

**సెంథిల్ కుమార్**

**జులపాల జుట్టు... మెడలో తాయత్తు... నల్లటి శరీరంపై కొట్టొచ్చేలా కనిపించే రంగు రంగుల దుస్తులు... తొలి సారి సెంథిల్ కుమార్‌ను చూసిన వారెవరైనా సరే ఆయనో గొప్ప సినిమాటోగ్రాఫర్ అంటే నమ్మరు. అందుకేనేమో గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీ తొలి పరిచయంలో ఆయనను 'హిప్పీ'లా ఉన్నాడని భావించి అలాగే సంబోధించాడు కూడా. తర్వాత అదే ఆయన నిక్‌నేమ్‌గా మారింది. ఇప్పుడీ హిప్పీ భారతీయ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేశాడు. '3డి హోలోగ్రామ్' టెక్నాలజీలో మోడీని యావత్ భారతదేశానికి చూపించింది ఆయనే. మోడీ, కెసీఆర్, చంద్రబాబు వంటి రాజకీయ నేతల ఎన్నికల ప్రసంగాలను ప్రజలకు మరింత దగ్గరగా చూపించిన ఘనత సెంథిల్ కుమార్‌కే దక్కుతుంది. 2014 ఎన్నికల్లో సెంథిల్ '3డి' ప్రచారం ఒక సంచలనమే అయ్యింది.**

# మోడీని త్రీడీలో చూపించాడు!

తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన సెంథిల్ చిన్నప్పటి నుంచే సినిమాలన్నా, ఫోటోగ్రఫీ అన్నా మక్కువ పెంచుకున్నాడు. 1989లో చెన్నైలోని గవర్నమెంట్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో చేరాడు. సినిమాటోగ్రఫీలో వస్తున్న మార్పులను అనునిత్యం అధ్యయనం చేసేవాడు. 1992లో ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ నుంచి బయటికి రాగానే సినిమాల్లో చేరాడు. ఒక్కో మెట్టు ఎక్కుతూ సినిమాటోగ్రాఫర్‌గా ఎదిగాడు. తమిళ ఇండస్ట్రీలోని స్టార్లందరితోను సుమారు 50 సినిమాలకు కెమెరామ్యాన్‌గా పనిచేశాడు. " సినిమాల్లో బిజీగా ఉండగానే ఎఐఎడిఎంకె అధినేత్రి, అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి అయిన జయలలిత తన ప్రచార సభలను రికార్డు చేయాల్సిందిగా నాకు ఆఫర్ ఇచ్చారు. కానీ సమయం లేక వాటికి నేను దూరంగా ఉన్నాను'' అని సెంథిల్ చెప్పారు.

తెలుగులో పలు టీవీ సీరియళ్లకు, ప్రచార చిత్రాలకు దర్శకత్వం వహించిన మణిశంకర్ ఆ తర్వాత బాలీవుడ్‌లో పలు విజయవంతమైన చిత్రాలను రూపొందించి సాంకేతిక చిత్రాల దర్శకుడిగా పేరుతెచ్చుకున్నాడు. '3 డి హోలోగ్రామ్' గురించి విన్న మణిశంకర్ తనతో పాటు సెంథిల్‌ను కూడా లండన్‌కు తీసుకెళ్లాడు. అక్కడే సెంథిల్ 3డి ఫోటోగ్రఫీలో శిక్షణ తీసుకున్నారు. అంతకుముందు ఈ టెక్నాలజీని అమెరికాలో పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ తన డాన్స్ ప్రోగ్రామ్‌లకు ఉపయోగించేవాడు. ప్రేక్షకులకు లైవ్‌లో చూసిన అనుభూతిని కలిగించే ఈ సరికొత్త టెక్నాలజీని ఎన్నికల్లో ఉపయోగిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వారిద్దరికి కలిగింది. సాంకేతిక విషయాల పట్ల ఆసక్తిని చూపే నరేంద్రమోడీని మొదట కలిశారు. " నేను ఆయన ఆఫీసురూమ్‌లో కూర్చున్నాను. కలర్‌ఫుల్ కుర్తా వేసుకుని ఠీవిగా మోడీగారు నడిచొస్తుంటే నేను నోరెళ్లబెట్టి చూస్తుండిపోయాను. దగ్గరకు రాగానే భోంచేశారా? అంటూ కుశల ప్రశ్నలు వేశారు. అప్పటికే నేను అక్కడ వేదికలాంటి సెట్ వేసి షూట్‌కు సిద్ధంగా ఉన్నాను. దానిపై టెస్ట్ షూట్ చేసిన తర్వాత మోడీ గారు హోలోగ్రామ్ టెక్నాలజీ గురించి 25 నిమిషాల సేపు మాట్లాడారు. ఆ టెక్నాలజీ గురించి అప్పటికే ఆయన చాలా తెలుసుకున్నారని నాకర్థమైంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనే దీన్ని ఉపయోగిద్దాం అనేసి వెళ్లారాయన. మోడీగారు అంత స్నేహపూర్వకంగా మాట్లాడతారని నేన స్సలు ఊహించలేదు'' అని మోడీతో తన మొదటి అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు సెంథిల్.



స్టూడియోలో మోడీతో ...

గుజరాత్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మోడీ 3డి ప్రచారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గంటన్నర పాటు షూట్ చేసిన ఆయన ప్రసంగాన్ని వందలాది స్క్రీన్‌ల ద్వారా లక్షలాది జనం వీక్షించే అవకాశం కలిగింది. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో సైతం ప్రధాని అభ్యర్థిగా మోడీ 3డి హోలోగ్రామ్ టెక్నిక్‌తో 750 స్క్రీన్‌ల ద్వారా గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్‌లలో కొన్ని లక్షల మంది ఓటర్లను ఆకట్టుకున్నారు. ఈ టెక్నాలజీ వల్ల మోడీ స్వయంగా తమ ముందుకు వచ్చి ప్రసంగిస్తున్న అనుభూతి పొందారు వారంతా. "షూటింగ్‌కు వచ్చిన ప్రతీసారి నాలుగైదు రంగుల కుర్తాలు వెంట తెచ్చుకునేవారాయన. హిప్పీ! ఏ రంగు కుర్తా వేసుకోవాలో చెప్పు అంటూండేవారు. 3డి హోలోగ్రామ్‌కు ఏవి బాగా సూట్ అవుతాయో చెబితే వాటిని వేసుకునేవారాయన. దేశంలో ఎక్కడికి వెళ్లినా చెప్పిన సమయానికి స్టూడియోకు వచ్చేవారు. అంతగా సమయపాలన ఉన్న వ్యక్తిని నేను ఇంతదాకా చూడలేదు'' అన్నారు సెంథిల్.

మోడీ కొత్త ప్రచారం మన నాయకులను కూడా ఆకర్షించింది. ఈసారి ఎన్నికల్లో టీఆర్ఎస్ అధ్యక్షుడు కెసీఆర్, తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు కూడా సెంథిల్ సేవలను వినియోగించుకున్నారు. సెంథిల్ బృందం పరిచయం చేసిన ఈ టెక్నాలజీ భారతీయ ప్రచార పర్వంలో మరెన్ని పోకడలు పోతుందో వేచిచూడాలి.

బ్లాగోతం

# ఒక రాజు - నలుగురు కొడుకులు

ఒక రాజుకి నలుగురు కొడుకులు. ఒకసారి రాజుకి జ్వరం వచ్చింది. స్వైన్‌ఫ్లూ ఏమోనని రాజవైద్యుడు వచ్చి పరీక్షించి చూసి జ్వరానికి కారణం వీపు మీద లేచిన పుండు అని తేల్చి చెప్పాడు. ''ఇక్కడికి ఈశాన్యంగా ముప్పయి కోసుల దూరంలో వున్న కొండ మీద వున్న చెట్టు తొర్రలో వున్న పిట్టవేసిన రెట్ట తెచ్చి, మందు చేసి పూస్తే అప్పుడు తగ్గుతుంది'' అని పెట్టె మూసుకుని వెళ్లిపోయాడు.

ముసలోడు(రాజు) తన కొడుకులను పిలిచి, ''నాయనలారా!''

(''ముసలోడు మనకి ఏదో పెట్టాడు'' అని కొడుకులు మనసులో అనుకుని, పైకి)

''తండ్రీ''

''నాకు ఈ జ్వరం తగ్గాలంటే మీరు నాకోసం ఒక సాహసం చెయ్యాలి'' అని రాజ వైద్యుడు చెప్పినది చెప్పాడు.

''సరే'' అని మొదటికొడుకు(వీడి పేరు అనవసరం) బయలుదేరాడు. వెళ్లినవాడు వెళ్లినట్టే వున్నాడు. వాడి జాడలేదు.

''సరే'' అని రెండవ కొడుకు( వీడి పేరు మనకు అస్సలు అవసరం లేదు) బయలుదే రాడు. వీడి జాడ కూడా లేదు.

''సరే'' అని మూడవకొడుకు(వీడి పేరు కూడా మనకు అస్సలు అవసరంలేదు) బయ లుదేరాడు.

వీడి జాడ కూడాలేదు.

''తండ్రీ నేను ఆరునూరైనా...నూరు ఆరై నా...మందు తీసుకుని వస్తాను'' అన్నాడు విజయుడు(వీడే మన హీరో. అందుకే పేరు పెట్టా...)

మందు అనే పదం వినగానే రాజుకి నోట్లో నీళ్లు కారాయ్. సారీ! వూరాయ్.

మెక్‌డవెల్స్‌ని వూహించుకుంటూ విజయుడిని ఆశీర్వదించాడు.

ఒకమంచి తెల్లగుర్రం మీద వారానికి సరిపడా ఆహారం తీసుకుని ఉత్తరది క్కుగా వెళ్లసాగాడు.

ఈశాన్యం వెళ్లమంటే..ఉత్తరంగా వెళ్లుతున్నాడు ఏమిటా అనుకుంటు న్నారా?

మన హీరో కొంచెం తేడాగాడు. వెర్రె టీకి ప్రాణం ఇస్తాడు. పూరిజగన్నాథ్ హీరోలాగా అన్నమాట. ఉత్తరంగా వెళ్లినా ఈశాన్యం వస్తుందని వీడి వెధవ ఆలోచన.

అలా కొంత దూరం పోయేసరికి విజయు డికి మంచినీళ్లు దాహంవేసింది.

(మంచి నీళ్లు కాక వేరే దాహం వేయడమే మిటి? వీడు కొంచెం తేడా కదా...అప్పుడ ప్పుడు వేరే దాహం కూడా వేస్తుంది వీడికి...)

నీళ్ల కోసం వెతుకుతున్న విజయుడికి, దూరంగా నీళ్లు పారుతున్న శబ్దం వినిపిం చింది. వేగంగా గుర్రాన్ని అటు వేపు పరిగెత్తిం చాడు.

అతనికి పెద్ద జలపాతం కనిపించే సరికి ఆనందంతో గుర్రాన్ని అక్కడే ఉన్న చెట్టుకి కట్టి, జలపాతంలోకి దిగాడు.

కడుపునిండా నీళ్లు తాగి బయటికి వస్తున్న విజయుడి కాలుకి ఏదో చుట్టుకుని బలంగా లోపలికి లాక్కొని వెళ్లింది. పూర్తిగా నీళ్లల్లో మునిగిన విజయుడు దాన్ని ఎక్కడో చూసినట్లుందని ఆలోచించి, ''అనకొండ'' అని పెద్దగా అరిచాడు.(ఈ మధ్య జెమినిలో తెలుగులో చూసాడు)

వెంటనే విజయుడు చొక్కా చించుకుని దానితో పోరాటానికి దిగాడు.

(ఆరుపెట్టెల బాడి చూసి అనకొండ పారి పోతుందేమోనని)

దాన్ని చంపటం ముందే చూసి ఉండటం వల్ల, ''జై జెమిని'' అనుకుని వీజీగా చంపే సాడు.

వెంటనే బయటకు వచ్చి, నీళ్లలోకి చూడ సాగాడు.



(చచ్చిన అనకొండలో నుండి దేవత వచ్చి ''ఏమి కావాలి కోరుకో!'' అంటే ఏమి కోరుకో వాలా అని ఆలోచించసాగాడు.)

కాని ఆమె ఎంతసేపటికి రాకపోయేసరికి, నిరాశగా గుర్రం దగ్గరకు వెళ్లాడు.

అప్పుడు గమనించాడు తన ఒంటిమీద అక్కడక్కడ గాయాలనుండి రక్తం వస్తోందని.

మాటీవీలో చూసిన 'ప్రకృతి వైద్యం' గుర్తుకు వచ్చి కావలసిన మొక్కలు వెతకసా గాడు.

ఒక మొక్కను చూసి అతని కళ్లు ఆనం దంతో మెరిసినయ్

దాని మొదట్లో పట్టుకుని బలంగా లాగాడు.

అంతే. ఒక పెద్ద మెరుపు. (మెరుపుతో పాటు శబ్దంకూడా వస్తుంది కదా) అందుకనే ప్రత్యేకంగా రాయలేదు. ఇంకు దండగని...)

వీటన్నింటితో పాటు దేవత కూడా ప్రత్యక్ష మయింది.

చొక్కాలేకుండా ఆరుపెట్టెల బాడీతో వున్న విజయుడిని చూసి,

''నాయనా! శరీరమంతా సొట్టలతో, చొక్కా కూడా లేకుండా, పిచ్చి మొక్కలు పీక్కుంటూ తిరుగుతున్నావు. నేను నీకు ఏమైనా సహాయం చేయగలనా?'' అని అడి గింది.

ఆశ్చర్యంతో కూడిన ఆనందం వల్ల వచ్చిన సిగ్గుతో విజయుడు మెలికలు తిరగసాగాడు.

''విషయం చెప్పు'' మళ్లీ ఆమే అడిగింది.

విజయుడు జరిగినదంతా డైలీ సీరియల్ లాగా కాకుండా టి20 లాగా చెప్పేసాడు.

''నన్ను ఆ చెట్టు దగ్గరకు చేర్చగలవా'' అని అడిగాడు.

''చెట్టు దగ్గరకు ఏంటిరా పిచ్చివెధవా? ఆ పిట్టరెట్టను కూడా తెచ్చివ్వగలను. నీ బుర్ర ఇంతవరకే పనిచేస్తుంది'' అని మనసులో అనుకుని, ''తథాస్తు'' అని మాయమయ్యింది.

తన తెలివితేటలకు లోలోపల మురిసిపోయేలోపలే విజయుడు చెట్టుతొర్రదగ్గర ఉన్నాడు. వెంటనే ఏమీ ఆలోచించకుండా తొర్రలో చె య్యి పెట్టాడు పిట్టకోసం. ఏదో కుట్టిన ట్లనిపిస్తే అంతే వేగంగా చెయ్యి వెనక్కి తీసుకున్నాడు.

బాధగా దిక్కులు చూస్తున్న అతనికి చెట్టు మీద చెక్కిన అక్షరాలు కనిపించాయి.

''ఈ చెట్టు తొర్రలో ఉన్న పిట్ట పక్క కొండ మీద ఉన్న చెట్టుతొర్రలోకి మారినది.''

కోపంతో విజయుడు పక్కనున్న కొండమీ దకి ఎక్కసాగాడు.



అదేసమయంలో కొండ పళ్లు ఏరుకుంటున్న కొండరాజు కూతురు 'బండరాణి' విజయుడిని చూసింది.

ఆరుపెట్టెలబాడీ చిరిగిన, రంగుపోయిన, ఒక బటన్ ఊడిపోయిన జీన్స్(లెవిస్ 501 సీరీస్) వేసుకున్న విజయుడిని ఆమె ఇష్టపడింది.

ఒక కొండ పండుని తీసుకుని అతనిపై మెల్లగా విసిరింది. అది విజయుడికి బలంగా తగిలింది.

అసలే అనకొండ కొరికి, చెట్లు గీరుకుని ఏదో కుట్టి, ఈకలు పీకిన కోడిలాగా వున్న విజయుడికి చిర్రెత్తుకొచ్చింది.

కొండరాణిని చూసి ''ఒసే బండదానా!'' అని అరిచాడు.

తన పేరు ఎలా తెలిసింది అని ఆశ్చర్యంతో కూడిన ఆనందం వల్ల వచ్చిన సిగ్గుతో ఆమె చెట్టు చాటుకు పరిగెత్తింది.

ఒక్కసారి భూమి కంపించినట్లయింది. విజయుడు పడబోయి పక్కనేఉన్న చెట్టున పట్టుకుని నిలదొక్కుకున్నాడు.

''సిగ్గు పడింది చాలు గాని బయటకు రా!'' అన్నాడు.

సిగ్గు పడుతూనే బయటకు వచ్చింది. అయినా విజయుడు పట్టుకున్న చెట్టుని వదల్లేదు ఎందుకేనా మంచిదని.

''నీకు ఏమి కావాలి? ఇక్కడకు ఎందుకు వచ్చావ్?'' అని అడిగింది ఒక మెలిక వేస్తూ.

కావలసింది ఇది అని చెప్పాడు.

(పిట్టరెట్ట కావాలని అడిగితే బాగోదేమోనని, పిట్ట కావాలని చెప్పాడు. పిట్టని కొట్టి దాని రెట్ట తీయొచ్చని వీడి వెధవ ఆలోచన. కొంచెం తేడాగాడు కదా)

అంతలో నెత్తిన 1...2...3...50 పిడుగులు పడినట్లనిపించింది.

కళ్లు తిరిగినయ్. తలచుట్టూ పిట్టలు తిరిగినయ్.

విజయుడి నెత్తిమీద గుద్దిన బండరాణి అమాయకంగా, '' ఈ పిట్టల్లో నీకు కావలసిన దాన్ని పట్టుకో'' అంది.

పిడుగు ఎటునుండి పడిందా అని దిక్కులు చూస్తున్న విజయుడికి పిడుగుకి కారణం తెలిసింది.

వచ్చిన కోపం మింగి (వీడి అవసరం కదా?) ''నాకు చెట్టు తొర్రలో వున్న పిట్ట కావాలి'' అని అడిగాడు.

''అమ్మో ఆ పిట్టా! అది చాలా చెడ్డది. ఇంతకుముందు దానికోసం వచ్చిన వాళ్లని

**''ఈ బండదాన్ని చేసుకోక తప్పేటట్లు లేదు'' అనుకుని, ''సరే'' అన్నాడు.**

**వెంటనే బండరాణి ఒక కొండ అరుపు అరిచింది.**

**ముందు పడిన పిడుగు కంటే దారుణంగా ఉంది ఆ అరుపు, చెవిలో నుండి కారుతున్న రక్తం తుడుచుకుంటూ.**

**ఏమి జరుగుతుందోనని చూడసాగాడు.**

ఏమి చేసిందో చూడు'' అని పక్కనే పడి వున్న మూడు అస్థిపంజరాలను చూపించింది.

పుర్రె(తలకాయ)లేని అస్థిపంజరాలను తన అన్నలుగా గుర్తించాడు విజయుడు.

''కాని నన్ను పెళ్లి చేసుకుంటానంటే నీకు సహాయం చేస్తాను'' మళ్లీ తనే అనింది.



''ఈ బండదాన్ని చేసుకోక తప్పేటట్లు లేదు'' అనుకుని, ''సరే'' అన్నాడు.

వెంటనే బండరాణి ఒక కొండ అరుపు అరిచింది.

ముందు పడిన పిడుగు కంటే దారుణంగా ఉంది ఆ అరుపు, చెవిలో నుండి కారుతున్న రక్తం తుడుచుకుంటూ.

ఏమి జరుగుతుందోనని చూడసాగాడు.

తొర్రలో నుండి పిట్టబయటికి వచ్చి ఎదురుగా వున్న బండరాణిని చూసి,

'అనుకున్నా, అరిచింది ఈ బండదేన'ని.. లోపల తిట్టని తిట్టు తిట్టుకుని,

''చెప్పండి మహారాణి'' అని పిట్టభాషలో అంది.

(మీకు అర్థం కావడానికి తెలుగులో రాయటం జరిగింది)

విషయం చెప్పింది బండరాణి కొండభాషలో.

వాళ్లిద్దరూ వాళ్ల వాళ్ల భాషలలో ఏదో మాట్లాడుకున్నారు..పోడుచుకున్నారు...

విజయుడు ఓపికగా వింటున్నాడు (వీడి అవసరం కదా...)

చివరికి పిట్ట వెళ్లడానికి ఒప్పుకుంది.

పెళ్లి కుదిరిన విజయుడు బండరాణిని, పిట్టని తీసుకుని రాజ్యానికి బయలుదేరాడు (ఏనుగు ఎక్కి)

''హమ్మయ్య'' అనుకున్న తెల్లగుర్రం మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది విజయుడికి.

...

దూరం నుండే రాజభటులు విజయుడిని గుర్తుపట్టి పరిగెత్తి వచ్చారు.

గుర్రంతో వెళ్లి ఏనుగు(బండరాణి)తో వచ్చిన యువరాజుని స్వాగత సత్కారాలతో ఆహ్వానించారు.

రాజవైద్యుడు పిట్టరెట్టతో మందు రాజుకు పూయడం, అది వికటించి రాజు చచ్చిపోవటం, విజయుడు రాజు కావడం వెంటవెంటనే జరిగిపోయాయి.

విజయుడు–బండరాణి–ఒక పిట్ట ....శుభం.

**– దగ్గుమాటి ఫణీంద్రరెడ్డి**

(indralokam.wordpress.com నుంచి)

బాటసారి

# చైనావాళ్లు మహా తెలివైనవాళ్లు!

**‘‘ప్రయాణం... సినిమా... రెండూ నా జీవితంలో కలగలసిపోయాయి. నా సినిమా కథలన్నీ ప్రయాణాల నుంచే పుట్టాయి. కథ రాసుకునేప్పుడు ఏదైనా ఆటంకం ఎదురైతే, వెంటనే కారు డ్రైవ్ చేసుకుంటూ ఎక్కడికైనా వెళ్తుంటాను. దాంతో అప్పటిదాకా నాలుగ్గోడల మధ్య ఉన్న నా ఆలోచనలు విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుభూతి కలుగుతుంది. కొత్త ఐడియాలతో మెదడు చురుగ్గా పనిచేస్తుంది’’ అంటున్నారు యువ దర్శకుడు మారుతి. ‘ఈ రోజుల్లో’, ‘ప్రేమకథా చిత్రమ్’, ‘బస్టాప్’ వంటి యూత్‌ఫుల్ సినిమాలతో కుర్రకారును ఆకట్టుకున్న మారుతి తాజాగా అల్లు శిరీష్, రెజీనా కాంబినేషన్‌లో ‘కొత్త జంట’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ‘‘ప్రయాణాల్లోనే ఒకరి గురించి మరొకరికి పూర్తి అవగాహన కలుగుతుంది. ముఖ్యంగా కుటుంబంతో కలిసి చేసే ప్రయాణాల్లో మన వారి పట్ల మనం తీసుకునే కేర్, వారి పట్ల మనకున్న ప్రేమ, గౌరవం వ్యక్తమవుతాయి. నాలుగ్గోడల మధ్య ఉండేవి సంబంధాలయితే... ప్రయాణాల్లో పెరిగేవి అనుబంధాలు’’ అంటున్న మారుతే ఈ వారం మన ‘బాటసారి’.**



చిన్నప్పటి నుంచే నాకు సినిమాలంటే ఇష్టం. ఏదైనా సినిమా చూస్తే చాలు... స్నేహితులమంతా కలిసి ఆ కథను కొత్త కొత్త మలుపులతో ఎవరికి తోచిన విధంగా వారు చెప్పడం మొదలెట్టేవాళ్లం. ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచి, ఐదారుగురం కలిసి సైకిళ్ల మీద మా ఊరు (మచిలీపట్నం) నుంచి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న మంగినపూడి బీచ్ వరకు సినిమా కథలు చెప్పుకుంటూ వెళ్లేవాళ్లం. సుమారు మూడు నుంచి నాలుగు గంటల ఆ ప్రయాణంలో మూడు నాలుగు కథలైనా చెప్పుకునేవాళ్లం. దారి మధ్యలో ఆకలేస్తే తినేందుకు ఊరి నుంచి బయలుదేరేప్పుడే ఒకరు పులిహోర, మరొకరు పెరుగన్నం తీసుకొచ్చేవారు. మధ్య మధ్యలో ఆగి వాటిని తింటూ ప్రయాణం సాగించేవాళ్లం. బీచ్‌లో సముద్ర స్నానాలు చేసి వెనక్కి వస్తూ కూడా బోలెడు సినిమా కథలు చెప్పుకుంటూ ఊరికి చేరుకునేవాళ్లం. ఆ ప్రయాణాలే నేను కథకుడిగా మారడానికి దోహదపడ్డాయి. నిర్మాతలకు సినిమా కథ చెప్పే మెళకువలను నేర్పించాయి.

## తెరమీద కనిపించింది నా ప్రయాణమే...

నా కథలన్నీ ప్రయాణాలు చేస్తున్నప్పుడే పుట్టుకొచ్చాయి. నాలుగ్గోడల మధ్య కూర్చుని కథను ఆలోచించేప్పుడు కొన్నిసార్లు ఏమీ తట్టక పెన్ను ముందుకు సాగదు. అలాంటప్పుడు వెంటనే కారు తీసుకుని ఒంటరిగా డ్రైవ్ చేసుకుంటూ హైదరాబాద్ శివార్లలోని చిలుకూరు బాలాజీ టెంపుల్‌కు వెళ్లడం నాకు అలవాటు. ఆ దారిలో కనిపించే అద్భుతమైన ప్రకృతి దృశ్యాలన్నీ నా మైండ్‌లో రికార్డ్ అయ్యాయి. నా తొలిసినిమా ‘ఈ రోజుల్లో’ సినిమా తీసేప్పుడు అందులోని రెండోపాటను ఎక్కడ తీయాలా అని ఆలోచిస్తున్నప్పుడు ఒక్కసారిగా నా మైండ్‌లోకి చిలుకూరు బాలాజీ టెంపుల్ రోడ్డు ఫ్లాష్‌లా వెలిగింది. ఆ రోడ్డులో నేను ఎగ్జయిట్ అయినా దృశ్యాలన్నీ పాటలో చూపించాలనుకున్నా. వెంటనే యూనిట్‌తో చర్చించి, 5డి కెమెరా తీసుకుని (ఆ సినిమా అంతా ఇదే కెమెరాతో తీశా) ఆ రోడ్డెక్కాను. ఆ పాటలో తెర మీద కనిపించే ప్రతీ దృశ్యం అంతకుముందు నా ప్రయాణాల్లో నేను చూసినవే. షూటింగ్ చేస్తున్నప్పుడు చిన్నగా వర్షపు తుంపరలు పడి, ఆకాశంలో ఇంద్రధనస్సు ఏర్పడింది. దాన్ని కూడా కెమెరాలో బంధించాను. సాధారణంగా ఏ సినిమాలోనైనా కృత్రిమ ఇంద్రధనస్సును చూపిస్తారు. నేను మాత్రం ఆ సినిమాలో నిజమైన ఇంద్రధనస్సును తెరపై చూపించాను. చాలాసార్లు ప్రయాణాలు మనలోని సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి చాలా పనికొస్తాయి.

## రోడ్డుపైనే లైవ్ పెయింటింగ్...

‘ఆ రోజుల్లో’ సక్సెస్ తర్వాత పన్నెండు రోజుల పాటు ఫ్యామిలీతో

లండన్‌లో రోడ్డు పక్కన లైవ్ పెయింటింగ్



యూరప్ ట్రిప్ వేశాను. నిజానికి ఆ సినిమా విడుదలకు ముందే 'థామస్ కుక్' వారి ప్యాకేజీ టూర్‌ను బుక్ చేశాను. బంధుగణమంతా కలిసి మొత్తం 25 మందిమి బయలుదేరాం. ప్యాకేజీ ట్రిప్ కాబట్టి వాళ్ల షెడ్యూలు ప్రకారమే అందరూ నడుచుకోవాల్సి ఉంటుంది. అది ఒక రకంగా ఇబ్బందే కానీ తొలిసారి యూరప్ దేశాలకు వెళ్తున్నాను కాబట్టి తప్పలేదు. లండన్‌లో దిగిన తర్వాత మాది పెద్ద బృందం కాబట్టి మాకు ప్రత్యేకంగా ఒక బస్సు పెట్టారు. అందులోనే వారి షెడ్యూల్ ప్రకారం లిస్టులో ఉన్న ప్రదేశాలను చూస్తూ వెళ్లాలి. ఎక్కడైనా మనకు నచ్చిన చోట ఎక్కువ సేపు ఆగుదామంటే కుదరదు. మా వాళ్లంతా ఇక్కడ టూరిస్టు బస్సుల్లో పుణ్యక్షేత్రాలకు వెళ్లినట్లు అక్కడ కూడా పర్యాటక ప్రదేశాలను హడావిడిగా చూస్తూ , ఫోటోలు దిగుతూ ఆనందిస్తున్నారు కానీ నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. రోడ్డు పక్కన ఎన్నో అద్భుతమైన సీనరీలు కనిపిస్తున్నాయి కానీ ఆగి చూసే ఛాన్సు లేదు. ఆస్ట్రియాలో మంచుకొండలు, ప్రకృతి దృశ్యాలు నన్ను అమితంగా ఆకట్టుకున్నాయి. అక్కడే ఇంకొంతసేపు ఉండిపోవాలనిపించింది కానీ బలవంతంగా బస్సులోకి రాక తప్పలేదు.



భార్య స్పందనతో ...

చివరికి ఒకచోట ఒక టూరిస్టు ప్లేసు చూసేందుకు బస్సు ఆగింది. అక్కడ రోడ్డు పక్కన పదుల సంఖ్యలో లైవ్ పెయింటింగ్ ఆర్టిస్టులు కూర్చుని ఉన్నారు. వారి ముందు కాన్వాసులున్నాయి. ఎదురుగా కూర్చున్న పర్యాటకుల బొమ్మలను (పోర్ట్రెయిట్స్) ఐదు నిమిషాల్లో చక్కగా గీసి ఇస్తున్నారు. నేను కూడా ఆర్టిస్టును. బొమ్మలు బాగా గీస్తాను కాబట్టి సహజంగానే నా అడుగులు అక్కడి నుంచి కదలడం లేదు. మా వాళ్ల రమ్మని ఒకటే బలవంతం చేస్తున్నారు. వాళ్లను వెళ్లి చూసి రమ్మని చెప్పి నేను అక్కడే పెయింటర్లు వేస్తున్న బొమ్మలను, వారి నైపుణ్యాన్ని గమనిస్తూ నిలుచుండిపోయాను. లైన్ డ్రాయింగ్, కలర్ సెలెక్షన్, కంపోజిషన్... తదితర అంశాల గురించి వారిని అడిగి తెలుసుకున్నాను. మనతో పోల్చుకుంటే విదేశాల్లో పురాతన కట్టడాలకు, సంస్కృతికి, కళాకారులకు బాగా విలువిస్తారు.



చైనా టూర్‌లో అక్కడి బుడతడితో సరదాగా ...

## అతి తెలివితో మోసపోయా ...

గత యేడాది చైనాకు ఏడు రోజుల పాటు ఫ్యామిలీ ట్రిప్ వేశా. చైనా ప్రొడక్ట్స్ గురించి అందరికీ తెలిసిందే. ప్రపంచంలో ఎక్కడ ఏ వస్తువు మార్కెట్లోకి వచ్చినా అచ్చుగుద్దినట్లుగా అలాంటి వస్తువునే వాళ్ల తయారుచేస్తుంటారు. ఏది అసలో, ఏది నకలో గుర్తుపట్టడం అసాధ్యం. ఆ విషయంపై అవగాహన ఉండటం వల్ల అక్కడ ఏదైనా కొనేప్పుడు జాగ్రత్తగా ఒకటికి రెండు సార్లు ఆలోచించి కొనాలని ముందే డిసైడ్ అయ్యాను. ఒకరోజు బస్సులో గైడ్ మమ్మల్ని షాంఘైలోని ఒకచోటుకి తీసుకెళ్లాడు. ఆ ప్రాంతంలో షాపింగ్ చేసుకోవచ్చని, ఎవరు ఎంత ధర చెప్పినా సగానికి సగం బేరం ఆడమని ఆయన మా అందరికీ చెప్పాడు. కొంతమంది స్కేటింగ్ షూ వేసుకుని, వాటిపై రోడ్డు మీద రయ్యిన దూసుకుపోతూ అలాంటి షూనే అమ్ముతున్నారు. చూడటానికి అవి చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. మా ట్రూపులో చాలామంది గైడ్ చెప్పినట్టుగానే సగానికి సగం బేరం ఆడారు. ఒక్కో జత '100 యెన్స్' (1 యెన్ సుమారుగా 10 రూపాయలు) అని చెబితే 50కి బేరమాడి తీసుకున్నారు. వాళ్లంతా కొనుక్కుని వెళ్లిన తర్వాత నా తెలివిని ఉపయోగించి వాటిని అమ్ముతున్న ఒకడితో బేరమాడాను. కాసేపటికి 20 యెన్స్‌కు ఒప్పుకున్నాడు. వెంటనే జేబులో నుంచి 100 యెన్స్ నోటు తీసి ఇచ్చాను. స్కేటింగ్ షూ నా చేతిలో పెట్టి మిగతా చిల్లర ఇచ్చాడు. నేను అనుమానంగా షూస్ బాగున్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలిస్తుండగా '' సార్ మీరిచ్చిన నోటు చిరిగి ఉంది. వేరే నోటు ఇవ్వండి'' అన్నాడు. నేను దాన్ని జేబులో పెట్టుకుని వేరే నోటు ఇచ్చి బస్సు ఎక్కాను. బస్సు బయలుదేరిన తర్వాత మా గైడ్‌తో అందరూ 50 యెన్స్‌కు కొంటే నేను తెలివిగా బేరమాడి 20కే కొన్నానని గొప్పగా చెప్పి చిల్లర చూపించాను. ఆ నోట్లను చూసిన గైడ్ 'ఇవి ఫేక్ నోట్స్' అనగానే వెంటనే నా జేబులో ఉన్న 100 నోటును చూపిస్తే... అది కూడా ఫేక్‌నోటే అన్నాడు. షూ అమ్మేవాడు నన్ను ఎలా మోసం చేశాడో (నేనిచ్చిన నోటు జేబులో పెట్టుకుని ఫేక్ 100 నోటును నాకిచ్చాడన్న మాట) గైడ్ చెబుతుంటే నవ్వాలో ఏడవాలో తెలియని పరిస్థితి నాది. అంటే 200 రూపాయల షూ కోసం 2000 రూపాయలు మోసపోయానన్నమాట.

ఫ్యామిలీతో యూరప్ ట్రిప్‌లో ...



## డ్రైవింగ్‌లో సగభాగం...

ఒకసారి అరకు చూసేందుకు నా భార్య (స్పందన) పిల్లలతో కలసి వైజాగ్ నుంచి కారులో వెళ్లాను. ఆ సమయంలో అరకు మొత్తం పచ్చని తివాచీ పరిచినట్లుగా ఉంది. నేనే స్వయంగా డ్రైవ్ చేస్తుండటం వల్ల నచ్చిన చోట ఆగుతూ ఫోటోలు దిగుతూ బాగా ఎంజాయ్ చేశాం. అక్కడి నుంచి బొర్రా గుహలకు వెళ్లి సాయంత్రం అవుతుండగా తిరుగు ప్రయాణమయ్యాం. కొంతదూరం రాగానే కడుపులో తిప్పింది. కళ్లు తిరగడం మొదలైంది. కొండ ప్రాంతం కావడం, ప్రమాదకరమైన మలుపులు, చీకటి పడుతుండటంతో నాలో టెన్షన్ మొదలయ్యింది. ఎక్కడా ఆగే పరిస్థితి లేదు. రోడ్డు మీద ఉండలేం. 'ఎలారా భగవంతుడా!' అనుకుంటుండగా, మా ఆవిడ తను కారు డ్రైవ్ చేస్తానంది. తనకు కారు డ్రైవింగ్ వచ్చన్న సంగతి నాకు తెలుసు కానీ అలాంటి ప్రమాదకర మార్గంలో ఎలా నడుపుతుందా? అనే టెన్షన్. కానీ తప్పదు. అయితే ఆమె కారులో అత్యంత సేఫ్‌గా మమ్మల్ని వైజాగ్‌కు తీసుకొచ్చింది. ఒకవేళ ఆమెకు డ్రైవింగ్ రాకపోతే... ఆ రాత్రి ఎలా గడిచేదో... ఇప్పటికీ తలుచుకుంటే భయమేస్తుంది.

ఫ్యామిలీతో ఎక్కడికి ప్రయాణమైనా బ్యాగుల్లో కొన్ని పచ్చళ్లు, పొడులు వేసుకుని వెళ్లడం మా వాళ్లకు అలవాటు. ఒక పూట బయటి ఫుడ్డుతో ఇబ్బంది పడ్డా, ఇంకో పూట వాటితో సుష్టుగా తింటాం. ప్రయాణాలు హోదాను మరిపించి అందర్నీ సహప్రయాణీకులను చేస్తాయి. మన 'సోల్' ఏం కోరుకుంటుందో తెలిసేది ప్రయాణాల్లోనే.

– చల్లా శ్రీనివాస్

## మీకు తెలుసా?

- ఆస్ట్రేలియాను ఇంతకుముందు న్యూ హాలండ్ అని పిలిచేవారు.
- మనిషి పాదంలో 26 ఎముకలుంటాయి.
- ఏనుగు రోజుకు 4నుంచి 5 గంటలపాటు నిద్రపోతుంది.
- నిమిషంపాటు ముద్దాడితే 26 కేలరీలు ఖర్చు అవుతాయి.
- హమ్మింగ్ బర్డ్ ఒకటే వెనకకు కూడా ఎగరగల పక్షి.
- మొసలి దాని నాలుకను అసలు కదిలించలేదు.

## చుక్కలు కలపండి





## పేరు 'న్నేక'

టొరెంటో జూలో పుట్టిన ఓ ఆడ గొరిల్లాకు మాంఛి పేరు పెట్టాలనుకున్నారు జూ క్యురేటర్ మారియా ఫ్రాంక్. ఆన్‌లైన్‌లో దానికి పేర్లు సూచించవలసిందిగా కోరారు. పేరులో 'ఎన్' మొదటి అక్షరంగా ఉండాలని నియమం పెట్టారు. ఎందుకంటే ఆ అక్షరంతోనే ఆ పిల్ల తల్లి పేరు మొదలవుతుందట. ఓహ్! ఒకటా...వందా.. వెయ్యా.. పదివేలపేర్ల జాబితా జడ్జీల ముందుకొచ్చింది. వాటిని వడపోసి..వడపోసి ఇరవైకి తగ్గించారు. మళ్లీ వాటిని మూడు పేర్లకు తగ్గించారు. ఈ పేర్లు వరుసగా నియా, న్యోటా, న్నేక. ఆ పదాల అర్థాలు వరుసగా... ఉద్దేశం, నక్షత్రం, వాళ్ల అమ్మే గొప్పది. అమ్మ పేరులో మొదటి అక్షరమే పిల్ల పేరులో ఉండాలనుకున్నారు కదా! ఇక 'వాళ్ల అమ్మే గొప్ప' అనే అర్థం వచ్చే పేరు దొరికితే..ఇంకేముంది? చివరి పేరే ఖరారు చేసారు. 'కనుమరుగవుతున్న ఈ గొరిల్లా జాతిని శాయశక్తులా కాపాడుకుంటాము' అంటున్నారు మారియా 'న్నేక'ను చూసి మురిసిపోతూ.

## దారి కనుక్కోండి






# అవయవాల పేర్లు




మన శరీరంలోని కొన్ని అవయవాల పేర్లు మనకు తెలియను కూడా తెలియదు. ఎక్కువగా డాక్టర్లు వాడే ఆ పదాలలో కొన్నిట్ని ఇస్తున్నాం..చూడండి.

**Medulla oblongata:** మెదడులో ఓ భాగం.

**Uvula:** కొండనాలుక.

**Gluteus maximus:** శరీరంలో ఇదే అతి పెద్ద కండరం.

**Patella:** ఇది మోకాలి చిప్ప. కాలు వంచినపుడు మోకాలును ఇది రక్షిస్తుంది.

**Axilla:** గొరిల్లా రైమింగ్‌తో ఉన్న ఈ పదానికి అర్థం చంక.

**Coccyx:** ఇది తోక ఎముక. ఇది ఉన్నట్లు కూడా చాలామందికి తెలియదు.

**Philtrum:** పైపెదవి మధ్యభాగం నుంచి ముక్కుకింది వరకు చారలా ఉన్న భాగం ఇది. జలుబు చేసినపుడు మ్యూకస్(చీమిడి అనే జిగురులాంటి ద్రవం) ఇక్కడ నిలుస్తుంది.

# నా బొమ్మ



**పి. సుశాంత్,** ఐదవ తరగతి
ఎస్.వి.ఆర్. డ్రాయింగ్ స్కూల్
వడ్డిగూడెం రోడ్, అమలాపురం.



# పిక్టోరిస్ వేగం



సౌరకుటుంబం వెలుపల కనుగొన్న 1800 గ్రహాల్లో బీటా పిక్టోరిస్ బి ఒకటి. దీనిని ఎనిమిది సంవత్సరాలక్రితం కనుగొన్నారు. దీని వయసు 20 మిలియన్ సంవత్సరాలని అంచనా. భూమికన్నా 3,000 రెట్లు బరువైనది. ఈ గ్రహం తిరిగే నక్షత్రం సూర్యుని కన్నా రెండురెట్లు బరువైనది, పదిరెట్లు కాంతివంతమైనది. ఈ గ్రహం వేగం గంటకు 90,000కిలోమీటర్లు. సౌరకుటుంబం వెలుపలి గ్రహాలలో దీని గురించి తెలిసినన్ని వివరాలు మరే గ్రహం గురించి తెలియవు. దీని వేగాన్ని కనుగొనడానికి సైంటిస్టులు ఉపయోగించిన టెక్నిక్‌ను డాప్లర్ ఎఫెక్ట్ అంటారు.

# 'గ్రేస్' టాప్ !

ఒక్కోసారి మీ తరగతి పాఠాలు పూర్తిచేయడానికే మీరు'అబ్బో ఎంత కష్టం' అనుకుంటారు కదూ. అలాంటిది ఒకే సారి హైస్కూలు, కాలేజి చదువులు చదవాలంటే ఎంత కష్టపడాలి? అలా కష్టపడి చదువుకుంది ఫ్లోరిడాకు చెందిన పదహారేళ్ల అమ్మాయి గ్రేస్ బుష్. 13 ఏళ్ల వరకు ఇంటివద్దనే చదువుకుంది ఎనిమిదిమంది అక్కచెల్లెళ్లతోపాటు. ఆ తర్వాత హైస్కూలు, కాలేజి చదువులు ఒకేసారి ప్రారంభించి పూర్తిచేసింది. ఇంత కష్టపడడం ఎందుకు అని ఛానల్‌వాళ్లు అడిగితే,''మా కుటుంబం చాలా పెద్దది. మా పేరెంట్స్‌కు దీనివల్ల డబ్బు ఆదా అయింది. క్రిమినల్ జస్టిస్‌లో డిగ్రీ తీసుకున్నాను కదా, ఏదో ఒకరోజు సుప్రీంకోర్టు జస్టిస్ అవుతాను''అని ధీమాగా చెప్పింది.





రంగులు దిద్దండి




# మైనస్ 30 లో మారథాన్

మైదానాల్లో నిర్వహించే పరుగుపందేలు... రోడ్ల మీద మారథాన్‌లు మామూలే. అలాంటి పోటీలు ఎక్కడైనా జరుగుతాయి. కానీ శరీరం గడ్డ కట్టే మంచులో నిర్వహించే రన్నింగ్‌రేసులో పాల్గొనాలంటే... తలుచుకుంటేనే ఎవరికైనా చెమటలు పడతాయి. అందుకే ఆర్కిటిక్ మహాసముద్రం దగ్గర జరిగే నార్త్‌పోల్ మారథాన్ పేరెత్తితే చాలు గజగజ వణికిపోతారెవరైనా. ప్రపంచంలోనే అతిశీతల మారథాన్ ఇదే. విమానాలు, హెలికాప్టర్లలో అక్కడికి చేరుకుని మైనస్ 30 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న మంచు మీద పరుగెత్తుతారు. అందులో పాల్గొన్నవారు ఒకటీ రెండు కిలోమీటర్లు కాదు... ఏకంగా 42 కిలోమీటర్లు పరుగెత్తాల్సి ఉంటుంది. అందుకే మారథాన్ ప్రారంభంలో ఇరవై ముప్పై మంది ఔత్సాహికులు కనిపించినప్పటికీ విపరీతమైన చలిని తట్టుకోలేక చాలామంది మధ్యలోనే డ్రాప్ అవుతుంటారు. అత్యంత ప్రమాదభరితమైన ఈ మారథాన్‌ను నాలుగు గంటల ఏడు నిమిషాల్లో పూర్తిచేసి మైఖేల్ వార్డియన్ ఈ యేడాది విజేతగా నిలిచాడు.




# 'స్వీట్‌కార్న్' ఛాంపియన్!



ఎంత రుచిగా ఉన్నా మీరు ఎన్ని మొక్కజొన్న పొత్తులు తినగలరు? రెండు లేదంటే మూడు అంతే కదా. కానీ న్యూయార్క్‌కు చెందిన కొంటీ అనే వ్యక్తి ఏకంగా 43 పొత్తులు తిని రికార్డు సృష్టించాడు. అమెరికాలోని దక్షిణ ఫ్లోరిడా చుట్టుపక్కల మొక్కజొన్నలను బాగా పండిస్తారు. ప్రతీ యేడాది అక్కడ 'స్వీట్ కార్న్ ఫెస్ట్' నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవంలో స్వీట్‌కార్న్‌కు సంబంధించి పలు ఆహార పదార్థాలను సందర్శకులకు అందుబాటులో ఉంచుతారు. అంతేకాదు మొక్కజొన్న పొత్తులు తినడంలో ఛాంపియన్‌షిప్ పోటీ కూడా పెడతారు. ఈసారి పోటీలో కొంటీ 43 పొత్తులు లాగించి కప్పు, కిరీటం ఎగరేసుకుపోయాడు.



❖ తాయ్‌ చీ

తాయ్‌చీలో ప్రధానంగా నాలుగు పద్ధతులు ఉంటాయి. వీటిని చిన్, యాంగ్, యూ, హో పద్ధతులుగా పిలుస్తారు. హో పద్ధతిని పాటించే వారు అతి తక్కువ. అందువల్ల దాని గురించి చెప్పుకోవాల్సిన అవసరం లేదు. తాయ్‌చీని సాధన చేసేవారందరూ పైన పేర్కొన్న మూడు పద్ధతులనే అనుసరిస్తూ ఉంటారు. ఇటీవల కాలంలో ఈ మూడు పద్ధతులలోని అంశాలను కలిపి మరొక పద్ధతిని తయారుచేశారు. ముందుగా ఈ మూడు పద్ధతులలోని ముఖ్యమైన అంశాలను తెలుసుకుని తర్వాత వాటిలోని కదలికలను విశ్లేషిద్దాం.



# మూడు పద్ధతుల్లో కదలికలు



★ చిన్ పద్ధతిలో కదలికలు చాలా వేగంగా ఉంటాయి. శక్తిమంతంగా కూడా ఉంటాయి. తాయ్‌చీని తొలిసారి నేర్చుకొనేవారు ఈ పద్ధతులను అనుసరించటం చాలా కష్టం. ఒకటో నెంబరు చిత్రంలో చిన్ కదలిక ఏ విధంగా మొదలవుతుందో చూడవచ్చు.

★ యాంగ్ పద్ధతినే ఇప్పుడు అనేక మంది అనుసరిస్తున్నారు. దీనిలో కదలికలు అంత వేగంగా ఉండవు. చిత్రం సంఖ్య 2లో యాంగ్ పద్ధతిలో కదలిక ఏ విధంగా మొదలవుతుందో చూడవచ్చు.

★ యాంగ్‌ను మరింత సులభతరం చేసి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ప్రయత్నంలో భాగంగా హో పద్ధతి ప్రచారంలోకి వచ్చింది. చిత్రం 3లో హో పద్ధతిలో కదలిక ఏ విధంగా మొదలవుతుందో చూడవచ్చు.




## తాయ్‌చీ వ్యాయామాలెలా ఉంటాయి?

తాయ్‌చీలోని వ్యాయామాలను మూడు రకాలుగా విభజిస్తారు. ఈ వ్యాయామాలను షార్ట్ ఫార్మ్స్, లాంగ్ ఫార్మ్స్, ఫార్మ్స్ విత్ వెపన్స్ (ఆయుధాలతో చేసే వ్యాయామాలు)లుగా విభజిస్తారు. కొత్తగా వ్యాయామాలు మొదలుపెట్టిన వారికి ఆయుధాలతో చేసే వ్యాయామాలను నేర్పరు. కదలికలలో కచ్చితత్వం వచ్చిన తర్వాతే వారికి ఆయుధాలను ఇస్తారు.

## షార్ట్ ఫార్మ్స్

షార్ట్ ఫార్మ్స్‌లో 30 నుంచి 40 వరకూ కదలికలు ఉంటాయి. వీటిని పూర్తి చేయటానికి మూడు నుంచి 20 నిమిషాల వరకూ పడుతుంది. ఎక్సర్‌సైజ్ చేసేవారు వార్మ్‌అప్ ఎలా చేస్తారో– తాయ్‌చీలో ఈ షార్ట్ ఫార్మ్స్ కూడా ఆ విధంగా ఉపయోగపడతాయి. వ్యక్తులకు ఉండే వ్యాధులను బట్టి ఈ వ్యాయామాలలో కొన్ని మార్పులు చేస్తూ ఉంటారు. అంతే కాకుండా– పైన పేర్కొన్న వేర్వేరు పద్ధతులను బట్టి కూడా ఈ వ్యాయామాలు మారుతుంటాయి.

## లాంగ్ ఫార్మ్స్

దీనిలో మొత్తం 80 కదలికలు ఉంటాయి. వీటిని చేయటానికి దాదాపు గంట సేపు పడుతుంది. ఈ కదలికలు కొద్దిగా క్లిష్టంగా ఉంటాయి. షార్ట్ ఫార్మ్‌ను నేర్చుకున్న తర్వాతే వీటిని నేర్చుకోవాల్సి ఉంటుంది. వీటిని నేర్చుకోవటానికే దాదాపు సంవత్సరం పడుతుంది. ఆ తర్వాత వీటిని క్రమం తప్పకుండా సాధన చేస్తే చాలా మంచి ఫలితాలు వస్తాయి. తాయ్ చీలో ఉన్నత శిఖరాలు చేరాలనుకొనేవారు ఈ కదలికలను, వాటి వెనకున్న మౌలిక సూత్రాలను తప్పనిసరిగా నేర్చుకోవాలి.

## ఫార్మ్స్ విత్ వెపన్స్

ఈ పద్ధతిలో ఆయుధాలను మన శరీరానికి అదనంగా అమర్చిన భాగాలుగా భావిస్తారు. ఆయుధం చివరి భాగంలో ఉన్న కేంద్రాన్ని లక్ష్యం చేసుకొని, శరీరంలోని శక్తినంతా దాని ద్వారా బయటకు పంపటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. రెండు వైపులా పదునున్న విచ్చుకత్తులు, విశాలమైన వేట కత్తులు, బరిసెలు మొదలైన వాటితో ఈ కదలికలు ఉంటాయి. తాయ్‌చీలో విశేషమైన అనుభవం ఉన్నవారు మాత్రమే వీటిని చేయగలుగుతారు.

– శ్రీభావ




# మనిషి వర్సెస్ జంతువు

అనగనగా ఒక రాజాభయ్యా ఉన్నాడు. ఆయన ఒక పెద్ద భూస్వామి అని, తనకి నచ్చని వాళ్ళని లేదా తనను వ్యతిరేకించే వాళ్ళని ఆయన తన ఇంటి ఆవరణలోనే ఉన్న కొలనులో ముద్దుగా పెంచుకొనే మొసళ్ళకి 'బ్రేక్‌ఫాస్ట్'గా వేస్తుంటాడని 'గిట్టనివాళ్ళు' అంటుంటారు. ఒక విలేఖరి ఆయనని మొసళ్ళ గురించి 'ఇలా అట కదా' అని అడిగితే, 'ఇవన్నీ మీలాంటి విలేఖరులే సృష్టించారోయ్' అని కోప్పడేసి, సదరు విలేఖరిని కూడా 'గిట్టనివాళ్ళ' లిస్ట్‌లోకి ఎక్కించేశాడట. ఇంతకీ విలేఖరి ఆయనని ఇంటర్వ్యూ ఎందుకు చెయ్యాల్సి వచ్చింది అంటే... రాజా భయ్యా 'సరదాగా' చేసిన అనేక పనులు 'గిట్టక' ఆయన మీద తప్పని పరిస్థితిలో కొన్ని కేసులు పెట్టాల్సి వచ్చింది. అలా ఆయన ప్రతి కేసు సందర్భంగాను ఒక్కో జైలుకి వెళ్ళాల్సి వచ్చింది. వెంటనే బెయిల్ వచ్చేస్తుండేదనుకోండి. అలా ఆయన ఉత్తరప్రదేశ్‌లోని 14 జైళ్ళనూ సందర్శించేరు. మహానుభావులు! ఈలోగా ఆయన కేసులు సెంచరీ దాటేశాయి. ఇంతలో ప్రభుత్వం మారింది. నవయువకుడైన ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌గారు ప్రమాణ స్వీకారం చేసినప్పుడే నేర చరిత్ర ఉన్నవాళ్ళకి, ముఖ్యంగా మర్డర్ కేసుల్లాంటివి ఉన్న వాళ్ళకి తన ప్రభుత్వంలో స్థానం లేదని ప్రకటించివున్నారు. కానీ ఆయన ప్రతిభకే పట్టం కట్టే మనిషి. రాజాభయ్యాగారి ప్రతిభని చూసి ఆయనని తగిన రీతిన సత్కరించాలనుకున్నారు. వెంటనే ఆయనని తన మంత్రివర్గంలోకి తీసుకుని జైళ్ళ శాఖ ఇచ్చారు. మనలో మన మాట. ఆ శాఖకు ఆయనకన్నా తగినవారు ఎవరు చెప్పండి! జైళ్ళ గురించి జైల్లో ఉండి వచ్చిన వాళ్ళకే కదా బాగా తెలిసేది.

***

వచ్చినప్పటి నుండి ఆమె ఏడుస్తూనే ఉంది. జైలుకు వచ్చిన మొదటిరోజు సాధారణంగా అందరూ చేసే పనే అది. కానీ ఆమె ఏడుపు చాలా దైన్యంగా ఉంది. ఎంతమంది పలకరించినా పలకలేదు. కొంతమంది భాషా సమస్య అనుకొని వేరు వేరు భాషల్లో కూడా ప్రయత్నించారు. మాసిన చీర. చంకలో పిల్లోడు. ఆమె కూర్చున్న చోటంతా ఝుమ్మని ఈగలు. కొందరు చీదరింపుగా వైదొలగుతుంటే, కొందరు జాలిగా చూస్తున్నారు. కొత్త బందీలు జైలుకు వచ్చే టైమ్ సాయంత్రమే. కాబట్టి ఆమె వచ్చిన కాసేపటికే లాకప్ టైమ్ అయ్యింది.

జమ్మేదార్ వచ్చేలోపు కాళ్ళు చేతులు కడుక్కోమని వార్డ్ పహరా (శిక్షపడిన ఖైదీలనే నియమిస్తారు ఆ పనిలో) కాసే ఆమె గదమాయించి చెప్పింది. అయినా ఆమె జవాబు చెప్పలేదు. కనీసం మాట్లాడుతున్న వాళ్ళ వైపు తల తిప్పి కూడా చూడలేదు. తన మానాన తాను ఏడుస్తోంది. లాకప్ అయ్యాక తనకి కేటాయించిన జాగాలో మొహం మీద కొంగు కప్పుకుని పడుకున్నది. పహరా రొట్టెలు తీసుకుపోయి ఇచ్చింది. తీసుకోలేదు. పిల్లాడి చేతిలో ఒక రొట్టె పెట్టి ఆమె వెనక్కి వచ్చింది. తర్వాత ఆమెని ఎవ్వరూ పలకరించలేదు.

***

ఉదయం లాకప్ తెరిచాక బయట వరండాలో కూర్చుని చిన్నగా బెక్కుతోంది. కన్నీళ్ళు కారీ కారీ ఎండిపోయినాయి. నేను నా ఉదయం పనులు ముగించుకొని వచ్చేసరికి కోర్టుకు వెళ్ళాలని పిలుపొచ్చింది.

# జైలుకథలు - 9

బి. అనూరాధ

స్నానానికి పోబోతూ ఆమె వైపు చూశాను. ఆమె మీద ముసురుతున్న ఈగల వల్ల అందరూ దూరంగా నిలబడి ఏదో జంతువును చూసినట్టు చూస్తున్నారు. నేను లోపలికి పోయి ఒక స్నానం సబ్బు, బట్టలుతికే సబ్బు, ఒక పాత దుపట్టా తీసుకుని వచ్చాను.

అరెస్టు చేసేటప్పుడు చాలా చిత్రంగా కనీసపు వస్తువుల్ని కూడా తీసుకోనివ్వరు. అందువల్ల ఎవరైనా సరే కట్టుబట్టలతో వస్తారు జైలుకి. ఇళ్ళలో అరెస్టు చేసేవాళ్ళని కూడా కనీసపు వస్తువులు ఎందుకు తీసుకోనివ్వరో అర్థం కాని విషయం. జైలుకి వచ్చిన 15 దినాల వరకు సబ్బులు, నూనె వంటివి కూడా ఇవ్వరు. నిజానికి అవసరమయ్యేదే అప్పుడు. ఇదేమి న్యాయమో, ఎక్కడి నియమమో అర్థమే కాదు.

పైగా అరెస్టయ్యాక ఒక దినమో రెండు దినాలో స్నానపానాలు లేకుండా పోలీసు స్టేషన్లలో గడపాల్సి వస్తుంది. దాని వల్ల జైలుకి వచ్చేసరికి ఘోరమైన పరిస్థితిలో ఉంటుంటారు.

**అరెస్టు చేసేటప్పుడు చాలా చిత్రంగా కనీసపు వస్తువుల్ని కూడా తీసుకోనివ్వరు. అందువల్ల ఎవరైనా సరే కట్టుబట్టలతో వస్తారు జైలుకి. ఇళ్ళలో అరెస్టు చేసేవాళ్ళని కూడా కనీసపు వస్తువులు ఎందుకు తీసుకోనివ్వరో అర్థం కాని విషయం. జైలుకి వచ్చిన 15 దినాల వరకు సబ్బులు, నూనె వంటివి కూడా ఇవ్వరు. నిజానికి అవసరమయ్యేదే అప్పుడు. ఇదేమి న్యాయమో, ఎక్కడి నియమమో అర్థమే కాదు.**

**పైగా అరెస్టయ్యాక ఒక దినమో రెండు దినాలో స్నానపానాలు లేకుండా పోలీసు స్టేషన్లలో గడపాల్సి వస్తుంది. దానివల్ల జైలుకి వచ్చేసరికి ఘోరమైన పరిస్థితిలో ఉంటుంటారు.**

'చూడమ్మా నీ పేరేంటి?'

... ఆమె నాకేసి కనీసం తల తిప్పి కూడా చూడలేదు.

'మూగదేమో?' గుంపులోంచి ఎవరో అన్నారు.

దగ్గరకెళ్ళి ఆమె పక్కనే కూర్చున్నా. ఒక్కసారి ఝుమ్మని చుట్టుముట్టాయి ఈగలు.

"ఇలా ఎంతసేపు ఏడుస్తావు చెప్పు? లే, లేచి ముఖం కడుక్కుని స్నానం చెయ్యి" అన్నాను. పహరా వేపపుల్ల తెచ్చి ఇచ్చింది. పిల్లోడు చూడు భయపడిపోయాడు అన్నా కదలిక లేదు.

"దీదీ... అంతా మంచిగయిపోతుందిలే. మేమంతా లేమా" మెల్లగా ఆమె చేతిని నా చేతుల్లోకి తీసుకుని భుజమ్మీద చెయ్యేశాను. మానవ స్పర్శకి అప్పటివరకు ఆమెలో ఘనీభవించినదేదో ఫెటిల్లిన విస్ఫోటించినట్టు నా మీద పడి ఏడ్చింది.

అప్పటివరకు నిలబడి చూస్తున్న శకున్ మెల్లగా వచ్చి ఆ పసివాడిని చేతుల్లోకి తీసుకున్నది. మెల్లగా ఒక్కొక్కరూ దగ్గరికి రావడం మొదలుపెట్టారు. ఆమెని రెక్కపట్టి లేపి బలవంతంగా సబ్బు చేతిలో పెట్టి బావి దగ్గరికి పంపుతుంటే లలిత వచ్చి, దీదీ మేము చూసుకొంటాములే కోర్టుకి టైమ్ అవుతోంది అన్నది. నిజానికి ఇప్పుడు నా అవసరం లేదు. మొదటి అడుగు ఎవరో ఒకరు వెయ్యాలంతే. తరువాత ఇక అందరూ వస్తారు. నేను తయారయ్యి వచ్చేసరికి ఆమె పిల్లాడికి స్నానం చేయించి గట్టు మీద కూర్చోపెట్టింది. శకున్ ఆ పిల్లాడికి టవల్‌తో ఒళ్ళు తుడిచి పౌడర్ వేసి బొట్టు, కాటుక పెట్టింది. నేను నిశ్చింతగా కోర్టుకు వెళ్ళాను. కస్టడీలోకి వెళ్ళి కూర్చున్నాక. హిందీ పేపర్లు తీసి చూశాను. ఎక్కడా ఆమె గురించి వార్త రాలేదు. కాబట్టి ఏం కేసో తెలియలేదు.



ఆమె కళ్ళలోని దైన్యం ఇంకా వెంటాడుతోంది. చాలా పేద మనిషిలా ఉంది. ఆదివాసీలాగే ఉంది. ఇప్పటికీ ఆమె నోరు విప్పి మాట్లాడలేదు కాబట్టి మూగమనిషా కాదా తెలియలేదు. బహుశా ఆమెని దుఃఖమే మాట్లాడనివ్వడం లేదు కావచ్చు. జీవితంలో ఎప్పుడూ ఊహించని ఒక కష్టాన్ని ఎదుర్కున్నప్పుడు అల్లకల్లోలమయిపోతాం మనుషులం. ఆ మనుషులు ఏ అడవిలోనో కట్టెలు కొట్టుకుని బతికే వాళ్ళయితే చెప్పనే అక్కర్లేదు.

నేను సాయంత్రం కోర్టు నుండి వచ్చేసరికి ఆమె ఒక గుంపు మధ్యలో కనబడింది. ఫరవాలేదే అనుకొన్నాను. స్నానం చేసి శుభ్రంగా ఉంది. లలితని అడిగాను ఏమన్నా తెలుసా? చెప్పిందా అని.

'మూగమనిషి అయితే కాదు. ఎందుకు తీసుకొచ్చింరో తెల్వదు' అన్నది.

★★★

అసలు విషయం ఏమిటంటే ఆమెను ఎందుకు తీసుకొచ్చారో ఆమెకూ తెలియదు. మాకూ తెలియదు. కొంతకాలం తరువాత మేము తెలుసుకున్న విషయం, ఆమెను జైలుకి తీసుకురావడానికి ముందు ఏం జరిగిందనేది మాత్రమే.

ఒకరోజు ఆమె నూకలతో గంజి కాచి, గుడిసెకి తడికె అడ్డుపెట్టి ఏమన్నా ఆకు కూర దొరికితే కోసుకు వద్దామని అడవిలోకి పోయింది. ఈ లోపు ఒక మేక వచ్చి గంజిగిన్నెలో మూతిపెట్టింది. గిన్నెలో దాని కొమ్ములు ఇరుక్కొని బయటకు రాలేదు. దాని తల మొత్తం గిన్నెలో ఉండిపోయింది. తల బయటకు తీయడానికి మేక ప్రయత్నించినా, చూసినవాళ్ళు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. గంజి లోపలికి పోవడం వల్లనో, ఊపిరాడకనో గానీ మేక చచ్చిపోయింది. మేక యజమానులు ఈమెని పరిహారం అడిగారు. ఆమె దగ్గర డబ్బులు లేవు. మామూలుగా అయితే పంచాయితీ అయ్యేది. కానీ ఇప్పుడు అడవిలోకి మరేమీ రాకపోయినా పోలీసుస్టేషను వచ్చింది. వాళ్ళు వెళ్ళి స్టేషన్‌లో రిపోర్టు చేశారు. పరిహారం కట్టలేకపోయింది. కనుక ఆమె మీద ఏదో ఒక కేసు పెట్టి జైలుకి పంపారు. తన ఇంటికి మేకలూ కుక్కలూ రాకుండా పకడ్బందీగా ఇల్లు కట్టుకోకపోవడమే ఆమె నేరమయిపోయింది. ఆమె కుటుంబ సభ్యులు ఏమేమి కష్టాలు పడ్డారో తెలియదు కానీ, మూడు నెలల తర్వాత ఆమెకి బెయిలు దొరికింది.

★★★

నీతి : మనుషులను జంతువులకు ఆహారంగా వెయ్యగలిగిన వాళ్ళు జైళ్ళ మంత్రులవుతారు. జంతువుల నుండి తమ ఆహారాన్ని కాపాడుకోలేని వాళ్ళు జైళ్ళ పాలవుతారు.

...........................................

anu13ravi@gmail.com



## పులిహోర

**కావలసిన పదార్థాలు:** (శుభ్రం చేసిన) చింతచిగురు – 1 కప్పు, పొడి అన్నం – 2 కప్పులు, వేరుశనగ పప్పు – 3 టేబుల్ స్పూన్లు, శనగపప్పు – 2 టేబుల్ స్పూన్లు, ఆవాలు – అర టీ స్పూను, మినపప్పు – అర టీ స్పూను, పసుపు – అర టీస్పూను, కరివేపాకు – 4 రెబ్బలు, ఎండు మిర్చి – 3, నూనె – 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా, ఇంగువ – చిటికెడు.

**తయారుచేసే విధానం:** అన్నం (ఉడుకుతున్నప్పుడే ఒక టీ స్పూను నూనె, చిటికెడు ఉప్పు కలిపి) పొడిగా వండి చల్లార్చాలి. అర టీ స్పూను నూనెలో చింతచిగురును పచ్చివాసన పోయేవరకు చిన్నమంటపై వేగించి పక్కనుంచాలి. అదే కడాయిలో మిగతా నూనె వేసి ఎండుమిర్చి, వేరుశనగలు, శనగపప్పు, మినప్పప్పు, ఆవాలు, కరివేపాకు, పసుపు, ఇంగువ లతో తాలింపు వేసి ఉప్పు, చిగురుతో పాటు అన్నంలో కలపాలి. ఈ చింత చిగురు పులిహోర వేసవిలో తప్ప మరోకాలంలో చేసుకునే అవకాశం లేదు కాబట్టి వెంటనే చేసేయండి.





# 'చిగురు' కాలం

ఫుడ్ కోర్ట్

## పచ్చిరొయ్యలతో

**కావలసిన పదార్థాలు:** చింతచిగురు – పావు కేజీ, పచ్చిరొయ్యలు – అరకేజీ, ఉల్లిపాయలు – 3, పచ్చిమిర్చి – 4, నూనె – 3 టేబుల్ స్పూన్లు, పసుపు – అర టీ స్పూను, కారం – 1 టీ స్పూను, ఉప్పు – తగినంత.

**తయారుచేసే విధానం:** పచ్చిరొయ్యలు, చింతచిగురు విడివిడిగా శుభ్రం చేసి ఉంచుకోవాలి. నూనెలో ఉల్లి, పచ్చిమిర్చి తరుగు దోరగా వేగించి పసుపు, రొయ్యలు వేసి మగ్గనివ్వాలి. రొయ్యలు మూడు వంతులు ఉడికిన తర్వాత చింతచిగురు, కారం, ఉప్పు కలిపి రెండు నిమిషాల తర్వాత కప్పు నీరు పోసి మూత పెట్టాలి. కూర చిక్కబడ్డాక దించేయాలి. (చింతచిగురు రుచి తెలియాలి కాబట్టి మసాల పొడి, కొత్తిమీర లాంటివి వాడకూడదు. మటన్, చికెన్‌లతో కూడా ఇలాగే కలిపి వండుకోవచ్చు. వీటిలో మాత్రం అల్లం వెల్లుల్లి, మసాల పొడి వాడాలి).





## చిగురు పొడి

**కావలసిన పదార్థాలు:** చింతచిగురు – 1 కప్పు, ఎండు మిర్చి – 10, కరివేపాకు – 4 రెబ్బలు, ఇంగువ – పావు టీ స్పూను, శనగపప్పు – పావు కప్పు, మినప్పప్పు – 1 కప్పు, వెల్లుల్లి రేకలు – 10, నూనె – అర టీ స్పూను, ఉప్పు – రుచికి తగినంత.

**తయారుచేసే విధానం:** చింతచిగురు శుభ్రం చేసి కడిగి ఆరబెట్టి దోరగా వేగించి పక్కనుంచాలి. శనగపప్పు, మినప్పప్పు విడివిడిగా వేగించాలి. నూనెలో ఎండుమిర్చి, వెల్లుల్లి రేకలు, కరివేపాకు, ఇంగువ వేగించాలి. అన్ని పదార్థాలనూ చల్లారిన తర్వాత ఉప్పు జతచేసి మిక్సీలో బరకగా పొడి చేసుకోవాలి. పుట్నాలు, పల్లీలు, నువ్వుల పొడి మాదిరే ఈ పొడి వేడి అన్నంలో నెయ్యితో పాటు కలుపుకుంటే చాలా రుచిగా ఉంటుంది.




## రమేశ్చంద్ర మహర్షి

బి.టెక్,

సెల్: 92465 82255

ఫోన్: 040-6522 5554


భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, ప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలూ, పంచ కర్మేంద్రియాలూ, మనసూ అనే పదకొండు ఇంద్రియాలూ, శబ్ద, రూప, స్పర్శ, రస గంధాలనే ఇంద్రియ విషయాలూ కోరిక, ద్వేషం, తెలివి, సుఖం, దుఃఖం, ధైర్యం ... వీటి వికారాలూ కలిసి ఏర్పడే క్షేత్రం ... మనిషి! ఆ మనిషికి భవిష్యత్తునే దారి చూపే నేత్రం, జ్యోతిశ్శాస్త్రం!!

★★★

కృతే కార్యే కిం ముహూర్త ప్రశ్నేన?

పని ముగిసిన పిదప ముహూర్తమడగడం, జరగకూడనిది జరిగిపోయాక పరిహారాలు పాటించడం వలన ఏంటి ప్రయోజనం?

భవిష్యత్ ముందే తెలిస్తే ముప్పు నుండి తప్పించుకోవడం లేదా తగ్గించుకోవడం సాధ్యమే!

కాలః క్రీడతి గచ్ఛత్యాయుః

కాలం ఆడుకుంటూ ఉంటుంది. ఆయువు గతించిపోతూ ఉంటుంది. రాబోయే మంచి చెడ్డలు తెలిస్తే ఉన్నంతలోనే ఉన్నతంగా జీవించగలుగుతాం!

వయం భగవంతః స్యామ

మనమందరమూ భాగ్యశాలురమవుదుముగాక!

★★★

పాఠకులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఈ క్రింది వివరాలు రాసి పంపండి.

పేరు ......................................

పుట్టిన తేదీ ..............................

పుట్టిన సమయం .......................

పుట్టిన ఊరు (మండలం)...........

ప్రశ్న ........................................

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

అదృష్ట రత్నజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రిక
ప్లాట్ నెం.76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033.

# అదృష్ట రత్నజ్యోతి

**కె.టి., చెన్నై**

**మా అమ్మాయి ఉద్యోగం, భవిష్యత్ వివరించగలరు.**

మీ అమ్మాయి జన్మకుండలి ప్రకారం-

2002 నుండి 2020 ఫిబ్రవరి వరకూ రాహు దశ.

2020 ఫిబ్రవరి నుండి 2035 నవంబర్ వరకూ గురు దశ. పిదప శని దశ.

రాహు దశ అమ్మాయి కెరీర్ మీద దృష్టి పెడుతుంది. రవి స్థితి, గురు కుజుల వీక్షణ వలనా ప్రభుత్వోద్యోగం ఖాయం! అది ఐఏఎస్ అని చెప్పలేం కానీ మూడక్షరాలదే మాత్రం అవుతుంది. కుజుని నీచత్వం, లగ్నాధిపతిని అష్టమ శని కంట్రోల్ చేయడం గజకేసరి యోగం విచ్ఛిన్నం కావడం వంటి కొన్ని కాంబినేషన్స్ దీనికి కారణం. దశమ రాహువు, రవి సమక్షంలో ధన లాభాధిపతుల యుతి, లగ్న తృతీయాధిపతుల పరివర్తన వంటి కాంబినేషన్స్ కలిగిస్తున్న బలం, ప్రభుత్వోద్యోగం ఎంత ప్రబలమయినదో వివరిస్తున్నాయి.

ఇప్పటి నుండి 2016 సెప్టెంబర్ వరకూ ఆరాటం పోరాటం, ఏ ఉద్యోగం కూడా తృప్తినివ్వకపోవడం జరుగుతుంది. 2016 సెప్టెంబర్ నుండి 2017 ఆగస్ట్ మధ్య స్వప్నం సాకారమవ్వడం. సివిల్స్‌లో విజయం!

2014 ఉత్తరార్థం వివాహం. 2016 సెప్టెంబర్ వరకూ వైవాహిక జీవితంలో చికాకు. ఈ పీరియడ్‌లో వివాహానికి సంబంధించినంతవరకూ ఎలాంటి తొందరపాటు నిర్ణయాలూ తీసుకోకూడదు. సహనం వహించడమే పెద్ద రెమెడీ. ఇక్కడ చిన్నపాటి రిప్పూ ఉంటుంది... అది... వివాహం నాటికి అబ్బాయి మంచి ఉద్యోగంలో ఉండడం జరిగినా రాహువులో రవి అంతర్దశ వచ్చే నాటికి ఈ జాతకురాలు సివిల్స్‌లో సెలెక్ట్ కావడం వలన భర్త అనే గీత చిన్నదై కనిపిస్తుంది. సప్తమాధిపతి నీచ పట్టడం, నీచభంగం కాకపోవడం వలన ఇది అనివార్యం! అధిపతికి అష్టమాధిపతి కంట్రోలింగ్ ఫ్యాక్టర్ కావడం, కుజదోషం వలన వైవాహిక జీవితంలో సంతృప్తి దాదాపు అసాధ్యం. ఎప్పుడూ ఏదో ఒక చికాకు, ఇగో తృప్తిపడక పోవడం... ఇవన్నీ తప్పని పరిస్థితులు. 2017 ఆగస్ట్ నుండి 2019 ఫిబ్రవరి మధ్య ఈమె మొత్తం మైండ్‌సెట్ మారిపోతుంది. ఇక్కడ శక్తికీ, మనసుకీ కారకుడయిన చంద్రుడు ఉచ్ఛపట్టి లగ్నంలో స్థితి పొందడం వలన, ఒక కొత్త అహంభావం వచ్చి చేరుకుంటుంది. ఆత్మవిశ్వాసం మంచిదే కాని అహంకారానికి ఫలితం అశాంతే కదా. పెత్తనం చేయాలనే మనస్తత్వం కూడా దీనికి మూలకారణం. స్వభావో దురతిక్రమః !



2019 ఫిబ్రవరి నుండి 2020 ఫిబ్రవరి మధ్య కుజదోషం జూలు విదుల్చుకుంటుంది. తనకంటే తక్కువ స్థాయిలో ఉన్న భర్తని ఈ దేశంలో అయితే భార్య మనసా వాచా అంగీకరించడం కష్టమే. అప్పటివరకూ ఉన్న అసంతృప్తి, భార్యాభర్తల మధ్య యుద్ధం భీకర వాతావరణాన్ని సృష్టిస్తుంది. అయితే ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయాలు రెండున్నాయి. ఈ జాతకురాలు తలక్రిందులుగా తపస్సు చేసినా ఇంతకంటే శక్తివంతుడయిన భర్తను పొందలేకపోవడం. రెండు- 2020 ఫిబ్రవరి వరకూ ఓపిక పడితే భార్యాభర్తల మధ్య ఈ సమస్య భవిష్యత్తులో మరి ఉత్పన్నం కాదని తెలుసుకోవడం.

దీనర్థం అప్పటి నుండి చిలకల్లాగా, గోరింకల్లాగా అన్యోన్యంగా ఉంటారని కాదు. రానున్న గురుదశకీ కుజుడే కంట్రోలింగ్ ఫ్యాక్టర్ కావడం వలన భార్యాభర్తల మధ్య అదే జీవితం నడుస్తుంది. కాకపోతే ''అలవాటు''యిపోతుంది.

ఈ ప్రపంచాన్ని శాసించే నాలుగయిదు పదాల్లో ''అలవాటు'' ఒకటి! మంచిదే!

జీవితం ఎవరికయినా రెండు విధాలుగా నడుస్తుంది. 1. ఒక సమస్య రావడం, దాన్ని పరిష్కరించుకోవడం. తిరిగి మరో సమస్య రావడం దాన్ని పరిష్కరించుకోవడం. ఇది ఒక కోవ. 2. ఒక కష్టం రావడం, దాన్ని నివృత్తి చేసుకోవడం. తిరిగి మరో కష్టం రావడం దాన్ని నివృత్తి చేసుకోవడం. ఈ జన్మకుండలి మొదటి కోవకి చెందినది. అయితే ధనం, అధికారం వీటికి లోటులేని జీవితం.

వయో రూప విభూతీనా మేకైకం మద కారణమ్!

2019 ఫిబ్రవరి నుండి 2020 ఫిబ్రవరి మధ్య ఉత్పన్నమయ్యే పైన చెప్పుకున్న సమస్యకి శని కుజులకు ఎంత గట్టి రెమిడీస్ పాటిస్తే అంత ప్రయోజనం.

ఇక గురు దశ. ధన వర్షం కురిపించే మహత్తరమైన దశ. బృహత్తరమయిన ప్రణాళికలతో ముందుకు దూసుకుపోయే దశ. అయితే ఈ దశ నూటికి నూరు శాతం యోగించాలంటే అనుసరించాల్సిన పనులు... కుటుంబ సభ్యులను ఎంత సంతోషంగా, ఉల్లాసంగా ఉంచగలిగామన్నది. దీనర్థం ఇంట్లో ఎవరి మనసూ కష్టపెట్టకపోవడం. ముఖ్యంగా భర్తది.

రెండు... ఉగ్రం వచో అపావధీత్...

భద్ర వాచ్యాయ ప్రేషితో మానషః !

తోటి వాళ్ళతో తీయగా మాట్లాడాలి.

2020 ఫిబ్రవరి నుండి 2022 మార్చ్ మధ్య గురువులో గురువు. ఒక ప్రాపర్టీ తీసుకోవడం. పప్పులో కాలేయడం. అది లిటిగెంట్ ప్రాపర్టీ అవ్వడం, ధననష్టం. దీనంతటికీ కారణం భర్త తీసుకున్న తప్పుడు నిర్ణయం... ఇంకేముంది, మళ్ళీ యుద్ధ వాతావరణం. ఈ పీరియడ్‌లో ఎంత సంపాదించేమన్నది ముఖ్యం కాదు. ఎంత పోగొట్టుకోకుండా ఆపగలిగామన్నదీ, భార్యాభర్తల మధ్య సఖ్యతా ముఖ్యం! అంటే దీనిలో బోధపడిన విషయం... ఈ అంతర్దశలో ఎలాంటి స్థిరాస్తి కొనుగోలు చేయకూడదు.

2022 మార్చ్ నుండి 2024 సెప్టెంబర్ మధ్య శన్యంతర్దశ. ప్రతి విషయం నెగెటివ్ నోట్‌తో ప్రారంభం కావడం, చివరికి లాభించడం. ఉద్యోగంలో ఊహించని సమస్యలు. అయితే పరిష్కారమయిన ప్రతిసారీ మంచి పేరు రావడం... ఆత్మవిశ్వాసం ద్విగుణీకృతమవుతుంది.

2024 సెప్టెంబర్ నుండి 2026 డిసెంబర్ మధ్య బుధాంతర్దశ. ప్రమోషన్. ధనలాభాధిపతులు ధన స్థానంలో కలిస్తే ఎలాంటి ఎఫ్లుయెన్స్ ఇస్తారో ఈ జన్మకుండలి ఒక ఉదాహరణవుతుంది. ఒక మాటలో చెప్పాలంటే ఐశ్వర్యం! స్టింకింగ్ రిచ్! పెలాషియల్ బిల్డింగ్!

కెంపు+పచ్చ కలిపి ధరిస్తే ఇంకా మరెన్నో ఆస్తులు!

2026 డిసెంబర్ నుండి 2027 నవంబర్ మధ్య... మళ్ళీ లెక్కలేనన్ని ఆస్తులు. ''లెక్కాపత్రం లేని'' ఆస్తులు! ఒక్కోసారి అంతే! సరయిన దశాంతర్దశలు నడిస్తే అదృష్టం జీవితాన్ని ఉప్పెనై ఊపేస్తుంది!

భాగ్యం ఫలతి సర్వత్ర!!

పుస్తక ప్రపంచంలో ఒక మహా ఆవిష్కారం '**అధినేత**'. 1992లో సంచలనం సృష్టించిన రమేశ్చంద్ర మహర్షి విరచిత '**అధినేత**' ఇప్పుడు ఎమెస్కో వారి ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. **ప్రతులకు: 92465 82255.** Advt

## ఈవారం కథ

★ బి.పి. కరుణాకర్

# ఇరుకు పదును

***నర్సింగరావు చనిపోయి అయిదు నెలలు దాటింది. అతను చనిపోయాకే మొదటిసారిగా వాళ్లింటికి వెళ్లాను. అప్పుడే అతని భార్య సరస్వతిని చూసాను. మొదటిగదిలోనే ఒక మూలనున్న కుర్చీలో కూర్చుని ఉంది. అతని పార్థివ శరీరం గది చివర్లో ఉంది. తీసుకు వెళ్లిన గులాబీ దండ అతని శరీరం మీద వేసి చేతులు జోడించి నమస్కరిస్తూ నిమిషంపాటు కళ్లు మూసుకుని అతని ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నాను.***

ఆమె కూర్చున్న దగ్గరకు వెళ్దామనుకున్నాను. నేను ఎవరో ఆమెకు తెలియక పోవచ్చు కాబట్టి నన్ను నేను పరిచయం చేసుకుని విచారం తెలియచేద్దామనుకునేంతలో నలుగురైదుగురు ఆడవాళ్లు ఆమె చుట్టూ చేరేసరికి నా ప్రయత్నం విరమించుకోవలసి వచ్చింది. తర్వాత వీలుకా లేదు. మా ఆఫీసు వాళ్లూ, అతను పనిచేసిన డిపార్ట్‌మెంటువాళ్లు చాలా మంది వచ్చేసరికి ఆమెను కలిసి మాట్లాడలేకపోయాను.

అంతకు ముందు ఏడెనిమిదిసార్లు అతనిని నా కారులో వదిలిపెట్టడానికి వచ్చినపుడు తన ఇంట్లోకి రమ్మని అతను నన్ను ఎప్పుడూ పిలవలేదు. నా ఇంటికి మట్టుకు చాలా సార్లు వచ్చాడు. ఇంట్లో ఉండేది నేను ఒక్కడినే కాబట్టి అతను ఫ్రీగా మెలిగేవాడు.

ఆఫీసులో భోజన విరామసమయంలో స్టాఫ్ క్యాంటిన్‌లో భోజనం చేసాక నా గదిలో అరగంటపాటయినా కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్లం. అతనే ఎక్కువ మాట్లాడేవాడు. నేను అతనంత మాటకారిని కాను. నాకంటే ఏడెనిమిదేళ్లు చిన్నవాడయినా నాకు దిక్సూచిలా ఉండేవాడు. అతను చనిపోయేనాటికి మంచి హోదాలో ఉన్నాడు. బతికి ఉంటే తేలికగా జనరల్ మేనేజర్ అయి ఉండేవాడు. నా హోదా అతనంత పెద్దది కాదు.

మా సంస్థ లేడీస్ వెల్ఫేర్ సెంటర్ ద్వారా కంపేషనేట్ గ్రౌండ్స్ మీద సరస్వతి కంప్యూటర్ విభాగంలో అప్రెంటిస్‌గా చేరింది. ఆమె చేరిన మూడు వారాల తర్వాత గాని భవాని నాకు ఆ విషయం చెప్పలేదు. భవాని నర్సింగరావుకు దగ్గర మనిషి. ఆమెను నాకు పరిచయం చేసింది అతనే.

అప్రెంటిస్‌లకు ఎంత చదువున్నా నాలుగువేల కన్నా ఎక్కువ జీతం ఉండదు. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం బ్రేక్ ఇచ్చి తిరిగి ఉద్యోగంలోకి తీసుకుంటారు. సంస్థ బస్సుపాస్‌లు ఉండవు.

నాకు తెలిసి నర్సింగరావు బాగానే సంపాదించాడు. రెండు అపార్ట్‌మెంట్స్ కొన్నాడు. ఒకటి అద్దెకు ఇచ్చి మరొక దాంట్లో తను ఉండేవాడు. ప్రస్తుతం సరస్వతికి పెన్షన్ వస్తూండవచ్చు. బీమా, గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ ఎక్కువ మొత్తంలోనే అంది ఉంటాయి. పేరుకు అప్రెంటీసె అయినా ఎక్కువగా అటెండర్ పనులే చేయించు కుంటుంటారు. అన్నీ అమరిన వ్యక్తి అంత చిన్న ఉద్యోగానికి అంతో దూరం నుండి ఎందుకు వస్తున్నదో అర్థం కాలేదు. భవానీని అడిగాను. తనకు తెలియదు అంది. భవాని కలుపుగోలు వ్యక్తి అయినా గుట్టుమనిషి. నిజాల గొంతు నొక్కేస్తుంటుంది. ఆమెకు ముప్పయి సంవత్సరాలు పైబడినా ఇరవై అయిదు సంవత్సరాలు మించనట్లు కనిపిస్తుంది. పెళ్లి కాలేదు. నాకు అర్థం కాని మరొక విషయం ఏమిటంటే సరస్వతికీ, భవానికీ స్నేహం ఎలా కుదిరిందని! రెండు మూడు సార్లు వాళ్లు కలిసి తిరగడం చూసాను.

సరస్వతి రెండు సార్లు నా ఆఫీసు గదికి వచ్చింది. కాని గదిలో మరెవరో కూర్చుని ఉండడం వలన లోపలకు రాలేదు. వెళ్లిపోయింది. నన్ను పలకరిద్దామని వచ్చిందో, నర్సింగరావు గురించి ఏమయినా తెలుసుకుందామని వచ్చిందో తెలియదు. భవానీకి ఫోను చేసి అడుగుదామనిపించినా పనుల్లో పడి మర్చిపోయాను.

మూడో సారి నా గదిలో మరెవరూ లేకపోవడం గమనించి సరస్వతి భవానిని వెంటబెట్టుకుని వచ్చింది. కూర్చోమన్నాను. ''టీ తెప్పించమంటారా'' అని అడిగాను. ''వద్దు'' అంది సరస్వతి. భవాని చేతివేళ్లకు ఉన్న రంగులు చూసుకుంటోంది. ఒక్కొక్క వేలికి ఒక్కో రంగు వేసుకుని ఉంది.



బొమ్మలు : అక్బర్

''చెప్పండి. ఎలా ఉన్నారు? మీ పిల్లలు ఎలా ఉన్నారు?'' అడిగాను.

నర్సింగరావుకు ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయి ఇంజనీరింగ్, రెండోవాడు సీనియర్ఇంటర్ చదువుతున్నారు.

''నేను బావున్నాను. పిల్లలూ బావున్నారు. మీరు నాకో అరగంట సమయమిస్తే కొన్ని విషయాలు మాట్లాడి వెళ్తాను'' అంది సరస్వతి.

భవాని ముఖంలోకి చూసాను. ఆమె కళ్లు బావుంటాయి. వాటిని పక్కకు తిప్పింది. ఎందుకో గంభీరంగా ఉన్నట్టు అనిపించింది.

''మాట్లాడండి''.

సరస్వతి ముఖం ప్రసన్నంగా లేదు. మునుపెన్నడూ పరిశీలనగా చూడలేదు. ఎప్పుడూ అంతేనేమో! భవాని నాకు ముందుగా హింట్ ఇచ్చిఉంటే బావుండేది. సరస్వతి తన పర్సులోంచి మూడు తాళం చెవులు బయటకు తీసి టేబుల్ టాప్ మీద పెట్టి, నా ముందుకు జరిపింది.

''ఇవి వేటివో చెప్పగలరా?'' అడిగింది.

ఒకటి తీసి ఆమెవైపు జరిపి, ''ఇది మీ కారుది. స్టెర్లింగ్ టవర్ వద్ద కారు పార్క్ చేసి సిటీ బస్సు పట్టుకుని కంపెనీకి వచ్చేవాడు'' అన్నాను.

స్టెర్లింగ్ కంపెనీ నుండి మా కంపెనీ ముప్పయి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ప్రయాణఖర్చుల నిమిత్తం నర్సింగరావుకు

కంపెనీ నెలకు మూడువేలు ఇచ్చేది. నేను కంపెనీ బస్సు ఉపయోగించుకుంటాను. కాని తను ఉపయోగించుకునేవాడు కాదు.

''వాళ్లు సమాచారమివ్వగానే డూప్లికేట్ తాళంచెవితో కారు స్టార్ట్ చేసి ఇంటికి తీసుకువెళ్లాం. చాలా పార్ట్స్ తీసేసారు. ఎవరు తీసారంటే మాకు తెలియదు అని అక్కడి వాచ్‌మెన్‌లు ఎవరికి వాళ్లు తప్పించుకున్నారు. ఇంటికి తీసుకెళ్లాక బాగు చేయించాను. ఇప్పుడు బాగానే నడుస్తోంది.''

''మీకు డ్రైవింగ్ వచ్చా?''

తలూపింది. కారు తీసుకువెళ్లాక ఇంక ఆ తాళంచెవి నాకు ఎందుకు చూపించడం?

''కంపెనీకి కారులో వస్తున్నారా?''

''లేదు. బస్సులో వస్తున్నాను.''

''ఈ రెండో తాళం మోటారు బైక్‌ది. దాన్ని కూడా తెచ్చుకున్నారా?''

''లేదు. ఎక్కడ ఉంది?''

''రైల్వే స్టేషన్ అటుపక్కనున్న స్టాండ్‌లో ఉంటుంది. మీ ఐడెంటిటీ చూపించి అద్దెబకాయి కడితే ఇచ్చేస్తారు. సమస్యేమీ ఉండదు.''

''మరి ఇది?''

మూడోతాళం చెవి చేతిలోకి తీసుకున్నాను. పెద్దగా ఉంది. లాకర్ చెవిలా అనిపిస్తోంది. చివర 101 నెంబరు వేసిన నీలంరంగు కాయితం కట్టి ఉంది.

''ఇది లాకర్ కీ అయి ఉండాలి'' అన్నాను.

''ఏ బ్యాంకుది అయివుంటుంది?''

''నాకు తెలియదు. డబ్బు తాలూకు లావాదేవీలు నాతో ఏనాడూ మాట్లాడలేదు.''

''లాకర్‌లో డబ్బులుండొచ్చు కదా?''

''ఉండొచ్చు. డబ్బే కాకుండా నగలు, ముఖ్యమైన డాక్యుమెంట్లూ ఉండొచ్చు. బ్యాంకులో అకౌంట్ ఉన్నవారికే లాకర్ సదుపాయం ఉంటుంది. ఏఏ బ్యాంకుల్లో అకౌంట్లు ఉన్నాయో మీ ఇంట్లో పాస్‌బుక్‌లుంటే సరాసరి బ్యాంకు మేనేజర్ల దగ్గరకు వెళ్లి మాట్లాడితే బావుంటుంది. మీతో కొన్ని విషయాలు దాస్తుండేవాడా?''

''అదేం కాదు'' అంది చిన్నగా. నిజం చెప్పినట్టు అనిపించలేదు. తాళం చెవులందుకుని పర్సులో వేసుకుంది.

''మీ అంత దగ్గరగా ఆయనకు స్నేహితులు ఉండేవారా?''

''ఉండొచ్చేమో. నేను అడగలేదు. ఆయన చెప్పలేదు.''

పర్సు మళ్లీ తెరిచి రెండు ఉత్తరాలు తీసి నాకు అందించి, ''ఇవి ఎవరు రాసినవో చెప్పగలరా?'' అడిగింది.

అవి ప్రేమలేఖలు. రెండూ ఒకరు రాసినవి కావు. రెండింటిలోనూ రాత చక్కగా ఉంది. ఎవరికి సంబోధిస్తూ రాసారో పేర్లు లేవు. అలాగే చివర్లో సంతకాలూ లేవు. చదవాలనిపించలేదు. ఆ ఉత్తరాలు తిరిగి ఆమెకు ఇచ్చేసాను. ఆమె మడతలు పెట్టి పర్సులో పెట్టుకుంటూంటే భవాని వంక చూసాను. తల అడ్డంగా ఆడించింది. ఆ విషయంలో ఏమీ చెప్పవద్దని ఆమె నన్ను ప్రాధేయపడినట్లుగా అందులో సంకేతం ఉంది.

''మీ ఆయనకు స్నేహితురాళ్లు ఉన్న విషయం నాకు తెలియదు'' అన్నాను.

''మీకు తెలియదంటే నమ్మాలనిపించడం లేదు. ప్రతిరోజూ మీరు మాట్లాడుకునేవాళ్లు కాదా?''

''ప్రతిరోజూ....'' జవాబు చెపుతుండగానే నా మాటలకు అడ్డు వచ్చి, ''మీ ఇద్దరూ ఏ విషయాల గురించి మాట్లాడుకునేవాళ్లు?''

ఆమె స్వరంలోని కాఠిన్యానికి నా సహనం నశిస్తోంది

నిగ్రహించుటూ నెమ్మదిగా, ''ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకునేవాళ్లం'' అన్నాను.

''అంతేనా?'' నవ్వుముఖంతోనే అడిగింది.

కుర్చీలో అసహనంగా కదిలాను.

''ఆడవాళ్ల గురించి ఏం మాట్లాడుకునేవాళ్లు కాదా?''

ఏమని జవాబు చెప్పాలో అర్థం కాలేదు. నేను ఏమీ చెప్పకపోయేసరికి,

ఆమే అంది, ''సహజం కదా.''

''వెల్. నా కంటే భార్య లేదు...'' ఆగాను.



''మీ అంత దగ్గర స్నేహితులు ఆయనకు ఉన్నారా?'' మళ్లీ అడిగింది.

''ఆయన డిపార్టుమెంట్ ఫ్యాక్టరీలో ఉంటుంది. అక్కడ ఎవరైనా ఉండొచ్చు. కాని తన స్నేహితుల గురించి నాతో ఎప్పుడూ చెప్పలేదు..'' అంటున్నాను.

నా మాటలకు అడ్డు తగులుతూ, ''మీరెందుకు పెళ్లి చేసుకోలేదు?'' అడిగింది.

భవాని సరస్వతి చేతి మీద తన చేయి ఉంచి, ''కారు ప్రమాదంలో సార్ భార్య, పిల్లలిద్దరు చనిపోయి పదేళ్లు అయింది. మళ్లీ పెళ్లి చేసుకోలేదు'' అంది.

''సారీ. అయాం సారీ'' అంది సరస్వతి.

చేతి గడియారం వంక చూసుకున్నాను. మా సంభాషణ అంతటితో ఆగిపోతే బావుణ్ను అనుకున్నా. కాని ఆమె సందేహాలు పూర్తిగా తీరినట్టు అనిపించడం లేదు. పొరపాటున ఏ మాట జారతానో?

''ఆయన ఎడ్వంచర్స్ గురించి మీకు ఎంతో కొంత తెలిసిఉండాలి'' పట్టు వదలకుండా అంది.

అటో ఇటో తేల్చుకోవడానికీ వచ్చినట్టుంది. ఏం చెప్పబోయి ఏం చెపుతానో? బల్లమీదున్న గ్లాసు అందుకుని మూత పక్కన పెట్టి నీళ్లు తాగాను. గ్లాసు మళ్లీ బల్లమీద పెట్టాను.

'' ఎడ్వంచర్స్ అంటే?'' అడిగాను.

జవాబుగా రెండు ఫోటోలు తీసి నా ముందు ఉంచుతోంటే భవాని ముఖంలోకి చూసాను. మూడు నాలుగు క్షణాలపాటు భవాని కళ్లు మూసుకుంది. భవానీకి నామీద నమ్మకం సడలుతూ ఉండొచ్చు. ఆ ఫోటోలు నర్సింగరావు ఎందుకు భద్రంగా ఉంచుకున్నాడో, అవి సరస్వతి చేతుల్లోకి ఎలా వచ్చాయో అర్థం కావడం లేదు.

''ఇలాంటివి...ఇవి ఎవరివో చెప్పగలరా?''

తల అడ్డంగా ఆడించి, ''తెలియదు'' అన్నాను. భవాని ముఖంలోకి మళ్లీ చూడదల్చుకోలేదు. సరస్వతి అరచేతులు తెరిచి నా కళ్లల్లోకి చూస్తూ అడిగింది. ''నేనాయనకు ఏం తక్కువ చేసానని?''

ఆ ప్రశ్నకు నా దగ్గరేం జవాబు ఉంటుంది?

రచయిత సెల్: 92908 28575

# మిక్చర్ పొట్లం

బొమ్మలు: ఎస్.రాజశేఖర్ రెడ్డి

## పెళ్లవనీ ... నా తఢాకా చూపిస్తా



"మా యజమాని ఒట్టి దరిద్రుడు. నన్ను కొట్టని రోజంటూ లేదు తెలుసా?" బాధగా చెప్పింది గాడిద.

"అన్ని దెబ్బలు తింటూ ఆ ఇంట్లో పడుండాల్సిన కర్మ నీకేంటి?" ఓదార్చింది కుక్క.

"నిజమే .. కాని వాడికో అందమైన కూతురుంది. ఆ పిల్ల సరిగ్గా చదవనప్పుడంతా నీకు గాడిదనిచ్చి పెళ్లి చేస్తా అంటుంటాడు వాడు. అందుకే భరిస్తున్నా" వివరించింది గాడిద.

## దాంపత్య రహస్యం



"70 ఏళ్లు వచ్చినా మీరు మీ ఆవిడని డార్లింగ్, జానీ, ప్రియా, కన్నా, మున్నా ... అని రకరకాల ముద్దు పేర్లతో పిలుస్తున్నారు. మీ అన్యోన్య దాంపత్యం వెనకున్న రహస్యం చెబుతారా?" అడిగాడు సుబ్బారావు.

"మా ఆవిడ అసలు పేరు మర్చిపోయి పదేళ్లు దాటింది. ఆ సంగతి తనకు తెలియకుండా ఇలా కవర్ చేస్తుంటా" అసలు విషయం చెప్పాడు రామారావు.

## పీడకల



"రాత్రి నీవు కలలోకి వచ్చావు తెలుసా?" చెప్పాడు మురళి.

"వచ్చి .. ఏం చేశానమ్మా?" గోముగా అడిగింది ప్రేయసి రూప.

"మనిద్దరం ఒకే బస్సులో ప్రయాణిస్తున్నామట. హఠాత్తుగా బస్సు ఒక నదిలో పడిపోయింది. ఎవరికి వాళ్లం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఈదుతున్నాం. నీవు మాత్రం ఎవరికోసమో వెతుకుతున్నావు"

"బహుశా నీకోసమే అయివుంటుంది మురళీ" సిగ్గుపడింది రూప.

"కాదు, కండక్టర్ టికెట్టు వెనక టూ రూపీస్ డ్యూ రాసాడు, వాడెక్కడంటూ నీవు అరవడం వినిపించింది" చెప్పాడు మురళి.

## ఆత్మరక్షణ కోసం



"ఏరా ... హడావిడిగా ఎక్కడికో బయల్దేరావు?" అడిగాడు వీరగంధం.

"కరాటే నేర్చుకోడానికి" చెప్పాడు కొత్త పెళ్లికొడుకు జోగినాథం.

"ఇప్పుడంత తొందరేమొచ్చిందిరా?" నిలదీశాడు వీరగంధం.

"మా ఆవిడకి కరాటే వచ్చని శోభనం రాత్రే తెలిసింది ..." బదులిచ్చి బిరబిర నడిచాడు జోగినాథం.

## భలే మొగుడు



"మీ ఆయన లాంటి అత్యాశపరుడిని మరెక్కడా చూడలేదమ్మా" చిరాగ్గా అన్నాడు డాక్టర్ రంగనాథం.

"ఏం జరిగింది డాక్టర్?" నీరసంగా అడిగింది అలివేలు.

"నీ కిడ్నీలో రాళ్లున్నాయని చెబితే, రంగురాళ్లా ... ఏమాత్రం ఖరీదు చేస్తాయని అడిగాడు" చెప్పాడు డాక్టర్.

## ఎవరికి చెప్పుకోవాలి?



"హల్లో .. పోలీస్ స్టేషనా .. రోడ్ నెంబర్ వన్‌లో అంకాళమ్మ గుడి దగ్గర యాక్సిడెంట్ జరిగింది"

"ముందు అంబులెన్స్‌కి ఫోన్ చేయవోయ్"

"యాక్సిడెంట్ జరిగింది అంబులెన్స్‌కే సార్"

– సిహెచ్‌వివిఎస్ మూర్తి, పాల్వంచ

## ఛాయా 'చిత్రం'



రివర్స్ గేర్

# అంకెలతో అదృష్టం

**ఐ.బి. సాహు**
సెల్ : 95810 94208, 90142 48124

పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీకాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియనితనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు.......................
2. పుట్టిన తేదీ ...........
(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)
3. పుట్టిన సమయం .........
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు ...........
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అంకెలతో అదృష్టం**

ఆంధ్రజ్యోతి దినపత్రిక,
ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్ – 500 033.

సంఖ్యలలో ఒకటి ఎప్పుడూ ఒకటే. అయితే అన్ని ఒకట్లు నెంబర్ వన్ కావు. కానేరవు. 208 ద్వారా వచ్చే ఒకటి, 19 ద్వారా వచ్చే ఒకటి బాహ్య రూపంలో లెక్కించబడినా క్షేత్ర స్థాయిలో ఒకటిగా లెక్కించబడని రూపాంతరాలు. చాల్డీన్‌లో 30 లేదా 31 వరకు వివరించినా పైథాగరస్ సిద్ధాంతంలో 108 దాకా లెక్కించినా తెలుగు సంఖ్యా శాస్త్రంలో 56 వరకే లెక్కించినా సంఖ్యలు వాటి స్వభావాలు ఇంతే ఉండాలని కాని, ఇంతలోపే ఉండాలని కాని , స్వభావం ఇదే అని ఎక్కడా నిర్వచించబడనపుడు 16 స్వభావం 25లో ఎలా వస్తుంది? తిరిగి 34 స్వభావం 25గా ఎలా వస్తుంది లాజిక్ లేని ఈ వాదం ఎలా సమర్థించగలం.

ఒకటి – 1999 – ఈ మొత్తం కూడా ఒకటే. అయితే ఒకటిలో ఉన్న లక్షణాలన్నీ ఇందులో ఉన్నాయా అని అడిగితే ఖచ్చితంగా ఉండవు. విశేషం 9999లలో ఒకటి రాదు. ఇవన్నీ ఎందుకు వ్రాయవలసి వచ్చిందంటే ఒకటి– బార్న్ లీడర్, ఒకటి– మీరు స్ట్రాంగ్ అని చెప్పే కబుర్లు ఎంత హాస్యాస్పదంగా ఉన్నాయో చెప్పడానికే!! కొన్ని పదతుల్లో ఒకటికి అర్థమే వివరించబడదు. 10వ సంఖ్యకు అర్థం వివరించబడదు. 19లో సాధించే స్థాయి ఉన్నట్లే, ఎవరో ఒకరి మోసానికి గురయ్యే లక్షణం అంతర్లీనంగా ఉంటుంది. ఇదే 19 మొండి శక్తిని ఇస్తుంది. మరో పద్ధతిలో 19 స్వర్గాధిపత్యం అనీ ఉంటుంది. ఒక సాధారణ వ్యక్తితో మీ పేరు 19లో సెట్ చేయడం వల్ల మీరు స్వర్గాధిపత్యం సాధిస్తారంటే అతను భయపడిపోతాడు.



ఇక 28లో ఎలా, ఏం చెయ్యాలి, ఎందుకు, ఇవన్నీ నాకేనా అనే అసంతృప్తి 90 శాతం ఉంటుంది. 37లో విపరీతమైన శక్తి ఉందనడంలో అతిశయోక్తి లేదు కాని పలాయనవాదం ఉండడం సైడ్ ఎఫెక్టే. 46లో యునిక్‌గా నిలిచే శక్తి ఉంది. అహంకారమూ ఉంది. మూలపురుషుడు అనిపించే సత్తా ఉంది. అయినవారికైనా అన్యాయం చేయగల కఠినత్వమూ ఉంది. ఇవన్నీ కూడాను 37లో మీరు మహరాజంటే ఊరుకోవు. బాహ్యస్థాయిలో ఈ లక్షణాలు ఉండగా అంతఃస్థాయిలో మరింత స్పష్టంగా ఇండికేట్ చేస్తుంటాయి. ఎన్నో బాధలు అనుభవించే వ్యక్తిని 73 సరిపోతే 73లో పేరుపెడితే మార్పు తథ్యం.

ఆర్.వి. శక్తి స్థాయిలో వచ్చే 82 పరువు నష్టానికి దారితీయడమే కాదు, గొంతుకు ఉరి బిగించే శక్తినిచ్చేయగలదు. 91 డిస్ట్రక్షన్‌ను ఇచ్చేస్తుంది. సంఖ్య ఏ స్థాయిలో ఏ ఫలితాన్నిస్తుందో తెలియనపుడు అది ఖచ్చితంగా విషప్రాయమే. 100ను సెంచరీ అన్నాం బావుంది. అందులో దాగివున్న పంతాన్ని ఎవరూ కాదనలేరు. 37లో ఉన్న అర్థం 136లో కీర్తిని పెంచే దిశగా మళ్ళించబడుతుంది. 46లో ఉన్న శక్తి 154లో అదృష్టాన్ని మార్చే సాధనంగా రూపాంతరం చెందుతుంది. కాబట్టి 1 నుండి 30 వరకో, ఒకటి నుండి 52 వరకో చెప్పే లక్షణాలలో 19, 28, 37 ఒకే స్థాయిలో ఉండవు కాక ఉండవు.

ఇక కోర్స్ నిర్ధారణలో లక్ష్య సాధన ఉండాలి. కోర్స్ ఇచ్చేదే ఫలిత సాధనకు. అటువంటపుడు 41 రోజులు 41 సార్లు పది కోర్సులు అనేది ఏ ఫలితాన్నిస్తుందో ఒక్కసారి స్థిమితంగా ఆలోచిస్తే ఖచ్చితంగా భయం వేస్తుంది.

37వ సంఖ్య 307 సార్లు వ్రాయగలిగితే మిస్ట్రిల్ శక్తి సాధ్యపడుతుంది. అదే 406 సార్లు వ్రాయగలిగితే పర్‌ఫెక్షన్ ఏర్పడిపోతుంది.

అక్షరంలో ఉన్న శక్తిని అంకె ద్వారా సాధించాలనుకున్నపుడు ఎన్నో రూల్స్ ఉంటాయి. ఆ రూల్స్ అనుసరణ జరిగిన రోజు పవిత్ర అయినా సీత అయినా నరహరి అయినా శ్రీనివాస్ అయినా ఒకటే. పేరు ఏదైనా సరే ఉద్దీప్తం కావించబడతుంది. పేరులో కాంతి వేగం పెరుగుతుంది. పేరులో ధ్వని వేగం క్రమబద్ధం చేయబడుతుంది. ఆపైన జన్మ తేదీలోని వైబ్రేషన్‌కు సింక్రొనైజ్ కాబడతుంది. ఇవి అన్నీ వరుసగా స్టెప్‌వైజ్ జరిగినపుడు సానియా పేరు శక్తివంతమే. సోనియా పేరు అద్భుతమే. అవేమీ జరగనపుడు రామచంద్ర పేరు నిశ్చలంగా, తటస్థంగా ఉండడంలో ఆశ్చర్యమే లేదు.

'ఎ' అక్షరం చాలా సులభంగా చేర్చేస్తుంటాము. బూడిద నుండి తిరిగి ప్రాణం పోసుకోగల శక్తి 'ఎ' స్వంతం. ఒక వ్యక్తి ఆయుష్షు 'ఎ' అక్షరంలో గణించేయవచ్చు. అయితే ప్రతిభ, సామర్థ్యం ఉండాలి. ఒకటి గురించి వ్రాసింది చాలా తక్కువ. శాస్త్రం డెప్త్ ఇంకా ఎక్కువ...

Advt

## కొత్తపుస్తకాలు

### అంతః సూత్రాలను పట్టుకోలేకపోయినా

# మంచి కథలే!

**జీ**వితంలో కథ ఉంది. కథలో జీవితం ఉంటుంది. జీవనరంగం మారినప్పుడల్లా కథ కాన్వాస్ మారిపోతుంటుంది. మార్పు ఇంత నిత్యం, తథ్యం అయినప్పుడు జీవితాన్ని అల్లుకొని ఉండే కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాల మాటేమిటి? తల్లిదండ్రులు, కుటుంబం ఉన్నప్పటికీ పిల్లలను అనాథల్లా ప్రైవేట్ హాస్టళ్ళలో పడేస్తున్నారు కొందరు. అనుబంధాలు, ఆప్యాయతలకు దూరంగా ఎక్కడో కార్పొరేట్ స్కూళ్లలో చదివిస్తున్నారు. హైదరాబాద్‌కో, అమెరికాకో బతకడానికి పోయిన కుటుంబం ఆ తర్వాత పుట్టి పెరిగిన ఊరు, మనుషుల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఒక వయసు వచ్చిన తరువాత తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలోకి నెడుతున్నారు. లేదంటే పనిమనుషులు, ఆయాల స్థాయికి దించేస్తున్నారు. పిల్లలు పుట్టలేదని భర్త రెండో పెళ్లి చేసుకుంటున్నాడు. ఇలా కుటుంబ, మానవ సంబంధాలతో ముడిపోయిన వ్యక్తీకరణలను ఎన్నయినా చెప్పుకోవచ్చు. కథల్లోకి తీసుకురావచ్చు. ఏడ్వవచ్చు. ఏడ్పించవచ్చు. కానీ, ఈ గరుకైన అనుభవానికి పదేపదే మనం ఎందుకు గురికావల్సి వస్తున్నదనేది మాత్రం ప్రశ్నగానే మిగిలిపోతున్నది. దీనికి విరుగుడు, నివారణ, ఉపశమనం ప్రకృతిలోకి ప్రయాణించడమేనా? నవ నాగరిక సామాజిక కథనాన్ని ప్రాకృతిక సంబంధాల నమూనా ఇంకెంతకాలం శాసిస్తుంది? డా.ఎం.సుగుణరావు 'నేలకు దిగిన నక్షత్రం', ఈతకోట సుబ్బారావు 'కాశీబుగ్గ', కూతురు రాంరెడ్డి 'కాలుతున్న కట్టెలు' కథా సంపుటులను పరిశీలించినప్పుడు ముప్పిరిగొనే ఆలోచనలివి.




రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుంచి రాస్తున్న ముగ్గురు సీనియర్ కథకులను ఒక్కచోట చదవడం ఒక అనుభవం అయితే, కొన్ని ఇతివృత్తాల నిర్వహణలో ముగ్గురి అనుభవం, వ్యక్తీకరణ, నిర్ధారణ ఒకేలా ఉండటం ఆసక్తి కలిగించే మరో అంశం. కూతురు రాంరెడ్డి, ఈతకోట సుబ్బారావుల విషయంలోనైతే ప్రాంతీయ వైవిధ్యమే చక్కని శిల్పంగా అమరింది. వీరి టైటిల్ కథలు 'కాలుతున్న కట్టెలు', 'కాశీబుగ్గ'ల్లో చర్చించిన విషయాల కన్నా, కథనాన్ని పరుగులు తీయించిన శైలీ విన్యాసమే ఎక్కువ ఆకట్టుకుంటుంది. సుగుణరావు కథనంలో నాటకీయత పాలు ఎక్కువ. నాటకీయతే లేకపోతే జీవన ఇతివృత్తాలు కథా ఇతివృత్తాలను అందించలేవు. నిజమేగాని వాస్తవికత అనే రెండో కోణం కూడా జీవితానికి ఉంది. అటు నాటకీయతని, ఇటు వాస్తవికతని సమస్థాయిలో పట్టుకున్న సాహిత్యం ఉత్తమ కేటగిరీకి చెందుతుంది. మన రచయితలు ఈ ప్రయాణాన్ని ఇంకా సాధించాల్సే ఉన్నదని సుగుణరావు కథలు చదివినప్పుడు అనిపిస్తుంది. ఉమ్మడిగా ఈ ముగ్గురూ తమ రచనల్లో కనబరిచిన ఆదర్శ మానవతావాదానికీ వీరి వయసుకూ సంబంధం ఉన్నదనిపిస్తుంది. అమ్మనేం చేద్దాం? (కాలుతున్న కట్టెలు), మా ఊరు ఒక్కసారి పోయి రావాలి (నేలకు దిగిన నక్షత్రం), జాబిలమ్మ (కాశీబుగ్గ) కథల్లో కనిపించే సారూప్యతని వీరి సమతల మనఃస్థితి ద్వారానే అర్థం చేసుకోగలం.




కదిలేదీ కదిలించేదీ సాహిత్యమేగానీ, అది ప్రశ్నలను కూడా రాజేయాలి. ఒక స్థితిని మనఃఫలకం మాత్రమే పట్టుకోలేదు. మంది అనుభవానికి ప్రకృతి, సమాజ అనుభవం కూడా జత కలవాలి. అప్పుడే సంపూర్ణ అర్థస్వరూపం దర్శనమిస్తుంది. ఈతకోట సుబ్బారావు కథలు విసిరే ప్రశ్నల పదును ఆయన శిల్ప రహస్యాన్ని పట్టిస్తుంది. 'కాశీబుగ్గ ' కథలోని చిందులు జానపద కథానాయకుడి లక్షణాలు గల, మనసుకు హత్తుకుపోయే పాత్ర. నల్లమలలో చీకటితెరలు కమ్మిన రాత్రి దృశ్యం, బెంగాలీ ప్రసిద్ధ రచయిత విభూతిభూషణ్ 'వనమాలి'లోని తుఫాను రాత్రిని కళ్లకు కట్టి గగుర్పాటును కలిగిస్తుంది. 'జాబిలమ్మ' ఎత్తుగడ ఆకట్టుకుంటే, 'బతికి చచ్చినవాడు'లో ముగింపు అర్థవంతంగా ఉంది. 'ప్రాణం ఖరీదు'లోని లాజిక్ అందలేదు. కాన్వాస్‌కున్న విస్తృతిరీత్యా కూడా ఈ కథని మరింత విస్తరించొచ్చుననిపిస్తుంది. ఖాకీవనం, ఖాకీబతుకులు వంటి రచన చేయడానికి కావాల్సిన దినుసు పాత్రికేయ వృత్తిలో ఉన్న ఈతకోట సుబ్బారావు వద్ద ఉన్నదని ఈ కథ చదివితే తెలుసుకుంటాం.

ఇదే పార్శ్వాన్ని స్వీయాత్మక దృక్కోణంలో రాసి మెప్పించగల వృత్తి అనుభవం కూతురు రాంరెడ్డి సొంతం. 'కాలుతున్న కట్టెలు' కింది స్థాయి ఎక్సైజ్ అధికారులపై చురకలతో సరిపెట్టారు. కానీ, వ్యవస్థీకృత నేర స్వభావాన్నంతా బయటపెట్టగల శక్తివంతమైన ఇతివృత్తం ఇది. బెల్టుషాపులకూ, నకిలీ మద్యం అమ్మకాలకూ; రాజకీయ ఒత్తిళ్ల, ప్రభుత్వ అవసరాలు, బ్యూరోక్రటిక్ దళారీ అవతారాలు, ప్రజల ప్రజాస్వామిక ప్రాతినిధ్య నిరాకరణకూ మధ్యగల సంబంధాన్ని రాయగలిగితే మన సమాజం సారాసామ్రాట్టుల, సిండికేట్ మాఫియాల గుప్పిట చిక్కిన వైనం తెలిసివస్తుంది. అప్పుడా సమస్య శాంతవ్వ దగ్గర ఆగదు. ఆమె భర్త బక్కయ్య శవాన్ని తగలేయడంతో తీరదు. ఇలా కథ గురించి నిర్దేశించే వస్తువుని సుగుణరావు కథలు కూడా చాలా మటుకు అందించాయి. 'నేలకు దిగిన నక్షత్రం'లో రచనా పోటీల్లో ఎంపికను సాహిత్యేతర ప్రయోజనాలు నిర్దేశించడంపై ఆగ్రహించారు. మంచిదే. నష్టపరిహారం కోసం పరిశ్రమల్లో కార్మికులు చేతులూ కాళ్లూ తెగ నరుక్కుంటున్న ఘట్టాల్లోని కన్నీటిని పిండారు. అదీ అవసరమే. కానీ ఆ వ్యథార్థ జీవుల కడుపుల్లో కాళ్లుపెట్టి తంతున్న కాలం చెల్లిన చట్టాలు, దివాలాకోరు, దోపిడీ నిబంధనల క్రూరత్వాన్ని పట్టించుకుని ఉంటే మరింత మంచి కథ తయారయ్యేది.




కథా సంప్రదాయంలోని నవ్యతని సాధించడం రచన కౌశలంతోనే ముడిపడిన అంశం కాదు. అంతఃబహిర్ ప్రభావాల వొరిపిడిలో రాటుతేలుతున్న జీవన గమనాన్ని మనిషి కేంద్రంగా చిత్రీకరించగలగాలి. మానవత్వం అనేది అందులో ఒక భాగమేగానీ, అదే ఆధునిక కథకు మానవ స్పర్శని అద్దలేదు.

– వి. అరవింద్

**నేలకు దిగిన నక్షత్రం** – ఎం. సుగుణరావు, పేజీలు: 280, వెల: రూ. 150/–, ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు.
**కాశీబుగ్గ** – ఈతకోట సుబ్బారావు, పేజీలు: 122, వెల: రూ. 80/–, ప్రతులకు: 94405 29785.
**కాలుతున్న కట్టెలు** – కూతురు రాంరెడ్డి, పేజీలు: 187, వెల: రూ. 120/– ప్రతులకు: 90004 15353

## మూడు యాభయిల
# మన గురజాడ

'రాజాం' నుంచి గురజాడ మీద వెలువడిన 'వెలుగు' వారి మరో ప్రచురణ ఇది. గురజాడను జీవితకాలం భక్తిశ్రద్ధలతో పరిశీలన చేసిన ఆధునిక రచయితలు, కళాకారులు అర్పించిన నీరాజనాల సమాహారమే ఈ సంపుటం. ఇందులోని ప్రతి వ్యాసమూ విలువైనదే. ఫోటోలు, అక్షర చిత్రాలు, వ్యంగ్యోక్తులు– ముచ్చటైన ముద్రణ. పాఠకులను ఇట్టే ఆకట్టు కొంటుంది. అన్నీ కొంగ్రొత్త ఆలోచనలే.

యాభైయ్యేళ్ళ గురజాడ నూటయాభై యేళ్ళు గొప్పగా జీవించాడు. ఇంకా జీవిస్తాడు. ఆయన పాత్రలు నేటికీ కొత్త రూపాలతో దర్శనమి స్తూనే ఉన్నాయి.

శివసాగర్ అన్నట్టు (డామిట్! గురజాడా!)

''నీ గిరీశం/ వెనుకటి గిరీశం కాడు/ పరశురాముడై/

గొడ్డలి పట్టుక తిరుగుతున్నాడు/

నా పేరు గిరీశమే/ నినద భీషణ శంఖము/ దేవదత్తమే

ఖబడ్దార్ అని గాండ్రిస్తున్నాడు.

ప్రస్తుతం/ కరప్షన్ ఛార్జ్‌లో/ విలవిల తన్నుకుంటున్నాడు/''

.............

''మంచి ఎక్కడున్నా/ గ్రాహ్యమే' నన్న మధురవాణి/

విశాఖ కరంచంద్ గాంధీ ఆస్పత్రిలో/ చాలాకాలం కోమాలో

ఉన్నది/ కల్లోల సముద్రంలో నౌక దురవస్థ/ నేడు మధురవాణి''

చరిత్రకారుడుగా, శాసన పరిశోధకుడుగా గురజాడను ఈనాటికీ గుర్తించకపోవడం పెద్ద లోపమే అని ఇందులో చాలామంది రచయితలు అభిప్రాయపడ్డారు.



మధురవాణి ఉచ్చులో చిక్కుకుని ఆరోగ్యాన్ని పణంగా పెట్టి గురజాడ పరిశోధనలో జీవితం అర్పించిన గోపీ (పెన్నేపల్లి గోపాలకృష్ణ) నిష్పక్షపాతంగా బేరీజు వేసిన ఆనందరాజు వ్యాసం తప్పక చదవదగింది. ఆయన ఎంత శ్రమపడిందీ 'గురుజాడలు' సంపాదక సభ్యుడిగా డా. కాళిదాసు పురుషోత్తం వివరించారు. ఇంగ్లీషు డైరీలు తొలిసారిగా ప్రచురించడంలో, అరుదైన వ్రాతప్రతులను సేకరించడంలో 'మనసు' ఎంత శ్రమించిందీ తెలిపారు. ఈ ప్రచురణ ఆధారంగా ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి గురజాడ కథానికలను మూలాలతో అనుశీలనం చేశారు. గురజాడకు దేశీయ పాశ్చాత్య కథానికలపై గల అవగాహనను చక్కగా వివరించారు.

గురజాడ 'దేశభక్తి' గేయంలోని ప్రతి చరణమూ ఎంతో ఆలోచన, అవగాహనతో కూడిన మేలైన రచన అని ఎన్. వేణుగోపాల్ విశ్లేషించారు. యు.ఎ. నరసింహమూర్తి, కవనశర్మ, వరవరరావు, కాత్యాయని, సత్యవతి, రామమోహనరాయ్ మొదలైన 53 మంది రచయితల వ్యాసాలున్న ఈ సంపుటి గొప్ప ఆకర గ్రంథం (Reference book). జాతీయ భావాలు గల ప్రతి ఒక్కరూ మెచ్చే పుస్తకం.

ఒక సంవత్సరం పాటు ప్రతి నెలా సాహితీ సాంస్కృతిక సభలు జరిపి ఆ అనుభవాలకు ఈ రూపంలో చిరస్థాయి కల్గించిన 'వెలుగు'కు మరోమారు కైమోడ్పు.

– మాచవోలు శివరామప్రసాద్

**మూడు యాభయిల మన గురజాడ,** పేజీలు : 408,
వెల : రూ. 200, ప్రతులకు : నవోదయ, ప్రజాశక్తి



# రాలుతున్న పూలు

మన దేశంలో స్త్రీ జీవితమొక పద్మవ్యూహం. పుట్టింది మొదలు కాటికి చేరే వరకు బాధ్యతలు, బంధాలు, భయాలు, అభయాలు ఎన్నో ఆమెకు. అవేమిటో తెలియాలంటే జి.లక్ష్మి 'పూలు పూయని నేల' కథలు చదవాలి. ఆడవాళ్ళ కష్టాలు అనగానే ఇల్లాళ్ళ వ్యథలే అని ఇప్పటికీ చాలామంది భావిస్తూ ఉంటారు. కాని అన్ని రంగాల్లోకి చొచ్చుకుపోతున్న మహిళలకూ కష్టాలు ఉంటాయి. నెలకి లక్ష రూపాయలు సంపాదించుకునే శ్రావ్య పెళ్ళి చేసుకోవాలంటే భయపడుతుంది. అది భయం కూడా కాదు, బాధ్యతలను నెరవేర్చే సమయం లేదన్న ఆందోళనే అని 'పూలు పూయని నేల' కథలో లక్ష్మి విశ్లేషిస్తారు. ఒకవేళ పెళ్ళి చేసుకుంటే, పిల్లలు పుడితే ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో 'ఆనంద అపార్ట్‌మెంట్'లో చూపిస్తారు. మాతృత్వం ఒక వరం. కానీ, కొంతమంది దాన్ని శాపంలానే భరిస్తున్నారు. అలా భరించలేని సుజాత అబార్షన్ చేయించుకున్నా, తనను అమ్మలా గుర్తించమని ఆవేదన చెందుతుంది. 'అమ్మ' కథలో. అందంగా తెరపై తళుక్కుమనే బొమ్మల జీవితంలోని కృత్రిమత్వాన్ని 'ప్లాస్టిక్ పూలు'లో ఆవిష్కరించారు. ఈ సమస్యలన్నీ నిజమైనవే కాని కథలన్నీ ఆర్గ్యుమెంట్లలా సాగుతాయి. చెప్పాలనుకున్న విషయాన్ని వ్యాసంలా కాకుండా లోతుగా, ఆవేదనాభరితంగా మలచగలిగితే ఈ కథలు హృదయాలను తాకేవి.

– దేరా

**పూలు పూయని నేల,** జి. లక్ష్మి,
పేజీలు : 132, వెల : రూ. 80, ప్రతులకు : విశాలాంధ్ర



# 'ఖాన్' వర్సేషన్స్!

తరచి చూస్తే మన చుట్టు ఉన్న ప్రతి జీవి, ప్రతి వస్తువు కథాంశాలే. వీటి ఆధారంగా విలువలను సమాజానికి చెప్పగలిగితే– అవి సూటిగా మనసులకు హత్తుకుపోతాయి. అలాంటి ప్రయత్నాన్ని పోలీసు సిబ్బంది పత్రిక 'సురక్ష' ద్వారా ఐపీఎస్ అధికారి ఏకె ఖాన్ చేశారు. ఈ కథలన్నింటినీ 'ఏకె 97–యువతతో 'ఖాన్'వర్సేషన్' పేరిట 'అలకనంద' సంస్థ ప్రచురించింది. పోలీసు సిబ్బంది రకరకాల పరిస్థితుల్లో తమ విధులను నిర్వర్తిస్తూ ఉంటారు. సమాజంలో ఉన్న విలువలను అతిక్రమించకుండా, తమ వృత్తి నిబంధనలకు ఇబ్బంది కలగకుండా మెలగటానికి ఉపకరించే విధంగా ఖాన్ ఈ కథలను తీర్చిదిద్దారు. ఎక్కువ ఇతివృత్తాలను నెట్‌లో దొరికే స్ఫూర్తి కథల్నించి తీసుకున్నా స్థానికత చెడకుండా చక్కగా రాశారు. కేవలం పోలీసు సిబ్బంది మాత్రమే కాదు.. యువతీ,యువకులు అందరూ చదవాల్సిన పుస్తకమిది.

– అంకిత్

**ఏకె 97–యువతతో 'ఖాన్'వర్సేషన్**
పేజీలు : 176, ధర : రూ. 125,
ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు

# సినిమా పజిల్

నిర్వహణ : యజ్ఞమూర్తి

## అడ్డం

1. అల్లు శిరీశ్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన చిత్రం (4)
4. 'అభిమానం'లోని 'ఓహో బస్తీ దొరసాని బాగా ముస్తాబయ్యింది' గీత రచయిత (3)
5. సురేశ్ కృష్ణ దర్శకత్వంలో మోహన్‌బాబు టైటిల్ రోల్ చేసిన చిత్రం '......రామన్న చౌదరి' (5)
6. 'అల్లరి' సినిమాతో పరిచయమైన సంభాషణల రచయిత (3)
8. బి. నరసింగరావు రూపొందించిన 'మట్టి మనుషులు' నాయిక అటు ఇటయ్యింది (3)
11. పాకిస్తానీ తార వీణా మాలిక్ నాయికగా నటించిన తెలుగు చిత్రం (4)
12. సురేశ్, నిరోషా జంటగా చోళరాజన్ దర్శకత్వంలో 1992లో వచ్చిన చిత్రం (4)

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ● | ● | 3 |
| | ● | | ● | 4 | | |
| 5 | | | | | ● | |
| | ● | ● | ● | 6 | 7 | |
| ● | 8 | | 9 | ● | | ● |
| 10 | ● | ● | 11 | | | |
| 12 | | | | ● | | ● |

## నిలువు

1. 'రాముడు-భీముడు'లోని 'దేశమ్ము మారిందోయ్ కాలమ్ము మారిందోయ్' పాట రచయిత (4)
2. 'శ్రీవారికి ప్రేమలేఖ' దర్శకుడు (3)
3. 'గబ్బర్‌సింగ్'లోని 'ఆకాశం అమ్మాయయితే నీలా ఉంటుందే' గీత రచయిత (4)
4. 'చందమామ కథలు'లో నరేశ్ జోడీ (3)
7. ఎన్టీఆర్, అంజలీదేవి జంటగా తాపీ చాణక్య దర్శకత్వంలో వచ్చిన చిత్రం (4)
9. తెలుగులో 'జర్నీ'గా వచ్చిన తమిళ చిత్రం 'ఎంగేయుమ్ ఎప్పోడుమ్'లో ఓ నాయిక (3)
10. 'ఇంద్ర భవనం'లో కృష్ణ జోడీ (2)

### గత వారం జవాబులు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 నా | రా | 2 రో | హి | త్ | ● | 3 ఇ |
| గ | ● | ష | ● | ● | ● | ల్లా |
| బా | ● | 4 గా | లి | 5 ప | టా | లు |
| 6 బు | ల్లో | డు | ● | ద్మి | ● | ● |
| ● | ● | ● | 7 నా | ని | 8 కృ | ష్ణ |
| 9 ర | వి | తే | జ | ● | ష్ణ | ● |
| తి | ● | ● | ర్ | ● | 10 డు | పాం |

# అంకేళి

నిర్వహణ : పి. రాఘవరెడ్డి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 7 | | | | | | 5 | |
| | | 4 | 1 | | 6 | | | 3 |
| | | 6 | | | | | | 7 |
| | 3 | | 4 | 1 | 5 | | 7 | |
| | | | | 3 | | | | |
| | 6 | | 8 | 9 | 2 | | 4 | |
| 5 | | | | | | 7 | | |
| 6 | | | 7 | | 1 | 9 | | |
| | 4 | | | | | | 3 | |

అడ్డం, నిలువులోనే కాకుండా బాక్సులో, క్రాస్‌లో కూడా 1 నుండి 9 అంకెలు ఒకసారే వచ్చేలా నింపాలి. దాదాపు సుడోకు లాంటిదే. కాని రెండు క్రాస్‌లలో కూడా రావడం ఇందులో అదనం.

### గత వారం జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 2 | 5 | 9 | 3 | 1 | 4 | 7 | 8 |
| 3 | 7 | 1 | 4 | 2 | 8 | 5 | 6 | 9 |
| 9 | 4 | 8 | 7 | 5 | 6 | 1 | 3 | 2 |
| 5 | 9 | 3 | 1 | 4 | 7 | 8 | 2 | 6 |
| 1 | 6 | 7 | 8 | 9 | 2 | 3 | 4 | 5 |
| 4 | 8 | 2 | 5 | 6 | 3 | 9 | 1 | 7 |
| 7 | 5 | 4 | 6 | 1 | 9 | 2 | 8 | 3 |
| 8 | 3 | 9 | 2 | 7 | 4 | 6 | 5 | 1 |
| 2 | 1 | 6 | 3 | 8 | 5 | 7 | 9 | 4 |

# పూరణం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | ■ | 4 | | 5 | 6 |
| 7 | | ■ | 8 | 9 | | ■ | 10 | |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | |
| 11 | 12 | ■ | 13 | | 14 | ■ | 15 | |
| ■ | 16 | | | ■ | 17 | | | ■ |
| 18 | | ■ | 19 | 20 | | ■ | 21 | 22 |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | |
| 23 | 24 | ■ | 25 | | 26 | ■ | 27 | |
| 28 | | | | ■ | 29 | | | |

## అడ్డం

1. వాడుకలో 'శిరీష' కుసుమం (4)
4. పడవని గాలివాటు నుండి రక్షించేది (4)
7. ప్రవాహం – వాగుతోడిది (2)
8. కొన్నాళ్ళు మధురవాణిని పోషించిన ఈ పంతులు మహా జిత్తులమారి (3)
10. ఈ పిశాచం మనలో ఉంటే ఎదుటివారి మనసులోని మాటలు ఇట్టే వినిపిస్తాయట (2)
11. మాగాణి (2)
13. చెడ్డ పేరు లాంటి మాయని మచ్చ (3)
15. దురదకు మరో పేరు (3)
16. దీంతో తల గోక్కున్నట్టని సామెత (3)
17. కాగు ఆద్యంతాలుగా నూనె చెట్టు (3)
18. ప్రాచుర్యంలో ఉన్న పచ్చడి బ్రాండ్ – గీతాంజలిలో నాగార్జున పాడింది దీనికోసమే కాబోలు! (2)
19. గుడి (3)
21. అటు ఇటు లేని వెంకన్న కొండ (2)
23. చంపటం – వృథలా వినిపించింది (2)
25. మధురలో కొలువైన చేపకళ్ళ తల్లి (3)
27. కౌరవుల భరతం పట్టడానికి కె.వి.రెడ్డి ఎంచుకున్న బజార్ ఇదే (2)
28. శబ్ద రహిత నవ్వు (4)
29. వాడుకలో తావి (4)

## నిలువు

1. చనిపోయినవారి మధ్యలో దాగిన 'వంగ' (4)
2. కరివేపాకులో కనిపించిన జంతువు శీర్షాసనం వేసింది (2)
3. 'నరవరా'లో ఆద్యంతాలే మిగిలాయి (2)
4. కప్ప కాదు, పడవలా తేలే దుంగ (2)
5. చాకచక్యంలో సగం (2)
6. గుడిసె – సీతారాముల వనవాస నివాసం (4)
9. హంస (3)
12. చైనా జపాన్ల మధ్య ఉత్తర దక్షిణాలుగా చీలిన ఏక నామ దేశం – తడబడింది (3)
13. 'ఆహాఁ అందము చిందే ..' అంటూ ఈమధ్య 'వెండితెర బంగారం'లో కనిపించిన అలనాటి తార – కింద నుండి (3)
14. కాళ్లా గజ్జా ... పాటలో వినిపించే అస్థిపంజరం (3)
15. చిగురు కాదు బంక (3)
18. శకుంతల చెలికత్తె – అనసూయ తోడిది (4)
20. అన్న భార్యను పిలవండి (3)
22. మిడిమేళం లాంటి దక్షిణాది భాష (4)
24. అధరంలో కనిపించే నేల (2)
25. 'అంబలి తాగేవాడికి ఇవి ఎత్తేవాడు ఒకడని' – ఏకవచనంలో (2)
26. పల్టీ కొట్టిన విహంగం (2)
27. సినిమా కుటుంబానికి కె.వి.మహాదేవన్ వరస (2)

నిర్వహణ : గొరుసు

### గత వారం జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 చె | 2 గు | వే | 3 రా | ■ | 4 ఊ | ర | 5 పం | 6 ది |
| 7 ర | వ్వ | ■ | 8 స | 9 ల | హా | ■ | 10 ప | గం |
| బం | ■ | ■ | ■ | లా | ■ | ■ | ■ | బ |
| 11 డ | 12 జ | ■ | 13 చె | మ | 14 ట | ■ | 15 ఎ | ర |
| ■ | 16 మై | థి | లి | ■ | 17 కు | రు | లు | ■ |
| 18 య | కా | ■ | 19 యా | 20 గ | ము | ■ | 21 క | 22 క్ష |
| మ | ■ | ■ | ■ | రి | ■ | ■ | ■ | మా |
| 23 పు | 24 ష్ప | ■ | 25 తా | మ | 26 ర | ■ | 27 పా | ప |
| 28 రి | బా | సా | ట | ■ | 29 స | వ | ర | ణ |

# ఈవారం కవితలు

బహుశా మీలో చాలామందికి తెలిసినట్టే అనిపించొచ్చు –
చెప్పగలరా 'నాకు తెల్సులే' నుంచి
'నీకేం తెల్సులే'కు మధ్య దూరమెంతో?

★★★

ఇదంతా వాడి గురించే –
కాకపోతే, కాస్తంత నా గురించి కూడా.

★★★

బోర్లించిన నీలాకాశపు సంద్రంలోకి ..
ఎప్పుడు, ఎందుకు, ఎలా వేశానో ఓ మోహపు గాలం,
హఠాత్తుగా మిలమిలలాడే అమాయకపు మత్స్యరాజం పైకుబికి
నా మెడ చుట్టూ పసివాసనతో చుట్టేసుకుంది.



## సన్ రైజ్

మా యువళగీతానికి కొత్త నేపథ్య సంగీతంలా ..
అర్థరాత్రికి ఆవల అరచేతిలో ఉదయించిన దినబాలుడు

★★★

ఇదంతా వాడి గురించే –
కాకపోతే, కాస్తంత నావాడి జ్ఞాపకాల గురించి కూడా.

★★★

ముళ్లు పెరిగిన నా కాళ్లకు తన పాదాల గులాబీలనానించి,
మహానమ్మకంగా గట్టిగా నా వేలు పట్టుకునే
మొగ్గతొడిగాడు
పండిన మెత్తటి పనసపండులా భుజంమీంచి జారి ..
గుండెలకెదురుగా గుబాళింపు రత్నాలను విరజిమ్మాడు
పొద్దుటి గోర్వెచ్చటి నీటిలో తడిసిన పిల్లిపిల్లకు
షేమ్ షేమ్ అని ..
తువ్వాలు చుడితే మామ్మగారి మెడలో
ముత్యమై మురిశాడు

★★★

ఇదంతా వాడి గురించే ..
కాకపోతే, పులిగా మారుతున్న ఓ గొర్రెపిల్ల గురించి కూడా.

★★★

మంద నుంచి వేరుపడినట్టు బిక్కుబిక్కుమని
చూపులు రిక్కించేవాడు
ఇప్పుడు స్ట్రీట్ క్రికెట్‌లో పులిపిల్లగా మారుతున్నాడు
పగులుతున్న అద్దాల చప్పుళ్లు, ఆంటీల అరుపులు
బహు కర్ణపేయంగానున్నవి
పొద్దున్నే డౌన్లోడ్లు, మిట్టమధ్యాహ్నం పీఎస్పీలు,
అర్ధరాత్రి దాటే వరకు ఐపీఎల్‌లు

★★★

ఇదంతా, వాడి గురించే ...
కాకపోతే, అమ్మమ్మాతాతలఅమ్మానాన్నల చంకల ఇరుకుల్లోంచి ..
రెక్కవిప్పుతోన్న ఓ బుజ్జాయి పావురాయి గురించి కూడా.

★★★

ఇదంతా కచ్చితంగా వాడి గురించే ..
కాకపోతే, కాస్తంత నా జ్ఞాపకాల చెలమ గురించి చూడా ..
సెంట్ రబ్బర్‌తో జ్ఞాపకాలు చెరిగిపోవడం గురించే ..
మంత్రనిర్మిత మాయానగరం మాయమవ్వడం గురించే ..
బాల్యపు ట్రాన్స్‌లోంచి టీన్స్‌లోకి జరుగుతున్న
మెటామార్ఫసిస్ గురించే ...
వాడ్ని పరీక్షించడానికి గీటురాయిగా మారుతున్న
ఆకురాయి ప్రపంచం గురించే ..
'నాకు తెల్సులే' నుంచి 'నీకేం తెల్సులే'
మధ్య దూరం పదేళ్లేనాననే ..
పదేళ్ల చరిత్రలో ఏమీ కాకపోవచ్చు గానీ,
చరిత్రలో వాడికంటూ ఓ పేజీ మిగలాలనే ఆకాంక్షకే ..

– దేశరాజు, 99486 80009



బొమ్మ : అక్బర్

## జీవుడు

కనులు తెరచి చూస్తున్నాను కదా
కదలిక కొంతైనా ఉందనుకుంటారు
కవితలేవో వ్రాస్తున్నాను కదా
కలలు కొన్నైనా మిగిలాయనుకుంటారు
మాటల గునపాలతో త్రవ్వితే
కన్నీటి జల ఉబుకుతుందనుకుంటారు

ప్రపంచంలో మసలుతున్నాను కదా
ప్రాణమింకా నిలిచి ఉందనుకుంటారు
కాటికివతల కనిపిస్తున్నాను కదా
హృదయమింకా పగలలేదనుకుంటారు
పాత నాటకమే ప్రదర్శిస్తే
పొరపాటున పలుకుతాననుకుంటారు

– టి. శ్రీవల్లీ రాధిక, 94416 44644

# వెండితెర బంగారం - 51



రాముడు, లక్ష్మణుడు అనే ఎడ్లతో పాటు మహానటి **సావిత్రి** కనిపిస్తున్న ఈ స్టిల్ 'నమ్మినబంటు' (1960) చిత్రంలోది. అక్కినేనికి జంటగా సావిత్రి అద్భుతంగా నటించిన చిత్రాల్లో ఇదొకటి.

'శంభూ ఫిలింస్' పతాకంపై యార్లగడ్డ వెంకన్న చౌదరి నిర్మించిన చిత్రం ఇది. ప్రముఖ సినీ గీత రచయిత కొసరాజు కుమారుడు భానుప్రసాద్ ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరు. కథ సుంకర సత్యనారాయ ణది. విజయావారి 'షావుకారు' తర్వాత అచ్చమైన తెలుగుతనం, కర్షక జీవితం, పల్లె వాతావరణం కన్పించిన ఈ చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు. ఆయన దర్శకత్వంలో అంతకు ముందు కని పించని వేగం, కొత్తదనం, పటుత్వం ఇందులో కనిపిస్తాయి. ఇందులో ఎడ్లు చేసిన ఫీట్లు గురించి ప్రేక్ష కులు నేటికీ గొప్పగా చెప్పుకుంటారు.

ఈ చిత్రానికి ఆ ఏడాది ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా రాష్ట్రపతి రజత పతకం లభించింది. అయితే అదే సంవత్సరం 'శాంతినివాసం' విడుదలై గట్టి పోటీ ఇవ్వడంతో పెద్దగా కమ్మర్షియల్ సక్సెస్ కాలేదు. స్పెయిన్‌లో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. చిత్ర విజయాన్ని పురస్కరించుకుని ఎడ్ల బొమ్మలతో పాటు 'మేటి నటీనటులకంటే మిన్నగా నటించిన రాముడు – లక్ష్మణుడు' అని రాసిన ఓ కరపత్రం విడుదల చేశారు నిర్మాతలు. అందుకే విదేశాలకు ఆహ్వానించినప్పుడు 'మీ హీరోలున్నారు కదా .. వాటినే తీసుకు వెళ్లండి' అన్నారట ఆ నటులు సర దాగా. దీన్ని పెద్ద జోక్‌గా చెప్పుకునేవారు అప్పట్లో.

సాలూరు రాజేశ్వరరావు, మాస్టర్ వేణులు జమిలిగా సంగీతం సమకూర్చిన ఈ చిత్రంలో 'చెంగు చెంగున గంతులు వేయండి ..', 'ఎంత మంచివాడవురా ... ఎన్ని నోళ్ల పొగడుదురా' లాంటి శ్రావ్య మైన పాటలున్నాయి.

నిర్వహణ : **డా. కంపల్లె రవిచంద్రన్, 98487 20478**

25 మే 2014

ఆదివారం
ఆంధ్రజ్యోతి



16

బాటసారి
అనంత శ్రీరామ్



26

కథ
గోధుమరంగు ఆట



# మన మామిడి 'గొప్ప'లు



శ్రీదేవి



మధుబాల



రవీనా టాండన్

❖ ఫిల్మ్‌నగర్



కరిష్మాకపూర్



తనూజ

# హీరోయిన్ల 'వేషాలు'!

భారతీయ సినిమాల్లో 'డ్రామా' బాగా పండుతుంది. ఎదుటి వాళ్లను ఫూల్స్‌ను చేసేందుకు చాలాసార్లు హీరోలు 'ఆడ' వేషాలు వేస్తుంటారు. అమితాబ్ నుంచి అమీర్‌ఖాన్ దాకా ఎందరో చీరకట్టు, బొట్టుతో నాజూగ్గా తయారై కావాల్సినంత వినోదాన్ని అందించారు. హీరోలే కాదు... కథను బట్టి హీరోయిన్లు కూడా అప్పుడప్పుడు 'మగరాయుళ్ల'లా తయారవుతారు. మీసకట్టు, ప్యాంటు షర్టుతో హంగామా సృష్టిస్తారు.

విద్యాబాలన్ తన తాజాచిత్రం 'బాబీ జాసూస్'లో బారెడు గడ్డం, గళ్ల లుంగీ, చొక్కాతో కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే హీరోయిన్లు మారువేషాల్లో కనిపించడం మధుబాల, సైరాబాను, తనూజాల టైమునుంచే ఉంది. 1956లో వచ్చిన 'రాజ్ హత్' సినిమాలో శత్రు శిబిరంలో చేరి రహస్యాలను రాబట్టేందుకు రాణీగా ఉన్న మధుబాల మీసకట్టు, తలపాగాతో వెళ్తుంది. 'జంగ్లీ'లో షమ్మీకపూర్‌ను ఆటపట్టించేందుకు మంచుకొండల్లో గడ్డం మీసాలతో 'సాధువు' వేషం వేస్తుంది సైరాబాను. 'దో చోర్'లో తనూజ, 'ఏక్ సే బడ్ కర్ ఏక్'లో రవీనా టాండన్ మగరాయుళ్లలా హీరోలకు మస్కా కొడితే, శ్రీదేవి, కరిష్మాకపూర్ వంటి చాలామంది హీరోయిన్లు సన్నివేశాలకు అనుగుణంగా చార్లీచాప్లిన్ వేషాలు వేసి సరదా తీర్చుకున్నారు. 'షీ ఈజ్ ద మ్యాన్' అనే హాలీవుడ్ చిత్రం ఆధారంగా బాలీవుడ్‌లో ఆ మధ్య రూపొందిన 'దిల్ బోలే హడిప్పా'లో రాణీముఖర్జీ ఒక సిక్కు యువకుడిగా క్రికెట్ టీమ్‌లోకి ప్రవేశిస్తుంది. ఈ 'వేషా'లను ప్రేక్షకులు వెంటనే గుర్తుపడతారు కానీ సినిమాలోని మిగతా క్యారెక్టర్లు గుర్తుపట్టకపోవడమే వి'చిత్రం'.



సైరాబాను



విద్యాబాలన్



రాణీముఖర్జీ

ఆదివారం ఆంధ్రజ్యోతి

25 మే 2014

❖ కామెంట్




# మరో జమ్మిచెట్టును వెతకండి

మహాభారతంలోని విరాటపర్వం చాలామందికి గుర్తుండే ఉంటుంది. ధర్మరాజు జూదంలో ఓడిపోయాక దుర్యోధనుడు విధించిన షరతుల ప్రకారం పాండవులు అరణ్యవాసానికి బయల్దేరి వెళతారు. పన్నెండేళ్లు పూర్తయ్యాక కొత్త పరీక్ష మొదలవుతుంది. ఎవరూ గుర్తుపట్టకుండా ఏడాది పాటు ఎక్కడ అజ్ఞాతవాసం చేయాలా అని చాలాసేపు ఆలోచించి చివరికి విరాటుని కొలువును ఎంచుకుంటారు వాళ్ళు.

అప్పట్లో పేపర్లు, టీవీలు, ఇంటర్నెట్‌లూ లేవు కాబట్టి ఎంత పెద్ద రాజులనైనా ఇతర రాజ్యాలలోని ప్రజలు గుర్తించలేకపోయేవాళ్ళు. కాని మాటలో, నడకలో, ప్రవర్తనలో రాజసం ఎక్కడికి పోతుంది? అన్నిటి కంటే ముఖ్యంగా ఆయుధాలను గుర్తు పట్టేస్తారు కదా! భీముడి గద, అర్జునుడి విల్లు గురించి అప్పటికే అందరికీ తెలుసు.

అందుకే విరాట రాజ్యం పొలిమేరలు సమీపిస్తుండగా ధర్మరాజు ఆగి తమ్ముళ్ళతో ''మనం ఈ ఆకారాలతోనూ, ఈ ఆయుధాలతోనూ నగరంలో అడుగుపెడితే ఎవరైనా సులభంగా గుర్తు పట్టేస్తారు. ముందు మన ఆయుధాలను ఎక్కడైనా దాచి పెట్టాలి'' అని చెప్తాడు.

అందరూ అనువైన చోటు కోసం చుట్టూ వెతుకుతారు. అక్కడో శ్మశానం కనిపిస్తుంది. అందులోని ఒక జమ్మిచెట్టు ఆకాశాన్నంటే కొమ్మలతో, దట్టమైన ఆకులతో పగటివేళలోనే దట్టమైన చీకటి నీడల్ని పరుస్తూ భయంకరంగా ఉంటుంది.

పాండవులు తమ ఆయుధాలన్నీ ఒక చోట చేరుస్తారు. చచ్చిపడి ఉన్న ఒక జంతువు చర్మం ఒలిచి ఆయుధాల మూటకు దాన్ని చుడతారు. ఒక అనాథ శవాన్ని కూడా ఆ మూటతో చేర్చి కట్టి ధర్మరాజు స్వయంగా చెట్టెక్కి ఒక కొమ్మకు వేలాడగడతారు. మా వాళ్లొకరు చనిపోతే మా కులాచారం ప్రకారం అలా పెట్టామని దూరం నుంచి చూస్తున్న పశుల కాపరులకు చెపుతాడు. అన్ని జాగ్రత్తలు తీసుకున్నందువల్లే మళ్లీ వాళ్లొచ్చి కిందికి దింపుకునే దాకా అవి అక్కడే ఉండిపోతాయి.

★★★

ఈ కథలోంచి మన నాయకులు నేర్చుకోవాల్సింది ఒకటి ఉంది. ఐదేళ్ల దాకా ఎన్నికలు రావు కాబట్టి అప్పటిదాకా వాళ్ల తమ తమ విమర్శనాస్త్రాలను జాగ్రత్తగా మూటగట్టి, ఏదో ఒక జమ్మిచెట్టు కొమ్మకు వేలాడగట్టి, ఏమీ తెలియనట్లుగా అచ్చం పాండవుల్లా మామూలు వేషాలతో జనం మధ్యలోకి తిరిగి వస్తే బాగుంటుంది!

'ఫన్' లైనర్

ప్రేమలో పడటం అద్భుతం... ఆ ప్రేమ నుంచి బయటపడటం మహాద్భుతం.

'ఆదివారం అనుబంధం'పై మీ అభిప్రాయాలను శుక్రవారంలోగా అందేలా పంపగలరు. ఆలస్యంగా అందిన ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని మనవి. **sunday.aj@gmail.com** కి మీ ఉత్తరాల్ని మెయిల్ చేయవచ్చు.

# ఇన్‌బాక్స్




# ఇండెక్స్




**కవర్‌స్టోరీ** 8
మన మామిడి 'గొప్ప'లు

**బ్లాగోతం** ................ 6
ఓరి దేముడోయ్!

**సెలబ్రిటీ** ................ 13
సిద్ధార్థ్ మాల్యా

**బాటసారి** .............. 16
అనంత శ్రీరామ్

**కేరింత** ................. 18
ఎగిరే గడియారం

**అవీ ఇవీ** ................ 20
పేపర్ కట్టడాలు

**జైలు కథలు** .............. 22
40 ఏళ్ళ తరువాత మేరీ టేలర్..

**ఫుడ్‌కోర్ట్** .............. 24
నూల్‌కోల్‌తో...

**ఈ వారం కథ** ........... 26
గోధుమరంగు ఆట





**ఈవారం కవితలు** ........ 34
నానా విధ నివేదన; 4 హైకూలు


## స్వాగతించే మార్పు..

మారుతోన్న కాలానికి సూచికగా మీరు అందించిన కవర్‌స్టోరీ 'ఫీమేల్ బైకర్స్' మాకెంతో నచ్చింది. అతి సాధారణ స్కూటీల్లాంటివి కాకుండా, మగవారికి ధీటుగా భారీగా ఉండే రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి టూ వీలర్స్‌ని నేటి మహిళ సునాయాసంగా నడిపిస్తోందని చదివి ఆశ్చర్యపోయాం. స్త్రీలు బైకుల మీద పర్వతారోహణం కూడా చేయగలగుతున్నారంటే అంతకంటే ఏం కావాలి? ఈ మార్పు ఆటోమొబైల్ కంపెనీల్లో మరింత ఉత్సాహం రేకెత్తించి కొత్త రకాల బైకులు తయారీకి శ్రీకారం చుట్టడమే కాదు, కత్రినా లాంటి తారలను స్ఫూర్తిగా తీసుకుని మరెందరో అమ్మాయిలు బైక్ నడపాలనుకునే ఆసక్తి కనబరచడం కూడా ఖాయం.

– **జె. రమణిమోహన్,** అక్కాయపల్లి, కడప

## బాల్యాన్ని గుర్తు చేసింది

'పెద్ద పహాడ్' కవిత హృద్యంగా ఉంది. చదవగానే చిన్ననాటి స్మృతులు సినిమా రీళ్లగా కదలాడాయి. అందమైన బాల్యాన్నీ, ఉమ్మడి కుటుంబాల మహత్తుని, ప్రకృతిని, అలతి పదాలలో, అలవోకగా చెప్పిన తీరు ఎంతో బావుంది. బాల్యాన్ని కళ్ల ముందుంచిన కవిత రాసిన అన్నవరం దేవేందర్‌గారికి అభినందనలు.

– **కొల్లూరి సోమశంకర్,** ఈ – మెయిల్

## అక్షరబద్ధమైన చరిత్ర

ఈ వారం బాటసారి ఇ. శివనాగిరెడ్డి ' 'చరిత్ర'ను తవ్వే దారుల్లో ...' కథనం చదివిన తర్వాత మాకు ఎన్నో అమూల్యమైన విషయాలు తెలిశాయి. ముఖ్యంగా అలంపూర్ సమీపంలోని సేతుపల్లి వద్ద చరిత్రను తవ్వే క్రమంలో సమాధుల పక్కనే వంట చేసుకుని, నిద్రపోవడం వెనక ఆ బృందం కార్యదీక్ష అర్థమవుతోంది. అలాగే శ్రీలంక బౌద్ధారామాల గురించి ఆసక్తికరమైన సమాచారం అందించారు.

– **గుండాల భాస్కర్,** హనుమకొండ

## పువ్వు పుట్టగానే ...

ఈ వారం సెలబ్రిటీ శీర్షికన వచ్చిన 'రెహమాన్ మెచ్చిన గళం' మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంది. చిన్న వయసులోనే జోనిట గాంధీకి గాయనిగా అంతర్జాతీయ ఖ్యాతి లభించడం మామూలు విషయం కాదు. పైగా ఆస్కార్ విజేత రెహమాన్ అభిమానం పొందటం మరింత గొప్ప కదా. రాబోయే రజనీకాంత్ 'కొచ్చడియాన్' ఆమెకు మరింత పేరు తీసుకువస్తుందని భావిస్తున్నాను. ఈ సందర్భంగా మన ప్రజ్ఞని ప్రపంచానికి చాటే వారధి 'యూట్యూబ్' ను జోనిటాతో పాటు అభినందించక తప్పదు. యూ ట్యూబే లేకపోతే ఆమె టొరాంటోలోనే ఉండిపోయి మనందరి దృష్టిలో పడేది కాదు కదా.

– **బి. మధుసూదనరెడ్డి,** బేతంచెర్ల

## నా హృదయం ఊగిసలాడే..

వెండితెర బంగారంలో కృష్ణకుమారిని చూడగానే మా హృదయాలు ఊగిసలాడాయి. అపురూప రూపలావణ్యం, నటనలో కూడా తనదంటూ ఒక ప్రత్యేకత నిలుపుకుని దశాబ్ది కాలంపాటు వెండితెరను ఏలిన ఆమెను ప్రేక్షకలోకం ఎప్పటికీ మరచిపోలేదు. భార్యాభర్తలు చిత్రంలో ఆమె నటన ఎంతో సహజంగా ఉంటుంది. మీరన్నదీ నిజమే .. ఆమె అందం ముందు ఒక్కోసారి ఆమె నటన చిన్నబోయేది. వారం వారం మీరు అందించే వెండితెర బంగారం కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తూ ఉంటాం.

– **యు. చిట్టిబాబు,** కొత్త పాల్వంచ

## కన్నీటి గాథలు..

ఆంధ్రజ్యోతి రాగానే నేను ముందుగా చదివేది బి. అనురాధగారు రాస్తున్న జైలు కథలనే. ఎంతో ఉత్కంఠ కలిగిస్తున్న ఈ కథలు చదువుతున్నప్పుడు మనసంతా వికలైపోతుంది. ఒక్కోసారి నాకు తెలియకుండానే చెంపలు తడిసిపోతాయి. ఈవారం 'పేదింటి పోగ' కథనం కూడా మనసును తడిపేసింది. ఇందులో వచ్చిన పాత్రలు ఉష , ఆశల జీవితంలో వచ్చిన ఆటుపోట్లు, క్రమంగా వాళ్లపై నమోదైన కేసు తెలిమబ్బులా తేలిపోవడం మాకు సంతోషం కలిగించింది. జైలు గోడల మధ్య పారే దుఃఖాన్ని అక్షరీకరించి బాహ్య ప్రపంచానికి తెలియచేస్తున్న రచయిత్రికి మా అభినందనలు.

– **పి.ఎస్.వి.ఎన్. ప్రసాద్,** ఈ–మెయిల్






మందు మీదున్నావు తుమ్మెదా
నీకు మందెవరు పోశారె తుమ్మెదా
గల్లీలు తిరిగేవు తుమ్మెదా
నీ ఇల్లు గుల్లేను తుమ్మెదా ... /మందు/

మస్తుగా తాగావు తుమ్మెదా
మత్తెక్కి ఉన్నావు తుమ్మెదా
మసక చీకట్లోన తుమ్మెదా
మురికి గుంటల కాడ తుమ్మెదా .....
బురదలో పడి నీవు తుమ్మెదా
పందిలా దొర్లావు తుమ్మెదా /మందు/



తూలుతూ వచ్చావు తుమ్మెదా
కుక్కలా మొరిగావు తుమ్మెదా
పరువులో కక్కావు తుమ్మెదా
ఆ కంపులో పొర్లావు తుమ్మెదా ....
నాకు తిక్కరేగిందంటే తుమ్మెదా
నీ మక్కెలే ఇరిగేను తుమ్మెదా /మందు/

– చిట్టెం మరియదాస్, 98857 78783

# వయస్సు తగ్గించే మిషను



వెంగళప్ప పెద్దాసుపత్రిలో చూపించుకోవడానికి తన ఏడేళ్ల కొడుకుని వెంట తీసుకుని పట్నం వెళ్లాడు. ఎలాగో ఆస్పత్రి కనుగొని ముందుగా 'ఓపీ' లో కూర్చున్నాడు. ఎదురుగా లిఫ్టు కనిపించింది. అదేంటో అంతకు ముందు ఎరగడు. ఏదో హెల్త్ మిషన్ అనుకున్నాడు. మీట నొక్కితే తెరుచుకుంటోంది. మనిషి ఎక్కగానే మూసుకుంటోంది. చాలా చిత్రంగా ఉంది వెంగళప్పకి. అతను చూస్తుండగానే 70 ఏళ్ల ముసలమ్మ మీట నొక్కి లోపలికి వెళ్లింది. వెంటనే తలుపు మూసుకుంది. రెండు నిమిషాల్లో మళ్లీ తలుపు తెరుచుకుని అందులోంచి 16 ఏళ్ల పడుచుపిల్ల రావడం కనిపించింది. వెంగళప్ప బుర్రలో ఒకేసారి వెయ్యి లైట్లు వెలిగాయి.

''ఒరేయ్ సిన్నోడా నువ్వు వెళ్లి మీ అమ్మని తీసుకురారా .. ఈ మిషన్లోకి పంపి వైద్యం చేయించాలి'' అంటూ తొందర పెట్టాడు.

– అంబడిపూడి శ్యామసుందరరావు, గుంటూరు.



– మతిలేని మెకానిక్?
– కారుకింద కాపురం పెట్టేవాడు.



– స్వర్గంలో ఎన్నికలు జరిగితే?
– దేవతలారా దీవించండి!
అని ప్రచారం జరుగుతుంది.



– భార్యా భర్తలు కామెంట్ ప్లీజ్?
– ఒకరి రహస్యాలు మరొకరికి తెలియకుండా జాగ్రత్త పడేవారు.

– కె. సతీష్ రెడ్డి, వరంగల్

బ్లాగోతం

# ఓరి దేముడోయ్!

దోగాడడం రాగానే బిరబిరా వంటగదిలో స్టీలు గిన్నెల దగ్గరకు వెళ్లేవాడ్ని. వాటిలో నా మొహం పొడవుగా, అడ్డంగా, తమాషాగా కనిపించేది. అమ్మలా వంట చేయాలని గిన్నెలో గరిటె పెట్టగానే ''ఆడపిల్లలా ఈ ఆటలేంటి?'' అంటూ పక్కన కూర్చోబెట్టి బంతిని చేతిలో పెట్టేది నాన్నమ్మ. అదెక్కడ నిలిచేది – దొర్లుకుంటూ ఎటో పోయేది. పైగా స్టీలు గిన్నెలా అది చమక్ చమక్ మనేది కాదు. ఒళ్లు మండి దాన్ని పట్టుకుని గట్టిగా ఒక్క తన్ను తన్నగానే ''ఎంతైనా మగపిల్లాడి అల్లరే వేరబ్బా'' అనేసేది గిరిజత్త.

కొంచెం పెద్దయ్యాక నన్ను, పూజని, రోజక్కని అమ్మ బజారుకు తీసుకువెళ్లేది. వాళ్లిద్దరికీ రంగురంగుల గౌనులు, క్లిప్పులు, గాజులు, పట్టీలు, చెప్పులు ... నాకు మాత్రం సన్న గీతలు, గళ్ల చొక్కాలు కొనేది. వాళ్ల గౌనులు, గాగ్రాలు, చుడీలు, పట్టులంగాల మీద చమ్కీలు, అద్దాలు, తళుకులు, పూసలు ..ఆ బట్టలు వేసుకుని ఇద్దరూ యువరాణీల్లా మెరిసిపోతుండేవాళ్లు. ఏడుపొచ్చి కాస్త గట్టిగా ఏడవగానే ''ఆడపిల్లలా ఆ ఏడుపేంటి?'' అంటూ కసిరేది సీత పిన్ని.

మరికొంచెం పెద్దయ్యాక పుస్తకాల్లోంచి తల పైకెత్తితే చాలు ఏదో ఒక పని పురమాయించేవారు. జీవితం మొత్తమ్మీద ఓ టన్ను అల్లం, మూడు టన్నుల మిరపకాయలు, పదహారు టన్నుల టమోటాలు తీసుకొచ్చుంటాను. ఏమన్నా అంటే ''ఇంట్లో మొగపిల్లోడివి. నువ్వు కాకపోతే ఎవరు తెస్తారు?'' అనే మాట వినీ వినీ చెవులు చిల్లులు పడిపోయాయి. నేనేమో ఎర్రటి ఎండలో తిరగడం. రోజక్క మాత్రం చల్లని పిండిలో చేతులు పెట్టి పొత్రం నైసుగా తిప్పుతూ ఆటలు.



డ్రాయింగ్‌లో మొదటి బహుమతి వచ్చినరోజు అందరూ మెచ్చుకున్నారని తెల్లారి ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేస్తానంటే కిసుక్కున నవ్వారు. అక్కయ్య నెలకోసారి ఒంట్లో బాలేదని సుబ్బరంగా మంచమెక్కి పడుకునేది. అన్నం, పళ్లు, పాలు, సమస్తం మంచం దగ్గరకే వచ్చేవి. నేను కాళ్ల నొప్పులు అంటే ''నీ వయస్సులో మేము మైళ్లు నడిచేవాళ్లం నువ్వేంట్రా క్రికెట్ ఆడే అలసిపోతావు?'' అనేవాళ్లు.

నేను పదో తరగతి పాసవ్వగానే మంచి కాలేజీలో సీటు వస్తుందో లేదోనని ఇంట్లో అందరికీ టెన్షన్. రోజక్క కాలేజీకి వెళ్లేముందు ఇంత హడావిడి లేదు. ఏమంటే ''అక్కయ్యకు సీట్ రాకపోతే ఏ డాక్టర్‌నో ఇంజనీర్‌నో అల్లుడుగా తెచ్చుకుంటాం. నువ్వు చదవకపోతే ఎలారా?'' అని సమాధానం.

**కాలేజ్‌లో అబ్బాయిలు, అమ్మాయిల వెంట పడేది వాళ్ల అందం చూసి కాదు, తాము వేసుకోలేకపోయిన రంగు రంగుల బట్టలు చూసి అని ఎప్పటికి తెలుసుకుంటారో!**

రోజక్క పెళ్లి కుదిరింది. గోరింటాకు పెట్టించుకోవడం, చుట్టాలతో కబుర్లు చెప్పడంతో పూజ బిజీ. నేనేమో తిరిగి తిరిగి మగపెళ్లి వాళ్లకు మర్యాదలు చేసి బొగ్గులా అయ్యానని అమ్మమ్మ అన్నప్పుడు కాని అద్దంలో చూసుకోవడానికి ఖాళీ దొరకలేదు. సరే, అక్క పెళ్లిలో సరేలే వయ్యా, నీ పెళ్లిలో బాగా ఎంజాయ్ చేసి ఉంటావ్‌గా అనుకున్నారా?

నా పెళ్లి కుదిరాక అమ్మని షాపింగుకి రమ్మంటే ''మీ షర్టులు నాకేం తెలుస్తాయిరా? నీ ఫ్రెండ్స్‌తో వెళ్లి తెచ్చుకో'' అనేసింది. ఇంత అన్యాయమా!

తర్వాత అమెరికాలో ఉద్యోగం వచ్చింది. ఇద్దరం కలిసే వెళ్తాం అంటే ''దేశం కాని దేశంలో ఏం ఇబ్బంది పడతారు. నువ్వు కొంచెం ఇల్లు అదీ ఏర్పరచుకున్న తరువాత అమ్మాయిని తీసుకెళ్లు'' అని ఒంటరిగా పంపేసారు. చిన్నప్పట్నుంచి కాఫీ కలపడం కూడా నేర్పలేదు. ఇప్పుడ అక్కడ ఎలా ఒండుకు తింటాననుకున్నారు? ఆకలేస్తే దగ్గరలో ఇండియన్ రెస్టారెంట్ కూడా లేదు. వెళ్లడానికి కారు లేదు. సరే ఎలాగో కష్టపడి ఇల్లు చూసి కారు కొన్నాక నా భార్య మహారాణిలా వచ్చింది. అమెరికా విచిత్రాలన్నీ చూస్తూ వారానికో నాలుగు రోజులు రెస్టారెంట్‌లో భోజనం చేస్తూ పూటకో మాటు ''అమ్మా బెంగగా ఉందే'' అని వాళ్లమ్మకు ఫోన్లు చేస్తూ.

నాలుగు రోజులు సెలవు రాగానే స్నేహితులతో కలిసి వెకేషన్ అంటూ ఎటో అటు ప్రయాణం. కారులో ఆడాళ్లు హాయిగా నిద్దరోతుంటే తెలిసీ తెలియని ఊర్లకు దారి వెతుక్కుంటూ చీకట్లో డ్రైవింగ్. అక్కడ గుర్రాలెక్కి తిరగడం, స్నార్కెలింగ్, స్కూబా డైవింగ్ అంటూ మొహానికి మాస్క్ పెట్టుకుని నీళ్ల లోపలకు వెళ్లడం. అడ్వెంచరెస్ రైడ్స్ అంటూ తల కిందులుగా పాతిక అడుగుల నుండి కింద పడడం. ఒకటా! గుండెలో బిక్కుబిక్కుమంటున్నా పైకి బింకంగా కనిపించాలి – మగాళ్లం కదా!

నేను తండ్రిని కాబోతున్నానని తెలిసాక స్వీట్లన్నీ మా ఆవిడకిచ్చేవాళ్లు. నాకు మాత్రం ''అమ్మాయిని బాగా చూసుకో, ఏ పనీ చేయించకు'' అని ఉచిత సలహాలు. అప్పటికావిడ లంకంత కొంపలో మందీ మార్బలానికీ వండి వార్చి మహా కష్టపడిపోతున్నట్లు. వంశోద్ధారకుడు కావాలని అందరికీ కోరికే. వంశభారం అంతా మొయ్యాలి కదా!

నా పుత్రరత్నం పుట్టగానే మా ఆవిడకు మూడు నెలల మెటర్నిటీ లీవు. నేనేమో డ్రైవర్, గోఫర్‌గా ఓవర్ టైం చేయటం. అర్థం కాలేదా? మా ఆవిడ గంటకోసారి ''గోఫర్ దిస్, గోఫర్ దట్'' అంటూ బయటకు తరిమేస్తూ ఉంటుందిలెండి. చిన్నప్పుడు టన్నుల టన్నుల కూరగాయలు తెచ్చానా, ప్రస్తుతం వేగన్లు వేగన్లు డైపర్లు, గర్బర్ పుడ్‌లు తెస్తున్నాను.

ఇంతలో ''రోజక్క కూతురుకి ఓణీలివ్వాలి. మీరిండియా రండి. బాబుని కూడా అందరం చూసినట్లుంటుంద''ని అమ్మ ఫోను. ''ఇక్కడ్నుంచి నీకేమైనా కావాలా?'' అని అడిగాను. మా అమ్మకు కోరల్ సెట్లు, బెడ్ షీట్లు, జంషోలో పూసలు ఇష్టం లెండి. తనకే కాక చుట్టపక్కల అందరికీ తెమ్మంటుంది. ''నాకేమొద్దుగానీ మీ అక్క కూతురుకి మనం బంగారం పెట్టాలి'' అంది. ''ఎంతమా ఓ కాయిన్ తీసుకురానా?'' అంటే ''వడ్డాణానికి ఓ కాయినేం చాలుద్ది పదో, పన్నెండో కాయిన్లు తీసుకురా. అన్నట్లు ఇప్పుడు పూజకు ఐదోనెల. సీమంతానికి బంగారు గాజులు పెడదాం'' అన్నది.

ఇండియా వెళ్లగానే ''ఏం నాయనా అక్కడ్నే ఉంటారా ఏంది? ఒక్కడివే పిల్లోడివైతివే మీ అమ్మా నాయన్ను చూసుకోబళ్లా. తొందరగా రండి'' అంటూ నారాయణ తాత చీవాట్లు.

ఓరి దేముడోయ్! మగవాడిగా పుట్టడం కంటే మర్రిచెట్టుగా పుట్టడం ఎంతో సుఖం.

– **జ్యోతిర్మయి** themmera@gmail.com

## ❖ బిట్‌బ్యాంక్




'E' అనే అక్షరం వాడకుండా రాసిన నవల ఒకటుంది. పేరు Gadsby. అందులోని 50 వేల పదాల లోనూ ఆ అక్షరం ఉండదు.

★ వ్యోమగామి హెల్మెట్ లోపల దురద పెడితే గోక్కోవడానికి ఒక చిన్న పరికరం ఉంటుంది.



స్టీఫెన్ హాకింగ్‌ను చిన్నప్పుడు 'ఐన్‌స్టీన్' అనే ముద్దుపేరుతో పిలిచేవారు.

★ ప్రపంచంలో ఆకలితో బాధపడుతున్న వారి కంటే అధిక బరువుతో బాధపడు తున్నవారే ఎక్కువ.



హొండురాస్ దీవులలోని యోరో నగరంపై ఏటా చేపల వాన కురుస్తుంది. ఆ రోజు వందలాది చేపలు ఆకాశం నుంచి చినుకుల్లా రాలతాయి.

★ అమెరికాలో ప్రతి ఐదు సెకండ్లకు 60 వేల ప్లాస్టిక్ బ్యాగుల వాడకం జరుగుతోంది.



కవర్‌స్టోరీ





ఎన్నికల్లేకపోయి ఉంటే కనీసం నెల రోజుల్నించి మనం మామిడి పళ్ల గురించి మాత్రమే మాట్లాడుకుంటూ ఉండే వాళ్ళం. మామిడికి మన రాష్ట్రం అంతగా ప్రసిద్ధి చెందింది. మన దేశంలో అత్యధికంగా మామిడి పండే రాష్ట్రాల్లో మనది రెండో స్థానం. మన దగ్గర నుంచి ఈ మామిడి పశ్చిమ ఆసియా నుంచి ఉత్తర అమెరికా దాకా అనే దేశాలకు ఎగుమతి అవుతూ ఉంటుంది. ఇన్ని రకాలుగా ప్రాశస్త్యం పొందిన మన మామిడి రకాల గురించి మనకు తెలిసింది కూడా తక్కువే...

# మన మామిడి 'గొప్ప'లు

మామిడి మన దేశంలోకి, మన రాష్ట్రంలోకి ఎప్పుడు ప్రవేశించింది? ఎవరు ఈ మొక్కలను తీసుకువచ్చారనే విషయం చెప్పటం కష్టం. అయితే మన పురాణాల్లోను, చరిత్ర గ్రంథాల్లోను దీని ప్రస్తావన ఉంది కాబట్టి మామిడి మన నేల మీదకు వచ్చి కొన్ని వేల ఏళ్లు అయిందని చెప్పవచ్చు. దేశవ్యాప్తంగా దాదాపు వెయ్యి రకాల మామిడి రకాలు దొరుకుతున్నాయి. వీటిలో మన దగ్గర వాణిజ్యపరంగా అందరికీ లభ్యమయ్యేవి కేవలం 20 రకాలే. "మా దగ్గర నిజానికి 500 రకాల మామిడి రకాలు ఉన్నాయి. వీటిలో రైతులు ఎక్కువగా పండించేవి 20 రకాలు. మిగిలినవన్నీ జెర్మ్ ప్లాజం కోసం మేము ఉంచుకున్నవే. ఇవన్నీ- ఏప్రిల్ నుంచి జూలై వరకూ కాయలు కాస్తాయి" అని సంగారెడ్డిలోని ఫ్రూట్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ భగవాన్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న రకరకాల పళ్లను పరిరక్షించటానికి, పరిశోధనలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం ఈ పరిశోధనాశాలలను ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి దీనిలో మామిడిపై అనేక రకాల పరిశోధనలు జరుగుతున్నాయి. పళ్లపై పరిశోధనలు చేయటానికి ఎక్కువ చలి, ఎక్కువ వేడి లేని ప్రాంతం కావాలి. అందుకే సంగారెడ్డిలో ఈ కేంద్రాన్ని పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతే కాకుండా దేశంలో అత్యధికంగా మామిడి పళ్లు ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి కాబట్టి దీనిని ఇక్కడ స్థాపించారు.

## తేడాలూ ఉన్నాయి..

మామిడి పండు నాణ్యత అది పెరిగే నేలపైన, ఆ ప్రాంతంలోని వాతావరణంపైన ఆధారపడి ఉంటుంది. "మామిడి సాగుకు సంబంధించి- మొత్తం ఆంధ్రప్రదేశ్‌ను- కోస్తా, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలుగా విభజించవచ్చు. ఈ మూడు ప్రాంతాల్లోను వేర్వేరు రకాల వాతావరణ పరిస్థితులు ఉంటాయి. వాటి ఆధారంగానే మామిడి దిగుబడి, పళ్ల నాణ్యత ఆధారపడి ఉంటాయి. కోస్తా ప్రాంతంలో తేమ ఎక్కువ. అందువల్ల పళ్లలో నీరు ఎక్కువ ఉంటుంది. దీని కారణంగా తీపి తక్కువగా ఉంటుంది. రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండదు. అందువల్ల ఇక్కడ పండే పళ్లలో తీపి ఎక్కువగా ఉంటుంది.అయితే సాగు చేసే నేలను కూడా పరిగణనలోకి తీసుకుంటే- తెలంగాణలో పండే మామిడి కన్నా రాయలసీమ మామిడి ఎక్కువ తీపిగా ఉంటుంది" అని భగవాన్ వివరించారు. ఈ పరిస్థితుల ఆధారంగానే అక్కడ పండే రకాలు కూడా ఉంటాయి. ఉదాహరణకు దసేరా పళ్లు కోస్తా ప్రాంతంలో పండవు. తెలంగాణలోనే ఎక్కువగా పండుతాయి.

## తగ్గిన దిగుబడి

తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించగలిగిన పంటల్లో మామిడి కూడా ఒకటి. మన రాష్ట్రంలోని మొత్తం మామిడి ఉత్పత్తిలో

70 శాతం ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి వస్తుంది. 30 శాతం మాత్రమే తెలంగాణ నుంచి వస్తుంది. ఈ ఏడాదిలో అకాల వానలు ఎక్కువగా కురవటం వల్ల మామిడి ఉత్పత్తి తగ్గిందని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచి మే మూడో వారం దాకా నాలుగు సార్లు అల్పపీడనద్రోణులు ఏర్పడి వానలు కురిసాయి. ముఖ్యంగా తెలంగాణలోని కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో 16 వేల హెక్టార్లలో మామిడి పంట దెబ్బతింది. దీని వల్ల ఈ ఏడాది మామిడి దిగుబడి 40.54 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

"వాతావరణంలో అనేక మార్పులు వస్తున్నాయి. ఎల్‌నినో వంటివి తరచుగా సంభవిస్తున్నాయి. ఒక దశాబ్దం క్రితం దాకా వేసవిలో అల్పపీడన ద్రోణులు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం ఇవి ఎక్కువగా వస్తున్నాయి. వీటి ప్రభావం నేరుగా పంటలపై పడుతుంది" అని వాతావరణ శాస్త్రవేత్త నంద కిషోర్ వివరించారు. పంట దిగుబడి తగ్గటం వల్ల సహజంగానే ఇతర దేశాలకు ఎగుమతులు తగ్గుతాయి. మన రాష్ట్రం నుంచి ప్రతి ఏడాది పశ్చిమ ఆసియా, దక్షిణాఫ్రికా, యూరప్, ఉత్తర అమెరికాలకు మామిడి పళ్లను ఎగుమతి చేస్తూ ఉంటారు. వీటితో పాటు ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు కూడా మన మామిడి పళ్లు ఎగుమతి అవుతాయి. ఈ ఎగుమతుల విలువ గత ఏడాది 1,700 కోట్ల రూపాయల దాకా ఉంది. ఎగుమతి అయ్యే మామిడి పళ్లు మొత్తం దిగుబడిలో 20 శాతం దాకా ఉంటే మిగిలిన వాటిని రైతులు స్థానికంగానే విక్రయిస్తారు. మామిడి హోల్‌సేల్ ధర– సీజన్ మొదట్లో– అంటే ఏప్రిల్‌లో టన్నుకు 40 వేల రూపాయల దాకా ఉంటుంది. జూన్ నాటికి ఇది పది వేల రూపాయలకు పడిపోతుంది. రాష్ట్ర ఉద్యానవనశాఖ అంచనాల ప్రకారం ఒక సామాన్య రైతుకు సగటున ఒక హెక్టారుకు ఏడు వేల రూపాయలు మాత్రమే లభిస్తాయి. రైతుల పరిస్థితిని మెరుగుపరచటానికి ఈ శాఖ మామిడి తోటలను పెంచేవారికి మొదటి ఏడాది రూ. 16 వేలు, రెండో ఏడాది రూ. 6,500, మూడో ఏడాది రూ. 5,000 సబ్సిడీగా అందిస్తోంది. అంతా కలిపితే రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి 10 కోట్ల రూపాయలను సబ్సిడీ రూపంలో రైతులకు అందిస్తున్నారు. అయినా ఎక్కువ మంది రైతులు మామిడి తోటలను పెంచటానికి ముందుకు రావటం లేదు. దీనికి కారణం ప్రభుత్వ విధానాలలో ఉన్న లోపాలేనంటున్నారు రైతులు.





రైతు మురళి

"మామిడి రైతుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాంకేతిక సాయం అందటం లేదు. ఉదాహరణకు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వ్యవసాయశాఖాధికారులందరూ పామాయిల్ పంటపైనే దృష్టి పెడతారు. గత కొన్నేళ్లుగా ప్రతి ఏడాది పామాయిల్ పంట 90 శాతం దెబ్బతింటున్నా సరే. మా వాతావరణ పరిస్థితులకు మామిడి మంచిపంట. దీనిని వేస్తే లాభాలు వస్తాయి. పామాయిల్ వేస్తే నష్టం వస్తుంది. అయినా వ్యవసాయాధికారులు పామాయిల్‌నే ప్రోత్సహిస్తున్నారు. దూరదృష్టి లేని ఇలాంటి విధానాల వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి" అని బొబ్బిలికి చెందిన మురళీ కృష్ణంరాజు అనే రైతు ప్రభుత్వ విధానాలను తప్పుపట్టారు.



## కోస్తా ఆంధ్ర

- ✓ మామిడి మార్కెట్లో 60 శాతం బంగినపల్లి ఆక్రమించుకుంటుంది. అయితే ఇక్కడ పండే బంగినపల్లిలో నీరు ఎక్కువగా ఉంటుంది. తీపి తక్కువగా ఉంటుంది. ఇవి ఏప్రిల్ 15వ తేదీ నుంచి మార్కెట్‌లోకి వస్తాయి. జూన్ దాకా ఉంటాయి.
- ✓ మిగతా 40 శాతం మార్కెట్‌ను సువర్ణరేక, చెరుకు రసం పళ్ల ఆక్రమిస్తాయి. ఇవి మే రెండో వారంలో మార్కెట్‌లోకి ప్రవేశిస్తాయి.



## తెలంగాణ

- ✓ ఇక్కడా 60 శాతం బంగినపల్లి రకమే పండుతుంది. ఇక్కడి బంగినపల్లి కోస్తా ఆంధ్ర కన్నా కొద్దిగా తీపిగా ఉంటుంది. ఈ పళ్లు మే రెండో వారానికి మార్కెట్లో ప్రవేశిస్తాయి.
- ✓ మిగిలిన 40 శాతం మార్కెట్‌ను దసేరి, హిమాయత్, చెరుకురసాలు ఆక్రమిస్తాయి. ఈ మూడు పళ్లలో దసేరి ఏప్రిల్ చివరకు మార్కెట్‌లో ప్రవేశిస్తుంది. హిమాయత్, చెరుకురసాలు మే మూడో వారానికి కాని మార్కెట్‌లోకి రావు.



## రాయలసీమ

- ✓ ఇక్కడి మార్కెట్లోనూ 60 శాతం బంగినపల్లి పండుతుంది. ఈ ప్రాంతంలో మామిడి – తెలంగాణ, కోస్తాంధ్ర పళ్ల కన్నా తీపిగా ఉంటాయి. ఇవి మార్కెట్‌లోకి మే రెండో వారంలో వస్తాయి. అంటే కోస్తాంధ్రలో కన్నా ఒక నెల లేటుగా మార్కెట్‌లో ప్రవేశిస్తాయి.
- ✓ మిగతా 40 శాతం మార్కెట్‌ను తోతాపురి, నీలం, రుమాలీ, చెరుకురసాలు ఆక్రమిస్తాయి. ఇవి కూడా మే రెండో వారానికి మార్కెట్‌లో ప్రవేశిస్తాయి, నీలం పళ్లు మాత్రం జూన్ చివరకు వస్తాయి.

# వెరైటీ రకాలివే..

పశ్చిమగోదావరి పేరు చెపితేనే కొందరి నోరూరుతుంది. గోదావరి నది, కాల్వలు, సరస్సుల్లో లభించే చేపలు, రొయ్యల వంటకాలు ఇక్కడ ప్రత్యేకత. ఆయా వంటకాలు రాజధానిలోని ప్రముఖులకు, మంత్రులకు బహుమతుల రూపంలో చేరతాయి. డబ్బుతో కాని పనులు కూడా క్షణాల్లో అయ్యేందుకు ఈ రుచులే సహాయపడతాయి. వేసవి వచ్చేసరికి మరొక ప్రత్యేకత అందరినీ 'పశ్చిమ' వైపు చూపుతిప్పేలా చేస్తుంది. ఇక్కడ దొరికే రెండు రకాల మామిడి పండ్లే కారణం. అవి మొగల్తూరు బంగినపల్లి, గోదావరి జిల్లాల్లో మాత్రమే దొరికే పండూరి రకాల మామిడి పళ్ళు.



## మొగుల్తూరు పళ్లు..

మొగల్తూరులో పండే మామిడి పండ్లకు విశిష్ట స్థానం ఉంది. పూర్తిగా తీర ప్రాంత మండలమైన మొగల్తూరులో సుమారు 900 ఎకరాల్లో ఈ మామిడి తోటలు ఉన్నాయి. ఇక్కడి ఇసుక నేలలు, తేమ వాతావరణం మామిడి తోటలకు అనుకూలం కావడంతో ఇక్కడ దిగుబడి అయ్యే మామిడి చాలా రుచిగా ఉంటుంది. కాస్త అలస్యంగా అంటే మే నెలాఖరు నాటికి ఇక్కడ మామిడి దిగుబడి ప్రారంభమవుతుంది. మొగల్తూరు పరిసర గ్రామాల్లో బంగినపల్లి, చెరుకు రసం, నల్లయాండ్రస్, భూలోక సుందరి, సువర్ణరేక, కలెక్టర్, నీలఖంటాలుతో పాటు అనేక దేశవాళీ రకాలు కూడా పండుతాయి. ముఖ్యంగా బంగినపల్లి రకం మామిడికి మొగల్తూరు పెట్టింది పేరు. ఈ మామిడి పండు తొక్క దళసరిగా ఉంటూ ఎంతో తియ్యదనాన్ని కలిగి ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో వీటి ధర వంద కాయలు సైజును బట్టి రూ.800 నుండి 1,400లు వరకూ ఉంటుంది. ఏటా విజయవాడ, హైదరాబాద్, బెంగుళూర్, మద్రాస్ వంటి ప్రాంతాలకు ఇది టన్నుల కొద్దీ ఎగుమతి అవుతుంటుంది.



## పండూరి మామిడి

ఉభయగోదావరి జిల్లాల్లోనే ఈ మామిడి పండ్లు పండిస్తారు. పశ్చిమగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలోనూ, తూర్పుగోదావరి జిల్లాలోని తుని, కత్తిపూడి ప్రాంతంలోనూ ఈ పండూరి మామిడి రకాలు పండిస్తారు. అది కూడా తక్కువ విస్తీర్ణంలోనే ఈ రకం పండించడం వల్ల ఎక్కడలేని గిరాకీ ఉంటుంది. పిట్ట కొంచెం కూత మాదిరిగా పండూరి మామిడి ఆకారంలో కోడి గుడ్డు సైజుకు కొంచెం ఎక్కువ ఉంటుందంతే. సాధారణంగా ఇందులో మేలిమి రకం పండ్లు చెట్టు వద్దనే అమ్మకాలు జరిగిపోతాయి. ముందుగానే రాజకీయ నేతలో, ప్రముఖులో పండూరి మామిడి మొదటి రకం మామిడి కాయలను కైవసం చేసుకుంటారు. తమ మిత్రులకో, బంధువులకో, ఇతర అతిథులకో పంపించడానికి గోదావరి జిల్లా వాసులు కూడా ఎగబడతారు. ఈ రకం విశేషం ఏమిటంటే మామిడి పండ్లలో చెరుకు రసం, పంచదార రకాలు తీపిదనంలో పెట్టింది పేరు. ఈ రెండు రకాలకు అనేక రెట్లు తీపిదనం పండూరి మామిడి సొంతం. గుజ్జు కూడా మరీ పీచు మాదిరిగా కాకుండా చిక్కటి జ్యూస్ మాదిరిగా ఉండడం మరో ప్రత్యేకత. మార్కెట్‌లో పండూరి మామిడి కాయ ఒక్కటి రూ.10 నుంచి 40 రూపాయల వరకు ఉంటుంది.

## రాజుల పండు..



విజయనగరం, బొబ్బిలి ఒకప్పటి రాజుల సంస్థానాలు. ఇప్పుడవి లేవు కాని, ఆ తరం వారు వేసిన మామిడితోటలు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం విజయనగరం జిల్లా వ్యాప్తంగా 35 వేల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. ఇందులో 15 వేల హెక్టార్లను రాజుల సామాజికవర్గమే సాగు చేస్తోందంటే ఈ తోటలపై వారికున్న మక్కువను మనం అర్థం చేసుకోవచ్చు. బొబ్బిలికి చెందిన సాలా వెంకట మురళి కృష్ణ వంద ఎకరాల్లో 30 రకాల మామిడి పండ్లను పండిస్తున్నారు. ఆయన పండించిన పళ్లకు అనేక బహుమతులు కూడా లభించాయి. ఆయన తన తోటల్లో బంగినపల్లి, సువర్ణరేక, పనుకులు, చిన్నరసం, పెద్దరసం, చెరుకురసం, బారామతి (పునాస మామిడి), కోలంగోవ, హిమామ్ పసంద్, దసేరీ, లంగడా, నీలం, మల్లిక, ఆమ్రపాలి, కేసర్, సఫేదా, సుయా, నీలుద్దీన్, నీలిషాన్, జహంగీర్, స్వర్ణ జహంగీర్, పెద్ద సువర్ణరేక, పోలిపిల్లి సువర్ణరేక, పానకాలు, ఆల్ఫాన్సో వంటి రకాలను పండిస్తారు. కేవలం తోటలు మాత్రమే కాకుండా నర్సరీలకు కూడా విజయనగరం పెట్టింది పేరు. ఎల్.కోటలోని భీమాలిలో మేలైన మామిడి రకాలు లభిస్తాయి. మామిడి పండ్ల సీజన్ వచ్చిందంటే చాలు విజయనగరం జిల్లా నుంచి కేవలం మామిడి వ్యాపార ఎగుమతుల వల్లే.. ఈస్ట్‌కోస్టు రైల్వేకు రూ.5 కోట్లు రాబడి వస్తుందంటే ఇక్కడ పండే పళ్లకు ఉన్న గిరాకీని అర్థం చేసుకోవచ్చు.

## బొబ్బిలికి మాత్రమే పరిమితం

మెట్టవలస పీచుమాను, బొబ్బిలి పీచుమాను, శ్వేతామృతం , ఎర్ర అరటి అనే మామిడి పళ్ళ రకాలు బొబ్బిలి ప్రాంతానికి మాత్రమే సొంతమైనవి. వీటిని జ్యూసీ వెరైటీలు అంటారు. కృష్ణపసంద్, స్వర్ణసింధూరి అనేవి కూడా అరుదైన రకాలు. ఇవి ఇతర ప్రాంతాల్లో లభ్యం కావు.



**మెట్టవలస పీచుమాను :** పసుపు రంగు మీడియం సైజులో ఉండే ఈ పళ్ళు 90 శాతం మేర చెట్టుపైన ముగ్గితే చాలా రుచిగా ఉంటాయి. వీటి టెంక పీచుగా ఉన్నా, పలుచని రసంతో మధురంగా ఉంటాయి. దూర ప్రాంత రవాణాకు వీలుకాని ఈ పళ్ల ధర ఒక్కొక్కటి 10 నుంచి 15 రూపాయిల వరకూ ఉంటుంది.

**బొబ్బిలి పీచుమాను :** వీటి సైజు చిన్నగా ఉంటుంది. పసుపు రంగులో గుండ్రంగా ఉండే ఈ పండుకూ పీచు ఎక్కువే గాని చాలా తీయగా ఉంటుంది.

**ఎర్ర అరటి :** ఈ కాయలు పొడవుగా, వంకర తిరిగి ఉంటాయి. పండు పై భాగంలో ఎర్రగా ఉంటుంది. అందువల్ల దీనిని ఎర్ర అరటి అని పిలుస్తారు. దీని టెంక చాలా పలచగా ఉంటుంది.

**శ్వేతామృతం :** ఇవి చాలా అరుదైన పళ్లు. గుండ్రంగా ఉంటాయి. బొబ్బిలిలో ఈ జాతి చెట్లు రెండు మాత్రమే ఉన్నాయి. ఇవి మిగిలిన జాతుల కన్నా ముందే కాస్తాయి.

**స్వర్ణ సింధూరి :** ఈ పళ్లు పెద్ద సువర్ణరేఖ సైజులో ఉంటాయి. ఎరుపు, బంగారు రంగులు మిళితమయినట్లు ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిని ఎక్కువగా ఎగుమతి చేస్తారు.

**కృష్ణ పసంద్ :** ఈ పళ్లు పింక్ రంగులో ఉంటాయి. తొక్క దళసరిగా ఉంటుంది. ఇవి పది నుంచి పదిహేను రోజులు నిల్వ ఉంటాయి.

## అరుదైన పరిశోధనా కేంద్రం


భగవాన్

హైదరాబాద్‌కు 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంగారెడ్డి ఫల పరిశోధనా కేంద్రానికి అంతర్జాతీయంగా ఎంతో పేరు ఉంది. మామిడికి సంబంధించి ఇక్కడ జరిగే పరిశోధనలు ఆసియా ఖండంలో మరెక్కడా జరగటం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ ఫల పరిశోధనా కేంద్రాన్ని 1963లో ఏర్పాటు చేశారు. మామిడి, సీతాఫలం, జామ, బొప్పాయి మొదలైన పళ్లపై పరిశోధనలు చేయటం దీని ప్రధానోద్దేశం. 1971లో ఈ పరిశోధనా కేంద్రంలో ఎస్‌టీఏఫ్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా మామిడి, జామ రకాలపై ప్రత్యేక పరిశోధనలు చేపట్టారు. దేశంలో దొరికే రకరకాల మామిడి వెరైటీలను సేకరించి, అత్యాధునిక పద్ధతుల ద్వారా వాటిని భద్రపరిచి, వాటిపై పరిశోధనలు చేసి, భవిష్యత్ తరాల వారికి అందించటం ఈ కార్యక్రమం ప్రధానోద్దేశం. దీనిలో భాగంగా దాదాపు ఐదు వందల మామిడి రకాలను ఈ కేంద్రం సేకరించింది. వివిధ రకాల మామిడి చెట్లను 42 హెక్టార్ల విస్తీర్ణంలో వేసి వాటిపై పరిశోధనలు చేస్తున్నారు. మామిడికి సంబంధించి ఆసియాలో ఇంత విస్తృతంగా పరిశోధన చేసే సంస్థ మరొకటి లేదు. కేవలం పరిశోధనలు చేయటమే కాకుండా, రైతులకు అవసరమైన మామిడి మొక్కలను కూడా ఈ సంస్థ అభివృద్ధి చేసి అందిస్తోంది. ప్రతి ఏడాది ఈ సంస్థ నుంచి రైతులు 1.5 లక్షల మామిడి మొక్కలను తోటల కోసం తీసుకువెళ్తూ ఉంటారు.

“మామిడి జర్మ్‌ప్లాజంను భద్రపరిచి దాని ద్వారా హైబ్రీడ్ వెరైటీలను అభివృద్ధి చేయటం మా ప్రధానోద్దేశం. దీనిలో భాగంగా మేము అనేక రకాల కొత్త హైబ్రీడ్ వెరైటీలను అభివృద్ధి చేశాం. 1985లో మేము విడుదల చేసిన మంజీర రకం ఇప్పుడు మార్కెట్లో మంచి ప్రచారంలోకి వచ్చింది. ఇదే విధంగా నీలం, బేనిషాన్ మామిడి రకాలను సంకరం చేయటం ద్వారా నీలషాన్ అనే ఒక కొత్త రకాన్ని రూపొందించాం. ఈ రకం చాలా ఎక్కువ దిగుబడి ఇస్తుంది” అని ఈ పరిశోధనాశాలలో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న ఎ. భగవాన్ వెల్లడించారు.




ఈ పరిశోధనా సంస్థ ఇటీవల కాలంలో వివిధ రకాల వాతావరణ పరిస్థితుల ఆధారంగా ఎలాంటి మామిడి మొక్కలను పెంచవచ్చనే విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. తెలంగాణ ప్రాంతంలో దసేరా, మల్లిక రకాల మామిడి పండిస్తే ఎక్కువ దిగుబడి వస్తుందని పరిశోధనలలో తేలింది. ఈ పరిశోధనా కేంద్రం ఇచ్చిన ప్రోత్సాహంతో తెలంగాణ ప్రాంతంలో రైతులు దసేరా మామిడిని ఎక్కువగా పండిస్తున్నారు. మేలు రకాల మామిడి పళ్లను అభివృద్ధి చేయటానికి పరిశోధనలే కాకుండా పాత తోటలలో దిగుబడిని ఎలా పెంచాలనే విషయంపై కూడా ఇక్కడ పరిశోధనలు జరుగుతున్నాయి. “మన రాష్ట్రంలో కోస్తా ప్రాంతంలో ఉన్న తోటలు చాలా పురాతనమైనవి. అందువల్ల వాటి దిగుబడి క్రమంగా తగ్గిపోతోంది. దీనిని పెంచటానికి మేము చేసిన కొన్ని పరిశోధనలు ఫలితాలను ఇచ్చాయి..” అని భగవాన్ తెలియజేశారు.

– సండే డెస్క్



# అనుగ్రహం

25 - 31 మే 2014

డాక్టర్ పి.ఎ.రామన్



**మేషం:** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

సంప్రదింపులు, ఒప్పందాలు కొలిక్కి వస్తాయి. పదవుల కోసం యత్నాలు సాగిస్తారు. ఆదాయానికి తగ్గట్టు ఖర్చులుంటాయి. గృహ మార్పు యత్నం ఫలిస్తుంది. ఇతరుల విషయాల్లో జోక్యం తగదు. ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. ఒక సంఘటన మీపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఉద్యోగస్తుల శ్రమకు గుర్తింపు, ప్రతిఫలం లభిస్తుంది. విలువైన వస్తువులు, నగదు జాగ్రత్త. నిరుద్యోగులకు మెరుగైన అవకాశం లభిస్తుంది.



**వృషభం:** కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ప్రయత్నపూర్వకంగా అవకాశాలు కలిసి వస్తాయి. సంతానం ద్వారా శుభవార్తలు వింటారు. ఖర్చులు సామాన్యం. రావలసిన ఆదాయం అందుతుంది. పెద్ద మొత్తం ధనం డ్రా చేసేటపుడు జాగ్రత్త. ప్రముఖుల ఇంటర్వ్యూ కోసం పడిగాపులు తప్పవు. మంగళ, బుధవారాల్లో పనులు స్వయంగా చూసుకోవాలి. బంధువులతో విభేదాలు తలెత్తుతాయి. ఆరోగ్య రీత్యా ఇబ్బందులెదుర్కుంటారు. పెట్టుబడులకు అనుకూలం.



**మిథునం:** మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

వ్యవహారాలు మీ చేతుల మీదుగా సాగుతాయి. సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకుంటారు. ఇంటా బయటా ప్రశాంతత నెలకొంటుంది. ఖర్చులు పెరిగినా భారమనిపించవు. గురు, శుక్రవారాల్లో చెల్లింపులు, నగదు స్వీకరణలో జాగ్రత్త. ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. పెద్దల గురించి ఆందోళన చెందుతారు. ఆహ్వానాలు, కీలక పత్రాలు అందుకుంటారు.



**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

ఆర్థిక స్థితి నిరుత్సాహపరుస్తుంది. ఏ విషయంపై ఆసక్తి ఉండదు. ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. పట్టుదలతో యత్నాలు సాగించండి. ఆత్మీయులు, సన్నిహితులను కలుసుకుంటారు. శనివారం నాడు పనుల సానుకూలతకు బాగా శ్రమించాలి. దంపతుల మధ్య సఖ్యత లోపం, చికాకులు తలెత్తుతాయి. వ్యాపారాల్లో పోటీని దీటుగా ఎదుర్కుంటారు.



**సింహం:** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

కష్టానికి గుర్తింపు, తగిన ప్రతిఫలం లభిస్తాయి. పదవులు, కీలక బాధ్యతలు స్వీకరిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. కుటుంబీకుల కోసం బాగా వ్యయం చేస్తారు. సంప్రదింపులు, ఒప్పందాలు అనుకూలిస్తాయి. ఆది, సోమవారాల్లో పనులు అనుకున్న విధంగా సాగవు. దీర్ఘకాలిక పెట్టుబడులు, వ్యాపారాల విస్తరణలకు అనుకూలం. వృత్తి, ఉద్యోగ బాధ్యతల్లో ఏకాగ్రత వహించండి.



**కన్య:** ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. పట్టుదలతో అనుకున్నది సాధిస్తారు. ఆందోళన కలిగించిన సమస్య సమసిపోతుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. పదవుల కోసం యత్నాలు సాగిస్తారు. పరిచయం లేని వ్యక్తులతో జాగ్రత్త. మంగళ, బుధవారాల్లో కావలసిన వ్యక్తుల కలయిక అనుకూలించదు. ఆశాదృక్పథంతో ఉద్యోగ యత్నం సాగించండి. వృత్తి, ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు.



**తుల:** చిత్త 3,4; స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ముఖ్యమైన వ్యవహారాలతో హడావుడిగా ఉంటారు. ప్రముఖుల ఇంటర్వ్యూ సాధ్యం కాదు. పట్టుదలతో యత్నాలు సాగించాలి. ఆదాయ వ్యయాలకు పొంతన ఉండదు. ఆది, గురువారాల్లో వ్యవహారాలు స్వయంగా చూసుకోవాలి. దంపతుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. సంతానం విషయంలో శుభపరిణామాలు సంభవం. నిరుద్యోగులకు ఉద్యోగ ప్రాప్తి. ఉద్యోగస్తుల హోదా పెరిగే సూచనలున్నాయి.



**వృశ్చికం:** విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక స్థితి క్రమంగా మెరుగుపడుతుంది. ధనమూలక సమస్యలు పరిష్కారమవుతాయి. కుటుంబీకులతో ఉల్లాసంగా గడుపుతారు. మంగళ, శనివారాల్లో మీపై శకునాల ప్రభావం అధికం. ఆహ్వానాలు, ముఖ్యమైన పత్రాలు అందుకుంటారు. సంప్రదింపులు, ఒప్పందాలు అనుకూలిస్తాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. మీ శ్రీమతి ప్రోత్సాహంతో కొత్త యత్నాలు సాగిస్తారు. అధికారులకు బాధ్యతల మార్పు, స్థానచలనం తప్పదు.



**ధనస్సు:** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

కొత్త ఆలోచనలతో యత్నాలు సాగిస్తారు. కుటుంబీకుల ప్రోత్సాహం ఉంటుంది. పొదుపు పథకాలు, పెట్టుబడులు లాభిస్తాయి. ఖర్చులు ప్రయోజనకరం. సంతానం ఉన్నత చదువులపై దృష్టి సారిస్తారు. గురు, శుక్ర వారాల్లో వ్యవహారాల్లో కచ్చితంగా ఉండాలి. అయినవారితో సంప్రదింపులు జరుపుతారు. ఉద్యోగ బాధ్యతల మార్పు, పదోన్నతి, స్థానచలనం తప్పవు.



**మకరం:** ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

బంధుమిత్రులతో సత్సంబంధాలు నెలకొంటాయి. గృహంలో ప్రశాంతత నెలకొంటుంది. వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. అందివచ్చిన అవకాశం చేజారినా ఒకందుకు మంచిదే. శనివారం నాడు పనులు హడావుడిగా సాగుతాయి. ఒక సమాచారం నిరుత్సాహపరుస్తుంది. వ్యాపారాల్లో నష్టాలు, ఆటంకాలు అధిగమిస్తారు. గృహ నిర్మాణం, మరమ్మతులకు అనుకూలం.



**కుంభం:** ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ప్రతి విషయం మీరే చూసుకోవాలనుకుంటారు. ఇతరులపై నమ్మకం ఉండదు. సన్నిహితుల ద్వారా కొత్త విషయాలు గ్రహిస్తారు. ఊహించని పెద్ద ఖర్చు తగిలే ఆస్కారం ఉంది. కావలసిన వ్యక్తుల కలయిక సాధ్యం కాదు. వృత్తి వ్యాపారాల్లో రాణిస్తారు. వ్యాపారాల విస్తరణ, ఏజెన్సీలు, లీజు పొడిగింపులకు అనుకూలం. అయినవారి గురించి ఆందోళన చెందుతారు. వాయిదాపడిన పనులు పూర్తి చేస్తారు.



**మీనం:** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఈ వారం సంప్రదింపులు, ఒప్పందాలకు అనుకూలం. మీ ఆలోచనలు కొలిక్కి వస్తాయి. నిర్దిష్ట ప్రణాళికతో యత్నాలు సాగిస్తారు. ధనం చేతిలో ఏమాత్రం నిలబడదు. ప్రయత్నపూర్వకంగా అవకాశాలు కలిసి వస్తాయి. ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతుంది. సంతానం చదువులపై దృష్టి సారిస్తారు. గృహంలో శుభకార్యం నిశ్చయమవుతుంది. అధికారులకు బాధ్యతల మార్పు, హోదా పెరిగే సూచనలున్నాయి.

❖ సెలబ్రిటీ

సిద్ధార్థ మాల్యా

కళ్లు మిరుమిట్లు గొలిపే లైఫ్‌స్టయిల్ అతడిది. కాళ్లకు 'విమానాలు' కట్టుకుని తిరుగుతుంటాడు. ఉదయం లండన్‌లో టిఫిన్ చేసి, మధ్యాహ్నం దుబాయ్‌లో లంచ్‌తో పాటు షాపింగ్ చేసి, రాత్రి డిన్నర్ సమయానికి ఇండియాలోని ఇంటికి చేరుకుంటాడు. అతడి చుట్టూ ఎప్పుడు చూసినా అందమైన అమ్మాయిలుంటారు. ఫోటో షూట్స్ చేస్తూ, ఫ్యాషన్ షోలలో పాల్గొంటూ, మందు సేవిస్తూ, క్రికెట్ మ్యాచ్‌లు తిలకిస్తూ క్షణం కూడా తీరిక లేకుండా గడుపుతాడు. అయితే అదంతా బిజినెస్‌లో భాగమే అంటాడు. మందు, మగువ, క్రీడలకు వినోదాన్ని కూడా రంగరించి వ్యాపారం చేయడంలో తండ్రికి తగ్గ తనయుడిగా పేరుతెచ్చుకున్నాడు యు.బి. గ్రూప్ అధినేత విజయ్ మాల్యా గారాల కొడుకు 27 ఏళ్ల సిద్ధార్థ మాల్యా.



# జూనియర్ మాల్యా!

'బార్న్ విత్ సిల్వర్ స్పూన్' అనే మాటకు సిద్ధార్థ మాల్యా చక్కగా సరిపోతాడు. కోట్లాది రూపాయల సామ్రాజ్యానికి యువరాజైన 'సిడ్' (అతడి ముద్దుపేరు) లాస్ ఏంజిల్స్‌లో పుట్టాడు. అతడి తల్లి ప్రముఖ మోడల్ సమీరా మాల్యా. సిద్ధార్థ పుట్టిన తర్వాత ఇంగ్లండ్‌కు షిఫ్ట్ అయ్యారు. అక్కడే ప్రసిద్ధ లండన్ యూనివర్శిటీ నుంచి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పట్టా తీసుకున్నాడు సిద్ధార్థ. అతడి తండ్రి విజయ్ మాల్యా అప్పటికే ఇక్కడ లిక్కర్ కింగ్‌గా పేరుగాంచాడు. భవిష్యత్తులో తమ గ్రూపుకు సారథ్యం వహించాలనే కావొచ్చు... డిగ్రీ పూర్తి చేశాక సిద్ధార్థ 'డ్రింక్స్ జెయింట్'గా పేరుగాంచిన 'డియాజియో' కంపెనీలో బ్రాండ్ మేనేజర్‌గా యేడాది పాటు పనిచేశాడు. 2010లో అతడు ఇండియాలో అడుగుపెట్టేసరికి 'ఇండియన్ ప్రీమియర్ లీగ్' (ఐపిఎల్) క్రికెట్ ప్రారంభమైంది. విజయ్ మాల్యా తన కొడుకుకు తొలి అసైన్‌మెంట్‌గా 'రాయల్ ఛాలెంజర్స్' టీమ్ బాధ్యతలను అప్పగించాడు. ఆ యేడాది జరిగిన ఐపిఎల్‌లో, ఛాంపియన్స్ లీగ్ టి 20లో రాయల్ ఛాలెంజర్స్ టీమ్‌ను ఫైనల్స్‌కు చేర్చడంలో సిద్ధార్థ్ కృషి కూడా ఉంది.



తండ్రి విజయ్ మాల్యాతో ...



దీపికాతో ...

సిద్ధార్థకు మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, లైఫ్ స్టయిల్ కార్యక్రమాల్లో పాల్గొనాలనే కోరిక చాలా ఉంటుంది. అందుకే పేజ్3 కార్యక్రమాల్లో, సినిమా కార్యక్రమాల్లో, టీవీ షోల్లో హోస్ట్‌గా తరచూ కనిపిస్తుంటాడు. ఈ సరదా వల్లే అతడికి గ్లామర్ ప్రపంచంతో పరిచయాలేర్పడ్డాయి. ఆయేషా టకియా వంటి ఎంతోమందితో సిడ్ ప్రేమ వ్యవహారాలు వివాదాస్పదమయ్యాయి. టాల్ బ్యూటీ దీపికా పదుకొనేతో సుమారు యేడాది పాటు డేటింగ్ కూడా చేశాడు. తన జీవితంలో అలాంటి 'ఎపిసోడ్స్' ఎన్నో ఉన్నప్పటికీ, కెరీర్ పట్ల మాత్రం చాలా సీరియస్‌గా ఉంటానంటున్నాడు సిద్ధార్థ. ఒక వైపు తండ్రి వ్యాపారాలను (కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్, యునైటెడ్ బ్రూవరీస్) చూసుకుంటూనే మరోవైపు తన అభిరుచులకు అనుగుణంగా ఆన్‌లైన్ చాట్ షో 'నో బౌండరీస్'ను ప్రారంభించాడు. అందులో క్రిస్ గేల్, ఆడమ్ గిల్‌క్రిస్ట్ వంటి గొప్ప గొప్ప క్రికెటర్లు ఎంతోమందిని ఇంటర్వ్యూ చేశాడు. 'ఎన్డీటీవీ గుడ్‌టైమ్స్'లో కూడా టీవీ షోలకు ప్రజెంటర్‌గా, న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. 'కింగ్‌ఫిషర్ క్యాలెండర్ గర్ల్' కోసం సిద్ధార్థ చేసిన టాలెంట్ హంట్ అతడికి మీడియాలో పేరు తీసుకొచ్చింది. ''మాల్యా కుటుంబంలో పుట్టడం తప్పకుండా నా అదృష్టమే. నాకు అనేక అవకాశాలు రెడీమేడ్‌గా వచ్చిన మాట వాస్తవమే అయినా వాటిలో నా ప్రతిభ నిరూపించుకోకుంటే ఎవరేం చేయలేరు. మా నాన్న నా కోసం ట్రాక్ ఏర్పాటు చేసినా రన్నింగ్ మాత్రం నేనే చేసి గెలవాలి కదా'' అంటున్నాడు సిద్ధార్థ్.

కోట్లాది రూపాయల సామ్రాజ్యానికి యువరాజైనా సరే 'మాల్యా'గా కాకుండా సిద్ధార్థగా తన ప్రత్యేకతను చాటుకోవాలనుకుంటున్నాడు. అందుకే ఒకవైపు ర్యాంప్ షోలలో మోడల్‌గా పాల్గొంటూ, టీవీ షోలను నిర్వహిస్తూ, 'మ్యాజిక్ బస్' అనే ఒక స్వచ్ఛంద సంస్థకు అంబాసిడర్‌గా సేవా కార్యక్రమాలు చేస్తూ.. మరోవైపు వారసత్వ వ్యాపారానికి నాయకత్వం వహిస్తూ ముందుకు దూసుకుపోతున్నాడీ యువకుడు.

# బంధువు పోతే ... వేలు కత్తిరిస్తారక్కడ!





**జీవనం**

కుటుంబసభ్యులెవరైనా, దూరపు బంధువులెవరైనా చనిపోతే ఆ బాధ మనసులో నుంచి కొన్నాళ్ల పాటు పోదు. ఆ తర్వాత ఆ సంఘటన నుంచి క్రమక్రమంగా బయటపడేందుకు ప్రయత్నిస్తాం. ఇంకొన్నాళ్లకు ఆ బాధ నుంచి తేరుకుని మామూలు మనుషులమవుతాం. అయితే ఇండోనేషియాలోని 'దని' తెగలోని మహిళలకు మాత్రం అది కేవలం మానసిక బాధనే కాదు శారీరక బాధను కూడా మిగులుస్తుంది. ఆ తెగలో ఎవరి బంధువు చనిపోతారో, ఆ ఇంటి మహిళ వేలును మధ్యలోకి కత్తిరించే సాంప్రదాయం ఉంది. అంటే... మొండి వేళ్లను బట్టి వారికి సంబంధించి ఎంతమంది బంధువులో చనిపోయారో చెప్పొచ్చన్నమాట. ఈ అమానుష, అమానవీయ ఆచారం గురించి తెలుసుకుంటే ఎవరికైనా ఒళ్లు గగుర్పొడుస్తుంది.



ఇండోనేషియాలోని గునియా కొండ ప్రాంతాలలో ఎన్నో ఏళ్లగా 'దని' అనే ఒక తెగ జీవనం సాగిస్తోంది. నాగరికతకు దూరంగా, ఒంటిపై దుస్తులు కూడా ధరించకుండా (ఇప్పుడిప్పుడే అక్కడ మార్పు వస్తోంది) అడవుల్లో సంచరిస్తూ వ్యవసాయం చేస్తుంటారు. చిలగడ దుంపలను అధికంగా పండించే ఈ తెగలో ఏవైనా సంబరాలు జరిగితే పంది మాంసాన్ని వండుకుని తింటారు. ఒక కందకాన్ని తవ్వి అందులో పంది మాంసాన్ని, చిలగడ దుంపలను వేసి పై నుంచి అరటి ఆకులు, గడ్డితో కప్పుతారు. దాని మీద మంటల్లో బాగా కాల్చిన బండరాళ్లను పేర్చుతారు. ఆ వేడికి లోపల మాంసం ఉడుకుతుంది. ఆ విధంగా ఆకుల కింద ఆవిరిలో ఉడికిన మాంసాన్ని వాళ్లు చాలా ఇష్టంగా తింటారు.



సమూహాలుగా జీవించే ఈ తెగలో అనాదికాలం నుంచి పైన చెప్పిన ఒక ఆచారం ఉంది. కుటుంబసభ్యులుగానీ, సమీప బంధువులుగానీ మరణిస్తే ఆ కుటుంబంలోని మహిళ చేతివేలిని సగం కత్తిరిస్తారు. కత్తిరించడానికి ముందు ఆ వేలిని దారంతో గట్టిగా కట్టి, వేలి చివరికి రక్తప్రసరణ లేకుండా చేస్తారు. కొంతసేపటికి వేలు చచ్చుబడి పోతే అప్పుడు దాన్ని కత్తిరిస్తారు. అలా అయితే బహుశా నొప్పి తెలియదేమో. దీన్ని చనిపోయిన వ్యక్తికి ఘనమైన నివాళిగా భావించడమేగాక, వారి దెయ్యాలు తమను పీడించవని బలంగా నమ్ముతారు. అప్పుడెప్పుడో మన దేశంలో భర్త చనిపోతే భార్య అదే చితిలోపడి సతీ సహగమనం చేసే మూఢనమ్మకం గురించి విన్నాం కానీ... అంతకు మించిన మూఢ నమ్మకాలు ఇప్పటికీ అనేక తెగల్లో ఉన్నాయనడానికి ఇదొక ఉదాహరణ.

# అంకెలతో అదృష్టం

ఐ.బి. సాహు
సెల్ : 95810 94208,
90142 48124

పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీకాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియనితనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు.........................
2. పుట్టిన తేదీ ...........
(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)
3. పుట్టిన సమయం .........
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు ...........
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అంకెలతో అదృష్టం**

ఆంధ్రజ్యోతి దినపత్రిక,
ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్ – 500 033.

**ఎల్.ఆర్.కె., నెల్లూరు**

**నా పేరులో నంబర్లు, వైబ్రేషన్స్ పూర్తిగా వివరించగలరు. నా పేరులో మార్పు సూచించగలరు.**

బర్త్ వైబ్రేషన్ 9. బర్త్ వైబ్రేషన్‌లో ఉన్న నంబర్స్ 1,8. విధాన వైబ్రేషన్ 1. వైబ్రేషన్‌లో ఉన్న నంబర్స్ 4,6. మొత్తంగా గమనించిన సంఖ్యలు 1,8,4,6,9,2. సంఖ్యలలో ఉన్న విశిష్ట స్వభావం వల్ల పాజిటివ్ ఫలితాన్నివ్వగలవు. నెగెటివ్ ఫలితాన్నివ్వగలవు. న్యూట్రల్‌గా మారగలవు. 1,8,4,6,9,2లో ఈ లక్షణ ప్రభావం గమనించవచ్చు. 1– కన్‌స్ట్రక్టివ్ ఎనర్జీనివ్వగా, 2 డిస్ట్రక్టివ్ స్థాయి ఇస్తుంది. 4 న్యూట్రల్ స్థాయి. 6– కన్‌స్ట్రక్టివ్, 8 కన్‌స్ట్రక్టివ్. ఓవరాల్‌గా 18 నెగెటివ్ స్థాయిని రైజ్ చేస్తుండగా 46 పాజిటివ్ స్థాయిని రైజ్ చేస్తుంది.

ఇక మీ పేరులోని అర్థం. అర్థం అనగానే KNIFE అనగా కత్తి అనే పద్ధతి కాదు. ప్రతి పేరుకు నెట్‌లో విపరీతార్థాలు ఉంటున్నాయి. మన పేర్లు తెలుగు సంస్కృతినే ప్రతిఫలిస్తుంటాయి. మూలం సంస్కృతం. మీ పేరులో రుద్ర స్వరూపం కొంత, సాత్విక అంశం కొంత ఉంది. పేరులో మార్పు ఈ రెండు అంశాలను డిస్ట్రబ్ చేయకూడదు. ఇది ప్రాథమిక ఆవశ్యక నిర్ణాయక సూత్రం. పేరు ఇనీషియల్‌తో సహా ఉండడం అనేది ఎవరి చేతిలోనూ ఉండదు. ఇప్పటి వరకు ఎవరు ఎక్కడ ఏ స్థాయిలో జన్మించాలి అనేది డిసైడ్ చేయలేదు. ఈ డెసిషన్ కాస్మిక్ లెవల్‌లో జరుగుతుంది. భూమిపై ఈ నిర్ణయం అమలు జరుపబడుతుంది. కాస్మిక్ స్థాయిలో రికార్డ్ ఖచ్చితంగా మెయింటెయిన్ చేయబడుతుంది. వ్యక్తి జననం యాదృచ్ఛికం కాదు, ఏక్సిడెంటల్‌గా జరుగదు. జననం వెనుక శక్తి వైబ్రేషన్ల నిర్మాణ క్రమం ఎక్కడో నిర్ణయించబడి భూమిపై అనేక సంఘటనల సమాహారంగా మార్చబడేదే జీవితం. వైబ్రేషన్ల నిర్మాణ క్రమాన్ని కొంతలో కొంతగా, నూరు శాతంగా అనుభవంలోకి తెచ్చేదే సంఖ్యా శాస్త్రం. ఒక పేరును గమనిస్తున్నాం అనగానే ప్రాథమిక అడ్డంకి వ్యక్తి కాస్మిక్ స్థాయి. ఈ స్థాయి అంతుపట్టనిదే మీ పేరులో ఏ మార్పూ చేయలేం. కాస్మిక్ స్థాయిలో ముఖ్య అంశం ఆర్.వి. ఎనర్జీ. మీ ఆర్.వి. శక్తి స్థాయి 30/31. ఇంతవరకు డైరెక్ట్‌గా 3 ఎక్కడా కనిపించలేదు. ఆర్.వి. స్థాయి కౌంట్ తర్వాత 1,8,4,6,9,2,3 నంబర్లు గణనలోకి వచ్చేశాయి. పేరు నిర్ణయించడంలో ఉన్న మిస్టిక్ శక్తి అనంతం. ఒక్కో ఏడాది గడిచేకొద్దీ ఇండివిడ్యువల్ వైబ్రేషన్స్ శక్తి స్థాయి మారుతూ ఉంటుంది. పేరును పరిశీలించేటపుడు ఇండివిడ్యువల్ వైబ్రేషన్ స్థాయిని ప్రప్రథమంగా గణించాలి.



మనం పుస్తకం చూసో, నెట్‌లో రిసీవ్ చేసుకునే సమాచారం అసంపూర్తిగా ఉంటుంది తప్ప క్లారిటీ ఉండదు. వ్యాపారరీత్యా ప్రకటనలు డబ్బు కట్టి ఇస్తామే తప్ప ఫ్రీగా కాదు. మూడు నెలల కాలానికి ఒక సమయాన్ని బుక్ చేయడం, కావలసిన డబ్బు కట్టడం, ఆపై వ్యాపారం యధేచ్ఛగా చేయడం. అంతమాత్రాన నిష్ణాతులు కారు కదా. ఎవరి వైఖరి వారిది. మాకు సబ్జెక్ట్ తెలుసు అనే వారిలో చాలామంది వీటి బారిన పడినవారే. ఎంత అమాయకంగా అడుగుతారంటే డబ్బులిచ్చి ఇస్తారాండి ఇవన్నీ అంటూ ఆశ్చర్యపోతుంటారు. మీరు మీకుగా పేరులో చేసుకున్న మార్పు ఈ కోవలోకి చెందినదే. ఫలితం మీకూ తెలుసు.

మీ పేరులో 5,7 సంఖ్యలకు సంబంధించిన అక్షరాలున్నాయి. తొమ్మిది వైబ్రేషన్స్ మీ బర్త్, విధాన, నేమ్ వైబ్రేషన్స్‌లో ప్రస్ఫుటంగా ఉన్నాయి. నేమ్ వైబ్రేషన్ 5లో పెట్టి మీ జీవితం బాపుంటుంది అనేయడానికి వీల్లేనంత కిష్టమైనది సంఖ్యాశాస్త్రం. ఈ వైబ్రేషన్స్‌లో మీరు జాగ్రత్త వహించవలసిన అంశం మీ వైవాహిక జీవితం. పొరపాట్లు జరుగుతుంటాయి. అవి మిమ్ములను దహించే స్థాయికి రానివ్వరాదు. ఇదే అంశం ధనంతో ముడిపడి ఉండడం వల్ల ధననష్టం. వెనుకటికి ఒక స్వామీజీ మాట్లాడితే ఎన్నో సూక్తులు వెల్లువలా వచ్చేవి. భగవంతుడు విధించిన శిక్ష అందరికీ తెలిసి విధించబడింది. నిజాయితీ లేనపుడు ధర్మసూక్ష్మాలు ఎందుకు. రామాయణ కాలం నుండి జీవితశైలి ఎలా ఉండాలో వివరిస్తూనే ఉన్నా కాలానుగుణంగా ఎన్నో తప్పులు. ఉదాహరణకి మీ జీవితంలో ఇలా ఉండరాదు అనే వ్యక్తి జీవితం నిండా అవే సంఘటనలే ఉండచ్చు. ఆ వ్యక్తి ఎదుటివారికి సలహాలు ఇచ్చే స్థాయి కోల్పోయినట్లే. ఎంతోమంది ఆషాఢభూతులు పొరపాట్లను సలహాలుగా ఇస్తూ వారి గొయ్యి వారే తవ్వుకుంటుంటారు. మీరు న్యాయ సంబంధ రంగంలో ఉన్నారు కాబట్టి నేను ఏం చేసినా ఫర్వాలేదనుకుంటే అది మీ ఇష్టం.

మీ పేరులో ఇనీషియల్ L.V.గా వ్రాసుకోండి. RAAMKRISHNA L.V.గా వ్రాసుకున్నట్లయితే పైన వివరించిన అంశం తన బలాన్ని కోల్పోతుంది. ప్రతిరోజు 45 సార్లు వ్రాయండి. ఈ సమస్య 2016 ఏప్రిల్‌లో సమసిపోతుంది. సంఖ్యా శాస్త్రం స్టెప్‌వైజ్‌గా అభివృద్ధినిస్తుంది. జీవితాన్ని సరళీకృతం చేస్తుంది. ఇది వ్రాయకపోతే వచ్చే నష్టం ఏమీ లేదు, పరువునష్టం తప్ప. వ్రాస్తే వచ్చే లాభం ఏమీ లేదు, జీవితం హార్మోనిలో ఉండడం తప్ప. విజ్ఞులు, ప్రాప్తకాలజ్ఞులు తమకేం కావాలో అదే కాలాన్నుంచి డిమాండ్ చేయగలరు.

శుభమ్.

Advt

బాటసారి

''ప్రయాణాల్లోనే దాదాపుగా నా సాహిత్యపఠనమంతా సాగింది. రైలు ప్రయాణాలు చేస్తున్నప్పుడు ప్రయాణ బడలిక తెలియకుండా పుస్తకాలు చదవడం నాకు అలవాటు. ఆ సాహిత్య పఠనమే నన్ను సినిమాల్లో గీత రచయితగా నిలబెట్టింది. కాలేజీ రోజుల్లో యండమూరి వీరేంద్రనాథ్ 'విజయానికి ఐదుమెట్లు' పుస్తకాన్ని రైల్వేస్టేషన్‌లో కొని, రైలు ప్రయాణంలోనే మొత్తమంతా చదివేశాను'' అని చెప్పారు గీత రచయిత అనంత శ్రీరామ్. బాపట్లలో ఇంజనీరింగ్ చదివిన శ్రీరామ్ అక్కడి నుంచి సొంతూరు దొడ్డిపట్లకు వెళ్లాలంటే పాలకొల్లు స్టేషన్ దాకా రైలులోనే ప్రయాణించేవారు. ''ప్రయాణాలంటేనే అనుకోని అవాంతరాలు ఎన్నో వచ్చి పడుతుంటాయి. వాటన్నింటిని దాటుకుంటూ ప్రయాణాన్ని ఎంజాయ్ చేయడంలోనే జీవితం విలువ తెలుస్తుంది'' అంటున్న అనంత శ్రీరామే ఈ వారం మన 'బాటసారి'.



# పులికి అంగుళం దూరంలో...

రైలు ప్రయాణం... బస్సు ప్రయాణం... కారు ప్రయాణం... లారీ ప్రయాణం... బైకు ప్రయాణం... ఇలా ఒక్కో ప్రయాణం ఒక్కో అనుభూతినిస్తుంది. బాపట్లలో ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు సెలవుల్లో మా ఊరికి (దొడ్డిపట్ల) వెళ్లాలంటే పాలకొల్లులో రైలు దిగి వెళ్లేవాణ్ణి. ఒకసారి ట్రైన్ టికెట్‌కు అవసరమైన డబ్బుల్ని మాత్రమే జేబులో పెట్టుకుని స్టేషన్‌కు బయలుదేరాను. రోడ్డు మీద రష్ వల్ల నేను స్టేషన్‌కు చేరుకునేసరికే ఒంగోలు- నర్సాపూర్ ట్రైన్ బయలుదేరుతోంది. హడావిడిగా పరుగెత్తుతూ దాన్ని ఎక్కే ప్రయత్నం చేశాను కానీ గుమ్మం దగ్గరే చాలా మంది వేలాడుతుండటంతో వీలుకాలేదు. ఆ విధంగా ట్రైన్ మిస్సయ్యింది. విజయవాడకు వెళ్తే ఏదో ఒక ట్రైన్ దొరుకుతుందన్నారెవరో. దాంతో విజయవాడకు టికెట్ తీసుకుని, అక్కడ దిగి ఇంకో ట్రైన్ ఎక్కడంతో నా దగ్గరున్న డబ్బులన్నీ అయిపోయాయి. జేబులో చిల్లిగవ్వ కూడా లేదు. నిజానికి నేను పాలకొల్లులో దిగాలి కానీ డబ్బులు తక్కువ ఉండటంతో భీమవరం దాకే టికెట్ తీసుకున్నాను. అర్ధరాత్రి దాటింది. భీమవరం స్టేషన్ వస్తుంటే నాలో తెలియని భయం మొదలైంది. జేబులో ఒక్క పైసా కూడా లేకుండా అంత రాత్రి పూట అక్కడి నుంచి మా ఊరిదాకా ఎలా వెళ్లాలి? అనే తర్జన భర్జన నాలో మొదలైంది. స్టేషన్ మరో ఐదు నిమిషాల్లో వస్తుందనగా నా ప్రయాణంలోని సాధక బాధకాలన్నింటిని ఒకతనికి పూస గుచ్చినట్లు చెప్పి 'ఒక్క యాభై రూపాయలిస్తే చాలా మేలు చేసినవారవుతారు'ని దీనంగా వేడుకున్నాను. ఇంజనీరింగ్ కాలేజీ స్టూడెంట్‌నని తెలుసుకుని ఆయన ఏమీ ఆలోచించకుండా జేబులో నుంచి యాభై నోటు తీసిచ్చాడు. నేను నా నోట్‌బుక్‌లో ఆయన అడ్రస్ రాసుకుని, ఊరికి చేరుకోగానే తప్పకుండా ఆ డబ్బులు మనీఆర్డర్ చేస్తానని చెప్పాను.



మారేడుమిల్లికి వెళ్లే దారి ...
(ఇన్‌సెట్‌లో) గిరిజనుల విల్లు, బాణాలు

ఒంటిగంటకు స్టేషన్‌లో దిగి, మా ఊరివైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఎక్కాను. ఒకవైపు విపరీతమైన ఆకలి, మరోవైపు నిద్రలేమి వల్ల ఆ నోట్‌బుక్‌ను బస్సులోనే మర్చిపోవడంతో నాకు సాయం చేసిన వ్యక్తి అడ్రస్ పోయింది. ఆ తర్వాత ఎప్పుడు రైలెక్కినా ఆ వ్యక్తి గుర్తుకు వచ్చేవాడు. నేను సంపాదించడం మొదలెట్టిన తర్వాత ప్రయాణంలో ఎవరైనా 'ఊర్లెళ్లేందుకు డబ్బుల్లేవ'ని అడుగుతూ తారసపడితే మాత్రం వారికి ఎంతో కొంత తప్పకుండా సాయం చేసేవాడిని. తర్వాత తర్వాత అలా అడుక్కోవడం ఒక బిజినెస్‌లా మారిందని నా ఫ్రెండ్స్ చెప్పడంతో అలాంటివారిపై జాలిపడటం మానుకున్నాను.

## రోడ్డు మీదే పడక...

కాలేజీలో చదువుకునే రోజుల్లో ఫ్రెండ్స్‌తో కలిసి మా ఊరు నుంచి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న మారేడుమిల్లి, పాములేరు అడవుల్లోకి బైకుల మీద లాంగ్ డ్రైవ్‌కు వెళ్లేవాళ్లం. మధ్యలో ఆకలైతే తినేందుకు పులిహోర, మజ్జిగన్నం ప్యాకెట్లను, విశ్రాంతి తీసుకోవడానికి కొన్ని దుప్పట్లను వెంట తీసుకెళ్లేవాళ్లం. రోడ్డు పొడవునా ఎన్నో అద్భు

తమైన దృశ్యాలు కనిపించేవి. ఎక్కడైనా చెరువులు, సెలయేళ్లు కనిపిస్తే బైకులను రోడ్డుపక్కన ఆపి, ఎవరికీ ఈత రాకున్నా వాటిలో దిగి ఆడుకునేవాళ్లం. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో గిరిజనులు విల్లు, బాణాలు పట్టుకుని తారసపడేవారు. వాటిని కొనాలని నాకు యమా కోరికగా ఉండేది. అందుకే ఎవరైనా గిరిజనుడు కనిపిస్తే చాలు బాణాలు కొనేందుకు బేరం పెట్టేవాడిని. కానీ అంతలోనే వారి పెద్దలు వచ్చి వారించేవారు. వాళ్లు తయారుచేసిన బాణాలను ఎవరికీ అమ్మరాదనే నియమం ఉందని చెప్పేవాళ్లు.

అప్పట్లో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు చాలా తక్కువగా ఉండేవి. ఇరవై, ముప్ఫయ్ నిమిషాలకు ఒక వాహనం కనిపించేది. అందుకే మేము వెంట తెచ్చుకున్న దుప్పట్లను సరదాగా రోడ్డు మీదే పరుచుకుని పడుకునేవాళ్లం. ఏదైనా వాహనం వస్తోందనే సంకేతం రాగానే గబగబా వాటిని తీసి, ఆ వాహనం వెళ్లిపోగానే తిరిగి వాటిని పరిచి కబుర్లు చెప్పుకునే వాళ్లం. అడవిలో పులులు, సింహాలు కనిపిస్తాయని భయపెట్టేవాళ్లు కానీ మేము వెళ్లిన నాలుగుసార్లు కూడా జింకలు తప్ప ఏవీ మా కంట పడలేదు. దానికి కారణం భయం వల్ల మేము అడవిలోపలికి ఎక్కువ వెళ్లలేకపోయేవాళ్లమని తర్వాత నాకు అర్థమైంది. బహుశా అడవిలో మరికొంత దూరం వెళ్తే కనిపించేవేమో.






'డల్లాస్ జూ' దృశ్యాలు

## ఆటోలో 60కిలోమీటర్లు ...

'స్టాలిన్' సినిమా విడుదలైన తర్వాత నా క్లాస్‌మేట్ సుధాస్రవంతి పెళ్లికి చిలకలూరిపేటకు వెళ్లాల్సి వచ్చింది. నా ఫ్రెండ్ మస్తాన్ ఫోన్‌చేసి పిడుగురాళ్ల దాకా వస్తే అక్కడి నుంచి ఇద్దరం కలిసి పెళ్లికి వెళ్దామన్నాడు. ట్రైన్‌లో పిడుగురాళ్లకు చేరుకుని వాళ్లింట్లో భోజనాలు చేసే సరికి చాలా రాత్రయ్యింది. అక్కడి నుంచి చిలకలూరిపేటకు 60 కిలోమీటర్లే కాబట్టి ఏం పర్వాలేదన్నాడు. పైగా ముహూర్తం (అర్ధరాత్రి మూడుగంటలకు) టైముకు చేరుకుంటామన్నాడు. వాడు భరోసా ఇచ్చాడు కదాని నేను కూడా తొందరపెట్టలేదు. పాత విషయాలను గుర్తు చేసుకుంటూ రాత్రి పన్నెండు గంటలకు రోడ్డుమీదకు వచ్చాం. ఏదైనా బస్సు దొరికితే నరసరావుపేట మీదుగా చిలకలూరిపేటకు వెళ్లొచ్చన్నాడు. కానీ ఎంతసేపు వెయిట్ చేసినా ఒక్క బస్సుగానీ, లారీగానీ ఆ రూట్‌లో కనిపించలేదు. నాలో టెన్షన్ మొదలైంది. అనేక ప్రయాసల కోర్చి ఇంతదూరం వచ్చిన తర్వాత ముహూర్తం సమయానికి అక్కడికి చేరుకోకుంటే ఏం ప్రయోజనమని మా వాడిని తిడుతున్నాను. ఇంతలో ఒక ఆటో మమ్మల్ని దాటుకుని వెళ్లి కాస్త దూరంలో ఆగి రివర్స్ గేర్‌లో వెనక్కి వచ్చి మా ముందు ఆగింది. ఆటోడ్రైవర్ నన్ను చూసి ''సార్... మెగాస్టార్ నటించిన స్టాలిన్ సినిమాలో పరారే పరారే అనే పాట రాసింది మీరే కదా సార్. మిమ్మల్ని టీవీల్లో, ఆడియో ఫంక్షన్లలో చాలాసార్లు చూశాను...'' అంటూ ఎగ్జయిటింగ్‌గా చెప్పుకుపోతున్నాడు. మా హడావిడిలో మేముంటే మధ్యలో వీడి గోలేంట్రా బాబూ! అనుకుంటూనే అన్యమనస్కంగానే అతడు అడిగే ప్రశ్నలకు సమాధానం చెబుతున్నాను. మాటల మధ్యలో మేము చిలకలూరిపేటకు వెళ్లాలని చెప్పాను. అతడు వెంటనే మీకు అభ్యంతరం లేకపోతే నా ఆటోలో దింపుతాను సార్ అన్నాడు. మేమిద్దరం ఆశ్చర్యపోయాం. అర్ధరాత్రి అరవై కిలోమీటర్లు... ఆటోలో ఎలా వెళ్తాం. పైగా అతను ఒంటరిగా వెనక్కి రావాలి. ఎంత వారించినా వినకుండా మా ఇద్దరినీ బలవంతంగా ఆటోలో కూర్చోబెట్టాడు. మాకు కూడా వేరే గత్యంతరం లేక కూర్చున్నాం. అతను హుషారుగా షార్ట్‌కట్ రూట్లలో పొలాలు, తోటల మధ్య నుంచి ఆటోను పరుగెత్తించాడు. వెన్నెల రాత్రి కావడంతో ఆటోలో ప్రయాణం గతుకుల రోడ్ల వెంట సాగినప్పటికీ అద్భుతంగా అనిపించింది. ఆటో అతని కోరిక మేరకు నేను రాసిన కొన్ని సూపర్ హిట్ పాటలు పాడుతూ... మొత్తం అరవై కిలోమీటర్లు ప్రయాణించాను. సరిగ్గా ముహూర్తం సమయానికి అక్కడ దింపినందుకు అతనికి థాంక్స్ చెప్పి, రానూపోనూ ఎంతవుతుందో లెక్కేసి దానికి కాస్త ఎక్కువగానే అతను వద్దని వారిస్తున్నా జేబులో పెట్టాను.

## బీచ్‌లోకి కారేసుకెళ్లొచ్చు...

ప్రకృతి, పశుపక్ష్యాదులు, నీళ్లంటే నాకు భలే ఇష్టం. అందుకే ఎక్కడికైనా టూర్‌కు వెళ్తే అలాంటి ప్రాంతాలవైపే నా అడుగులు దౌడు తీస్తాయి. 2006లో బంధుమిత్రులతో కేరళకు వెళ్లినప్పుడు అక్కడి బ్యాక్‌వాటర్ ఒడ్డున ఉండే కొబ్బరి చెట్ల నడుమ కారులో ప్రయాణిస్తూ అలౌకిక ఆనందానికి గురయ్యాను. ముఖ్యంగా బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్‌లను మనమే డ్రైవ్ చేయొచ్చు. కేరళలోని తలసేరీ బీచ్‌కు ఓ ప్రత్యేకత ఉంది. సుమారు నాలుగు కిలోమీటర్లు బీచ్‌లో కారుమీద గానీ, బైక్ మీద గానీ చక్కర్లు కొట్టొచ్చు. సాధారణంగా బీచ్‌లో ఇసుక వల్ల అడుగుతీసి అడుగు వేయడం కష్టంగా ఉంటుంది కానీ ఈ బీచ్‌లో నేల గట్టిగా ఉండటం, ఒడ్డు నుంచి సముద్రం అర కిలోమీటరు దాకా లోతుగా ఉండకపోవడం వల్ల వాహనాలను బీచ్‌కు ఆనుకుని ఉన్న నీళ్ల మీద స్పీడుగా డ్రైవ్ చేయొచ్చు. నీటిని చీల్చుకుంటూ వాహనాన్ని డ్రైవ్ చేయడమంటే ఎంత మజా ఉంటుందో అనుభవించిన వారికే తెలుస్తుంది.

గత యేడాది అమెరికాలో జరిగే 'తానా' సభలకు అతిథిగా వెళ్లాను. అక్కడి 16 రోజుల ప్రయాణాలన్నీ కాంక్రీట్ జంగిల్‌లో తిరిగినట్టే ఉంది. వాటన్నింటి కంటే 'డల్లాస్ జూ' నన్ను అమితంగా ఆకట్టుకుంది. అక్కడ పక్షులను, జంతువులను అతి దగ్గర నుంచి చూస్తూ ఎంజాయ్ చేయొచ్చు. రకరకాల చిలకలకు ట్రైనింగ్ ఇవ్వడం వల్ల అవన్నీ మన మీదకు వచ్చి ఫ్రెండ్లీగా వాలుతాయి. జిరాఫీలు ఎత్తుగా ఉంటాయి కాబట్టి, దానివల్ల వాటి ఎత్తులో కందకం తవ్వారు. వాటి తల సరిగ్గా మన ముందుకు వస్తుంది. ఐదు డాలర్లు ఇస్తే పది క్యాబేజీ ఆకులు ఇస్తారు. సరదాగా వాటిని జిరాఫీలకు తినిపించొచ్చు. ఒక గ్లాస్ రెస్టారెంట్‌లో కూర్చుంటే మన చైర్ పక్కనే (మధ్యలో గ్లాస్ ఉంటుంది), కేవలం అంగుళం దూరంలో పులులు, సింహాలు వచ్చి సేదదీరడం చూడొచ్చు. ఆ మధ్య మన 'జూ' స్వర్ణోత్సవాలకు పాట రాసే అవకాశం వచ్చినప్పుడు... మనుషులకు ప్రకృతిని, పక్షులను, జంతుజాలాన్ని దగ్గర చేసే అలాంటి సృజనాత్మక చర్యలను ఇక్కడ కూడా చేపట్టవచ్చు కదాని అధికారులకు చెప్పాను. కానీ మన దగ్గర చట్టాలు అందుకు ఒప్పుకోవట.

– చల్లా శ్రీనివాస్



కేరళలోని తలసేరీ బీచ్



# సముద్రపు ఒడ్డున రాళ్లు గుండ్రంగా ఉంటాయెందుకు?

ఎందుకు?

ఎందుకంటే, అలలు పదేపదే ఒడ్డుకొచ్చి రాళ్లను కొట్టుకోవటం వల్ల రాళ్లు నునుపుదేలి గుండ్రంగా తయారవుతాయి. నీళ్ల తాకిడికి రాళ్లు ఒకదాన్నొకటి ఒరుసుకుని కూడా నునుపుదేలతాయి. నిజానికి ఈ రాళ్లన్నీ ఒక పెద్ద కొండరాయి నుంచి ఊడిపడ్డ ముక్కలే! అగ్ని పర్వతాలు, భూకంపాల ప్రభావం వల్ల రాళ్లు ముక్కలుగా విరిగిపోతాయి. ఆ గరుకు రాతి ముక్కలే సముద్రపు అలల ధాటికి నున్నగా తయారవుతాయి.

# ఆకులకు అన్ని రంగులెందుకు?



ఆకులన్నీ ఆకుపచ్చగానే ఉంటాయా? జాగ్రత్తగా గమనించి చూడండి. కొన్ని ముదురు ఆకుపచ్చలో, లేత ఆకుపచ్చలో, ఇంకొన్ని పసుపు రంగులో కూడా ఉంటాయి. కణాల్లోని క్లోరోప్లాస్ట్ వల్లే ఆకులు ఆకుపచ్చగా ఉంటాయి. అయితే క్లోరోఫిల్ 2 ఎ కలిగివుండే ఆకులు నీలం, ఆకుపచ్చ రంగులు కలిసిన ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. క్లోరోఫిల్ 2బి కలిగి ఉండే ఆకులు పసుపు, ఆకుపచ్చ రంగులు కలిసినట్టు లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఆకులు పసుపు రంగులో ఉంటే వాటి కణాల్లో క్సాంతోఫిల్2 ఉందని అర్థం. కెరోటిన్ కలిగిన ఆకులు నారింజ రంగులో ఉంటాయి. ఇదికాక కాలాలకు అనుగుణంగా కూడా ఆకుల్లో మార్పులు జరుగుతాయి.

కూల్ గాడ్జెట్

# ఎగిరే గడియారం



ఉదయాన నిద్ర లేవాలంటే ఎవరికైనా బద్ధకమే. పెట్టుకున్న అలారం పెట్టుకున్న టైమ్‌కే మోగినా ఎక్కడ లేస్తున్నాం? మోగగానే దాని నెత్తిన ఓ మొట్టికాయ వేసి మళ్లీ నిద్రపోతుంటాం. పాపం గడియారం. గట్టిగా అరవటం తప్ప ఇంకేం చేయగలదు? మనల్ని నిద్ర లేపాలంటే శబ్దం ఒక్కటే సరిపోదు. అలారం జోరీగలా వెంటపడాలి. ఇప్పుడిలాంటి గడియారం ఒకటి మార్కెట్లోకొచ్చింది. దీనికి డిజిటల్ స్క్రీన్‌తోపాటు ఓ బుల్లి ఫ్యాన్ కూడా బిగించి ఉంటుంది. సెట్ చేసుకున్న సమయం దగ్గరపడగానే పెద్ద శబ్దంతో మోగడమే కాక దానికి బిగించి ఉన్న ఫ్యాన్ గాల్లోకి లేచి మన చుట్టూ గిరగిరా తిరుగుతుంది. అలారంనైతే ఆపగలం గానీ గాల్లో చక్కర్లు కొట్టే ఫ్యాన్‌ను పడుకునే పట్టుకోలేం కదా! పైకి లేచి చేత్తో దాన్ని అందుకోవాలి. అలా చేసేలోపు నిద్ర కాస్తా తుర్రుమంటుంది. ఈ తమాషా గడియారం ధర 1000 రూపాయలు.

కార్టూన్




చుక్కలు కలపండి



## రంగులు వేయండి



## దారి కనుక్కోండి






## ఉంగరం

మీకు తెలుసా

వేళ్లకు ఉంగరాలు అందాన్నిస్తాయి. క్రీస్తు పూర్వం 1600 సంవత్సరంలోనే అనటోలియా అనే ప్రాంతంలో మనుషులు ఉంగరాలను ధరించిన ఆనవాళ్లు దొరికాయి. అయితే అలంకరణలో ఉంగరాలకు పెద్ద పీట వేసింది మాత్రం ఈజిప్షియన్లే! వీళ్ల లోహం, క్వార్ట్జ్, పింగాణీలను ఉపయోగించి ఉంగరాలు తయారుచేసేవారు. క్లిష్టమైన డిజైన్లను రూపొందించటంలో కూడా వారే సిద్ధహస్తులు. అప్పట్లో కొత్త సంవత్సరం కానుకగా ఉంగరాలను ఇచ్చిపుచ్చుకునేవారు. తర్వాతి కాలంలో ఈజిప్షియన్ల ఉంగరాల డిజైన్లను గ్రీకు, రోమన్ డిజైన్లు ఆక్రమించాయి. టోలమీ రాజుగా ఉన్న కాలంలో ఈ ఉంగరాలను కంచు, బంగారు లోహాలతో తయారుచేసేవారు. ఉంగరాలను ఎడమ చేతి ఉంగరపు వేలుకు పెట్టుకునే సంప్రదాయం కూడా ఈజిప్షియన్ల నుంచే మొదలైంది. ఈ వేలి నరం నేరుగా గుండెకు దారి తీస్తుందనే కారణంతో ఈజిప్షియన్లు ఉంగరాలను ఎడమ చేతి నాలుగో వేలికి పెట్టుకునేవారు. ఇదే సంప్రదాయం ఇప్పటికీ పెళ్లిళ్లలో నడుస్తోంది.

## నమ్మలేని నిజాలు

- నిప్పుకోడి గుర్రం కంటే వేగంగా పరిగెత్తగలదు. సింహంలా గాండ్రించగలదు కూడా.
- ఎగిరే క్షీరదం గబ్బిలం ఒక్కటే!
- కంగారూలు వాటి తోక ఆధారంతో ఎగిరి దూకుతాయి. తోకను గాల్లోకి లేపి ఉంచితే అవి ముందుకు దూకలేవు.
- మన ఖర్మ కాలి మనం ఎప్పుడైనా మొసలి నోటికి చిక్కితే వాటి కళ్లలో బొటనవేలితో పొడవాలట. అలా చేస్తే మొసలి పట్టు వదిలేస్తుందట.
- పిల్లి చెవుల్లో 33 కండరాలు ఉంటాయి. కాబట్టే అవి ప్రతి చిన్న శబ్దాన్ని వినగలుగుతాయి.
- ఏనుగులు 3 మైళ్ల దూరంలో ఉన్న నీటిని కూడా వాసన పట్టగలవు.
- కొవాలా బేర్‌లు యూకలిప్టస్ ఆకుల్ని మాత్రమే తింటాయి.

## నా బొమ్మ



**జె. విష్ణు హేమశ్రీ,** 4వ తరగతి,
రత్నం నెక్స్ట్ స్కూల్, నెల్లూరు.



## పేపర్ కట్టడాలు!



నిర్మాణరంగం అభివృద్ధి చెందుతున్న కొద్దీ కొత్త కొత్త ఇళ్ల డిజైన్లు వెలుగుచూస్తున్నాయి. ఇప్పుడు ఇంటి నిర్మాణంగానీ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంగానీ ఏదైనా సృజనాత్మకంగానే రూపుదిద్దుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో యువ ఆర్కిటెక్ట్‌లకు ఇటీవల చైనాలోని చోంకింగ్ యూనివర్శిటీ ఒక విలక్షణ పోటీని నిర్వహించింది. కేవలం పేపర్‌తో బిల్డింగులు కట్టమని యూనివర్శిటీకి చెందిన అర్కిటెక్చర్ అండ్ అర్బన్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ సవాలు విసిరింది. వివిధ కళాశాలలకు చెందిన 350 మంది ఆర్కిటెక్చర్ విద్యార్థులు 19 టీములుగా ఏర్పడి, పేపర్‌తో అద్భుత నిర్మాణాలను సృష్టిస్తే, వాటిని చూసిన వారంతా నోరెళ్లబెట్టారు. ఒక్కో పేపర్ బిల్డింగ్ ఒక్కో కళాఖండాన్ని తలపించింది. అవన్నీ కూడా రాబోయే కాలంలో నిర్మాణరంగంలో వాస్తవరూపం దాలుస్తాయని నిపుణులు అంటున్నారు.



అలా ఇలా



## 'వెజిటబుల్' పెయింటింగ్స్!

అర్జెంటీనాకు చెందిన అన్నా కెవిల్లీ జాయెస్‌కు ఫుడ్ స్టయిలిస్టుగా, ఫుడ్ ఇలస్ట్రేటర్‌గా మంచి పేరుంది. కూరగాయలు, పప్పు దినుసులు, ఇతర ఫుడ్ ఐటెమ్స్‌ను ఆమె అద్భుతమైన బొమ్మలుగా మారుస్తుంది. పక్షులంటే ఆమెకు వల్లమాలిన ప్రేమ. ఒకరోజు కెవిల్లీ పెంపుడు పక్షి చనిపోయింది. ఆ బాధలో నుంచి బయటపడేందుకు ఆమె ఫుడ్ ఐటెమ్స్‌ను ఉపయోగించి అందమైన పక్షి బొమ్మలను డిజైన్ చేయడం మొదలెట్టింది. సెరామిక్ ప్లేట్స్‌ను కాన్వాసులగా చేసుకుని కెల్లీ సృష్టించిన చిత్రాలను చూసి అందరూ మెచ్చుకోవడంతో 'ట్రిబ్యూట్' పేరిట అందమైన పక్షుల బొమ్మలకు ఆమె జీవం పోయసాగింది. దోసకాయలు, క్యారెట్ ముక్కలు, బఠానీ గింజలు, క్యాబేజీ ఆకులు, రకరకాల ధాన్యాలను రంగులుగా మార్చి... బ్రష్‌కు బదులుగా చిన్న కత్తితో కెవిల్లీ ఇలాంటి అద్భుతాలెన్నింటినో ఆవిష్కరించింది.



## ❖ తాయ్ చీ

తాయ్‌చీకి రెండు ప్రధానమైన లక్ష్యాలు ఉన్నాయి. వీటిలో మొదటిది శత్రువుల నుంచి కాపాడుకోవటం. రెండోది ఆరోగ్యాన్ని కాపాడుకొనే సాధనంగా దీనిని వాడుకోవటం. పూర్వకాలంలో తాయ్‌చీని మార్షల్ ఆర్ట్‌గా ఉపయోగిస్తే ఆధునిక కాలంలో ఇది ఆరోగ్య ప్రక్రియగా మారింది. దీనిలోని కదలికలన్నీ వాటికి అనుగుణంగానే ఉంటాయి. ఈ కదలికలను అర్థం చేసుకుంటే దానిలో శక్తి ప్రసారం ఎలా అవుతుందో తెలుస్తుంది. ఇప్పుడు తాయ్‌చీలోని కొన్ని సుప్రసిద్ధ కదలికలను విశ్లేషిద్దాం..



# శరీరంలో శక్తి ప్రసారం ఇలా...



Single Whip

## సింగిల్ విప్

మన చేతి చివర ఉండే ప్రతి భాగం ఒక కొరడాలా మారగలదు. కొరడాను గట్టిగా ఝుళిపించినపుడు దానిలోని మొత్తం శక్తి అంతా దాని చివరకు చేరుతుంది. అప్పుడు అది తాకితే తగిలే గాయం చాలా తీవ్రంగా ఉంటుంది. తాయ్‌చీలోని సింగిల్ విప్ కదలికలు కూడా ఈ విధమైన ఫలితాన్నే ఇస్తాయి. ఈ కదలికలను చిత్రం1లో చూడవచ్చు. శత్రువును ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు వారిని భుజాల ద్వారా, మోచేతి ద్వారా, ముంజేతి ద్వారా, అరచేతి ద్వారా, చేతి వేళ్ల ద్వారా ఎదుర్కోవచ్చు. వీటిని ఆయుధాలుగా మార్చి ఉపయోగిస్తే శత్రువు తీవ్రంగా గాయపడతాడు. ఈ కదలికలను ప్రాక్టీసు చేయటం వల్ల కొన్ని ఆరోగ్యపరమైన లాభాలు కూడా ఉంటాయి. ఈ కదలికల వల్ల చేతి నుంచి వేళ్ల దాకా శక్తి ప్రసారం సాఫీగా జరుగుతుంది. రక్తప్రసారంలో మార్పులు వస్తాయి. చేతినొప్పులు టెన్నిస్ ఎల్బో వంటి సమస్యలు ఉన్నా తగ్గుతాయి. ఇప్పుడు ఈ కదలికలను ఏ విధంగా ప్రాక్టీసు చేయాలో చూద్దాం..

★ ముందు రెండు చేతులను నేరుగా పెట్టాలి. ఆ తర్వాత ఒక చేతి చివరను కొంగ ముక్కు ఆకారంలో ఉంచాలి. ఈ కొంగముక్కు ఆకారం రావాలంటే అరచేయి కిందకు ఉండాలి. నాలుగు వేళ్లు, బొటన వేలు కలిపి ఉంచాలి. దీని వల్ల శక్తి అంతా వేలి చివరలలో కేంద్రీకృతమై ఉంటుంది.

★ అరచేతిని పూర్తిగా విడదీసి, మళ్లీ కొంగముక్కు ఆకారంలోకి తీసుకురావటం వల్ల చేతిలోకి చాలా శక్తి వస్తుంది. వేళ్లు, మోచేయి వంటి వాటికి బలం చేకూరుతుంది.

ఇప్పుడు వేర్వేరు పద్ధతుల్లో సింగిల్ విప్ కదలికలు ఏ విధంగా ఉంటాయో చూద్దాం..

★ చిన్, యాంగ్ పద్ధతుల్లో రెండు కాళ్ల మధ్య దూరం ఉంటుంది. ఒక కాలు కొద్దిగా వంగి ఉంటుంది. ఈ కదలిక శత్రువుపై దాడి చేయటానికి సిద్ధంగా ఉన్నట్టు ఉంటుంది. (చిత్రం 2)



★ వ్యూ పద్ధతిలో రెండు కాళ్లు ఒకే రేఖపై ఉంటాయి. కాళ్లు, చేతులు సరిసమానంగా వంగి ఉంటాయి. శరీరం ఇటు కుడివైపుకు కాని అటు ఎడమవైపుకు కాని ఒంగి ఉండదు. శరీరం మొత్తం బరువు రెండు కాళ్లపైన సరిసమానంగా ఉంటుంది. (చిత్రం 3)

★ ఇక శత్రువుపై దాడి చేసే సమయంలో అరచేతిని రకరకాలుగా ఉపయోగించవచ్చు. శత్రువు చేసే దాడిని అడ్డుకోవటానికి కూడా ఉపయోగించవచ్చు. (చిత్రం 4)

– శ్రీభావ

మహిళా వార్డు ముందున్న ఆవరణలో ఒక పెద్ద పనస చెట్టుంది. దాన్ని 'కఠల్ పేడ్' అంటారు. ఆ చెట్టు చుట్టూ గుండ్రంగా ఒక సిమెంటు గట్టు ఉంటుంది. దానిమీద కూర్చుని ఉదయం పూట పేపర్ చదువుతుంటాం. డ్యూటీలో ఉన్న జమ్మెదారిణి కూడా సాధారణంగా అక్కడే కూర్చుంటుంది. నేను కొత్తగా జైలుకి వచ్చిన కాలం అది. హిందీ పేపర్ చదవడానికి కొంత కష్టపడుతూ వాళ్ళనీ వీళ్ళనీ అడుగుతూ ఉన్నాను. ఆ రోజు డ్యూటీలో ఉన్న జమ్మెదారిణి ఒక ముసలావిడ. మొత్తం ముగ్గురు జమ్మెదారిణుల మధ్య డ్యూటీలు మారుతుండేవి. ఇద్దరు ముసలమ్మలు ఒక పడుచామె. పగలు ఇద్దరు ఉంటారు.



# నలభై ఏళ్ల తరువాత మేరీ టేలర్...

"నిన్ను చూస్తే నాకు గతంలో ఇక్కడున్న ఒక విదేశీ మహిళ గుర్తుకొస్తోంది. ఆమెకి కూడా హిందీ వచ్చేది కాదు. నీలాగే నేర్చుకున్నది. ఇతర బందీల పట్ల నువ్వు ఉండే తీరు చూసి కూడా నాకామే జ్ఞాపకం వస్తూ ఉంటుంది. నీలాగే రాజకీయ బందీ, మీ పార్టీ కేసే, బ్రిటిష్ ఆమె..."

"మేరి టేలరా?..." ఉద్విగ్నంగా అడిగాను. ఆమె నిర్ఘాంతపోయింది.

"నీకెలా తెలుసు?"

"ఆమె పుస్తకం నేను చదివాను" అని చెప్పేసరికి ఆమె తెగ సంతోషపడిపోయింది.

"అరె నిజంగానా? చాలా మంచిది. ఆమె పుస్తకంలో నా గురించి కూడా రాసింది" అన్నది.

నేనా పుస్తకం 1992లోనో 93లోనో చదివాను కాబట్టి అందులోని విషయాలు గుర్తు ఉండడం కొంచెం కష్టమే. ఆమె ఉన్నది హజారిబాగ్ జైలు అని నాకెందుకో గుర్తు రాలేదు.

"అమలేందు అండా బ్యారక్‌లో ఉండేవాడు. ఝూజీ అనే సిపాయి తెలుసా? ఆయన, నేను ఇద్దరం అప్పుడు ఇదే జైల్లో డ్యూటీ చేసే వాళ్ళం. ఝూ అప్పటికి నాకన్నా రెండేళ్ళు సీనియర్. ఆయన అమలేందు సెల్ దగ్గర డ్యూటీ చేసేవాడు. కల్పన అని ఒక బెంగాలీ ఆమె ఉండేది. ఇప్పటి రెండో నెంబర్ వార్డు, మూడో నెంబర్ వార్డులు అప్పట్లో సింగిల్ సెల్స్‌గా ఉండేవి. మేరీని, కల్పనాని చెరొక సెల్‌లో పెట్టారు."

నాకు నోట మాట రాలేదు. ఇప్పుడు ఆ గదులు ఒక్కోదానిలో పదమూడు మంది బందీలు, నలుగురు పిల్లలూ చొప్పున ఉన్నారు. మళ్ళీ ఒకసారి వెళ్ళి ఆ గదులని చూశాను. దానికి ఎదురుగా ఉన్న చిన్న ఔట్ హౌస్ లాంటిదాన్ని అప్పట్లో వీళ్ళిద్దరిపై నిఘా పెట్టడం కోసం వాడేవారట. అక్కడ కూర్చుని జమ్మెదారిణిలు కాపలా కాసేవారు. దాన్నే ఇప్పుడు కమానీఘర్ అంటున్నారు.

నాకు ఇంక అశాంతి మొదలయ్యింది. వెంటనే ఆ పుస్తకం చదవాలన్న కోరిక పట్టుకుంది. ఈసారి ఎవరైనా వచ్చేటప్పుడు ఆ పుస్తకం పంపమని ఇంటికి ఉత్తరం రాశాను. జైలు నుంచి ఉత్తరం పంపడం అంటే అదొక యజ్ఞం. ముందు హెడ్ వార్డర్‌కి ఇవ్వాలి. ఆయన దానిని కార్యాలయంలో ఇస్తాడు. వాళ్ళు రిజిస్టర్‌లో ఎంటర్ చేసి, దానిని బడా బాబు (హెడ్ క్లర్క్)కి పంపుతారు. ఆయన చదివి జైలర్‌కి పంపుతాడు. జైలర్ మామూలు ఉత్తరాలైతే సంతకం పెట్టేసి పంపేస్తాడు కానీ రాజకీయ ఖైదీలు రాసినవి కాబట్టి తను కూడా చదివి, సూపరింటెండెంట్ సంతకం కోసం పంపుతాడు. ఆయన కూడా చదివి సంతకం పెట్టాక అప్పుడు డిస్పాచ్‌కి వెళ్తుంది. అలా నా ఉత్తరం ఇల్లు చేరడానికి ఒక మూడు వారాలు పట్టింది. అప్పట్లో నా సహచరుడు హైదరాబాద్ జైల్లో ఉన్నాడు. ఇక్కడ కేసు కోసం ఒకసారి తనని కోర్టుకి తీసుకొచ్చారు. వస్తూ నా కోసం పుస్తకాలు, బట్టలు, తినుబండారాలు, పళ్ళు తీసుకువచ్చాడు. జడ్జి అనుమతి కూడా పొందాము. వాటిని తనిఖీ చేసి, నాతో పాటు వచ్చిన సెక్యూరిటీ వాళ్ళకి అందజెయ్యమని జడ్జి ఆదేశించాడు. వెంటనే జడ్జి ఎదురుగానే అటు ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన పోలీసులు, ఇటు కోర్టు సిబ్బంది, ఇరుపక్షాల లాయర్ల సమక్షంలో నా వెంట వచ్చిన ఝార్ఖండ్ ఎస్కార్ట్ పోలీసులు తనిఖీ చేశారు. అందులో ఏమున్నాయో, ఏం తీస్తున్నారో ఏమీ పట్టించుకోకుండానే నేను నా సహచరుడితో మాట్లాడేందుకు దొరికిన అవకాశాన్ని వినియోగించుకోవడంలో నిమగ్నమయ్యాను.

"మేరి టేలర్ పుస్తకం దొరికింది. ఒక్కటే కాపీ ఉందట. జిరాక్స్ చేయించి తేవాల్సింది అని అన్నాను కానీ, ఇక తెచ్చారు కదా మళ్ళీ వెనక్కి పంపడం ఎందుకులే అనుకుని తెచ్చేశా" అన్నాడు.

జైలులో గడిపిన నాలుగేళ్ళలో అక్కడి సామాన్య స్త్రీల జీవితాలు నన్నెంతో ప్రభావితం చేశాయి. ఈ పది కథలు వాళ్ళందరి కోసం.

# జైలుకథలు - 10

బి. అనూరాధ

వాళ్ళు తనిఖీ పూర్తి చేసి, అభ్యంతరకరమైన సామాన్లు ఏవీ లేవని జడ్జికి చెప్పారు. ఎస్కార్ట్ వాళ్ళు వాటిని నేరుగా జైలుకి పంపుతామన్నారు. కానీ రెండు రోజులు గడిచినా రాకపోయేసరికి అడిగాను. జిల్లా పోలీసులు వాటిని తీసుకుపోయారని తెలిసింది. ఇక వాటి కోసం దరఖాస్తులు, నిరాహారదీక్షలు చేయాల్సి వచ్చింది. మొదట తిండి, బట్టలు ఇచ్చి ఊరుకున్నారు. మళ్ళీ నిరాహారదీక్ష చేస్తే అవుట్ లుక్, ఇండియా టుడే లాంటి పత్రికలు మాత్రం ఇచ్చారు. ఎంత కొట్లాడినా మేరి టేలర్ పుస్తకం, ఒక సంచి నిండా మోసుకొచ్చిన ఇతర పుస్తకాలు మాత్రం ఇవ్వలేదు.

ఈ లోపు ఒకరోజు జైలు లైబ్రరీలో హిందీలో మేరి టేలర్ పుస్తకం ఉందని తెలిసింది. నాకు హిందీలో చదవడం అయిష్టంగా ఉన్నా ఇంక దాని కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాను. మొదట అది సర్క్యులేషన్లో ఉందన్నారు. నెలలు, నెలలు గడిచిపోయినా ఇవ్వలేదు. చివరికి జైలర్– నేను అంతగా దానిని అడుగుతున్నాను కనుక తను కూడా చదివాక ఇస్తానన్నాడు. ఆయనకి డ్యూటీలో తీరిక దొరక్క వీలయినప్పుడు అక్కడో ముక్క ఇక్కడో ముక్క చదువుతూ చాలా కాలయాపన చేశాడు. నేను వదల్లేదు. కోర్టుకెళ్ళిన ప్రతిసారి జడ్జిని అడగడం మొదలుపెట్టాను. చివరికి భరించలేక అయినా, ఆయన చదివాకే ఇచ్చాడు. సరిగ్గా నేను ప్రయత్నాలు ప్రారంభించిన రెండేళ్ళ తరువాత ఆ పుస్తకాన్ని హిందీలో చదవగలిగాను. నేను విడుదలయ్యే ముందు జరిగిన ఆఖరి ములాకాతీలో మావాళ్ళు దాని తెలుగు పుస్తకం మళ్ళీ తెచ్చిచ్చారు.

మొదట మేరి టేలర్ పుస్తకం సర్క్యులేషన్లో ఉందన్నారు. నెలలు, నెలలు గడిచిపోయినా ఇవ్వలేదు. చివరికి జైలర్– నేను అంతగా దానిని అడుగుతున్నాను కనుక తను కూడా చదివాక ఇస్తానన్నాడు. ఆయనకి డ్యూటీలో తీరిక దొరక్క వీలయినప్పుడు అక్కడో ముక్క ఇక్కడో ముక్క చదువుతూ చాలా కాలయాపన చేశాడు. నేను వదల్లేదు. కోర్టుకెళ్ళిన ప్రతిసారి జడ్జిని అడగడం మొదలుపెట్టాను. చివరికి భరించలేక అయినా, ఆయన చదివాకే ఇచ్చాడు. సరిగ్గా నేను ప్రయత్నాలు ప్రారంభించిన రెండేళ్ళ తరువాత ఆ పుస్తకాన్ని హిందీలో చదవగలిగాను. నేను విడుదలయ్యే ముందు జరిగిన ఆఖరి ములాకాతీలో మావాళ్ళు దాని తెలుగు పుస్తకం మళ్ళీ తెచ్చిచ్చారు.

1970–75 మధ్య సరిగ్గా అయిదేళ్ళ పాటు మేరీ ఈ జైల్లో ఉంది. అప్పట్లో ఉన్నత విద్య అభ్యసించడానికి యూరప్‌కి వెళ్ళిన అనేక మంది బెంగాలీ యువతీ యువకులు నక్సల్బరీ రాజకీయాల పట్ల ప్రభావితమయ్యారు. అలా లండన్ వెళ్ళిన అమలేందు అక్కడ పరిచయమైన మేరీతో స్నేహం చేశాడు. ఇద్దరి అభిప్రాయాలూ కలిసాయి. తరువాత మేరీ ఇండియాకి వచ్చింది. ఇద్దరూ పెళ్ళి చేసుకున్నారు. ఝార్ఖండ్ వెళ్ళిన కొద్ది రోజులకే అరెస్టయ్యి హజారీబాగ్ సెంట్రల్ జైలుకి వెళ్ళారు. 75లో ఎమర్జెన్సీ విధించిన రోజునే ఆమెకు లండన్‌కి టికెట్ ఇచ్చి నేరుగా విమానం ఎక్కించారు. ఆ అయిదేళ్ళలో గానీ, వెళ్ళేటప్పుడు గాని, ఒక్కసారి కూడా ఆమెను అమలేందుని కలవనివ్వలేదు. తను లండన్ చేరుకున్నాక 'మై ఇయర్స్ ఇన్ ఏన్ ఇండియన్ ప్రిజన్' అని తన అనుభవాలు రాసింది. అది మొదలు హిందీలోకి, తరువాత తెలుగులోకి అనువాదం అయ్యింది.




70 నుండి చూసుకుంటే దాదాపు నాలుగు దశాబ్దాల అనంతరం నేనీ జైలుకి వచ్చాను. (2009 అక్టోబర్) అప్పటికి ఇప్పటికీ మారనివి కొన్ని చూసి నవ్వుకున్నాను. శనగల నాస్తా అప్పుడూ ఉంది. వాళ్ళు కూడా ఇలాగే ఎండబెట్టి మహిళా మూలాకాతీకి వెళ్ళేటప్పుడు వాటితో వంటలు చేసేవారు. అప్పట్లో మేరీకి రేషన్ ఇచ్చేవాళ్ళు వంట చేసుకోవడానికి. అందరూ ఆమె స్టవ్ మీద వంట చేసుకొనేవారట. అందరూ చేసుకొన్నాకే తను చేసుకునేదట. మారిన విషయాలలో మరొకటి ఏమిటంటే, అప్పట్లో పగటి షిఫ్ట్ ఈగలు, రాత్రి షిఫ్ట్ దోమలు డ్యూటీ చేస్తుంటాయని రాసింది. ఇప్పుడు ఈగలు, దోమలు కూడా 24 గంటలు డ్యూటీ చేస్తున్నాయి. కానీ అక్కడే ఉన్న తన సహచరుడిని మాత్రం ఒక్కసారి కూడా కలవనివ్వలేదు. నా సహచరుడిని కలవడానికి మొదట నాకు అనుమతి నిరాకరించారు. నేను వెంటనే సూపరింటెండెంట్‌కి ఒక ఉత్తరం రాశాను. బంధువులను కలవవచ్చు అనే నియమం ప్రకారం నాక్కూడా నా భర్తని కలిసే హక్కు ఉందని, నాకు ఆ హక్కు నిరాకరిస్తే ఎందుకు ఏ చట్టం ప్రకారం నిరాకరించారో చెప్పవలసిన బాధ్యత అధికారులుగా వాళ్ళకు, తెలుసుకోవాల్సిన హక్కు బందీగా నాకూ ఉన్నాయని, వాళ్ళు తెలియజేస్తే దాని గురించి ఏం చెయ్యాలో నేను నిర్ణయించుకుంటానని రాశాను. ఆ దరఖాస్తు తీసుకుపోయిన జమ్మేదారు, మీ పార్టీ వాళ్ళెవరికీ ఇప్పటిదాకా ములాకాతీలు ఇవ్వలేదు, ఇవ్వరు అని చెప్పాడు. చివరికి నా దరఖాస్తు మీద చర్చ జరిగిందని, నిరాకరించడానికి రాతపూర్వకమైన నియమం ఏమీ లేదు కాబట్టి ఇవ్వడమే సరైంది అనుకున్నామని తరువాత నాకు సూపరింటెండెంట్ చెప్పాడు. అలా నేను నా సహచరుడిని కలవడం మొదలయ్యింది.

మేరీ వర్ణించినట్టే ఇప్పటికీ అక్కడ మహిళా ములాకాతీ రోజంతా ఒక పండగ వాతావరణం, జాతరకి పోయినట్టు పోవడం, మహిళలంతా ఉత్సాహంగా తయారవ్వడం, ఏమీ మారలేదు. మేరీకి ఒకసారి ఒక పిల్లాడు ఒక పువ్వు తెచ్చి ఇచ్చాడట. ఆమె ఎంతో కదిలిపోయింది. ఒక గ్లాసులో నీళ్ళు పోసి దానిని పెడితే, ఆకస్మికంగా తనిఖీకి వచ్చిన సూపరింటెండెంట్ ఆమె ఎవరితో మాట్లాడిందోనని పెద్ద గొడవ చేసి, ఆమె సామాన్లు చిందరవందర చేసి అందరికీ వార్నింగ్ ఇచ్చి బీభత్సం చేశాడు.

ఇప్పుడు విప్లవ పార్టీలలో ఉండే మగవాళ్ళనే తప్ప ఆడవాళ్ళని విడిగా సెల్స్‌లో ఉంచే ప్రాక్టీసు లేదు. కిక్కిరిసిపోతున్న జైళ్ళలో అవి కూడా వార్డులుగా రూపాంతరం చెందాయి. అయితే అప్పటి పరిస్థితులకి ఇప్పటికీ కొన్ని మంచి మార్పులైతే ఉన్నాయి. అప్పుడు గడ్డ కట్టించే చలిలో కాలికి చెప్పులు కూడా అనుమతించేవాళ్ళు కాదంటే, ఎంత భయంకరమైన పరిస్థితో అర్థం చేసుకోవచ్చు. మేరీ ఆ చలిని తట్టుకోలేక కొందరు ఖైదీలతో కలిసి కప్పుకోవడానికి ఇచ్చే రగ్గుల అంచులు కత్తిరించి వాటితో చెప్పులు లాగా కుట్టుకుని రాత్రిపూట వేసుకునేది. కత్తెర కూడా అనుమతించరు కాబట్టి దానిని రహస్యంగా కుట్టు విభాగం నుంచి తెచ్చి మళ్ళీ ఇచ్చేశారట. కట్టుబట్టలతో వచ్చిన మేరీ లోదుస్తులు అడిగితే జైలు అధికారులు గృహ మంత్రిత్వ శాఖకి రాయమన్నారంటే అవాక్కయిపోతాము. పైగా అమలేందు ఇంటి నుండి వచ్చిన దుస్తులను ఆమెకు ఇవ్వనివ్వలేదు. స్నానం చేశాక మార్చుకోవడానికి బట్టలు లేక దుప్పటి ఒంటికి చుట్టుకుని పేంటు షర్టు ఉతికి ఆరేసుకునేదట. అవి తొందరగా ఆరకపోవడం వల్ల ఆమె దుప్పటి కప్పుకుని ఉన్నప్పుడు సూపరింటెండెంట్ ఒకసారి ఆక

స్మిక తనిఖీకి మందీ మార్బలంతో వచ్చాడట. 'నిజానికి సిగ్గుపడాల్సింది ఆయనే. నేను కాదు' అని రాసింది మేరీ. ఆమె పట్ల ఎంత అమానవీయంగా వ్యవహరించారో చెప్పడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. కొన్ని నెలల పాటు ఆమె ఆ ఒక్క జతతోనే గడిపింది. చివరికి ఆమె తండ్రి చేసిన ప్రయత్నాల వల్ల బ్రిటిష్ ఎంబసీ నుండి బట్టలు వస్తే తప్ప ఆమెకు ఆ కష్టం తప్పలేదు. అప్పట్లో కరెంటు కూడా ఉండేది కాదు. వీటన్నిట్నీ లెక్కచేయక పిల్లలు, ఖైదీలందరితో ఎంతో స్నేహంగా ఉంటూ అనేక అవసరాలకు సహాయపడుతూ ఉండేది మేరీ.



అసలు భారతదేశాన్ని మేరీ జైలులోనే చూసింది. పురుషాధిపత్యానికి ఉన్న అనేక రూపాలను జైలుకి వచ్చిన మహిళల అనుభవాల ద్వారా తెలుసుకుంది. ఇక్కడి కుల వ్యవస్థ, అంటరానితనం గురించి కేవలం దిగ్భ్రాంతి చెంది ఊరుకోకుండా తనతో స్నేహంగా ఉండే ఒక దళిత స్త్రీ చేతి వంట తినడం ద్వారా తన తిరుగుబాటుని కూడా ప్రకటించింది. అప్పటికి నవ యువతిగా ఉన్న ఆదివాసీ జమ్మీదారిణి లెవినీ పట్ల ఆమె ఎంతో సానుభూతితో వ్యవహరించింది. అందుకే ఆమె ఇప్పటికీ మేరీని మర్చిపోలేదు.

ఒకరోజు లెవినీ (ఇప్పుడు ముసలిదైపోయింది) నన్ను అడిగింది. మేరి టేలర్ జీవించే ఉందా? ఎలా తెలుస్తుంది? అని. నేను ఈ మధ్యనే ఇంటర్‌నెట్‌లో వెతికి ఆమె జీవించే ఉన్నారని, లండన్‌లో ఉన్నారని తెలుసుకున్నాను. ఒక విలేఖరి తన బ్లాగ్‌లో ఆమెను తాను 2005లో కలుసుకున్నానని రాశారు. ఆమె ఇప్పుడు వయసు విధించిన పరిమితుల్లోనే అయినా మతోన్మాదానికి వ్యతిరేకంగా పని చేస్తున్నట్లు తెలిసింది. ఆమెను కాంటాక్ట్ చేయాలనే నా ప్రయత్నాలు మాత్రం ఇంకా ఫలించలేదు.

..........................................

anu13ravi@gmail.com

(ఈ శీర్షికను ఇంతటితో ముగిస్తున్నాం)





## ఫుడ్ కోర్ట్

## సూప్

**కావలసిన పదార్థాలు:** నూల్‌కోల్ (ఆకులతో పాటు) – 1, ఉల్లిపాయ – 1, టమోటా – 1, క్యారెటు – చిన్నముక్క, మిరియాల పొడి – 1 టీ స్పూను చొప్పున, ఉప్పు – రుచికి తగినంత, వెల్లుల్లి – అర టీ స్పూను, లవంగం –1, దాల్చినచెక్క – అరంగుళం ముక్క, బిర్యానీ ఆకు – 1.

**తయారుచేసే విధానం :** రెండు కప్పుల నీటిలో నూల్‌కోల్, క్యారెట్, ఉల్లిపాయ, టమోటా ముక్కలతో పాటు దాల్చినచెక్క, బిర్యాని ఆకు, లవంగం వేసి ఉడికించాలి. చల్లారిన తర్వాత వడకట్టి మిర్యాలపొడి, ఉప్పు కలిపి ఒక పొంగు వచ్చాక దించేయాలి. సూపు వేడి వేడిగా ఉన్నప్పుడే బ్రెడ్ ముక్కలు నంజుకుంటూ తాగితే బాగుంటుంది.



# నూల్‌కోల్‌తో రెండు

## కొబ్బరితో కూర

**కావలసిన పదార్థాలు:** నూల్‌కోల్ – 1, ఉల్లిపాయ – 1, టమోటా – 1, పసుపు – చిటికెడు, దనియాల పొడి – 2 టీ స్పూన్లు, సోంపు – అర టీ స్పూను, కారం – 1 టీ స్పూను, అల్లం వెల్లుల్లి పేస్టు – 1 టీ స్పూను, కరివేపాకు – 4 రెబ్బలు, కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు – రుచికి తగినంత, నూనె – 2 టేబుల్ స్పూన్లు.

**పేస్టు కోసం:** పచ్చి కొబ్బరి తురుము – 3 టేబుల్ స్పూన్లు, మిరియాలు, జీలకర్ర, సోంపు – అర టీ స్పూను చొప్పున, పచ్చిమిర్చి – 2.

**తయారుచేసే విధానం:** నూల్‌కోల్‌ను శుభ్రం చేసి ముక్కలుగా తరగాలి. నూనెలో సోంపు, కరివేపాకు, ఉల్లితరుగు, అల్లం వెల్లుల్లి పేస్టు, టమోటా ముక్కలు ఒకటి తర్వాత ఒకటి వేగించి నూల్‌కోల్ ముక్కలు కలపాలి. రెండు నిమిషాల తర్వాత కారం, దనియాలపొడి, ఉప్పు, పసుపు కలిపి అరకప్పు నీరు పోయాలి. ముక్కలు ఉడికిన తర్వాత కొబ్బరి పేస్టు మిశ్రమం వేసి 3 నిమిషాల తర్వాత కొత్తిమీర చల్లి దించేయాలి. ఈ కూర పరాటాలతో బాగుంటుంది.






**రమేశ్చంద్ర మహర్షి**

బి.టెక్,

సెల్: 92465 82255

ఫోన్: 040-6522 5554


భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, ప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలూ, పంచ కర్మేంద్రియాలూ, మనసూ అనే పదకొండు ఇంద్రియాలూ, శబ్ద, రూప, స్పర్శ, రస గంధాలనే ఇంద్రియ విషయాలూ కోరిక, ద్వేషం, తెలివి, సుఖం, దుఃఖం, ధైర్యం ... వీటి వికారాలూ కలిసి ఏర్పడే క్షేత్రం ... మనిషి! ఆ మనిషికి భవిష్యత్తునే దారి చూపే నేత్రం, జ్యోతిశ్శాస్త్రం!!

★★★

కృతే కార్యే కిం ముహూర్త ప్రశ్నేన?

పని ముగిసిన పిదప ముహూర్తమడగడం, జరగకూడనిది జరిగిపోయాక పరిహారాలు పాటించడం వలన ఏంటి ప్రయోజనం?

భవిష్యత్ ముందే తెలిస్తే ముప్పు నుండి తప్పించుకోవడం లేదా తగ్గించుకోవడం సాధ్యమే!

కాలః క్రీడతి గచ్ఛత్యాయుః

కాలం ఆడుకుంటూ ఉంటుంది. ఆయువు గతించిపోతూ ఉంటుంది. రాబోయే మంచి చెడ్డలు తెలిస్తే ఉన్నంతలోనే ఉన్నతంగా జీవించగలుగుతాం!

వయం భగవంతః స్యామ

మనమందరమూ భాగ్యశాలురమవుదుముగాక!

★★★

పాఠకులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఈ క్రింది వివరాలు రాసి పంపండి.

పేరు ....................................

పుట్టిన తేదీ ............................

పుట్టిన సమయం .....................

పుట్టిన ఊరు (మండలం)...........

ప్రశ్న ..................................

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అదృష్ట రత్నజ్యోతి**

ఆంధ్రజ్యోతి దినపత్రిక
ప్లాట్ నెం.76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033.

# అదృష్ట రత్నజ్యోతి

**వి.టి., హైద్రాబాద్.**

**మా అమ్మాయి జన్మకుండలి సంపూర్ణంగా, నిర్మొహమాటంగా వివరించగలరు.**

మీ అమ్మాయి జన్మకుండలి ప్రకారం- నక్షత్రం ఉత్తరాషాఢ. ధనూరాశి.

2014 ఫిబ్రవరి నుండి 2031 నవంబర్ వరకూ రాహు దశ. 2031 నవంబర్ నుండి 2047 ఆగస్ట్ వరకూ గురు దశ. 2047 ఆగస్ట్ నుండి 2066 మే వరకూ శని దశ.

**కంట్రోలింగ్ ఫేక్టర్స్:** కుజునికి రవిచంద్రులు. అలాగే తనకు తాను. ఇలా తనకు తాను కంట్రోలింగ్ ఫేక్టర్ కావడానికి ఫలితం, గొప్ప ఆత్మవిశ్వాసం. ఫిజికల్ స్టేమినా. మెంటల్ స్టేమినా. అలాగే ఆయా సందర్భాల్లో ''ఉపయోగపడే కోపం''!

రాహువుకు కంట్రోలింగ్ ఫేక్టర్ కేతువు. బృహస్పతికి శుక్ర రాహు చంద్రులు. ఈ కారణంగా మొదట అబ్బాయి పుట్టాల్సింది అమ్మాయి కావడం జరుగుతుంది. శనికి కంట్రోలింగ్ ఫేక్టర్ చంద్రుడు. దీనివలన వృత్తిలో తిరుగులేని స్థానం.

**యోగాలు :** 1. రుచక మహాయోగం. 2. శశ మహాయోగం. పూర్వపుణ్యం 70 శాతం. పూర్వపాపం 30 శాతం!

**దశా నిర్దేశం:** 1. 2007 నుండి 2014 ఫిబ్రవరి వరకూ నడిచే కుజుదశ, శని అంతర్దశలో విద్య ఇంజినీరింగ్ చేస్తుంది. అంటే 2010 నుండి.

2. ప్రస్తుతం 2014 ఫిబ్రవరి నుండి 2016 అక్టోబర్ మధ్య రాహువులో రాహువు. కంట్రోలింగ్ ఫేక్టర్ కేతువు కారణంగా విద్య ఇతర రాష్ట్రంలో హాస్టల్లో ఉండి చదువుకోవడం జరుగుతుంది.

బృహస్పతి ఉన్నత విద్యనిచ్చే అధిపతి కావడం, ఆయన రవిని కంట్రోల్ చేయడం, రవి విద్యా స్థానంలోకి ప్రవేశించి బుధునితో కలిసి ఉండడం వంటి కారణాల వలన పిజి ఎమ్‌బిఏ అవుతుంది.

లాభాధిపతి దశమంలో పడడం వలన ఇంటికి ఈ జాతకురాలే ప్రథమ సంతానం.

అయితే కేతువు కారణంగా ఈ రాహువులో తన తర్వాత పుట్టిన ఆమెతో... అంటే చెల్లెలి వలన కుటుంబంలో అశాంతి నెలకొంటుంది. ఆమె ప్రేమ వ్యవహారం ఇంట్లోవారికి తీవ్ర మనస్తాపం కలిగిస్తుంది.

3. రాహువులో గురువులో... అంటే 2016 అక్టోబర్ నుండి 2019 మార్చ్ మధ్య ఈ జాతకురాలికి ఒక ప్రేమ వ్యవహారం. అది వివాహానికి దారి తీయడం జరుగుతుంది. 'భావ స్థిరాణి జననాంతర సౌహృదాని''! ఈ ప్రేమ వ్యవహారం ఇప్పటిది కాదు, గత జన్మ సంబంధం!

ఈ లవ్ ఎఫైర్‌కి సూత్రధారి అయిన బృహస్పతిని, కారకుడూ అధిపతీ అయిన శుక్రుడు కంట్రోల్ చేయడం, ఆ శుక్రుడిని వృత్తికి కారకుడూ, అధిపతీ అయిన శని కంట్రోల్ చేయడం వలన అబ్బాయి సహోద్యోగి. కళ్యాణాన్నిచ్చేది రాహువులో గురువులో శుక్రుడు. అంటే 2017 డిసెంబర్ నుండి 2018 మే మధ్య గ్రహచారం చూస్తే ఇంకా దగ్గరగా చెప్పుకోవచ్చు.

4. రాహువులో శనిలో... అంటే 2019 మార్చ్ నుండి 2021 డిసెంబర్ మధ్య శశ మహాపురుష యోగం వ్యక్తీకరణలోకి వస్తుంది. దశమాధిపతికి దశమ స్థితి, చతుర్థాధిపతితో కంట్రోల్ చేయబడడం, అలాగే యుతి... వెరసి వృత్తిలో అసాధారణమయిన స్థితి, ధనయోగం, అధికారం, గృహ యోగం. అయితే దీనంతటికీ మూల కారణం, రాహువులో గురువులో చంద్రుడు... అంటే 2018 జూన్ నుండి సెప్టెంబర్ మధ్య, అలాగే రాహువు విదశ.... అంటే 2018 నవంబర్ నుండి 2019 మార్చ్ మధ్య కంపెనీ తరపున చేసే విదేశ యానాలు!

5. రాహువులో బుధునిలో... అంటే 2021 డిసెంబర్ నుండి 2024 జూన్ మధ్య కొంచెం బ్యాడ్ పీరియడ్. పైన చెప్పుకున్న గృహ యోగం దీనిలో లుప్తమయిపోవడం... అంటే అమ్ముకోవలసి రావడం జరుగుతుంది. అలాగే తల్లికి కొంచెం అనారోగ్యం, తనకు అశాంతి. ఈ అంతర్దశ బాధించడానికి మూల కారణాలు-



రాహువులో బుధునిలో బుధుడు... అంటే 2021 డిసెంబర్ 21 నుండి ఏప్రిల్ 30 మధ్య... అంతవరకూ నడిచిన దశాంతర్దశలు యోగించడంతో నిగ్రహం కోల్పోయి కొన్ని తప్పులు చేయడం... అది, ఉన్న మంచి ఉద్యోగం లోంచి మారిపోవాలని చేసే ప్రయత్నం, విడాకులు తీసుకోవాలనే ప్రగాఢమయిన కోరిక. ఈ రెండు విషయాల్లోనూ తప్పులో కాలేయడం జరుగుతుంది. నిగ్రహం లేదా సంయమనం కోల్పోవడమనే తప్పుకు పెనాల్టీ దాదాపు రెండున్నర సంవత్సరాలు. ''భూతం భవ్యాయ కల్పతే!'' దీనికి రెమిడీస్- అహం తలకెక్కకుండా చూసుకోవడం, బుధునికి గట్టి రెమిడీస్ పాటించడం వీటన్నింటినీ మించి, ఈ జాతకురాలు తనకు తెలియకుండానే తన ఇంటి ఉత్తర భాగానికి దోషం చేర్చడం. ఆ కారణంగానే ఇల్లు అమ్ముకోవలసి వస్తుంది. గచ్ఛతః స్ఖలనమ్! నడిచేవాడు పడతాడు... జాగ్రత్తగా ప్రయాణించాలి. తప్పులు చేసి కాలం వృథా చేసుకోకూడదు.

న హ్యహాని నివర్తంతే! జరిగిపోయిన కాలం తిరిగి రాదు!! - సశేషం

పుస్తక ప్రపంచంలో ఒక మహా ఆవిష్కారం **'అధినేత'**. 1992లో సంచలనం సృష్టించిన రమేశ్చంద్ర మహర్షి విరచిత **'అధినేత'** ఇప్పుడు ఎమెస్కో వారి ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. ప్రతులకు: **92465 82255.** Advt

❖ ఈవారం కథ

# గోధుమరంగు ఆట

★ భగవంతం

బొమ్మలు : అక్బర్

**అర్ధరాత్రి బస్సు ప్రయాణం. వయా భద్రాచలం..చింతూరు.. మోతుగూడెం..సీలేరు..చింతపల్లి.**

**అట్నుండి ఏడోనెంబర్ బస్సులో కానీ, ఇట్నుండి పదమూడో నెంబర్ బస్సులో కానీ భగవంతం వస్తాడేమోనని–**

**హోటల్లో– గోధుమరంగు స్మృతిని మాత్రం మిగుల్చుకున్న ఖాళీ కప్పులోని శూన్యం ముందు కూర్చొని ఎదురుచూసే ఆయన్ని కలవడానికి మా ఊరి నుండి ఇంతకన్నా కళాత్మకమైన దారి మరొకటి లేదు.**

రాత్రంతా దట్టమైన అడవులవైపు సాగిపోతూ– తెల్లారేసరికి గిరిజన గూడేల చివరి పొగమంచు చీల్చుకుపోతూ – మధ్యాహ్నమంతా కొండమలుపుల ఎండనీడల్లో మెలికలు తిరుగుతూ సాగే ప్రయాణం. ఘాటీ రూటు కాబట్టి ఓ గంట ఆలస్యమైనా రేపు సాయంత్రానికల్లా హోటల్‌కి చేరుకుని ఆయన్ని కలుసుకోవచ్చు.

గోధుమరంగుకి అవతల ఆయన– ఇవతల నేను. ఊహించుకుంటేనే భలే వేడుకగా ఉంది. ఆయన్తో చాలా విషయాల గురించి చర్చించాలి. ఒకటీ రెండు మెలితిప్పిన అనుభవాల గురించి పంచుకోవాలి. నాలుగైదు చమత్కారాల గురించి చెప్పి నవ్వుకోవాలి. ఒకే ఒక ప్రశ్నకు ఎలాంటి జవాబు చెబుతాడో చూడాలి...

లయబద్ధమైన శబ్దంవల్ల ఆలోచన్లోంచి బయటికొచ్చి బస్సు కిటికీలోంచి అవతలికి చూసాను. బస్సు భద్రాచలం బ్రిడ్జీని దాటుతోంది.

★★★

దట్టమైన అడవిలోంచి వేగంగా వెళ్తోంది బస్సు. టైం రాత్రి మూడుగంటలు దాటి ఉండొచ్చు. డ్రైవరూ, నేను మాత్రమే మెలకువగా ఉన్నట్లు తలతిప్పి బస్సునంతా పరికించిన తర్వాత గ్రహించాను. కండక్టర్ కూడా మంకీ క్యాపు పెట్టుకున్న తలతో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. అతడి వెనుక సీటే నాది.

చుట్టూ ఉన్నవాళ్లంతా నిద్రపోవడం వల్ల కలిగిన మానవ నిశ్శబ్దం నన్ను ఇంకో ప్రపంచంలో మేల్కొనేలా చేసింది. నా పక్కసీటు కూడా ఖాళీగానే ఉండడంతో రిలాక్స్‌డ్‌గా కిటికీవైపు వాలి చాలా సేపట్నుండి అడవి వైపు చూస్తున్నాను.

చీకటితో కలిసి చెట్లన్నీ వేగంగా వెనక్కి వెళ్లిపోతున్నాయి. నేను ముందుకి వెళ్లడం వల్లే అవి వెనక్కి వెళ్తున్నాయన్న భావన చలనంలోని సౌందర్య రహస్యాన్ని చెబుతున్నట్లుగా ఉంది. అయితే...ఎందుకీ చలనం..? దేన్ని అందుకోవడానికి ఈ ప్రయాణం..? ఏది ప్రేరేపించడం వల్ల ఈ కదలిక....? ఏ ఖాళీల వల్ల ఈ పూరించుకోవడాలు..?

ప్రశ్నలు నాసికారంధ్రాల చివరినుండి పుడుతున్నట్లుగా అనిపించాయి. అంత బస్సు వేగంలోనూ ఉచ్ఛ్వాస నిశ్వాసల నడక నెమ్మదిగా కొనసాగుతోంది. శ్వాస తీసుకోవడంలోని సుఖం మొదటిసారి అనుభవంలోకి వస్తున్నట్లుగా ఉంది. ఈ సుఖానికీ పై ప్రశ్నలకీ ఏమైనా సంబంధం ఉండి ఉంటుందా? సుఖం జవాబుల వల్ల కాకుండా ప్రశ్నల వల్ల కూడా కలుగుతుందా...?

బస్సు రోడ్డు మలుపేదో తిరుగుతోంది. శరీరం పూర్తిగా కిటికీ వైపు ఒరిగింది. చాలా పెద్దమలుపు. అంత పెద్ద మలుపులోనూ డ్రైవర్ బస్సు వేగాన్ని ఏ మాత్రం తగ్గించకపోవడం వల్ల శరీరం గాల్లో తేలుతున్నట్లుగా ఉంది. బస్సు సున్నా అనే అంకెమీద గుండ్రంగా తిరుగుతున్న భావన కలిగింది. ఉన్నట్లుండి బస్సు వేగం అమాంతం తగ్గిపోతూ మలుపులో క్రీ...చ్..మని బ్రేకు పడుతూ ఆగిపోయింది...

నిద్రపోతున్న వాళ్లలో కొందరి తలలు ఒక్కసారి ముందుకి కదిలి తిరిగి వెనక్కి సర్దుకున్నాయి–మూలిగిన పెదవులతో.

బస్సుకి ఏదో అడ్డం వచ్చినట్లుంది. డ్రైవర్‌కి దగ్గర్లో ఉన్న సీటు కాబట్టి కిటికీ పక్క నుండి కుడివైపుకు జరిగి బస్సు ముందున్న అద్దాల్లోంచి బయటికి చూసాను. ఒళ్లంతా చిక్కని పాలతో నిండిపోయినట్లున్న తెల్లని ఆవు ఒకటి రోడ్డు దాటుతోంది. బస్సు లైట్ల వెలుగులో– అది రోడ్డు దాటుతూ ఒకసారి తలతిప్పి బస్సువైపు చూసినపుడు– దాని ముఖంలో అడవిలోని అమాయకత్వం మొత్తం ముద్దగా ఒక్కచోట కనిపించినట్లయింది.

ఈ రాత్రి అది ఎక్కడినుండి ఎక్కడికి పోవడానికి రోడ్డు దాటుతోందో...? అడవి శరీరంలోని చిన్న అవయవంలా అది రోడ్డు దిగి చెట్లలోకి అదృశ్యమైంది. బస్సు తిరిగి కదిలింది. కూర్చున్న సీటు అంచులోంచే తలతిప్పి వెనక్కి చూసాను. బస్సు వెనుక అద్దాలకవతలి చీకట్లలో ఆవు ఆత్మకథ రాయడంలో తిరిగి మునిగిపోయినట్లు కనిపించింది అడవి.

పావుగంటలో అంతా సద్దుమణిగి తిరిగి అందరూ గాఢనిద్రలోకి జారిపోయారు నిశ్శబ్ద పెదవులతో.

నేను మళ్లీ కిటికీ పక్కకు చేరుకుని బయటికి చూసాను.

అడవి కొలనులోకి రాత్రెప్పుడో కప్ప దూకినపుడు ఏర్పడ్డ వలయాల్లా మళ్లీ ఆలోచన్లు ప్రశ్నలుగా ... ఈ ప్రశ్నలన్నీ ఎక్కడి నుండి ఎందుకు పుడుతున్నాయో నీకు తెలుసా?

ఎవరో ప్రశ్నించినట్లనిపించింది. ప్రశ్నలకు సంబంధించిన మౌలికమైన ప్రశ్న...కానీ జవాబు దొరకలేదు... బస్సు కిటికీ అవతలి చీకట్లోని అడవివైపు మరింత స్పష్టంగా చూడడానికి ప్రయత్నించాను.

★★★

చింతపల్లిలో మధ్యాహ్నం భోజనమయ్యాక ఆ ఊరు చివరి రోడ్డు కిరువైపులా జరుగుతోన్న వారాంతపు సంత దగ్గర బస్సు ఆపి ఏదో కొనుక్కోడానికి దిగాడు డ్రైవర్.



కిటికీలోంచే నాకు కనిపిస్తోన్న మేరకు బయటి ప్రపంచాన్ని కాసేపు పరిశీలించాను. అటవీ ఉత్పత్తులైన చింతపండు, కుంకుళ్లు, తేనెలాంటివి అమ్ముతున్న దుకాణాలు, కొత్తవీ పాతవీ బట్టలు అమ్ముతున్న దుకాణాలు, చవకబారు సబ్బులు, పౌడర్లు అమ్ముతున్న దుకాణాలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు అమ్ముతోన్న దుకాణాలు....

అన్నింటి దగ్గరా జనం గుమిగూడి ఉన్నారు. అంతా సందడిగా ఉంది. ఉన్నట్లుండి జనం మధ్యలో ఏదో కలకలం. ఎవరిదో చేతిసంచీ గాల్లోకి ఎగిరింది. అందులో సరుకులన్నీ గాల్లోనే చెల్లా చెదురయ్యాయి. ఎవరో వృద్ధుడు..సుమారు డెబ్బై ఏళ్ల పైబడ్డవాడు. జనం మధ్యలోంచి పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. జనమంతా ఈ హఠాత్ సంఘటనకు విస్తుబోతూ పక్కకి జరిగి దారి ఇస్తున్నారు. ఆ వృద్ధుడి పెదవుల్లోంచి రెండే రెండు పదాలు పదే పదే వినబడుతున్నాయి.

''వేరే ఉంది...ఇది కాదు-ఇది కాదు..వేరే ఉంది-ఇది కాదు...వేరే ఉంది''.

అతడి వేషధారణ చూస్తే-శుభ్రమైన ఇస్త్రీ చేసిన ప్యాంటూషర్టులో-నూనె పెట్టి దువ్విన క్రాఫుతో, చేతికి రిస్ట్‌వాచీతో, జేబులో పెన్నుతో రిటైర్డ్ స్కూల్ హెడ్‌మాస్టర్‌లా ఉన్నాడు. జనం ముఖంలోని ఆశ్చర్యాన్ని బట్టి అతడు ఉన్నట్టుండి-ఇప్పుడే-ఈ సంతలోనే మొదటిసారిగా అలా ప్రవర్తించడం మొదలుపెట్టాడు అని తెలుస్తోంది. అతడు పరుగెత్తుకుంటూ వస్తూనే చేతికున్న గోల్డ్‌కలర్ రిస్ట్‌వాచీ తీసి అవతలికి విసిరేసాడు. అలా పరుగెత్తుకుంటూ దాదాపు మా బస్సు సమీపానికి చేరి టక్కున ఆగాడు. పదేళ్ల వయసున్న కోయపిల్ల రోడ్డుపక్కన నిలబడి సొరకాయలు అమ్ముకుంటోంది.

అతడు ఆ పాప దగ్గర ఆగి-ఆమె వైపు కదిలి-వంగి-ఆ పాప బుగ్గమీద ముద్దుపెట్టి 'ఇది కాదు..వేరే ఉందిరా తల్లీ' అంటూ ఆమె చేతిలోని సొరకాయ తీసుకుని చేత్తో గుండ్రంగా తిప్పుతూ-తను కూడా గుండ్రంగా తిరుగుతూ 'హ్హా..హ్హా హ్హా' అని కాసేపు కేరింతలు కొట్టి-తిరిగి సొరకాయ ఆమె చేతిలో పెట్టి- ఏదో గుర్తుకొచ్చినట్లుగా ఆగి- తన ప్యాంటు జేబులోంచి మనీపర్స్ తీసి-అందులోని నోట్లన్నీ బయటికి లాగి-పర్స్ అవతలికి విసిరేసి-

డబ్బులన్నీ ఆ పాప చేతిలో కుక్కాడు. విస్తుపోయి చూస్తోంది ఆమె. చుట్టూ ఉన్న వాళ్లందరి హావభావాలు కూడా అలాగే ఉన్నాయి. అతడు మళ్లీ అన్ని జేబులూ వెదికి-చేతికి దొరికినన్ని చిల్లర పైసలు బయటికి తీసి-గాల్లోకి విసిరాడు. ఒక నాణెం ఎగిరొచ్చి మా బస్సుమీద పడింది. ఒక్క కుదుపుతో బస్సు కదిలింది. ఉలిక్కిపడ్డాను. చప్పున కల చెదిరింది. కళ్లు తెరిచి చూసాను. బస్సు స్పీడ్ బ్రేకర్‌ను దాటుతోంది.

విచిత్రమైన కల..భలే గమ్మత్తుగా ఉంది. స్పీడ్ బ్రేకర్ కుదుపు లేకపోతే కల ఇంకా అలాగే సాగేదేమో...? కలలో ఆ వృద్ధుడు ఇంకా ఏం చేసేవాడో...ఏం చెప్పేవాడో...తెలుసుకునే అవకాశం ఎప్పటికీ లేదు.

అసలు ఏ కల ఎక్కడ తెగుతుందో ఎవ్వరికీ తెలియదు. జీవితం...కలలోని కల అనిపిస్తుంటుంది ఒక్కోసారి. అలా అనిపించినప్పుడు అంతా మ...బ్బు...లా...విడిపోయినట్లూ, ఎంతో తేలికైపోయినట్లూ అనిపించి హాయిగా ఉంటుంది. అదీ కొన్ని క్షణాలు...లేక కొన్ని నిమిషాలు...అంతే. మళ్లీ పొగకమ్మినట్లు ...చవకబారువి ముఖ్యమైపోవడాలు-మహదానందం కలిగించేవి మరుపున..మరుగున పడిపోవడాలు-ఇలా ఉంటే బావుండుననుకోవడాలు-ప్చ్‌లూ-రోజుకింత మాంసం తిని రక్తం తాగి బలిసిపోయే మనసుని మోయలేక మోయలేక అలసిపోవడాలు....

దీని గురించి కూడా ఆయన్తో మాట్లాడాలి. తాగడం పూర్తి చేసిన కాఫీ కప్పుని టేబుల్ మీద పెట్టబోతూ ఏం చెప్పడానికి ఉద్యుక్తుడవుతాడో చూడాలి.

కిటికీలోంచి బయటికి చూసాను. ఎండిపోయిన సొరకాయబుర్రలతో కలిసి శీతాకాలపు మధ్యాహ్నపుటెండలో ఆబగా చలికాగుతున్న గుడ్డిగుడిసెల గూడేన్నేదో వేగంగా దాటుతోంది బస్సు.

★★★

ఇరవయ్యో నంబరు సిటీబస్సు దిగి నడుచుకుంటూ బస్టాపుకి దగ్గర్లోనే ఉన్న ఆ హోటల్‌కి చేరుకోబోతూ దాని ముందు కాసేపు నిలబడ్డాను. పాతకాలం నాటి నిర్మాణం. ఈ హోటల్లో కూర్చునే కదా ఆయన కాఫీ తాగుతూ ఎదురుచూసేది. ఉత్తరంలో రాసిన

ఒక నాణెం ఎగిరొచ్చి మా బస్సు మీద పడింది. ఒక్క కుదుపుతో బస్సు కదిలింది.

ఉలిక్కిపడ్డాను. చప్పున కల చెదిరింది. కళ్లు తెరిచి చూసాను. బస్సు స్పీడ్ బ్రేకర్‌ను దాటుతోంది.

విచిత్రమైన కల..భలే గమ్మత్తుగా ఉంది. స్పీడ్ బ్రేకర్ కుదుపు లేకపోతే కల ఇంకా అలాగే సాగేదేమో...?



ఉత్త గోధుమరంగు వేడి ఊహ..ఉన్నిథన్‌లు..ఇక్కడే కదా...

రంగుల ప్రపంచం మధ్యలో నిలబడి బ్లాక్ అండ్ వైట్ ఫోటోని చూస్తున్నట్లనిపించింది. హోటల్‌వైపు కదులుతూ వాచిలో టైం చూసాను. నాలుగూ నలభై ఏడు...శీతాకాలపు సాయంత్రపు చల్లగాలి అప్పుడే చర్మాన్ని పలకరించడం మొదలుపెట్టింది. హోటల్లోకి అడుగుపెట్టి నాకు కావలసిన సీటు కోసం చూసాను. చివర్లో కుడివైపు కిటికీ పక్కన పాతకాలపు చెక్క టేబుల్ కనిపించింది. కానీ కుర్చీలు ఖాళీగా ఉన్నాయి.ఆయన హోటల్‌కి రాలేదా...? వచ్చి వెళ్లిపోయాడా...? వస్తాడా...?

అక్కడ కూర్చుంటేనే కిటికీలోంచి బస్‌స్టాప్ కనిపిస్తుంది. ఖచ్చితంగా ఆయన కూర్చునే స్థలం అదే...అనుకుంటూ అటువైపు కదిలాను. వెనుక గోడకి ఆనించి వేసిన కుర్చీలో కూర్చున్నాను. ఎడమవైపు కిటికీలోంచి బయటి ప్రపంచం కనిపిస్తోంది. ఎదురుగా ఆరుటేబుళ్ల కవతల కౌంటర్‌కి ఎడమవైపున ముఖద్వారం. సాయంకాలపు ఎండ బయటి నుండి సగం కౌంటర్ మీద పడుతోంది. కౌంటర్లో కూర్చున్న వ్యక్తి వెనుక గోడ మీద దండతో ఎవరిదో నవ్వుతూ ఉన్న వ్యక్తి ఫోటో ఉంది. బహుశా ఈ హోటల్ వ్యవస్థాపకుడు అయివుండొచ్చు.

కాసేపటికి పొడుగ్గా బక్కపలచగా ఉన్న సుమారు ఇరవై అయిదేళ్ల యువకుడు స్టీలు జగ్గుతో నీళ్లతో వచ్చి టేబుల్ మీద ప్లేట్లో బోర్లించి ఉన్న గ్లాసు తీసి నీళ్లు నింపుతూ-

'ఇంత చివర్లో కూర్చున్నారేటండీ. ఎదురుగా ఖాళీగా ఉందిగా' అన్నాడు.

'ఇక్కడే బాగుంది నాకు. కిటికీ పక్కన...దీని అవతలి ప్రపంచానికి ఇవతల' చివరి వాక్యం మనసులోనే అనుకుని-'నీ పేరేమిటి?' అనడిగాను.

'పైడి తల్లండీ' చెప్పాడతను. ఉన్నిథన్ ఎక్కడికెళ్లాడో...? మానేసి ఉంటాడా! లేక ఈ రోజు డ్యూటీకి రాలేదా...?

'ఉన్నిథన్ రావడం లేదా...?'

'ఎవరూ...మధ్యలో కొన్నాళ్లు ఆగిపోయిన ఈ హోటల్‌ని కొని తిరిగి ప్రారంభించిన ఒకప్పటి ఈ హోటల్ సర్వర్ ఉన్నిథన్ గారి గురించేనా మీరడుగుతుందీ...' అని-

కౌంటర్ వెనుక కనిపిస్తోన్న ఫోటోవైపు వేలు చూపిస్తూ- 'ఆయనేనా' అన్నాడు పైడితల్లి.

కౌంటర్ మీద పడుతోన్న సూర్యాస్తమయపు ఎండ-వెనుక గోడ మీద సృష్టిస్తోన్న వెలుతురులో-ఫోటోలోంచి ఉన్నిథన్ నవ్వుతున్నాడు. ఉన్నిథన్ వెళ్లిపోయాడా? సర్వర్గా మొదలుపెట్టి ఒక్కోమెట్టూ ఎక్కి...చివరికి అన్ని మెట్లనూ రద్దుచేసి-

'ఏం చెప్పమంటారు?రవ్వదోసె, మసాల దోసె, ఊతప్పం..చపాతీ' పైడితల్లి అడుగుతున్నాడు. తలతిప్పి 'ఆ..'అని -'రవ్వదోసె' అన్నాను. పైడితల్లి వెళ్లిపోయాడు – రవ్వ, బియ్యంపిండి మధ్యలో అతి చిన్న చిన్న శూన్యాల్ని సృష్టించి ప్లేట్లో పట్టుకురావడానికి. స్టీలు గ్లాసులోని నీళ్లు తాగి నింపాదిగా ఒకసారి హోటల్నంతా పరికించి చూసాను.

టేబుళ్లు, కుర్చీలు, కిటికీలు, కౌంటర్ పాతవే అయినా ఫ్యాన్లూ, లైట్లూ, ఫ్లోరింగ్ కొత్తవి. పాతాకొత్త మేలుకలయికలా ఉంది.

ఆయనెలా వస్తాడో హోటల్కి. ఇల్లు దగ్గర్లోనే ఉన్నట్లయితే నడుచుకుంటూనా? కొంచెం దూరం అయితే స్కూటర్ మీదా? చాలా దూరం అయితే సిటీ బస్సులోనా? అసలు ఈ మధ్య వస్తున్నాడా? తప్పకుండా వస్తాడు. 'రోజూ మధ్యాహ్నమో, సాయంత్రమో అలా వచ్చి ఈ హోటల్లో కూర్చొని ఎదురుచూడడం ఇష్టం నాకు' అని హోటల్లో కూర్చునే ఆయన రాసిన ఉత్తరంలోని వాక్యం గుర్తొచ్చింది.

అయినా సరే పైడితల్లిని అడిగితే పోలా- అనిపించిందో క్షణం. 'వద్దు. దానివల్ల నా కాల్పనిక విస్తృతి యొక్క పరిధి కుంచించుకుపోయే అవకాశం ఉంది.' రవ్వదోసె తెచ్చిపెట్టాడు పైడితల్లి. శూన్యాల్ని చట్నీలో సాంబారులో నంజుకోసాగాను. తింటూనే తలెత్తి కౌంటర్ వెనుక ఉన్నిథన్ ఫోటోపక్కనున్న గుండ్రని నలుపూతెలుపుల గోడ గడియారం వైపు చూసాను. పావు తక్కువ ఆరు.

మెల్లగా హోటల్లోకి జనసంచారం పెరిగింది. ఆయన హోటల్లో అడుగుపెట్టి-అలవాటైన టేబుల్ వైపే వచ్చి-సాలోచనగా 'మీరూ...'అని నా పేరు అడుగుతాడా?

లేక అదేం పట్టించుకోనట్టుగా ఎదురు సీట్లో కూర్చొని కాఫీ ఆర్డరిచ్చి 'ఈ ఎదురుగా ఉన్నవాడు తొందరగా వెళ్లిపోతే బాగుండును. తన ఏకాంతపు ఎదురుచూపుల్లో తను మునిగిపోవచ్చు' అని అనుకుంటాడా?

ఆయన రాసిన ఉత్తరంలో ఒక వాక్యం మధ్యలోని 'ఉండడం' అనేపదంలో చివరిదైన సున్నా అనే అక్షరాన్ని గమ్మత్తుగా...ఒక వైపుకి వంచి ఆయన రాసిన తీరుని చూస్తే-

ఆయన శరీరం చుట్టూ ఉన్న కాంతి వలయంతో నిస్సంకోచంగా కరచాలనం చేయవచ్చనిపిస్తుంది.

పొద్దునెప్పుడో బయటికి వెళ్లి తిరిగి చీకటి పడేవేళకి పొగమంచులోంచి తిరిగి వస్తోన్న మనిషికోసం- హిల్స్టేషన్ మీది రాత్రిగదిలో బ్యాగ్లో ఒంటరిగా ఎదురుచూస్తోన్న పొడవాటి సీసాలోని ద్రాక్షతోటల దారులు కన్నకలల గురించీ,

మూడోరోజు ముసురులో కూడా చీకటి కిటికీ పక్కనే ఏకాంతంగా కూర్చొని- వెనక్కి వెళ్లిపోయిన స్కూల్ గోడల నీడల గురించీ, ఉద్విగ్న సౌందర్యపు క్షణాల కారణాల గురించీ, రక్తంలో పూలు పూయించిన పొడవాటి రాత్రుల్ని తల్చుకున్నపుడు పుట్టిన దిగులు గురించీ, హఠాత్తుగా క్షణకాలంలో అనుభవంలోకి వచ్చిపోయిన'ఉనికి'తాలూకు స్పృహ మిగిల్చిపోయిన కొన్నిరోజుల నిశ్శబ్దాన్ని గురించీ,



మండుతోన్న ఒక మే నెల మధ్యాహ్నపు ఎండలో ఆటోదిగి పరుగెత్తుకుంటూ రైల్వేప్లాట్ఫాం చేరుకుని-కదులుతోన్న ప్యాసింజర్ రైలుని అతికష్టంమీద అందుకుని-క్రిక్కిరిసిన జనంలో డోర్ దగ్గరే వేడి నిట్టూర్పుల ప్రయాణం కొనసాగిస్తున్నపుడు- బయట వడగాడ్పుల వెండిఎండలో-గంట తరువాత బీడు భూములకవతల పొలం గట్టుపైన కనిపించిన చింతచెట్టునీడ కళ్లకు కలిగించిన ఆహ్లాదాన్ని- మిగిలిన ప్రయాణమంతా 'నా నీడపట్టున హాయిగా సేద తీరుతూ ఈ ఋతువునంతా గడిపేయక ఎందుకు మీ అందరికీ ఈ ఎండాకాలపు ప్రయాణాలు, ఇనుప వడగాడ్పులు' అని రాత్రెప్పుడో రైల్లో నిద్రపోయేంత వరకూ వెంటాడిన ఏ చింతా లేని ఆ చింత చెట్టు జ్ఞాపకాన్ని గురించీ-

ఇలా అనేకం ఆయన్తో పంచుకోవచ్చనిపిస్తుంది.

పైడితల్లి నీడ ట్యూబ్లైట్ వెలుతురుని అడ్డగించి నా మీద పడింది. తలపైకెత్తి 'టీ చెప్పు' అన్నాను. టేబుల్ క్లీన్ చేసేవాడిని కేకేస్తూ అతడు వెళ్లిపోయాడు. కిటికీలోంచి మళ్లీ చల్లగాలి. బయట ప్రపంచంలో కూడా దీపాలు వెలిగాయి. వీధిలో జనసంచారం పెరిగింది.

ఒక వీధి దీపం కింద రాజస్తానీ ఛాట్భండార్ చక్రాల బండి ముందు జనం గప్చుప్లూ, కట్లేసులూ అప్పుడే చుట్టుముడుతోన్న చలితో కలిపి నములుతున్నారు. బస్టాపు ముందున్న రోడ్డుకవతల కళ్లు జిగేల్మనిపించే దీపకాంతులతో షాపింగ్మాల్ ఒకటి మనుష్యుల కొనుగోలుశక్తి వైపు చూపులు సారించి నిలబడి ఉంది.

ఇంకో వీధి దీపం కింద కళ్లు లేని కబోది ఒకడు బొచ్చెను శబ్దం చేయిస్తూ అడుక్కుంటున్నాడు. కిటికీ పక్కనే ఉన్న రోడ్డుకవతలి గోడ మలుపులో చీకటిగా ఉన్నచోట పాదచారి ఒకడు ఆగి సినిమాపోస్టరు మీద ఉచ్చ పోస్తున్నాడు.

ఒక వృద్ధుడు పెంపుడుకుక్కతో ఈవెనింగ్ వాక్ చేస్తూ కిటికీ దాటుతున్నాడు. ఆయన ఇంటినుండి బయలుదేరి ఉంటాడా? దార్లో ఉండి ఉంటాడా? లేక బయటికెళ్లే కార్యక్రమాలన్నీ రద్దుచేసుకుని ఇంట్లో క్రాస్వర్డ్ పజిల్స్ నింపుతూ కాలక్షేపం చేస్తూ ఉండి ఉంటాడా?

ముఖద్వారం వైపు చూసాను. ఎవరో బిల్ పే చేసి బయటికి వెళ్తున్నారు. కౌంటర్ వెనుక ఫోటో మీదికి మళ్లీ నా దృష్టి మరలింది. ఉన్నిథన్ నవ్వుతున్నాడు కౌంటర్ మీది రేడియోలోంచి సాయంకాలపు వార్తలు వింటూ.

ఒకవేళ ఆయన ఈరోజు హోటల్లో కలవకపోతే ఏం చేయాలి? రేపు కూడా వచ్చి వెయిట్ చేసి చూడాలా? లేక తెల్లవారుఝామునే ఊరికి బయలుదేరే బస్సులో తిరిగి వెనక్కి వెళ్లిపోవాలా? అసలెందుకు రావడం- ఎందుకు పోవడం?

అయితే...ఇలా రావడం వల్లే కదా...చింతపల్లి సంతలోని వృద్ధుని కల కనగలిగింది. తిరిగి వెనక్కి వెళ్తున్నపుడు మళ్లీ ఏ కల వస్తుందో?

ఊరికి చేరుకుని-మర్నాడు తిరిగి ఆఫీసుకి అటెండయ్యి-సాయంత్రం ఏకాంతంగా

**పైడితల్లిని అడిగితే పోలా-అనిపించిందో క్షణం. 'వద్దు. దానివల్ల నా కాల్పనిక విస్తృతి యొక్క పరిధి కుంచించుకుపోయే అవకాశం ఉంది.' రవ్వదోసె తెచ్చిపెట్టాడు పైడితల్లి. శూన్యాల్ని చట్నీలో సాంబారులో నంజుకోసాగాను. తింటూనే తలెత్తి కౌంటర్ వెనుక ఉన్నిథన్ ఫోటోపక్కనున్న గుండ్రని నలుపూతెలుపుల గోడ గడియారం వైపు చూసాను.**

పార్క్‌కి చేరుకుని–

ఆ రెండు కలల్ని కలిపి వాటిలో అంతః సూత్రం ఏదైనా కనిపిస్తుందేమోనని వెదికి–దొరికితే ఆ ప్రయత్నానికి సంబరపడి–దొరక్క పోతే ఆ వ్యర్థ ప్రయత్నానికి నాలో నేనే నవ్వుకుని... టీ తెచ్చి టేబుల్‌మీద పెట్టాడు పైడి తల్లి. చేతిలోకి తీసుకుని గ్లాసుని పైకి లేపాను. తేయాకు–ద్రవ రూపపు పెదవుల్తో వెచ్చగా ముద్దుపెట్టుకుంది.

తాగడం పూర్తి చేసి గోడ గడియారం వైపు చూసాను. ఏడున్నర అవుతోంది–ఉన్నిథన్ నవ్వుకి పక్కన.

కిటికీలోంచి బయటికి చూసాను. పల్చటి పొగమంచు బస్‌స్టాప్‌ని కమ్ముకుంటోంది.

వీధి దీపం చుట్టూ చేరిన పురుగులు 'అడుగుతుంటే చెప్పవేం..మా ఉనికికి అర్థమేవిటి?' అని దీపాన్ని నిలదీసి అడుగుతున్నాయి–అంతలోనే ఒకటీ రెండు ఇసుకలా రాలిపోతూ.

ఛాట్‌భండార్ విజయవంతంగా ఆడుతోంది. బస్టాపులో ఎవరో ఆటో ఎక్కుతున్నారు.

ఎవరైనా ఆటో దిగితే బాగుండు–ఆయనేమోనని గుమ్మం వైపు ఎదురుచూపులు నిలిపేవాడిని కాసేపు. చూపుల్ని కిటికీలోంచి లోపలికి తిప్పి చుట్టూ ఉన్న ప్రపంచంవైపు చూసాను. ఎవరి ప్రపంచంలో వారున్నారు.

నా ప్రపంచంలో నేనుండిపోయి గమనించలేదు కానీ–నా చుట్టూ ఉన్న టేబుళ్ల దగ్గర జనం కూర్చొని చాలాసేపటి నుండీ టిఫిన్లు చేస్తూ కాఫీ,టీలు తాగుతూ గట్టిగానే మాట్లాడుకుంటున్నారు. ఒక్కసారిగా వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లయింది. జస్ట్ ఫర్ ఎ ఛేంజ్ అన్నట్లుగా ఆయనొచ్చేవరకూ కాలక్షేపం కోసం వాళ్ల సంభాషణల్ని వినడానికి ప్రయత్నించాను. నా టేబుల్ వెనుక కూర్చున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకాయన ఏదో ఆఫీసులో డిపార్ట్‌మెంట్ హెడ్‌లా ఉన్నాడు.

ఆ ఆఫీసు మొత్తం నడవడానికి తనొక్కడే కారణమైనట్లు, మిగతా స్టాఫంతా పనిదొంగలూ సోమరిపోతులూ అయినట్లు ఊతప్పం తింటూ పక్కవాడితో ఊదరగొడుతున్నాడు.

నా టేబుల్‌కి కుడిపక్క ఇద్దరు యువకులు చపాతీ తింటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్లలో కూడా ఒకడే మాట్లాడుతుంటే మరో యువకుడు వింటున్నాడు. మాట్లాడుతోన్న యువకుడి మాటల్ని బట్టి అతడు కొత్తగా ప్రేమలో పడ్డట్టు తెలుస్తోంది.

నా చెవులకి వినిపించినంత మేర ఆ టేబుల్ మీది వ్యక్తీ, ఈ టేబుల్ మీది యువకుడూ మాట్లాడుకుంటున్న మాటల్ని వినసాగాను.

ఇలా జనం మధ్యలో ఉన్నప్పుడు వాళ్లు మాట్లాడుకునే మాటల్లోని విషయాలకన్నా–వాళ్ల మాటల్లోంచి ఎంత తరుచుగా 'నేను' అనే పదం వ్యక్తమవుతుందో గమనించడం పట్ల ఆసక్తి ఎక్కువ నాకు. అదొక గేమ్‌లా ఉంటుంది. ఆ టేబుల్ మీదినుండీ, ఈ టేబుల్ మీదినుండీ వెంటవెంటనే దూకుతోన్న 'నేను' అనే పదం యొక్క వేగాన్ని

**ఉన్నిథన్ చివరిశ్వాస ఎక్కడ తీసుకొని ఉంటాడు? ఈ ఊళ్లోనా? కేరళలోనా? అతడి తలలోని చివరి స్మృతి ఏమై ఉంటుంది? అతడి పెదవుల మీది ఆఖరిపదం ఏమిటో...?**

**ఉన్నిథన్ చివరిశ్వాసతో..ఉన్నిథనే కాదు భూమ్మీది ఏ జీవి చివరి శ్వాసతోనైనా విశ్వంలోని ఏ ఇతర కదలికకైనా సంబంధం ఉండి ఉంటుందా? ఎవరు చెబుతారు?**

ఆస్వాదిస్తూ కాసేపు అలా ఉండిపోయాను.

ఉన్నట్టుండి డిపార్ట్‌మెంట్ హెడ్ స్వరం పెంచి 'నేను గనక లేకపోతే..' అనగానే వెంటనే –ఇట్నుండి ప్రేమలో పడ్డ యువకుడి నోట్లోంచి 'ఆ ఆనందమే వేరు' అన్న వాక్యం చటుక్కున వినిపించింది.

మెరుపువేగంతో అసంకల్పితంగా సంభవించిన ఆ చమత్కారానికి ఫక్కున నవ్వొచ్చింది నాకు. వాళ్లెవరైనా ఈ విషయాన్ని గమనించి ఉంటారా అనుకుని రెండు టేబుళ్ల వైపూ చూసాను. హోటల్లోని రణగొణధ్వని వల్ల వాళ్లు ఈ చమత్కారాన్ని గమనించినట్లు లేరు. దీనికి 'లాఫింగ్ ఫిలాసఫీ' అని పేరు పెడితే ఎలా ఉంటుందీ అనిపించింది. తెలుగులో అయితే–చమత్కార వేదాంతం. కిటికీలోంచి చల్లగాలి ఈసారి బలంగా వీచింది. బయటంతా పొగమంచు.

వస్తువుల్లోంచి..మనుషుల్లోంచి...వాళ్ల మాటల్లోంచి...వాళ్ల మధ్యన ఖాళీల్లోంచి...

ఆయన పొగమంచుకి అవతల ఉన్నాడా? నిజానికి పొగమంచు మధ్యలోనే ఉండి ఉంటాడు ఎక్కడున్నా. కాని దానికి అవతల ఉన్నాడేమో అనుకోవడంలోనే మరొక టీగ్లాసులోని గుండ్రని వేడికి సార్థకత..ఇంకో టీ చెప్పాను. బిజీగా ఉన్నట్లున్నాడు–చాలాసేపటి తర్వాత తెచ్చిచ్చాడు పైడితల్లి.

టీ తాగుతుంటే చూపులు మళ్లీ ఉన్నిథన్ ఫోటో మీదికి వెళ్లాయి. ఉన్నిథన్ చివరిశ్వాస ఎక్కడ తీసుకొని ఉంటాడు? ఈ ఊళ్లోనా? కేరళలోనా? అతడి తలలోని చివరిస్మృతి ఏమై ఉంటుంది? అతడి పెదవుల మీది ఆఖరిపదం ఏమిటో...?

ఉన్నిథన్ చివరిశ్వాసతో..ఉన్నిథనే కాదు భూమ్మీది ఏ జీవి చివరిశ్వాసతోనైనా విశ్వంలోని ఏ ఇతర కదలికకైనా సంబంధం ఉండి ఉంటుందా? ఎవరు చెబుతారు?

ఆయనొస్తే బాగుండు. ఇవన్నీ మాట్లాడుకోవచ్చు. టైం చూసాను. చూస్తూ చూస్తూనే దాదాపు తొమ్మిదయిపోయింది. హోటల్ మూసేయడానికి ఇంకా గంట టైం ఉంది.

ఏదడిగినా అడక్కపోయినా ఆయన్ని తప్పకుండా అడగాలనుకున్న ఆ ఒకే ఒక్క ప్రశ్న గుర్తొచ్చింది. వెంటనే పెదవుల మీదికి నవ్వొచ్చి వాలింది. ఇక దాని అవసరం లేదు.

కుర్చీలోంచి లేస్తూ పైడితల్లి కోసం చుట్టూ చూసాను. అతను కనిపించలేదు. ఎవరికిచిన్న చిన్న శూన్యాల్ని సృష్టించి ప్లేట్లో పెట్టుకుని తేవడానికి లోపలికి వెళ్లాడో?

సాయంత్రం నుండి అప్పటిదాకా కూర్చున్న టేబుల్ దగ్గర్నుండి కదిలి కౌంటర్ దగ్గరికెళ్లి బిల్ పే చేసి మిగిలిన చిల్లర పైడితల్లికి ఇవ్వమని చెప్పాను.

ఉన్నిథన్ ఫోటోని దగ్గర్నుండి చూడాలనిపించింది. అతడు ఇంకా నవ్వుతూనే ఉన్నాడు.

కౌంటర్ మీది రేడియోలోంచి వాతావరణ వివరాలు ప్రసారమవుతున్నాయి. 'రాగల ఇరవై నాలుగ్గంటల్లో...'అని వినిపించగానే



తలెత్తి క్యాష్‌కౌంటర్లో కూర్చున్న వ్యక్తికేసి చూసి– 'రాగల ఇరవై నాలుగ్గంటల్లో ఏ క్షణమైనా పోగలం.. ఈ అద్భుత వాస్తవాన్ని మొదట బలంగా తెలుసుకున్న మనిషి కళ్లలోంచి కారిన కన్నీరే–ఇప్పటివరకూ ఈ భూమ్మీద అత్యధిక వర్షపాతంగా నమోదైంది..అని రేడియో వాతావరణ విశేషాల్లోనైనా ఒక్కసారి కూడా చెప్పరేవండీ?' అని అనాలనుకున్నాను.

కానీ బయట ఆకాశం కింద ఒక అనంతమైన కాల్పనిక వేడుక నాకోసం ఎదురుచూస్తూ ఉంటే–

మాటల్తో కాలాన్నెందుకు వృథా చేయడం అనుకుని–హోటల్లోంచి బయటకొచ్చేసాను.

(**24.05.2014**న ప్రఖ్యాత తెలుగు రచయిత 'త్రిపుర' ప్రథమ వర్ధంతి)

– రచయిత సెల్ : **93993 28997**

# కొత్తపుస్తకాలు

## నిర్వికల్ప చిత్ర సంగీతం

మూడు దశాబ్దాల క్రితం నిర్వికల్ప సంగీతం వినిపించిన వాడ్రేవు చిన వీరభద్రుడు ఒంటరి చేల మీదుగా పునర్యానం పొంది కోకిల ప్రవేశించే కాలంలో మనకు 'నీటిరంగుల చిత్రం' అందించారు. జీవితాన్ని కవిత్వంతో మమేకం చేయడం లేదా కవిత్వమే జీవితం కావడం మనకు భద్రుడి కవిత్వంలో కనిపిస్తుంది. 'ఇంధనం అగ్నిగా మారినట్టు, ప్రతి రోజూ ఒక పద్యంగా మారాలని ప్రార్థిస్తున్నాను' అంటారు. మనిషి పుట్టుక, ఎదుగుదల, జీవన ప్రస్థానం, మరణం వీటన్నిటితో పాటు... సమాజంతో సాగించే అనుబంధం భద్రుడు కవితా నేపథ్యంలో కనిపిస్తాయి. అలా అని, నేల విడిచి సాముచేసే రకం కాదు. 'ఏప్రిల్ రోజుల దారులంతటా రాలిన దిరిసెన పూలలో/ ప్రాచీన భూమ్యాకాశాల విస్మృతరహస్యాలు, అవి నీ కంఠాన్ని/ పెనవేసుకోగానే మీ నాన్న ఒంటి చెమట, మీ అమ్మ మజ్జిగ/ చిలికేటప్పటి వెన్న వాసన నిన్ను గుప్పున కమ్ముకుంటాయి' అని అలౌకిక అనుభవాన్ని వాస్తవ అనుబంధానికి ముడిపెడతారు.

అద్భుతమైన చిత్రాలు గీచే భద్రుడు కవిగా ప్రకృతిలో తనను తాను మమేకం చేసుకుంటారు. 'నేనింకా చిగురించకుండా వసంతం/ వసంతం కాజాలదని నాకు అర్థమయ్యింది' అనీ, 'ఈ ప్రపంచమొక పుష్పంగా మారాలంటే/నేనొక తుమ్మెదగా మళ్ళీ పుట్టక తప్పదు' అనీ అనడంలో ఆ మమేకత స్పష్టమవుతుంది. మామూలుగానే చాలామందికి ప్రకృతి పలికే ఆహ్వానాలు అందవు. కానీ, కవికి అందకుండా ఎలా ఉంటాయి. అయితే అనువుకాని వేళ– అంటే ఆఫీసులో హడావుడిగా పనిచేసుకుంటున్నప్పుడు ఎక్కడి నుంచో ఓ కోకిల స్వరం వినిపించినా ఆ ఆహ్వానాన్ని మన్నించలేం కదా! చిన్నప్పుడు పిల్లలు పిలువలేదు, యవ్వనంలో యువతులు వెంటపడలేదు... 'జీవితం సగం గడిచిపోయింది. ఇప్పుడెందుకమ్మా/కోకిలమ్మా నన్నొక తల్లిని చేసి మైమరపిస్తావు?' అని వాపోతారు.




182 కవితలున్న ఈ సంకలనంలో ఎక్కడా ఒక్క కఠిన పదం లేదు. పలు క్లిష్టమైన సందర్భాల్లో సైతం భద్రుడు సుతిమెత్తగానే స్పందించారు. 'ఆడుకునే పిల్లలు అలవోకగా పేనే రంగుదారపు వల'లా కవిత్వాన్ని పాఠకుల మీదకు వదిలారు.

– దేరా

**నీటిరంగుల చిత్రం**, వాడ్రేవు చినవీరభద్రుడు
పేజీలు : 232, వెల : రూ. 150
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్.

## స్వీకారం

**ఓటరన్న శతకం**
రచన: డా. కోయి కోటేశ్వరరావు
పేజీలు : 40, వెల: రూ. 30
ప్రతులకు : 94404 80274

★★★

**కృష్ణాతీరం**
రచన : కంచల జయరాజ్
పేజీలు : 196, వెల: రూ.130
ప్రతులకు : 98489 92299

★★★

**ముజఫర్‌నగర్ మారణకాండ**
నిషిద్ధ మేఘాల్లోకి మా యాత్ర
రచన : అనిశెట్టి రజిత, భండారు విజయ
పేజీలు : 64, వెల : రూ.50

**ఆకాశపుష్పం**
అపూర్వ త్యాగానికి నీరాజనం
పేజీలు : 42, వెల : రూ.50
ప్రతులకు : 88019 10908

★★★

**కర్ణ మహాభారతం**
రచన : శ్రీ శార్వరి
పేజీలు : 272, వెల : రూ.200
ప్రతులకు : 81793 21129

## చిరస్మరణీయ శిలా గానం

ఇది తిరుమలలో రాతి బండపై స్వరసహితంగా దొరికిన అతి ప్రాచీన వాగ్గేయ రచన. ప్రముఖ పత్రికా రచయిత నండూరి పార్థసారథి ఆధ్వర్యంలో ఆచార్య వేటూరి ఆనందమూర్తి సహాయ సహకారాలతో పదకవితా పితామహ తాళ్లపాక అన్నమాచార్య రాసిన ఈ ప్రాచీన సాహిత్యాన్ని సేకరించి, స్వరాలు కూర్చి, అందించిన గీతం ఇది. ఈ శిలా గీతాన్ని సత్తిరాజు వేణుమాధవ్ అత్యద్భుతంగా, అత్యంత మార్దవంగా గానం చేశారు. అన్నమయ్య కీర్తనకు స్వరాలు కూర్చి, సంగతులతో గానం చేయడం ఇదే ప్రథమం.




ఈ గానం కలిగించిన ఆసక్తి కంటే దీని వెనుక ఉన్న చరిత్ర మరింత ఆసక్తి కలిగిస్తుంది. తిరుమల కొండ మీద సుమారు 500 ఏళ్ల క్రితం ఓ పెద్ద రాయి మీద చెక్కిన ఈ 'అన్నమయ్య దశావతార సూళాది' సంస్కృత రచన దేశంలోనే ఇప్పటివరకు స్వర సాహిత్యంలో లభించిన అతి ప్రాచీన గీతంగా గుర్తింపు పొందింది. అన్నమయ్య కాలంలోని మాళవగౌళ రాగంలో ఉన్న ఈ గీతాన్ని 1949లో కనుగొని, అరవై అయిదేళ్ల తరువాత ఇప్పుడు మొదటిసారిగా సీడీలోకి తీసుకురావడం జరిగింది. ఒకప్పుడు తాళ్లపాక వారి కాలంలో మాత్రమే పాడుతూ ఉన్న 'సూళాది ప్రబంధం' ప్రక్రియకు చెందిన రచన ఇది. ఇప్పుడు ఈ ప్రక్రియ అంతరించిపోయింది.

ఈ దశావతార సూళాది రచనలో ఒక్కొక్క అవతారానికి ఒక్కొక్క పాట చొప్పున పది పాటలున్నాయి. అన్నీ ఒకే రాగంలో ఉండే ఈ పాటలకు తాళాలు మాత్రం వేరు. తిరుమలలో రాతి బండల మీద ఈ పాటలు, మరికొన్ని అసంపూర్ణ రచనలు కనిపించాయి. ఇవి అజ్ఞాతంగా పడి ఉన్నాయి. వీటిని మొదటిసారిగా చూసిన పరిశోధకులు వేటూరి ప్రభాకర శాస్త్రిగారు వీటిని పరిశీలించి, పరిష్కరించాలని ప్రయత్నించారు కానీ, ఈలోగా దివంగతులవడంతో ఆ ప్రయత్నం మూలపడింది. అరవై ఏళ్ల తరువాత వేటూరి ఆనంద మూర్తి సహాయంతో ఇది మళ్లీ వెలుగులోకి వచ్చింది. ఈ గేయ రచన ఇతర అన్నమాచార్య కీర్తనల మాదిరిగానే వినసొంపుగా ఉన్నాయి. ఇటువంటి సీడీని వెలువరించిన నండూరి పార్థసారథి అన్నమయ్య అభిమానుల మనసుల్లో చిరస్థాయిగా ఉండిపోతారనడంలో సందేహం లేదు.

– జి. రాజశుక

**తిరుమల శిలాగీతం** (సాంగ్ ఆన్ ఎ స్టోన్ – సీడీ)
సమర్పణ : నండూరి రికార్డ్స్, ప్రభాకర స్మారక ట్రస్ట్ (తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో)
వెల : రూ. 200, కాపీలకు: 9959734534, 09742486122

# ❖ మిక్స్చర్ పొట్లం

బొమ్మలు: ఎస్.రాజశేఖర్ రెడ్డి

## ఏ పుట్టలో ఏ పాముందో?



‘‘అదేంట్రా ... తిరుపతి వెళ్లి గుండు మాత్రమే గీయించుకున్నావు? పనిలో పనిగా గడ్డం, మీసాలు కూడా తీయించుకోలేకపోయావా ?’’ అడిగాడు వీరబాబు.

‘‘వెంకన్న బాబుకి తల నీలాలు మాత్రమే ముడుపు కట్టాను. గడ్డం సింహాచలం అప్పన్నకి, మీసాలు శ్రీశైలం మల్లన్నకీ మొక్కుకున్నా మరి’’ చెప్పాడు బుచ్చిబాబు.

## అంతేకదండీ!



‘‘అతిసార వ్యాధి అంటే ఏమిట్రా?’’ అడిగాడు టీచర్.

‘‘అతిగా సారా తాగితే వచ్చే జబ్బండి’’ ఠపీమని బదులిచ్చాడు చింటూ.

– కె. జయన్న , రాజోలి, అలంపూర్

## వెంటాడే జబ్బు



‘‘అమ్మా ... మనం చూసిన అమ్మాయి నాకు వద్దే. వాళ్ల చెల్లెల్ని చేసుకుంటాను’’ తల్లి కొంగు పట్టుకుని బతిమాలాడు చంటబ్బాయి.

‘‘సరేలే, వెధవ బుద్ధులెక్కడి పోతాయ్ .. మీ నాన్న కూడా అంతే. మా అక్కని చూడ్డానికి వచ్చి నన్ను చేసుకున్నాడు మరి’’ చిర్రుమంది అమ్మ.

## పాడు బుద్ధి



‘‘ఏమండీ, రాజారావు అప్పు ఇచ్చాడా?’’

‘‘లేదు, అప్పు ఇవ్వడానికి తెగ ఇబ్బంది పెడుతున్నాడు. అప్పు వచ్చే వరకు ఓపిక పడదాం. ఆ తర్వాత నా దగ్గరనుండి ఎలా తిరిగి వసూలు చేసుకుంటాడో చూస్తాను ... వాడి జేజమ్మ దిగిరావాలి’’

## తిక్కమాలోకం



‘‘నీ కొచ్చిన జబ్బు ఏంటని అంతలా గొంతు చించుకునిఅడుగుతున్నా ... కిక్కురుమనవేం?’’ బల్లగుద్ది కోపంగా అరిచాడు డాక్టర్.

‘‘మీ వెనక ‘నిశ్శబ్దం పాటించండి’ అని బోర్డు ఉంది కదండీ ... అందుకే ...’’ నీళ్లు నములుతూ చెప్పాడు పేషెంటు.

– సి.హెచ్. శ్రీనివాసరావు, విజయవాడ.

## ఎవరి గోల వారిదే



తన ఇద్దరు కూతుళ్లతో రైలు ప్రయాణం చేస్తోంది ఆండాళ్లమ్మ. మధ్యలో ఒకసారి –

‘‘అమ్మా ... ఇందాక వెళ్లిన స్టేషను పేరేంటి?’’ అడిగింది పదేళ్ల శృతి.

‘‘అబ్బబ్బా ... నన్ను డిస్టర్బ్ చేయకన్నానా? చెల్లి చూడు, ఎంత బుద్ధిగా ఉందో’’ తల ఎత్తకుండా సీరియస్‌గా వీక్లీ సీరియల్ చదువుతూ కసిరింది నాంచారమ్మ.

‘‘చెల్లి లేదమ్మా ... చెల్లి ఇందాక ఆగిన స్టేషన్లో దిగిపోయింది. అందుకే అడిగా’’ చెప్పింది శృతి.

## తొందరేముంది జానూ



భర్త చేత తాగుడు మానిపించాలని తెగ ప్రయత్నిస్తోంది జానకి. అందులో భాగంగా –

‘‘ఏమండీ ... తాగడం వలన కలిగే నష్టాల గురించి ఈ మధ్య టీవీల్లో డాక్టర్లు చెబుతున్నారు. అదొక విషం అట. నెమ్మది నెమ్మదిగా మృత్యువు దగ్గరకు తీసుకెళ్తుందట’’ అని చెప్పింది.

‘‘చావుకు తొందరెందుకు జానకీ ... నెమ్మదిగానే రానీలే ... ’’ మందు గుటకేస్తూ తాపీగా బదులిచ్చాడు సూరిబాబు.

భళా ‘చిత్రం’



# వెండితెర బంగారం - 52



## 'నీ సరి విలాసులు జగాన లేనె లేరుగా'

మన్మథుడు చిన్నబోయే అసమాన రూప విలాసంతో, శృంగారం ఒలికిస్తూ అర్జునుడి వేషంలో కనిపిస్తున్న ఈ ఎన్.టి.రామారావు స్టిల్ 'బభ్రువాహన' (1964) చిత్రంలోది.

హేమాహేమీల్లాంటి నటులు, వీనుల విందైన సంగీతం ఉన్నా .. కథాబలం లేకపోతే చిత్రం పరాజయం తప్పదని నిరూపించిన చిత్రం ఇది. ఈ చిత్రానికి సీ.సముద్రాల పాటలు, మాటలు రాయడంతో పాటు దర్శకత్వం కూడా వహించారు. 'బభ్రువాహన' కథను వెండితెరకు అనువదించడంలో ఆయన జైమినీ భారతాన్ని అలక్ష్యం చేసి, విజయవిలాసాన్ని అనుసరించడం వల్లే ఆకట్టుకోలేక పోయిందన్నారు. ఇదే కథను విశ్వకవి రవీంద్రుడు 'చిత్రాంగద' గా రచించి కీర్తి సంపాదించారు.

రాజసులోచన ఉలూచి పాత్రలో ఎంత బాగా నటించినా ఆమె అంతకుముందు ధరించిన 'వాంప్' పాత్రల కారణంగా ప్రేక్షకుల మెప్పు పొందలేకపోయారు. ఇక చలం టైటిల్ రోల్ పోషించినా అతనికిగల హాస్యనటుని ఇమేజ్ కారణంగా నిరాదరణకు గురయ్యారు.

1963లో వచ్చిన 'నర్తనశాల'లో ఎన్.టి.రామారావు బృహన్నలగా నటించినా బ్రహ్మరథం పట్టిన ప్రేక్షకులు ఈ చిత్రంలో వీరశృంగార పురుషుడిగా 'తెర'విందు చేసినా తిప్పికొట్టారంటే – కారణం స్క్రిప్టులో దమ్ము లేకపోవడమే.

విశేషం ఏమంటే, 'బభ్రువాహన' చిత్రం హైదరాబాద్, సుదర్శన్ 35 ఎం.ఎం.లో పునః విడుదల (1978) సందర్భంగా వంద రోజులు ప్రదర్శించబడటం. మొదట్లో పరాజయం పాలై, 30 ఏళ్ల తర్వాత విడుదలై విజయం సాధించిన చిత్రాల్లో ఎన్.టి.రామారావు నటించిన 'కన్యాశుల్కం' కూడా ఉండటం మరో విచిత్రం.

---

నిర్వహణ : డా. కంపల్లె రవిచంద్రన్, 98487 20478

# పూరణం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | ■ | 4 | | 5 | 6 |
| 7 | | ■ | 8 | 9 | | ■ | 10 | |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | |
| 11 | 12 | ■ | 13 | | 14 | ■ | 15 | |
| ■ | 16 | | | ■ | 17 | | | ■ |
| 18 | | ■ | 19 | 20 | | ■ | 21 | 22 |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | |
| 23 | 24 | ■ | 25 | | 26 | ■ | 27 | |
| 28 | | | | ■ | 29 | | | |

## అడ్డం

1. ధరతో మొదలైన కౌసల్య కోడలు (4)
4. బారంగా అంతమైన దౌత్యం (4)
7. మసి కాదు, రాలిన పొట్టు (2)
8. 'ఈ వనంలో తులసి మొక్క'ని సామెత (3)
10. జుట్టు; 'నీ -- దరగా' అని నానుడి (2)
11. సంతతిలో తెలుగు 'మార్కెట్' (2)
13. జ్యోతిష్యం చెప్పేది (3)
15. '-- వచ్చే ఎలుకా భద్రం!' (2)
16. 'మ' ద్వయంగా ప్రేమ (3)
17. అడుగులు తడబడ్డ అబల (3)
18. రాజకీయ నాయకులు చల్లుకునేది – సంస్కృతంలో (2)
19. మరాళిలా ధ్వనించిన స్వరం (3)
21. రవిగాంచనిది గాంచినా సరే, ఇతగాడికి అద్దె ఇల్లు దొరకడం గగనం (2)
23. చారుశీలలో సగం మిగిలింది (2)
25. హిట్లర్‌కు ఎప్పటికీ ఉండే పేరు (3)
27. అనిరుద్ధుడ్ని వలచిన బాణాసుర పుత్రి; ఈమె పరిణయం యక్షగానంగా బహు ప్రసిద్ధి (2)
28. ఒక పిట్ట – గగనంలోంచే నీటిలోని చేపను చూడగల స్ఫూర్తిరూపి (4)
29. తప్పు చేసినవారు ఇది కోరడంలో తప్పేముంది? (4)

## నిలువు

1. సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించగానే వచ్చే నెల (4)
2. కురుపు పగిలి కారేది (2)
3. బీగం కాదు లోకం (2)
4. '-- నైనా కాకపోతిని రామ పాదము సోకగా' ఆరుద్ర పాట (2)
5. తుది లేని బాసికం (2)
6. సంక్రాంతి సందర్భంలో ఆడవాళ్ల మధ్య జరిగే పోటీ – ఏకవచనం (4)
9. మాతగా అవతరించిన దశమగ్రహం (3)
12. కమతం కాదు ... మోహం (3)
13. తిరణాల (3)
14. కప్పుకునేది – గొంగళి తమ్ముడు (3)
15. ఒకప్పుడు పంతుళ్ల తలపై విధిగా ఉండేది – మొక్కలకూ వేస్తుంది (3)
18. బుద్ధుడు బోధించిన సూత్రాలు (4)
20. మొదల్లేని కువలయం (3)
22. రావణ వధకు కావలసిన ఉప్పందించినవాడు – చివర సరవరించాలి (4)
24. రాజకీయాల్లో రాజ్యమేలే గజ్జి – కిందనుండి (2)
25. తల తెగిన ఉనికి (2)
26. ఈ శిల బౌద్ధ కాలపు విశ్వవిద్యాలయంగా ప్రసిద్ధి (2)
27. కారం కరువైన మేలు (2)

### గత వారం జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ది | 2 రి | సె | 3 న | ■ | 4 తె | ర | 5 చా | 6 ప |
| 7 వం | క | ■ | 8 రా | 9 మ | ప్ప | ■ | 10 క | ర్ణ |
| గ | ■ | ■ | ■ | రా | ■ | ■ | ■ | శా |
| 11 త | 12 రి | ■ | 13 క | ళం | 14 కం | ■ | 15 జి | ల |
| ■ | 16 కొ | రి | వి | ■ | 17 కా | ను | గు | ■ |
| 18 ప్రి | యా | ■ | 19 దే | 20 వ | ళం | ■ | 21 రు | 22 మ |
| యం | ■ | ■ | ■ | ది | ■ | ■ | ■ | ల |
| 23 వ | 24 ధ | ■ | 25 మీ | నా | 26 క్షి | ■ | 27 మా | యా |
| 28 ద | ర | హా | సం | ■ | 29 ప | రి | మ | ళం |

నిర్వహణ : గొరుసు



# నానా విధ నివేదన

గడ్డకట్టిన సౌందర్యాన్ని
ముద్దులొలికే మూటలుగా
కాంతి పుంజాల పొట్లాలుగా వేరు చేసి
చుట్టూ వెదజల్లాలని కాంక్షగా వుంటుంది
బ్రతుకు ఒక్కటే అయినా
బహుముఖంగా బహుళ వర్ణంగా
బహువిధ చిత్ర సంకలిత పటంగా
విస్తరించాలని ఆరాటంగా ఉంటుంది
ఒకే బిందువులో ఇమిడిపోయి
ఏకాకార ఏక స్వరూప ఏక వైఖరి నిండిన
గూడులో బందీ అవటం నుంచి తప్పించుకుని

రెక్కలు విప్పుకుని పైకెగుర్తూ
వివిధ రకాల విశిష్ట విన్యాసాలు చేయాలని
మనసులో మహచెడ్డ కోరికగా ఉంటుంది

సూర్యోదయమూ సాయం సంధ్యా చంద్రాతపమూ
అన్నీ మనోవీధిలో మరువాల జల్లుల్నే కురుస్తాయి
సున్నితంగా హృదయపు గదుల్ని తెరుస్తాయి
పిల్లకాలువా చల్లని వాగూ పరవళ్లు తొక్కే పర్వత ధునీ
అన్నీ అంతరంగాన్ని ఓజోవంతమే చేస్తాయి
ఆశ్చర్యానంద తరంగాల్నే వీస్తాయి

గణాలతో సాగే గమనమూ
నియమ రహిత నిస్తుల చలనమూ
ఇతివృత్తాల కల్పనా పరిపాకమూ
నిరామయ నిర్వికార పరామర్శనమూ
ఆషామాషీ కాని భాషా బదలాయింపూ
అన్నీ ఆకర్షణీయంగానే
అనుమోదకరంగానే సుఖదాయకంగానే
అలరిస్తాయి ఆత్మను
ముక్కుసూటిగా తగిలేదీ
ముసుగు చాటున ఉండి
ముగ్ధమోహనంగా సవ్వడి చేసేదీ

బొమ్మలు : అక్బర్

మెదడు పైపొరల వస్త్రగాళాల్లో
మేటలు వేసి మెరిసేదీ
అన్నీ ఆత్మీయంగానే ఆప్యాయంగానే
మరులుగొల్పేలానే ఉంటాయి
నెమలీకా ఆరుద్ర పురుగూ
ఎర్ర గులాబీ ధవళ శంఖమూ
నున్నటి గవ్వా సంపంగి రేకూ
గచ్చకాయా బండి చక్రం
గిరగిర తిరిగే మెరుపుల బొంగరం
అన్నింటినీ ఆత్రంగా అందుకోవాలనే
అక్కున చేర్చుకోవాలనే ఉంటుంది
అన్ని రంగుల కాంతుల్నీ వెదజల్లాలని
ఆశగా అపేక్షగా అభిలాషగా ఉంటుంది

పరిపరి విధాల పరిమళిస్తేనే కదా
జీవనం పావనం అనే భావన విరిసేది

– ఎలనాగ, 98669 45424

## ❖ ఈవారం కవితలు

# నాలుగు హైకూలు

సీతాకోకచిలక హైకూల్ని
అనువదించి బయటికి వచ్చాను –
సీతాకోకచిలక



గేటు మీదికి
వంగిన పచ్చగన్నేరు –
'కుక్క ఉన్నది జాగ్రత్త'






దారిలో ఎదురయ్యారు
వెళ్లేటప్పుడు అతనూ,
వచ్చేటప్పుడు అతని భార్యా



రాలుతున్న ఆకుల
మధ్య ఎగురుతోంది
సీతాకోకచిలక

– గాలి నాసరరెడ్డి

# V సినిమా పజిల్

నిర్వహణ : యజ్ఞమూర్తి

## అడ్డం

1. 'అమృతం చందమామలో' దర్శకుడు (6)
5. జయప్రద సోదరుడు రాజబాబు హీరోగా నటించిన చిత్రం '... రోమియో' (4)
6. వి.వి. వినాయక్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన చిత్రం (2)
8. రమేశ్‌బాబు హీరోగా దాసరి నారాయణరావు సినిమా (2)
9. కాంతారావు, భారతి జంటగా హెచ్. కృష్ణమూర్తి డైరెక్షన్‌లో వచ్చిన సినిమా (4)
11. కె. వాసు దర్శకత్వంలో కృష్ణంరాజు, జయసుధ జంటగా నటించిన చిత్రం అటుయిటుగా (5)

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | ● |
| | ● | | ● | | ● | 4 |
| 5 | | | | ● | 6 | |
| | ● | | ● | 7 | ● | |
| 8 | | ● | 9 | | | |
| | ● | 10 | ● | | ● | |
| ● | 11 | | | | | ● |

## నిలువు

1. ఎన్టీ రామారావు, భానుమతి నటించిన 'పల్నాటి యుద్ధం' దర్శకుడు (6)
2. కృష్ణ, శోభన్‌బాబు, వాణిశ్రీ కాంబినేషన్ ఫిల్మ్ (4)
3. 'రుద్రనేత్ర'లో చిరంజీవి జోడీ (2)
4. 'అదీ లెక్క'తో దర్శకుడిగా మారిన గేయ రచయిత, సంగీత దర్శకుడు (5)
7. ఎన్టీఆర్, శ్రీదేవి జంటగా కె. బాపయ్య రూపొందించిన చిత్రం (4)
10. మహేశ్, రక్షిత జంటగా నటించిన చిత్రం (2)

### గత వారం జవాబులు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 కొ | త్త | 2 జం | ట | ● | ● | 3 చం |
| స | ● | ధ్యా | ● | 4 ఆ | రు | ద్ర |
| 5 రా | య | ల | సీ | మ | ● | బో |
| జు | ● | ● | ● | 6 ని | 7 వా | స్ |
| ● | 8 న | ర్చ | 9 అ | ● | ర | ● |
| 10 మీ | ● | ● | 11 న | గ్న | స | త్యం |
| 12 నా | గ | క | న్య | ● | త్వం | ● |

# V అంకెళి

నిర్వహణ : పి. రాఘవరెడ్డి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | | | 2 | | | | | 4 |
| | | | | 3 | 4 | | | |
| 2 | | | | 6 | | | | 3 |
| 6 | | | 9 | | 1 | 4 | | |
| | 8 | 1 | | | | | 7 | 6 |
| | 4 | | 6 | | 5 | | 9 | |
| 1 | | | 8 | | | | | 5 |
| | | | | 1 | 7 | | | |
| 3 | | | | 4 | | | | 7 |

అడ్డం, నిలువులోనే కాకుండా బాక్సులో, క్రాస్‌లో కూడా 1 నుండి 9 అంకెలు ఒకసారే వచ్చేలా నింపాలి. దాదాపు సుడోకు లాంటిదే. కాని రెండు క్రాస్‌లలో కూడా రావడం ఇందులో అదనం.

### గత వారం జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 7 | 8 | 3 | 2 | 4 | 1 | 5 | 6 |
| 2 | 5 | 4 | 1 | 7 | 6 | 8 | 9 | 3 |
| 3 | 1 | 6 | 5 | 8 | 9 | 4 | 2 | 7 |
| 8 | 3 | 2 | 4 | 1 | 5 | 6 | 7 | 9 |
| 4 | 9 | 5 | 6 | 3 | 7 | 2 | 1 | 8 |
| 1 | 6 | 7 | 8 | 9 | 2 | 3 | 4 | 5 |
| 5 | 8 | 1 | 9 | 4 | 3 | 7 | 6 | 2 |
| 6 | 2 | 3 | 7 | 5 | 1 | 9 | 8 | 4 |
| 7 | 4 | 9 | 2 | 6 | 8 | 5 | 3 | 1 |

# హోమియోలో అద్భుత ఫలితాలు !
# 'పాజిటివ్' తో మార్చుకోండి మీ జీవితాలు!!
## 100% సైడ్ ఎఫెక్ట్ లేని వైద్యానికై సంప్రదించండి.

## డయాబెటిస్
మన జీవితంపై ఎంతగా
ప్రభావితం చేస్తుందో మీకు తెలుసా?

**డయాబెటిక్ సమస్యలు - దుష్ఫలితాలు**

• సెక్సువల్ సమస్యలు • అధిక బరువు
• బరువు తగ్గడం • నీరసం • సంతానలేమి
• థైరాయిడ్ • ఆర్థరైటిస్ • వెన్నునొప్పి • డిప్రెషన్



**76%** Diabetic Patients are happy now

డయాబెటిస్ చికిత్స కొరకు
డయాబెటిక్ సెల్
పాజిటివ్ హోమియోపతి సౌజన్యం

## పైల్స్, ఫిస్టుల్యా & ఫిష్షర్స్ కు
**హోమియోలో పాజిటివ్ ఫలితాలు**

• అధిక రక్తస్రావం • ఎక్కువసేపు కూర్చోవడానికి ఇబ్బంది పడడం
• మూత్రాశయంలో దురద, మంట
• మూత్రాశయ పగుళ్ళు, ఇన్ఫెక్షన్లు మొ॥న ఎన్నో సమస్యల నుండి సత్వర పరిష్కారం అందిస్తుంది 'పాజిటివ్'



## నొప్పులు తో
మొదలయ్యే సమస్యలు...

• రుమటాయిడ్ ఆర్థరైటిస్
• స్పాండిలైటిస్
• ఫ్రోజెన్ శోల్డర్
• గౌటీ ఆర్థరైటిస్
• సోరియాటిక్ ఆర్థరైటిస్
• ఆస్టియో ఆర్థరైటిస్



ఆర్థరైటిస్ చికిత్స కొరకు
Positive Orthopathy
A Positive Homeopathy Initiative



## పాజిటివ్ ప్రత్యేక చికిత్సలు :
• సోరియాసిస్ • సెక్స్ సమస్యలు • పైల్స్, ఫిస్ట్యులా
• సైనసైటిస్ • PCOD • కిడ్నీలో రాళ్లు
• ఆస్తమా • నెలసరి సమస్యలు • కీళ్లనొప్పులు


సంతానలేమి


థైరాయిడ్


ఇంపోటెన్సీ


స్పాండిలైటిస్

డాక్టర్ గారితో డైరెక్ట్‌గా సంప్రదించండి **96527 54053**
ఉ॥ 10 గం॥ల నుండి రాత్రి 7 గం॥ల వరకు

ఉచిత సలహాలకై:1800 425 0144
ఆంధ్రప్రదేశ్, తమిళనాడు & కర్ణాటక

SMS 'POSITIVE' to 55352
*Follow us on :*

The art of healing

# పాజిటివ్ హోమియోపతి
నెం.1 వరల్డ్ క్లాసికల్ హోమియోపతి An ISO 9001 - 2000 Certified ®

www.sricharanamedia.com

• అమీర్‌పేట • S.R.నగర్ • మెహిదీపట్నం • కూకట్‌పల్లి
• విక్రమ్‌పురి • కాచిగూడ • దిల్‌షుక్‌నగర్ • A.S.రావు నగర్
• నిజామాబాద్ • కర్నూల్ • గుంటూరు • వైజాగ్ • విజయవాడ
• తిరుపతి • రాజమండ్రి • బెంగుళూరు • చెన్నై

ఫ్రీ డాక్టర్ కన్సల్టేషన్ కొరకు
**92461 99933**